TIGHT BINDING BOOK

brown book

UNIVERSAL
LIBRARY
OU_204953
UNIVERSAL
LIBRARY

OUP—881—5-8-74—15,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 808 Accession No. T4367

Author

Title

This book should be returned on or before the date last marked below.

ధ్వని - లిపి - పరిణామం

లేక

ప్రాచీన వాఙ్మయంలో వ్యావహారికభాష

గ్రంథకర్త

వల్లమూడి గోపాలకృష్ణయ్య

ప్రకాశకులు

ఆంధ్ర గ్రంథాలయ ట్రస్టు

పటమటలంక

హక్కులు
గ్రంథకర్తవి

ప్రథమ ముద్రణం
1000 ప్రతులు

నవంబరు, 1955

వెల
రు 4-0-0

సర్వోదయప్రెస్
పటమటలంక

విషయసూచిక

ముఖచిత్రం - "ప్రవాహినీదేశ్యా"

	పుట
మామాట	4
నానుడి	7
అంకితం	13
పీఠిక	15

గ్రంథోద్బోధం - తొలిపలుకు

	పుట		పుట
గ్రంథారంభం	౧	థ, ధ	౨౭౩
ఇ, ఈ, ఎ, ఏ	౩	న, ణ	౨౯౧
ఉ, ఊ, ఒ, ఓ,	౪౧	ఫ, భ	౨౯౯
ఋ, ౠ, ఌ, ౡ	౫౩	మ, వ	౩౦౧
అయి, ఐ, అవు, ఔ	౧౧౮	ఱ, ర	౩౦౨
ం, ః	౧౬౪	శ, స	౩౨౫
ఖ, ఘ, ఙ	౨౮౬	మహాప్రాణాలు	౩౭౪
చ్, జ్	౨౫౩	సంయుక్తాలు	౩౫౬
ట, డ	౨౭౦	ద్విత్వలోపాలు	౩౮౮
త, ద	౨౭౨	ఇతరాలు	౩౭౪

గ్రంథోద్బోధం - మలిపలుకు

ముఖ్య సవరణలు

ఉదాహృత గ్రంథవివరణ పట్టిక

మా మా ట

తెలుగులో పరిశోధనలు చేసి విమర్శక ప్రావీణ్యము చూపి వ్రాసినవారు చాల తక్కువ. అందులోనూ, భాషకు సంబంధించిన విమర్శ లేనే లేదనవచ్చును. ఏనాడో చిలుకూరి నారాయణరావుగారు ఆంధ్రభాషా చరిత్రలో సమకూర్చిపెట్టిన ముడిసరుకు మాత్రమిప్పటికీ చెప్పుకోదగిన విషయంగా నిలిచింది. వాదాలు మాత్రం తెలుగులో అప్పుడప్పుడు పొడసూపినవి. భాషనుగురించిన తర్జనభర్జనలు గ్రాంథిక గ్రామ్య భాషల సంబంధమున ఎక్కువగా జరిగినవి. అపారఖ్యాతిగన్న గిడుగు రామమూర్తి పంతులుగారు ప్రధాన పాత్రవహించి కొంత పరిశోధన, విమర్శ సాగించిరి. వారి పనిని పూర్తిచేయడానికి యువకుడు, పండితుడు, కవి, బహు గ్రంథ రచనకు, బహుళ గ్రంథరచనకు పూనుకొన్నవాడు శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్య. ఈయన "ప్రాచీన వాఙ్మయంలో వ్యావహారికభాష" ను గురించి సుమారు 400 పుటల గ్రంథమును రచించినాడు. తన రచనను తానే ఆశీర్వదించుకుంటూ

గిడుగు కాదు కాదు; పిడుగటంచును గొప్ప
కీర్తిగన్న రామమూర్తిగారి
తలపు నిల్పితీవు సలుపు ప్రస్థానమ్ము
జయము నీకె జయము జయము జయము॥

అని వ్రాసుకొన్నాడు.

నన్నయభట్టు నుంచీ, నన్నయభట్టేల? నన్నెచోడుని నుంచి నేటివరకు ప్రసిద్ధులయిన సారస్వత నిర్మాతలను, ఆంధ్ర భాషాభూషణమును వ్రాసిన కేతన మొదలు అప్పకవ్యాదులతో సహా నేటివరకు లక్షణ గ్రంథములను వ్రాసిన శబ్దశాసనులను గాలించి వడపోసినారు. వాఙ్మయము అనే పదమునకే వ్యావహారిక భాష అనే నిర్వచనము సూచించి నేటి గ్రాంథిక భాషకు వ్యావహారిక భాషలకుగల భేదాలు వుచ్చారణ మూలకంగా కలిగినవే అను న్యాయమును స్థాపించి ధ్వని భాషను ఆస్థానమును నది ప్రాతిపదిక చేసి దానికి సాంకేతికముగా లిపి యేర్పడు తుందనీ, లేని నిర్ణయమునకై పండితులు భాష కొరక స్థిరత్వమేర్పరచి గ్రాంథిక భాషను సృష్టిస్తారని వాడుక ప్రయత్నములో వున్నా వాడుక ప్రాబల్యాన్ని వారూ ఆపలేరనీ కాబట్టి గ్రాంథికభాష నిర్మాతల వ్రాతలలోను అనాది సిద్ధంగా వాడుకభాష స్వరూపాలు నిలిచిపోయినవని చూపడానికి శ్రీ గోపాలకృష్ణయ్యగారు వుద్దండమయిన కృషి చేసినారు. ప్రాచీన గ్రంథముల నుండి వీరుద్ధరించిన భాగములు చూస్తేనే వీరి కృషి యెంత అపార మైనదో కనుపిస్తుంది. ఇదివరలో పండితులు చేసిన విమర్శలు, చేసిన సిద్ధాంతాలు తమ కష్టపడునేమో యను సందేహము కారణంగా కాబోలు వ్రాత పండితులను వ్రాతలను వీరు పదేపదే పునర్విమర్శించినారు. ఇట్టి పునర్విమర్శలు చర్చలను అతిగా పెంచునేమో! కాని యెవరి ఆదుర్దా వారిది. తమ కృషికొక పరిపూర్ణత్వము వుండవలెననే ఆశయే గ్రంథ రచయితలను విస్తృత రచనల లోనికి దించుచున్న దనుకొనవచ్చును. ఎట్లయినను శ్రీ గోపాల

కృష్ణయ్యగారు బహు నిశితమయిన దృష్టితో విషయ వివరణము చేసినారు - నిశితమయిన భాష ప్రయోగించినా రసడానికి తావివ్వలేదనడము హర్షింపదగిన విషయము.

నిజమునకు ఈ "ధ్వని - లిపి - పరిణామం" తెలుగు భాషలో వెలువడుచున్న ఒక అపూర్వరచన. రచయిత ప్రజ్ఞకు నారపుగాయి వంటిది. ఇట్టి రచనను ప్రకటించు సదవకాశమును మాకు కల్పించిన గ్రంథకర్తగారికి ప్రణామములు సమర్పించుట మావిధి.

శ్రీ వజ్ఝమూడి గోపాలకృష్ణయ్యగారి రచన లింకను కలవు. వ్యావహారిక భాషా వ్యాకరణం, జనపదమంజరి, ఆంధ్ర వ్యాకరణం, ఆంధ్ర ఛ్ఛందము వగైరాలు. ఇవియును త్వరలో ప్రకటితమయి శ్రీ గోపాలకృష్ణయ్యగారి మాతృసేవను బలవత్తర మొనర్చుగాక.

గాడిచర్ల హరిసర్వోత్తమరావు

అధ్యక్షుడు

ఆంధ్ర గ్రంథాలయ ట్రస్టు



కృతి

విధాత – ప్రదాత

నాముడి

జన వ్యవహారంలో లేని సంస్కృత భాషకూడా పండితుల పఠన పాఠనాలలో నలిగి ప్రాంతీయంగా నిత్య వ్యవహారాల్లో కలిగే మార్పులకు లోనై ఆ మార్పులకు కూడా గ్రాంథికతాముద్రను వేసుకొన్నది. అటువంటప్పుడు సజీవమైన భాషకు - అనగా - నిత్యమూ జన వ్యవహారంలో వున్న భాషకు మార్పు మరింత సహజమై గ్రాంథికతాముద్రను వేసుకొనడం దోషం యెలా అవుతుంది? కనీసం దోషాభాసమైనా యెలా అవుతుంది? ఈ నిత్య సత్యాన్ని గుర్తించిన శ్రీగిడుగు రామమూర్తి పంతులుగారి మూలంగా వ్యావహారిక భాషావాదం బయలుదేరి తెలుగు నేల నాలుగు చెరగులూ సహోధృతంగా వ్యాపించింది - అసలు శ్రీగిడుగు వారు ఈ వ్యావహారిక వాదాన్ని లేవదీయడానికి మూలకారణం ప్రాచీన తాళపత్ర గ్రంథాల్లో పెక్కుచోట్ల వ్యావహారిక భాషారచన కానరావడమే. ఈనాడు లక్షణ వంతంగా గ్రాంథికంగా ముద్రితాలైన ప్రాచీన రచనలైనపురాణాల్లో, ప్రబంధాల్లో, ఛందో గ్రంథాల్లో, వ్యాకరణాల్లో ఎన్నో వ్యావహారిక ప్రయోగాలున్నాయి. వాటి నెన్నింటినో మన పండిత శేఖరులు పరిష్కర్తలుగా బయలుదేరి సంస్కరణ పేరుతో రూపుమాపారు. భాషయొక్క వస్తుస్థితికి సహజత్వానికి, సత్యానికి జరుగుతున్న ఈఅన్యాయాన్ని యెదుర్కొనాలని వుద్యమం ప్రారంభించినవారు శ్రీరామమూర్తిపంతులుగారు. ఈవుద్యమాన్ని పెక్కుమంది ఛాందసులైన పండితులు ఎదుర్కొన్నారు. తమ శక్తికొద్దీ వ్యావహారిక వాదం సత్య సమ్మతం కాదని నిరూపించడానికి ప్రయత్నించారు. గొప్ప గొప్ప పండితులు తమ వ్యావహారిక వాదానికి పెట్టని కోట గోడల్లాగా అడ్డంగా రావడం చూచిన శ్రీరామమూర్తి పంతులుగారు ప్రాచీన వాఙ్మయాన్ని గాలించి పూర్వకవులు వాడిన వ్యావహారిక రూపాలను ఎత్తి చూపుతూ మంచి మంచి వ్యాసాలు, గ్రంథాలు రచించారు. కాని శ్రీగిడుగు వారు ఎంత కృషిచేసి వ్యావహారిక భాషావాదాన్ని ప్రస్థాపించుతున్నా వారి కృషిని ఏదోవొక వంకపెట్టి గ్రాంథిక వాదులు త్రోసిపుచ్చుతూనేవున్నారు. గ్రాంథిక వాదులు ఎంతలేదన్నా కాదన్నా వ్యావహారిక వాదం పున్నమనాటి వెన్నెలలాగా చల్లగా వ్యాపించి విరగపూచి, కాచి, సర్వతోముఖంగా ఫలిం

చెందింది. అయినా ఉద్దండ గ్రాంథిక వాదులైన కళాప్రపూర్ణ శ్రీవజ్ఝల చినసీతారామస్వామి శాస్త్రిగారు తమ ఆంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వ† ప్రథమ సంపుటంలో శ్రీగిడుగు రామమూర్తి పంతులుగారి కృషిని వ్యావహారిక భాషా వాదాన్ని ఖండించినట్లు దుయ్యబట్టారు. కాదు మిక్కిలి శ్రీగిడుగు వారు చేసిన పరిశోధనను పరిశ్రమను వట్టి నీటి మూటగానే అప్రామాణికమని త్రోసి పుచ్చారు. శ్రీవజ్ఝలవారు ఈ క్రింది విధంగా వ్రాశారు-

—" విస్తర. ... III విమ:- నేటి కాలమున గ్రామ్య గ్రాంథిక భాషా వివాదము ప్రబలియున్నది. పండితుల వాదము తెలుగు భాష గ్రామ్యము కానేరదని వ్యావహారిక భాషా వాదులు చెప్పుచుందురు. వీరిలో ముఖ్యులు కీర్తిశేషులగు కళాప్రపూర్ణ గిడుగు వెంకట రామమూర్తి పంతులుగారు, బ్ర-శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రులవారును. శాస్త్రులవారి సంస్కృతములోని యాంధ్రభాషానుశాసన మను వ్యాకరణమును రచియించిరి. పంతులవారు తాము పరిశోధించి సంపాదించిన ప్రయోగ సంచయమును శ్రీ శాస్త్రుల వారి కొసంగినట్లు క్రింది రీతిని వ్రాసియున్నారు. "నా ప్రయోగ సంచయము నాకు మ - జయంతి గంగన్న పంతులుగారు పంపినారు. అవి బ్ర. శ్రీ. మల్లాది సూర్యనారాయణ శాస్త్రి గారు తమకిమ్మని కోరితే వారికిచ్చినాను. వారు వీటిని తమ ఆంధ్ర భాషానుశాసన మందు ఇమిడ్చినారు" (బాలకవి శర

† ఇది ఆంధ్ర విశ్వకళా పరిషత్ ప్రచురణం - మొదటి సంపుటం 1951 లోను రెండవ సంపుటం 1952 లోను ప్రకటితాలయ్యాయి.

ణ్యాము. 200 పుట) పంతులవారి ప్రయోగ సంచయములోనివి చాల వఱకుఁ గవి ప్రయుక్తములని విశ్వసింపఁ దగిన యతి ప్రాసాది స్థల నిబద్ధములు మిక్కిలి యరుదు. మఱియుఁ బంతుల వారి ప్రయోగ సంచయములోఁ బ్రామాణికులుగ నెన్నఁ గొనఁబడుచున్న మహాకవి ప్రయోగములు మిక్కిలి యల్ప సంఖ్య గలవి – † (ఆం. వ్యా. సం. సర్వస్వం - 178, 179 పుటలు)

గ్రాంథిక కాంధ్రాని కున్న సంకుచితమైన నియమాలను సడలించి విశాల పరచి ఒక వ్యాకరణాన్ని వ్యావహారిక భాషకు ఒక వ్యాకరణాన్ని రచించాలనే ఇచ్ఛతో అయిదు సంవత్సరాలకు పూర్వం నుంచీ కృషి చేస్తున్న నేను శ్రీవజ్ఝలవారు వ్రాసిన పై వాక్యాలు తదితర విషయాలు చూచి ఆశ్చర్య పడినాను. గ్రాంథిక వాదులైన శ్రీవజ్ఝలవారు అసలు వ్యావహారిక వాదాన్నే కాదని త్రోసిపుచ్చుతున్నప్పుడు నా వ్యాకరణం బయటకు వస్తే "ఈ వ్యావహారికానికి కూడా ఒక వ్యాకరణమా?" అని అవహేళనచేసి త్రోసిపుచ్చడం కష్టం కాదు. అందువల్ల ముందు వ్యావహారిక వాదాన్ని ప్రస్థాపించి ప్రాచీన వాఙ్మయంలో కూడా వ్యావహారికం వున్నదని నిరూపిస్తూ ఒక గ్రంథాన్ని నిర్మించి ప్రకటించిన తర్వాత నే వ్యాకరణాన్ని ప్రకటించుదామని సంకల్పించాను. లోగడ నేను గ్రాంథిక కాంధ్రానికి వ్యాకరణాన్ని నిర్మించాలని ప్రాచీన వాఙ్మయాన్ని పరిశోధిస్తున్నప్పుడు నాదృష్టికి గోచరాలయిన వ్యావహారిక భాషకు సంబంధించిన విషయాలను గుదిగుచ్చి "ధ్వని - లిపి - పరిణామం - లేక ప్రాచీన వాఙ్మయంలో వ్యావహారికభాష" అనే ఈ గ్రంథాన్ని రచించాను.

ఈ నాడు పెక్కుమంది రచనలో వినియోగిస్తున్న వ్యావహారిక భాష చాలా మంచిదనీ ప్రాచీనకాలంలో పండితులు, కవులు, లక్షణ గ్రంథకర్తలు సైతం గ్రాంథికమనీ లక్షణబద్ధమనీ మడిగా వుంచుకొన్న భాషలో ఎంతో భ్రష్టమైన వ్యావహారికాన్ని వినియోగించి నిత్యమూ వ్రాస్తూ వుండేవారనీ

† చివరి పంక్తులకు గీతలు నేనే పెట్టినాను. శ్రీవజ్ఝలవారు పెట్టలేదు.

ఈ గ్రంథంలో నిరూపించాను. అసలు గ్రాంథికంలో వ్యావహారికాన్ని వాడడమే తప్పు. అందులోను భ్రష్టమైన నీచమైన వ్యావహారికాన్ని గ్రాంథికంలో వాడడం మరీతప్పు. ప్రాచీన వాఙ్మయాన్ని సవ్యంగా సమగ్రంగా పరిశీలించకుండా గ్రాంథిక వాదులు వ్యావహారిక వాదులను దూషించడం ఆశ్చర్యకరంగా వున్నది. ప్రాచీన వాఙ్మయం యొక్క వస్తుస్థితి సూచనా మాత్రంగానైనా తెలియని కొందరు పెద్దలు మన్మథ ఉగాదినాటి రేడియోలో అస్తవ్యస్తంగా గోష్ఠి జరుపుతూ వ్యావహారిక భాషా వాదాన్ని, రచనలను, ఆ రచనలకు మూలమైన పత్రికలను దూషించడం"వెక్కిరించ బోయి వెల్లకిల బడ్డట్లుగా" వున్నది. ఈ గ్రంథంలో నేను ప్రతిపాదించిన శాస్త్రీయమైన విషయాలను గ్రాంథికవాదులైన శ్రీవఝ్ఝల చినసీతారామస్వామి శాస్త్రిగారు గాని తదితరులు గాని త్రోసిపుచ్చడం అసంభవం. ఛందోవ్యాకరణ గ్రంథాల నాధారం చేసుకొని గ్రాంథికవాదులు త్రోసిరాజన లేని పద్ధతిలో ఈ గ్రంథనిర్మాణం చేసినాను కాబట్టి సరిపోయినది గాని లేకపోతే పీఠికలో శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు వ్రాసినట్లు ఏ శాసనాలనో మాములు ప్రబంధాలనో ఆధారంచేసుకొనే యీ గ్రంథ నిర్మాణంచేసి వుంటే దీన్ని వట్టి అప్రామాణిక గ్రంథంగా పరిగణించి అతిసులభంగా త్రోసిపుచ్చేవారే - ఇంకా అవసరమైతే "సంస్కృత భాషపై దేశభాషా వ్యావహారిక ప్రభావం" అనే పేరుతో నేను వ్రాసిన గ్రంథాన్నికూడా త్వరలోనే ప్రకటింపగలను. ఇందులో దేశభాషా వ్యావహారిక ప్రభావంచేత ఉచ్చారణకు అనుగుణంగా సంస్కృత పదాలు ఎలా మారిపోయి ప్రామాణికత్వాన్ని పొందాయో నిరూపించాను. ప్రస్తుతగ్రంథానికున్న ధ్వని - లిపి - పరిణామంఅనే పేరును బట్టి యిందులో నేను లిపి చరిత్రను ప్రతిపాదించానని భావించరాదు. ధ్వనికి అనుగుణంగా ధ్వనియొక్క మార్పులకు తగినట్లుగా లిపి యెలా మారుతుందో చూపడమే యిందులో నేను చేసినపని. వాస్తవానికి యిక్కడ ధ్వనిశబ్దాన్ని వినియోగించకూడదు. శబ్ద - లిపి - పరిణామం అని "శబ్ద" శబ్దాన్ని వినియోగించి పేరు పెట్టాలి. "ఏదో శబ్దం అయ్యింది; అదిగో శబ్దం వినిపిస్తున్నది" వంటిచోట్ల "శబ్ద" శబ్దం "మోత" అనే అర్థంలో వ్యవహరింపబడు తున్నప్పటికీ "శబ్ద" శబ్దానికి "నుడి" అనే అర్థమే ప్రచురంగా వున్నది. "శబ్దపరిణామం" అనేసరికి "నుడుల పరిణామం" [పదపరిణామం]

అని చెప్పేంటనే అర్థస్ఫురణ జరుగుతుంది. "ధ్వని పరిణామం" అనగానే వెంటనే కలిగే అర్థబోధ "శబ్దపరిణామం" అన్నప్పుడు కలుగదు. అందువల్లనే దీనికి ధ్వని - లిపి - పరిణామం అనే పేరు పెట్టాను - అయితే ఈ పేరు అందరికీ అందుబాటులో వుండక కొందరికిమాత్రమే వుంటుంది కాబట్టి, ధ్వని - లిపి - పరిణామ రూపంగా ఈ గ్రంథంలో నేను ప్రతిపాదించింది "ప్రాచీన వాఙ్మయంలోని వ్యావహారిక భాషాస్థితిని" కాబట్టి, అందరికీ అందుబాటులో వుండేలాగా దీనికి "ప్రాచీన వాఙ్మయంలో వ్యావహారిక భాష" అని మరొక పేరు పెట్టాను. ఈ గ్రంథంలో వున్న విషయం ఎంత జటిలమైనదైనా అందరికీ అందుబాటులో వుండాలనే అభిప్రాయంతోనే అత్యంత సులభమైన భాషలో సూటిగాను, స్పష్టంగాను, విపులంగాను విషయ ప్రతిపాదన చేసినాను. అయినా ఈగ్రంథ విషయం అనుకున్నంత తేలిగ్గా అందరికీ అవగాహన కావడం కష్టమే- కేవలం వ్యావహారిక వాదాన్ని నిలబెట్టడం కోసమే యీ గ్రంథాన్ని రచించాను కాబట్టి ఆవాదాన్ని వ్యతిరేకించే పెద్దలకు యిది అర్థమైతే చాలుననుకుంటాను.

మొట్టమొదట వ్యావహారిక వశాన మన పదాలు ఏ విధంగా మార్పు పొంది గ్రాంథికతా ముద్రను పొందాయో నిరూపించాలని ఆపదపరిణామాన్ని కూడా యీ ధ్వనిలిపిపరిణామ గ్రంథంలోనే చేర్చి ప్రకటించుదామనుకొన్నాను. కాని యీ పద పరిణామం కూడా వ్యావహార వశాన జరిగిందే అయినా "మరీ చాదస్తం" అంటారేమోనని యిందులో చేర్చలేదు. అయితే నా ఆ పరిశ్రమను కూడా "పద పరిణామం" అనే పేరుతో వీలైనంత త్వరలో ఒక గ్రంథంగా ప్రకటింపగలను. ఈ వ్యావహారిక భాషా గ్రంథంలో శ్రీయుతులు మల్లంపల్లి సోమశేఖరశర్మ, ఆర్.దొరస్వామిశర్మ, యన్.వెంకటరావుగార్లు చూపిన ప్రయోగాలు కొన్ని పేర్కొన్నాను. అందుకు వారికి కృతజ్ఞుడను. ఈ గ్రంథం మూడేళ్ళనాడే వెలువడి వుండవలసింది. కాని ముద్రణావకాశాలు లేక వెలువడలేదు. దీని ముద్రణకు ప్రప్రథమంగా చేయూతనిచ్చిన కూచిపూడి ఆర్యమహిళా సమాజ కార్యకర్తలు శ్రీమతులు యలవర్తి సీతారత్నం, జాస్తిసులశమ్మ గార్లకు, శ్రీమేకా కమలా రామకృష్ణయ్య దంపతులకు కృతజ్ఞతాభివందనాలు. తర్వాత తమ పనిగా పూనుకొని ముద్రణను కొనసాగించిన గ్రంథాలయ సేవాతత్పరులు శ్రీ సాగరాని నాగ

భూషణంగారికి, పుస్తకాన్ని తమ సంస్థపక్షాన ప్రచురించడానికి ఆమోదాన్ని తెలిపిన ఆంధ్ర గ్రంథాలయ ట్రస్టు వారికి, గ్రంథాన్ని శ్రద్ధగా చదివి మామాట వ్రాసిన ట్రస్టు అధ్యక్షులు శ్రీ గాడిచర్ల హరి సర్వోత్తమరావుగారికి నా నమోవాకాలు. అడిగినంతనే అమూల్యమైన పీఠిక వ్రాసిన శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారికి నా ధన్యవాదాలు. స్కెచ్ వ్రాసిన శ్రీ జి. చిన్నబాబుగారికి ముఖచిత్రం వ్రాసిన శంకర్ & సంజీవిగార్లకు అభినందనలు. చేదోడు వాదోడుగా నిలిచిన నా ప్రియ శిష్యులు చిరంజీవులు వి. రామిరెడ్డి, పి. భాస్కరరావు, ఏ. పున్నారావు, సి. రామదాసు, యస్. రామచంద్ర, స. శివరామిరెడ్డి, వై. కోటేశ్వరరావు, జి. వీరబ్రహ్మాచారి, యం. సుబ్బారావులను విద్యాభివృద్ధిగా ఆశీర్వదిస్తున్నాను. ప్రూఫులు చూడ్డంలో సహాయపడిన శ్రీ డి. ధర్మరాజు, కోచ్. అమ్యంత రామయ్యలను అభినందిస్తున్నాను. శ్రమకోర్చి శ్రద్ధగా పనిచేసిన సర్వోదయ ప్రెస్ వర్కర్ల పట్ల నా సంతోషాన్ని ప్రకటిస్తున్నాను.

మన్మథ
కార్తీకం.

మీ
పట్టమూడి గోపాలకృష్ణయ్య



కృతి అధినేత

శ్రీ యార్లగడ్డ శివరామకృష్ణ ప్రసాద్

అంకితం

సహృదయులు

సారస్వత పరిపోషకులు

దివి నియోజకవర్గ ప్రజానాయకులు

అయిన

శ్రీ యార్లగడ్డ శివరామకృష్ణ ప్రసాద్, M. L. A.

గారికి



పీఠికా కర్త

శ్రీ కోరాడ రామకృష్ణయ్య

పీఠిక

శ్రీయుత వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారితో నాపరిచయమునకు కారణము కేతన ఆంధ్రభాషాభూషణమునకు ఆయన రచించిన పీఠిక. ఆయనతో కంటె ఆయన పీఠికతో కలిగిన పరిచయమే ముందు నన్నాకర్షించినది. ఇదియే తరువాత వారితోడి పరిచయమునకును దారితీసినది. మాపరిచయము కొద్దిదే అయినను దీనినిగురించి, నేను కొన్నిమాటలు వ్రాయవలయునని వారు పట్టుపట్టుటచే వారి కార్యోత్సాహమును, చేపట్టిన మహోద్యమమందు ఆయనకుగల కార్యదక్షతను, పరిజ్ఞానమును జూచి చకితుడనైన నేనును వారిమాట కాదనలేక సిద్ధపడినాను. మన దేశములో ఆంధ్ర సాహిత్యమును గూర్చి కొంత పరిశ్రమ జరుగుచున్నను మన భాషా స్వరూప లక్షణ పరిణామములను గూర్చిన పరిశీలనము చాల తక్కువగా నున్నది. సాహిత్య విషయములోవలె భాషా విషయమున శ్రద్ధ తీసికొను వారు చాల తక్కువగుటయే దీనిక కారణము. అందులో దాని పరిణామ రీతులను గూర్చిన పరిశీలన మందు శ్రద్ధగాని ఉత్సాహముగాని శక్తిగాని కనబరచువారు ఇంకా అల్పసంఖ్యాకులై యున్నారు. దీనికి ముఖ్యకారణములలో నొకటేమంటే కేతన చెప్పినట్లు "తల్లి సంస్కృతంబె యెల్ల భాషలకును" అను మాట యందలి పరమ విశ్వాసముచే మన దేశములోని పెద్ద పండితులే ఈ భాషకు సన్నిహితములైన ఇరుగుపొరుగు భాషలతో సంబంధమేమైన గలదా యను విషయమును పరిశీలింప నొల్లకుండుట, వాని మాట

మెత్తితే ఏవగింపు హేళనమును వ్యక్తపరచుట. సంస్కృతజన్యత్వనిరూపణము గౌరవప్రదముగా నెంచి ఆ గౌరవాభాసమునే నమ్ముకొని వాస్తవస్థితిని పరిశీలించుటకైన ప్రయాసనివారధిక సంఖ్యాకు లగుటచేత దేశమున నీ భాష యొక్క సహజ పరిణామమును గూర్చిన పరిశోధనమంతగా వర్ధిల్లుటలేదు. దేశమున విశ్వవిద్యాలయ మేర్పడిన పిదప గూడ పది పదిహేను సంవత్సరములపాటు ఆనర్సు తరగతిలో భాషాశాఖకు విద్యార్థులే లేకపోయిరి. భాషాభ్యాసమునకుగాని భాషా పరిశోధనమునకుగాని అప్పట అవకాశమే లేకపోయినది. సంస్కృత జన్యత్వ వాదమునకు, సంస్కృత వ్యాకరణ శక్తి ననుసరించి చర్చలతో గూడిన వ్యాఖ్యానములకు విమర్శలకు మాత్రమే విశ్వవిద్యాలయ మాదరము చూపగలిగినది. కావుననే దేశములో వాస్తవమైన ఆంధ్ర భాషాపరిణామ చరిత్రాన్వేషణకు, పరిశోధనకు తగిన దోహదము కలుగలేదు. దానికి తగిన వాతావరణమును దేశములో నేర్పడలేదు. కాని యిటీవల బయలుదేరిన నవ్యాంధ్ర సాహిత్యోద్యమము, వ్యావహారిక భాషా ప్రచారోద్యమము అనునవి భాషా విషయమున అపూర్వ సంచలనమునకు కారణమై దేశీయులను కొంతవరకు భాషాతత్త్వ పరిశీల నోన్ముఖులను గావించుటకు దోడ్పడినవి. అందు గ్రాంథిక వ్యావహారిక వాదము లక్ష్యలక్షణ సంబంధ నిర్ణయమునకు దారి తీసినదై ఆయా కాలము లందలి లాక్షణికుల రచనా వైఖరులను పోల్చి పరిశీలించుటకై పండితులను ప్రేరేపింపజొచ్చినది. కాలక్రమమున గ్రంథముల వ్రాత ప్రతులలో గలుగుచూ వచ్చిన

మార్పులచేతనైతేనేమిఆయాకాలములందుకవులవలంబించుచూ వచ్చిన సంప్రదాయ భేదముల చేతనైతేనేమి ఒక్కొక్కప్పుడు కవులు లాక్షణికులు కూడ తెలిసియో తెలియకయో అవలంబించిన నిరంకుశత్వముచేత నైతేనేమి లక్ష్యలక్షణములలో కొన్ని సందర్భముల వ్యత్యాసములు పొడగట్టుచుండుట, కొందరు మహా కవులు లాక్షణికుల యీ సడింపులకు పాలై అలాక్షణిక కవులుగ పరిగణింపబడుట, కొందరు లాక్షణికులు తాము చేయగడగిన లక్షణము విషయమునే తబ్బిబ్బులుపడి లక్ష్యవిరుద్ధముగా లక్షణము నేర్పరచిన వారుగా తయారగుట తటస్థించుచూ వచ్చినది. అట్లు లక్షణవిరుద్ధములని లాక్షణికులు చెప్పిన అనేక రూపములకు కారణము భాషలో కాలక్రమమున గలిగిన సహజ పరిణామమేనని, అట్టివి ప్రామాణికులగు కవులు ప్రయోగించి యుండుటచే ప్రమాణములుగానే గ్రహించవలెనని, అట్టివే యిటీవలికాలమునగూడ శిష్టవ్యవహారసిద్ధములైనచో వాని ప్రామాణికత్వము సంగీకరించి, జీవద్భాషయగుటచే యిందలి ప్రయోగపద్ధతిని కాలానుగుణముగ విస్తృతి నొందింపవలసిన ఆవశ్యకతకలదని తొలుత దేశముచే గుర్తింపజేసినవారు శ్రీగిడుగు రామమూర్తిపంతులు గారు. కాని యీ వ్యవహారము జనులనోళ్ళలో అనేకవిధములుగా ఉండేదేగాని గ్రంథస్థముకాకపోవుటచేఈభాషకుసరియైన హద్దులు ప్రామాణికత్వము ఇంకను సుస్థిరముగా నేర్పడలేదు. దానికై విశేష పరిశ్రమ జరుగవలసియున్నది. ఈ విషయమున శాస్త్రచర్చలు వదలి భాషాతత్వమును గుర్తించి భాషాపరిణామరీతుల ననుసరించి శిష్టవ్యవహారముగా గ్రహింప

దగిన భాషకు సరియైన హద్దుల నేర్పరచుకొనుట ఆవశ్యకము. మహాకవులు బయలుదేరి యీ భాషలో సద్గ్రంథములను రచించుటచే ఈ భాషకు ప్రామాణికత్వమును సిద్ధింపజేయ వలసియున్నది. ఇంతకును లక్ష్యమును బట్టియే గదా లక్షణము బయలుదేరవలసినది. ఇదివరకు శిష్టవ్యవహార సిద్ధములై ప్రామాణికత్వమును బడసినవని చెప్ప దగిన వ్యావహారిక భాషారూపముల కన్నిటికి నొక నిఘంటువో వ్యాకరణమో ఏర్పడినచో అది అటు రచయితలకును ఇటు లాక్షణికులకును గూడ నుపయోగకారి కాగలదనుటలో సందేహములేదు. అట్టి మహోద్యమమును తలపెట్టి నవలంకషమైన ప్రాచీనాంధ్ర భాషాలక్షణ జ్ఞానము సంపాదించి వ్యావహారికాంధ్రము నుద్ధరింపబూనిన వారగుటచే శ్రీ గోపాలకృష్ణయ్యగారు మిగుల ప్రశంసాపాత్రులగుచున్నారు. ధైర్యము [illegible] నిందుకు బూనుకొనుటయేగాక ఇంతకు ముందు వ్యాకరణ నిఘంటువులను రచించిన వారైనను కొందరు ప్రతిఘటించుచున్న వ్యావహారికభాషా వాదమునకు బలము చేకూర్చి నిలబెట్టుటకుగాను వీరిప్పుడాయాకాలము లందలి లాక్షణికుల రచనల నాధారముగా జేసికొని శాస్త్రీయ పద్ధతిని వ్యావహారిక భాషా పరిణామమును ధ్వనిలిపిపరిణామ రూపముల నన్వేషించుటకు పూనుకొనిరి. ఈ పద్ధతిని ఆంధ్ర భాషా పరిణామ క్రమమును నిరూపింప వలయునను భావము నాకు చాలకాలము నుండి కలదు. ఆపని మీరు చేపట్టుట నాకెంతయు ముదావహమైనది. నిశితమైన లక్షణ పరిజ్ఞానము కలవారగుటచే ఆయా లక్షణకర్తల భావ

ములను తులనాత్మక దృష్టితో బరిశీలించి అందలి గుణదోషము లను చక్కగా నిరూపించుచు తమ కార్యమును సాధించు కొనుటలో కృత కృత్యులైనా రీయన -

అయితే ప్రస్తుత మీ గ్రంథము వ్యావహారిక భాష యొక్క లక్షణమును గాని ప్రామాణికత్వమును గాని తెలుప గలదని యూహించిన వారికి కొంత ఆశాభంగము కలుగవచ్చు నేమో! ఎందుకనగా వ్యావహారిక భాషను గూర్చి నేనొక గ్రంథ మును వ్రాయుచున్నాను. ఈయన నాకు వ్రాసినప్పుడు నేను కూడ ప్రాచీన శాసనములలోనో, కావ్యములలోనో, ఆధునిక వ్యవహారములనో కానబడు వ్యావహారిక భాషా పరిణామ క్రమమును వివరించునవి గాబోలుననియే తలంచితిని. కాని యీ గ్రంథమును జూచినప్పుడు ఒకవిధ మగు నాశ్చర్యమే కలిగినది. కాని అది యెంతయు అను కూలము ఆమోద కరము గూడ నైనదనియే చెప్పవలసి యున్నది. ఏమ నగా ప్రాచీన వాఙ్మయములో వ్యావహారిక భాష యొక్క ఉనికిని, దాని స్వరూప లక్షణములను మన కెరి గించుటలో నీ రచయిత యవలంబించిన పద్ధతి చాల చమ త్కారమైనది. చమత్కార మగుటయే కాదు. ఈయన సూక్ష్మదృష్టికిని ప్రతిభాశక్తికిని గూడ గొప్ప తార్కాణమన వచ్చును. ఏమనగా ఈ గ్రంథములో ఈయన ప్రాచీన వాఙ్మ యములో వ్యావహారిక రూపముల స్థితిని ఆయా కాలముల యందు కవులు లాక్షణికులు గ్రహించిన లేదా నిషేధించిన రూపములలోని ధ్వని లిపి పరిణామమును బట్టి సాధింప యత్నించినారు. కాబట్టి ఈ గ్రంథమునకు "ధ్వని - లిపి -

పరిణామం" అను ఒకమూరు పేరుకూడా పెట్టి వరుసగా అచ్, హల్, వర్ణక్రమాన ఈ భాషలోని వర్ణములు, కొన్ని సంయుక్తాక్షరములు, వ్యవహారమునం దేకాలమున నెట్టి పరిణామమును పొందిన భాషలోని శబ్దముల కెట్టి వ్యావహారిక రూపములను గల్పించినవో ఆయా రూపములు ప్రాచీన కవులచే గాని, లాక్షణికులచేగాని, ఆధునిక పండితులచేగాని యెట్లు గ్రహింపబడుచు వచ్చినవో ఈ గ్రంథమున వీరు అతిగంభీరమైన విమర్శనము చేసి సువ్యక్తము చేసిన వారైనారు.

ప్రతి భాషకు మొదటి స్థితి వ్యావహారికమే. దానిని కొందరు కొన్ని మార్పులు చేసి లక్షణబద్ధము చేస్తే అది గ్రాంథికమవుతుంది. వాస్తవానికి గ్రంథస్థమైనదల్లా గ్రాంథికమే కావాలి కాని వ్యావహారికంకూడా గ్రంథస్థము కావచ్చు - కాని లక్షణబద్ధమైతేకాని వ్యావహారికమైనా గ్రాంథికావస్థ పొందదు. తెలుగు భాష మొదట గ్రంథస్థమై కనబడుట లేదు కాని శాసనస్థమై కనబడు తున్నది. ఆ కాలములో గ్రాంథిక వ్యావహారికములకు భేదము విశేషముగానున్నట్లగపడదు. సంధులు, రూపములు, వాక్య నిర్మాణము మొదలగు వానిలో నియమ మగపడదన్న మాటే కాని ఆ భాషకు గ్రాంథిక లక్షణములు కొన్ని కనబడుచున్నవి. "ఇన్పుణోలి, అణపోతులు, రేవణకాలు, పుద్ధణకాలు, ఇచ్చిన దత్తి, పెన్పాఱు, ఇశరేనికిన్" - ఇందు విసంధి రూపాలున్నవి. అన్వయము వెనుక ముందుగా నున్నది. కొన్ని కొత్తరూపాలున్నవి. కాని పెన్పాఱు అను సమాసము, ఇశరేనికిన్ అను ద్రుతాంత

ప్రయోగము చూస్తే భాష గ్రాంథికతా యోగ్యత కలదేయని పించును. ఈ తొలిశాసనములలోని కొన్ని రచనలు ఛందోబద్ధములే యనువారును కొందరు గలరు. అయితే వీనిలోనే "ఏళువారు" అను దానితోపాటు "ఏలేవారు" అని ఇప్పుడు కూడా మనము వ్యావహారికమనుకొనే రూపము క్రీ॥ శ॥ 7-8 శతాబ్దముల నాడే కనబడుతున్నది. తొమ్మిదవ శతాబ్దము నాటికి దేశీయచ్ఛందో రచనలు కానవచ్చుటయేగాక తెలుగు భాషకు గ్రాంథికత్వము కూడ సిద్ధించినదని అప్పుడే గ్రాంథిక వ్యావహారిక భేద మేర్పడుతూ వచ్చినదని తెలంపదగియున్నది. అనగా శిష్ట భాష - దాని నుండి వ్యవహారములో మార్పు నొందుతూ వచ్చిన రూపములు కూడ మనకు శాసన కాలము నుండియే వచ్చుచున్నవన్నమాట. ఆ తరువాత నన్నయ తన కాలమున గల భాషలో కొన్ని సంస్కారములను జేసి రాజమహేంద్రవర ప్రాంతము నందలి శిష్టుల భాషలో భారతమును రచించుటచేత ఆతని భాషపూర్వ శాసన భాష కంటె మార్పు కలదైనది. ఇదియే తరువాతి కాలమున లాక్షణికుల దృష్టిలో ప్రామాణికమగు గ్రాంథిక భాషగా వెలసినను, అప్పటి వ్యావహారిక రూపములు ఆతని కాలపు శాసనముల లోను గ్రంథములలోను కన్పట్టుచునే యున్నవి. నన్నయ ప్రయోగింపనొల్లని "కుర్యు" (కిరియు అనుటకు) "కట్టివ్సి" "కుడ్చి" వంటి రూపములు, "బరిహి, హరుపాశుధారలు, మహారుషి, దివ్యరుషులపల్లి, ఉత్పలలు, బ్రాహ్మడు, శబసంకులము, అమరలేమలు" మొదలైన వ్యావహారిక రూపములను నన్నిచోడుడు ప్రయోగించినాడు. ఈతని జాడనే సోమనాథుడు

కూడ అనుసరించినారు. నన్నయ వెనువెంటనే వచ్చిన వీరిట్టి రూపములను తమ కావ్యములలో ఎనుక సాహసించిరంటే వీరి కాలమున కింకను నన్నయ భాష పరమప్రామాణ్య ప్రతిని పొందలేదన్నమాట కాదుగా. తన కాలమున వ్యవహార ప్రసిద్ధమైన భాషను నన్నయ తనకు నోచిన రీతిని సంస్కరించుకొని ఆతడొక విధముగా గ్రంథ రచన చేస్తే నన్నిచోడాదులు వారి కాలమున వ్యవహారములో నున్న భాషను గ్రహించి తమ కావ్య రచనను సాగించినారు. ఏ అంశమున ఆయాదేశ కాలముల యందు వ్యవహారములో - శిష్ట వ్యవహారములోనే-ఉన్న భాషయేగాని వేరుగాదు. నన్నిచోడాదులు చేసిన ప్రయోగములను ప్రయోగింప కూడదను నియమమునుగాని, అనుశాసనముగాని వారి కాలమున కేదియు లేదుగదా! దేశవ్యవహారమును బట్టి వారు ఉచితములను కొన్న ప్రయోగములనే వారు చేసినారు. వారి భాషా ప్రయోగములను ఇటీవల నేర్పడిన వ్యాకరణలక్షణమను కొలత బద్దతో కొలుచుటకు మనము సిద్ధపడుటచేతనే వారిభాష మనకు లక్షణ విరుద్ధముగా నున్నట్లుగపడ జొచ్చినది. లేకపోతే నన్నెచోడ సోమనాథుల ప్రయోగములను చిన్నయసూరి వ్యాకరణము తోనా కొలుచుట? ఆంధ్ర భారత రచన తిక్కన ఎఱ్ఱాప్రగడల మూలంగా పూర్తియైన పిదప ఆంధ్ర సాహితీ లోకమున కవిత్రయమునకు విశేషప్రతిష్ఠయు, వారి రచనకు ప్రామాణికత్వము నేర్పడుట తటస్థించినది. తిక్కన శిష్యులు మారన, మంచన మొదలగు వారు తరువాత శ్రీనాథాదులు, వారిననుసరించి రచించిన వారగుటచే కవిత్రయ ప్రతిష్ఠ దేశములో స్థిరపడి వారవలంబించిన భాషా పద్ధతికే

లక్షణానుసృతమై వచ్చినది. నన్నిచోడాదుల కాలమున భాష కింకను లక్షణానుసృత మేదనుటకు అప్పకవి చెప్పిన ఈ పద్యములే నిదర్శనములు –

> ఆదిని శబ్దశాసన మహాకవి చెప్పిన భారతంబులో
> లేదది వర్ణింపగా బడియె నెందును దాని నె కాని సూత్రసం
> పాదన లేమిచే తెలుగు పల్కుల నెక్కటి గూర్చి చెప్పగా
> రాదని దాక్షవాటి కవిరాక్షసు డీ నియంబు చేసినన్॥

ఆమూండు పర్వములలో

> నా మాన్యపు నుడువు తెలుగులనసికొని కృతుల్
> తాము రచించిరి తిక్కనసు
> ...ముద్దన తో...పు తెలుగు కవీంద్రుల్॥

కాబట్టి నన్నయకు పూర్వమందు వాన్లు, పుంగోలు, ఉన్సి, అలకిపుట, ఎనుబంది ప్రుట్టు ఆష్టపట్టు సేను మొదలైన వానిని ఎట్లు ఆ కాలపు శిష్ట వ్యవహార రూపములుగాను, నన్నయ కాలమున వాటికి పరిణతి రూపములగు వాండు, ప్రోలు, ఉన్సి, అడచుట, ఎనిమిది పుట్టి ఆళ్ళపట్టుసేను, అను వానిని ఆ కాలపు శిష్టరూపములుగాను గ్రహిస్తున్నామో, అట్లే నన్నిచోడుడు వాడిన "కర్యి, కలుహారము, అమ్మహారుషి, మాధుర్యత, పుడమిపుడు, దట్టి" మొదలగు రూపములనుఆతని కాలమందలి శిష్ట వ్యవహార రూపములుగ గ్రహింపవలసినదే. అట్లు కానిచో అట్టి యుద్గ్రంథమును రచించిన కవి ఆరూపముల నెందుకు వాడినాడు? తెలియకనా? వ్యవహారమున లేకున్న ఆతని కెట్లు వచ్చినవి? కల్పించెనా? ఆతడు శిష్టుడు గాడా? ఇట్లు నన్నెచోడ సోమనాథాదుల రచనలను బట్టి

మన కా కాలపు వ్యావహారిక భాషా స్వరూపము కొంత వర కైనను తెలియవచ్చినది. ఇక కేతనాది లాక్షణికులు బయలు దేరిన తరువాత వారికి నచ్చని వ్యావహారిక రూపములను కొన్నింటిని అప్రామాణికములని తలచి గ్రామ్యములను పేరితో కావ్యభాషలో నిషేధింప జొచ్చినారు. ఈ పనికి కేతనయే మొదటివాడు. ఆతని "పంచాకుమయ్యా, తోపించాకుమయ్యా, వాటీ పెచ్చుతారు, మమ్మాదలంచి।......" అను పద్యము ఇందుకు నిదర్శనము. ఆతని గ్రామ్యమంతా ఆ కాలంలో శిష్ట వ్యావహారికం కాకపోవచ్చునుగాని, ఆతడందు చేర్చిన ఆడ, ఈడ, ఏడ, సంపేరు, తెంపేరు, పాడేరు, కాయు, మోాయ, వేయు, గడ్డ, గుడ్డు, మొదలైనవి కొన్ని తరువాతి కాలమున శిష్ట వ్యవహారమున చేరినవి. నన్నిచోడుడు "బాహ్మాడు" (బాహ్మణుడు) శబ్దము ప్రయోగించినాడు. అది శిష్ట వ్యావహారికమే అప్పటికీ ఇప్పటికీ కూడా. కాని కేతన గ్రామ్యముగా పరిగణించిన బామ్మడు ఇప్పటికీ శిష్టరూపము కాదు."

కేతన కాలానికి వేదాలు, వినుతి అను పదములు యేదాలు, యినుతి అయినట్లే ఆంధ్ర శబ్దచింతామణి కాలం నాటికి ఇఈ ఎఏ లు ఆదియందుగల పదాలుకూడ యియీ యె యేలతో కూడినవైనవి. యిక్కడ, యితడు, యెక్కడ అని అజాదులు హలాదులుగా వ్రాయబడుతూ వ్యవహారమున నుండెడివి. ఈ విషయమునే "అద్యశ్రియాసు" ఇత్యాది సూత్రముచే చింతామణి సూచించినది. పెద్దనాది లాక్షణికులుకూడ పదాదిని "య" కారము లేదని నిషేధించుటచేత యకారమాదినిగల రూపము లాకాలమున వ్యవహారములో నుండెడి

వని తెలియుచున్నది. యెక్కడ, యెవడు, మొదలగు కొన్ని రూపములు అకార సాహచర్యాన్ని బట్టి స్వరసామ్య సూత్రముచే యక్కడ, యవడు, అని యైనవి. ఇట్టియకారములతో కొందరు తరువాతి కవులు యతులను గూడ నిల్పినారు. ఈ రీతిగ లాక్షణికులు నిషేధించుట చేతను, నిషేధములను పాటింపక వ్యవహార పరిపాటిని బట్టి కవులు యతిప్రాసలలో ఆయా వర్ణముల నుపయోగించుచుండుట చేతను, ఆయా కాలము లందీ వ్యావహారిక రూపములు పండితులలోను కవులలోను కూడ ప్రచారము నందుండెననుమ విషయము ఈ గ్రంథమున చక్కగ నిరూపింపబడినది. ఇస్త్రీ ఉటోలు పదాదిని వకారముతో గూడిన వైనవి. ఋవర్ణము సంస్కృతీయం బగుటచే, దేశీయుల యుచ్చారణమున నది "రి" "రు" లు గా మారినది. ఈ భాషలోని చ, జల దంత్యతాలవ్య భేదము వానిపైవచ్చు అచ్చులను బట్టియే గలుగు చున్నను, కొన్ని యెడల సంస్కృత భాషా ప్రభావముచేత గాబోలు తారుమారుగా కనబడు చున్నది. మహాప్రాణములగు ఠకార భకారములు కొన్ని దేశ్య శబ్దములనబడు ఠవరాదులలో గనబడుచుండుటను ఉచ్చారణలో గలిగిన మార్పుగా వీరు సమర్థించినారు. ఇక నీ భాషలోని "ఱ" కారము దేశీయమగు నొక వింత యక్షరము. ఆకారమునుబట్టి (శకట) రేఫముతో నభేదమును చేసి - లఘ్వలఘుత్వమును గల్పించుటచే లాక్షణికులకు గలిగిన చిక్కులు చక్కగా నిందు వ్యక్తము చేయబడినవి. ఇవి భిన్నాక్షరము లనుటకు లాక్షణికులు వేరు వేరు పట్టికలను జేర్పవలసి వచ్చుటయే నిదర్శనముగదా. ఉచ్చారణములో

వీని భేద మంతరించుటచే, నిందలి చిక్కులను ఇతర ద్రావిడ భాషారూపములతో బోల్చి నిర్ణయించుటయే యుక్తమైనపని. శషసలు - వాస్తవముగా ద్రావిడ భాషలలో లేవు - చేసి - చేశి, సెనగలు - శనగలు, వంటి రూపములలోని మార్పులను వర్ణ సమీకరణమును బట్టి సమర్థించుకొన వచ్చును. ఇట్టి వ్యావహారిక రూపములలో గలుగు ననేక విధములగు ధ్వనుల మార్పులను, వాని పరిణామ రీతిని సనిదర్శనముగా వీరీ గ్రంథమున ఆయా కవుల పద్యములలోని యతిప్రాసలలోని రూపములను బట్టి చక్కగా నిరూపించి యున్నారు.

ఆంధ్ర కవితకీ యతిప్రాసలు పుణ్యస్త్రీకి మంగళసూత్రముల వంటి వని కొందరి గోసరాణన్నారం. ఈ యతిప్రాసల మూలముగానే ఆయా కాలములయందలి ఆంధ్రభాషా స్వరూప లక్షణముల యథార్థస్థితిని మనము తెలుసుకొన గలుగుచున్నాము. వీని నాధారము చేసికొనియే ఆయా కాలములందలి లాక్షణికులు భాషా లక్షణములను గూర్చిన తమ రచనలను కొనసాగించిరి. అట్లే ఈ రచయితయు ఈ రెంటిని నాధారముగా జేసికొని ఆయా కాలములందలి వ్యావహారిక భాషా స్వరూపమును నిరూపించు ధ్వని లిపి పరిణామ రీతులను వ్యక్తపరచుట ఎంతయు సమంజసముగా నున్నది. ఈయతి ప్రాసలనునవి సులభముగా దిద్దివేయుటకు వీలులేనివి. ఐనను పండితులు లాక్షణికులు తమ వాదముల కనుకూలముగా వానిని సమన్వయించిరో, దిద్దిరో, ఎట్లో తమ వాదమును నిలబెట్టుకొనుటకు యత్నించుచునే యున్నారను విషయమును ఈ రచయిత పెక్కు చోటుల బహు సమర్థతతో నిరూపించి

యున్నారు. లాక్షణికులు, పండితులు, తమవాదమును నిలబెట్టుకొనుటకు కాలానుగుణముగా వ్యవహారమున మారుతూ వచ్చిన రూపములను ప్రాచీన లక్షణమున కనుగుణముగ సమర్థించుటక్కై పడిన బాధలు, తికమకలు, స్వోక్తివిఘాతములు మొదలగు వానిని శ్రీ గోపాలకృష్ణయ్యగారు వ్యక్తపరచిన రీతిచూస్తే చాల ఆశ్చర్యము కలుగక మానదు. ఆయా పట్టులందీ రచయిత చాల లోతునకు దిగి వానిని బైటకు దీసి వ్యక్తీకరించుటలో అసాధారణ ప్రజ్ఞను కనబరచినారనటకు సందేహము లేదు.

ప్రస్తుతము వ్యావహారిక భాషా రూపములలో ఇకారాకార సమ్మేళనము వలన ఏర్పడిన ae ధ్వనికి లిపి చిహ్నము లేకపోవుటచే కలుగుచున్న చిక్కును తొలగించుటకు ఈయన సూచించిన మార్గము అవశ్యాదరణీయము మని తోచుచున్నది. మక్కాకు, వచ్చాడు మొదలగు శబ్దములందు ఏకారాకార మిశ్రస్వరమును సూచింపు “ె” ఈ లిపి చిహ్నము ముద్రణమున స్వీకరింపబడినచో ఈ విషయమున గలుగుచున్న చిక్కులు చాలవరకు పరిహరింపబడును ననుటకు సందేహము లేదు.

జనుల యుచ్చారణ పరిపాటినిబట్టి భాషలో ధ్వనులు కాల క్రమమున అనేక విధముల మారుచుండుట సహజమనియు, అవి సామాన్యముగ స్వరసంప్రదాయానుసారములై

యుండుననియు గుర్తించి సమన్వయించుకొనవలయు ననునది భాషా తత్వవేత్తల మతము.

ఈధ్వని - లిపి - పరిణామపద్ధతినె యీ రచయిత పద వాక్య పరిణామములను గూడ పరిశీలించి వ్యావహారిక భాషా పరిణామ ప్రామాణ్యములను స్థాపింపగల నవ్య భాషా వ్యాకరణ నిఘంటువులను గూడ శీఘ్రకాలములోనే ప్రకటించి ఆధునిక ప్రజాస్వామ్య తత్వానుకూలముగా శ్రీరామమూర్తి పంతులుగారు ప్రారంభించిన శిష్ట వ్యావహారిక వాదమునకు స్థిరత్వము దిగ్విజయము కలుగునట్లు చేసి స్వతంత్ర భారతమున విశాలత్వము నాశించుచున్న యాంధ్రమాత యాశీర్వాదములను బొందుదురుగాక యని యాశించుచున్నాను.

మద్రాసు
18-10-1955

కోరాడ రామకృష్ణయ్య

ధ్వని - లిపి - పరిణామం

లే క

ప్రాచీన వాఙ్మయంలో వ్యావహారిక భాష

గ్రంథకర్త

వడ్లమూడి గోపాలకృష్ణయ్య

కళాకృష్ణుల కావ్యమాల

౩

కఱుడు గట్టిన
గ్రాంథి కాంధ్ర రచనా ప్రచండవాడ
సత్పండితోద్దండ తతులు
దద్దరిల్లగ
గుండెలు గుద్ది నిల్వు మదురు
బెదురులు లేవు నీ కెదురెలేదు

ధ్వని - లిపి - పరిణామం

(ప్రాచీన వాఙ్మయంలో వ్యావహారిక భాష)

మనం "లిటరేచర్" (Literature) అనే ఆంగ్ల పదానికి మారుగా "వాఙ్మయము" అనే సంస్కృత సమ పదాన్ని వ్యవహరిస్తున్నాము. కాని యీ "వాఙ్మయ పదము" "లిటరేచర్" అనే ఆంగ్లపదానికి సరైన -అంటే- సమానార్థకమైన సంస్కృత సమపదం కాదని మన విమర్శకు లందరూ యిదివరకే అంగీకరించారు. వాక్ + మయము" అను వాని మేళనంచేత ఈ "వాఙ్మయ" మనే పదం యేర్పడింది - వాక్కుల మయమైనది- అనగా - నోటిమాటలతో నిండినది వాఙ్మయ మనబడుతుంది. ఈ వ్యుత్పత్త్యర్థాన్నిబట్టి వాఙ్మయమనే పదాన్ని మాటలతో కూడినదానికి దేనికైనా వ్యవహరించవచ్చును. కాని వ్యుత్పత్త్యర్థాన్నిబట్టి విశాలమైన అర్థంకల యీ వాఙ్మయ పదానిక అర్థంలో అవ్యాప్తిత్వం యేనాడో పట్టింది.

అనాదిగా కవిత్వానిక * సంబంధించిన గ్రంథసముచ్ఛయానికే ఈ వాఙ్మయ శబ్దం వ్యవహరింపబడుతున్నది.

భాష ప్రప్రథమంగా వాగ్రూపంలో వెల్వడి తర్వాత క్రమక్రమంగా లేఖనారూపాన్ని పొందుతుందన్న విషయం సర్వ

---

* కవిత్వం కేవలం పద్యాత్మకమే అనే నియమం యెక్కడా లేదు. అది గద్యాత్మకమైనా, పద్యాత్మకమైనా, గేయాత్మకమైనా యేదైనా కావచ్చు.

విదితమే. ఉచ్చరించే భాషను వ్రాయడానికి మొదలు పెట్టారు కాబట్టే అటువంటి భాషాపదసముచ్చయానికి "వాఙ్మయ" మని పేరు వచ్చింది. ఆవిధంగా కాకపోతే లేఖనామయమనో వాక్కుకు సంబంధం లేని మరొక పదసంజ్ఞయో వచ్చివుండేది. ఇటువంటి వాఙ్మయాన్ని - అంటే - నోటిమాటలతో నిండిన భాషను - అనగా - వ్యావహారిక భాషను ప్రాచీనకాలంలో కొందరు పెద్దలు తమకున్న ధీశక్తిని వినియోగించి కొన్ని మార్పులు ♦ చేసి మనం "లక్షణబద్ధ" మనీ "గ్రాంథిక" మనీయెంచుతున్న కావ్య భాషను సృష్టించారు. అసలు న్యాయానికి లక్షణబద్ధమైనభాషనే గ్రాంథికభాష అనాలనే సిద్ధాంతం యెక్కడా లేదు. గ్రంథాల్లో వ్యవహరించే భాష - అది లక్షణబద్ధం కావచ్చు - వ్యావహారికం కావచ్చు - లేదా నింద్యమైన కుత్సార్థదోషపూరితమైనదే కావచ్చు - ఏదైనప్పటికీ గ్రాంథికమే అవుతుంది. కాని యీ గ్రాంథిక మనే పదం కొంతకాలంగా "లక్షణబద్ధమైన" భాషకే వ్యవహరింపబడుతున్నది. వ్యావహారిక భాషనే సంస్కరించి సృష్టించిన మన గ్రాంథికాంధ్రానికి - అనగా - లక్షణాంధ్రానికి

♦ ఈ మార్పునే "సంస్కరణ" అని కొందరన్నారు. సంస్కరణ అనగా బాగుచేయడం-ఈ సంస్కరించడమనేది ఒకే పద్ధతిలో సర్వతోముఖంగా(వ్యావహారకంగాను గ్రాంథికం గాను - రెండువిధాలాకూడా)జరిగివుంటే అదినిజంగా సంస్కరణ అనిపించుకొనేది. కాని యీసంస్కరణ కావ్య భాషకు గ్రంథరచనలోను, గద్యపద్యాదులును ఆశువుగా రచించడంలోను, మాత్రమే జరిగి సర్వతోముఖత్వాన్ని పొందలేదు. ఆవిధంగా పొందడం అసంభవంకూడా - అందుకే కొన్ని కొన్ని పరిమిత పరిధుల్లో మాత్రమే జరిగ యీ సంస్కరణను సంస్కరణ అనడం నాకిష్టంలేదు. అందుకే "మార్పు" శబ్దాన్ని వినియోగించాను.

ప్రాచీనకాలంలోను, గ్రాంథి కాంధ్ర పురాణ ప్రబంధ నిర్మాణ కాలంలోను, వ్యావహారిక భాషాస్థితిగతు లెటువంటివో - ఆ వ్యావహారిక భాషను లక్షణాత్వం - గ్రాంధికత్వం - ఏవిధంగా సంక్రమించిందో పరిశీలించడం అవసరం. అటువంటి పరిశీలనకు ఆయువుపట్టు మన భాషకున్న అక్షరాలు - ఆ అక్షరాలు పొందే మార్పులు - ఆ మార్పులకు గల కారణాలు - ఆ మార్పుల్లో వ్యావహారికానికి, ప్రజల ఉచ్చారణకు ఉన్న స్థానగలం. ఇవి ముఖ్యంగా పరిశీలనకు రావలసిన విషయాలు. కాబట్టి మన ఆంధ్రభాషలో వ్యావహారికానికి అనుగుణంగా ఏయే అక్షరాలు ఏవిధంగా మార్పులను పొందాయో అధికారపూర్వకంగా తెలుసుకోవడం యెంతైనా అవసరం.

— ఇ, ఈ, ఎ, ఏ. —

మన ఆంధ్రభాషలోని "ఇ, ఈ" లు వ్యవహారంలో "యి, యీ"లుగా మారినాయి. ఈ "ఇ,ఈ"లు ఉన్నవి ఉన్నట్టుగా వుచ్చరించాలంటే కొంచెం వొత్తి (నొక్కి) పలుక వలసివస్తుంది. ఈ విధంగా ఒత్తి పలకడంలోవున్న కష్టాన్ని కొంత తగ్గించుకోవడానికి అత్యల్పమైన సుఖాన్ని కూడా అపేక్షించే మానవుడు ఆ "ఇ, ఈ"లను నొక్కి- పలుకకుండా తేల్చి పలుకుతాడు. ఆ తేల్చిపలుకడంలో "తాలు" స్థానికాలైన యీ "ఇ,ఈ" లకు సన్నిహితంగా వుండే తాలుజమైన "య" కారం వస్తుంది. అప్పుడవి "యి, యీ"లుగా మారి నోటినుంచి వెల్వడతాయి.

ఇదే విధంగా కంఠతాలుజాలైన "ఎ, ఏ" లను స్థాన

ప్రయత్న మిశ్రతత్వంచేత (యకారం తాలుజం - ఎ, ఏ, లు కంఠ తాలుజాలు. "య" కారానికి సంవారం, నాదం, ఘోషం, బాహ్యప్రయత్నాలు. "ఎ, ఏ"లు కూడా సంవార నాద ఘోష ప్రయత్నాలు కలవి అవడంచేత) "య" కారం వస్తుంది. అప్పుడవి "యె, యే"లుగా మారి వెలువడతాయి. అనగా ఉచ్చారణలో మానవుని సుఖాపేక్షవలన "ఇతడు, ఈతడు, ఎక్కడ, ఏమి," మొదలైన అజాదిపదముల ఆదిగల ఇ, ఈ, ఎ, ఏ,లు హలాదులుగా - అంటే - "య" కారాదులుగా "యితడు, యీతడు, యెక్కడ, యేమి, అని ఉచ్చరింపబడతాయి. కాగా ఈనాడు ఇ, ఈ, ఎ, ఏ, లు ఆదిగల పదాలు యకారంతో కలిపి వ్యావహారిక భాషలో వ్రాయబడడం అసహజం కాదన్న మాట. నేటి వ్యావహారికభాషలో వ్యవహరిస్తున్న ఈ "య" కారం కేవలం ఈనాటిదికాదు. వ్యావహారికభాషావాదం పుట్టడానికి చాలా కొన్ని వందల సంవత్సరాలకుపూర్వమే ఉన్నది. ఆంధ్రశబ్దచింతామణి*కర్త (కాలం క్రీ॥శ॥ 11వ శతాబ్దం అయినా 16వ శతాబ్దం అయినా ఏదయినా కావచ్చు) "అద్యః క్రియాసు భూతార్థద్యోతిన మాద్యగం వినా సర్వః" అనే సూత్రంలో

* ఆంధ్రశబ్ద చింతామణి కర్త నన్నయ భట్టారకుడని కొందరివాదము. వారివాదనలో సత్యం ఉన్నా లేకపోయినా కేవలం వాదం కొరకు మాత్రమే చింతామణి కర్తగా నన్నయను అంగీకరించినట్లయితే పదాది "య" కారం నన్నయ సహితం వాడినాడని గ్రాంథికవాదులు అంగీకరించక తప్పదు. నన్నయ అంతటివాడు పదాది "య" కారాన్ని వ్యవహరించినప్పుడు (అందులోను లక్షణగ్రంథంలోనే తాను వ్యవహరించి అంగీకరించి నప్పుడు) వ్యావహారికంలో పదాది యకారాన్ని వ్యవహరించడం దోషంగా ఎంచడం ఏమాత్రమూ సమంజసంకాదు.

పదాది "య" కారాన్ని స్పష్టంగా అంగీకరించాడు. ప్రాచీన కాలంలో ఆంధ్రప్రబంధకర్తలు లక్షణగ్రంథకర్తలూ ఒక్కరేమిటి కవులందరూ పదాది "య"కారాన్ని వ్రాతలో సైతం వ్యవహరించారు. యితడు, యెవడు మొదలైన పదాలను (ఆది అంతస్థము) యకారాదిగ కవులు పండితులు సైతం వ్రాస్తూ వుండేవారు కాబట్టే లక్షణగ్రంథకర్తలు పదాదిలో "య" కారం లేదని చెప్పుకోవలసి వచ్చినది.

క॥ తలకట్టుగాక యెత్వము
యలవడుఁ జ జ సలను మూఁట నది మొదలగుచోఁ
దెలుఁగుల మొదల్ల నెయిలివి
యల హల్లులుగావు స్వరములగు వ్రాయంగన్

ఉదాహరణము :

ఆ॥ వె॥ చెలువ చేర కొప్పు జేన యనంగను
సీస కొప్పనంగఁ జెల్లు మూఁట
నెలుక యిరవనంగఁ నీ రెండువర్ణంబు
లచ్చులగును హల్లులాదిగావు

(లక్షణసార సంగ్రహం. తృతీయాశ్వాసం. 6,7 పద్యాలు.
క్రీ॥ శ॥ 1550 ప్రాంతం. చిత్రకవి పెద్దన రచన)

ఈ పెద్దన కాలంలో అజాది పదాలైన "ఎలుక, ఇరవు" మొదలైన పదాలు "యెలుక, యిరవు" మొదలైనవిగా హల్లు ఆదిలోగలవిగా వ్రాయబడుతుండేవి. కాబట్టే ఆ పదాలు అజాదులేనని హలాదులు కావని ఉదాహరణాలతో సహా పెద్దన చెప్పుకోవలసి వచ్చినది.

ఎవడు, మొదలైన పదాలకు హలాదిత్వాన్ని అప్పకవి అంగీకరించక పోవడంచేత "అద్యః క్రియాను భూతార్థద్యోతిస మాద్యగం వినా సర్వః" అనే చింతామణి సూత్రాన్ని "అద్యః క్రియాను భూతాద్యర్థ సముద్యోతిసం వినా సర్వః" అని సవ రించుకున్నాడు. అప్పకవి పదాది "య" కారాన్ని అంగీకరించ కుండా "అద్యఃక్రియా" స్విత్యాది సూత్రాన్నంతే దిద్దగలిగి నాడు గాని ఉచ్చారణలోను, తదనుగుణంగా వ్రాతలోను పామరులకే కాక పండితులకు కూడా ఉన్న "యెవడు, యెక్కడ" అని హలాదిగా వ్రాసే అలవాటును ఏ విధంగా దిద్దగలడు ? అందుకనే పాపం పదాది "య" కారాన్ని అంగీ రింపక చింతామణి సూత్రాన్ని దిద్దిన అప్పకవికూడా పదాదిలో "య"కారం లేదని అజాది పదాలను హలాది పదాలుగా వ్రాయడం దోషమని ఒకసారికాదు ఎన్నోసార్లు చెప్పుకు న్నాడు.

క॥ పద్యాది ప్రాణంబుల
నాద్యంతాంతస్థములుగ, నజ్ఝులు కృతులన్
జైద్యహర ! వ్రాయుదురు తమ
విద్యాధికులెల్లఁజూచి వికవికనవ్వన్ ॥

క॥ ఇరులీఁగలు ఋత లూళ్ళ
వ్వరు నేమిటి కొక్కఁడోపు వానికి నను సీ
కరణిపదంబుల మొదలివి
స్వరములనుచుఁ దెలిసి వ్రాయఁ జనుఁ బద్యాదిన్

(అప్పకవీయం. 2. ఆ. 48, 44 ప)

క॥ తెలుఁగున యణకారంబులు
గలుగవు శబ్దాదులను యకారము పగిదిన్
బలుకఁబడునవి స్వరములగు
ఖల పూర్వామరవినాశ ! కామెపలీశా !

(అప్పకవీయం. 2. ఆ. 65 ప)

సీ॥ ఆంధ్రోక్తి మొదల నాద్యంతస్థ ముండదు
ప్రాణమై యదిగనుపట్టుఁగాని

(అప్పకవీయం. 2 ఆ. 175)

అప్పకవి కాలంలోనైతం ఇక్కడ, ఎక్కడ మున్నగు పదాలు హలాదులుగా ఉచ్చరింపబడుతున్నట్లు అప్పకవి అంగీకరించాడన్న సంగతి "శబ్దాదులను యకారము పగిదిన్ బలుకబడునవి స్వరములగు" అనుదానివల్ల స్పష్టంగా తెలుస్తున్నది. వ్రాతలో కూడా ఆనాడు ఆదిలో "య"కారాన్ని వినియోగించేవారు కాబట్టి అన్ని పర్యాయాలు పదాది "య"కారం తెలుగులో లేదని అప్పకవి చెప్పుకున్నాడు. ♦

♦ ఆంధ్రశబ్ద చింతామణికర్త "అద్యః క్రియాసుభూతార్థద్యోతినమాద్యగం వినా సర్వః" అనే సూత్రంలో స్పష్టంగా పదాది "య" కారాన్ని అంగీకరించాడు. అందువలన సంధిజరుగవలసినపుడు రాముడు + యెక్కడ ఇత్యాదులలో సంధిజరుగడంలేదు. తింటిన్ + యిప్పుడు ఇత్యాదులలో "య"కారం స్థిరం కావడంచేత లోపసంశ్లేషాదికార్యాలు అనివార్యాలు అవుతున్నాయి. కాబట్టే చింతామణికర్త "సర్వత్రాజ్వత్ కార్యం జ్ఞేయం యస్య" అని పదాదిలో వున్న "య" కారానికి అచ్చువంటి కార్యాన్ని ప్రవచించి "రాముడెక్కడ, తింటినిప్పుడు" మున్నగు రూపాలు సిద్ధింపజేశాడు. జనవ్యవహారవశాత్తు ఉచ్చారణ కనుగుణంగా యేర్పడిన యీ పదాది "య" కారస్థితిని లక్షణభాషలో - అనగా - కావ్యభాషలో అంగీకరించి తిరిగి దానికి ("య"కారానికి) లోపం చెప్పుకోనవలసిన యవసరం

యేమాత్రమూ లేదని అప్పకవి భావించాడు. ఆ కారణంచేతనే "అద్యః క్రియాసు భూదార్థద్యోతిన మాద్యగం వినా సర్వః" అనే సూత్రాన్ని "అద్యఃక్రియాసు భూతాద్యర్థసముద్యోతినం వినా సర్వః" అని సవరించాడు. కాబట్టే అప్పకవి "సర్వత్రాజ్వత్కార్యం జ్ఞేయం యస్య" అనే సూత్రాన్ని ఆంధ్రీకరింపలేదు. పదాది "య"కారాన్ని చింతామణికర్త అంగీకరించిన విధంగా అప్పకవి అంగీకరించని కారణంచేత పదాది "య" కారానికి చింతామణికర్త అజ్వత్కార్యము చెప్పుకొనినవిధంగా అప్పకవి చెప్పుకొనవలసిన అవుసరం కలుగలేదు. నేటి అప్పకవీయంలో "సర్వత్రాజ్వత్కార్య" మిత్యాది సూత్రాన్ని అప్పకవి ఆంధ్రీకరించినట్లుగా తత్ సూత్రంతో పాటు యీ క్రింది పద్యము కనపడుతున్నది.

ఉ॥ ఆరయ వైకృతోక్తులఁ బదాదులయందు యకారముండ దా
తీరునఁ బల్కు వ్రాఁతగణుతింపగ నచ్చగు దానిడాపలన్
నీరజనాభ! నాంతములు నిల్చిన నచ్చటఁ బ్రాణసంధ చె
న్నారు నితండు వైద్యవసుధాధిపు నేపడఁగించె నేఁ డనన్॥

(అప్పకవి 5 ఆ. 40 ప.)

అప్పకవి "అద్యః క్రియా" స్విత్యాది సూత్రాన్ని పదాది "య" కారాంగీకార భావం లేకుండేట్లుగా సవరించి తన సవరణకు అనుకూలంగా "సర్వత్రాజ్వత్కార్య" మిత్యాది సూత్రాన్ని తొలగించినాడన్న సంగతి గమనింపక యెవరో యితర బాలసరస్వతీయాది ప్రతులలో కనపడుతున్న ఈ "సర్వ" త్రిత్యాది సూత్రం అప్పకవీయంలో లోపించిందనీ భావించి ఆ సూత్రాన్ని దాని కాంధ్రీకరణంగా వున్న పై పద్యాన్ని అప్పకవీయంలో ప్రవేశపెట్టి ఉంటారు. అహోబలుడు "సర్వత్రాజ్వత్కార్యమితి సూత్రంతు తత్పుస్తకే నదృశ్యత ఏవ" (అహో. 139 పు. 1926 ముద్రణ) అని స్పష్టంగా వ్రాయడం చూస్తే అప్పకవీయంలో సర్వత్రేత్యాది సూత్రమూ తదాంధ్రీకరణ పద్యమూ లేదని తెల్లమవుతున్నది. అహోబలుని వాక్యాన్ని బట్టి పై సూత్రమూ దాని ఆంధ్రీకరణ పద్యమూ అహోబలునికి తరువాతే అప్పకవీయంలో చేర్చబడ్డాయనడం నిస్సందేహం. వస్తుస్థితి ఈ విధంగా ఉండగా

— "పదాది యకార నిరాసకములగు నప్పకవీయస్థిత "వికృతిపదాదా" విత్యాద ప్రక్షిప్త సూత్రములు చింతామణిలో నుండునపుడు పదాది యకారమున కజ్వద్భావము నుపదేశించెడి "సర్వత్రాజ్వ" దిత్యాది ప్రకృత సూత్ర ముండనేరదుగదా. అట్లైనను నట్టి సూత్రమును దాని వివరణమును నప్పకవీయ పంచమాశ్వాసమున వెలయుచునే యున్నవి. కాఁగాఁ బదాది యకార నిరాసకములగు 'వికృతిపదాదా' విత్యాది సూత్రములు నిర్వివాదముగఁ బ్రక్షిప్తములని చెప్పఁదగియున్నవి. కావుననే యెవ్వరో యప్పకవీయ మాతృకలోని యిట్టి సందర్భరాహిత్యము నాలోచించి 'సర్వత్రాజ్వ' దిత్యాది ప్రకృత సూత్రమును దాని వివరణపద్యములను నప్పకవీయమునుండి బహిష్కరించుటయు నట్టి మాతృకయే యహోబల పండితునకు దొరకుటయు సంభవించెనాయని "సర్వత్రా?-జ్వత్కార్య మితి సూత్రంతు తత్పుస్తకే నదృశ్యత ఏవ" (అహో. 155 పుట) అనెడి యహోబలపతి వాక్యముచే నాలోచింపవలసియున్నది". (చిం. వి. పరిశోధనం. 190 పుట) —

అని శ్రీ వఝ్ఝల చినసీతారామస్వామిశాస్త్రిగారు వ్రాయడం వింతగా వున్నది. మీదుమిక్కిలి తమ ఆంధ్రవ్యాకరణసంహితాసర్వస్వంలో(126పు.)

— "అప్పకవీయ ముద్రణములందును తాళపత్ర మాతృకలందును సర్వత్రేత్యాది చింతామణికారికయు దాని కప్పకవిచేసిన వివరణపద్యములును వెలయుచునే యున్నవి.

పయిని వివరించిన విరోధమును గనిపెట్టి ప్రక్షిప్త పాఠకర్తలు "సర్వత్రేత్యాది" కారికను దొలఁగించిన యప్పకవీయ మాతృక యహోబల పండితునకు లభించెనో? లేక యహోబలపతియే యాకారిక లేదని సాహసముతో వ్రాసెనో? తెలియకున్నది." —

అని వ్రాయడం మరింత వింతగా వున్నది. "అద్యః క్రియాసుభూతార్థద్యోతన మాద్యగం వినాసర్వః" అను చింతామణి సూత్రానికి కొంత భిన్నమైన సూత్రాన్ని అప్పకవి గ్రహించాడని శ్రీ వఝ్ఝలవారు అంగీకరించారు.

వికృతివివేక కర్త కాలంలో (ఈ వికృతివివేకానికే అథర్వణకారికావళి అని నామాంతరం) కూడా పదాదిలో "య" కారం వున్నదనడం స్పష్టం†

వికృత్యాది గతో యోऽత్ర స్యా చ్ఛబ్దాంతరయోగతః
ప్రాణమాత్రావశేషస్యా దత్ర శ్రీకవి. సమ్మతేః
(వికృతి. సంధి-22 సూ.)

అప్పకవి గ్రహించిన సూత్రంలో పదాది "య"కారాంగీకారవిషయంలేదన్న సంగతి సుస్పష్టం. పదాది "య"కారాన్ని అంగీకరించని అప్పకవి పదాది "య" కారానికి అజ్వత్వాకార్యం చెప్పే సూత్రాన్ని పరిగ్రహించి ఆంధ్రీకరించాడనడం సమంజసం కాదు. "అద్యః క్రియా" స్విత్యాది సూత్రాన్ని పదాది "య" కారాన్ని అంగీకరించడం ఇష్టంలేని అప్పకవి తానే సవరించి వుండకూడదా ? తానుచేసిన సవరణ కనుగుణంగా "సర్వ" త్రేత్యాది సూత్రాన్ని ఆంధ్రీకరించకుండా విడిచిపుచ్చగూడదా ? "అద్యః క్రియా" స్విత్యాది సూత్రంలో అప్పకవీయ పాఠానికి బాలసరస్వతీయాదుల పాఠానికి భిన్నత్వమున్న సంగతి గమనించని వారెవరో అప్పకవీయంలో "సర్వ" త్రేత్యాది సూత్రం సకారణంగా లోపించిందన్న సంగతి తెలియక దానిని ఆంధ్రీకరించడం మరచి ఉంటారని భావించి తమంతటతామే పద్యాలను ప్రవేశపెట్టకూడదా ? సర్వత్రేత్యాది కారిక దాని ఆంధ్రీకరణ పద్యాలు అప్పకవీయంలో నిజంగానే ఉంటే అహోబలుడు ఆ కారిక లేదని సాహసించి బుద్ధిపూర్వకంగా అబద్ధం ఆడవలసిన అవసరం యేమున్నది? అప్పకవి పదాదిని "య"కారమున్నట్లు చెప్పకుండా అజ్వత్వాకార్యం చెప్పినాడనడం సమంజసమెట్లా అవుతుంది ?

† ఈ వికృతివివేకకర్త కవిబ్రహ్మ తిక్కనసోమయాజికి ఇంచుక పూర్వకాలంలో ఉన్న అథర్వణాచార్యులని కొందరి వాదం - ఈవాదం ప్రకారం ఈ గ్రంథకాలం క్రీ॥శ॥ 1260 కి పూర్వమనే చెప్పాలి. ఆంధ్ర శబ్దచింతామణి నన్నయ కర్తృకమనడం యెంత సత్యదూరమో ఆ చింతామణికి పూర్వంగా వెలసిన యీ వికృతివివేకం అథర్వణకర్తృకమనడం అంతసత్యదూరం- (దీన్ని గురించిన కొంతవివరం - దివ్యప్రభావివరణసహిత

అని చింతామణిలోని "సర్వత్రేఽజ్వ"దిత్యాది సూత్రాన్ని విపులీకరించినట్లుగా శ్రీకవిమతంలో పదాది "య" కారం వున్నట్లు మతాంతరంగా చెప్పబడింది. అయితే వికృతివివేక కర్తకాలంలోనో అంత కించుక పూర్వమో కొందరు పండితులు పదాది "య" కారాన్ని అంగీకరించారనే విషయంపై శ్రీకవిమతోద్ధాటనవల్లనే తెల్లమవుతున్నది.

ఈ వికృతివివేకంలోనే మరొకచోట అజాది పదాలను హలాదులుగా గ్రహించరాదని ఈ క్రింది కారికలో చెప్పబడింది.

"ఆద్యవర్ణాస్తు హల్త్వేన నగృహ్యంతే కదాపిచ"

(ఆద్యవర్ణాస్తు=పదాద్యచ్చులు, కదాపిచ=ఎప్పుడూ, హల్త్వేన=హలాదులుగా, నగృహ్యంతే=గ్రహింపబడవు.)

ఈ కారికాకర్తకాలంలో కొన్ని అజాదిపదాలు హలాదులు (యితను, యీతను, యెక్కడ, వుడుత, వోడ – ఇత్యాదులు) గా వ్యవహరింపబడుతుండేవి కాబట్టే పదాద్యచ్చులు హలాదులుగా ఎప్పుడూ గ్రహింపబడవని చెప్పవలసివచ్చింది.

అ, ఆ లకు పూర్వభాగంలో సవిక్షమైన హల్లులుకూడా కలిపి ఏకాలంలోనూ వ్యవహారం లేదు–అంటే–జనవ్యవహారంలో

ఆంధ్రభాషాభూషణపీఠిక – (వివరణకర్త – శ్రీ దేవినేని సూరయ్యగారు పీఠికాకర్త–వడ్లమూడి గోపాలకృష్ణయ్య.) 28 వ పుట చూడుడు.

ఆంధ్రశబ్దచింతామణి (బాలసరస్వతి) కాలానికి తర్వాత క్రీ॥ శ॥ 17వ శతాబ్ద్యంతంలో ఈ వికృతివివేకం వెలువడింది. ఈ గ్రంథకాలం యేదైనప్పటికీ యిందులో కూడా పదాది "య"కార అంగీకారసంకల కారిక ఉండడమే మనకు ముఖ్యం.

నాటికీ నేటికీగూడ అ, ఆ, లలో మార్పు[1] కలుగలేదన్న మాట- ఇ, ఈ, లకూ ఎ, ఏలకూ వ్యవహారంలో "య" కారోచ్చారణ పూర్వకాలంలోనే సంక్రమించింది. ఉ,ఊ,ఒ,ఓ లకూ ప్రాచీన కాలంలోనే "వ" కారోచ్చారణ సంక్రమించింది. ఐ,ఔ లకు "అయి, అవు" అని ద్వ్యక్షర భిన్నరూపాలు ఏర్పడినవిగాని ఇ, ఈ, ఎ, ఏ, ఉ, ఊ, ఒ, ఓ, లకువలె హలాది ఉచ్చారణ ఏర్పడలేదు- అనగా-ఈ వికృతివివేకకర్త కాలంలో "ఇక్కడ, ఈతడు, ఎక్కడ, ఏమి, ఉడుత, ఊరు, ఒకడు, ఓడ" మున్నగు పదాలు "యిక్కడ, యీతడు, యెక్కడ, యేమి, వుడుత, వూరు, వొకడు, వోడ" మున్నగు హలాది పదాలుగా వ్యవహరించేవారన్న మాట. అతడు, ఆతడు, ఐశ్వర్యము, ఔదల, మొదలైన పదాలన్నీ అజాదులుగానే వ్యవహరించేవారు. ఈ పదాద్యచ్చులకు అనగా అ ఆ ఐ ఔ అను వాటికి పూర్వభాగంలో హల్లు జనవ్యవహారంలోకూడా ఏనాడూ లేదన్న

[1] అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ మున్నగు స్వరాలను రెండు రెండు (హ్రస్వదీర్ఘాలు) కలిపి జంటస్వరాలుగా ఉచ్చరించేటప్పుడు పూర్వాననున్న హ్రస్వస్వరం జనోచ్చారణలో దీర్ఘస్వరంగా మారుతుంది. - అనగా - అ, ఆ - అనే హ్రస్వదీర్ఘ స్వరాలు రెండూ వెంటవెంటనే ఉచ్చరింపవలసి వచ్చినప్పుడు మొదటవున్న హ్రస్వస్వరం దీర్ఘస్వరంగా మారుతుందన్న మాట. (ఇదే విధంగా ఇతర స్వరాలుకూడా మారతాయి) అందువల్లనే అ,ఆ-ఇ,ఈ-ఉ,ఊ, వగైరాలకు ఏజంట కాజంటను వెంటవెంటనే ఉచ్చరించవలసివచ్చినప్పుడు అ, ఆ లను అ, ఆ లుగా కాకుండా ఆ, ఆ లుగా వుచ్చరిస్తాం - ఇ, ఈలను ఇ, ఈ లుగా కాకుండా ఈ, ఈ లుగా వుచ్చరిస్తాం - ఇదే విధంగా యితర స్వరాల్లోకూడా పూర్వాన్ని వుండే హ్రస్వస్వరం దీర్ఘస్వరంగా మారుతుంది. ఈ మారడం కేవలం జనవ్యవహారంలో ఉచ్చారణ సుఖాపేక్షతోనే - వెంటవెంటనే హ్రస్వదీర్ఘాలు రెండూ ఉచ్చరించవలసివచ్చి

మాట. అతడు అక్కడ మొదలైన పదాలను, యితడు యిక్కడల వలె యతడు, యక్కడ అని ఎవ్వరూ వ్యవహరించ లేద్న మాట. కాబట్టి పదాదిలో హ ఉచ్చారణ ఏర్పడేన ఇ ఈ ఎ ఏ ఉ ఊ ఒ ఓ లకు మాత్రం ఆదిలో హల్లు ఉండ దన్న సంగతి వికృతివివేకకర్త చెప్పినా ఉపరం నగ్నసత్యం. వాస్తవ మిట్లుండగా శ్రీ వఝ్ఝల చిన సీతారామశాస్త్రిగారు ఆద్యవర్ణాస్త్యత్వాది కారికకు ఈక్రిందిగోని విపరీతార్థం చెప్పడం ఆశ్చర్యకరంగా ఉన్నది.

“ఆద్యవర్ణాస్తు = (ఆది + అవర్ణాస్తు)

నప్పుడు మొదట హ్రస్వమూ తర్వాత దీర్ఘమూ ఉచ్చరించడం ఎవరికైనా కష్టమే - కాబట్టే చాలా ప్రాచీనకాలంనుంచికూడా హ్రస్వాన్ని దీర్ఘంచేసి ఉచ్చరించేవారు - ఆకారణం చేతనే

* క॥ ఆ ఆ లై ఔలకు మఱి
ఈ ఈలు ఋకారసహిత మే ఏలకు నా
ఊ ఊల్ తమలో నొండొండి
ఓ ఓలకు వళ్ళగు స్వయోన్నత చరితా !
(కవిజనాశ్రయం - సంజ్ఞాధికారం)

* క॥ తనరఁగ ఆ ఆ ఈ ఈ
లనఁగా ఊ ఊలు నాఁగ నంబుజనళి లో
చన ! ఋ ౠ ఐ ఓ ఔ
లనఁగ నజంతాహ్వయంబులగు పరినొందున్.
(అనంతుని ఛందం - 4ఆ. 109 ప.)

---

* ఈ రెండు పద్యాలు ముద్రణలో ఆయాగ్రంథాల్లో అర్థానికి అనుగుణంగా సవరించి ముద్రింపబడ్డాయి. అవి పరిష్కర్తల పొరపాటు.

పదాదిగతములగు "అ-ఆ" అను వర్ణములు, హాత్త్వేన నగృహ్యాంతే = అకారయుక్తపదాదిగతయకారములుగ - అనఁగా - నలఘు యకారములుగ గ్రహింపఁబడవు.

(ఆం. వ్యా. సం. సర్వస్వము 122 పుట)

వాస్తవంగా అజాదిపదాలైన ఇతడు, ఈతడు మొదలైనవాటిని సుఖాపేక్షతో జనవ్యవహారంలో యితడు, యీతడు అని హలాదులుగా ఉచ్చరించడం తదుచ్చారణ కనుగుణంగా ఉల్లేఖించడం జరుగుతున్నది కాబట్టి ఆ పదాది హల్లులను విడిచిపుచ్చాలని చెప్పడం సమంజస మవుతుంది. అతడు, ఆతడు మున్నగు అకారాది పదాలలో "అ" కారానికి హలుచ్చారణ యెక్కడైనా వున్నదా? హల్త్వంచేత వ్యవహారం ఉండనేగదా హల్త్వగ్రహణం కూడదని చెప్పవలసిన అవసరంకలగడం. "అ" కారానికి హలుచ్చారణే లేనప్పుడు వికృతివినేక

ఈపద్యాలలో అ, ఆ - ఇ, ఈ - ఉ, ఊ - ఋ, ౠ - ఎ, ఏ - ఒ, ఓ లలో ఉన్న హ్రస్వాలు దీర్ఘాలుగా ప్రయోగింపబడ్డాయి ♦ "అకారానికి ఉకారం వస్తుంది" ఇత్యాది ప్రయోగాల్లోకూడా కారప్రత్యయం రానప్పుడు హ్రస్వం దీర్ఘంగా మారుతుంది. (చూ - ప్రౌ - వ్యా - సంజ్ఞ - సూ 3) అపుడు "ఆను ఊ వస్తుంది" అని అయిపోతుంది. ఇదికూడా ఉచ్చారణ సౌలభ్యానికి వచ్చిందే - "రాఁ దొలంగి సమస్తాక్షరములమీఁద"† (అనం - ఛం-4-ఆ.128ప.) అని "ర"కారానికి "రా"అని అనంతుడు ప్రయోగించాడు. ఇదికూడా వ్యవహారవశంచేత గ్రంథస్థమై అంగీకరింపబడినదే.

♦ మా-ఛందోదర్పణ విశేషములు - నావ్యాసం - ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక-39 సంపు. 1-8 సంచిక-6 పుట.

† మా-ఛందోదర్పణము - కొన్ని విశేషాలు-నావ్యాసం- సుభాషిణి- 18 పుట - 1952 సెప్టెంబర్.

కర్త "ఆది + అవర్ణాస్తు" అని "అ"కారాదులన్నింటిని గ్రహించ వలసిన అవసరం లేదుగదా! "ఆద్య + వర్ణాస్తు" అని సాంప్ర దాయంగా విభజించి చెప్పుకుంటున్న అర్థాన్ని విడిచిపుచ్చి శ్రీ వఝ్ఝలవారు అసర్థదాయకమైన విపరీతార్థకమైన విభాగం చేసి "ఆది + అవర్ణాస్తు" అని వ్యర్థమైన అర్థాన్ని చెప్పడం సమజసంకాదు. అకారం ఆదిలో వున్న పదాలకు హ్రాలాది వుచ్చారణ వున్నప్పుడు వఝ్ఝలవారు చెప్పిన అర్థం పొసగుతుంది గాని లేనప్పుడు పొసగనేరదు.

క్రీ. శ. 17 వ శతాబ్దంలో ఉన్న బాలసరస్వతి తన బాల సరస్వతీయంలో " సర్వత్రాఽజ్వ త్కార్యం జ్ఞేయం యస్య ప్రమత్రపకృతికేభ్యః " అనే చింతామణి సూత్రానికి వ్యాఖ్యా నం వ్రాస్తూ –

" కలిగెఁ యెమ్మ్మ, కలిగె యెమ్మ్మ అని సంశ్లేషంకాని, లోపముకాని లేదాయెను. ఇచ్చట నాద్యగముగనుక యెత్వము వచ్చినది. యెత్వము రాఁజెప్పనేల ? అజ్వత్కార్యం వచ్చున నేల ? ఆదియం దచ్చేకాని యకారము లేదనినఁ జాలదా ? యనరాదు. ప్రయోజనాంతరము లేకున్నను ఉచ్చారణావరోధ మూచున్నది కాన "యె" కారమె కాని "ఎ"కారము కానేరదు."

(బాలసరస్వతీయం – సంధి – 174 పు.)

అని వ్రాసినాడు. "యెమ్మ్మ" అన్నప్పుడు పదాని "యె" కారం వ్రాసుకొనడం ఎందుకు? అందులోని "య్" కారహల్లుక సంధిలో లోపం చెప్పుకోవలసిన అవసరం ఏమిటి? అని ఎవరైనా ప్రశ్నిస్తారేమోనని భావించిన బాలసరస్వతి వ్యవహారంలోఉన్న

ఉచ్చారణకు విరోధం రాకుండా ఉండడానికి పదాది "యె"కారం గ్రహింపబడిందని సమాధాన మిచ్చారు. పండితుడు, కవి, వ్యాకరణవ్యాఖ్యాకర్త అయిన బాలసరస్వతి ఇక్కడ ఉచ్చారణనుబట్టి "యెవడు" ఇత్యాదుల్లో పదాది "యె"కారాన్ని నిక్కచ్చిగా వ్రాసుకోవచ్చునని చెప్పుతుంటే; వ్యావహారిక భాషను రచనలో ప్రయోగించవచ్చునని బహిరంగంగా అంగీకరించి చాటినట్లేకదా! బాలసరస్వతి వ్రాసిన వాక్యాలనుబట్టి ఆతని కాలంలో పండితకవులందరూ గ్రాంథిక మని పేరు పెట్టుకొన్న భాషలో సైతం "యెవడు - యేమి" మొదలైన "యె" కారాది వ్యవహారపదాలనుమాత్రమే ఉపయోగించేవారని ఆ పదాలు అజాదులుగా వ్యవహరించేవారు కాదేమో అనికూడా మనం తేలికగా నిర్ణయించుకోనవచ్చు.

ఇంతేకూ ఈపరిశీలనవల్ల ఈనాడు వ్యావహారిక భాషలో "యితడు, యీతడు, యెవడు, యేమి" అని యకారాదులుగా వ్యవహరించుచున్నట్లు ప్రాచీన కాలంనుంచీ (శ్రీ నర్యుఖలవారి మతంలో ఆంధ్రశబ్దచింతామణికర్త నన్నయభట్టు కాబట్టి ఆ కాలంనుంచీ) గ్రాంథికంలో సైతం వ్యవహారం వున్నదని స్పష్టమవుతున్నది.

ఎ, ఏ లు ఆదినిగల పదాలకు "య" కారం చేరడమే కాక అదిచేరిన తరువాత వ్యవహారంలో ఆ "యె, యే" లు మరికొంత పరిణామంకూడా చెందాయి. యెక్కడ, యేమి, మొదలైనవాటిల్లోవున్న యె, యే లు య, యాలుగా మార్పు పొందాయి. వాస్తవానికి యీ మార్పు అసహజంకాదు.

"య"కార వ్యంజనం తాలుస్థానికం. "ఎ,ఏ"లు కంఠతాలుస్థానికాలు -అనగా- "ఎ,ఏ"లు కంఠంలోనుంచి తాలువులలోనుంచి పుట్టాయన్నమాట. "అ" కారం కంఠంలోనుంచి పుట్టినదే కావడంచేత "అ"కారానికి "ఎ, ఏ"లకు స్థానసామ్యం వున్నది. కాబట్టే యెవరు, యేమి యిత్యాదులలో "యె, యే" లలోని కంఠజాలైన "ఎ, ఏ" లకు మారుగా అదేస్థానంలో పుట్టిన "అ, ఆ"లు రావడం సమంజసమే అవుతుంది. కాబట్టే కొందరు వుచ్చారణ కనుగుణంగా "యెక్కడ, యేమి," అని "యె, యే" లను వ్రాస్తుంటే మరికొందరు "యక్కడ, యామి" అని య, యాలను వ్రాస్తుంటారు. "యక్కడ" అన్నప్పుడు హ్రస్వ అకారంతో కూడిన "య" కారానికి ప్రాచీనకాలంనుంచీ బహుళ వ్యవహారం వున్నదిగాని శబ్దాదిలో "యామి" అన్నప్పుడు దీర్ఘ "ఆ" కారంతో కూడిన "యా" కారానికి వ్యవహారం అనుమానమాత్రమేవున్నది. కాని "యే" కార దీర్ఘం "యా"కారంగా వ్యవహరింపబడడమున్నది పదమధ్యంలో మాత్రం ప్రాచీనకాలం నుంచీ బహుళంగానే వున్నది.* 'యెవరు, యేమి" ఇత్యాదులలో వున్న "యె, యే"లలోని స్వరం వ్యవహారంలో (ఉచ్చారణలో) సరియైన నిలకడలేనిదవడంచేత అది అ, ఆలకు సన్నిహితమై చివరికి ఆ "అ, ఆ" లు కూడా నిలిచే స్థితికి ఆస్కారమిచ్చింది. ప్రాచీనకాలంలో వ్యవహారవశానవచ్చిన "యెవరు" మున్నగు పదాలను "యవరు" మున్నగు పదాలుగా కవులు పండితులు సైతం వ్రాస్తూవుండేవారు - ఆ కారణంచేతనే-

* "యే" కారం "యా" కారంగా మారడాన్ని గురించి ముందు సప్రమాణంగా వివరింపబడుతుంది.

"ఎట్టిస, ఎంబస, ఎఱుగుడి, ఎండ, ఎవత" మొదలైనపదాలు "యెట్టిస, యెంబస, యెఱుగుడి, యెండ, యెవత"లుగా మారడమేకాకుండా "యట్టిస, యంబస, యఱుగుడి, యండ, యవత"లుగా కూడా మారి యతిస్థానాల్లో ప్రయోగింపబడ్డాయి.

గీ॥ యెట్టి నామాత్యు ననుజన్ముఁ డహీపభూష
ణాంఘ్రి.................. (శృం-శా-1 ఆ.)

క॥ ....శివలో
కావాప్తిం బడ సంగాడె యంబన నావేన్॥
(శివ. త. సా. 425 ప.)

క॥ అబ్బురపు బాలపదముల
జొబ్బిల్లెడి రసముఁ గ్రోల జోకవహింపన్
నిబ్బరపుఁ గవిత లబ్బుట
యబ్బురమా యెఱుకగన్న యఱుగుడికన్నా.
(కన్నశతకము. 1 ప.)

ఆ॥ వె॥ యండమావు లుదకమైనట్లు తాజీవు (పరశురామశతకము. 94 ప.)

గీ॥ యవతయేనియు వెన్నుని యౌవనాఢ్య...
(అహోబలుని కాళిం. ప. 2 ఆ. 115 ప.)

ఇదేవిధంగా "ఎవడు" మొదలైన పదాలను "యెవడు" మొదలైనవిధంగానే కాకుండా "యవడు" మొదలైనవిగాకూడా ప్రాచీన పండితకవులు వ్రాస్తూండబట్టే ఆంధ్రశబ్దచింతామణి కర్త "అద్యాః క్రియాసు భూతార్థద్యోతిన మాద్యగం వినాసర్వాః" అనే సూత్రాన్ని సృష్టించాడు. "యెవడు, యెక్కడ, పోయెను, కొనియెను" ఇత్యాదుల్లో "యె" కారాంతే వ్రాయాలిగాని, "యవడు, యక్కడ, పోయను, కొనియను"అని "య"కారాలు

వ్రాయకూడదని యీసూత్ర కర్త అభిప్రాయం—ఈ అభిప్రాయాన్ని యీ సూత్రంలో సూటిగా ప్రవచించలేక పోయాడు—"భూతార్థ క్రియల్లోను, నామాదిల్లోను, ఉండే ఆద్యంతస్థ (య్) మీద "అ" కారం వుండదు" దని ఆసూత్రానికర్థం – భూతార్థ క్రియల్లో–అంటే–కొనియెను ఇత్యాదుల్లో "య్" కారంమీద "అ" కారంవుండదని చెప్పాడు కాబట్టి అసలు సహజంగావుండే "ఎ" కారమేవుంటుందనివూహించుకోవాలి–అదేవిధంగా నామాదుల్లో కూడా "య్" కారంమీద 'అ' కారం వుండదన్నాడు – "అ" కారం ఉండదన్నాడుగదా అని ఇకారం ఈకారం ఏదో ఒకటి వుంటుందనడానికి వీలు లేదు–యితడు – యీతడు ఇత్యాదుల్లో "య్" మీద "ఇ, ఈ"లు ఉంటాయనేది నిస్సందేహం–అయితే "అ" కారం వుండదు అని సూత్రకారుడు చెప్పవలసిన అవసరమేమిటి? ఈ ప్రశ్నకు సమాధానాన్నే మన వూహకు సూత్రకర్త విడిచిపుచ్చాడు – ఎవడు మున్నగు పదాల్లోని "ఎ" కారాన్ని ఉచ్చారణలోనే "యెవడు, యవడు" అని "యె" కార "య" కారాలుగా రెండు విధాలుగానూ పండితకవులు వ్రాస్తూండేవారు. ఈ రెండింటిలో "యె" కారం వ్రాయడం సమ్మతమా? "య" కారం వ్రాయడం సమ్మతమా? ఏది వ్రాయాలి? అనే ప్రశ్న (సందేహం) కలిగినప్పుడు నామాదిలో "య్" కారంమీద "అ" కారం వుండనేరదనీ "ఎ" కారమే వుంటుందనీ చెప్పుకోవాలి–ఈ విషయమంతా మనం పైసూత్రంలోని "భూతా" శబ్దంచేతనే వూహించుకోవాలి–"కొనియెను" వ్రాయాలా? "కొనియను" వ్రాయాలా? అని సందేహం వచ్చినప్పుడు "య్" కారంలో "అ" కారం వుండదని సూత్రకారుడు

న్నాడు కాబట్టి "ఎ" కారం వుంటుందని మన మనుకొంటాము. ఇదేవిధంగా నామాదిలోకూడా "య్" కారంమీద "అ" కారం వుండదన్నాడు కాబట్టి ఈ నామాది విషయంకూడా సందేహం కలిగి సష్టంచేసని మనం అనుకోవాలి. లేకపోతే ప్రయోజనసంపుం పదు–యెవడు ప్రాయోగాలా? యువడు ప్రాయోగాలా? అన్నప్పుడు "య్" కారంమీద "అ" కారంవుండదన్నాడు కాబట్టి "ఎ" కారం వుంటుందనుకుని యెవడు అనేది ప్రాయోగాలి అని మనం భావించుకోవాలి – ఇంతభావాన్ని "అద్యః క్రియా" స్వేత్యాది సూత్రంలో తత్కర్త నెల్లడించ లేక పోయాడు. ఇంతభావమూ అతనికి లోపల ఉన్నది కాని ఆలోపల ఉన్న భావాన్నంతా బైట పెట్టలేక పోయాడు.† ఇంతకూ "అద్యః క్రియాసుభూతార్థద్యోతిస మాద్యగం వినాసర్వః" అనే సూత్రంవల్ల ఆంధ్రశబ్ద చింతామణి సృష్టింపబడిన కాలంలో "యెవడు, యెక్కడ" – "యువడు, యక్కడ" మొదలైన రెండు విధాల రూపాలూ పండిత కవులు ప్రాస్తావుండేవారనడం సుస్పష్టం. ఈ పదాది అత్వవిశిష్టమైన యకారాన్ని దృష్టిలో పెట్టుకునే క్రీ. శ. 1550 ప్రాంతంలో ఉన్న ముద్దరాజు రామన

తే. గీ. తాయెతులు నుయ్యెలయుఁ బయ్యెదయును దక్కఁ
గలుగ దెత్వంబు మధ్య యకారమునకుఁ
గుదిని గ్రియఁ దక్క నెత్వంబు గదియ దాది
నత్వమందదు తెనుఁగున నబ్జనాథ!

(కవి సంజీవని-ప్ర.తరం-117 ప)

† నిజంగా ఈ సూత్రకర్త నన్నయభట్టే అయివుంటే దీన్ని ఇంత అస్పష్టంగా రచించుతాడనడం హాస్యాస్పదం.

అనే ఈ పద్యంలో యకారంపైన "ఆది సత్వ మందదు తెనుఁగున సజ్జనాభ!" అని చెప్పినాడు. రామన కాలంలో పండితులుకూడా "యవడు" "యక్కడ" ఇత్యాదిగా "అ" కారయుక్తమైన "య" కారాన్ని వ్రాస్తూ ఉండేవారు. కాబట్టి రామన పదాదిలో ఉండే "య" కారం మీద అత్వము ఉండదని స్పష్టపరిచాడు. ఇంతకు చివరకు 1550 ప్రాంతంలోకూడా "యెవడు" ఇత్యాదుల్లో పదాది "య" కారాన్ని వ్యవహరించేవారనడం నగ్న సత్యం.

నేటికీ వ్యవహారంలో "ఎ" కారం ఆదిలోవున్న పదాలు నిత్య వ్యవహారంలో "యె" కారాదులుగా మారి పోవడంతో పాటు "య" కారాదులుగాకూడా మారిపోయి స్థిరపడి పోయాయి. "ఎఱ్ఱపల్లి-యెఱ్ఱపల్లి-యఱ్ఱపల్లి" "ఎలవర్తి-యెలవర్తి-యలవర్తి" మొదలైనవి అనేకాలు వ్యవహారంలో ఉన్నాయి.

ఈ "యె" కారం "య" కారంగా మారడం కేవలం నామాదిలోనే కాదు. పదమధ్యంలోనైనా, క్రియలోనైనా, ఎక్కడైనా మారుతుంది. "యెవడు-యెక్కడ" మొదలైన పదాలను "యవడు-యక్కడ" మొదలైన పదాలుగా వ్రాసినట్టే "కొనియెను-తినియెను-పోయెను" మొదలైన క్రియలను కూడా "కొనియను-తినియను-పోయను" మొదలైనవిగా వ్రాస్తూ ఉండేవారు. ఆకారణంచేతనే వేంకటనాథకవి

శా॥ అయ్యో వ్యా నీసుతు గ్రద్ధ తన్నుకొని పో
యన్ భీతివాపోవఁ గన్

(పంచతంత్రం-2వ ఆ.)

మ॥ అని శాపావధిచెప్పి ముద్గలుఁడు పో
యన్.........[పంచతంత్రం-4. ఆ.]

అని "పోయెన్" అనడానికి "పోయన్" అనేపదాన్ని యతిస్థానంలో ప్రయోగించాడు.

ఈ విధంగా పండిత కవులుకూడా "కొనియను-పోయను" మొదలైన రూపాల్లో "య" కారాన్ని వాడడంచూడబట్టే ఆంధ్ర శబ్దచింతామణి కర్త "అద్యః క్రియాః" స్విత్యాది సూత్రాన్ని సృష్టించి భూతార్థ క్రియల్లో "య్" కారంమీద "అ" కారం లేదని తెగవేసి చెప్పాడు. * "చనియను-కొనియను" అని "య" కారాలు వ్రాయకూడదు-"చనియెను-కొనియెను" అని "యె" కారాలే వ్రాయాలి.-అని యెన్నిసార్లు చదువుకున్నా, యెన్ని సూత్రాలు వ్రాసుకున్నా, ఉచ్చారణవశాత్తు, అలవాటు కొద్ది ప్రాచీన కాలంలో చాలామంది పండితులు తప్పు రూపా

---

* "అద్యః క్రియాసు భూతార్థద్యోతిన మాద్యగం వినా సర్వః" అనే ఈ చింతామణి సూత్రాన్ని కొన్ని ప్రయోజనాలనపేక్షించి అప్పకవి "అద్యః క్రియాసుభూతాద్యర్థ సముద్యోతినం వినాసర్వః" అని సవరించాడు-నామాని "య" కారాన్ని అప్పకవి అంగీకరించని కారణంచేత "ఆద్యగం" అనేపదాన్ని తొలగించినాడు- "ఎవడు-ఎక్కడ"-అజాములుగానే వ్రాయాలని అతడు నిశ్చయంగా అభిప్రాయపడడంచేత "యెవడు" అని వ్రాయాలా? "యవడు" అని వ్రాయాలా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పవలసిన అగత్యం అతనికి కలుగలేదు-"పోయెను" వ్రాయాలా "పోయను" వ్రాయాలా? అనే ఈ "యె" కార "య" కారాల సందేహం కేవలం భూతార్థ క్రియల్లోనే కాకుండా, "పోయెద" వ్రాయాలా? "పోయద" వ్రాయాలా? అనేసందేహం ఈ తద్ధర్మ క్రియల్లో సైతం కలిగే అవకాశంవున్నది కాబట్టే "భూతార్థ" అనేదాన్ని "భూతాద్యర్థ" అని సవరించాడు-ఆదిశబ్దంచేత "పోయెద" వంటి తద్ధర్మక్రియలు

పరిగ్రహించాడు. అప్పకవి విడిచిపుచ్చిన "భూతార్థద్యోతిన" మనేపాఠంవల్ల తద్ధర్మ క్రియలు గ్రహింపబడవు-అహోబలుడుకూడా అప్పకవివలెనే నామాది "య" కారాన్ని అంగీకరింపకపోవడం చేతను, పోయెను మొదలైన భూతార్థ క్రియల్లోవచ్చే సందేహం పోయెద మొదలైన తద్ధర్మక్రియల్లో సైతం రావచ్చునని అభిప్రాయం కలవాడవడంచేతను, అప్పకవి సవరించిన సూత్రాన్నే సాధువుగా యెంచినాడు-"అప్పకవి పుస్తక పాఠఏవ సాధురితి ప్రతిభాతి" (అహో-పం-139 పుట. 1926ముద్ర) అని వ్రాసినాడు-వాస్తవమిట్లావుండగా శ్రీ వఝ్ఝల చిన సీతారామస్వామి శాస్త్రిగారు కేవలం అప్పకవి యిచ్చిన పాఠమే దోషపూరితమనీ ఈ విషయంలో అహోబలుడు సైతం పొరపడ్డాడనీ వ్రాయడం (చిం-వి. పరిశోధనము-188-189 పుటలు) సమంజసంగా లేదు-" అద్యః క్రియాసుభూతార్థ.........మాద్యగం వినాసర్వః " అనేదాంట్లో "పోయెద" మొదలైన తద్ధర్మ క్రియల్లో " యె " కారం వ్రాయాలో " య " కారం వ్రాయాలో చెప్పబడలేదు-"అద్యః క్రియాసుభూతాద్యర్థ సముద్యోతిన" మిత్యాది సూత్రంలో " యవడు " ఇత్యాదుల్లో "యె" కారం వ్రాయాలో "య" కారం వ్రాయాలో చెప్పబడలేదు. అప్పకవి పదాది యకారాన్ని అంగీకరించలేదు కాబట్టి దాని విషయం విడిచిపుచ్చాడు-అందులో అతని దోషంలేదు-అది సకారణంగా విసర్జింపబడ్డ విషయం-"అద్యః క్రియాసుభూతార్థ.........మాద్యగం వినాసర్వః" అనే సూత్రంలో "పోయెద" ఇత్యాది తద్ధర్మ క్రియలు ప్రమాదవశాన విసర్జింపబడ్డాయి - ఇందులో తద్ధర్మక్రియలు గ్రహింపబడకపోవడం దోషంగాను లోపంగాను పరిగణింపబడుతుంది—

అప్పకవితోపాటు పదాదిలో "య" కారహల్లులేదన్న అహోబలుడు అతిప్రసంగంచేసి యీ క్రింది వాక్యాలు పొరపాటుగా వ్రాశాడు—

—"వాఁడెవ్వఁడు ఇత్యాదౌ సర్వత్రాజంశేన సంధి శ్రవణాత్-సీ-ఎవ్వని వాకిట నిభమదపంకంబు ఇత్యాదౌ ఎకారం ప్రత్యేవ ఇకారవశేః ప్రయుక్తత్వాత్ ప్రయోజనాభావాచ్చ ఆద్యగ యకారస్య ప్రాణ్యంశో అనుపపన్న ఇతి తత్త్వాగో వక్తవ్యః"-(అహో-పం-186 పు. 1926 ము.)

లని అనుకుంటూనే "చనియను-కొనియను" అని "య" కారం కల రూపాలే వ్రాస్తూండేవారు.

బహుళాంధ్ర సంస్కృత వ్యాకరణవేత్తయై విమర్శకుడై "నేనే నన్నయభట్టును - తిరిగి జన్మించా" నని గొప్పలు చెప్పు కున్న అహోబల పండితుడుకూడా వ్యావహారికంగావున్న అల వాటు కొద్దీ "చనియను-వినియను-కనియను" అని "య" కారాలే వ్రాస్తూండేవాడు.

—"చనెన్,వినెన్,కనెన్, ఇత్యాది క్రియా ప్రయోగోపి ప్రబంధేషు వర్తతే - తత్ర: శ్లో॥ "ఏదంతతాచ నామ్నామస్యాత రస్యా మియాంతానా" మితిసూత్రం నప్రవర్తతే-నామ్నామితి నామమాత్రస్యైవ గ్రహణాత్ -" (అహో-పం-135 పుట.)

చనియెన్ - వినియెన్ - కనియెన్ మొదలైన రూపాలకు "ఏదంతతాచ" ఇత్యాదిసూత్రం వర్తించి-చనెన్-వినెన్-కనెన్ మొదలైన రూపాలు సిద్ధింపనేరవని అహోబలుడంటున్నాడు. దానికి కారణం "ఏదంతతాచ" ఇత్యాది సూత్రం నామాలకు

"ఎవ్వని వాకిట నిభమదపంకంబు" అన్నప్పుడు "ఎవ్వని" లోని "ఎ" అనేదానికే "ఇభమదం" లోని "ఇ" అనేదాన్ని యతిగా వేయడంవల్ల "ఎవ్వని" అనేపదానికి ఆదిలో యకారహల్లులేదని అహోబలుడు సమాధాన మిచ్చాడు-ఇది సమంజసం కానేరదు-"యవ్వని" అని పదాది "య" కారం వ్రాసి నప్పటికీ "ఇభ" లోని "ఇ" కారానికి యతిచెల్లనే చెల్లుతుంది. కేవలం "ఎ" కారాన్నే ఉద్దేశించి "ఇ" కారవళి వేశాడనడం పొరపాటు-"యె" కారాన్ని ఉద్దేశించి "ఇ" కారవళి వేసినా వేయవచ్చు-పదాది "య" కార విసర్జనకు అహోబలుడు చెప్పిన వళి విషయం ఒక కారణంగా యిప్పటికీ భాసించదు—

మాత్రమే వర్తిస్తుందనియట-చనియెన్ మొదలైన రూపాల విష
యంలో "ఏదంతతాచ" ఇత్యాది సూత్రం అసలు వర్తింపదు.
ఆసూత్రంలో "ఇయ" అంతమందున్న వాటికి మాత్రమే "ఎ"
త్వం విధింపబడుతోంది. అంటే-ఆసూత్రం "కన్నియ" మున్నగు
రూపాలను "కన్నె" మొదలైనరూపాలుగా చేస్తుందన్న మాట-
"ఏదంతతాచ" ఇత్యాది సూత్రంలో "ఇయ" అనేది అంత
మందున్న నామాలకే "ఎ"త్వం విధించబడుతున్నదికాని "ఇయె"
అనేది అంతమందున్న క్రియలకు "ఎ"త్వం విధింపబడడం లేదు
గదా!-చనియె ఇత్యాదులు "ఇయె" అంతమందు కలవిగాని
"ఇయ" అంతమందు గలవి యెప్పుడూ కావు- "ఏదంతతాచ"
ఇత్యాది సూత్రము ఇక్కడ వర్తించనే వర్తించదు. ఈ సంద
ర్భంలో అహోబలుని స్వవచన వ్యాఘాతం ఒకటి ఉన్నది.
"ఏదంతతాచ" ఇత్యాది సూత్రం నామాలకే వర్తిస్తుందిగాని,
క్రియలకు వర్తించదని "అద్యః క్రియా" స్విత్యాది సూత్ర
వాఖ్యలో (151 వ పుటలో) వ్రాసినాడేగాని అహోబలుడు
మరల తానే "ఏదాంతతాచ" ఇత్యాది సూత్రానికి వ్యాఖ్యా
నం వ్రాస్తూ (321 వ పుటలో) "క్రియాస్వపి కదియుంబడె,
కదెంబడె ఇత్యాది రూపం" అని స్పష్టంగా ఆ సూత్రం క్రియ
లకుకూడా వర్తిస్తుందని చెప్పినాడు. "కదియున" అన్నప్పుడు
"ఇయ" ఉన్నది నిజమే. "ఏదంతతాచ" ఇత్యాది సూత్రం నామా
లకు మాత్రమే వర్తిస్తుంది కాబట్టి "కదియున" అనేది నుజ్యాంత
మైన క్రియారూపం అవడంచేత ఇది "కదెన" అనే రూపం
కాదని నిరసించడానికి మాయ ఒకపంక "కదెన" అనే రూపాన్ని
అంగీకరిస్తూ "చనియె" ఇత్యాదులు క్రియ లవడంచేత "ఏదంత

తాంచ" ఇత్యాది సూత్రం వాటికి వర్తించ దనడం కేవలం పొర పాటు. "ఏదంతితాంచ" ఇత్యాది సూత్రం క్రియలకుకూడా వర్తి స్తుందని అహోబలుడు 321 వ పుటలో తిత్సూత్ర వ్యాఖ్యలో వ్రాసి "కదియుంబడు", "కదెంబడు" అని ద్వివిధరూపాలను ఉదా హరించాడేగాని వాస్తవానికి "కదెంబడు" అనే రూపం కానేరదు. ఇది అసలు "కదియు" ధాతువు. దీనికి నుజ్యంత రూపం "కది యున్" అని అవుతుంది. ఇటువంటి నుజ్యంత రూపాలన్నీ క్రియాంతాలుగా లెక్కకు వచ్చేటట్లయితే — "చదియు, చది యున్, చదెన్" — "కనియు, కనియున్, కనెన్ — "తినియు, తినియున్, తనెన్" అని "చదెన్, కనెన్, తినెన్" మొదలుగా గల అనిష్ట రూపాలు సిద్ధించవలసి వస్తుంది. అసలు ఈ "ఏదం తితాంచ" ఇత్యాదిసూత్రం క్రియలలో వర్తించనేరదనడమే లెస్స. సమంజసంకూడా. ఈ సందర్భంలో శ్రీ వఝ్ఝల వారు "ఆం. వ్యా. సం. సర్వస్వం-783 వ పుటలో

"క్రియాస్వపి-కదియంబడె-కదెంబడె ఇత్యాది రూపమ్. (అహోబల-348 పు.) ఇది సరియేకాని ప్రయోగములు లభిం పమింజేసి కావలయు శబ్దరత్నాకరమునందును సూ-రా-నిఘం టువునందును "కదెంబడు" అను ధాతు వుదాహరింపఁబడ లేదు. క॥ పట్టు లెంచికదియఁబడి యే। ర్పాటు వ్రేసినమోముదాఁక తిరిగె గరుడి......(నిర్వ-౬ ఆ. ౨౭ ప. శ. ర. సూ. రా. ని.) అను ప్రయోగముతోఁ గోశద్వయమునందును "కదియంబడు" ధాతువు మాత్రమే చూపంబడెను".—

అని వ్రాసినారు. ఇందు శ్రీ వఝ్ఝల వారుకూడా "కదెం

బడు" అను రూపం సాధువన్నట్లే తమ భావాన్ని వెలువరించారు. ఆరూపం ఇవ్వనందుకు శబ్దరత్నాకరం, సూర్యరాయాంధ్ర నిఘంటు కర్తలను విమర్శించినారే గాని ఆ రూపముగూడా ప్రయోగాగతం ఇవ్వలేకపోయారు. వాస్తవానికి "కదెన్" మొదలైన రూపాలు సాధువులైతే గదా! ఏ మహాకవి కావ్యంలో ఎక్కడైనా ఒక ప్రయోగాగతం ఉన్నప్పటికీ అది కవి ప్రయుక్తమని గ్రహించవలసిందేగాని సాధు వనడానికి శాస్త్రీయం అవకాశం లేదు. *

---

* ఆంధ్రశబ్ద చింతామణికి మొట్టమొదట సంస్కృతంలో వృత్తి వ్రాసిన మహాపండిత వాసుదేవ కవి "ఏదంతతాచ నామ్నా మన్యతరస్యామిగాంతానాం" అనే సూత్రానికి వ్యాఖ్యానం వ్రాస్తూ "చకారా త్పదమధ్యేపి పరియాచకం, పరేచకం క్వచిత్ స్యాత్ ప్రాగయో లోపః" ముత్యము-కన్య-పరియాచకం." (వాసుదేవ వృత్తి - నావద్ద ఉన్న తాళపత్ర ప్రతి- 16 వ పత్రం-2 వ వైపు.)

దీనిని చూచిన అహోబలపండితుడు కూడా "చకారబలేన శబ్దమధ్యేప్యయాగ సిద్ధిః పరియాచకం, పరేచకం, పర్యాచకం ఇతి తేన - వర్ణుం బర్యాచక మేలచే సకు శుభార్థముచే కనుంగొంపనే చెలీ - ఇత్యాది ప్రయోగస్సాధుః." (అహో. 321 పుట) అని వ్రాసినాడు. ఈ వాసుదేవ, అహోబలు లిద్దరుకూడా పై వ్రాతలు ప్రమాద సహితంగానే వ్రాశారు. "ఏదంతతాచ" ఇత్యాది సూత్రం లోని చకారబలంచేత పదమధ్యంలో ఉండే "ఇయ" కు సైతం "ఎ" త్వాన్ని చెప్పి "పల్లియలు-పల్లెలు" వంటి రూపాలు సాధించుకోనవచ్చు. కాని "ఇగా" అనేది మధ్యలో ఉన్న "పరియాచకము" అనే పదంలో "ఎ" త్వం సాధింపడం సంభవించ నేరదు. "ఏదంతతాచ" ఇత్యాది సూత్రం "ఇయ" అంతమందున్న వాటికి హ్రస్వ "ఎ" కారాన్ని చకారబలంచేత పదమధ్యంలో ఉండే "ఇయ" కు హ్రస్వ "ఎ" కారాన్ని సాధించుతున్నది. కాని "ఇగా" అనే దానికి దీర్ఘమైన "ఏ" కారాన్ని విధించడం లేదు. "ఇయ" కు విధించబడేది హ్రస్వ "ఎ" కారమే గనుక వాస్తవానికి "ఏదంతతాచ నామ్నా మన్యత

రస్యామియాంతానామ్" అని సూత్రాన్ని వ్రాయవలసి ఉండగా "ఎదంత" అని హ్రస్వ "ఎ" కారం కలిగిన రూపం సంస్కృతంలో ఉండని కారణంచేత (సంస్కృతంలో హ్రస్వ ఎకారం లేదు.) ఈ చింతామణి సూత్రాలు సంస్కృత భాషలో రచింపబడిన కారణంచేత పై సూత్రంలో అటువంటి "ఎదంత" అనే హ్రస్వ "ఎ" కార రూపం ప్రయోగింపబడక "ఏదంత" అని ప్రయోగింపబడింది. అగత్యంగా పెట్టవలసి వచ్చిన ఈపై సూత్రంలోని దీర్ఘ "ఏ" కారాన్ని చూచి, "ఇయాంతాః" అనే దానిని "ఇయ + అంతాః" అని విభజించుకోవడానికి మారు "ఇయా + అంతాః" అని విభజించుకొని పరియాచకంలోని "ఇయా" అనే దానికి "ఏదంత" లోని దీర్ఘ "ఏ" కారాన్నే గ్రహించి దానిని విధించడంచేత "పరేచకము" అనేరూపం ఏర్పడుతుందని వాసుదేవుడు భావించాడు. ఈ వాసుదేవుడు వ్రాసిన వ్రాతను చూచిన అహోబలుడుకూడా అతని వాక్యాలను అనుసరించి వ్యాఖ్యానించాడనడం స్పష్టం. పరియాచక రూపంలో ఉన్న "రి" కార గతమైన "ఇ" కారానికి "అన్యేషాంచ ప్రయోగమహితానాం" అనే చింతామణి సూత్రంవల్లా, "లాఁతి యచ్చునకు సహిత మొకానొకచో నుడినడుమ లోపంబుగానంబడియెడి" (బాల. ప్రకీ. 18 సూ.) అనే బాల-వ్యాకరణ సూత్రంవల్లా "ఇ" త్వలోపాన్ని సంపాదించి పర్యాచకం అనే రూపాన్ని సైతం సాధింపవచ్చును. అటువంటి ప్రయోగాలున్నప్పటికీ సాధువులే ఔతాయి. కాని పరేచకము అనేరూపం గ్రాంథిక భాషలో దానికున్న వ్యాకరణాలచేత సాధ్యం కానేరదు. "పరేచకము" అని ప్రయోగంగల ఏకవి పద్యాన్నీ అహోబలుడు కూడా ఉదాహరించలేదు. "ఏదంతతాచ" అనే సూత్రంలోని "ఏదంత" అనే దానిచే హ్రస్వ "ఎ" కారమే గ్రహింపవలసి ఉన్నది కాబట్టి "ఇయాంతాః" అనేటప్పుడు "ఇయ + అంతాః" అనే పదవిభాగమే చేసుకోవలసి ఉన్నది కాబట్టి వాసుదేవాదులు భావించిన విధంగా "ఏదంతతాచ" ఇత్యాది సూత్రంచేత "పరేచకము" అనే రూపం సిద్ధింపనేరదు. జన వ్యవహారంలో "పరేచకము" లోని రేకారం అకార, ఏకార స్వరాలకు రెంటికీ సంబంధించిందిగా (తాటాకులోని టావలె) ఉచ్చరింపబడుతుంది. ఇట్టి ఉచ్చారణకల ఈ పదాన్ని "పరేచకము" అనికూడా (తాకేటు అని కొందరు వ్రాయు విధంగా) వ్యావహారిక భాషలో వ్రాస్తూ ఉంటారు. ఈ "పరేచకము" అనే

ఇంతకు "ఏదంతతాచ" ఇత్యాది సూత్రం "చనియెన్, కనియెన్" మొదలైన రూపాల విషయంలో వర్తించదని గదా ఈ చర్చవల్ల తేలుతున్నది. అహోబలుడు "చనియెన్, కనియెన్" మొదలైన రూపాలను ఉచ్చారణ కనుగుణంగా వ్యవహారవశాన కలిగిన అలవాటునుబట్టి ఇతర కవి పండితులవలెనే "చనియన్, కనియన్" మొదలైన రూపాలుగా వ్రాసుకొని అవి

రూపం ఏకావ్యంలో ప్రయుక్తమైందో నాకు కనపడలేదు. వాసుదేవాగలు గ్రాంథిక భాషకు వ్రాయబడ్డ వ్యాకరణ సూత్రాలను ప్రవర్తింపజేసి వ్యావహారిక భాషా రూపమైన "పరేచకాన్ని" సాధించడానికి పూనుకోనడం హాస్యాస్పదంగా ఉంది. దీన్ని సాధింప ప్రయత్నించిన వాసుదేవాదులు వ్యావహారిక భాషారూపాన్ని పరిగ్రహించారనే విషయం స్పష్టం. ఈవ్యాఖ్యాకర్త లిద్దరి కాలంలోను గ్రాంథిక భాషలో వ్యావహారిక రూపమైన "పరేచకా"నికి బహుళ ప్రచారమున్నదని మనం భావించడం దోషంకాదు. "పర్యాచకం" మొదలైన రూపాల విషయంలో గ్రాంథిక భాషావాదుల్లో ప్రముఖులైన శ్రీ వఝ్ఝల వారు.

"చకారబలేన (ఏదంతతాచ అనునోట్టిది) శబ్ద మధ్యే ప్యయంవిధిః పరియాచకము-పరేచకము-పర్యాచకము ఇతి తేన-నన్నుం బర్యాచకమేల చేసెదు సుహర్ద్రముచే గరుణింపవే చెలి! ఇత్యాది ప్రయోగస్స్వమః (అహో. 348 పు.) "పర్యాచకము-పరేచకము" అను శబ్దములు శబ్దరత్నాకరమున సంగ్రహింపఁబడలేదు. అహోబలపతి యిచ్చిన ప్రయోగ మెక్కడిదో తెలియదు. "పరియాచక" శబ్ద మధ్యమున "ఇయా" అని యున్నదిగాని 'ఇయ' లేదు."— (ఆం. వ్యా. సం. సర్వ. మొ. సం. 783 పు.) అని మాత్రమే వ్రాసి మిన్నకుండడం సమంజసంగా లేదు. దీన్నిబట్టి "పరేచకము" అనేది గ్రాంథిక భాషకున్న వ్యాకరణాల ప్రకారం తప్పు ప్రయోగమని ఉక్తుండే గ్రాంథిక వాదులైన వఝ్ఝల వారే గమనింప నప్పుడు ఉచ్చారణ కనుగుణంగా ఇష్టం వచ్చినట్లు వ్రాతలు వ్రాసి వ్యావహారిక రూపాలు వాడే పూర్వ పండితుల సంగ తేమనాలి?

ఇయాంతాలుగా కనబడుతున్నవి కాబట్టి అవి వాస్తవానికి "ఇయె" అంతమందుగల క్రియలనే విషయం మరచిపోయి "ఏదంతతాచ" ఇత్యాది సూత్రం ఇక్కడ ఎందుకు వర్తించదా అని శంకతీసికొని, ఆసూత్రం నామవాచకాలకు మాత్రమే వర్తి స్తుంది కాబట్టి ఇవి నామవాచకాలుకాక క్రియ లవడంచేత వీటికి వర్తిం చదని చెప్పినాడు. ఈ సందర్భంలోనే అహోబలుడు అధర్వణ కారికల ననుసరించి "కనెన్, వినెన్" అనే రూపాలు సాధిస్తూ

"ఇయాంతా స్సాధవ శ్శబ్దాః క్వచి దేదంతతాపి వా" ఇతినా పత్వం"–(అహో: 135 పు.)

అని వ్రాసినాడు. ఈ అధర్వణకారిక "కన్నియ" మున్నగు శబ్దాలకు మాత్రమే వర్తిస్తుందిగాని "కనియె" ఇత్యాదులకు వర్తించ నేరదు. అహోబలుడు ఇయాంతాలకు వర్తించే ఈకారికను "కనియె" ఇత్యాదులకు వర్తింపచేయు డానికి కారణం ఆరూపాలను "కనియన్" అని "య" కారం గల రూపాలుగా వ్రాసికొనడమే.

అహోబలుడు "కనియెన్" ఇత్యాదులు క్రియలు కాబట్టి "ఏదంతతాచ" ఇత్యాది సూత్రం వాటికి వర్తించదన్న విషయం గురించి వాటిని వ్యవహారం ప్రకారం "కనియన్" ఇత్యాదు లుగా వ్రాసికొని ఇయాంతాలని భ్రమపడ్డ విషయం గురించి (శ్రీ) వఝ్ఝల వారు తమ సర్వస్వంలో ఎత్తనే లేదు. కాని అహో బలుడు అధర్వణ కారికల ప్రకారం "కనెన్" ఇత్యాది రూపా లను "ఇయాంతా స్సాధవ శ్శబ్దాః క్వచి దేదంతతాపివా" అను కారికకు వర్తింపచెయ్యడం గురించి (శ్రీ) వఝ్ఝలవారు సర్వస్వం 783వ పుటలో.

– "చనియెన్" ఇత్యాదులలోనిది "ఇయ" కాదు. "ఇయె" అనుదానికి ఎత్వము నెవ్వరును విధింపలేదు" – అని మాత్రం వ్రాసినారు. ఏసష్టాన్ని నివారించడంకోసమై "అద్యాః క్రియాసు భూతార్థద్యోతిస మాద్యగం వినాసర్వాః" అన్న సూత్రం ఆంధ్ర శబ్ద చింతామణిలో సృష్టించబడిందో ఆసూత్రానికే వ్యాఖ్య వ్రాస్తూ ఆ వ్యాఖ్యలోనే ఆ సూత్ర ప్రయోజనాన్ని గుర్తించకుండా, వినియోగ పరచుకోకుండా, ఆసష్టాన్నే అహోబలుడు పొందడం విచిత్రంగా ఉన్నది. "కనియెన్" ఇత్యాదులలోనిది "యె" కారమేకాని "య" కారంకాదని "అద్యాఃక్రియాసు" ఇత్యాది సూత్రం స్పష్టపరుస్తున్నది కదా! ఈ విషయాన్నే అహోబలుడు గమనింపక "కనియన్" అని "య" కారమే ఉందనుకొని ఇయాంతాలని పొరపడినాడు. ఈ క్రియల విషయంలో అప్పకవి

సీ॥ యాకు భూతాది క్రియా ద్యోతితములఁ బూ
పట్టు నెత్వము తలకట్టుగాదు-

(అప్ప. 2 ఆ. 175 ప.)

అని చెప్పినాడు.

ఈ విధంగా ఉచ్చారణనుబట్టి వ్యవహారబలంచేత కావ్య భాష అనబడే గ్రాంథిక భాషలో సహితం "యె" కారం "య" కారంగామారిపోయింది. ఈమార్పువల్లనే "ఉయ్యెల" "ఉయ్యాల" గాను "పయ్యెద" "పయ్యాద" గానుమారిపోయాయి. ఈ "ఉయ్యాల, పయ్యాద" లను ప్రాచీన కవులు పెక్కుమంది ఉపయోగించడం వల్ల వీటిని వ్యాకర్తలు పరిగ్రహింపక తప్పలేదు. అందుకే చిన్నయసూరి "ఉయ్యెల" "ఉయ్యాల" అనే రూపాలను

ప్రత్యేకరూపాలుగా పేర్కొన్నప్పటికీ "పయ్యెద" విషయంలో "పయ్యెద, పయ్యద" (బాల. ప్రకీ. 5 సూ.) అని సూత్రించు కొనక తప్పలేదు. వాస్తవానికి "ఉయ్యేల" రూపమే వ్యవ హారవశాన "ఉయ్యల"గా మారింది. "ఊయెల" "ఊయల" ఐనది.

ముద్దరాజు రామన పదమధ్య "య" కారాలనుగురించి ఈ క్రింది పద్యం వ్రాసినాడు.

తే. గీ. తాయెతును నుయ్యేలయుఁ బయ్యెద యను నదక్కఁ
కలుగ దెత్వంబు మధ్య యకారమునకుఁ
దుదను గ్రియఁదక్క నెత్వంబు గదియ, దాది
నత్వమందదు తెనుఁగున నబ్జనాభ !

(కవి. త. 117 ప.)

ఈ పద్యాన్ని పురస్కరించుకొని అప్పకవి, కూచిమంచి తిమ్మకవి ఈ క్రింది పద్యాలు రచించినారు.

తే. గీ. ధరణి నుయ్యేల పయ్యెద తాయెతులను
గల య కారంబులకు వక్రములు నిజంబు
ముద్దరాజు రామన వాని మూఁటిని బద
మధ్య యాలని చెప్పె నిమ్మాట మిథ్య.

(అప్ప. 2 ఆ. 104 ప.)

తే. గీ. తాయెదయు నుయ్యేలయుఁ బయ్యెదయును నరఁగ
గలుగ దత్వంబు మధ్య యకారమునకు
ననుచు మును ముద్దరాజు రామన వచించెఁ
గాని యత్వంబు కృతులందుఁ గలదు శర్వ !

(సర్వ. సా. సం. 68 పు.)

ముద్దరాజు రామన వ్రాసిన పద్యం తారుమారై పోయింది. అప్పకవి ఒక విధంగాను, కూచిమంచి తిమ్మకవి మరొక విధంగాను రామన్నను విమర్శించారు. "ఉయ్యాల, పయ్యెద, తాయెతు" అనే రూపాల విషయం అప్పకవి ఎక్కడా ఎత్తలేదు. "ఉయ్యేల, పయ్యెద, తాయెతు" అనే వాటిలో ఉన్న మధ్య యకారం శాబ్దిక యకారమని రామన చెప్పడం పొరపాటనీ, అది ఆగమ యకారమనీ అప్పకవి చెప్పినాడు. ఒక విధంగా ఆలోచిస్తూంటే అసలు అప్పకవికి

> తే. గీ. "తాయతయు, నుయ్యాలయుఁ, బయ్యెదయును దక్కఁ
> గలుగ దత్వంబు మధ్య యకారములకుఁ
> దుదను గ్రియఁదక్క నెత్వంబు గదియ, దాని
> నత్వ మందదు తెనుఁగున నబ్జనాభ!"

అనే పద్యం లభించిందేమో! ఇటువంటి పద్యం లభించి ఉంటే ముద్దరాజు రామన "ఉయ్యాల, పయ్యెద, తాయెతు" అనే అత్వవిశిష్టమైన 'య' కారంగల రూపాలు పేర్కొన్నాడని భావించి, ఆ రూపాలను దోషపూరితాలుగా తలంచి "ఉయ్యేల, పయ్యెద, తాయెతు" అనే వక్రాలు గలిగిన రూపాలే నిర్దుష్టాలని, అత్వంతో కూడినవి దుష్టాలనీ ప్రవచింపదలచి "ధరణి నుయ్యేల, పయ్యెద, తాయెతులును" ఇత్యాది పద్యాన్ని అప్పకవి రచించాడేమో? ఆ మూడు శబ్దాలలోను "య్" కారం మీద అత్వంలేదని, వక్రమే ఉన్నదని చెప్పడానికే "వక్రములు నిజంబు" అనేదాన్ని ప్రయోగించాడేమో? ఈ అభిప్రాయం తోనే "ఉయ్యాల-పయ్యెద-తాయతు" అనేరూపాలను అప్పకవి అంగీకరించలేదేమో? ముద్దరాజు రామన అత్వ విశిష్ట యకారం

గల రూపాలు పేర్కొనకపోతే పదమధ్య యాలుకావని చెప్పిన అప్పకవి అత్వ విశిష్ట యకారంగల రూపాల విషయం అసలు ఎత్తకుండానే ఉంటాడా? తిమ్మకవి అత్వాయుతాలుగా చెప్పితే అవి దుష్ట రూపాలని భావించి వక్ర విశిష్టాలను మాత్రమే పేర్కొన్నాడేమో! "పదమధ్య యకారం" అన్నప్పుడు అలఘు యకారంగాకాక అత్వ విశిష్ట యకారంగా భావించాడేమో!

తే. గీ. ఊచు నెల కాకగుటనేత నుయ్యెలయ్యెఁ
బయిని యెదకునిక్క వక్రోక్తిఁ బయ్యెదయ్యెఁ
దల్లి కాపునకై కట్టఁ దగిన యత్తు
తేలఁ బల్కఁగ దాయతు దేశ్యమునను.

(అప్ప. 2 ఆ. 185 ప.)

అనే పద్యాన్ని "ప్రేలా శబ్దమునకుఁ దద్భవము పేల" ఇత్యాది వచనమును, ఉయ్యాలాదులు మూడూ ముఖ్యంగా వక్రయుతాలని నిరూపించడానికే రచించాడేమో!

కూచిమంచి తిమ్మకవి "తాయతు, ఉయ్యాల, పయ్యాద" అనే రూపాలు రామకవి అనిష్టాలుగా పేర్కొన్నట్లును, ఎత్వ విశిష్టమైన యకారం గల రూపాలే ఇష్టాలుగా పేర్కొన్నట్లును పద్యం రచించి "ఉయ్యాల, పయ్యాద" అనే వాటికి ప్రాచీన కవుల ప్రయోగాలు చూపించాడు. తిమ్మకవి ఇచ్చిన పాఠానికీ, అప్పకవి ఇచ్చిన పాఠానికీ సంబంధం లేదు. అప్పకవి అత్వ విశిష్టమైన యకారంగల రూపాలను పేర్కొనక పోవడం చేత రామన్న అత్వ విశిష్ట యకారంగల రూపాలనే పేర్కొన్నాడేమో! అప్పకవి వాటినే తప్పు రూపాలుగా చెప్పి "వక్ర

ములు నిజంబు" అని కేవల వక్రరూపాలనే పేర్కొన్నాడేమో! ఆవిధంగా కాకపోతే "ఉయ్యేల, పయ్యెద, తాయెతు" ల్లో ఉన్న వక్రాన్ని గురించి అంత దీర్ఘంగా చర్చించిన అప్పకవి "ఉయ్యాల, పయ్యద, (తాయతు అనే దానికి ప్రయోగం మృగ్యం. కాబట్టి విడిచిపెట్టవచ్చు) అను రూపాల విషయమై ఒక్క మాటైనా ఎందుకని చెప్పకుండా ఉంటాడు! ఈ అప్పకవి పాఠభేదం కానీ, చిన్నకవి పాఠభేదం కాని ఏదైనా ఈ "యె" కారం "య" కారంగాను, "య" కారం "యె" కారంగాను, ఇష్టంవచ్చినట్లు తారుమారు కావడంవల్లనే ఏర్పడింది. తామున్న పద్యంలో అసలు అత్వ విశిష్ట యకారంగల పదాలనే పేర్కొన్నట్లయితే ఈ నాడు ముద్రిత కవి (జన) సంజీవనిలో వక్ర విశిష్ట యకారానికి ఇచ్చిన కవి ప్రయోగాలు ప్రక్షిప్తాలనే భావించవలసి ఉంటుంది.

స్థాన ప్రయత్న సామ్యాలచేత "యె" కారం "య" కారంగా మార్పు పొందడం విపుల వ్యాప్తిని చెందిన తరువాత శాబ్దికమైన సహజమైన "య" కారం తిరిగి ఇదే స్థాన ప్రయత్న సామ్యాలచేత "యె" కారంగా మారడంకూడా జరిగింది. "చాయకు," "పాయకు", "లోయకు", "పయ్యన", "ఆయస" "దరియన్", "చేయన్" మున్నగు అత్వ విశిష్ట యకారాలు గల పదాలను "చాయెకు-పాయెకు-లోయెకు-పయ్యెన-ఆయెస-దరియెన్-చేయెన్" మున్నగు ఎత్వ విశిష్ట యెకారంగల పదాలుగా ప్రాచీనులైన పండిత కవులు కొందరు వ్రాస్తూ ఉండేవారు. అందువల్లనే గణపవరపు వేంకట కవి

సీ॥ చాయకుఁ బాయకు లోయకు వను పల్కు
లంచెత్వ మమరక యత్వ మగును,

(సర్వ లక్షణ శిరోమణిలోని ఆంధ్ర కౌముది అనబడే వ్యాకరణ భాగం 25. పు.)

అని వ్రాయవలసి వచ్చింది. అప్పకవికూడా

సీ॥ నడుగుల నడుమను గడను యా కెందును
దలకట్టు తక్క నెత్వంబు లేదు

(అప్ప. 2-ఆ. 175 ప.)

అని వ్రాసి "కయ్యము-గాయకము-కాయ" మున్నగు పదాలను ఉదాహరించి భారతాది గ్రంధాలలోంచి "చయ్యన-"ఆయన-దరియన్-చేయన్" పదాలలోని "య" కారము అత్వ విశిష్టమే కాని ఎత్వ విశిష్టం కాదనడానికి యతిస్థాన ప్రయోగా లుదాహరించాడు. అప్పకవి కాలంలోకూడా "కయ్యెము-గాయెకము" మొదలైన ఎత్వ విశిష్ట యకారంగల పదాలను వ్రాస్తూ ఉండేవారు కాబట్టే అప్పకవి ఆవ్రాత దుష్టంగా వాకొన్నాడు.

ఇటువంటి వ్రాతలు ఆనాడు అధికంగా ఉండబట్టే వాటిని దోషాలుగా దృష్టిలో పెట్టుకొన్న అప్పకవి ఒకటికి రెండు సార్లుగా అప్పకవీయం, ద్వితీయాశ్వాసం 176 వ పద్యంలో తిరిగి ఈ విధంగా పేర్కొన్నాడు.

సీ॥... తే. గీ.......భూతాది క్రియా పదాంత
ముల విశేషణ భావి క్రియలను దక్క
మొదలి యంతస్థమున కేత్వములు త్రిలింగ
దేశ భాషను బుట్టవు దితిజభేది॥

ముద్దరాజు రామన్న కాలంలోకూడా (క్రీ.శ. 1550లో) "కయ్యెము-చయ్యెన-పాయెకు" మొదలైన పదాలను అత్వ

విశిష్ట యకారం కలవిగా వ్రాయడానికి మారు "కయ్యెము-చయ్యెన-పాయెకు" మొదలైన ఎత్వ విశిష్ట యెకారంగల పదాలుగా వ్రాస్తూ ఉండే వారు. కాబట్టి

తే. గీ. తాయె ‡ తయు, నయ్యెలయుఁ బయ్యెదయును దక్కఁ
గలుగ నెత్వంబు మధ్య యకారములకుఁ
దుదను గ్రియఁ దక్క నెత్వంబు గదియ, దాది
నత్వ మొందగు దెనుఁగున నజ్జ నాభ!

(కవి. 1 తరం. 117 ప.)

అనే ఈ పద్యంలో "తుదను గ్రియఁ దక్క నెత్వంబు గదియదు" అని క్రియకు చివర తప్ప మరొక చోట ఎత్వంతో కూడిన "యె" కారం పదాంతంలో ఉండనేరదని స్పష్టపరచినాడు. అంటే—రామన్న కాలంలో "పోయెను-కొనియెను" ఇత్యాది క్రియలలోనే కాక ఇతర పదాంతాల్లో ఉండే అత్వ విశిష్ట యకార స్థానంలో కూడా ఎత్వ విశిష్ట యెకారాన్ని వ్రాస్తూ ఉండేవారన్న మాట. కాబట్టే రామన్న అంతిమంలో "యె" కారం క్రియలలో తప్ప మరొక చోట ఉండదని చెప్పినాడు,

ఈ పద్ధతిలో పదాంతంలో ఉండే "య" కారం "యె" కారంగా ఉచ్చారణ ప్రకారం వ్రాయబడడం అతి ప్రాచీనం నుంచీ ఉన్నదని "బోయెత" శబ్దాన్ని బట్టి తెలుస్తున్నది. "బోయ"

---

‡ ఈ పద్యం మొదటి రెండు పాదాలూ నా అభిప్రాయం ప్రకారం పూర్వం సూచించినట్లు ఈ క్రింది విధంగా ఉండాలి—(చూ-33 పుట) "తాయతయు నయ్యలయుఁ బయ్యదయును దక్కఁ-గలుగ దత్వంబు మధ్య యకారములకు."

అని అదంత "య" కారంగల ఈ పదం వ్యవహారవశాన "బోయె" గా మారి పోయింది. "తవర్ణకంబు కులవాచకంబులకు స్త్రీ వాచ్యంబగునపుడు మతుబర్థంబునందగు" (బాల. తద్ధి: 19 సూ.) అనే సూత్రం ప్రకారం "బోయ" అనే పదం మీద తవర్ణకం చేరితే "బోయత" అవుతుంది. "బోయ" "బోయె" గా మారినట్లు "బోయత" "బోయెత" గా కూడా మారిపోయింది. ఈ మారడం అనేది ఎప్పుడో రామరాజ భూషణుని కాలానికి పూర్వమే జరిగింది.

చ॥ అతినవ పల్లవోజ్జ్వలతరాంగరుచుల్ తొలి సంజ గప్పు బో
యెతతఱి వేచి వింటఁ గది యుంచిన వేగురుఁ జిక్కఁ గానుంటు
(హరి. న. 4 ఆ.)

అని రామరాజ భూషణుడు నాటి వ్యవహారం ప్రకారం "బోయెత" అని వక్రరూపాన్ని ప్రయోగించాడు.*

---

* ఈ "బోయెత" అనేది పద మధ్య యెకారం కలదిగా నారాయణీయాంధ్ర వ్యాకర్త, మరి కొందఱు విమర్శకులు భావించారు. కాని అది సమంజసం కాదు. "బోయెత" లోని "త" వర్ణం ప్రత్యేకంగా వచ్చి విశేషార్థంలో (మతు బర్థంలో) చేరిందేగాని అది సహజంగా శాబ్దికంగా ఉన్న "త" వర్ణం కాదు. ఆ "త" వర్ణం సహజ శాబ్దికం కానప్పుడు అందులో ఉన్న "యె" కారం పదమధ్య "యె" కారం కానేరదు. "బోయెత" అనే ఈవక్రయోగం గల "యె" కార ప్రయోగం ప్రామాణిక ప్రయోగాల్లో చాలా అరుదుగా కానరావడంవల్ల బాలవ్యాకర్త దీనిని పరిగణించ లేదు. "త" వర్ణకం పరమవుతూంటే కొన్ని చోట్ల వక్రం కనపడుతోందని చిన్నయసూరి (బాల. తద్ధి. 20 సూ.) చెప్పినాడు గాని "బోయెత" ను

"ఎ" కారం "యె" కారంగా మారినట్లే "ఏ" కారం ఉచ్చారణలో స్థాన ప్రయత్న సామ్యంవల్ల "యే" కారంగా మారుతుంది. ఉ॥ ఏమి – యేమి, ఏతము – యేతము మొ॥ వ్యవహారంలో ఉచ్చారణ బలంవల్ల "యె" కారం "య" కారంగా మారినట్లే ఈ "యే" కారంకూడా "యా" కారంగా మారి పోయింది. నామాదిలో ఉన్న ఈ "యా" కారం ఆకార ఏకారాలకు మధ్యమస్వరం కలదిగా ఉచ్చరింపబడు తుంది. అందువల్లనే "యే" గాను "యా" గాను, రెండు విధాలా ఉచ్చరింపబడటం, తదనుగుణంగా వ్రాయబడడం జరుగు తుంది. "ఏంది"–"ఏతము" మున్నగు పదాద్యచ్చులు "యే" కారాలుగా మారి "యేంది – యేతము" కావడంతో పాటు "యాంది–యాతము" అని కూడా వ్యవహరింప బడుతున్నాయి. ఈ పద్ధతిలోనే "ఏడ" అనేది "యేడ, యాడ" లుగాను–"ఏచమనేని" అనేది "యేచమనేని, యాచమనేని" లుగాను; "ఏర్లగడ్డ–యేర్ల గడ్డ, యార్లగడ్డ" లుగాను; "ఏలకులు–యేలకులు, యాలకు" లు గాను పరిణామం చెందాయి. "ఏచమనేని–యేచమనేని" అనేవి రెండూ (శ్రీ) నాథుని కాలంనుంచీ వ్యవహార భ్రష్టం అయిపో యాయి. కాబట్టి నేటికి నిలబడిన "యాచమ నాయుడు, యాచ మనేని" వంటి "యా" కార ప్రయోగంకల ఈ పదాలే సహజ సిద్ధాలేమో అని సందేహం కలిగేటంతగా మన నిత్య వ్యవహా రంలో స్థిరపడిపోయాయి. "ఏర్లగడ్డ" అనేది "యేర్లగడ్డ" గా

ఉదాహరింప లేదు. అంతకు పూర్వం "బోయ" "బోయత" అని అత్వ విశిష్ట యకార రూపాలనే పేర్కొన్నాడు.

మారిన తరువాత కొద్ది కాలంనుంచీ ఇప్పుడు వ్యవహారంలో కేవలం "యార్లగడ్డ"గానే ఉపయోగింపబడుతోంది. "యాడ-యాలకులు" ఇత్యాదులు అనేక శబ్దాలు సర్వసామాన్యాలయి పోయాయి. వ్యవహార బలంచేతనే పదమధ్యంలో ఉండే "యే" కారంకూడా "యా" కారంగామారింది. "ఊయేల, ఉయేల, ఉయ్యేల" లు "ఊయాల, ఉయాల, ఉయ్యాల" లుగా మార్పు చెంది పూర్వ కవులచే విశేషంగా ప్రయోగింపబడి, ఆంధ్ర వ్యాకర్తలకు సైతం శిరసావహింప వలసిన పదాలయ్యాయి. (చూ. బాల. వ్యా. ప్రకీ 4, 6 సూ.) పూర్వ కాలంలో "ఊయేల" అని దీర్ఘ "యే" కారాన్ని వ్యవహరించినట్లు "పయ్యెదకు" "పయ్యెద అని "తాయెతుకు" "తాయేతు" అని దీర్ఘ "యే" కారాల వ్యవహారాలున్నట్లు క్రీ. శ. 1676 ప్రాంతం వాడైన గణపవరపు వేంకటకవి వ్రాసిన ఈక్రింది పద్య భాగం వల్ల తెలుస్తున్నది.

"ఊయల, పయ్యెద, తాయతుల నడిమి యత్వమునకు యత్వ మేత్వ మునగు" (ఆంధ్రకౌముది 25 పుట)

"తాయేతు" అని దీర్ఘ "యే" కారంతో కూడిన వ్యవహారం ఈ నాటికీ కొన్ని ప్రాంతాల్లో ఉన్నది గాని "పయ్యేద" అనే వ్యవహారం ఏ ప్రాంతంలోనూ ఈ నాడు కానరావటం లేదు. రామన్న కాలంలో "పయ్యేద" అనే వ్యవహారంకూడా ఉన్నదేమో!

మొత్తం ఈ పరిశీలన వలన "ఇ, ఈ, ఎ, ఏ" లు "యి, యీ, యె, యే" లుగా వ్రాయబడడం అస్వాభావికం కాదనీ వాటిని

ప్రాచీనులు గ్రాంథికంలో వ్యవహరించడమే కాకుండా విరివిగా ఎప్పుడూ వ్రాస్తూ ఉండేవారని తేలుతున్నది. వీటిలో "యె, యే" లను మరి కొందఱు కవులు, పండితులు, వ్యాకరణ చ్ఛందో గ్రంథకర్తలతో సహా చాలామంది "య, యా" లుగా వ్యవహరించే వారనికూడా తేలుతున్నది.

— ఉ, ఊ, ఒ, ఓ —

"ఉ, ఊ" లు వ్యవహారంలో "వు, వూ" లుగా మారినాయి. ఈ "ఉ, ఊ" లు ఉన్నవి ఉన్నట్టుగా ఉచ్చరించాలంటే లోగడవలెనే కొంచెము ఒత్తి పలుకవలసి వస్తుంది. ఈ విధంగా ఒత్తి పలకడంలో వున్న కష్టాన్ని కొంత తగ్గించు కొనడానికి సుఖాపేక్షతో మానవుడు ఆ "ఉ, ఊ" లను ఒత్తి పలకకుండా తేల్చి పలుకుతాడు. ఆ విధంగా తేల్చి పలకడంలో ఓష్ఠ స్థానికాలైన "ఉ, ఊ" లకు సన్నిహితంగావుండే ఓష్ఠజమైన "వ" కారం వస్తుంది. ("ఉ, ఊ"లకు స్థానం ఓష్ఠం. సంవారం-నాదం-ఘోషం-బాహ్య ప్రయత్నాలు. "వ" కారానికి దంతము, ఓష్ఠము స్థానాలు. సంవార నాద ఘోషాలే "వ" కారానికి బాహ్య ప్రయత్నాలు.) అప్పుడవి "వు, వూ" లుగా మారి నోటినుండి వెలువడతాయి.

ఇదే విధంగా కంఠోష్ఠజాలైన "ఒ, ఓ" లకు స్థాన ప్రయత్న మిశ్రత్వంచేత "వ" కారంవస్తుంది. అప్పు డవి "వొ, వో" లుగా మారి నోటినుండి వెలువడతాయి.-అనగా-ఉచ్చారణలో మానవుని సుఖాపేక్షవల్ల "ఉడుత-ఊరు-ఒకడు-ఓడ" మున్నగు అజాది పదముల ఆదిగల "ఉ, ఊ, ఒ,ఓ" లు హలా

ములుగా—అంటే—"వ" కారాదులుగా "వుడుత-వూరు-వొకడు-వోడ" అని ఉచ్చరింపబడతాయి. కాగా ఈ నాడు "ఉ, ఊ, ఒ, ఓ" లు మొదటగల పదాలు "వ" కారంతో కలిపి భాషలో వాడబడడం సహజమేనన్న మాట. నేటి వ్యావహారిక భాషలో వ్యవహరింపబడుతున్న ఈ "వ" కారం కేవలం ఈనాటిది కాదు. అత్యంత ప్రాచీన కాలంలో సైతం ఈ పదాది "వ" కారాన్ని పండిత కవులు వ్రాస్తూ ఉండేవారు. ఆ కారణంచేత ప్రాచీన కాలంలో లక్షణ గ్రంథకర్తలు పదాదిలో "వ" కారం ఉండదని అజాది పదాలను—అంటే—ఇక్కడ సందర్భాన్ని బట్టి "ఉ, ఊ, ఒ, ఓ" లు ఆదియందుగల పదాలను "వ" కారాదులుగా వ్రాయరాదని పెక్కు పర్యాయాలు చెప్పుకోవలసి వచ్చింది.

తే. గీ॥ "ఆంధ్ర సంస్కృతి పదముల యందు మొదలి
నైన § ఊ, ఊలు, ఓ కారమనెడి లిపులు
స్వరము లగుగాని హల్లుల చొరవు గనుక
వాకు నుత్వో ‡ త్వముల నవి వ్రాయరాదు.

ఆ. వె॥ ఉల్ల ముపిద యుదుటు నూరును నోపిక
యనెడు పలుకులెల్లఁ దెనుఁగులోన
ఉదధి యున్నతంబు నూర్వశి యోంకార
నుమరు వనఁగ సంస్కృతమునఁ జెల్లు."

(ల. సా. సం. తృ. ఆ. 8, 9 పద్యాలు)

---

§ లోగడ 12, 13, 14వ పుటల్లో (ప్రౌఢ వ్యాకరణం. సంజ్ఞా. 2 సూత్రం ప్రకారం) చర్చించిన దాన్నిబట్టే "ఉ, ఊ" లన్నప్పుడు ఆదిహ్రస్వ స్థానంలో దీర్ఘం వచ్చింది.

‡ "వాకు నుతోత్వముల" అని ముద్రణ ప్రతిలో పాఠం ఉన్నది. కాని "వాకు నుత్వోత్వముల" అనే ఉండాలి. ఉత్వంచేత "ఉ, ఊ" లు, ఒత్వంచేత "ఒ, ఓ" లు పరిగ్రహింపబడతాయి.

ఈ పెద్దన కాలంలో—అంటే—క్రీ. శ. 1550 ప్రాంతంలో "ఉల్లము-ఉవిద-ఉదుటు-ఊరు-ఒపిక" అనే అజాది తెలుగు పదాలు, "ఉదధి - ఉన్నతంబు - ఊర్వశి - ఓంకారము" అనే అజాది సంస్కృత సమపదాలు, "వుల్లము - వువిద - వుదుటు-వూరు-వోపిక; వుదధి-వున్నతంబు - వూర్వశి - వోంకారము" మున్నగు "వ" కారాది (హలాది) పదాలుగా వ్రాయబడుతూ ఉండేవి. కాబట్టే "స్వరములగుఁగాని హల్లులై పోరవు గనుక, వాని నుత్వోత్వముల నవి వ్రాయఁగాదు" అని పెద్దన కచ్చితంగా చెప్పుకున్నాడు.

పదాది "య" కారంతో పాటు పదాది "వ" కారాన్ని సైతం అంగీకరించని "కాకునూరి అప్పకవి" కూడా పదాదిలో "వు, వూ, వో, వో" లు లేవని ఒకసారికి రెండు సార్లు చెప్పుకున్నాడు.

క. "పద్యాది ప్రాణంబుల
నాద్యంతాంతస్థములుగ నజ్ఞులు కృతులన్
హృద్యహార! వ్రాయుదురు తెము
విద్యాధికులెల్లఁ జూచి వికవిక నవ్వన్.

ఆ॥ ఇరు తెఁగులు ఉత్తు లూళ్లె
వ్వరు నేమిటి యొక్కఁడోపు వానికి వను నీ
కరణి పదంబుల మొదలివి
స్వరములనుచుఁ దెలిసి వ్రాయఁ జనుఁ బద్యాదిన్"

(అప్ప. 2 ఆ. 48, 44 ప.)

సీ॥ జాతినాగల వోష్ఠ్య శబ్ద మొక్కటి దక్క
సంస్కృతాంధ్రముల ముఖ్యములగు

శబ్దంబు మొదల నిశ్చయముగాఁ గొమ్ములు
నోత్వంబులును గల్గ వొకటికైన
వాఁకు శృంగముల క్రైవడి నోత్వముల భంగి
శబ్దాదిఁ గలయవి స్వరములగును
రెండును లాఁతులనుండుఁ గృష్ణుఁడు కిన్క—
వుట్టమోదినఁ జెట్టు వొలిసె ననఁగ
తే. గీ. నడుమఁ గొమ్ములు సంస్కృతాంధ్రముల రెంట
బలసి జాత్యక్షరములకే గలిగి యుండు
భావుకము నీవు భవుకంబు భవుఁ డనంగఁ
బొడవు దీవులు సవురంబు పువ్వులనఁగ

(అప్ప. 2 ఆ. 221 ప.)

అని అజాది పదాలకు మొదట "వ" కారం వ్రాయ గూడదని చెప్పుకున్నాడు. "ఉలుత-ఊళ్లు-ఒక్కడు" మొదలైన పదాలు "వులుత-వ్రాళ్లు-వొక్కడు" మొదలైనవిగా అప్పకవి కాలంలో వ్రాసే వారనడం నిర్వివాదం.

అహోబలుడుకూడా "ఊదోతౌదంత్యోష్ఠ భవస్యవికృతి శబ్దాదా ఇతి చ తత్పుస్తకే † స్థితమ్.......దంత్యోష్ఠ భవస్య వకారస్య తేన ఊరు-ఉవిద-ఇత్యాదావచ్త్వం నిర్వివాదం. ఆద్య ప్రకృత్యామపి వోఢృశబ్ద ఏవ శబ్దాదా వకారస్య ఓత్వం దృశ్యతే." — (అహో. 139 పుట.) అని "అద్యః క్రియా" స్విత్యాది సూత్ర వ్యాఖ్యా సందర్భంలో వ్రాశాడు. "ఊరు-ఉవిద" ఇత్యాదుల్లో ఆదినున్నది అచ్చేనని హల్లు అనవలసిన పనిలేదని అహోబలుడు వ్యావహారికాన్ని ఆమోదించక నిర

† అప్పకవి పుస్తకే.

సించినాడు. ఈ "వ" కారాది వ్రాతలను గమనించిన 'చిన్నయసూరి' కూడా "యకారంబును-వు, వూ, వొ, వో, లునుఁ దెలుఁగు మాటలకు మొదట లేవు" (బాల. సంజ్ఞ. 17 సూ.) అని స్పష్టంగా చెప్పాడు. ఎప్పుడైనా వ్యవహారం అన్నది ఉంటేనే కదా తప్పు అని, ఒప్పు అని చెప్పుకోనే అవకాశం కలగడం!

ఈ "ఉ, ఊ, ఒ, ఓ" లు ఆదిగల పదాలను "వు, వూ, వొ, వో" లు ఆదిగాగల పదాలుగా వ్రాయడమనేది క్రీ. శ. 13వ శతాబ్దానికి పూర్వకాలంలోనే ఉన్నది. ఈ విధంగా అజాదులను హలాదులుగా వ్రాయడ మనేది కేవలం పామరులలోనే లేదు. పండిత కవుల్లో సైతం వున్నది. కాబట్టే కొందరు కవులు

ఉ॥ "అనయము భక్త శిష్యకులు
లంచును వేదము లా ద్విజోత్తముల్
విన నుతియింపఁ గుక్కుఁ జది
వించిన హావినహళ్లి కల్లిదే
వునకు సనుంగు వాఁడనని
వుత్సుకతన్ నుతియింతు భక్తహృ
ద్వనజ విహారలోల బస
వా! బసవా! బసవా! వృషాధిపా!"

(వృషాధిప శతకము. 98 ప.)

"వొక్కని డించి పోవుటయు భీతిల్లి"

(నవనాథ చరిత్ర. † 92 పుట.)

---

† కర్త: గౌరన-మదరాసు యూనివర్సిటీ పబ్లికేషన్.

"వుండంగఁ దగిన తావులను విశ్వాస్యు"

(నవనాథ చరిత్ర. 177 పుట).

ద్విపద :-"వోజమై జరయును చావునుఁ దెవుల్లేని"

"వుడిపి కోలూని పోవుచునుండి......"

(ద్విపద భారతం[1] 21-41 పుటలు)

అని కొన్ని విశేష ప్రయోగాలుచేశారు. ఈ ప్రయోగాలలో "ఉత్సుకతన్" అనడానికి "వుత్సుకతన్" అనీ, "ఒక్కని" అనడానికి "వొక్కని" అని "ఉండంగ" అనడానికి "వుండంగ" అనీ "ఓజమై" అనడానికి "వోజమై" అనీ "ఉడిపి" అనడానికి "వుడిపి" అనీ యతిస్థానాల్లో ఉపయోగింపబడ్డాయి. ముద్రణలో "యుత్సుకతన్-ఒక్కని-ఉండంగ-ఓజమై-ఉడిపి" అని సవరించి ముద్రించబడినాయి. కాని ఈపదాలు ఈ ప్రయోగాల్లో అజాదులుగా ఎంచబడేటట్లయితే యతులు గతులు తప్పుతాయి. హలాదులుగా (వకారాదులుగా) ఉంటేనే యతికి సరిపోతాయి. ఉచ్చారణ ననుసరించి "ఉడుత-ఊరు" వంటి పదాలు "వుడుత-వూరు" వంటివిగా వ్యవహరింపబడి యతిస్థానాల్లో ప్రయోగింపబడ్డాయి. ఈ ప్రయోగాలను వ్యాకరణం రీత్యా "వ" కారాదులు కాకుండా ఉండేటట్లు సవరించి పూర్వులు కొందరు "ఉ' ఊ, ఒ, ఓ" లకూ "వు, వూ, వొ, వో" లకు యతి మైత్రిని పాటించారు. వాస్తవానికి ఛందో గ్రంథకర్తల యతి నియమాల ప్రకారం "ఉ, ఊ, ఒ, ఓ" లకు "వు, వూ,

[1] కర్త: తిమ్మకవి - ఆంధ్రా యూనివర్సిటీ పబ్లికేషన్.

వొ, వో" లకు పరస్పరం మైత్రి లేదు. అయినప్పటికీ కొందరు కవులు "దేవుసకు సనుంగువాఁడసని వుత్సుకతన్"– "వొక్కని డించి పోవుటయు భీతిల్లి" — "వుండంగఁ దగిన తావులను విశ్వాస్యు"–అని ప్రయోగింపబడిన ఇటువంటి ప్రయోగాలను "దేవుసకు సనుంగువాఁడసని యుత్సుకతన్"–ఒక్కని డించిపోవుటయు భీతిల్లి"—"ఉండంగఁ దగిన తావులను విశ్వాస్యు" సంటి ప్రయోగాలుగా, వ్యాకరణ యుక్తంగా సవరించుకొని "ఉ" కార "ఒ" కారాలకు, వు, వోలకు పరస్పర యతి మైత్రిని అగతికంగా (గతిలేక) అంగీకరించి ఈ క్రింది విధంగా విశేష ప్రయోగాలు చేశారు.

చ॥ "పలుకులఁ దన్నుఁ దాఁ బొగడఁ బాతకమందు రటుండఁ దారకా
వలి సికతావ్రజంబు హిమవారి కణంబులు లెక్క పెట్టఁగా
నలవడుఁగాని యేను వసుధామరకోటికి దానమిచ్చు గో
వుల గణుతింప ధాతయును నోపఁడు మాధవ! యేమి చెప్పుదున్

(భాగ. దశమ. ఉ. 461 ప.) †

చ॥ విను మగధేశ్వరుం డపుడు విప్ర జనావళియందు భక్తియున్
వినయముఁ గల్గి యుద్ధియును వేడినచో వృథసేయ కిచ్చుఁగా
వునఁ దగ నర్జునుండును పవ§ నోద్భవుఁ డేను బ్రాహ్మణాకృతిం
జని రణభిక్ష వేడిన వశంవదుఁడై యతఁ డిచ్చుఁ గోరికల్.

(భాగ. దశమ. ఉ. 715 ప.)

---

† రామా అండు కో వారి ప్రచురణ. § వావిళ్ల వారు ప్రకటించిన ఆంధ్ర మహా భాగవతంలో పై పద్యత్రయంలో 715 వ పద్యంలో మాత్రం అవకాశం లభించబట్టి గాబోలు "కావున విజయుండును పవన పుత్రుండు" అని ప్రయోగాన్ని దిద్దివేశారు. 462, 900 పద్యాల్లో మాత్రం దిద్దలేకపోబట్టి గాబోలు "ఉ–వు" ల యతులు అట్లాగే నిలచి ఉన్నాయి.

తే. గీ. గగనమందుండి యొకఁ డార్తుఁడగుచు వచ్చి
నందనందను పాదారవిందములకు
వందనము చేసి ఆనకదుందుభిని మ
హోగ్రుఁడై పట్టితెచ్చె సాల్వుండు గడఁగి.

(భాగ. దశమ. ఉ. 900 ప.)

మ॥ "అనినన్ గర్దభి పల్కె నీవనుట తెంధ్యం బీవు శాస్త్రార్థ చిం
తను గర్మం బొనరింతు గాని విను మం। తస్వార హీనుండ వె
ట్లనినన్ భూసుత కాంత మంగలికి నె। య్యంబార నిద్గాంచెఁ గా
వునఁ జండాలుఁడ వౌదు సందియము లే। దూహింప నిప్పట్టునన్"

(ధర్మ ఖండము. 3 అ. 82 ప.)
(కర్త ; ఈదురుపల్లి భవానీ శంకర కవి.)

క॥ "....................................ని
ల్వుండని కొల్చుండఁజేయ నుత్సవ యుతులై"

(బసవ పురాణము 1 అ. 152 ప.
కర్త పిడుపర్తి సోమన)

"ఉ, ఊ, ఒ, ఓ" లకు "వు, వూ, వొ, వో" లకు యతిమైత్రి సంగీకరించబట్టే పై ప్రయోగాలు చేయబడ్డాయి. అయితే-ఈ విధంగా యతులను ఉపయోగించే అవకాశం కలగడానికి మొట్ట మొదటి మెట్టు "ఉ, ఊ, ఒ, ఓ లు "వు, వూ, వొ, వో" లుగా ఉచ్చారణ ప్రకారం కేవలం వ్రాయబడడమే కాకుండా "దేవునకు ననుంగువాఁడనని వుత్సుకతన్" వంటి ప్రయోగాలు చెయ్య బడడమే. * శాబ్దికమైన "వు" కారానికి సంధి, గతం

* క॥ మొదల సభంబులు రెండును
గదిసిన విభవంబు తభసగణ సంగతి యొ
ప్పదు రయమున నధిక శుభం
బొదవును భయములను హాని వొందు నృసింహా !
(అనం. ఛం. 1 ఆ. 27 ప.)

కాకుండా విడిగా ప్రయోగింపబడ్డ పదాది "ఉ" కారంతో "వు" కారానికి యతి చెల్లిందంటే పదాదిలో ఉన్న "ఉ" కారానికి "వు" కార వ్యవహారం ఉండడం శాబ్దికమైన "వు" కారానికి వ్యవహారశాత్తు వచ్చిన "వు" కారానికి యతిమైత్రి చెల్లుతుందని భావించడమే కారణం. శాబ్దికమైన "వు" కారానికి సంధి

దీనిలో చివరి పాదంలో ఉన్న ప్రయోగం "దేవునకు ననుంగువాఁడ నని యుత్సుకతన్" అనే ప్రయోగం వంటిదేనని ఒకానొక డభిప్రాయపడి "అప్పకవీయం" పంచమ ముద్రణ ప్రతికి తొలిపలుకుగా వ్రాసిన దానిలో వ్రాసినాను. దీనిని గురించి ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలో (39 సం. సంచిక 1-3) సంపూర్ణంగా చర్చించాను. ఈ ప్రయోగంలో "హాని యొందు" అని ఉండాలని, "హానివొందు" కాదని ఎవరైనా వాదించడానికి అవకాశం ఉన్నది. ప్రతిపక్ష వాదానికి అవకాశం ఇచ్చే ఇటువంటి ప్రయోగాలు ప్రయోగాలు అనిపించుకోవని నా అభిప్రాయం. "దేవునకు ననుంగువాఁడనని వుత్సుకతన్" అన్నప్పుడు "వుత్సుకతన్" అనే దానిని "యుత్సుకతన్" అని దిద్దుకున్నప్పటికీ అది సవ్యమైన ప్రయోగమని అనిపించుకోదు. దానికి కారణం "ఉ" కార "వు" కారాలకు ఏ ఛందోగ్రంథకర్త కూడా యతిమైత్రిని విధించి, లక్షణం చెప్పి పేర్కొనక పోవడమే! ఇక్కడ "శుభంబు+ఒదవును" అని పదవిభాగం జరుగుతున్నది. హాని + ఒందు="హానియొందు" అని అసలైన ప్రయోగమనీ, ఇక్కడ "ఒదవు" లోని "ఒ" కారానికి "ఒందు" లోని "ఒ" కారానికీ యతిమైత్రి చెల్లిందని ఎవరైనా వాదించడానికి అవకాశం వున్నది. "హాని వొందు" అనేదే అసలైన ప్రయోగమనడానికి ఆస్కారం లేదు. అందుకే "ఉ" "వు" ల యతికి ఉదాహరణంగా ఈ అనంతుని పద్యం పనికిరాదనడం. "దేవునకు ననుంగువాఁడనని" ఇత్యాది స్వైరప్రయోగాల్లో "గేయునకు" వంటి అపప్రయోగాలు సృష్టింపబడితేనేగాని ఆ ప్రయోగాలు "ఉ-వు" ల యతికి ఉదాహరణలు కావనడం సాధ్యపడదు.-(చూ. నా వ్యాసం-సుభాషిణి-సెప్టెంబరు 1952)

గతం కాకుండావుండి పదాదిలో వ్యవహారవశాత్తు వచ్చిన "వు" కారానికి యతి చెల్లడం స్థిరపడిపోతేనేగాని శాబ్దికమైన "వు" కారానికి సంధిగతమైన పదాద్యచ్చు "ఉ" కారానికి ("కావున చండాలుఁడ కాదు సందియము లేదూహింప" వంటిచోట్ల) యతిమైత్రి పాటింపబడదు. సిద్ధాంతం ప్రకారం శాబ్దికమైన "వు" కారానికి పదాద్యచ్చు స్థానంలో వ్యవహారవశాత్తువచ్చిన "వు" కారాదుల కీయతి స్థిరపడి పోయిందంటే "ఉ, ఊ, ఒ, ఓ"లు ఆదిలో గల పదాలన్నీ "వు, వూ, వొ, వో"లు ఆదిలో గలవిగా పండిత కవుల ఆమోదాన్ని పొంది స్థిరపడినట్లు అనడంలో అణుమాత్రమైనా సందేహం అక్కర లేదు.—అనగా—"ఉడుత-ఊరు-ఒకడు-ఓడ" మున్నగు అజాది పదాలు "వుడుత-వూరు-వొకడు-వోడ" మున్నగు హలాది పదాలుగా వ్రాసికొనవచ్చని పండిత కవులచేత బాహాటంగా అంగీకరించబడినట్లన్న మాట!

"ఒకడు-ఒగరు- ఒద్ద" మొదలైన పదాలు వ్యవహారవశాత్తు "వొకడు-వొగరు-వొద్ద" మొదలైనవిగా - హలాదులుగా మారిపోయాయి. ఆయా పదాల్లో "ఒ" కారం "వొ" కారంగా మారడమేకాకుండా "వ" కారంగాకూడా మారిపోయింది-అనగా-"ఒద్ద-ఒకడు" మొదలైన పదాలు "వొద్ద-వొకడు" లుగానే కాకుండా "వద్ద-వకడు" లుగాకూడా మారిపోయినాయన్న మాట. "వొ" కారం మీదఉన్న "ఒ" కారం కంఠోష్ఠ స్థానాలు రెండూ కలిగిన దవడంచేత కంఠస్థానికమైన "అ" కారం సైతం స్థానంయొక్క సన్నిహితత్వంచేత వస్తూ ఉంటుంది. "ఒంకె-ఒగరు-ఒదరు-ఒద్దిక-ఒయ్యారము" మున్నగు

అజాది పదాలు "వాంకె-వాగరు-వాదరు-వార్ధిక-వాయ్యారము" మున్నగు "వా" కారాది పదాలుగానే కాకుండా "వంకె-వగరు-వదరు-వగ్గిక-వయ్యారము" మున్నగు "వ" కారాది పదాలుగాకూడా ఈ నాడు వ్యవహరింపబడడం అసమంజసం కానేరదు. "ఒ" కారం "వా" కారంగా మారి ప్రామాణికత్వాన్ని పొందిందనడానికి ప్రయోగాలు పూర్వమే ఇవ్వబడ్డాయి. కాని పదాదిలో యేర్పడ్డ "వా" కారం "వ" కారంగా మారినందుకు నిత్య వ్యవహారంలోనే తప్ప పూర్వకవి వ్యవహారంలో ప్రయోగాలు మృగ్యాలు (వెతక తగ్గవి) గా ఉన్నాయి. "ఒగ్గు" అనే పదానికి నన్నయాదుల దగ్గఅనుంచీ అజాది వ్యవహారం ఉన్నది.

క॥ తన దివ్యతేజమున వ
న్నెన్ మెల్ల వెలుంగుచుండ వచ్చెను భృగువం
శమునకు నిర్వంశనకుఁ బ్రియ
మొదవింపఁగఁ దలఁచి గాని యొద్దకుఁ బ్రీతిన్"

(భార. అగ. 3 ఆ. 165 ప.)

ఇటువంటి "ఒ" కార ప్రయోగాలు కోకొల్లలు. వ్యవహారంలో మాత్రం "ఒద్ద" "వా" కారాది పదంగా చాలా పూర్వ కాలంలోనే మారింది. ఈ "ఒగ్గ" అనేదే "వొద్ద" గా మారడమే కాకుండా "వగ్గ" గాకూడా మారి అతి పురాతన కాలంనుంచీ ప్రామాణికత్వాన్ని పొందింది. కాబట్టే శబ్దరత్నాకరకారుడుకూడా

—"వగ్గ. దే. వి. ఒద్దయొక్క రూపాంతరము. ద్వి. రా.
(ఇది ఇతర పురాతన గ్రంథములయందు మృగ్యము)"

. అని వ్రాసినాడు. ఈ "వద్ద" అనేది ఆంధ్ర నిఘంటువుల్లో ప్రామాణికత్వాన్ని కూడా పొందింది.

పదాది "ఒ" కారం "వొ" కారంగా మారి "వ" కారంగా మారడం ఎప్పుడైతే జరిగిందో అప్పటినుండే సహజంగా ఉన్న (శాబ్దికమైన) "వ" కారం "వొ" కారంగా మారి "ఒ" కారంగా కూడా మారిపోయింది. ఈ విధంగా మారడంలో కూడా ప్రామాణికత్వాన్ని పొందిన రూపాలు అత్యల్పాలనే చెప్పవచ్చు. వ్యవహారంలో మాత్రం "వడియాలు-వడ్డించు-వస్తు-వత్తి-వదులు" మున్నగు పదాలు "వొడియాలు-వొడ్డించు-వొస్తు-వొత్తి-వొదులు" మున్నగు పదాలుగా మారడమేకాకుండా "ఒడియాలు-ఒడ్డించు-ఒస్తు-ఒత్తి-ఒదులు" మున్నగు అజాది పదాలుగాకూడా మారి పోయాయి.

వర్ణ శబ్ద భవమైన "వన్నియ" అనేది "వొన్నియ"గా మారి "ఒన్నియ" గాకూడా మారిపోయి ప్రామాణిక కవి ప్రయోగారూఢమై పోయింది.

ఈ విధంగానే దీర్ఘమైన "ఓ" కారం "వో" కారంగా మారడంతోపాటు "వా" కారంగాకూడా మారి వ్యవహారంలో "ఓరగిల్లు-ఓడిగిల్లు" మొదలగు పదాలు (వోరగిల్లు-వోడిగిల్లు మొదలగునవిగా మారి) "వారగిల్లు-వాడిగిల్లు" మొదలైనవిగా కూడా మారిపోయాయి.

అయితే సహజంగా పదాదిలో "వా" కారం కల పదాలు కొన్ని వ్యవహారంలో ఉన్నప్పటికీ "వో" కారంగా

మారడమే ముఖ్యంగా ఉన్నది. "వా" కారంగా మారడమే ముఖ్యమైనప్పుడు "ఓ" కారంగా మారడమనేది మరింత ముఖ్యమనడం స్పష్టం.

— ఋ, ౠ. ఌ, ౡ —

"ఋ, ౠ" లను ఈ నాడు మనం వ్యవహారంలో "రు-రూ" లుగా వ్యవహరిస్తున్నాము. వాస్తవానికి ఈ "ఋ" కార చరిత్రను చూస్తుంటే చరిత్రకందినంతవఱకు దీనికి "అ-ఆ" మొదలైన ఇతర అచ్చులవలె స్వతంత్ర వుచ్చారణ ఉన్నట్లు కనపడడం లేదు. "ఋ" కారానికి "ర" కారానికి స్థానం ఒకటే, బాహ్య ప్రయత్నంకూడా ఒక్కటేకావడంచేత స్థానాన్ని బట్టిగాని, ప్రయత్నాన్ని బట్టిగాని "ఋ" కార "ర" కారాలకు పుట్టుకలోనే అత్యంత సన్నిహితత్వం ఉన్నదనడం నిర్వివాదం. ఈ సన్నిహితత్వంచేతనే ఈ నాడే కాదు నన్నయభట్టుకి పూర్వకాలంనుంచీకూడా "ఋ" కార స్థానంలో ఏదో ఒక రూపంలో రేఫకనపడుతూనే ఉన్నది. అసలు "ఋ" కారంలో రేఫ ఉచ్చారణ ఈ నాటిది కాదు.

"పదాద్యంబులు "ఋ, ౡ" వర్ణంబులు ర, ల తుల్యంబులు" (బాల. ప్రకీ. 1 సూ.) అని చిన్నయసూరి "ఋ" కారానికి "ర" కార తుల్యత్వాన్ని మొన్న మొన్న చెప్పాడే కాని మొట్ట మొదటనుంచీకూడా "ఋ" కారంలో రెండు రేఫలున్నవనీ, ఒక అజ్భాగం † కూడా ఉన్నదనీ ప్రాచీనులు చెప్పు

---

† ప్రాచీనులు "ఋ" కారంలో అజ్భాగం ఉన్నట్టు చెప్పారు కాని ఆ అజ్భాగం స్వతంత్రమైనది ఉన్నట్లుగా కనపడడం లేదు. "ఇ" కార

కున్నారు. 'సిద్ధాంత కౌముది'లో "ఋతిసవర్ణేఋవా" అనే వార్తిక సందర్భములో "ఆద్యస్య (ఋకారస్య) మధ్యేద్వౌ రేఫౌ తయోరేకామాత్రా అభితో జ్ఞానభక్తే రపరా" అని భట్టోజీ దీక్షితులు వ్రాసినారు. ఈ సందర్భములో "ఋ" కారంలో ఉన్న అభ్యంతర విశిష్టత ఏమిటో, దాని ఉచ్చారణ ఇతర స్వరాల కంటె భిన్నంగా ఏవిధంగా ఉన్నదో ఇతడు వివరించలేదు. 'భట్టోజీ దీక్షితుల' కాలంలో 'ఋ' కారాన్ని ద్విస్వరముగా ఉచ్చరించినట్లుగా ఒక్కటే (స్వరం) ఉన్నట్లు చెప్పారు. ఆ కారణం చేతనే అందులో (ఋకారంలో) రేఫభాగమున్నదని చెప్పడానికి మారుగా రెండు రేఫలున్నట్లు 'భట్టోజీ దీక్షితులు' చెప్పినారు. అయితే 'ఋ' కారంలో ఈ ద్విరేఫోచ్చారణ ఏనాడు భ్రష్టమై ఏక రేఫోచ్చారణ ప్రవేశించిందో చెప్పలేము. లేదా ద్వి రేఫలు కలిసిగా ఉచ్చరించడం భట్టోజీ దీక్షితులు వివరించిన ప్రాంతీయంగా ఉన్న విశేష ఉచ్చారణ అయినా అయి ఉండాలి. *

భాగం కూడా కలిసినా, ఆ "న" కార భాగం భ్రష్టమైనందువల్ల "ఉ" కార భాగమూ అందులో నిలుస్తాయి. వాస్తవానికి "ఋ" కారంలో ప్రత్యేకమైన అస్తిత్వం అనేది ఉంటే ఇతర స్వరాలకు భిన్నమైన స్వతత్వం ఉన్నట్లైతే దాని అస్తిత్వంలో ఉన్న ప్రత్యేకత గుర్తించబడుతుంది. "న" కార భాగం కాని, ఇతర ఏ అక్షరాలలో భాగం ఉన్నప్పటికీ ఏ అభ్యాగాన్ని తాను పొందినా ఆ అక్షరకలయిక అవుతుంది. కాని "ఋ" కారం స్వతంత్ర స్వరం ఎన్నటికీ కాదు.

* ఈ భట్టోజీ దీక్షితులు తన కాలంలో వున్న వ్యవహారాన్ని బట్టి "ఋ" కారంలో రెండు రేఫలున్నాయని చెప్పగా యీ నాటి కాలపు పండితులను పట్టుకొని చాలా కాలంగా "ఋ" కారంలో ఏకరేఫ ఉచ్చారణ మాత్రమే ఏర్పడి ఉన్నదన్న సంగతి గ్రహించలేదు. మా గురువులు శ్రీ వేదుల

నన్నయభట్టు కాలంలోనూ, ఆతనికి పూర్వ కాలంలోనూ జన వ్యవహారంలో "ఋ" కారం "ర" కారంగా ఉచ్చరింపబడుతుండేది. ఆ కారణం చేతనే ప్రాచీన కాలంలో ఉన్న శిలాశాసనాల్ని తిరగవేసినా ఈనాడు మనం వ్యవహరించే ఈ "ఋ" కారానికి మారుగా "ర" కారమే కనబడుతుంది. "పృథివి" అని వ్రాయడానికి మారుగా "ప్రథివి" అని "ప" కార "ర" కారాలను స్పష్టంగా వ్రాసినారు. వాస్తవానికి "ఋ" కారానికి ఈనాడు ప్రత్యేక లిపి ఉన్నట్లుగా ప్రాచీన కాలంలో ప్రత్యేక లిపి లేనే లేదు. ఎక్కడైనా "ఋ" కారాన్ని వాడవలసి వచ్చినా "ఇత్వ రేఫ"నే వాడేవారు.

"............ప్రొత్వ ప్రత్వ వినయాను ప్రమిడాయ- IV 683-1142 సం॥

రామకృష్ణశాస్త్రిగారు "అప్పకవీయ వివరణము" 15 వ పుటలో ఈ క్రింది విధంగా వ్రాయడం సమంజసంగాను, వ్యవహారానుకూలంగాను లేదు.

"సంస్కృత వ్యాకరణంలో "ఋ" వర్ణంలో రెండు రేఫలున్నా మధ్య అచ్భాగమున్నా, ఉన్నదని ప్రతిపాదించబడుట ననుసరించియు, "ఋ" అను విశిష్ట వర్ణము కేవల "ఋ" వర్ణమున్న సంయుక్త వర్ణతుల్యమే గావునను సంయుక్త వర్ణములలో ఏహల్లైననేని ఒక్క దానికి పూర్వాక్షరము మైత్రి కుదిరినచో యతికి పనికివచ్చును అను నియమముండుటచేతను........."

ఇందులో మా గురువులు కేవల "ఋ" వర్ణంకూడా సంయుక్త వర్ణతుల్యమే అని వ్రాయడం సమంజసంగా లేదు. "ఋ" కారంలో రెండు రేఫలున్నాయని భట్టోజీ దీక్షితులు చెప్పిన వాక్యాన్ని పురస్కరించుకొని మా గురువులు ఈ వాక్యం వ్రాసి వుంటారు. చాలా కాలంగా "ఋ" కారానికి 'ర' కారంగానో లేదా 'రు' కారంగానో వ్యవహారమున్నది గాని రెండు

..........గుణాలంక్రిత............నెల్లూరు శాసనాలు వా II పుట. 966.

..........ప్రిధివి..........అహదనకర శాసనము. ‡

పై శాసన వాక్యాలలో "భృత్య-కృత్య-మృడాయ-గుణాలంకృత-పృథివి" అనే పదాలు "భ్రిత్య-క్రిత్య-మ్రిడాయ-గుణాలంక్రిత-ప్రిధివి" అని "రి" కారాలు కలవిగా వ్రాయబడ్డాయి. దీన్నిబట్టి ప్రాచీన కాలంలో "ఋ" కారాన్ని "ఇత్వరేఫ"గా ఉచ్చరించేవారనడం సుస్పష్టం. "ఋ" కారానికి "రి" కార ఉచ్చారణ ప్రాచీన కాలంలో సైతం ఉన్నది కాబట్టే "గృష్టి-గృహము-దృష్టి"-మొదలైన పదాలనుండి "గిడ్డి-గీము-దిష్టి" మొదలైన పదాలు జనించడం సంభవించింది. తద్భవ రూపంలో రేఫకు లోపం కలిగి దాని మీద ఉండే "ఇ" కార స్వరం మాత్రం మిగిలిందన్న మాట. "ఋ" కారానికున్న ఈ "రి" కారోచ్చారణను పురస్కరించుకొని నన్నయకు పూర్వకాలంలో "రిపుబలంబులఁ జెండాడె ప్రిధివి వణక" అని యథాప్రకారంగా తమకున్న అలవాటును బట్టి "పృధివి" లో

రేఫల వ్యవహారం కానరావడం లేదు; అటువంటప్పుడు కేవల 'ఋ' వర్ణం-అంటే-ఋషి-ఇత్యాదులలోని"ఋ"వర్ణం పూర్వకాల వ్యవహారాన్నిబట్టి"రి" కారంగానూ, నేటి వ్యవహారాన్ని బట్టి "రు" కారంగాను ఉన్నందున, ఏక రేఫోచ్చారణ మాత్రమేకల దీన్ని సంయుక్తవర్ణమనడం సమంజస మెలా అవుతుంది?

‡ "ఋ" కారానికి మారు "రి" కారాన్ని వ్యవహరించడమనేది నన్నయ కాలంలోనూ, అతనికి పూర్వంకూడా ప్రతి శాసనంలోనూ కనబడుతుంది. పై యుదాహరణలు ఊరికే మచ్చు కొరకు ఇవ్వ బడ్డాయి.

ఉన్న "పృ" కారాన్ని "ప్రి" కారంగానే (ఇత్వ రేఫగల పకారంగానే) భావించి "రిపు" శబ్దంలో ఉన్న "రి" కారానికీ, తమ వ్యవహారంలో ఉన్న "ప్రిథివి" శబ్దంలోని "రి" కారానికీ (అవి రెండూ ఏకాక్షరాలుగా ఉండడంచేత) యతిమైత్రి చెల్లినట్లుగా భావించేవారు. ఇటువంటి కొన్ని విషయాలలో కవితా సామ్రాజ్యంలో ఉన్నత స్థానాన్ని అందుకున్న నన్నయకు పూర్వులు కొందరు కొంత సవరణ ప్రవేశ పెట్టారు. "రిపుబలంబులఁ జెండాడ ప్రిథివి వణక" అని సహజమైన "రి" కారాన్ని "ఋ"కార స్థానంలో వ్యవహారవశాత్తు వచ్చిన "రి" కారాన్ని ప్రయోగించి యతి సరిపెట్టుకుంటున్న ఇటువంటి ప్రయోగాలను "రిపుబలంబులఁ జెండాడ పృథివి వణక" అనే రీతిగా సవరించి "ఋ" కారానికీ "రి" కారానికీ యతి మైత్రి చెల్లుతుందని సవరించుకున్నారు. ఈ సవరణ కేవలం నన్నయామాత్రమే చేశారనడానికి ఆస్కారం లేదు. ఆతనికి పూర్వులైన కొందరు పండిత కవులెవరైనా చేసి ఉండవచ్చు. † మొట్టమొదట "ప్రిథివి" ఇత్యాదులలోని "రి" కారానికీ, "రిపులు" ఇత్యాదులలోని "రి" కారానికీ చెల్లిన యతి మైత్రి "పృథివి .....రిపులు" అని "ఋ-రి" ల యతి మైత్రిగా సవరించు

---

† ఈ సవరణ నన్నయకు పూర్వకాలంలోనే జరుగక పోతే క్రీ.శ. 1100 ప్రాంతంలో రచింపబడిన కవిజనాశ్రయంలో

క॥ "అ, ఆ, ఐ, ఔ లకు మరి
ఇ, ఈ, లు ఋకార సహిత మే ఏలకునా
ఉ, ఊల్ తమలో నొడఁబడి
ఒ, ఓ లకు వళ్లగు న్నయోన్నతచరితా!"

కొన్న తర్వాత సహజ "ఠ" కారంలోని "ఇ" కార ప్రాధాన్యం వల్లా, యతిమైత్రిలో స్వరమిత్రత్వం అత్యంత ముఖ్యమవడం వల్లా "ఋ" కారానికి వ్యవహారంలో సహజంగా సంక్రమించిన "ఇ" కార ఉచ్చారణను పురస్కరించుకొని (ఋకారంలో రేఫ ఉచ్చారణ సహజంగానే ఉన్నది. ఈ విషయాన్ని సంస్కృతాంధ్ర వ్యాకరణ కర్తలుకూడా అంగీకరించారు.) "ఇ, ఈ" లకు, "ఋ" కారానికీ యతి మైత్రిని పాటించారు. స్వరముల యొక్క (అచ్చుల) ఉత్పత్తినిబట్టి "ఇ, ఈ" లలో నుంచి "ఎ, ఏ" లు పుట్టినవని స్వర చరిత్రజ్ఞుల అభిప్రాయం. "ఇ" కార జన్యాలైన "ఎ" కారాలకూ, యీ "ఇ" కారానికీ ఉన్న జన్య జనక భావాన్ని బట్టి "ఋ" కారానికీ "ఇ" కారానికీ ఉన్న మిత్రత్వంలో "ఎ" కారంకూడా భాగం సంపాదించింది. ఆకారణం చేతనే "ఋ" కారానికి "ఇ, ఈ" లతో పాటు "ఎ, ఏ" లకు కూడా యతి మైత్రి రావడం సంభవించింది.

నన్నయాదులచే వ్యవహరింపబడి, ప్రామాణికత్వాన్ని పొంది ప్రాచీన ఛందో గ్రంథ కర్తలచేత లక్షణాలు పేర్కొనబడ్డ "ఋ"_"ఠ" ల యతి మైత్రి జన వ్యవహార సిద్ధమే కాని వేరు కాదు.

అనే పద్యంలో "ఇ, ఈ, ఎ, ఏ" లకు "ఋ" కారానికి యతి మైత్రి చెప్పడం సాధ్యం కాదు. ఈ కవిజనాశ్రయ కాలంనాటికే కవి పండితలోకంలో "ఋ" కారం "ఠ" కారం కాదనే భావం ఏర్పడి ఉన్నది. కాబట్టే పై పద్యాన్ని కవిజనాశ్రయకర్త రచించడానికి ఆస్కారం లభించింది. దీన్ని గురించిన వివరం "ఋ వడి" పరిణామాన్ని చెప్పేటప్పుడు తెలుస్తుంది.

సంస్కృతంలోకూడా "ధృ-కృ-మృ" మొదలైన క్రియలు అవస్థాంతరంలో "ధృయతే-కృయతే-మృయతే" అని వ్యవహారింపబడడానికి మారు "ధ్రియతే - క్రియతే - మ్రియతే" అని వ్యవహారింపబడి పాణిన్యాదులచేత "ధ్రియతే" వంటి రూపాలే ప్రామాణికాలుగా అంగీకరింప బడడంచూస్తే అత్యంత ప్రాచీన కాలంలో సైతం (పాణినికి పూర్వకాలంలో కూడా) "ఋ" కారానికి "రి" కారోచ్చారణ ఉన్నదనే స్పష్ట పడుతున్నది. "ఋ" కారానికి "రి" కారవ్యవహారం ప్రమాణి కత్వాన్నికూడా పొందబట్టే "రీజ్ శయగ్లిఙ్క్షు" ఇత్యాది సూత్ర ప్రకారం "ఋ" కారం "రి" కారంగా మారుతుందని సంస్కృత వ్యాకరణ కర్తలు సిద్ధాంతీకరించుకున్నారు. దీన్ని బట్టి "ఋ" కారానికి "రి" కారోచ్చారణ అనేది పాణినికి పూర్వకాలంలోనే ఏర్పడిందని స్పష్టంగా చెప్పవచ్చు.

"ఋ" కారానికి మారు "రి" కారాన్ని ఉచ్చరించడ మనేది అత్యంత ప్రాచీన కాలంనుంచీ అలవాటుగా వస్తున్న ప్పటికీ "నన్నయ" కాలం నాటికే "రి" కా రోచ్చారణ భ్రష్టమై "ఋ" కార స్థానంలో "రు" కారం వ్రాయడం సంభవించింది. "ఋ" కారాన్ని వ్యవహారవశాత్తు నన్నయ కాలంలో కొందరు "రు" కారంగా వ్యవహరిస్తున్నప్పటికీ ఈ "రు" కార వ్యవ హారం ఆనాటికి అతి నవ్యమైనది అవడంచేతా, "ఋ" కార స్థానంలో "రి" కారాన్ని వ్యవహరించడ మనేది అత్యంత ప్రాచీన మైనది అవడంచేతా, ఈ ప్రాచీన రూపాన్నే శాస నాల్లో అందరగా వ్యవహరించే వారు. "ఋ" కారంగల పదా

లను "రి" కారంగల పదాలుగా వ్యవహరించడ మనేది మన కీనాడు ఎంతో కటువుగా కనబడుతుంది. "పృథివి-కృతి" మొదలైన పదాలను "ప్రిథివి-క్రితి" అని ఉచ్చరించాలంటే మనం ఎంతో బాధపడతాం. అలా ఉచ్చరించే వారిని చూచి "ఎందుకొచ్చిన చావు" అని అపహాస్యం చేసేవాళ్లుకూడా మనలో లేకపోలేదు. "ఋ" కారానికి "రి" కారోచ్చారణ వ్యవహారంలో నన్నయకాలంలోనే భ్రష్టమైనప్పటికీ, నన్నయకు చాలా కాలం తర్వాతకూడా ఉచ్చారణలో లేక పోయినా "ఋ" కార స్థానంలో "రి" కారాన్నే పండిత కవులు వ్రాస్తూండే వారు. "ఋ" కార స్థానంలో "రి" కారం వ్రాస్తున్నప్పటికీ అది వాస్తవానికి "రి" కారం కాదనీ "ఋ" కారమేననే సంగతి పండిత కవుల దృక్పథంలో మెలుగుతూనేవుండేది. కాబట్టే చాలా మంది ఈ విషయంలో సహజమైన "రి" కారమేదో, అసహజమైన "రి" కారమేదో-అంటే-"ఋ" కార స్థానంలో వచ్చిన "రి" కారం యేదో గుర్తు పట్టుకొని వ్యవహరిస్తూ వుండే వారు. కొందరు మాత్రం "పృథివి" మొదలైన "ఋ" కారం గల పదాలను "ప్రిథివి" మొదలైనవిగా (ఇత్వ రేఫకలవిగా) వ్యవహారవశాత్తూ వ్రాస్తూ వున్నామన్న సంగతి మరిచిపోయి అవి సహజ "రి" కారాలు కావన్న సంగతి (తెలియక కాదు) గమనింపక తప్పటడుగులు వేశారు. ఆ విధంగా తప్పటడుగులు వేసిన వారిలో ఉద్దండశక్తిమంతుడూ, మహాకవీ అయిన "రామరాజభూషణు"ని ఈర్ష్యతో తిరస్కరించిన "కాకనూరి అప్పకవి"కి ప్రామాణికుడైన "చిత్రకవి పెద్దన" ఒకడు. ఈ

"చిత్రకవి పెద్దన" బోడలకు (ఇకారాలకు) లక్ష్యంగా ఈ క్రింది పద్యాన్ని రచించాడు.

క॥ "క్షితి ధ్రితి నిఘని నిలిపితివి
స్థితి నిక్కి గవికి నిగిడితి శిఖిజిగి నిష్ఠిం
గ్రితి ద్వి డ్విధి విగవి విడిచి
క్రితిని వినిర్మింపితి సితి ఘ్రిణికి గిరి గ్రీహా.

(ల. సా. సం. 3 ఆ. 125 ప)

ఈ పద్యంలో ఉన్న "ధ్రితి–క్రితి–ఘ్రిణి–గ్రీహా" అనే నాలుగు పదాలనూ "ధృతి–కృతి–ఘృణి–గృహీ" అని సవరించి లక్షణసార సంగ్రహముద్రాపకులు (ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారు) ముద్రించారు. కాని ఇది పొరపాటు. పెద్దన "ఇ" కార స్వరం గల పదాలను ఆ పద్యంలో ఉదాహరించాడు. ఈ "ఇ" కారాలు గల పదాలను ఉదహరిస్తూ "ధృతి–కృతి–ఘృణి–గృహీ" అనే పదాలను "ధ్రితి–క్రితి–ఘ్రిణి–గ్రీహా" అని "ఇ" త్వ రేఫ కలవిగా వ్రాసికొనే అలవాటు కొందరితో పాటు తనకుకూడా ఉంది కాబట్టి అందులో ఉన్నది సహజమైన "రి" కారం కాదనీ, అది వ్యవహారవశాత్తూ "ఋ" కార స్థానంలో వచ్చిన "రి" కారమనీ గుర్తింపక సహజ "రి" కారాలని భావించి అలవాటు ప్రకారం "ఇ" త్వ రేఫ కలవిగా ప్రయోగించాడు. పెద్దన "ధ్రితి–క్రితి–ఘ్రిణి–గ్రీహా" అని "ఇ" త్వ రేఫను చేతులారా వ్రాసి వాటిలో "ఇ" కారం వున్నదని స్పష్టంగా చెబుతూవుంటే ముద్రాపకులు ఆ "ఇ" త్వ రేఫలుకల వాటిని "ఋ" కారం కలవిగా ముద్రించడం సమంజసంగా లేదు. వాస్తవానికి "ధృతి–

కృతి-ఘృణి-గృహీ" అనే వాటిలో వున్నది "ఋ" కారమేకాని "ఇ" త్వ రేఫకాదు. "ఋ" కారంగల వీటిని "ఇ" త్వ రేఫకలవిగా పెద్దన ప్రయోగించాడే! అది పొరపాటు కాదా? అనే సంగతి వేరు. అతని పొరపాటు పొరపాటే! "ఇ" కార రేఫలు బుద్ధి పూర్వకంగా వ్రాసి, ఈ పదాలలో "ఇ" కారం వున్నది అని స్పష్టంగా అతడు ఉదాహరిస్తూవుంటే ఎందు కొఱకు లక్ష్యంగా ఇచ్చాడో గమనించకుండా, లక్ష్యవిరుద్ధంగా దిద్ది, లక్ష్యంలో ఉంచడం సమంజసం కాదు. తలకట్లకూ (అకారం కలవాటికీ) కొమ్ములకు (ఉకారం కలవాటికీ) అని ఈ క్రింది పద్యాలు రెండూ పెద్దన ఉదాహరించాడు.

క॥ "ఘన శర శశధర భశర
ఘ్న దళశతనయన హయ మదనహర నర నం
దన కనకవసన దరచం
దన సమమమరఁగఁ బవన తనయా యశమరయాన్.

(ల. సా. సం. 3 ఆ. 124 ప.)

క॥ నుతులు నుడువుదురు గుణాు గురు
సుతు గురుభుజు గుణ్యు ముఖ్యు సుఘులున్ బుఘులున్
శ్రుతులును సుముఖులు మునులును
గుతుకులు గురువులును గుణులు గురుతు లునుపుచున్"

(ల. సా. సం. 3 ఆ. 126 ప.)

ఈ రెండు పద్యాలకూ మధ్య "ఇ" కారాలకు ఉదాహరణగా యిచ్చిన "క్షితి, ధ్రితి" ఇత్యాది పద్యం వున్నది. అకారాదుల కుదాహరణగా యిచ్చిన "ఘనశర" ఇత్యాది పద్యంలో ప్రతి అక్షరం మీాద "అ"కారం ఉన్నట్లే,

"ఉ" కారానికి ఉదాహరణగా యిచ్చిన "నుతులు" ఇత్యాది పద్యంలో ప్రతి అక్షరం మీాదా "ఉ" కారం ఉన్నట్లే, "ఇ" కారాలకు ఉదాహరణగా యిచ్చిన "క్షితి" ఇత్యాది పద్యంలో ప్రతి అక్షరం మీాదా "ఇ" కారం వుండితీరాలి. కాబట్టే "ధ్రి-క్రి-ఘ్రి-గ్రి" అనే "ఇ" త్వ రేఫగల అక్షరాలనే పెద్దన ప్రయోగించాడనీ "ధృ-కృ-ఘృ-గృ" అని వట్రువసుడిగల అక్షరాలను ప్రయోగింప లేదనీ తేటతెల్లమవుతున్నది. ఏది యెట్లున్నప్పటికీ పెద్దన "ఋ" కార స్థానంలో "ఇ" త్వ రేఫను వ్యవహరించడమే మనకు ముఖ్యం.

ఈ "ధృతి" మొదలైన పదాలను "ధ్రితి" మొదలైనవిగా, "ఇ" త్వ రేఫ కలవిగా ఉచ్చరించడమనేది నన్నయ కాలంలోనే సగానికి సగం భ్రష్టమై క్రమ క్రమంగా సంపూర్ణంగా భ్రష్టమై పోయిందని చెప్పవచ్చు. "ఋ" కారానికి మారు "రి" కారాన్ని ఉచ్చరించడమనేది ఇతర పదాలన్నింటిలోనూ సంపూర్ణంగా భ్రష్టమైనప్పటికీ ఒక్క "కృష్ణ" శబ్దంలో మాత్రం యీా నాటికీ "క్రిష్ణ" అని "ఇ" త్వ రేఫోచ్చారణ నిలబడి ఉన్నది. అయితే క్రమంగా ఈ "క్రిష్ణ" శబ్దంలోని "రి" కారంకూడా వ్యవహారంలోనుంచి యితర పదాల్లోవలెనే తొలగిపోతున్నదనే చెప్పవచ్చు. ఇప్పుడు దేశంలోవున్న వ్యవహారాన్నిబట్టి "కృష్ణ" శబ్దానికి "క్రిష్ణ" అని "ఇ" త్వ రేఫకలదిగానూ, "క్రుష్ణ" అని "ఉ" త్వ రేఫ కలదిగానూ, రెండు విధాలా వ్యవహారం ఉన్నదనే చెప్పాలి. కాని యిప్పుడు "క్రిష్ణ" శబ్దం కంటె "క్రుష్ణ" శబ్దాన్నే అత్యధిక సంఖ్యాకులు వ్యవహరిస్తు

న్నారు. మరికొంత కాలానికి "క్రిష్ణ"శబ్దానికున్న ఈ కొంచె పాటి వ్యవహారంకూడా వుండదని నిస్సంశయంగా చెప్పవచ్చు.

"ఋ" కారానికీ "ర" కారవ్యంజనానికీ స్థానం మూర్ధం. "ఇ" కారానికి స్థానం తాలువు-"ఉ" కారానికి స్థానం ఓష్ఠం-తాలవ్యమైన "ఇ"కారాన్నీ, మూర్ధన్యమైన "ర" కారాన్నీ కలిపి-అంటే-"రి" కారాన్ని, ఉచ్చరించడం కంటే ఓష్ఠస్థానికమైన "ఋ" కారాన్నీ, మూర్ధ స్థానికమైన "ర" కారాన్నీ కలిపి అంటే "రు" కారాన్ని ఉచ్చరించడం తేలిక - "ఇ" కారాన్ని ఉచ్చరించడంలో తాలుస్థానాలు కొద్దిగా దూరమవుతాయి-అంటే-"ఇ" కారాన్ని ఉచ్చరించేటప్పుడు వామ భాగంలో వున్న తాలువు మరికొంత వామ భాగానికి, దక్షిణ భాగంలో వున్న తాలువు మరికొంత దక్షిణ భాగానికి జరుగుతాయి. ఇంక "ఉ" కారాన్ని ఉచ్చరించడంలో ఓష్ఠ స్థానాలు - అనగా-అధరోష్ఠం-ఊర్ధ్వోష్ఠం రెండూకూడా కొద్దిగా ముందుకు జరిగి అంతకు పూర్వంకంటె మరికొంత సన్నిహితత్వాన్ని పొందుతాయి - పరస్పరం కొంత దూరంగా పోయే స్థానంకల "ఇ" కారం వున్న రేఫను ఉచ్చరించేకంటె కొంత సన్నిహితత్వాన్ని పొందే స్థానంకల "ఉ" కారంవున్న రేఫను ఉచ్చరించడం సులభం-సుఖంకూడా-ఈ సులభాపేక్షతోనే "ఋ" కార స్థానంలో వ్యవహరిస్తున్న "రి" కారాన్ని మానవుడు చల్లగా జారవిడచి, దానికంటె సులభంగా వుచ్చరించగల "రు"కారాన్ని దాని స్థానంలో ప్రవేశ పెట్టడానికి మొదలు పెట్టాడు-ఆ కారణం చేతనే "రి" కారంగా మారిన "ఋ" కారం "రు" కారంగా మారడం ప్రారంభించింది.

“ఋ” కారాన్ని “రి” కారంగా ఉచ్చరించి నప్పుడు సహజమైన “రి” కారమేదో అసహజమైన “రి” కారమేదో గుర్తు పెట్టుకొని వ్యవహరించవలసి వచ్చినప్పుడు వచ్చిన బాధవంటిదే “ఋ” కారాన్ని “రు” కారంగా ఉచ్చరించినప్పుడుకూడా సహజమైన “రు” కారమేదో అసహజమైన “రు” కారమేదో గుర్తుంచుకొనవలసిన బాధ సంభవించింది.

“ఋ” కార స్థానంలో “రి” కారోచ్చారణ భ్రష్టమై “రు” కారోచ్చారణ ఏర్పడడంచేత ప్రాచీన కాలంలో కవి పండితులు సైతం ఉచ్చారణ ప్రకారం “ఋ” కార స్థానంలో “రు” కారాన్ని విలిఖిస్తూ వుండే వారు. ఆకారణం చేతనే ఈ క్రింది ప్రయోగాల్లో “ఋ” కారం ఉత్వ రేఫగా (“రు” కారంగా) వ్యవహరింపబడి యతి స్థానాల్లో బిగింపబడింది.

“రురు వర్ణ దేహంబు (ఋ) రుగ్వేదమునకు”—

(పండి-చ-వాదప్ర-523 పుట)

సీ॥ అతఁడు సరస్వతి నవగాహనము చేయు
చుండి యా చేరువ నోర్తు తడుపు
గట్టక నీళ్లాడఁగాఁ జూడఁ దనదు శు
క్లము నిర్గమించిన ఘటు సురక్షి
తము సేయ సప్తభేదము లొంది యది సప్త †
(ఋ) రుషులైరి వారు మరుద్గణంబు
నకు సంజననకారణంబైరి విను ముక్క
నాఁ డత్తపస్వి వ్రేల్నాటి దర్భ

(భార-శల్య-2 ఆ- 160 ప.)

† ఇక్కడ “సత్పురుషులు” అని ముద్రాపకులు సంస్కరించారు- అది మూలార్థానికి విరుద్ధం.

మ॥ (ఋ) రుతు సంవత్సర మాస పక్ష జనితా రూఢాయ...

(వీరభ-వి-3 ఆ-169 ప.)

అని యీ ప్రయోగాల్లో "ఋ" కార స్థానంలో "రు" కారాన్ని వినియోగించారు. "ఋ" కారం వ్యంజనంతో మేళనమైనప్పుడు వట్రువసుడి (ృ) గా మారుతుంది. ఈ వట్రువసుడి కూడా "ఋ" కారమే కాబట్టి దీని స్థానంలో మాత్రం ఉత్వ రేఫ వచ్చి అసంయుక్తమైన ఆ అక్షరం సంయుక్తంగా మారిపోతుంది. ఈ విధంగా "ఋ" కారంగల హల్లులను "రు" కారం కలవిగా–అంటే–సంయుక్తాలుగా కొందరు కవులు యతిస్థానాల్లో యీ క్రింది ప్రయోగాల్లో ఉపయోగించారు.

క్రూరాస్త్ర చంద్రార్ధ-(కృ) క్రుత్తిఁ బొ గాహుల్లై

(భాస్క-రా-యు-కాం-1456)

కోని యల్లన కాలనేమి (గృ) గ్రుహమున కరిగన్—

(భాస్క-రా-యు-కాం-1617)

సురసది విమలం దడయు (శృం) శ్రుంగములన్

(భాస్క-రా-యు-కాం-2527)

(మృ) మ్రుగనాభి జలములు ముంగిళ్లఁ జల్లి

(వీరభ-వి-3 ఆ. 239 ప)

చు॥ (పృ) ప్రుష్ఠతులం ద్రోతుడు కాలచక్ర మహా
తాస్త్రుండట్లు (భాగ-దశ-ఉత్త-1334)

(తృ) త్రుణ కణాంశంబు వజ్రమై త్రుంచునట్లు

(వాసిష్ఠ-రా-ఆ-3-230)

క॥ (గృ) స్త్రీత్వమును వెలింగి తోంచుచుండు-
(వాసిష్ఠ-రా-3 ఆ-12)

(గృ) గ్రుహాధర్మ నిరతులు కొనివచ్చి భక్తి పూర్వ
కముగా............ (భోజరా-ఆ-3-ప-27)

(సృ) స్రుప్పునిలో నొండు రెండునుగాఁగఁ జెప్పి
(నవనా-చ-1-ఆ-41 పుట)

నొడరి నొప్పఁగఁదోగి (ధృ) ధ్రుతి దుప్పఁదూలి-
(నవనా-చ-2-ఆ-57 పుట)

(శృ) శ్రుణ్వాసక్త్రొటంచుఁ బరిశుద్ధాలఁ జేసెద రాష్ట్ర
కోటులన్ (కాళిందీ పరిణయం† -1 ఆ-33 ప)

ఈపై ప్రయోగాలన్నింటిలోనూ ప్రాచీన కవులు వట్రు
సుడి స్థానంలో ఉత్వరేఫను (రుకారాన్ని) వ్రాసికొన్నార
నడం నిర్వివాదం-కాని యీ ప్రయోగాలకు గ్రాంధికత్వం సంపా
దించడానికిగాను వాటిల్లోవున్న ఉత్వరేఫలను (వ్యవహారవశాత్తు
ఋకార స్థానంలో వచ్చిన వాటిని) ఋకారాలుగా మార్చివేసి
ఋకారానికి రికారానికి యతి చెల్లినట్లు ఋకారానికి రుకారా
నికి యతి చెల్లిందని కొందరు భావించారు. కాని "ఋ-రు"
ల యతిని యే * ఛందోగ్రంథకర్తాకూడా చెప్పని కారణంచేత అవి
"ఋ-రు" యతులుకావని సహజ "ఋ" కారానికీ, వ్యవహార

---

† కర్త - వేమరి సుందర రేమగిరిరాయకవి - దీని వ్రాతప్రతి నా వద్ద
వున్నది - ఇది అముద్రితం.

* "(గృ) గ్రుహాధర్మ నిరతులు కొనివచ్చి" అని ప్రయోగించిన

వశాత్తు ఋకార స్థానంలో వచ్చిన "రు" కారానికీ, వుపయో
గింపబడిన యతులని గ్రహించవలసి వుంటుంది.

అనంతుడు తన ఛందో దర్పణంలో "ఋ-రు" వడిని వచించాడని కొంద రంటారు-ఛందోదర్పణ ద్వితీయ ముద్రణ పీఠికలో ఈ క్రింది విధంగావున్నది.

—" ఋ-రు యతి - ౠ - లు యతి "—

అనంతు డీయతిని స్పష్టముగా నీ క్రింది పద్యములలో నాదేశించి యున్నాడు.

క॥ విలస ద్రుకారమును వ
ట్రులు విరమణమొందు శౌరి ఋషులకు శశ్వ
త్సులభుఁడనఁగ నీ యేలకు
తలపఁగ రీ తోడి విరతి తలకొన దెందున్ — 87

గీ॥ మును ఋకార మీ యేలతో నొనరినట్లు
చేర దొకట యణాదేశ కారణమున
ఘన లకారంబయగు స్వరల్గార విరతి
కౢప్తి లేదు శౌరి గుణావళుల కనఁగ — 89

కాని అప్పకవి యీ యతులను సంగ్రహింపక పోవుటచేతను ఋకా రమునకు, ఇ, ఈ, ఎ, ఏలతోడను రి, రే లతోడనే యతుల నాతడు మాపుట చేతను నీ యనంతుని ఛందోదర్పణములోని పై పద్యము లిట్లు మార్పు గావిం పబడినవి.

"విలస దృకారమును మఱి
రి ల లి విరమ మొందు శౌరి ఋషులకు"

అనియు,

"కౢప్తి లేదు శౌరి గుణావళికి ననఁగ"

అనియు, నప్పకవీయానుగుణముగా మార్పు చేయబడినవి.

"విలస ద్రికారమును వ
ట్రిల విరమణ మొందు శౌరి ఋషులకు"— (పూ-ము)

అప్పకవీయములో లేనిదెల్ల తప్పుగానే భావించి, ప్రాచీన గ్రంథముల లోని పాఠములుగూడ మార్పు చేయబడినవి-కాని యట్లు మార్పు చేయబడి నను, పెక్కుచోట్ల వాఙ్మయమున నిట్టి యతులు వెలయుచుండుటచేత నిది యప్పకవీయ ప్రభావమే యనియు, వతని గ్రంథమువలన ప్రాచీనభాషాచ్ఛంద స్సాంప్రదాయములు మఱుగుపడినవనియు నీక్రింది వివరణమును బట్టి గ్రహింపనగును.

కొన్ని యనంతుని ఛందస్సు వ్రాత ప్రతులలో నిట్టి పాఠము లున్నను నీపద్యములు రెండును లింగమగుంట తిమ్మన తన సులక్షణసారములో గ్రహిం చియే యుండుటచేత నందు సరియగు ననంతకవి పాఠములు గన్పట్టుచున్నవి.

" విలస ద్రికారమును వ
ట్రులు విరమణమొందు శౌరి ఋషులకు "

(సులక్షణసారము 1862 లో ముద్రితము)

కాని తరువాత నప్పకవీయము ననుసరించి సులక్షణసారములోకూడ పాఠములు మార్పు చెందినవి. అనంతుడు ఋ-రు యతిని తానాదేశించుటయే గాక తన భోజరాజీయమునందే వాడి యున్నాడు''—

ఈపైభాగంలో అనంతుడు ఋ-రు వడినే పేర్కొన్నాడనీ ఋ-రి వడిని పేర్కొనలేదనీ చెప్పబడింది-దాని సత్యాసత్యాలను పరిశీలించి తెలుసు కుందాము.

పైనున్న అనంతుని పద్యాలనే పరికిస్తే ఆతడు చెప్పింది ఋ-రి వడి మాత్రమేనని ఋ-రు వడి కాదని స్పష్టపడు తున్నది. " విలసద్రికారము " అనే పాఠం వుండాలా ? " విలసద్రుకారము " అనే పాఠం వుండాలా ? అనే సమస్య తేలాలంటే ఆ పద్యాన్ని అందులోను ముఖ్యంగా దాని ఉత్త రార్ధాన్ని చూస్తే తేలుతుంది.—''ఈ యేలకు దలపఁగ రీతోడి విరతి తలకొన దెందున్''—అనే వాక్యంచేత అనంతుడు " ఈ, ఏ '' లకు "రి" కారంతో యతి చెల్లదని నిషేధించాడు-ఈ నిషేధాన్ని అనంతుడు ఎందుకు చెప్పాలి? పూర్వార్థంలో ఋ-రు లకే వడి చెప్పివుంటే సంబంధ రహితంగా ఉత్తరా ర్థంలో ఈ, ఏ లకు "రి" కారానికి యతి చెల్లదని చెప్పడంలో అర్థమేమిటి ?

అనే ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలంటే అనంతుడు ఋ-రి వడినే చెప్పినట్లు తెలుస్తుంది. పూర్వార్థంలో "విలసద్రికారమును, వట్రిల విరమణ మొందు శౌరి ఋషులకు" అని ఋ-రి లకు యతి చెల్లుతుందని వాకొన్నాడు కాబట్టే ఋకారానికి మిత్రాలైన ఈ, ఏ లతోగూడా "రి" కారం యతిమైత్రి చెల్లుతుందా? అని ఆశంకరాగా ఆ ఆశంకను నివారించడానికి గాను— "ఈ, ఏ లకుఁ దలఁపఁగ రితోడి విరతి తలకొన దెందున్"-అని స్పష్టపరిచాడు_దీన్నిబట్టి పై పద్యంలో అనంతుడు చెప్పింది ఋ-రి వడినే గాని ఋ-రు వడిని కాదని తెలుస్తున్నది. కాని ఆ పద్యమే ఋ-రు వడిని ఆదేశించేదే కావాలంటే ఈ క్రింది విధంగా వుండాలి—

విలస ద్రుకారమును వ
ట్రులు విరమణ మొందు శౌరి ఋషులకు శశ్వ
త్సులభుఁ డనఁగ నూ యోలకుఁ
దలపఁగ రూతోడి విరతి తలకొన దెందున్.

ఈ పద్య పూర్వార్థంలో ఋ-రు లకు మైత్రి చెప్పబడింది. అచ్చుల్లో ఉ, ఊ, ఒ, ఓ లకు ఋ-ౠ లకు యతి మైత్రి ముందు అంగీకరిస్తేనేగాని ఋ-రు లకు యతి చెప్పడానికి వీలు పడదు - ఇంతకూ పూర్వార్థంలో ఋ-రు లకు యతి చెప్పడంవల్ల ఋకార మిత్రాలైన ఉ, ఊ, ఒ, ఓ, లకు "రు" కారానికి యతి చెల్లదని నిషేధించినట్లవుతుంది — ఋ-రుల యతి నంగీకరించి యతి చెప్పాలంటే మొట్ట మొదట ఋ కారానికి ఉ, ఊ, ఒ,ఓ లకు యతిమైత్రి నంగీకరించాలి-ఇటువంటి మైత్రిని అనంతుడు తన ఛందంలో చెప్పలేదు.

ఆ॥ వె॥ అగు నకారమునకు నైత్వౌత్వములు వడి
ఈ కి ఋత్వమునకు నేత్వ మమరు
నుత్వమునకు నోత్వ మొనరు నీగతి స్వర
యతులు విస్తరిల్లు నబ్జనాభ!—

(ఛం-ద- 1 ఆ-81 ప.)

ఈ పద్యంలోకూడా ఉ-ఋ ల మైత్రి చెప్పినట్లుగా భావించి దిద్దుకోవాలంటే యీ క్రింది విధంగా ఆ పద్యం వుండాలి—

ఆ। వె॥ అగు నకారమునకు నైత్వౌత్వములు వడి
ఈ కి ఋత్వమునకు నేత్వ మమరు
నుత్వ మోత్వమునకు ఋత్వల్ త్వములకు నొ
ని గతిన్ స్వరయతు లెనరుఁ గృష్ణ !—

కాని ఈ విధంగా వంకా టింకా లేకుండా మనం యెన్ని పద్యాల యినా దిద్దిపెట్టగలం గాని ఆపద్యాలను అనంతుడు వ్రాశాడనడం సంభ వించదు-అనంతుడు ఋ-రు వడి సే పేర్కొన్నాడని చెప్పవలసివస్తే ఆతని పద్యాల్లో మన కవిత్వం కనీసం సగమైనా పెట్టాల్సి వస్తుంది. అందుకే అనంతుడు ఋ-రు వడిని పేర్కొనలేదని భావించడం సమంజసం—

మా గురుదేవులు శ్రీ వేదుల రామశాస్త్రిగారు తమ అప్పకవీయ వివ రణ 17వ పుటలో ఈ ఋ-రు వడిని గురించి చర్చించుతూ— "అనంతుడు రు-ఋ యతిని తానాదేశించుటయే గాక తన భోజరాజీయమందే దానిని వాడి యున్నాడు-అని వ్రాసి మా మిత్రులు "గృహధర్మ నిరతులు కొనివచ్చి" అను పద్య ముదాహరించినారు-రువడి యనగా రు-ఋ లకు మైత్రి కూర్చుట గదా! ఇది రువడి నెట్లు సాధించును? ఇందు రు-ఋ లకు మైత్రి యెచ్చట నున్నది? ఇందు రు వర్ణ మేది? గృ-కొ అను వానికి మాత్రము మైత్రికాన వచ్చుచున్నది."—

అని వ్రాశారు. ఇది సరికాదు-"రురువర్ణ దేహంబు (ఋ) రుగ్వేదము నకు" అనే ప్రయోగంలో "ఋ" కారం "రు" కారంగా వ్యవహరింప బడింది. ఋకారాన్ని రుకారంగా వ్రాయకూడదని "రుగ్వేద" శబ్దాన్ని "ఋగ్వేద" శబ్దంగా దిద్దుకుని ఋ-రు ల మైత్రి నంగీకరించినట్లు కొందరు భావించారు. అదేవిధంగా "గ్రుహధర్మనిరతులు కొనివచ్చి" అన్నప్పుడు "గు-కొ" లకు సంయుక్త యతిని ప్రయోగింపగా ఇక్కడ "గ్రుహ" శబ్దాన్ని "గృహ" శబ్దంగా మార్చుకొని "గృ-కొ" లకు మైత్రి వున్నట్లుగా భావిం చారు-అంటే-యిందులో ఋ కార ఒకారాలకు మైత్రి అంగీకరింపబడిందన్న మాట-ఋకార ఒ కారాలకే యతి మైత్రి అంగీకరింపబడినప్పుడు ఋ కార ఉ కారాలకు ప్రత్యేకంగా (ఋ-రు ల) మైత్రికల ప్రయోగాలే ఉదాహరించ వలసిన పని లేదు.

ఋకారానికి "రు" కారోచ్చారణ నన్నయ కాలంలోనే సంక్రమించింది-ఇది పాల్కురికి సోమన్న కాలానికి మరింత వ్యాపించింది - ఋ కారానికి మారు "రి" కారాన్ని వ్రాయడమనేది నన్నయభట్టు కత్యంత ప్రాచీన కాలంలోనే ఏర్పడి స్థిర

ఈ ఋ-రి వడిగాని ఋ-రు వడిగాని జన వ్యవహారంలో ఉచ్చారణ వల్ల వచ్చినవేనన్న సంగతి గమనింపక మాగురుదేవులు అప్పకవీయ వివరణలో ఈ క్రింది విధంగా వ్రాయడం సమంజసం కాదు—

—"మరి యిట్లు విశేషములు చెప్పవలెనని కుతూహలము గల్గినచో ఎన్నియో కల్పించవచ్చును-మచ్చున కొక్కటి మాత్రము చూపుచున్నాము- అకార సహిత రేఫకున్ను (ర అను దానికిని) ఋ కారముతో రవడిని కల్పించి దాని కాధారముగా

"రణము మీఁదికి లంఘించి పృథుల సైన్య"

(భార-భీష్మ-ఆ 169)

అను పద్య ముదాహరణము చూపవచ్చును — (అప్ప-వివ-పుట 23)

అని వ్రాసి "రణము" అనడానికి మారు "రథము" వుండాలని వ్రాశారు-కాని నావద్ద వున్న భారత ప్రతిలో "రథము" అనే వున్నది గాని "రణము" లేదు—ప్రాచీన కాలంలో ఋ కారానికి "రి" కారోచ్చారణ వున్నది కాబట్టి రి వడి (ఋ-రి ల మైత్రి) సిద్ధించింది. తర్వాత క్రమంగా ఋ కారానికి "రు" కారోచ్చారణ యేర్పడిన కారణంగా రువడి (ఋ-రు ల మైత్రి) సిద్ధించింది. ఏకాలంలోనైనా ఏ ప్రదేశంలోనైనా ఋకారానికి "ర" (అత్వ విశిష్టంగా) కార ఉచ్చారణ ఉంటేనేగాని రవడి (ఋ-ర ల మైత్రి) సిద్ధింపదు-కృష్ణుడు అనడానికి "క్రిష్ణుడు - క్రుష్ణుడు" అని వ్యవహారం వున్నట్లుగా "క్రష్ణుడు" అని అత్వరేఫగల ఉచ్చారణతో వ్యవహారం యెక్కడైనా వున్నదా? ఋ కారానికి అత్వ విశిష్టరేఫోచ్చారణ ఉంటేనే గాని రవడి సంభవించదు—అటువంటి ఉచ్చారణతో వ్యవహారం యే ప్రాంతంలోనూ లేదు - కాబట్టి రవడి కల్పన సమంజసం కానేరదు—

పడిపోయినందువల్ల నన్నయ కాలంలో ఋ కారానికి రు కారో చ్చారణ సంక్రమించి నప్పటికీ వ్రాతలో దాన్ని ఉపయోగించే వారు కాదు-సాంప్రదాయంగా వస్తున్న రి కారాన్నే ఉపయో గించే వారు - కాని నన్నయభట్టు తన భారతంలో ఒక్క చోట మాత్రం ఋ కానికి మారు "రు" కారాన్ని ప్రయోగించాడు.

సీ॥ రంగ దుత్తుంగ తరంగ హస్తంబుల । నాడెడు నదివోలె నతుల వేగ
వాత విధూతమై వఱలెడు నది వోలెఁ । బర్వతకందరోపాంతతతులఁ
దొడరెడు నదివోలె (ధృ) ధ్రుత ఫేనవితతుల ।నగియెడు నదివోలె నాగ నక్ర
మకర కుల క్షుభ్యమాణమై తద్బాధ । కోపని యదివోలె

(భార - ఆరణ్య - 3 ఆ - 38 ప.)

ఈ సీసం మూడవ పాదంలో నన్నయ "ధృత" అని "ఋ" కారాన్ని వినియోగించడానికి మారు "ధ్రుత" అని "రు" కారాన్ని వినియోగించి "దొడరు" లోని "దొ" కారా నికి యతిని సరిపెట్టుకున్నాడు- ఇక్కడ ఈ దొ-ధ్రు (ధృ) లకు యతి వేయబడివుండడం చూచి కొందరు "ధ్రుత" వుండరాదని తలంచి "ధ్రువ" అని దిద్ది క్రింద "ధృత"ను పాఠాంతరంగా చూపించారు. "ధృత" ను "ధ్రుత" గా ప్రయోగించకూడదని యతి కోసమై "ధ్రువ" గా మార్చ గల్గారేగాని ఆ మార్చిన వారు అర్థాన్ని దృష్టిలో పెట్టుకొని మార్చలేక పోయారు.

ధృత=ధరించబడిన, ఫేన = నురుగుల యొక్క, వితతు లన్=సమూహములచేత, నగియెడు=నవ్వుతూ వుండే (తెల్లగా వుండే) నదివోలె=నదిలాగా అనే అర్థంలో నన్నయ చక్కగా "ధృత" శబ్దాన్ని "ధ్రుత" శబ్దంగా వినియోగించినాడు- ఈ అర్థాన్ని గమనింపక "ధ్రుత"ను "ధ్రువ"గా పరిష్కర్తలు

మార్చివేశారు-ధ్రువ=ధ్రువమైన (శాశ్వతమైన) ఫేనతతులు అని పరిష్కర్తల పాఠానికి అర్థం చెప్పుకోవాలి-ఫేనతతులు వున్నప్పుడు నది నవ్వుతున్నట్లుగా తెల్లగా వుంటుంది. ఇది నిజమే-కాని ఆ ఫేనతతులు ధ్రువంగా వుంటేనే నది నవ్వుతున్నట్లుంటుందనడం సమంజసం కాదు- పైపెచ్చు శాశ్వతంగా ఫేనతతులు ఏనదికీ ఎప్పుడూ ఎక్కడావుండవు - నురుగులు వున్నప్పుడు నది నవ్వుతున్నట్లు వుంటుందనడంలోనే సమంజసం వున్నది. కాబట్టి పాఠాంతరంగా పరిష్కర్తలు చూపెట్టిన "ధృత"శబ్దమే నన్నయచేత "ధ్రుత" శబ్దంగా ప్రయుక్తమైనదనీ, "ధ్రువ" శబ్దం పరిష్కర్తలుకొందరు యతికోసమై ప్రవేశపెట్టిన శబ్దమనీ తేలుతున్నది. † నన్నయభట్టు వ్రాసిన సీస పద్యానికి మూలం యిది.

శ్లో॥ తతోఽభ్యగచ్ఛన్ సహితా స్సముద్రం భీమనిస్స్వనమ్
నృత్తంత మివ చోర్మిభి ర్వల్గంత మివ వాయునా ॥
హాసంత మివ ఫేనౌఘైః స్ఖలంతం కందరేషుచ
నానాగ్రాహ సమాకీర్ణం నానాద్విజగణాన్వితమ్ ॥

(భార-అరణ్య-పంచాధికశతతమోధ్యాయః - 22, 23 శ్లో.)

ఇందులో కేవలం "హాసంత మివ ఫేనౌఘైః" అని మాత్రమే వున్నదిగాని ధ్రువ శబ్దం కాని ధ్రువశబ్దార్థకమైన మరొక శబ్దంకాని లేదు- నన్నయ భాగంలో "ధ్రువ" శబ్దాన్ని

---

† ఈ విధంగానే యెఱ్ఱాప్రగడకూడా సీ॥ యవన జీవిత సముద్ధరణ కృతాంతుండు రుక్మిమాన ద్రుమ ధ్రు (ధృ) త పరశువు" (హరి ఉ. భా. ౫ ఆ. 228 ప.) అని ధృత శబ్దాన్ని ఉత్వరేఫ కలదిగా (ధ్రుతగా) ప్రయోగింపగా అర్థాన్ని గమనింపక పరిష్కర్తలు యతి కోసం తప్పొప్పుల పట్టికలో "ధ్రువ"గా మార్చారు-ఈ మార్పు 1926 సం॥ క్రొత్త కూర్పులోనే కాని అంతకు ముందు లేనే లేదు.

యతికోసమై ప్రవేశపెట్టి పరిష్కర్తలు అర్థపుష్టిని తగ్గించారు. ఇంతవరకూ నన్నయ "ధృత" లోని ఋ కారాన్ని "రు" కారంగా వ్యవహరించాడనడం స్పష్టం-నన్నయ భట్టు కాలంలో ఋకార స్థానంలో వ్యవహరింపబడే "రి" కారానికి మారు దాని స్థానంలో "రు" కారం ప్రవేశించి క్రమ క్రమంగా అదే వ్యాపించి అనంతుని కాలానికి-అంటే- క్రీ॥ శ॥ 1435 ప్రాంతానికి విపరీతంగా పండిత కవులచేతకూడా వ్యవహరింప బడుతుండేది – ఋ కార స్థానంలో "రు" కారాన్ని వ్యవహరించడమనేది విపరీతమవడం చేతనే యింక "ఋ"కారం యొక్కడ వ్రాయాలో "రు" కారం యెక్కడ వ్రాయాలో తోచక దాని స్థానంలో దీన్ని దీని స్థానంలో దాన్ని తారుమారుగాకూడా వ్రాస్తూవుండే వారు- అంటే "ధ్రువ" అని "ధ్రు" కారం వ్రాయడానికి "ధృవ" అని "ధృ" కారాన్ని "ధృత" అని "ధృ" కారం వ్రాయడానికి "ధ్రుత" అని "ధ్రు" కారాన్ని వ్యవహరిస్తుండేవా రన్నమాట- అంతే కాదు- గ్రుచ్చు - క్రుమ్మ - మ్రుచ్చు-స్రుక్కు--బ్రుంగు మొదలైన (వట్రువసుడి (ఋకారం) వుండడానికి వీలులేని) తెలుగు పదాల్లోకూడా ఉత్వ రేఫ వ్రాయడానికి మారు వట్రువ సుడిని (ఋకారాన్ని) కూడా వ్రాస్తుండే వారు-అందుకే అనంతుడు తన ఛందోదర్పణంలో

ఆ॥ వె॥ తెలుఁగునందు లేదు లలిఁ గ్రింది సుడి గ్రుచ్చుఁ
గ్రుమ్మె నాఁగ రేఫకొమ్ము గాని
ప్రాస మైత్రి చొరదు దా సంయుతప్రాస
మగును రేఫయుతము ననుసరించి — (1 ఆ - 57 ప.)

తే॥ గీ॥ ఆంధ్రలిపిఁ జొప్పడదు ఋ కారాన్వితంబు
క్రొత్తగాదు కృష్ణుని వెన్న మ్రుచ్చు మనఁగ

స్రుక్కుఁ డతఁ డాజి నెట్టి విరోధినైనఁ
గ్రుమ్మునన రేఫయుత యతి గూడుఁ గాన - (1ఆ - 114 ప.)

అని ఒకసారికి రెండు సార్లు తెలుగులో-అంటే-అచ్చ తెలుగులో ఋకారాన్ని వ్రాయకూడదని, రుకారమే వ్రాయాలని చెప్పుకున్నాడు. అప్పకవి కాలంలోకూడా అచ్చ తెలుగు పదాల్లో రు వర్ణం వ్రాయవలసిన చోట వట్రువసుడి (ఋ కారం) వ్రాస్తూండేవారు-అందుకే అప్పకవి

సీ॥ తే॥ గీ॥ వట్రువులు లేవు తెనుఁగున వాని పగిదిఁ
బలుకు లిపు లెల్లఁ గ్రార కొమ్ములు నిజంబు
దునుము నిందాఁకఁ జైద్యుఁడు ద్రుళ్ళె ననఁగ
రోహిణీభర్త చరమాద్రిఁ గ్రుంకె ననఁగ -
(అప్ప - క - 2 ఆ - 65 వ.)

ఇందులో అప్పకవి త్రుళ్లు-క్రుంకు మొదలైన పదాలను కొందరు పండిత కవులు తృళ్లు-కృంకు అని వట్రువసుడులుగల పదాలుగా వ్రాస్తూవుండే అలవాటు చూచి వాస్తవానికి త్రుళ్లు-క్రుంకు మొదలైన అచ్చ తెలుగు పదాల్లో "ఋ" కారం లేదనీ ఉత్వరేఫే వున్నదని పేర్కొన్నాడు. "ఋ" కారానికి "రు" కారోచ్చారణ రావడంచేత "ఋ" కారమేదో "రు" కారమేదో తెలుసుకోనడం కష్టంగా వుండేది. చివరికి ఋ-రు లకు ఉచ్చారణలో అణుమాత్రమైనా భేదం లేకపోవడం చేత ఉత్వరేఫతో వ్రాయవలసిన తెలుగు పదాల్లోకూడా వట్రువసుడి వ్రాస్తుండేవారు. కాబట్టి అచ్చ తెలుగు పదాల్లో వట్రువసుడి లేదని అప్పకవి అనంతునివలెనే వాకొన్నాడు. అప్పకవి ఈ పద్యం వ్రాయడంలోవున్న అభిప్రాయాన్ని, అవసరాన్ని గుర్తిం

చకుండా కవిరాజు శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి గారు

—"వట్రువులు కొమ్ములైనచో యతిస్థానమున ఇ, ఈ, ఎ, ఏ లతో మైత్రి కలుగునని యెట్లు చెప్పెనో బోధ పడదు. కృష్ణ శబ్దం తెలుగులో వ్రాయవలసివచ్చుచో "క్రుష్ణ" యని వ్రాయు మనుచుండెను. ఇది యెట్టి విపరీతపు మాట!"

(తెనుఁగు వనము † తొలి పలుకులు - 8 పు.)

అని వ్రాయడం సమంజసంగా లేదు. అప్పకవి త్రుళ్లు-క్రుంకు మొదలైన వాటిల్లో వట్రువసుడి వ్రాయకూడదని చెప్పాడేగాని కృష్ణ శబ్దాన్ని క్రుష్ణశబ్దంగా వ్రాయాలని చెప్పలేదు. ఈ పద్య రచనలోవున్న ఆంతర్యం తెలియక శ్రీ చౌదరిగారు అపార్థాన్ని వెల్లడించారు-అప్పకవి

ఆ॥ వె॥ సుడులు తెలుఁగులందుఁ బొడమ వ్రాసెైవడి
ప్రాలు కొమ్ము క్రారవడులు గాన
రేఫయుత సమాఖ్యఁ గృతులఁ బ్రాసములగు
సారిదిఁ దమరుఁ దాము సుడులఁ బాసి—

(అప్ప-క-3 ఆ. 321 ప.)

అని మరొక పద్యంలో మరొకసారి తెలుగు పదాల్లో (ముృచ్చు మొదలైన వాటిల్లో) వట్రువసుడి వ్రాయకూడదని గోల పెట్టాడు-అచ్చ తెలుగులో వట్రువసుడిలేదని యెన్నిసార్లు చెప్పుకున్నప్పటికీ తెలుగు పదాల్లో వట్రువసుడి పండితకవులు వ్రాస్తూనే వుండేవారు – కాబట్టే కవి, పండితుడు, గొప్ప వ్యాకరణవేత్తకూడా అయిన అహోబలుడంతటి వాడు

† కర్త: విద్వాన్, విశ్వసోదర శ్రీ కొసరాజు బసవయ్యగారు

ఉ॥ అంగజు మేల్మిపంగయుగ మాకృతి కేము సమాన వైభవం
బుం గయికొంటిమింక సరిపోలము కాంతి నటంచు నగ్గులం
(బ్రు) బృంగి తపించి తత్తనువు వీడిన నాదొన వీడుగావనన్
సంగతి నయ్యుదూద్వహుని జంఘుల సొంపుఁ దలంప శక్యమే॥

(కాళిందీపరిణయం-1 ఆ. 48పు.)

అనే యీ పద్యంలో "బ్రుంగి" అని ప్రయోగించడానికి మారు "బృంగి" అని ప్రయోగించి గ్రాంథికవాదులు దిద్దడానికైనా అవకాశం లేకుండా యతి స్థానంలో బిగించాడు.

వట్రువసుడి లేని ప్రుచ్చు మొదలైన తెలుగుపదాలలో కూడా ఈవట్రువసుడి ప్రవేశించిందంటే యింక సంస్కృతంలో మాట యేమని చెప్పాలి? సంస్కృత పదాల్లోకూడా ఋకారం వ్రాయవలసిన చోట రుకారం, రుకారం వ్రాయవలసిన చోట ఋకారం యిష్టంవచ్చినట్లు వ్రాయబడుతుండేది — కాబట్టే అప్పకవి

సీ॥ క్రుజ్ క్రుధ క్రూర శిగ్రు శ్రుతి విశ్రుత
శుశ్రూష నిస్స్రుతి స్రుక్ స్రువములు
భ్రూణ భ్రుకుంశ బభ్రు భ్రువాణంబులు
భ్రుకుటిత భ్రూలతా ప్రకటితములు
కద్రువ ద్రుపద ద్రుమ ద్రుహిణ ద్రుహి
సౌరద్రు విద్రుమ శత్రువులును
ధ్రువమును ద్రుతమును భువిఁ గ్రార కొమ్మలై
తనరారఁగాని ఋత్వములు గావు

(అప్ప క. 2 ఆ - 66 ప.)

అని యీ పదాల్లో ఉత్వ రేఫ వ్రాయాలేగాని ఋకారం వ్రాయకూడదని కంఠోక్తిగా చెప్పాడు - ఈ విధంగానే

సీ॥ ఋష్య మూకాద్రియు ఋష్యశృంగుండును
ఋక్షమృగేంద్రుండు ఋక్షపదము
ఋతము ఋత్విక్కు నైరృతి ఋతుషట్కమ్ము
ఋతుపర్ణభూపతి ఋతుమతియును
ఋషభవాహనుఁడును ఋషియు ఋగ్వేదంబు
ఋభురాజు ఋణమును ఋద్ధి ఋజువు
వను నీ పదంబుల కాది వర్ణంబులు
సప్తమ స్వరములై జగతి వెలయుఁ
తే॥ గృష్ణ వృత్తాంతకా హృషీకేశ మదన
జనక పృథ్వీ కుమార భంజన యటంచు
హల్లు లందు వట్రువ లమరియుండు
సంస్కృతంబున యదువంశ సార్వభౌమ !

(అప్ప-క- 2 ఆ. 72 ప.)

అని "ఋష్యమూక"ఇత్యాదుల్లో ఋకారమే వ్రాయాలి గాని రుష్యమూక అని రుకారం వ్రాయఁకూడదనీ, కృష్ణ ఇత్యాదుల్లో వట్రువసుడి వ్రాయాలేకాని క్రుష్ణ అని ఉత్వరేఫ (కొమ్ము, క్రావడి) వ్రాయకూడదనీ పేర్కొన్నాడు. రుకారాలు వ్రాయవలసినచోట ఋకారం వ్రాయకూడదనీ, ఋకారం వ్రాయవలసినచోట రుకారం వ్రాయకూడదనీ యెంతగా పట్టుపట్టి పరిశీలించి యెన్నిసార్లు చెప్పుకున్నా ఉచ్చారణభిన్నత్వం లేని ఈ "ఋ-రు" లను అప్పకవే తారుమారుగా వాడినప్పుడు యితర కవి పండితుల మాట యేం చెప్పాలి? అప్పకవి ధ్రువ శబ్దంలో ఉత్వరేఫే వున్నది గాని వట్రువసుడి లేదని తన అప్ప కవీయం - 2 ఆ - 66 వ పద్యంలో స్పష్టంగా పేర్కొనికూడా ఈ క్రింది పద్యంలో ధ్రువ శబ్దాన్ని "ధృవ" శబ్దంగా (వట్రువ సుడి కలదిగా) యతిస్థానంలో ప్రయోగించాడు.

హారనర్తనము -

దావపావక ఖాది మా । ధవ దాశార్హా । దనుజాంతకా
దేవకీప్రియనందనా । దివిషద్వంద్యా । (ధ్రు) ధ్రువసన్నుతా
భావగోచర విశ్వరూ । ప దగు న్వ్యాసు । వ్వ నవర్తు సం
ఖ్యా విరామము రేఫ స । జ్య భ రేఫంబుల్ । హారనర్తనన్ -

(అప్ప - 4 ఆ)

అంతేకాదు ఈ క్రింది గోమూత్రికాబంధంలో యతి స్థానాల్లో ధృత-ధ్రువ- శబ్దాలను బిగించి "ధృత" గా వాడవలసినదాన్ని "ధ్రుత" గా వాడాడో "ధ్రువ" గా వాడవలసిన దాన్ని "ధృవ" గా వాడాడో అతడేగాని యితరులు చెప్పలేని పరిస్థితిలో ప్రయోగించాడు -

క॥ వితరణ శూర దయార్ణవ
(ధ్రు) ధృత చక్రధర నరసింహ (ధృ) ధ్రువశోధిమహా
వితరణ ధీర నయార్ణవ
జిత నక్ర పరతరగాహ జీవనధి గృహా! -

(అప్ప - 4 ఆ - 385 ప.)

ఈ పద్యంలో "ధృత" శబ్దాన్ని "ధ్రుత" గా (ఉత్వ రేఫ కలదిగా) ప్రయోగించి "ధ్రువ" శబ్దంలోని "ధ్రు" కారానికి "ధ్రుత" లోని "ధ్రు" కారానికి యతి సరిపెట్టుకోనైనా వుండాలి. లేదా "ధృత" శబ్దాన్ని ధృత గానే ప్రయోగించి "ధ్రువ" శబ్దాన్ని "ధృవ" శబ్దంగా (వటువసుడి గలదిగా) ప్రయోగించి "ధృత" లోని "ధృ" కారానికి "ధృవ" లోని "ధృ" కారానికి యతి సరిపెట్టుకొనైనా వుండాలి - వటువసుడి కలదిగానే వ్రాయవలసిన ధృత శబ్దాన్ని "ధ్రుత" శబ్దంగా (రుకారం కలదిగా) నైనా ప్రయోగించి వుండవచ్చు - ఉత్వ రేఫ కలది

గానే వ్రాయవలసిన ధ్రువ శబ్దాన్ని "ధృవ" శబ్దంగా (ఋకారం కలదిగా) నైనా ప్రయోగించి వుండవచ్చు - కాబట్టి యీ పద్యంలో అప్పకవి "ఋ"కారం వాడవలసినచోట "రు"కారాన్ని వాడాడనడానికీ ఆస్కారంవున్నది. "రు" కారం వాడవలసిన చోట "ఋ" కారాన్ని వాడాడనడానికీ ఆస్కారం వున్నది. ఏది యెక్కడ వ్రాయాలో అనే విషయంలో ఎంతో విచక్షణచూపి "రు" కారం కలవాటినీ "ఋ" కారం కలవాటినీ ప్రత్యేకంగా పేర్కొని పద్యాలువ్రాసిన అప్పకవే తప్పటడుగులు వేసినప్పుడు విచక్షణ లేని వాళ్ళ మాట యేమనాలి ?

ఆంధ్ర మహా భాగవతంలో "ద్రుహిణ" అని ఉత్వ రేఫ కలదిగా వాడవలసినశబ్దం "దృహిణ" అని వట్రసుడి కలదిగా యతి స్థానంలో ప్రయోగింపబడింది.

చ॥ మహిత తపోధనుండు ముని మండనుఁ డయ్యెడఁ బాసి పెండియు
న్మహిపతిభూషుఁ గాన రజ తాద్రికి నేఁగిన నగ్గిరీంద్రుపైఁ
దుహినమయూఖ శేఖరుఁడు దుర్గయుఁ దానును విశ్రమించుచున్
(ద్రు) దృహిణ తనూభవుండు చను దెంచుట కాత్మఁ బ్రమోద మొందుచున్

(భాగ - దశమ - ఉత్త - 1271 ప.)

ఋ కార, రు కారాలు తారు మారైన యిటువంటి ప్రయోగాలు పండితకవులు చేస్తూండడం గణపవరపు వెంకట కవి చూచి ఆ విధంగా ఋ-రు లను తారుమారు చెయ్యకూడదనే అభిప్రాయంతో యీ క్రింది సీసపాదాలు రచించాడు—

ద్రుహిణ ద్రుత ధ్రువ ద్రుపద త్రుటీ ద్రుమ
భ్రూ భ్రుకుంస శ్రుతి స్రు క్స్రువములు
క్రూర విశ్రుత శతద్రు క్రుద్ధ శత్రు క
ద్రు భ్రూణములు కొమ్ముతోడి క్రార

లింక వఱ్ఱువసుడి పొంకమౌ శబ్దాల
పేరులు తగుఁ గొన్ని భృంగ శృంగ
కృప కృషి కృతి భృతి నృప స్పృణి పృషు వృత్తి
ధృతి మృదు దృఢ భృగు పృథుల వృజిన
విస్పృమరా స్పృక్ స్పృతి ఘుస్పృణ మస్పృణ గృహ
కృత్తి ప్రస్పృతి దృప్త వృద్ధ తృప్త
వృకాల వృషభ పరివృష కృత్స్న మృ ఘృత
గృఘ్న కృంతన బృసీ తృణ సృగాల
దృ దృష్టి ఘృణి ఘృష్టి కృకవాక మృగ వృష్టి
తృష్ణా దృష తృ్ప్రష తృష్ణ లనఁగ.
(ఆంధ్ర. కౌ. 35 పుట.)

కృప-కృతి మొదలైన ఋ కారాలుగల పదాలు ఉత్వ రేఫలు కలవిగా (క్రుప-క్రుతి అని) ఎప్పుడైతే వ్రాయడం ప్రారంభించారో అప్పుడవి సంయుక్తాలుగా కనపడుతుండడం వల్ల అవి నిజంగా సంయుక్తాక్షరాలనే భావించి వాటికి పూర్వం లోవున్న లఘువులు గురువులుగా మారుతాయని కొందరు పూర్వకాలంలో భ్రమపడుతుండే వారు-అంటే- "పరికృతం" అని వ్రాసుకొనడానికి మారు ఉచ్చారణ కనుగుణంగా "పరిక్రుతం" అని వ్రాసుకొని "క్రు" అనేది సంయుక్తం కాబట్టి దాని పూర్వాక్షరమైన "రి" కారం గురువుగా చెల్లుతుందని కవులు తలంచేవా రన్నమాట-కాబట్టే అనంతుడు

క॥ ఉపరిని హల్సంయుతమై
నపుడూఁదును స్వరసమన్వితాక్షరమగునే
నపుడూఁద దాదివర్ణము
ప్రపాద్యయము పరికృతము పరి కౄ† త్తి యనన్.
(ఛం . ద - 4 ఆ-58 ప.)

---

† ౠ కారం విషయమై ముందు చర్చింపబడుతుంది.

అని ప్రవచించాడు-హల్లుతో సంయుక్తమయినట్లయితేనే పూర్వాక్షరం గురువవుతుందనీ అచ్చుతో కూడితే పూర్వాక్షరం గురువు కానేరదనీ అనంతుడు వాకొన్నాడు-పరికృతము అన్నప్పుడున్న "కృ" కారాన్ని "క్రు" కారంగా కొందరు వ్రాసికొని అది సంయుక్తమవడంచేత దాని పూర్వాక్షరం గురువు అవుతుందని భావించేవారు-కాబట్టే అక్కడ వున్నది అచ్చేగాని హల్లు కాదని హల్లైతేనే పూర్వాక్షరం గురువు అవుతుందనీ అచ్చయితే పూర్వాక్షరం గురువు కానేరదనీ అనంతుడు స్పష్టంగా పేర్కొన్నాడు-

ఈ విధంగా ఋ కారం "రు" కారంగా మారిపోయింది కాబట్టే (పృ) పృథివి మొదలైన పదాలకు పుడమి ([(ప్రు] పృ - పులకు సామ్యం) మొదలైన వికృతిపదాలు జనించాయి.

" వీర్యంబు సీసంబు పృథివి పుడమి. " [ఆం-కౌ-2 పుట.]

ఋ కారం "రు" కారంగా మారడమనేది నన్నయ్యకు కొద్దిగా పూర్వకాలంలోనే జరిగింది కాబట్టే నన్నయ్యకు పూర్వుడైన ‡ నన్నిచోడుడు

---

‡ నన్నిచోడుడు నన్నయ్యకు సమకాలికుడని "నన్నిచోడకవి చరిత్ర" లో శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారు నిరూపించడానికి ప్రయత్నించారు. కాని వారి విమర్శల్లోవున్న కొన్ని విషయాలనుబట్టీ మరికొన్ని యితర కారణాలవల్లా నన్నిచోడుడు స్పష్టంగా నన్నయకంటే పూర్వుడనే తేలుతున్నది. దీనికి సంబంధించిన విషయాలను ప్రత్యేక వ్యాసరూపాల్లో ప్రకటిస్తాను - ఒకవేళ పూర్వుడు కాడు సమకాలికుడే నన్నా - పరుడే నన్నా యేదన్నా నన్నయకాలంలోనే ఋ - రుగా మారిందని యిదివరకే నిరూపించాను కాబట్టి యిక్కడ వచ్చే పెద్ద యిబ్బంది యేమీలేదు.

చ॥ నిరురుతి వారి మాయల కనిం బ్రతిమాయ లొనర్చి పేర్చు సం
గర మొనరింపఁ బూని కడుఁగ్రైపున మార్కొని తాఁకి వీఁక నా
యిఁగవురవిఁద నొక్కట నసేక శిలీముఖవృష్టి భోఁగనం
గురిసె సురారి వాహినులకున్ లయకాలఘనాఘనాభమై
(కు-సం-12-ఆ-42 ప.)

అని యీ పద్యంలో "నిర్ృతి" అనడానికి "నిరురుతి" అని ప్రయోగించాడు. నిర్ + ఋతి అనేవాటి మేళనంవల్ల "నిర్ృతి"† అవుతుంది. కాని ఋతిలోని ఋకారానికి సహజంగా రేఫోచ్చారణ వుండడంచేత నిర్‌లోని వ్యంజన రకారమూ "రుతి" లోని రకారమూ కలసి "నిర్రుతి" అయిపోయింది. ఈ "నిర్రుతి" అనేదాన్నే నన్నిచోడుడు "నిరురుతి" అని "నిర్"లో రేఫకు ఉకార స్వరాన్ని (హల్లుకు చివర తెలుగులో ఉకారం చేరడం సహజం.) చేర్చి రూపంగా అక్షర వ్యస్తాన్ని సంపాదించి ప్రయోగించాడు. ఈ "నిరురుతి" అనేది "నిర్ృతి" కి వికృతిరూపంగా శ్రీ వఝ్ఝలవారు (ఆం-వ్యా-సం-స.159 పుటలో) అంగీకరించారు. ఋకారానికి "రు" కార వుచ్చారణతోపాటు లేఖనంకూడా వుంటేనేగాని "ఋతి" "రుతి" గా యెన్నడూ మారనేమారదు.

---

† ఈ ఋకారం పొల్లు హల్లుతో మేళన మైనప్పుడు వట్రువసుడి (ృ)గా మారుతుంది. ఈ మార్పు ప్రకారం ఋ కార స్వరంకల హల్లులను వాస్తవానికి క్ృ-గ్ృ-త్ృ-అనే పద్ధతిలో వ్రాయవలసి వుంటుంది. కాని ఈ విధంగా మనమే కాకుండా మన పూర్వులుకూడా వ్రాసి యెరుగరు. ఈసందర్భంలో 25_1_1958 ఆంధ్రప్రభ దిన పత్రికలో నేను వ్రాసిన "తెలుగు లిపికి తలకట్టు తెచ్చిన తిప్పలు" అనే వ్యాసభాగానికి మరికొన్ని పంక్తులు చేర్చి యిక్కడ ఉటంకిస్తున్నాను.

ప్రప్రథమంగా ప్రతి అక్షరానికి పైన అడ్డగీతగా నిలబడి రాను రాను అకారం గుర్తుగా కొన్ని హల్లులమీద మాత్రం మిగిలి మరి కొన్నిటి మీద అందాన్నీ, నిండుతనాన్నీ, అపేక్షించడంవల్ల వచ్చిన తలకట్టు తెలుగు భాషకు తెచ్చిన నష్టం ఇంతా అంతా కాదు. మహాకవుల్ని తప్పులో కాలు వేయించింది. విమర్శక శిఖామణుల్ని సెక్కుమందిని బోల్తా కొట్టించింది. యింక సామాన్యుల మాట చెప్పేదేముంది ?

ఒకసారి-ఇంకా ఒక సంవత్సరం దాటితే "తెలుగు పండిత పదవి" నలంకరించే మా భాషాప్రవీణ విద్యార్థిని కుమారుడు అన్నప్పుడు "కు" అనే దానికి వర్ణక్రమం చెప్పవయ్యా ? అని అడిగితే-క్ + అ + ఉ కలిస్తే "కు" అయిందని చటుక్కున చెప్పి ఊరుకున్నాడు. అంతేనా ? అని రెట్టించి అడిగే సరికి అయిదు నిమిషాల్లో తెప్పరిల్లి "తప్పు చెప్పానండి మేష్టారు! క్ + ఉ కలిస్తే కు అవుతుందండి!" అని సర్దుకున్నాడు. ఇక చిన్న పిల్లల్లో ఈ విధంగా యెన్ని సార్లు జరుగుతుందో చెప్పలేము. కాస్త చొరవా, బుర్రా వున్న కుర్రాడెవడైనా "మాష్టారండీ! "క" అన్నప్పుడు తలకట్టు అకారం గుర్తు గదా "కు" అన్నప్పుడు తలకట్టుకూడా అకారం గుర్తే అని అనకూడదా ? యెందుకని ?" అని యే ఎలిమెంటరీ టీచర్నో అడిగితే ఆయనకు పచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్లై "అది అంతేరా వెధవ" అని కసిరి సరిపుచ్చాల్సిందే కాని కుర్రాణ్ణి యేమని సంతృప్తి పరచగలడు ?

ఈ తలకట్టు క, గ, చ, ఛ, త, థ మొదలైన అక్షరాలమీద అకారం గుర్తుగా వచ్చింది. అంతే కాదు కు, గు, చు, ఛు, తు, ఘు, దు, ఘు, శా, దూ, కృ, హృ, వృ, మొదలైన అక్షరాలమీద కూడా తలకట్టు వుంటోంది. అకార వ్యతిరిక్త స్వరాలతో కూడుకున్న హల్లుల మీద కూడా తలకట్టును పెట్టుకోవడం కేవలం ఆ అక్షరాలు బోడిగాను, బోసిగాను వుండకూడదనీ, అందాన్ని, నిండుతనాన్ని కోరుకుని మాత్రమే. ఈ అందంకోసం వచ్చిన తలకట్టువల్ల మహా కవులు కొందరు, విమర్శకులు కొందరు ప్రమాదవశులయ్యారు. అటువంటి ప్రమాదాలవల్ల జరిగిన లోపాలు కొన్ని పరిశోధనలో బయటపడినవి. చూడండి! కృ, వృ, హృ యిత్యాదుల్లో ఋకార స్వరం గుర్తు (వట్రువసుడి) హల్లుకు అంటుకుండా వేరే ప్రత్యేకంగా వ్రాస్తాము. ఇటు

వంటి కృ, వృ, మొదలైన అక్షరాల్లో క్రిందుగాను, ప్రత్యేకంగాను వుండే వట్రువసుడిని చూడక పైనుండే తలకట్టుచూచి కృ, వృ ఇత్యాద్యక్షరాలను క, వ యిత్యాద్యక్షరాలుగా భావించిన పెద్దలు లేక పోలేదు. ఈ క్రింది పూర్వ కవుల ప్రయోగాలు చూడండి.

వృత్తమున కౌ భ జ స – వృత్తి న భ జల్
స న ల – పై గురులు రంగ నృపధీరా!

[ఆ. రం. రా. ఛందము–4 ఆ–131 ప.]

ఇది మంగళమహాశ్రీ అనే వృత్తంలోని ఒక పాదం. దీనికి యెనిమిదేసి అక్షరాలమీద పాదానికి రెండు యతులు వుంటాయి. చూడండి— వృత్తమున 4; కౌభజస 4; [4 + 4=8] తరువాత వృత్తిలోని "వృ" మొట్టమొదటి యతిస్థానం. యింక రెండవదో మరల యెనిమిది అక్షరాలు దాటిన తరువాత "పై" అనే [వృత్తినభ 4; జల్ సనల 4; 4 + 4–8] అక్షరం యతి స్థానం అయింది. మొదటి అక్షరం వృకారానికి యెనిమిది అక్షరాల తరువాత వృ కారానికి యతి చెల్లింది. రెండవ యతిస్థానంలో "పై" అనే అక్షరం వున్నది. వాస్తవానికి "వృ" అనే దానికి "పై" కి యతిమైత్రి లేదు. "వృ" లో ఋకారంవున్న సంగతి మరచిపోయి పైనున్న తలకట్టు చూచి "వ" అనుకొని "పై" అనే అక్షరానికి యతి సరిపెట్టుకొన్నాడు రంగకవి.

ఈ సందర్భంలో – పాఠాంతరాలుకూడా కావు. సవరణలు ప్రతిపాదించి రంగకవి పడ్డ ప్రమాదాన్ని తొలగించాలని యెవరో ఒకానొకరు యత్నించారు. కాని పద్యలక్షణం చెబుతున్న ఆ రంగకవి పద్యంలో "సనలపైగురులు" అన్నప్పుడు మీద – తర్వాత – అనే అర్థంలో వాడిన ఆ "పై" అనే శబ్దానికి అర్థంతో ఎంతసంబంధమున్నదో వారు గమనించలేదు.

మనకు పరమ ప్రామాణికుడైన యెఱ్ఱాప్రెగడ రచించిన హరివంశంలోని పద్యంలో యిట్లాగే మరొక యతి వుంది.

క॥ విషయేంద్రియ ప్రపంచము
హృషీక మనం బనగు నీ వతీతుండవై యు

న్మ్రషితముగ నది ధరించుటు
హృషీకేశ నామ శోభి తైతివి కృష్ణా !

[ఉత్త. హ- 6 ఆ - 80 ప.]

అసలు యీపద్యమే విచిత్రమైన పద్యం - ఇందులో నాలుగో పాదం కందపద్యలక్షణాన్ని అమాంతంగా వుల్లంఘించింది. పద్యం దిద్దడానికి వీలు కానిఘట్టం - నాల్గోపాదంలో "హృ - ఐ" లకు యతివేయబడింది. ఇదికూడా "హృ"లో వట్రువసుడి వున్న సంగతి మరచిపోయి పైనవున్న తలకట్టుచూచి "హ" అత్వవిశిష్టమైన దనుకోనడంవల్లనే యీ పొరపాటు జరిగింది.

తలకట్టుభ్రమవల్ల యిక్కడ యర్రాప్రెగడ "హృ" కారంలో వట్రుసుడి మాచుకోక "హ" కారంగా భావించి "హృ-ఐ" లకు యతివేశాడన్న సంగతి గమనింపక హరివంశం ముద్రణ ప్రతిలో పరిష్కర్తలు "హృషీకేశ నామ శోభి వీవో కృష్ణా!" అని యతికోసం సంస్కరించి ముద్రింపించారు. (ఈ సంస్కారమైనా మధ్యలో జరిగిందే కాని మొట్టమొదట అసలు జరుగనే లేదు. మొదటి ముద్రణలో యథాతథంగా "హృషీకేశనామ శోభివైతివి కృష్ణా!" అనే వుంది. కాని యీ పాఠాన్ని 1926 సం. వావిళ్ళవారి ముద్రణ కొత్త కూర్పులో "హృషీకేశనామ శోభి వీవో కృష్ణా!" అని దిద్ద బడింది. ఈ దిద్దుబాటైనా పద్యభాగంలో జరుగలేదు. తప్పొప్పుల పట్టికలో జరిగింది - పద్య భాగంలో మామూలుగా "శోభివైతివి" అనే పాఠమే వున్నది.) యతికోసమని గతిలేక తొందరపడి "శోభి వీవో" అని సంస్కరించారేకాని ఆ సంస్కరణ ఆ పద్యార్థానికి యెంతవరకు సరిపోతుందో చాలదో వారు చూచుకోలేదు - పైకందం పూర్వార్ధంలో "హృషీకమనఁ బరఁగు నీ వతీతుఁడవై" అని "నీవు" శబ్దం ఒకసారి ప్రయోగింప బడింది. పూర్వార్ధంలోనే నీవు వుండగా తిరిగివుత్తరార్ధంలో "ఈవు" అని పెట్టడంలో అర్థమేమిటి ? పోనీ యీ "నీవు" "ఈవు" అనే పదాలు భిన్నవాక్యాల్లో వున్నా బాగానే వుండేది - అలా కాకుండా ఒకేవాక్యంలో రెండు సార్లు-నీవు- అని ఒకసారి - ఈవు అని ఒకసారి ఏకార్థక శబ్దాలు వుండడంలో అర్థమేమిటి? "విషయేంద్రియ ప్రపంచము హృషీకము " అనఁ - బరఁగు" -

ఓ కృష్ణా! నీవు + అతీతుడవై యున్మిషితముగ నది * ధరించుట (న్= ధరించుటచేత) హృషీకేశనామ శోభి వీవు" –అని ఈ ఒకే వాక్యంలో రెండుసార్లు ఏకార్థకాలైన "నీవు - ఈవు" శబ్దాలు వుండడంలో అర్థంకాని కనీసం అందంకాని యేదైనా వున్నదా ?

ఈ "తెలుగు లిపికి గలకట్టు తెచ్చిన తప్పులు" అనే నావ్యాసాన్ని ఆంధ్రప్రభలో చదివి కళాప్రపూర్ణ శ్రీ వఝ్ఝల చినసీతారామస్వామి శాస్త్రి గారు 12_3_1953 న నాకు జాబువ్రాస్తూ "హృషీకపతినామ శోభి వీగతిఁ గృష్ణా" అనుగీతిది కవిప్రయుక్తమైయుండును" - అని వ్రాశారు. † అసలు ఈ యర్రాప్రగడపద్యం "శివుఁడు శ్రీ కృష్ణమహాత్మ్యము నభివర్ణించి స్తుతి చేయుట" అనే సందర్భంలోది. ఈ సందర్భంలో ఈశ్వరుడు "విష్ణు, నారాయణ, వాసుదేవ, త్రివిక్రమ, మాధవ, హృషీకేశ," ముదలైన పేర్లు శ్రీ కృష్ణుడికి యెందువల్ల వచ్చాయో- వాటి వ్యుత్పత్త్యర్థాలను వివరంగా చెప్పాడు - ఆ చెప్ప సందర్భంలో ప్రతిపద్యంలోను ఏదో ఒక క్రియ ప్రయోగించాడు.

1. విష్ణు నామము........యతిశయిల్లు 75 ప.
2. నారాయణుఁ డనఁగా నీ పేరు......వెలయు...... 76 ప.
3. వాసుదేవుఁ డంచురు..................... 77 ప.
4. త్రివిక్రముఁ డైతి (వి) త్రివిక్రమంబులన్ — 78 ప.

* ఇక్కడ అది శబ్దంచేత "హృషీకమనఁ బరఁగు విషయేంద్రియ ప్రపంచము" గ్రాహ్యం.

† ఆలేఖలో నా వ్యాసానికి సంబంధించిన వాక్యా లివి– రేఫశబ్దము కూడ అత్యవిశిష్ట రకారవ్యంజనవాచిగ వాడుకలు గలవు–"చ-నజ భజజల్ జరేఫలఁబెనంగి......." [కవిజనాశ్రయము] "హృషీకనామ శోభివైతివి కృష్ణా" అను భగ్నచ్ఛందము భగ్నయతియునగు పాఠము ప్రబంధపరమేశ్వర ప్రయుక్తము కాదని విమర్శకు లంగీకరింప నగును. ముద్రిత సంస్కార లోపమున నట్లు పడినదను నిశ్చయము. "హృషీకపతి నామశోభి వీ గతిఁ గృష్ణా" అనురీతిది కవిప్రయుక్త మననోపును. ఇంకను స్వారసికమగు పాఠము పండిత కవీంద్రులు కల్పింతురు గాక. "—

5. మాధవాఖ్యఁ బొగడుదురు............ 79 ప.
6. హృషీకేశనామ శోభివైతివి............ 80 ప.
7. వామనుఁ డనఁ బరగితివి......... 81 ప.

ఈ పద్ధతిలో అపద్యాలన్నీ నడిచాయి - "హృషీకేశ" అనే శబ్దాన్ని కింద చతుర్థపాదంలోఆదిలోపెట్టడమే గణభంగానికి దారితీసింది-ఎంతో ప్రసిద్ధిగావున్న కేశవనామల్లో సైతం "హృషీకేశాయ నమః" అని "హృషీకేశ" శబ్దాన్ని వ్యవహరించడమే ప్రాచీన కాలంనుంచీ వున్నది కాని "హృషీకపతి" శబ్దాన్ని వ్యవహారించడమనేది శ్రుతపూర్వం కానే కాదు. ఎర్రాప్రగడ కూడా మామూలు వ్యవహారంలోవున్న "విష్ణు, నారాయణ, వాసుదేవ, త్రివిక్రమ, మాధవ" ఆదిశబ్దాలను గ్రహించినట్లుగానే "హృషీకేశ" అనే ప్రసిద్ధశబ్దాన్ని గ్రహించివుంటాడనడమే సమంజసం కాని అప్రసిద్ధమైన, వ్యవహారంలో లేని "హృషీకపతి" శబ్దాన్ని గ్రహించి వుంటాడనడం సమంజసం కాదు. పాల్కురికి సోమన తన పద్యాలలో వేదవచనాలను పేర్కొనవలసి వచ్చినప్పుడు ఆవచనాలు వున్నవి వున్నట్టుగా ప్రయోగించాలంటే గణభంగం జరుగుతుందని సంకోచించకుండా వాటిని ఉన్నవి వున్నట్టుగానే (గణభంగానికి అంగీకరించి) ప్రయోగించాడు. అలా గణభంగం జరిగిన ప్రయోగాలు అతని సీసపద్యాల్లో కొకొల్లలు - (అపిమాషంమషంకుర్యాత్ ఛందోభంగం నకారయేత్) "మాషం అనే శబ్దాన్ని మషం అనైనా చెయ్యిగాని ఛందో భంగం మాత్రం చెయ్యకు" అనే ప్రాచీనుల వాక్యాన్ని తప్పనిసరిగా "ఛందో భంగమైనా చెయ్యిగాని సుశబ్దాన్ని అపశబ్దంగా మార్చకు" అని కూడా మార్చుకోనక తప్పదు - ఒక మంత్ర భాగాన్ని సుస్వరంగా పద్యంలో పెట్టాల్సి వచ్చినప్పుడు గణభంగం కాక యేమవుతుంది? అక్కడ మంత్రానికే ప్రాధాన్యం కాని యితరాలకుకాదు - ఈ విధంగానే యిక్కడ "హృషీకేశ" అనే శబ్దాన్నే వినియోగించాలని భావించిన యెర్రాప్రెగడ గణభంగాన్ని అంగీకరించడంలో ఆశ్చర్యంవుండదు -శ్రీ వఝ్ఝులవారు సూచించిన "ఈగతి" అనేదే చేరిస్తే నిజంగా ("హృషీకపతి నామ శోభి వీగతిఁ గృష్ణా") అక్కడ గతిలేక పెట్టుకొన్నట్లే కనపడుతుంది. "ఈగతి" అనే దానికి అర్థపుష్టిగాని

సందర్భశుద్ధిగాని ఈ పద్యంలో యేదీలేదు – గణయతి భంగాలు జరిగినప్పటికీ "హృషీకేశనామ శోభితైతిపి కృష్ణా" అనే పాఠంలోనే యెంతో అర్థం, అందం, రెండూ కన్పడుతున్నాయి.

ఈ విధంగానే క్రింద విడిగావుండే వట్రువసుడిని గమనింపక, ఆ అక్షర (స్వరవ్యంజనాల) విభాగాన్ని దృష్టిలో వుంచుకోకా కొందరు వ్యాకరణ వ్యాఖ్యాకర్తలు సైతం పైనున్న తలకట్టు చూచి దాన్ని అకారాంతంగా భావించి భ్రమలుపడ్డారు – ఆంధ్ర శబ్దచింతామణి అజంత పరిచ్ఛేదంలో "ఋ ద్వంద్వే రః" అని వొక సూత్రంవుంది – ద్వంద్వసమాసంలో పూర్వోత్తరపదాలు ఋకారాంతా లయినప్పుడు పూర్వపదాంత ఋకార స్థానంలో (ఆదేశంగా) అత్వవిశిష్టమైన "ర" అనేది వస్తుందని దాని అర్థం – ఆంధ్ర శబ్ద చింతామణికి క్రీ॥ శ॥ 1600 ప్రాంతంలో వ్యాఖ్యవ్రాసిన బాల సరస్వతి మొదలు ఆతనికి తర్వాతివారు కూడా దాన్ని యేవిధంగా వాఖ్యానించారో చూడండి! –

1. — "ద్వంద్వే=ద్వంద్వసమాసమందలి, ఋః=ఋకారాంత శబ్దముల ఋకారమునకు, క్వచిత్ = కొన్నిచోటుల, రః = రేఫము వచ్చును. 'మాత్రపితృ భావమున శైలపుత్రిఁ గొలుతు"

—(బాల – స – **207** వ. పుట.)

‡ **2.** "ఋకారాంత ద్వంద్వే పూర్వపదసంబధినో ఋకారస్య స్థానే రః స్యాత్ – మాత్రపితృబుద్ధి నంబోధిపుత్రిఁ గొలుతు"— (వాసుదేవ వృత్తి – నావద్ద వున్న తాళపత్రప్రతి – **15** పత్రం – మొదటివైపు – మొదటిపంక్తి –)

3. — "ఋకారాంత ద్వంద్వే పూర్వపదసంబంధి యః ఋకారస్తస్య స్థానే ర స్స్యాత్-మాత్రపితృబుద్ధి వైదేహపుత్రిఁ దలఁతు"—

(అహో – పం – **298** పుట.)

‡ అప్పకవి ఆంధ్ర శబ్దచింతామణి వ్యాఖ్యాతల్లో వొకడైనప్పటికీ అతని వ్యాఖ్య సంధిపరిచ్ఛేదంతోనే ముగిసినందువల్ల ఈ సూత్రానికి వ్యాఖ్య వ్రాయలేదు —

4. "ద్వన్ద్వే = ద్వన్ద్వసమాసమునందు, ఋః = ఋకారమునకు, రః = రేఫాదేశము, వా = వికల్పముగా నగును."

(ఆం-వ్యా-సం-సర్వస్వము - 2 సంపుటము. 1244 పు.)

ఋకారస్థానంలో అత్వవిశిష్టమైన రకారం వస్తుందని యీ వ్యాఖ్యాకర్త లెవ్వరూ చెప్పలేదు. బాలసరస్వతి కచ్చితంగా రేఫ వస్తుందన్నాడు - వాసుదేవుడు రః అన్నాడు కాబట్టి అత్వంతో కూడిన రకారంగా భావించాడని చెప్పుకోవచ్చు - అయినా స్పష్టపరచాల్సింది. అహోబలుడు కూడా రః అనే అన్నాడు కాని ఆ వ్యాఖ్యలోనే దాన్ని రేఫగా వ్యవహరించాడు- శ్రీ వఝ్ఝలవారు "రేఫ" అనే అన్నారు.

మాత్రపితలు - దీనిలో మొదటిపదం మొదటిస్థితి ఋకారాంతత్వం మాతృ అని వుంటుందికదా! "తృ" లో ఋకారస్వరం ఒక్కటే వున్నది కాని అకారంలేదు. "తృ" మీద వున్న తలకట్టుచూచి అకారం అనుకొని ఋకారస్థానంలో రేఫ - అంటే - పొల్లు రకారం (వ్యంజనమాత్రం) వస్తుందని అనుకొని "త్ర" అవుతుందనుకున్నారు - ఒకవేళ ఆ "తృ" లో వున్న తలకట్టే అకారమయితే ఋకారస్థానంలో వారనుకొన్నట్టు రేఫే (పొల్లు రకారమే) వస్తే "తర్" అవుతుందిగాని "త్ర" యెట్లా అవుతుంది? "ర్"అనేది "త్-అ" అనేవాటికిమధ్యలోవస్తేనేగాని (త్ + ర్ + అ=త్ర) అవికలసి "త్ర" కాదు - అసలు "తృ" లో ఋత్వమేకాని అత్వంలే నేలేదు- అయితే ఆపైనున్న తలకట్టు ఆ అక్షరంబోడిగా - బోసిగా - వుండకూడదనీ, అందాన్ని, నిండుతనాన్ని అపేక్షించి వచ్చిందేకాని వేరుకాదు—

ఈ సందర్భములో చిన్నయసూరి బాలవ్యాకరణంలోని సూత్రం చూడండి —

"ద్వంద్వంబునందు ఋకారంబునకు రవర్ణంబు విభాషనగు" మాత్రపితలు - మాతాపితలు - ఇత్యాదులు - (బాల - సమా - 24 సూ)

ఈ సూత్రంలో స్పష్టంగా ఋకారస్థానంలో అత్వవిశిష్టమైన "ర" వస్తుందని "రవర్ణము" అని వర్ణశబ్దం వుంచి చిన్నయసూరి నిర్దేశిస్తుంటే వ్యాఖ్యాతలు చూడండి యెంత వింతగా వ్యాఖ్యానించారో!

1. —"ద్వంద్వ సమాసంబునందుఁ బూర్వపదాంతంబయిన ఋకారంబునకు రవర్ణంబు (క్రావడి) వైకల్పికంబుగా నగును—"

(గుప్తార్థప్రకాశిక-282 పుట-కర్త: కల్లూరి వెంకటరామశాస్త్రిగారు.)

2. — "మాతృ + పితృ - ఇందుఁ దొలినున్న మాతృశబ్దము తుది ఋకారమున కీవిధిచే రేఫము కల్గెను" — ‡ (దూసి రామమూర్తిశాస్త్రి గారి వ్యాఖ్య - 353 - 354 పుటలు.)

3. "ద్వంద్వసమాసమున మొదటి పదము చివరనున్న ఋకారమునకు రేఫము వికల్పముగా నగును - (మాతృ + పితలు)- మాత్రపితలు- ఇందు మాతృ తొలిపదము - దానిచివరి ఋకారము రేఫముగా మాఱినది"—

(బులుసు వెంకటరమణయ్యగారి లఘుటీక - 200 పుట.)

అని యీవిధంగా బాలవ్యాకరణవ్యాఖ్యాతలందరూ అకారంతో కూడిన రకారం వస్తుందనడానికి రేఫ వస్తుందనే చెప్పారు - పైపెచ్చు శ్రీ కల్లూరి వారు "క్రావడి" వస్తుందని స్పష్టంగా వ్రాశారు- ఈవిమర్శకులైనవ్యాఖ్యాకర్తలప్రమాదాలకుకారణం(మాతృ)తృ మొదలైనవాటిల్లో తలకట్టువుండడమే- తలకట్టు అకారం అనుకొని, ఋకారం రావత్తుగా - అంటే - క్రావడిగా మారిపోతుందని భ్రమపడ్డారు - "తృ" లోని తలకట్టు అకారం గుర్తూకాదు; ఋకారం క్రావడిగానూ మారదు - నిక్కచ్చిగా "తృ" అన్నప్పుడున్న "త్ + ఋ" అనే వాటిల్లో ఋకార స్థానంలో అత్వవిశిష్టమైన "ర" కారం ఆదేశంగావచ్చి "త్+ర=త్ర" అవుతుందేగాని వేరుకాదు - ఈ సందర్భంలో మనం ముఖ్యంగా గమనించవలసిన విశేషం వొకటుంది — "తృ" అన్నప్పుడున్న తలకట్టు అకారంగుర్తుకానేకాదు — "తృ" అనే దాంట్లో అకారం లేనేలేదు - "త్ర" అన్నప్పుడున్న తలకట్టు అకారంగుర్తు- "త్ర" అనేదాంట్లో అకారం వున్నది - త్ + ఋ అక్షరాల మేళనం జరిగి

---

‡ ఈ సూత్రవ్యాఖ్య సందర్భంలో దూసివారు పెక్కుచోట్ల రేఫ రేఫ అంటూ రేఫను వ్యవహరించారేకాని ఒక్కసారైనా అత్వంతో కూడిన రకారమని వ్రాయలేదు.

నప్పుడు వచ్చేమార్పు రూపంలో - అంటే - తృ అనేదాంట్లో తలకట్టు వుంటుంది. అయితే అది అకారం గుర్తుమాత్రం కాదు - ఈ "తృ" అన్నప్పుడున్న (త్ + ఋ) ఋకారస్థానంలో అత్యవిశిష్టమైన రకారం అనేది ఆదేశంగా వస్తుంది - అంటే - ఋకార స్థానంలో "ర్ + అ" అనేవి రెండూ (ఆదేశాలుగా) వస్తాయన్నమాట - ఆదేశంగావచ్చే ర్ + అ అనే యీ రెండక్షరాలూ "త్" అనే పొల్లుహల్లుతో కలిసేటప్పుడు * "ర్" అనేది క్రావడి (◡) గానూ, "అ" అనేది తలకట్టు (✓) గానూ, మారి మరీ కలుస్తాయి - అంటే - "తృ" కారంలో అందంకోసం, నిండుతనంకోసమనివున్న తలకట్టుపోయి సార్థకమైనతలకట్టు (అకారవాచ్యమైన తలకట్టు) వచ్చి దానిక్రింద పొల్లురకారంగా క్రావడి వస్తుందన్నమాట- అప్పుడు "తృ" అనేది "త్ర"గా మారి త్ + ర్ + అ అనే అక్షరాల సంహితత్వాన్ని (పరస్సన్నికర్షత్వాన్ని) తెలియపరుస్తుంది- ఈ విషయాన్ని (తృ లోని తలకట్టు అకారంగుర్తుకాదనీ, త్రలోనితలకట్టు అకారంగుర్తనీ) గమనించక శ్రీకల్లూరివారు <u>రవర్ణంబు [క్రావడి] వైకల్పికంబుగా నగును"</u> అని వ్రాయడం కేవలం పొరపాటు - మామూలుగా ఏవస్తువైనా పొల్లుహల్లులకే గుర్తులు కాని స్వరసహితాలకు కానేకావు - క్త - క్మి - క్రు - క్లె - క్తొ మొదలైన యిటువంటి అక్షరాల్లో స్వరాల గుర్తులు " (తలకట్టు) ✓ - [గుడి] ి - [కొమ్ము] ‿ - [ఎత్వం] ⊃ - [ఒత్వం] ొ - అనేవి అక్షరాలకు పైభాగంలో వుండనే వుంటాయి. † [ఒక్క ఐకారంగుర్తుమాత్రం

---

* ఇక్కడ సందర్భవశాత్తు తృ - త్ర అనేవాటినే గ్రహించానుగాని ఋకార స్థానంలో పైసూత్రాలచేత రవర్ణం ఆదేశంగా వచ్చే యేఅక్షరాలనైనా గ్రహింపవచ్చు - ఈ తృ - త్ర లు ఇతర అక్షరాలకు కూడా ఉపలక్షణం —

† న్యాయానికి సంయుక్తాల్లో స్వరాలు మొదటి హల్లుమీద వుండకూడదు - చివరి హల్లుమీదనే వుండాలి - కాని మనం ప్రాచీనకాలంనుంచీ కూడా వ్రాతలో మొదటి హల్లుమీదనే స్వరంవ్రాసుకోనడమూ వర్ణవివక్షణ వచ్చేసరికి ఆ స్వరం చివరిహల్లుకి సంబంధించిందని భావించుకొని వ్యవహరించడమూ జరుగుతున్నది - వాస్తవానికి క్త - క్మి - క్రు - క్లె -

హల్లుల్లో పైన (ఎత్వంగుర్తు) — - క్రింద ౦— అనే గుర్తుగా పైనా క్రిందా రెండుచోట్లాకలిపి వున్నది -] కాబట్టి క్రింద వచ్చే వత్తులన్నీ వ్యంజ

క్తో అని వ్రాస్తున్న యిటువంటి సంయుక్తాక్షరాల నన్నిటినీ క్ఀత - క్ఀమి - క్ఀరు - క్ఀలె - క్ఀతో - అని యీ విధంగా చివరిహల్లుమీద స్వరంవుండేటట్టుగానే వ్రాయాలి - ఈ విషయాన్నే అప్పకవి యీ క్రింది పద్యంలో స్పష్టంగా చెప్పాడు.

తే॥ గీ॥ ఎన్ని హల్లులు జడ్డలై * యున్ననేమి
హల్లులకు పూర్వ నుండెడు హల్లులెల్లఁ
గడపటను వ్రాయు ద్విత్వసంక్రాటియె తాల్చు
దానితలకట్లు మున్నైన వానినెల్ల (అప్ప- 2 ఆ - 39 ప.)

అయితే సంయుక్తాలను క్ఀత - క్ఀమి - క్ఀరు - అనే పద్ధతిలో వ్రాయడమనేది క్త - క్మ - క్రు - అనేపద్ధతిలో వ్రాయడంకంటె కష్టతరమైంది. అందుకే యీ కష్టాన్ని భరించలేని మన పూర్వులు ఈ విధమైన లిపిని సుఖాపేక్షతో మనకు సృష్టించిపెట్టారు- కాని యిటువంటి లిపి సక్రమమైనదనడానికి ఆస్కారంలేదు.

---

* ద్విత్వాలైన హల్లుల్ని [క్క - త్త- చ్చ- మొదలైనవాటిని] మాత్రమే కాకుండా అన్యహల్సంయుక్తాలను [క్రి - త్మ - శ్చ - మొదలైనవాటిని] కూడా "జడ్డ" శబ్దంతో అప్పకవిలాగా ప్రాచీన లక్షణగ్రంథకర్తలు చాలా మంది వ్యవహరించారు. ఆ వ్యవహారం సరైందికాదు - "జడ్డ" అనేది ద్విత్వానికే సంజ్ఞ - ద్విత్వశబ్దాన్ని అన్యహల్సంయుక్తాలకుకూడా ప్రాచీనులు కొందరు వాడారు - అదికూడా సరికాదు - ద్విత్వమనేది ద్విరుక్తానికే సంజ్ఞ—

తే॥ గీ॥ ద్విత్వమున కాదివర్ణంబు తెనుఁగునందు
నూఁదకుండును వలసిన నూఁదియుండు
జానకీవల్లభుఁడు క్షమాశాలి యనఁగ
దశరథాత్మజుఁడు స్వామిధాత్రికనఁగ. (ఛదం- 1 ఆ- 67ప.)

అని అనంతుడీసందర్భంలో అన్యహల్సంయుక్తాల నుద్దేశించి "ద్విత్వ" శబ్దాన్ని ప్రయోగించడం సమంజసంకాదు.

నాలకు మాత్రమే చిహ్నాలనడం సమంజసం - అయితే శ్రీ కల్లూరివారు వ్రాసిన విధంగా "త్ృ" లోవున్న ఋకారం క్రావడిగానే మారితే అది స్వరరహితమైన "త్, ర్" అనే రెండు వ్యంజనాల రూపంమాత్రమే అవుతుందికాని "త్ర" యెలాఅవుతుంది ? ఈ విషయమంతా గమనింపని ఒకానొకడు శ్రీ కల్లూరివారి వ్రాతను సమర్థిస్తూ "రవర్ణమువస్తే తెలుగు లిపి స్వభావమును బట్టి క్రావడి అని వ్రాసియుంటారు" — అని ఒక చోట వ్రాశాడు - అత్వ విశిష్టమైన రకారం తెలుగు లిపిలో క్రావడిగా మారుతుందా ? మారితే అందులో స్వరం యెక్కడ ? - అత్వ విశిష్టమైన వర్ణం యెప్పుడూ క్రావడిగా మారదు - అందులో వున్న వ్యంజన రకారం మాత్రమే క్రావడిగా మారి మిగిలినఅకారం మరొకగుర్తుగా యేర్పడుతుంది - (ట మొదలైన కొన్ని అక్షరాల్లో తలకట్లు వుండదు కాబట్టి అత్వంవున్న అవస్థలో అవి యేవిధంగా వుంటాయో ఆవిధంగానే వుంటాయి.)

అత్వవిశిష్టమైన రకారానికి "రేఫ" శబ్దాన్ని వ్యవహరింపకూడదని యిదివరకే తెలిపాను - అయితే లోగడ నేను ఉదాహరించిన (రారాపుటలో) లేఖలో "రేఫ" శబ్దం అత్వవిశిష్ట రకారానికి మారుగా వాడడం వున్నదని శ్రీవర్ధ్యులవారు పేర్కొన్నారు. దానికి ఉదాహరణగా "చ॥ నజభజజల్ జరేఫలఁబెనంగి..." (కవిజనాశ్రియము) అని ఒక ప్రయోగాన్ని యిచ్చారు - గణవాచకాలైన భ, జ, న, స, మ, య, ర, త, మొదలైన అక్షరాల్లో వున్న అకారాలు ("హయవరట్" మొదలైన సూత్రాల్లో వున్నట్టుగా) ఉచ్చారణసౌలభ్యంకోసం (భ్-జ్-న్-స్-మ్-య్-ర్-త్- అని వుచ్చరించడం కష్టంకాబట్టి) వచ్చినవే కాని వేరుకాదు - భ, జ, న, ఇత్యాదుల్లో వున్న అకారాలు వుచ్చారణ సౌలభ్యం కోసం వచ్చినవే కాకపోతే

చంపకకేసరి ॥ "సజసాస్వలా యతి గజంబులఁ జంపకకేసరిన్"

కుసుమితలతావేల్లిత ॥ "విస్మత్నల్ యాయల్ కుసుమితలతావేల్లితన్ వళ్ళురుద్రుల్" [ల-సా-సంగ్రహం - 1ఆ - 35పుట.]

మేదిని[వాణి] ॥ "మృదయతి నజ్భజగ్గములు మేదినీ సమాఖ్యన్"

(అప్ప - 4ఆ - 16ఛందం- 289పుట.)

మొదలైనవృత్తాల్లో చిత్రకవి పెద్దన, అప్పకవులు "స, వ" అనడానికి "స్వ" అనీ; "మ, త, నల్" అనడానికి "మత్నల్" అనీ; "న, జ, భ, జ, ర, గ ములు" అనడానికి "నజ్భజగ్గములు" అనీ గణాక్షరాలను సంయుక్తాలుగా చేసి ప్రయోగించడానికి అవకాశమే లేదు - భ, జ, న మొదలైన గణాక్షరాలలో వున్న అకారస్వరం సహజమైందికాక ఉచ్చారణ సౌలభ్యంకోసం వున్నది కాబట్టే అది లోపించడానికీ, "జ్భ" మొదలైన సంయుక్తాలుయేర్పడడానికీ అవకాశం లభించింది. ఉచ్చారణార్థం వున్న స్వరం గాబట్టే కవిజనాశ్రయకర్తకూడా రగణంలోని రకారాన్ని రేఫగా వ్యవహరించాడు - అత్వవిశిష్టమైన రకారానికి "రేఫ" అని వ్యవహరించడమనేది కేవలం తెలుగులోనేకాదు - సంస్కృతంలోకూడా యెక్కడా లేదు - ఉన్నది అని గట్టిగా వాదించేవారు తగిన ఆధారంతో "రేఫ" శబ్దాన్ని అత్వవిశిష్టరకారానికి గ్రహణ అయ్యేట్లుగా యెక్కడ యేవిధమైన రూపసాధనలో సంస్కృతవ్యాకరణకర్తలు పేర్కొన్నారో సోదాహరణంగా నిరూపించడం అవసరం- అది అలా వాదించేవారి కర్తవ్యంకూడా- అవిధంగా నిరూపించుకోనకుండానే ఊరికే వాదించి ప్రయోజనం వుండదు.

"రేఫ అంటే పొల్లురకారమే గాని అత్వవిశిష్టరకారం కాదని స్పష్టంగా అభిప్రాయపడిన చిన్నయసూరి తన "ఆంధ్ర శబ్దశాసనము" లో (32పుట) "ఋత్వంబునకు ర వర్ణంబగు" అనీ, "సంస్కృత సూత్రాంధ్ర వ్యాకరణం" లో - "ఉ రా న త్వేషయస్య రో వా - (అనజ్వేషయస్య ఋతో రః)" - అనీ. బాలవ్యాకరణంలో "ద్వంద్వంబునందు ఋ కారంబునకు రవర్ణంబు విభాష నగు" అనీ సూత్రాలు రచించి వేటిల్లోనూ "రేఫ" అని వ్యవహరించ లేదు- బాలవ్యాకరణంలో యెక్కడైనా రేఫ - ర కార శబ్దాలను మాత్రమే చిన్నయ వుపయోగించాడుగాని ఈ "ద్వంద్వంబున" ఇత్యాది పైసూత్రంలో తప్ప మరెక్కడాకూడా "ర వర్ణము" అని వర్ణశబ్ద ప్రయోగంతో "ర" ను నిర్దేశింపలేదు - ఈ ఒక్క సందర్భంలోనే చిన్నయ "ర వర్ణము" అని యెందుకు వ్యవహరించాలి? ఇతరచోట్లల్లో లాగానే యిక్కడకూడా "రేఫ" శబ్దాన్ని యెందుకు ప్రయోగింపలేదు? అనే యీ ప్రశ్నలకు సమాధానం - "రేఫంటె పొల్లు రకారమేకాని స్వర విశిష్టంకాదు కాబట్టే" అనేదే సమాధానం - "రి, రు, రె, రొ" మొదలైన వాటినికూడా మనం

రేఫలుగానే వ్యవహరిస్తాము - ఇక్కడ స్వర విషయంకాక కేవలం పొల్లు రకారాన్ని మాత్రమే (వ్యంజనాన్నే) గ్రహిస్తాం కాబట్టే రేఫ శబ్దాన్ని యిటువంటి చోట్ల వ్యవహరిస్తాము - స్వర విశిష్టంగానే గ్రహించాల్సివచ్చినప్పుడు "రి" కారం, "రు" కారం అనే పద్ధతిలోనో లేక "రీ" "రూ" అనే పద్ధతిలోనో గ్రహిస్తాము - దీన్నిబట్టి చూచినా "రేఫ" అంటే రకార వ్యంజనమనే మనకు తేలేసారాంశం -

అసలు-ర + ఇఫ=రేఫ - అనిగదా రూపం - ర + ఇఫ - అన్నప్పుడున్న రకారంలోని అకారం యెప్పుడైనా ఉచ్చారణ సౌకర్యానికి వచ్చిందిగా భావించుకొని సంధి (గుణం) చేసుకోవాలేగాని స్వతస్సిద్ధమైన అకారంగా భావించుకొని సంధిచేసుకోకూడదు - వాస్తవానికి స్వతస్సిద్ధమైన అకారంకల "ర" వర్ణానికి "ఇఫ" ప్రత్యయం చేరనే చేరదు - అవిధంగా స్వతస్సిద్ధమైన అకారంకల "ర" వర్ణంమీదనే "ఇఫ" ప్రత్యయం చేరవలసివస్తే రి, రు, రే, రో మొదలైన సహజాలైన యితర స్వరాలుకల వాటిమీదకూడా చేరి "రీఫ - ర్వీఫ - రయిఫ - రవిఫ" వగైరా వెర్రి రూపాలన్నీ తయారవుతాయి - అందుకే మామూలుగా ఉచ్చారణ సౌలభ్యం కోసమని పెట్టుకొన్న ‡ అకారంకల రకారానికి మాత్రమే ఇఫ ప్రత్యయం

---

‡ అయితే యిక్కడ "ఉచ్చారణ సౌలభ్యం కోసం అకారాన్నే యెందుకు పెట్టుకోవాలి? ఇకారాన్ని కాని ఉకారాన్ని కాని ఏదో ఒక మరొక స్వరాన్ని యెందుకు పెట్టుకోకూడదు? ఉచ్చారణ సౌలభ్యానికై అకార వ్యతిరిక్త స్వరాలనే పెట్టుకొని రి + ఇఫ=రీఫ, రు + ఇఫ=ర్వీఫ అనే పద్ధతిలో "రీఫ" అనికాని "ర్వీఫ" అనికాని ఆయా రూపాలతో రకార వ్యంజనాన్ని యెందుకువ్యవహరించకూడదు? కేవలం అకారం మాత్రమే చేర్చి ర + ఇఫ= అనే యెందుకు వ్యవహరించాలి?" - అని యెవరైనా ప్రశ్నలు వెయ్యడానికి అవకాశంవున్నది - ఉచ్చారణ సౌలభ్యానికై అకారాన్ని మాత్రమే చేర్చడమనేది అనాదిగావున్న ఒక సాంప్రదాయం - ఎప్పుడో కొన్ని వందల యేళ్ళపూర్వం "హ, య, వ, ర ట్ - ఞ, మ, ఙ, ణ, నమ్, - ఝభఞ్ - ఘఢధష్ - మొదలైన మహేశ్వర సూత్రాల్లో అకారమే ఉచ్చారణ సౌకర్యార్థం వినియోగించబడింది - అకారం బ్రహ్మ (ఆనందో

చేరుతుందనీ, సహజమైన అకారంకల రకారానికి చేరదనీ భావించడం సర్వ విధాలా సమంజసం - † ఇంతకూ ఈ చర్చవల్ల "కు, కృ" మొదలైన అకార వ్యతిరిక్త స్వరాలుకల హల్లుల మీద తెలకట్టు వుండడంవల్ల అందమూ, నిండుతనమూ తప్ప ప్రత్యేకమైన ప్రయోజనమేమీలేదనీ, ఆవిధంగా ప్రయోజనరహితంగా వున్న యీ తలకట్టువల్ల కొందరు కవిపండిత విమర్శకులు కొన్ని పొరపాట్లు వ్రాశారనీ తేలుతున్నది -

శ్రీ కల్లూరివారు తమ గూఢార్థ ప్రకాశిక 4 వ పుటలో (ప్రథమ ముద్రణం) "క్ౢప్తము" అని వ్రాసినందుకు శ్రీ వజ్ఝలవారు తమ ఆం-వ్యా-సం - సర్వస్వంలో (49 పుట) - "గూఢార్థ ప్రకాశికాకర్త 'క్ౢప్తము' అని చూపక "క్ౢప్తమః" అని చూపుటచే (......) ఌ కారము హల్లు పయినిల్చు

బ్రహ్మ) పదార్థ వాచకమని దాన్ని వినియోగించి వుండవచ్చు - లేదా అక్షర సమామ్నాయంలో అకారం మొట్టమొదటిది కాబట్టి ముఖ్యంగా దాన్నే వినియోగించి వుండవచ్చు - అసలు అకారవ్యతిరిక్త స్వరాలను వినియోగించి ఉచ్చరించడంకంటే అకారాన్ని వినియోగించి ఉచ్చరించడం సులభం, సుఖం కూడా - ఈ సులభాపేక్షతోనే, ఈ సుఖాపేక్షతోనే ఆమహేశ్వర సూత్రాల్లో హకారాదుల్లో అకారం వుచ్చారణ సౌకర్యార్థం ప్రవేశపెట్టబడి వుంటుంది - అనాదిగా - అనుశ్రుతంగా - అలవాటుగా - మన తాతముత్తాల దగ్గరనుంచి మనకు నియమ పూర్వకంగా సంక్రమించింది కాబట్టే ఉచ్చారణ సౌకర్యానికి హల్లులమీద అకారం ఒక్కటే చేర్చబడుతున్నది ! అనేదే పై ప్రశ్నలకు సమాధానం —

† "ఆనక్ స్యాద్వృతోద్వంద్వే । రేఫశ్చైరికవేర్మతే" అని అథర్వణ విరచితంగా వెలసిన యీ వికృతి వివేక కారికలో ర వర్ణాన్ని వుద్దేశించి "రేఫ" శబ్దాన్ని వినియోగించడం కేవలం పొరపాటని యీ పరిశీలనవల్ల తేలుతున్నది - చింతామణీ, బాల వ్యాకరణ సూత్రవ్యాఖ్యాన కర్తలలాగానే ప్రావడి తత్వాన్ని దృష్టిలో పెట్టుకోక పైనుండే తలకట్టును అకారంగా భావించడం వల్లనే యీ పొరపాటు కూడా దొర్లిందనడం సమంజసం —

తెలుఁగులో "అ్రదువ- "విద్రువ" మొదలైన పదాల్లోని సంయుక్తాక్షరాలు(్రదుకారాలు) తేల్చి పలుకబడతాయి-అందువల్ల ఆ"్రదు"కారాలకు పూర్వంలోవుండేలఘ్వక్షరాలు గురువులుగా మారవు - "దృ" కారం యేవిధంగా తేల్చి పల్కబడుతుందో ఆ విధంగానే ఈ "అ్రదువ" ఇత్యాదుల్లోని "్రదు" కారంకూడా తేల్చి పలకబడుతుంది. ఈ"దృ-్రదు"లు రెండింటినీ ఒకే రకంగా తేల్చి పల్కుతుండేవారు కాబట్టే అ్రదువ-వి్రదువ ఇత్యాది ఋకారంవుండని ఈ తెలుగు పదాల్లోకూడా కొందరు "అదృవ-విదృవ" అని వ్రటువసుడిని వ్రాస్తూండేవారు-అటువంటి వ్రాతలు చూచిన అప్పకవి "అ్రదువ" మొదలైన వాటిల్లో ఋకారం లేదని యీ క్రింది పద్యంలో స్పష్టపరచాడు-

> ఆ॥ వె॥ అ్రదువ వి్రదువ నను క్రియాపదంబులయందుఁ
> దగిలి వ్రటుసుడుల పగిది నుండు
> వ్రాలు తేలఁ బల్కఁ గాిర కొమ్ములు గాని
> వ్రటుసుడులు గావు వనజనాభ! - (అప్ప - 2 ఆ - 71 ప.)

ఈ "ఋ" కారానికి కేవలం హల్లుగానే వ్యవహారమనేది ఎంతో ప్రాచీన కాలంలోనే వున్నది. కాబట్టే ఈ క్రింది

నపుడు "అ" కారానుమాపకమగు తలకట్టు వ్రాయరాదని యాతఁడు తలంచెనని తోఁచుచున్నది - ఆపక్షమునందు దుఃఖము మున్నగుచోటు లందలి యుకారలేఖనము నందును......" — అని విమర్శించారు - కాని అకార వ్యతిరిక్త స్వరాలుగల హల్లులపై ఆ తలకట్టు నిల్చుటవల్ల ప్రయోజనమేమో చర్చింపలేదు - అసలు ఈ పరిశీలనవల్ల కొందరు కవిపండితులు "కృ, వృ" ఇత్యాదుల్లో క్రిందుగా విడిగా వుండే వ్రటువసుడి సహజత్వాన్ని దాని సంపూర్ణ వర్ణతత్వాన్ని గమనింపక పైని అందంకోసకు వచ్చిన తలకట్టును చూచి ఆ తలకట్టు అకార స్వరచిహ్నంగా భావించారని స్పష్టపడుతున్నది.

ప్రయోగంలో ప్రాసలో రేఫంతో సమానంగా ఋకారం వ్యవహరింపబడింది.

కం॥ ఆ ఋషి పుత్త్రిఁడు గట్టిన
చీరలు మృదులములు నవ్య శిష్టములు మనో
హారులు నాతని పృథుకటి
భారంబున నొక్క కనకపట్టము వేర్చెలున్.

(భార. ఆరణ్య. 3 ఆ. 104 ప)

ఈ పై పద్యంలో ఉన్న ఋషి శబ్దంలోని ఋకారం హల్లుగా అంటే రుకారంగా వ్యవహరింపబడి రేఫంతో ప్రాస సమకూర్చబడింది. ఇటువంటి ప్రాసలనుచూచిన లక్షణ వేత్తలు ఋకారానికీ రేఫకూ ప్రాస చెల్లుతుందని అంగీకరించి "ఋ" కార స్థానంలో వినియోగించే రేఫను తొలగించాలని అభిప్రాయ పడ్డారు. ఆకారణంచేతనే అనంతాదులు యీ క్రింది లక్షణాలు సృష్టించుకున్నారు.

కం॥ ఆరయ స్వరగణమయ్యు ఋ
కారము ఋప్రాసమనఁగఁ గదియును రేఫన్
జేరి తన యురముఁ దన్నిన
యాఋషి పాదంబుఁ బిసికె నచ్యుతుఁడనఁగన్

(ఛందోద. 1 ఆ. 43 ప.)

తే॥ గీ॥ స్వరము లెల్లను బ్రకృతి భావంబులందు
రా వెనుక వ్రాయుయగు ఋస్వరంగ బోకండు
తగు యణాదేశమున రేఫ మగుటఁ జేసి
ప్రాసముల కట్లయగు వళిపట్లఁ గాదు

(అప్ప. 3 ఆ. 358 ప.)

ఇంతకూ యీ పరిశీలనవల్ల నేడు వ్యావహారిక భాషలో

ఋ కార స్థానంలో రుకారాన్ని వ్యవహరించడమనేది యీనాటిది కాదనీ అది దోషంకూడా కాదనీ స్పష్టపడుతున్నది †

ఋ, ౠలను ఈనాడుమనసంవ్యవహారంలో రు, రూలుగా వ్యవహరిస్తున్నట్లే ఌ, ౡ లను లు, లూలుగా వ్యవహరిస్తున్నాము. ఋ కారానికి ఇతర అచ్చులవలె స్వతంత్ర ఉచ్చారణ యే విధంగాలేదో అదే విధంగా ఈ "ఌ" కారానికి సైతం స్వతంత్ర ఉచ్చారణ లేదనే చెప్పవచ్చు. ఌ కారానికి "ల" కారానికి * స్థానంతోపాటు బాహ్య ప్రయత్నాలుకూడా ఒక్కటే అవడంచేత "ఌ" కార "ల" కారాలకు పుట్టుకలోనే అత్యంత సన్నిహితత్వం ఉన్నది. ఈసన్నిహితత్వంచేతనే అత్యంత ప్రాచీన కాలంలోకూడా "ఌ" కార స్థానంలో యేదో ఒక రూపంలో "ల" కారం కనపడుతూనే ఉన్నది. "ఌ"కారంలో "ల"కారోచ్చారణ ఈ నాటిది కాదు. "పదాద్యంబులు ఋ ఌ వర్ణంబులు ర ల తుల్యంబులు" (బాల. ప్రకీ. 1 సూ.) అని చిన్నయసూరి ఌ కారానికి లకార తుల్యత్వాన్ని మొన్న మొన్న చెప్పాడే కాని మొదటినుంచీకూడా ఈ "ఌ" కారంలో రెండు ల కారాలున్నవనీ ఒక అజ్భాగం ‡ కూడా ఉన్నదనీ ప్రాచీనులు చెప్పుకున్నారు. సిద్ధాంత కౌముదిలో "ఋతి సవర్ణే

---

† క్రిష్ణుడు అన్నప్పుడు రికార వ్యవహారం సైతం దోషం కాదని లోగడే నిరూపింప బడింది.

* "ఌ - ల" లకు స్థానం దంతాలు - సంవార నాద ఘోషాలు బాహ్య ప్రయత్నాలు.

‡ ప్రాచీనులు ఌ కారంలో అజ్భాగం ఉన్నట్లు చెప్పారు కాని ఆ అజ్భాగం స్వతంత్రమైనది ఉన్నట్లుగా కనబడడంలేదు. ఇకార భాగం

ఋవా "అనే వార్తిక సందర్భంలో" ఆద్యస్య (ఋకారస్య) మధ్యేద్వౌ రేఫౌ తయో రేకామాత్రా అభితోజ్భక్తే రపరా" అని భట్టోజీ దీక్షితులు వ్రాసిన వాక్యాలను "ఋ ౡ వర్ణయో ర్మిథస్సావర్ణ్యం వాచ్యమ్" అనే వార్తికాన్ని అనుసరించీ, సంస్కృత వ్యాకరణజ్ఞుల సాంప్రదాయాన్ని అనుసరించీ–"ఆద్యస్య (ౡకారస్య) మధ్యే ద్వౌ లకారౌ తయో రేకామాత్రా అభితోజ్భక్తేరపరా" అని ౡకార విషయికంగా అవసరమైనప్పుడు మార్చుకోవలసిఉన్నది. "ఋతి సవర్ణే ఋ వా" అనే వార్తికంలాగానే "ౡతి సవర్ణే ౡ వా" అనే వార్తికాన్ని కూడాసృష్టించుకొనవలసివున్నది. ఈసందర్భంలోఋకారంలో ఉన్న అజ్భాగ విశిష్టత యేమిటో చెప్పని భట్టోజీ దీక్షితులు దానికంటే మిక్కిలి స్వల్ప వ్యవహారంకల ౡ కార విషయం చెప్పకుండా విడిచి పుచ్చడంలో ఆశ్చర్యం లేదు. భట్టోజీ దీక్షితులు "ఋ" కారంలో రెండు రేఫలున్నాయని భావించిన విధంగానే "ౡ" కారంలో సైతం రెండు ల కారాలున్నాయని భావించి ఉంటాడనడంలో సందేహింప నక్కరలేదు. అయితే విపుల వ్యవహారంలో ఉన్న ఋ కారంలో ఉన్నదన్న ద్విరేఫోచ్చారణ యేనాడుభ్రష్టమై యేక రేఫోచ్చారణ ప్రవేశించిందో

కొంతకాలమూ, ఆ "ఇ" కార భాగం భ్రష్టమైన తరువాత "ఉ" కార భాగమూ అందులో నిలబడ్డాయి. వాస్తవానికి "ౡ" కారంలో ప్రత్యేకమైన అచ్త్వం అనేది ఉంటే ఇతర స్వరాలకు విభిన్నమైన స్వరతత్వం ఉన్నప్పుడే దాని అచ్త్వంలో ఉన్న ప్రత్యేకత గుర్తింప బడుతుంది. "ఇ" కార భాగం కాని యితర యే అచ్చులో భాగం ఉన్నప్పటికీ యే అజ్భాగాన్ని తానుపొందినో ఆ అచ్చు కలదే అవుతుంది గాని ౡ కారం స్వతంత్ర స్వరం యెన్నటికీకాదు.

చెప్పలేనప్పుడు అత్యల్ప వ్యవహారంగల "ఌ" కారంలో ఉన్న వన్న రెండు లకారాల ఉచ్చారణ యేనాడు భ్రష్టమై యేక "ల" కారోచ్చారణ ప్రవేశించిందో చెప్పడం అసామాన్యమైన విషయం. అయితే ఋ కారంతోపాటే ఌ కారంకూడా సహజంగానే పరిణతిచెంది వుంటుందనడంలో తప్పేమీ ఉండదు.

ప్రాచీన కాలంలో ఋ కారం రి కారంగా ఉచ్చరింపబడినట్లే ఌ కారం లి కారంగా ఉచ్చరింపబడుతుండేది. ఋషి, ఋతువు మొదలైన పదాల్లో ఋకారం ఆదిలో ఉన్నట్టుగా ఌ కారం ఆదిలో ఉన్న పదాలు యెక్కడో యేకాక్షర కోశాల్లో తప్ప యితరత్రా శూన్యాలనే చెప్పవచ్చు. కౢప్తము, కౢప్తి, కౢప్తికము, కౢప్తకీల, కౢప్తధూపము మొదలైన అయిదారు పదాలు తప్ప ఌకారంతో కూడిన పదాలు అధికంగా లేవనే చెప్పవచ్చు. ఈ అయిదారు పదాలైనా అవస్థాంతరంలో కౢప్త శబ్దంతో కూడినవేగాని ప్రత్యేక పదాలేమీ కావు. ప్రాచీన కాలంలో ఋ కారాన్ని "రి" కారంగా వాడినట్లే కౢప్తము మొదలైన పదాల్లో ఉన్న "ఌ" కారాన్ని "లి" కారంగా వ్యవహరిస్తుండే వారు.

ఉ॥ ఆవనజాక్షిఁ జెంది సర సాభిమతోజ్వల వస్తు జాతముల్
కేవల భోగయోగ్య పరికౢ † ప్తి ....
(హరి. ఉ. 8 ఆ. 318 ప.)

---

† కేవల .... పరికౢప్తి అనే ఈ పాఠాన్ని 1926వ సంవత్సర ముద్రిణలో "కేవల యోగభాగ్య పరికీర్తి" అని సవరించి ముద్రించారు.

ఇటువంటి ప్రయోగాల్లో "కౢప్త శబ్దం కౢప్తి" గా వ్యవహరింపబడి యతి సరిపెట్టుకోబడింది. అయితే ఇక్కడకూడా పూర్వుల దృష్టి ప్రసరించి "క్రి" కారాన్ని "కృ" కారంగా మార్చుకొని ఇకార ఋ కారాలకు మైత్రి సమకూర్చుకున్నట్లే "క్లి" కారానికి "కౢ" కారంగా మార్చుకొని ఇకార ఌకారాలకు యతి మైత్రిని సంపాదించుకున్నారు. "ఋ ఌ వర్ణయోర్మిథస్సావర్ణ్యం వాచ్యమ్" అనే వార్తికాన్ని అనుసరించి ఋ ఌ వర్ణాలు మిత్రాలు అవడంచేత ఋ కారానికి యే యే అక్షరాలు యతి చెల్లుతాయో ఌ కారానికి సైతం ఆయా అక్షరాలే యతికిచెల్లుతాయి. కాబట్టే ప్రాచీనకాలంలోవున్న ఛందో గ్రంథకర్తలు ఌ కారానికి ప్రత్యేకంగా యతి లక్షణం చెప్పలేదు. ఒక్క అనంతుడు మాత్రం ఌ కారవళికి లక్షణంగాను లక్ష్యంగాను ఈ క్రింది పద్యం రచించాడు.

తే॥ గీ॥ మును ఋకార మీయేలతో నొనరినట్లు
చేరదొకట యణాదేశ కారణమున
ఘన లకారంబయగును ఌకారవిరతి
కౢప్తి లేదు శౌరి గుణావళికి ననంగ† (ఛందో - 1 ఆ 89 ప.)

† అనంతుడు "ఋ-రి" ల మైత్రినే చెప్పాడనే సిద్ధాంతం ప్రకారం "ఌ-లి, ళి" ల మైత్రినే చెప్పి వుంటాడనడమే సమంజసంగా వుంటుంది. అనంతుడు "ఋ-రు" ల మైత్రినే చెప్పాడని ఆతని లక్షణ పద్యాలను అసమగ్రంగా దిద్దడానికి సాహసించిన ఒకానొకడు "కౢప్తి లేదు శౌరి గుణావళుల కనంగ" అని "ఌ-ళుల" మైత్రిని చెప్పినట్లుగా హాస్యాస్పదమైన అసమగ్రమైన సవరణ ప్రవేశపెట్టాడు. అది సమంజసంకాదు. దీన్ని గురించి "త్రిలిఙ్గ" లో (11-9-1950) అప్పకవీయ వివరణ విమర్శనా లేశము అనే నా వ్యాసంలో సమగ్రంగా చర్చించివున్నాను.

"ఋ" కారం క్రమక్రమంగా " రి " కారోచ్చారణలో నుంచి "రు" కారోచ్చారణలోకి మారిపోయినట్లే ఈ " ఌ " కారం సైతం " లి " కారోచ్చారణలోనుంచి " లు " కారోచ్చారణలోకి మార్పు చెందింది. " ఌ " కారంగల పదాలు అత్యల్పాలు అయినప్పటికీ యే "కౢప్త" శబ్దాన్నో వ్రాయవలసి వచ్చినప్పుడు ప్రాచీనకాలంలో పండిత కవులు కొందరు "క్లుప్త" శబ్దంగానే వ్రాస్తూ వుండేవారు. అక్షర వివేకజ్ఞానం విశేషంగాకల అప్పకవి అంతటివాడు " కౢప్త " శబ్దంలోవున్న " కౢ " కారాన్ని " క్లు " కారంగా వ్రాసుకొని ఆ " క్లు " కారాన్ని సంయుక్తాక్షరంగా భావించాడు. ఈ అప్పకవి తన అప్పకవీయం 3 వ ఆశ్వాసంలో సంయుతాసంయుత ప్రాసకు ఈ క్రింది విధంగా లక్షణ లక్ష్యాలు ప్రవచించాడు.

తే॥ గీ॥ రలలు తమ క్రింద జడ్డలై క్రాలు వ్రాలు
ప్రాస వర్ణంబులై వానిఁ బాసియైనఁ
గూడియైనను బెఱయడుగులను నిలుపు
సంయుతాసంయుత ప్రాస సంజ్ఞఁదనరి - (314 ప.)

తే॥ గీ॥ పాండి ద్రచ్చఁగ నిమ్ము నా తండ్రి కృష్ణ
వేండు కొనియెద నందాకఁ బండ్లు దినుము
దుండగపుఁ జేష్టలును నోటిగాండ్రతనము
మెండు గాఁజొచ్చె నీకు నైదేండ్లకనఁగ - (315 ప.)

రకారం సంయుక్తంగాకల అక్షరానికి, రకారం సంయుక్తంగా లేని దానికీ ప్రాసచెల్లడం సంయుతాసంయుతప్రాస అనబడుతుంది. "పాండి"అన్నప్పుడు రకారం లేదు - "తండ్రి"

అన్నప్పుడు రకారం వున్నది. ఇక్కడ "ండి - ంఢ్రి" అనే అక్షరాలకు ప్రాస ప్రయోగింపబడింది. ఈ విధంగానే "దుండ - గాండ్ర" అన్నప్పుడు కూడా సంయుతాసంయుతాలకు ప్రాస ప్రయోగింపబడింది. ఆవిధంగానే "ల" కారం సంయుక్తంగాకల అక్షరానికి "ల" కార సంయుక్తంలేని అక్షరానికి ప్రాస చెల్లడం సంయుతాసంయుత ప్రాస అనబడుతుంది. లకార రహితమైన "వేండు" లోని "ండు" కీ, 'ల' కార సహితమైన "పండ్లు" లోని "ండ్లు" కీ ప్రాస ప్రయోగింపబడింది. ఈవిధంగానె "మెండు - పండ్లు" అన్నప్పుడుకూడా సంయుతాసంయుతాలకు ప్రాస ప్రయోగింపబడింది. ఈ లక్ష్యాలు అప్పకవి తనంతట తాను స్వంతంగా రచించి వుదాహరించాడు - ఈ సంయుతాసంయుత ప్రాసకు లక్ష్యాలు మరికొన్ని మహాకవి ప్రయోగాలుకూడా ఉదాహరించాడు. అందులో ఆదిపర్వంలోనుంచి "క్షత్రియ - క్షత్రియ - (చా) రిత్రము - (మాం) ధాతృ" - అని "త్రి - త్రి - త్ర - తృ" అనే వాటిని; (వీటిలో త్రి - త్రి - త్ర - లు మూడూ సంయుక్తాలు, తృ అసంయుక్తం) — సోముని హరివంశంలో నుంచి "నాత్రో — రాతుల్ — ఈత్రై — చేతుల్" అనేవాటిని; (వీటిలో "త్రో - తు - తు - లు మూడు అసంయుక్తాలు, - త్రై - సంయుక్తం) - దేవీవిజయంలో నుంచి "వాక్త్రి - శక్తు, సంభ్ర - కుంభ" అనేవాటిని; (వీటిలో - క్త్రి - రేఫ సంయుక్తం - క్తు - రేఫాసంయుక్తం - ంభ్ర - రేఫ సంయుక్తం - ంభ - రేఫాసంయుక్తం) - పద్మపురాణంలో నుంచి "శ్రీక - లోకు - ఈకి - పాకృ -" అనేవాటిని

(వీటిలో క - కు - కృ - లు అసంయుక్తాలు - క్రి) - సంయుక్తం) వుదాహరించాడు - ఈవిధంగానే లకార సంయుతా సంయుతప్రాసకు కూడా వుదాహరణ మహాకవిప్రయోగం యివ్వాలి కాబట్టి "లకార శ్లిష్టమునకు రాఘవపాండవీయమున" అని వ్రాసి యీ క్రిందిపద్యాన్ని వుదాహరించాడు -

శా॥ లోకత్రాణ రతిం దదాదిమ మహీ లోక ప్రవేశోత్క భా
స్వత్క్లుప్త ప్రథమ ద్వితీయపదకుంజన్ మంజు మంజీర గ
ర్జా కల్పాపుల రామభారత కథాసర్గంబుల న్మించు వా
ల్మీకి వ్యాసులఁ గొల్చెదం దనుభయ శ్లేషార్థ సంసిద్ధికిన్ -

ఇందు "లోక - స్వక్లు - ర్జాక - ల్మీకి" అనేవాటిని (వీటిలో క - క - కి - అనేవి అసంయుక్తాలుగాను - క్లు - సంయుక్తంగాను) ఉదాహరించాడు - "కౢప్త" శబ్దాన్ని "క్లుప్త" అని "క్లు" కారంకలదిగా (ఉత్వలకారంతో) వ్రాసుకొనబట్టే అది అసంయుక్త మన్న సంగతి మరచిపోయి, సంయుక్తంగా భావించి అప్పకవి దీన్ని సంయుతాసంయుతప్రాసకు ఉదాహరణంగా పేర్కొన్నాడు- వాస్తవానికి యిందులో వుపయోగింపబడింది మామూలు వ్యంజనాక్షరప్రాసే గాని సంయుతాసంయుత ప్రాస కానేకాదు - "కౢప్త" అని వ్రాసుకోనవలసిన పదాన్ని ఉచ్చారణ ప్రకారం "క్లుప్త" అని ఉత్వలకారం కలదిగా వ్రాసుకొని ఆపద్యంలో సంయుతాసంయుత ప్రాస ప్రయోగింపబడిందని అప్పకవి భావించాడు - వ్యావహారికానికి వశమై అప్పకవి పడిన యీ పొరపాటును గమనించిన శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు అప్పకవీయంలో ఈ రాఘవ

పాండవీయ పద్యంలోని "కౢప్త" శబ్దానికి ఫుట్‌నోట్ క్రింద —"కౢప్తలో "కౢ" కారము లకారశ్లిష్టముకాదు — అప్పకవి యీ పద్యమును లకారశ్లిష్టమున కుదాహరణముగ నిచ్చుట ప్రమాదము—" అని వ్రాశారు.†

---

† లకారశ్లిష్టంగా "కౢప్త" శబ్దాన్ని అప్పకవి వ్యవహారవశాత్తు "క్లుప్త" శబ్దంగా వ్రాసుకొని పొరపాటుగా వుదాహరించాడన్న సంగతి గమనింపక మాగురువులు శ్రీ వేదుల రామశాస్త్రిగారు ఈ క్రిందివిధంగా వ్రాయడం సమంజసంగా లేదు —

— "ఇందు రెండవపాదములో "కౢప్త" అని ఌకార రూపాచ్చుతో గూడిన కకారప్రాసమున్ను తక్కిన పాదములలో ఇతరాచ్చులతోఁ గూడిన కకార ప్రాసములున్ను యథాసంభవముగా (యాదృచ్ఛికముగా) నూరనార్యుఁడు కూర్చియుండగా అప్పకవి దీనిని లకార శ్లిష్టాశ్లిష్ట (ఒకచో లకారయుతము తక్కినచోట్ల లకారాయుతము అనునట్లు) ప్రాసమున కుదాహరించి యున్నాడు — (ఈ విషయమే గిడుగువారు క్రింది భాగమున నిట్లు "కౢప్త" లో "కౢ" లకారశ్లిష్టము గాదు — అప్పకవి యీ పద్యములను లకారశ్లిష్టమున కుదాహరణముగ నిచ్చుట ప్రమాదము అని "రిమార్కు" వ్రాసిరి) ఇది కేవల ప్రమాదమా ఏదైనా హేతువున్నదా యని విమర్శించ వలసియున్నది — మిక్కిలి పరికింపగా ఇది కేవల ప్రమాదమనియు కౢప్తలో ఌకారమే గాని లకారము కానరాదనియు అప్పకవి యెఱుఁగని వాఁడనియు మాకుతోఁచదు. (ఇట్టిది ప్రమాదపతితము కాదని తోఁచుచున్నది.) మఱి యెట్లన అప్పకవి సంయుతాసంయుత ప్రాసమునకు చెప్పిన లక్షణమును బట్టియు జూపిన లక్ష్యములం బట్టియు రకారముతోఁ గాని లకారముతోఁ గాని సంయుక్తముగా నొకచోటను అట్టి సంయుక్తము లేకుండ నొకచోటను కూర్చి యున్నప్పుడే యీ సంయుతాసంయుత ప్రాసము చెల్లుచుండుటచేత

ఆదికవులు ఋకార ఌకారముల రకారద్వయ లకారద్వయ మేళనోత్పత్తి పరికించి అట్టి మేళనముచే నేర్పడు అన్త్వ హల్త్వములు కార్యవశమునఁ గైకొనుచు వచ్చిరనియు అందుచేతనే (హల్త్వ వివక్షచేతనే) వాడు + ఋషి ఇత్యాదులలో ఋ అను అచ్చు పరమైనను ప్రకృతిభావము (సంధి రామి) పొసగుచుండెననియు "ఆ ఋక్షి గట్టిన చీరలు" ఇత్యాది ప్రాసలు ప్రాసహల్లు ప్రధానమైనదైననూ చెల్లుబడి యగుచున్నవనియు ఋకార ఌకారములలోని రకార లకారములను బట్టి ఒకచో ఋకార ఌకార విశిష్టముగాను ఒకచో రకార లకార విశిష్టముగాను కూర్చినను హల్త్వ వివక్షచే సంయుక్తత్వ భంగమున్ను ప్రాసభంగమున్ను లేదనియు (ఈపక్షమున ఒక రకారముగాని ఒక లకారముగాని ఎక్కువగానున్నను మూఁటిసంయోగములో నొకటి లేకున్నను చెల్లునను సిద్ధాంతముచే బాధ యెంతమాత్రమును లేదనిభావము.) తలంచి అట్టి ప్రాసములే కూర్చిరనియు తరువాతివారు అట్టి నియమమును పాటించక ఒకచో రకార లకార విశిష్టముగాను మరియొకచో రకార లకార రహితముగాను (ఋకార ఌకార రూపమగు అచ్చుకూడా లేకుండ మరియొక యచ్చుతో గూడినవియు రకార లకార రహితములును గూడ) ప్రయోగించిరనియు అట్టివానిని గూడ గ్రహింపకతీరదు గావున వానికిని అనుగుణముగా లక్షణము చెప్పి లక్ష్యములు చూపునపుడు లకార విశిష్టముగా (లకార సంయుక్తముగా) నొకచోటను; కేవల లకార రహితముగా నొకచోటను ఉన్న మహాకవుల లక్ష్యము లతనికి దొరకమింజేసి కావలయు (అద్యతనులవి ఉండినను దొరకినను పాటింపక) అవియే చూపిన ప్రామాణ్య దార్ఢ్యముండదనియు పైని చెప్పిన విధముగా ఌకారశ్లిష్టమును లకారశ్లిష్టముగా గైకొనుటలో బాధయెంత మాత్రమును లేమిందలంచి (నవీన ప్రయోగముల సాధుత్వసాధనము నగునని యెంచి) మహాకవియగు సూరనార్యుని పద్యము నిట్లు లకార శ్లిష్టాశ్లిష్ట ప్రాసమున నుదాహరించినాడని తోచుచున్నది.

(అప్ప-వివ-313-314 పు.)

ఋ, ఌ వర్ణాలు అవసరాన్ని బట్టి అచ్చులుగాను హల్లులుగాను రెండు విధాలా వుపయోగపడతాయని మాగురువుల భావం - ఆభావం ప్రకారమే అప్పకవికూడా "క్లృప్త" అన్నప్పుడున్న ఌకారాన్ని హల్లుగా

తలచి అది సంయుక్తమని వుదాహరించాడని వారి అభిప్రాయం - సంస్కృతంలో ఋ, ౠ వర్ణాలకు వికల్పంగా అచ్త్వం వున్నది - అంటే - ఋ ౠ వర్ణాలు అవసరమైతే అచ్చులుగాను హల్లులుగాను రెండు విధాలా వినియోగించుకోవచ్చు - బ్రహ్మ + ఋషి అన్నప్పుడు ఋకారానికి అచ్త్వ వివక్షలో బ్రహ్మర్షి అనీ హల్త్వ వివక్షలో బ్రహ్మఋషి అనీ రెండు రూపాలూ అవుతాయి. అందుకే సంస్కృత వ్యాకరణాలలో ఇటువంటి చోట్ల వికల్పం ప్రకృతిభావం చెప్పుతున్నారు. అయితే తెలుగులో మాత్రం ఋ ౠ వర్ణాలకు హల్త్వ వివక్షగాని అచ్త్వ వివక్షలేదు - అతడు + ఋషి అన్నప్పుడు అతడు ఋషి అనే రూపమే అవుతుందిగాని "అతడృషి" అని ఏ పరిస్థితిలోనూ కాదు - అందుకే - ఋ ౠ వర్ణాలకు అచ్త్వం ఏపరిస్థితిలోనూ తెలుగులో లేదన్న సంగతి గమనించిన చిన్నయసూరి "పదాద్యంబులు ఋ ౠ వర్ణంబులు రలతుల్యంబులు" (బాల - ప్రకీ - 1 సూ) అని నిత్యంగానే హల్తుల్యత్వాన్ని పేర్కొన్నాడు - ఇంతెందుకు? అప్పకవి రేఫ శ్లిష్టానికి ఉదాహరణగా ఆదిపర్వంలోవున్న "క్షత్రియ వంశ్యులై" అనే పద్యాన్ని పేర్కొన్నాడు - అందులో "క్షత్రియ - క్షత్రియరిత్రము - ధాతృ -" రేఫ కల సంయుక్తాలుగా మూండక్షరాలు ఋ కారం గల అసంయుక్తంగా ఒక అక్షరమూ వున్నదని అప్పకవి భావించాడు - ఋకారంలోను హల్త్వమున్నదనే భావం అతనిలో వుంటే దీన్ని సంయుతాసంయుత ప్రాసకు లక్ష్యంగా యెలా యిస్తాడు ? ఋ కారంలో హల్త్వమున్నప్పుడు అది సంయుత ప్రాస అవుతుందేగాని సంయుతాసంయుత ప్రాస యెలా అవుతుంది? ఒకవేళ అప్పకవి ఇక్కడ ఋ కారానికి అచ్త్వ వివక్ష చేసుకున్నాడని ఎవరైనా అనవచ్చు - హల్త్వ వివక్షచేసుకొనడానికి ఎప్పుడైతే అవకాశం లభించిందో అప్పుడే ఎవరైనా ప్రతిపక్షులు "మాంధాతృ" అన్నప్పుడు "తృ" లోని ఋ కారం హల్త్వ వివక్షకలదేనని అది హల్త్వ వివక్షకలదవడంచేత అ పద్యంలో వుపయోగింపబడింది సంయుతప్రాసమే గాని సంయుతాసంయుతప్రాస కానే కాదని వాదించడానికి అవకాశం లేదా ? ఈ విధంగా ప్రతిపక్షవాదానికి అవకాశం యిచ్చే యీ పద్యం కేవల సంయుతాసంయుతప్రాసకే లక్ష్యమని అప్పకవి యెలా పేర్కొంటాడు ? కాబట్టి ఋకారంలో హల్త్వ

వివక్షవున్నదని అప్పకవి భావించాడనడానికి ఆస్కారంలేదు - ఈ విధంగానే "భాషాకౢప్త" అన్నప్పుడు "కౢ" కారంలో వున్న "ఌ" కారంలో హల్త్వం వున్నదని అప్పకవి భావించి దాన్ని సంయుతంగా భావించాడనడం సమంజసంకాదు - "కౢప్త" అన్నప్పుడు "కౢ"కారాన్ని ఉచ్చారణ ప్రకారం "క్లు" కారంగా వ్రాసుకొని అది సంయుక్తమని భావించాడనడంలోనే సమంజసమున్నది - ఒకవేళ "కౢప్త" అన్నప్పుడు ఌ కారాన్ని హల్త్వ వివక్షతోనే అప్పకవి గ్రహించినా అక్కడ హల్త్వ వివక్షలేదనీ అది సంయుతాసంయుతప్రాస కాదనీ అత్త్వవివక్షే వున్నదనీ అది సమప్రాసకే లక్ష్యమని ప్రతిపక్షులు వాదించడానికి అవకాశం వున్నది. కాబట్టి లోకత్రాణ ఇత్యాది పద్యాన్ని అప్పకవి "ల" కారశ్లిష్టానికి ఉదాహరణగా పేర్కొనడం ఏమాత్రమూ సమంససంకాదు- భాషాకౢప్త అన్నప్పుడు "కౢ"కారాన్ని "క్లు" కారంగా వ్రాసికొని సంయుక్తమని భావించాడనడమే యుక్తియుక్తం-అలాకాకపోతే "లకారశ్లిష్టమునకు రాఘవపాండవీయమున" అని అప్పకవి స్పష్టంగా లకారశ్లిష్టమని వ్రాయనే వ్రాయడు.

అప్పకవీయ వివరణంలో పేర్కొన్నట్లు అప్పకవికి ఋ ఌ వర్ణాలకు హల్త్వ వివక్షకూడా వున్నదనే భావమే వుంటే "ఋ ప్రాస" కు ఈ క్రింది విధంగా లక్షణం చెప్పనే చెప్పడు —

తే॥ గీ॥ స్వరము లెల్లను బ్రకృతి భావంబులందు
రా వెనుక వ్రాల యగు ఋస్వరంబొకండు
తగు యణాదేశమున రేఫ మగుటఁజేసి
ప్రాసముల కెల్లయగు వళిపట్లఁగాదు -

(అప్ప - 3 ఆ - 357 ప.)

అని లక్షణంచెప్పి "ధారుణి - గారేఫ - నారికి - ఆఋభు" అని లక్ష్యం యిచ్చాడు - ఋ కారస్వరం యణాదేశంలో రేఫగా మారుతుంది కాబట్టి రేఫకు ఋకారానికి ప్రాస చెల్లిందని యిక్కడ కారణం చెప్పాడు- ఋకారానికి హల్త్వవివక్షవున్నదనే భావమే అప్పకవిలో వుంటే "కొన్ని

ఌకార దీర్ఘం - అంటే - ౡకారం సంస్కృత వ్యాకరణంలో పేర్కొనబడలేదు - అయినప్పటికీ స్వరం అనేదానికి ప్రతిదానికీ జనవ్యవహారంలో ఒక్కొక అవస్థలో దీర్ఘం రావడం సహజం కాబట్టి ఌకారానికికూడా దీర్ఘం యేర్పడింది. అయినా ఈ "ౡ" అనేఅక్షరం మొట్టమొదట సంస్కృత భాషలో లేనేలేదు కాబట్టి ఆ అక్షరంకల పదాలు లేకుండా పోయాయి. అసలు అక్షరమే లేనప్పుడు పదం యెక్కడనుంచి వస్తుంది? కొంతకాలానికి వ్యవహారవశాత్తు వచ్చిన ఌకారదీర్ఘాన్ని సంస్కృత వ్యాకరణం తెలిసినవారు (వైయాకరణులు) అంగీకరించారు - "ఋ ఌ వర్ణయో ర్మిథస్సావర్ణ్యం వాచ్యం" అనే వార్తికంలో ఋ ఌ వర్ణాలకు పరస్పరం సవర్ణత్వం చెప్పబడింది కాబట్టి (ఋకారానికి దీర్ఘం సైతం వున్న కారణంచేత) ఋకారదీర్ఘంతోపాటు ఌకారదీర్ఘాన్ని కూడా గ్రహించాలని

చోట్ల ఋకారానికి హల్త్వవివక్షవున్నది కాబట్టి ఋకారానికి "రేఫకు" ప్రాస చెల్లిందని స్పష్టంగా చెప్పనే చెప్పేవాడు - ఈ భావం అతనిలో లేదు కాబట్టే ఋకార రేఫలకు ప్రాస చెప్పే విషయంలో కారణం వెతుక్కోవలసివచ్చింది - వెతుక్కొని "ఋకారం యణాదేశంలో రేఫ అవుతుంది కాబట్టి" అని కారణం చెప్పుకున్నాడు - వాస్తవానికి జనవ్యవహారంలో ఋకారానికి సంపూర్ణంగా రేఫోచ్చారణ ఏర్పడి స్థిరపడింది కాబట్టే ఋకార రేఫలకు ప్రాస చెల్లింది - యణాదేశంలో ఋకారం రకారంగా మారినంత మాత్రంచేతనే ఆ రెండింటికి ప్రాస చెల్లితే; యణాదేశంలో 'ఇ' కారం 'య' కారంగాను 'ఉ' కారం 'వ' కారంగాను మారడంవల్ల ఇకార యకారాలకు ఉ కార వకారాలకు ప్రాస చెల్లుతుందని చెప్పవలసిందేనా? ఇంతకూ అప్పకవి హృదయంలో ఋకారానికి హల్త్వవివక్షవున్నది అనే భావం లేదనడమే మనకు ముఖ్యం - ఋకారానికి హల్త్వవివక్ష లేనప్పుడు ఌ కారానికి వున్నదనడంలో సమంజసమేముంటుంది ?

సకారణంగా అంగీకరించారు-ఈ అంగీకారంవల్ల ౡ అనే అక్షరం అయితే యేర్పడింది గాని దానితో కూడిన శబ్దం మాత్రం ఒక్కటైనా లేదు-("ౡ" అంటే పర్వతమని ఎక్కడో ఏకాక్షరకోశంలో వున్నట్లుగుర్తు.) అందుకే చిన్నయసూరికూడా సామమాత్రంగా ౡకారదీర్ఘాన్ని సంస్కృతవర్ణాల్లో పఠించినా ఉదాహరణ యివ్వవలసివచ్చేసరికి "ౡకారము" అని మాత్రం వ్రాసి వూరుకున్నాడు - ఒక్క పదమైనా లేని యీ అక్షరాన్ని మనం నేర్చుకొనడం కేవలం వ్యర్థం - అది మన వర్ణసమామ్నాయంలో వుండవలసిన పనిలేదుకూడా - ఈ "ఌ" కారదీర్ఘం కేవలం నామమాత్రంగా ఒక్క అక్షరరూపంలో నిల్చి వున్నప్పటికీ "ఌ" కారం "లు"కారంగా† మారినట్లే "ౡ"

† ఉచ్చారణలో "ఌ" కారం "లు" కారంగా మారిందని పూర్వం నిరూపించాను. ఆ విధంగా మారడంవల్ల "కౢప్తి" మొదలైన ఌకారాలు గల పదాలను ఉత్వ లకారాలు కలవిగా (క్లుప్తి అని) వ్రాయడం ప్రారంభించారు. ఆ విధంగా లుకారాలు కలవిగా యెప్పుడైతే వ్రాయడం ప్రారంభించారో అప్పుడవి సంయుక్తాలుగా కన్పడుతుండడంవల్ల అవి నిజంగా సంయుక్తాక్షరాలనే భావించి వాటికి పూర్వంలో వున్న లఘ్వక్షరాలు గురువులుగా మారతాయని కొందరు కవులు పూర్వకాలంలో భ్రమపడుతుండేవారు. అంటే - "పరికౢప్తి" అని వ్రాసుకొనడానికి మారు ఉచ్చారణననుసరించి "పరిక్లుప్తి" అని వ్రాసుకుని "క్లు" అనేది సంయుక్తం కాబట్టి దాని పూర్వాక్షరమైన "రి" కారం గురువుగా చెల్లుతుందని కొందరు కవులు భ్రమపడేవార్న మాట - కాబట్టే అనంతుడు -

క॥ ఉపరిని హల్సంయుతమై
నపుడూదును స్వరసమన్వితాక్షర మగునే

కారం "లూ" కారంగా మారిపోయింది. దానికి వుదాహరణ చిన్నయసూరి "ఌాకారము" అని యిచ్చినట్లే మనంకూడా "లూంకారం" అని యిచ్చుకొని సరిపెట్టుకోవాలి -

ఇంతకూ ఈ పరిశీలనవల్ల ఋ - ౠ లను రు - రూ లుగాను ఌ, ౡ లను లు, లూ గాను ఈనాడు మనం వ్యవహరించడం దోషం కాదనీ అటువంటి వ్యవహారం పూర్వకాలంలో పండితకవుల్లో సైతం వున్నదనీ సుస్పష్టంగా తెలుతున్నది -

అయి, ఐ - అవు, ఔ

జనవ్యవహారంలో ఉచ్చారణ సౌలభ్యంకోసం "అయి" అనే రెండక్షరాలు "ఐ" గా మారిపోయినాయి - "అయి" అన్నప్పుడున్న "అ" కారం కంఠంలోనుంచీ "యి" కారం (స్వరవ్యంజనాలు రెండూకూడా) తాలువుల్లోనుంచీ జన్మిం

నపుడూఁద దాదివర్ణము
ప్రపాద్యయము పరికృతంబు పరికౢప్తి యనన్

(ఛం - ద - 4 ఆ. 58 ప.)

అని ప్రవచించాడు - హల్లుతో సంయుక్తమయినట్టయితేనే పూర్వాక్షరం గురువవుతుందనీ అచ్చుతో కూడితే పూర్వాక్షరం గురువు కానేరదనీ అనంతుడు వాకొన్నాడు. పరికౢప్తి అన్నప్పుడున్న "కౢ" కారాన్ని "క్ల" కారంగా కొందరు వ్రాసికొని అది సంయుక్తమవడం చేత దాని పూర్వాక్షరం గురువు అవుతుందని భావించేవారు - కాబట్టే అక్కడ వున్నది అచ్చేగాని హల్లుకాదనీ హల్లైతేనే పూర్వాక్షరం గురువు అవుతుందని అచ్చయితే పూర్వాక్షరం గురువు కానేరదనీ అనంతుడు స్పష్టంగా పేర్కొన్నాడు -

చాయి. "ఐ" కారంకూడా కంఠతాలు స్థానాల్లోనుంచే జన్మించింది. భిన్నస్థానాలుకల భిన్నాక్షరాలను రెండింటిని వుచ్చరించడంకంటే భిన్నస్థానాలుకల ఒకే అక్షరాన్ని వుచ్చరించడం మానవుడికి సులభం - అందుకే "అయి" ని "ఐ" గా మార్చి వుచ్చరించుతాడు - ఉచ్చారణలో "అయి" అనే రెండక్షరాలు "ఐ" గా మారడమనేది యీనాడు జరిగిందికాదు - అత్యంత ప్రాచీన కాలంలోనే జరిగి ఆమార్పును గ్రాంథికత్వంకూడా సంక్రమించి అనేక విషయాల్లో స్థిరపడి పోయింది. (కు + అయి) కయి, కయివారం, సయిచు, సయితం, అయిదు, కయిదువు, కయిత, దయివారు, మొదలైన వాటిల్లోవున్న "అయి" అనేది "ఐ" గా మారి కై, కైవారం, సైచు, సైతం, ఐదు, కైదువు, కైత, దైవారు, మొదలైనవిగా సిద్ధించాయి- ఈ రూపాలను రెండు విధాలగాను (అయికారంకలవిగానూ, ఐకారంకలవిగానూ) ప్రాచీన కవులు అనేకులు ప్రయోగించారు - అందుకనే యిటువంటి రూపాలను "వాయిరవుర్వ్యక్రతమా" † అని ఆంధ్ర శబ్ద చింతామణికారుడూ, "ఆచ్ఛికంబు

† ఈ "వాయిరవుర్వ్యక్రతమా" అనే యీ ఆంధ్రశబ్ద చింతామణి సూత్రానికి బాలసరస్వత్యాదులు ఈ క్రిందివిధంగా వ్యాఖ్యలు వ్రాశారు.
— "వక్రతమా = ఐకారౌకారములు, వా = వికల్పముగా, అయి రవుః = అయి అవు లౌను - ఉ : కై, కయి - కైలు, కయులు † - ఔర, అవుర" - (బాల - అజం - 209 పుట)

† ముద్రణ ప్రతిలో "కయిలు" అని వుదాహరించబడివుంది అదిపొరపాటు. "ఉద్బహుత్వే" అనే ఆంధ్రశబ్దచింతామణిసూత్రంవల్ల కయి+లు=కయులు అని అవుతుంది కాబట్టి "కయిలు" అనివుండ నేరదు.

లందయి యవులకు వక్రతమంబులు బహుళంబుగానగు" (బాల-క్రియ - 103 సూ) అని బాలవ్యాకరణకర్తా సూత్రాలు రచించుకొని సాధించుకున్నారు - "అయి" అనే రెండక్షరాలూ

క॥ "క్రమమున వక్రతమములకు
నమరు నయిక్కును నవుక్కునని యెకు నాదే
శములు వికల్పంబున......" (అప్ప. 2 ఆ - 110 ప.)

ఆ॥ వె॥ "లోకహితము కొఱకుఁ బైకొని దుష్టుల
లయ మొనర్చి శిష్టులయిన నృపుల
నేలయేలనిలిపె........." (అప్ప - 2 ఆ. 111 ప.)

— "వికృతి శబ్దేషు యః ఐత్, ఔచ్చ - తయోర్వా అయి, అవు ఇత్యేతా వాదేశౌ స్తః॥ చెలువలై - చెలువలయి - అవురా - ఔరా"— (వాసుదేవ వృత్తి- నావద్ద వున్న తాళపత్ర ప్రతి-14 వపత్రం. 2 వ. వైపు - చివరి పంక్తి)

— "వికృతి శబ్దేషు యః ఐత్, ఔచ్చ, తయోర్వా అయి, అవు ఇత్యేతా వాదేశౌ స్తః - చెలువై, చెలువయి, ఔరా, అవురా, ఇత్యాది"— (అహో - పం - 297 పుట.)

ఈ వ్యాఖ్యాతలు అందరూ "ఐ" కారానికి "అయి" వస్తుందని పేర్కొని ఐకారంకల రూపాలే మొదటివని పేర్కొనడం పొరపాటు - అగు ధాతువు క్త్వాంతరూపమైన "అయి" అనేది "ఐ" గా మారుతుంది. ఇదికూడా గమనింపక అహోబలుడంతటివాడు గుడ్డిగా వాసుదేవుడి వ్రాతను అనుసరించి "చెలువై - చెలువయి" అని వుదాహరణ లివ్వడం కేవలం పొరపాటు. చింతామణి సూత్రానికి "అయి" కి "ఐ" వస్తుందనీ, "ఐ" కి "అయి" వస్తుందనీ రెండు విధాలా అర్థం చెప్పుకోవచ్చు. కాబట్టి మొదట బహుళ వ్యవహారం కల"అయి" "ఐ"గా మారడాన్ని చెప్పి కయి-కై, చెలువయి-చెలువై వంటి వుదాహరణలిచ్చి తర్వాత "ఐ" "అయి"గా మారడాన్ని చెప్పి కైక, కయికవంటి వుదాహరణ లిచ్చివుంటే యెంతో బాగుండేది.

యిక్కడ "ఐ" గా మారడంలో కేవలం స్థానసామ్యమేకాక ప్రయత్న సామ్యంకూడా వున్నది. "అయి" అనే దాంట్లో "అ" కారానికి సంవార నాద ఘోషాలు, "యి" కారానికి (స్వరవ్యంజనాలకు రెండింటికీకూడా) సంవారనాద ఘోషాలు బాహ్య ప్రయత్నాలు - అయితే ఈ "అయి" అనే రెండక్షరాలకూ జరిగే బాహ్య ప్రయత్నాలే (సంవారనాద ఘోషాలే) "ఐ"అనే దానికికూడా జరుగుతాయి-ఈ విధంగా స్థాన ప్రయత్నసామ్యం వున్నది కాబట్టే "అయి"అనే రెండక్షరాలూ "ఐ" గా మారతాయి- "ఆచ్ఛికంబులం దయి యవ్వులకు" ఇత్యాది సూత్రంచేత చిన్నయసూరి "కయి, పయి" అనే ఇదంత రూపాలను "కై, పై" అని ఐదంతాలుగా సాధించుకున్నాడు - ఈ "కయి, పయి" వంటి శబ్దాలకు చిన్నయ మతంలో ద్వితీయా విభక్తిలో "ను" ప్రయత్యంచేరి "ఇకారంబుమీఁది†

† ఈసూత్రం అసంపూర్ణంగా వుంది. ఇకారం మీదవుండే "కు,ను, వు" లు ఆగమాత్మకాలైతేనే వాటిల్లో వుండే ఉకారం ఇకారంగా మారుతుంది. శాబ్దికమైతే మారదు - "ఇనుము" ఇత్యాదుల్లో "ఇ" కారంమీద "ను" వున్నప్పటికీ యిక్కడ "ను"లోని ఉత్వం ఇత్వంగామారి "ఇనిము" అని కానేరదు - కారణం ఆ "ను" కారం శాబ్దికమవ్వడమే - "కు, ను, వు" అనే అక్షరాలు ప్రత్యేక నిర్దేశాలై ఇకారంమీద వున్నప్పటికీ వాటిల్లో ఉకారం ఇకారంగా మారదు - కాబట్టే చిన్నయ సూరికూడా "ఇకారంబు మీఁది కు ను వు" అన్నప్పుడు "ది" అనే దానిలోని "ఇ" కారం తర్వాత "కు" వున్నప్పటికీ యిక్కడ "కు" లో వున్న ఉకారాన్ని ఇకారంగాచేసి ప్రయోగించలేదు. ఆ విధంగా ప్రత్యేక నిర్దేశంలో కూడా కు, ను, వు ల్లో వుండే ఉత్వం ఇత్వంగా మారేట్లయితే పైసూత్రంలో "ది" లో వున్న ఇత్వాన్ని బట్టి "కు" "కి"గా మారాలి. ఈ "కి" అనే దాన్ని పురస్కరించుకొని "ను" "ని" గాను, ఈ "ని"

కునువు క్రియా విభక్తుల యుత్వంబున కిత్వంబగు'' (బాల - తత్స - 26 సూ.) అనే సూత్రంచేత చివరి ఇకారానికి ఉకారం ఆదేశంగావచ్చి "కయిని, పయిని" వంటి రూపాలు సిద్ధించుతాయి. ఇప్పుడు ఈ "కయిని, పయిని," వంటి రూపాల్లోవున్న ''అయి" అనే అక్షరాలకు "ఆచ్ఛికంబులందయియవులకు" ఇత్యాది సూత్రంచేత ''ఐ'' కారం ఆదేశంగా వచ్చి "కైని, పైని" వంటి రూపాలు సిద్ధించడంలో అభ్యంతరమేమీ లేదు - అటువంటప్పుడు చిన్నయసూరి "ఐకారం బీతుల్యంబు'' - అని ప్రత్యేకంగా సూత్రాన్ని రచించుకుని ''ఐ" కారానికి ఈ తుల్యత్వాన్ని చెప్పుకొని "ఇకారంబు మీఁది కునువు" ఇత్యాది సూత్రాన్ని వర్తింపచేసుకొని "కైని, పైని'' వంటి రూపాలు తయారు చేసుకొనవలసిన అవసరం యేమాత్రమూ లేదు - అంటే - "ఐకారం బీతుల్యంబు" అనే సూత్రాన్ని చిన్నయ సూత్రీకరించడం వ్యర్థ ‡ మన్నమాట - "కయిని, పయిని'' ఇత్యాదుల్లోవుండే ''అయి" అనే దానికి "ఐ" కారంవచ్చి కైని, పైని, అనే రూపాలు తన సూత్రాల

అనే దాన్ని పురస్కరించుకొని ''వు" ''వి'' గాను మారి ''ఇకారంబుమీఁది కినివి క్రియావిభక్తుల యుత్వంబున కిత్వంబగు" అని సూత్రం తయారయ్యేది. అందుకే ప్రత్యేక నిర్దేశంలో కూడా ''కునువు'' ల్లోఉత్వం ఇత్వంగా మారదనడం—

‡ "ఐకారం బీతుల్యంబు" అనే యీ చిన్నయ సూత్రం ఐకారాంతాలైన రై మొదలైన శబ్దాలకు ద్వితీయాదుల్లో, రైని, రైకివంటి రూపాలను సిద్ధింప జెయ్యడానికి సూత్రింపబడిందని యెవరైనా అనవచ్చు - ఈ సూత్రం " రై '' మొదలైన శబ్దాలకు అనువర్తించే విషయమైకూడా ముందు చర్చింపబడుతుంది—

ననుసరించే సిద్ధిస్తాయన్న సంగతి చిన్నయసూరి మరచిపోయి కై, పై అనే వాటిల్లోవున్న ఐ కారాలు "అయి" అనేదాని స్థానంలో వచ్చినవన్న సంగతి గమనించక అవి సహజ "ఐ" కారా లనుకొని వాటికికూడా ఈ తుల్యత్వాన్ని ప్రవచించి "ఐకారం బీతుల్యంబు" అనే సూత్రంలో కైని, కైకి, పైని, పైకి అని ఉదాహరించాడు- ఈ తెలుగు పదాలను ఉదాహరించకుండా కేవలం "రైని, రైకి" అనే వాటిని (సంస్కృతసమాలను) మాత్రమే వుదాహరించి వూరుకుంటే తన వ్యాకరణ సూత్ర ప్రవృత్తిలోనైనా నిర్దుష్టత్వం వుండేది. కైని, కైకి, పైని, పైకి అనే రూపాలు "ఐకారం బీతుల్యంబు" అనే సూత్రం లేకుండానే సిద్ధిస్తుండగా ఆ సూత్రాన్ని సృష్టించి దానిక్రింద ఆ రూపాలను ఉదాహరించవలసిన అవసరం యెంతమాత్రమూ లేదు- అనవసరమైన యీసూత్రాన్ని సృష్టించడంవల్ల "అయి" అనే అక్షరాలు "ఐ" కారంగామారి స్థిరపడిందన్న సంగతి కూడా మరచిపోయి 'కై, పై' ఇత్యాదుల్లోని "ఐ" కారం కూడా పృథగక్షరమని - అంటే - సహజమైన యితర "ఐ" కారం (ఆదేశంగారాని దాని) వంటిదేనని ఆతడు భావించాడన డానికి ఆస్కారంవున్నది - "అయి" స్థానంలో ఆదేశంగా వచ్చిన "ఐ" కారాన్ని (ఆదేశంగారాని) ప్రత్యేకాక్షరంగా చిన్నయసూరే భావించాడంటే "అయి" "ఐ" గా మారడమనేది సుస్థిరంగా స్థిరపడి పోయిందన్న సంగతి ఋజువు చెయ్యాడమన్న మాట - "అయి" "ఐ" గా మారడమనేది యెంతగాస్థిరపడక పోతే ఆదేశంగావచ్చిన ఆ "ఐ" కారాన్ని స్వతంత్రాక్షరంగా చిన్నయసూరి భావిస్తాడు! ఆవిధంగాచిన్నయసూరి "కైని

పైని" అన్నప్పుడున్న "ఐ" కారాలు స్వతంత్ర స్వరాలనీ, "అయి" స్థానంలో ఆదేశంగా వచ్చినవి కావనీ భావించి వుండక, "కయిని, పయిని" అన్నప్పుడున్న "అయి" స్థానంలో తన సూత్రం ప్రకారం ఆదేశంగావచ్చినవేనన్న సంగతే గమనించి వుంటే "ఐ" కారానికి ఈతుల్యత్వాన్ని చెప్పనేచెప్పడు- ఒకవేళ సంస్కృత సమాలకోసం (రై మొదలైన వాటికోసం) చెప్పుకున్నా ఆ సూత్రంక్రింద లక్ష్యాలుగా "కైని, కైకి-పైని, పైకి" అనే వుదాహరణలు పేర్కొనేవాడేకాదు†

ఇంతగా - స్థాన ప్రయత్న సామ్యంవల్లా జనోచ్చారణలో సులభాపేక్షవల్లా "అయి" అనే రెండక్షరాలూ "ఐ" గా మారి యెప్పుడైతే స్థిరపడ్డాయో అప్పటినుంచే తిరిగి యిదే స్థాన ప్రయత్న సామ్యాలవల్ల జనవ్యవహారంలో విపరీతస్థితిలో అక్షరవినిమయం జరిగి స్వతస్సిద్ధమైన "ఐ" కారానికి ("అయి" అనే దానిస్థానంలో రాని "ఐ" కారానికి) "అయి" అనే రెం

---

† "ఐ" కారానికి ఈ తుల్యత్వం ఆంధ్రశబ్దచింతామణిలో చెప్పబడలేదు - చింతామణిలో "ని" ప్రత్యయం ప్రత్యేకంగా పరిగణింపబడి "నిరమోమహతామ్" అనే సూత్రంచేత మహత్తులకు మాత్రమే విధింపబడింది - ఇదే విధంగా "కి" ప్రత్యయం ప్రత్యేకంగా పరిగణింపబడి ఇకారాంతాలకు విధింపబడింది. ఆ కారణంచేత రైని, రైకి, పైని, పైకి వంటి రూపాలు చింతామణివల్ల సాధింపబడడంలేదు. ఈ రైని, రైకి వంటి రూపాలు చింతామణికి పూరకంగా వెలసి అథర్వణ కృతాలుగా చెల్లుబాటవుతున్న కారికలచేతకూడా సాధ్యాలుకావడంలేదు. చింతామణిలో "స్త్రోవావౌరైనావోః" అనే సూత్రంలో రైశబ్ద ప్రసక్తివచ్చింది. ఆ సందర్భంలోనైనా "రైని, రైకి" వంటి రూపాలు ఏవిధంగా సిద్ధించుతాయో అన్నయోచన చింతామణికర్తకుగాని చింతామణి వ్యాఖ్యాకర్తలకుగాని రాకపోవడం ఆశ్చర్యకరం!

డక్షరాలు రావడం ప్రారంభించినాయి - అంటే "కైక" † మొదలైన "ఐ" కారాలుగల పదాలు "కయిక" మొదలైన "అయి" కారాలు కలవిగా మారడం మొదలు పెట్టాయన్న మాట - ఈ విధంగా శాబ్దికమైన "ఐ" కారం "అయి" గా మారడమే కాకుండా "కయిక" మొదలైన రూపాల్లో ప్రాచీన కాలంనుంచీకూడా స్థిరపడి ప్రామాణిక కవి ప్రయోగారూఢమై పోయింది. కాబట్టే శ్రీవఝ్ఝలవారుకూడా ఆం. వ్యా. సం. స. 1654 వ పుటలో విపరీతస్థితికి - "కైక=కయిక" అని వుదాహరించారు.

ఈ విపరీతస్థితే వ్యవహారవశాన "కై" మొదలైన సంస్కృత పదాల్లోకూడా వచ్చింది. "రై" అన్నప్పుడు "ఐ"

---

† విపరీతస్థితికి - అంటే - ఐకారం "అయి" గా మారడానికి ఉదాహరణగా "కై, కయి" అనే వాటిని శ్రీ వఝ్ఝల చిన సీతారామ స్వామి శాస్త్రిగారు తమ ఆం. వ్యా. సం. సర్వస్వము 2 సంపుటము 1654 వ పుటలో (3 వ. పంక్తి) వుదాహరించడం కేవలం పొరపాటు - ఈ "కై" అనేదాన్ని శ్రీ వఝ్ఝలవారు చతుర్థీవిభక్తి ప్రత్యయంగా భావించారో "చెయ్యి, తొండము" ఇత్యాద్యర్థాలు కల శబ్దంగా భావించారో తెలియదు. ఏ విధంగా భావించినప్పటికీ "కై" అనేదే మొదటి రూపమనీ "కయి" అనేది తర్వాతి రూపమనీ అనడానికి ఆధారం యేమీలేదు - కై అనేదాన్ని వఝ్ఝలవారు విభక్తి ప్రత్యయంగానే గ్రహించి వుంటే "కు + అయి" అనేవాని మేళనంవల్ల "కయి" యేర్పడి ఆ తర్వాతనే "కై" అనేది సిద్ధించింది" అనే విషయం పరమసత్యం కాబట్టి "కై" అనేదే మొదటిదనడం సమంజసంకాదు - "కై" అనే దాన్ని శబ్దంగానే వఝ్ఝలవారు గ్రహించివుంటే "కై" అనేదే మొదటిదనీ "కయి" అనేది తర్వాతిదనీ చెప్పడానికి ఆధారాలు శూన్యాలు. "కయి" మీదనే "కై" సిద్ధించిందని చెప్పినా చెప్పవచ్చు.

కారానికి "అయి" వచ్చి "రై" "రయి" గా మారింది. ఈ విధంగా "రయి" గా మారడంవల్లనే దాని ద్వితీయలో "ను" వర్ణంవచ్చి ఆ "ను" వర్ణంలోని ఉత్వం "ఇ"త్వంగా(ఇకారంబు మీఁది కునువు ఇత్యాది చిన్నయసూరి సూత్రానుసారంగా) మారుతుంది - అప్పుడు "రయిని" అనే రూపం సిద్ధిస్తుంది - మామూలుగా తెలుగు సాంప్రదాయం ప్రకారం "అయి" కారానికి "ఐ" రావడం సహజం కాబట్టి తిరిగి "రయిని" అన్నప్పుడున్న "అయి" కారం "ఐ" కారంగా మారి "రైని" అవుతుంది. - అంటే- "రై" లోని "ఐ" కారం విపరీతంగా "అయి" గా (తెలుగు పదాల్లో విపరీత పరిణామం వచ్చినట్లే సామ్యంవల్ల సంస్కృత పదాల్లోకూడా) మారి "రయి" గా తయారైన "అయి" కారానికి తిరిగి "ఐ" కారంవచ్చి "రై" గా యథాస్థితిని పొందిందన్నమాట - ఈ విధంగా వ్యవహారవశాన "రై" "రయి" గా మారిందికాబట్టి "రైని" అనే రూపం సిద్ధించడం జరిగింది. ఆవిధంగా మారకపోతే "రైను" అని మాత్రమే అవుతుందిగాని "రైని" కానేకాదు -

మన వ్యాకరణకర్తలు "అయి" - అనే దానికి "ఐ" కారం రావడమనేది తెలుగులోనే అని చెప్పుతున్నారు కాబట్టి ఆకార్యవైపరీత్యం కూడా (ఐ - అయిగా మారడంకూడా) తెలుగులోనే అని చెప్పుకోవాలి-ఈఅభిప్రాయంతోనే చిన్నయ "ఆచ్ఛికంబులందయి ...." అని ఆచ్ఛికశబ్ద ప్రయోగం చేసి సూత్రరచన చేశాడు.

వాస్తవానికి "రైని, రైకి," వంటి రూపాలు రైశబ్దం మీద వ్యవహార వశాన తయారైన "రయిని, రయికి" వంటి

రూపాలలో "అయి" కి "ఐ" వచ్చి సిద్ధించినవే అయినప్పటికీ చిన్నయసూరి మాత్రం "ఐ" కారానికి ఈ తుల్యత్వం చెప్పుకుని "రైని, రైకి" వంటి రూపాలను తయారుచేసుకున్నాడు. ఆ విధంగా "ఐ" కారానికి ఈ తుల్యత్వం చెప్పుకొనడానికి కారణం "ఐ" కారానికి "అయి" రావడాన్ని (చిన్నయ తెలుగులోనే అంగీకరించలేదు -) సంస్కృత సమపదాల్లోకూడా అంగీకరించవలసి వస్తుందనేకాని వేరుకాదు - ఆవిధంగా సంస్కృత సమపదాల్లో "ఐ" కారానికి "అయి" కారం రావడాన్ని అంగీకరించడమే జరిగితే రైని, రైకి † వంటి రూపాలు తేలిగ్గా (ఐకారానికి ఈ తుల్యత్వం చెప్పుకోనక్కర లేకుండానే) సిద్ధిస్తాయి. అయితే ఈవిధంగా శాబ్దికమైన "ఐ" కారానికి "అయి" రావడాన్ని అంగీకరించడమే జరిగితే "హైయంగ, వైయాకరణ" ఇత్యాదిపదాల్లో కూడా "ఐ" కారానికి "అయి" కారంవచ్చి "హయియంగ, వయియాకరణ" అనే రూపాలనుకూడా అంగీకరించాల్సి వస్తుంది - వ్యావహారిక భాషలోనైనా "హయ్యంగ, వయ్యాకరణ" (ఇత్వలోప రూపాలు) వంటి రూపాలు వున్నాయిగాని "యి" కారాలు గల రూపాలు లేవు. వ్యావహారికంలోనే లేనప్పుడు గ్రాంథికంలో అంగీకరించడమెలాసంభవం? వ్యవహారంలో ఐ కారానికి "అయి" వచ్చి "రై" "రయి" గా తయారయ్యిందని లోగడ వ్రాశారే ఆవిధంగా "హైయంగ, వైయాకరణ" వంటివికూడా "హయియంగ, వయియాకరణ" అని "యి" కారాలుకలవిగా

---

† ముందు "రయిని, రయికి" వంటి రూపాలు సిద్ధిస్తాయి. అలా సిద్ధించాక ఇ కారం మీద "కు, ను"లు "కి, ని" లుగా మారతాయి-తర్వాతమామూలుగా "అయి"కి "ఐ" చేసుకోవచ్చుకాబట్టి రైని, రైకి వంటిరూపాలుసిద్ధిస్తాయి-

యెందుకుమారవు ? అలా మారలేదెందువల్ల ? అని ఎవరైనా ప్రశ్నలు వేయవచ్చు - " రై " శబ్దంలో " ఐ " కారం అవసానంలో వున్నది. ఆ విధంగా అవసానంలో వున్న " ఐ " కారం " అయి "గా మారడం అత్యంతం సులభం-" హైయంగ" ఇత్యాదుల్లో " ఐ " కారం అవసానంలో లేదు. అటువంటి చోట్ల "అయి" ని ఇ కారాంతంగా వుచ్చరించడం కష్టం - అందుకే "అయ్" గా వుచ్చరిస్తాం. ఈ కష్టం అవసానంలో వుండదు కాబట్టే "రై" శబ్దాన్ని "రయి" గా చేసుకుంటాము- అనేదే ఆ ప్రశ్నలకు సమాధానం -

ఈ విధంగా వ్యవహార వశాన రై శబ్దం " రయి " గా మారడంవల్ల "రయిని" వంటి రూపాలమీద "రైని" వంటి రూపాలు సిద్ధించి గ్రంథస్థమవడంతో "రై" శబ్దానికి "రయి" వంటి రూపాన్ని అంగీకరించని చిన్నయసూరి ఐకారానికి ఈ తుల్యత్వం చెప్పుకుని వాటిని సాధించుకోనవలసి వచ్చింది.

వాస్తవానికి రై శబ్దం వ్యవహారంలో "రయి" శబ్దంగా మారింది కాబట్టే "రయిని" వంటి రూపాలమీద (విపరీతంగా "అయి"కి "ఐ" వచ్చి) "రైని" వంటి రూపాలు వచ్చాయి. ఈ విధంగా వ్యవహారవశాన వచ్చిన "రైని" వంటి రూపాలు వ్యవహారబలంవల్ల కవులచేత ప్రయోగింపబడి వ్యాకరణకర్తల చేత అన్యథా (ఐకారానికి ఈతుల్యత్వం చెప్పుకునే రూపంలో) సాధించుకోబడ్డాయి.

అయితే ఈ "ఐ" కారం ఈవిధంగా విపరీతమై "అయి" గా మారడమే కాకుండా కొన్నిచోట్ల "అయ్" గా కూడా

మారింది - అంటే - "అయి" అన్నప్పుడున్న "యి" కారం లోని వ్యంజన స్వరాలలో(య్ + ఇ)చివరి స్వరం లోపించడం కూడా జరుగుతున్నదన్నమాట - "దైవము" అనే సంస్కృత సమరూపం "దైఅము" - "దైయము" - "దయ్యము" గా మారి ఈచివరిరూపం - అంటే - "దయ్యము" అనేది బహుళంగా ప్రాచీన కవిప్రయోగాల్లో ఆరూఢమైంది- "దైయము" అన్నప్పుడున్న "దై" లోని "ఐ" కారం "అయ్" గా మారి దయ్ + యము = దయ్యము అయినదనైనా చెప్ప వచ్చు - లేదా ఆ "దై" లోని "ఐ" కారం మామూలుగా "అయి"గానే మారి "దయి + యము" అన్నప్పుడు "యి" కారంలోని (య్ + ఇ అన్నప్పుడున్న) స్వరంమాత్రం లోపించి దయ్ + యము=దయ్యముఅయినదనైనా చెప్పవచ్చు. "దైయము" అనేపదం "దయ్యము" గా మారేటప్పుడు "దైలోని" "ఐ" కారం ఎప్పుడైనా (అయిగా మారినాసరే ఇకారలోపం వచ్చి) "అయ్" గా మారక తప్పదన్నమాట. "దైయము" అన్నప్పుడున్న "ఐ" కారం "అయి" గా మారినా "యి"కార స్వరలోపం జరిగి"అయ్"గా మారితేనేగాని"దయ్య ము" కాదనేవిషయం (తెలియక కాదు)గమనింపక శ్రీ వఝ్ఝల వారు"విపరీతస్థితికి"అని వుదాహరించుతూ"దైవము=(దైఅము= దైయము) దయ్యము" (ఆం-వ్యా-సం-సర్వస్వము 1654పుట) అని పేర్కొని వూరుకున్నారు. ఇక్కడ "దయ్యము" అనేది విపరీతస్థితికి- అంటే- "ఐకారం" "అయి" కారంగా మాత్రమే మారడానికి ఉదాహరణ అన్నట్లుగా వ్రాశారు. "అయి" అన్నప్పుడున్న "యి" లోని "ఇ" కారం లోపిస్తేనేగాని

"దయ్యము" కానేరదన్న సంగతి వారు గమనించినట్లు లేదు. నర్సులవారు అభిప్రాయపడినట్లు " ఐ " అనేది " అయి " గా మాత్రమే మారి వ్రాయుకుంటే " దైయము " అనేది " దయియము" అని చతురక్షర రూపమే అవుతుందిగాని "దయ్యము" అని త్ర్యక్షర రూపం యెలా అవుతుంది ? కాబట్టి " దై " అన్నప్పుడున్న " ఐ " కారం " అయ్ " గా నన్నా మారిందనాలి-లేదా- "అయి"గామారి చివరి "ఇ" కారానికి లోపం జరిగి "అయ్" గా తయారయ్యిందనైనా అనాలి - అయితే "అయి" లోని స్వరలోపం ఉచ్చారణ సౌలభ్యంకోసమే జరుగుతుంది. "ఇ" కారానికీ "య్ " కారానికీ రెండింటికీ కూడా స్థానం, బాహ్యప్రయత్నాలు † సామ్యంకలవి (ఒకే విధమైనవి)అవడంచేత య్ + ఇ ల మేళనంవల్ల యేర్పడిన "యి" కారంలోని "ఇ" కారం లోపించినా యిక్కడ స్థాన (బాహ్య) ప్రయత్నాల మార్పేమీ జరుగదు కాబట్టి అది లోపించడం జరుగుతుంది. ఆకారణంచేతనే "దైయము" - "దయ్యము"గా మారుతుంది -

ఈ విధంగా వికృతిపదమైన "దైయము" లోని " ఐ " కారం "అయ్" గా మారినట్లే సామ్యంవల్లనూ, ఉచ్చారణలో సంస్కృత పదంలో వున్నదైనా యెందులో వున్నదైనా సరే సౌలభ్యంకొరకు"ఐ"కారం "అయ్"గా మారడం ప్రాచీన కాలంలోనే జరిగింది. అందువల్లనే "హైయంగవము, నైయంక

---

† ఇ-య్ అనే వాటికి తాలువులు స్థానం - సంవారనాదఘోషాలు బాహ్యప్రయత్నాలు.

వము, నైయగ్రోధము, నైయర్థము, త్రైయంబకము, నైయాకర ణుడు" మొదలైన సంస్కృత సమపదాలలో వున్న "ఐ" కారా లను "అయ్" గా వుచ్చరిస్తూ తమ వుచ్చారణ కనుగుణంగా "హయ్యంగము, నయ్యంకవము, నయ్యగ్రోధము, నయ్యర్థము త్రియ్యంబకము, వయ్యాకరణుడు" అని ఐకారానికి మారు "అయ్" కలవిగా ప్రాచీనులు వ్రాస్తూవుండేవారు. కాబట్టే అప్పకవి -

క॥ హైయంగవీనమునకున్
నైయంకవ శబ్దమునకు నైయగ్రోధ
సైౖయజితాదుల కాదిని
వ్రాయంగావలయుఁ బ్రథమ వక్రతమంబుల్॥

క॥ వైయర్థ త్రైయంబక
వైయాకరణాగ్రగణ్య వైయాఘ్రిపద్
వైయాత్యంబుల మొదలను
వ్రాయందగు బుధులు ప్రథమ వక్రతమంబుల్ ॥

(అప్ప- 2 ఆ - 104, 105 ప.)

అని "హైయంగవీనము, నైయంకవము" మొదలైన శబ్దాలలో ప్రథమ వక్రతమాన్ని - అంటే - ఐ కారాన్ని వ్రాయాలని పేర్కొన్నాడు. "హైయంగము, త్రైయక్షము" మొదలైన ఐకారాలున్న పదాలను ఉచ్చారణ ననుసరించి "హయ్యంగము, త్రయ్యక్షము" అని "అయ్"కలవిగా వ్రాయ డమనే అలవాటు పూర్వకాలంలో పండితకవులకు కూడా వుండేది. అందుకే అప్పకవి ఒకసారికి రెండుసార్లు "హైయంగ" మొదలైన వాటిల్లో "య" కారానికి ద్విత్వం వ్రాయకూడదని యీ క్రింది పద్యంలో మరొకచోట చెప్పుకున్నాడు.

సీ॥ త్రైయక్ష పానీయ పీయూష వైయాత్య
హైయంగవీన వైయాసిక త్వ
దీయ స్వకీయాస్మదీయ మదీయ ప్ర
భృతులను గియ్యలు పెట్టరాదు
క్షయ్య జయ్య న్యాయ్య సాహాయ్య సాన్నాయ్య
ధాయ్య హేయ్యముల నికాయ్యములను
గ్రయ్యశబ్దమునను గియ్యలు గలవని
తెలిసి ప్రాసములకు నిలుపవలయు
తే॥ గీ॥ పైయెద సయాటయు నోయారి బలు గయాళి
యనుపదంబులఁ గొన్నిటి నరసిచూడఁ
దొలఁగు నిలుచును గియ్యలు తెలుఁగులందు
సత్యభామాముఖాంభోజ చంచరీక. (అప్ప - 2 ఆ - 226 ప.)

త్రైయక్ష, వైయాత్య † మొదలైన శబ్దాల్లో వుండే ఆద్యక్షరం "ఐ" కార స్వరం (ప్రథమ వక్రతమం) కలదిగాను ద్వితీయాక్షరాంగమైన "య్" కారహల్లు ద్విత్వరహితంగాను వుండేట్లుగా విలిఖించాలి. కాని ఆయాశబ్దాల్లో ఆద్యక్షరం అత్వం కలదిగానూ ద్వితీయాక్షరాంగమైన "య్" కార హల్లు ద్విత్వసహితంగాను వుండేట్లుగా విలిఖించకూడదు. – అంటే – "త్రైయక్ష" ఇత్యాది శబ్దాలను "త్రైయక్ష" అనే పద్ధతిలోనే (ఆద్యక్షరం ఐకారం కలదై, ద్వితీయాక్షరం ద్విత్వరహితంగాను) వ్రాయాలిగాని "త్రయ్యక్ష" అనే పద్ధతిలో (ఆద్యక్షరం అకారం కలదై ద్వితీయాక్షరం ద్విత్వసహితంగాను) వ్రాయకూడదు – అని శాబ్దికమైన

† "పానీయ, పీయూష, శయ్య, జయ్య" మొదలైన శబ్దాల విషయమై ముందు చర్చింపబడుతుంది.

"ఐ" కారానికి మారు సంస్కృత సమపదాల్లో సైతం వ్యావహారికాన్ని అనుసరించి యేర్పడిన యితర లిపి స్వరూపం సరైనది కాదన్నట్లు అప్పకవి చెప్పదలచాడు - త్రైయక్షవంటి రూపాలే వ్రాయాలికాని "త్రయ్యక్ష" వంటి రూపాలు వ్రాయకూడదని ఆతని అభిప్రాయం. ఈ సదభిప్రాయం అప్పకవి హృదయంలో వున్నది. కాని ఆ అభిప్రాయాన్ని స్పష్టంగానూ సమగ్రంగానూ పైపద్యంలోను లోగడ(127వ. పుటలో) పద్యాల్లోను బయటికి వెళ్ళగ్రక్క లేకపోయాడు. "త్రైయక్ష" ఇత్యాదుల్లో "కియ్యవళ్ళు † పెట్టరాదు" అని వచించితే సరిపోతుందనుకున్నాడు - ఎలాసరిపోతుంది ? "త్రైయక్ష" అన్నప్పుడు "కియ్యవడి పెట్టరాదు" అని చెప్పడంతో ఆ వున్నదానికి వున్నట్టుగా మనం అర్థం చెప్పుకుంటే న్యాయానికి "త్రైయ్యక్ష" అని వ్రాయకూడదని అప్పకవి చెప్పాడనే చెప్పుకోవాలి. ఈ విధంగానే చెప్పుకుంటే అప్పకవి వ్రాసిన ఆపద్యానికి విలువే లేకుండాపోతుంది - "త్రైయక్ష" ఇత్యాదుల్లో "ఐ" కారమే వ్రాయాలికాని "ఐ" కారానికి మారు "అయ్" అనేదాన్ని చేర్చి వ్రాయకూడదు అనే అప్పకవి చెప్పదలచాడు. అంటే - "త్రైయక్ష" వంటి రూపాలే వ్రాయాలికాని "త్రయ్యక్ష" వంటి రూపాలు వ్రాయకూడదని అప్పకవి చెప్పదలచాడన్న మాట - కాని చెప్పలేకపోయాడు. పూర్వం వుదాహరించిన "త్రైయక్ష" ఇత్యాది పద్యంలో వున్న-

† కియ్యవడి నేడు మనం వ్యవహరిస్తున్న క్యావడికి రూపాంతరం. దీన్నే "యావత్తు" అనికూడా వ్యవహరిస్తాము -

—" పైయెద సయాటయు నొయారి బలుగయాళి
యను పదంబులఁ గొన్నిటి నరసిచూడఁ
దొలఁగు నిలుచును గియ్యలు తెలుఁగులందు "—

అనే తేటగీతి భాగాన్ని పరిశీలిస్తే పైనీసపాదాల్లో వున్న "పైయక్ష" మొదలైన పదాల విషయంలో అప్పకవి యేం చెప్పదలచి చెప్పలేకపోయాడో మనకు సుస్పష్టంగా గోచరిస్తుంది. తెలుగు పదాలైన "పైయెద, సయాట, ఒయారి, గయాళి" మొదలైన పదాల్లో ద్విత్వాలు - అంటే - కియ్యలు (క్యావడులు - అనగా యూవత్తులు) వికల్పంగా లోపించుతాయని "పైయెద" ఇత్యాది పై పద్యభాగంలో అప్పకవి స్పష్టంగా చెప్పాడు. అంటే- సయాట, సయ్యాట- ఒయారి, ఒయ్యారి- గయాళి, గయ్యాళి - అని "య" కారద్విత్వ రహితంగానూ సహితంగానూ రెండు విధాలా రూపాలు వుండవచ్చుననీ ఆ విధంగా వ్రాయవచ్చుననీ చెప్పాడన్నమాట - ఇది నిజమే - "సయాట, సయ్యాట" లవంటి రెండు విధాల రూపాలూ మన వ్యవహారంలోనే కాకుండా కవి ప్రయోగాల్లోకూడావుండి వ్యాకరణ కర్తలచేత ఆమోదింప బడ్డాయికూడా - అయితే యిక్కడ "సయాట, ఒయారి" మొదలైన పదాల్లో "పైయెద" అనేదాన్ని అప్పకవి చేర్చడం సమంజసం కాదు - "సయాట" మొదలైన పదాలకు "పైయెద" శబ్దానికిఏమీ సంబంధంలేదు. ఆ పదాలకు జరిగేకార్యం వేరు- "పైయెద"కు జరిగేకార్యం వేరు- "పైయెద" అనేది ఈ "సయాట, ఒయారి" మొదలైన పదాల వంటిదే అనేటట్లయితే "పైయ్యెద" అనే అనిష్ట రూపాన్ని ఏ శబ్దతత్వవేత్తకూడా పేర్కొనని విచిత్ర రూపాన్ని అంగీక

రించాల్సి వస్తుంది. అప్పకవి "ఊచు నెలకాకగుబ్బచేత" ఇత్యాది (అప్ప - 2 ఆ. 185 ప.) పద్యంలో స్పష్టంగా "పయ్యెద" రూపాన్ని వావిడిచి అంగీకరించాడు—"పయ్యద" అనే రూపాన్ని అప్పకవి యెక్కడా పేర్కొనలేదు - † అయితే అప్పకవి "సయ్యాట" మొదలైన పదాలలోదిగా "పైయెద" అనేదాన్ని పేర్కొన్నాడే "సయ్యాట" మొదలైన పదాల్లాగా "పైయ్యెద" ‡ అనేదాన్ని యెక్కడా లేని రూపాన్ని అంగీకరిస్తాడా? ఒకవేళ అంగీకరించివుంటే దాన్ని ఎక్కడా పేర్కొనలేదేమి? "పైయ్యెద" రూపాన్ని ఎవ్వరూ పేర్కొనలేదు సరికదా! అప్పకవికూడా అంగీకరించడు - అయితే ఈ పద్య సందర్భంలో అప్పకవి "పైయెద" అనేది "సయ్యాట" వంటిదనీ, "పయ్యద" అనేది "సయ్యాట" వంటిదనీ భావించాడు. కాని "సయ్యాట" మొదలైన పదాలలో సంమార్పు జరిగినా ద్వితీయాక్షరంలోనే జరుగుతున్నదనీ "పైయెద" అనే పదంలో ఒక్క ద్వితీయాక్షరంలోనే కాకుండా ప్రథమాక్షరంలోకూడా మార్పు జరుగుతున్నదనీ అప్పకవి గమనించలేదు - "పైయెద" అన్నప్పుడున్న "యె" కారంలోని హల్లుకు ద్విత్వం వచ్చినట్లయితే "పై" లోని "ఐ" కారంపోయి "అ" కారం వస్తుందన్న సంగతి గమనించలేదు - వాస్తవానికి ఈ విషయమంతా అతనికి తెలియక కాదు- తెలుసును. అయితే- "పైయెద" అన్నప్పుడున్న "ఐ"

---

† చూడు - ఈ గ్రంథంలోనే ఇ, ఈ, ఎ, ఏ అనే భాగం 84-35 పుటలు —

‡ ఈ "పైయ్యెద" వంటి రూపం గ్రాంథికంలోనే కాదు వ్యావహారికంలోకూడా లేదు -

కారం "అయి" గా మారి తర్వాత "అయి" లోని "ఇ" కారంలోపించి "అయ్" గా మారి "పయ్యెద" అవుతుంది" –‡ అని చెప్పడంలో కంటే – "పైయెద" అన్నప్పుడున్న యి – కారానికి వికల్పంగా ద్విత్వంవస్తుంది" అని చెప్పడంలో సులభం వుందనుకొని "తొలఁగు నిలుచును గియ్యలు" అని వికల్ప కార్యం చెప్పుకున్న "సయాట" మొదలైన వాటిల్లో "పైయెద" ను చేర్చుకొన్నాడేగాని ఆవిధంగా "పైయెద" ను "సయాట" మొదలైన వాటిల్లో చేర్చుకోవ డంవల్ల "పైయెద" మీద "పయ్యెద" అనే రూపం సిద్ధించదు సరిగదా! "పైయ్యెద" అనే వైరిరూపం సిద్ధిస్తుందన్న సంగతి ఆతడు గమనించనేలేదు. ఊరికే "తొలఁగును కియ్యవడి" అనుకుంటే "పైయెద" అవుతుందనీ "నిలుచును కియ్యవడి" అనుకుంటే "పయ్యెద" అవుతుందనీ అనుకున్నాడేగాని "పయ్యెద" అన్నప్పుడు ("తొలఁగు నిలుచును గియ్యలు తెలుఁగులందు" అని ముందు తొలగడాన్ని – అంటే – లోపాన్ని చెప్పాడు కాబట్టి మొదట ద్విత్వరూపం గ్రహిద్దాం) కియ్యవడి తొలగితే (లోపిస్తే) "పయెద" అనే రూపంతయా రవుతుందేగాని "పైయెద" అనే రూపం కానేకాదు –

---

‡ అప్పకవి

కం॥ క్రమమున వక్రతమములకు
సమరు నయిక్కను నవుక్కు ననియెదు నాదే
శములు వికల్పంబున ....(అప్ప. 2 ఆ. 110 ప.(

అనే పద్యంలో "ఐ" కారానికి "అయి" అనేదాన్ని విధించడంచేత అతని అభిప్రాయం ప్రకారం "పైయెద" అనేదే మొదటి రూపంగానూ

"పయ్యెద" అనేది రెండవ రూపంగాను గ్రహించాలి. ఆకారణంచేతనే పైన "పైయెద" అనేదానిమీద "పయ్యెద" అనే రూపం సిద్ధింపజెయ్యడం జరిగింది. వాస్తవానికి "పైయెద" మొదటి రూపంకాదు. "పెయ్యెద" అనేదే మొదటి రూపం "పయి + ఎద" అని వుంటే యిక్కడ సంధిలేక పోవడంచేత మామూలుగా "య" డాగమంవచ్చి "పయియెద" అని అవుతుంది. ఇక్కడ ఏకస్థానికాలైన నాలుగక్షరాలను (య్ + ఇ=యి, య్ + ఎ = యె) ఒకదాని వెంబడి ఒక దానిని వరుసనే వుచ్చరించడం కష్టం - ఆకష్టాన్ని కొంత తగ్గించుకోనడానికి "పయియెద" అన్నప్పుడున్న "యి" కారంలోని "ఇ" కార స్వరాన్ని లోపింపచేస్తాము-అప్పుడు పయ్ + యెద = పయ్యెద అని యేర్పడి దీనిపైన "పయ్యెద" అన్నప్పుడున్న "అయ్" అనేదానికి మామూలుగా ఐత్వంవచ్చి "పైయెద" అనే రూపం అవుతుంది. ఈ సందర్భంలో— "పయ్యెద మొదటి రూపం కాదని పయ్యెద మీద (అయ్ అనే దానికి ఐ కారంవచ్చి -) "పైయెద" సిద్ధింపలేదనీ పయి + యెద అనే అవస్థలోనే "అయి" అనే దానికి "ఐ త్వంవచ్చి "పైయెద" అనే రూపం మొదట సిద్ధించి ఆతర్వాతనే "ఐ" కారానికి "అయ్" వచ్చి లేదా అయి వచ్చి ఇత్వలోపం జరిగి "పయ్యెద" సిద్ధించిందనీ యెవరైనా అనడానికి ఆస్కారం వున్నది - కాని "పయి + యెద" అనే అవస్థలోనే "అయి" కి "ఐ" త్వం చెప్పేపద్ధతిలో "అయి" కి "ఐ" త్వం వికల్పంకాబట్టి "పైయెద" అనే రూపంతోపాటు "పయియెద" అనే చతురక్షర రూపంకూడా ప్రయోగార్హంగా వుండవలసి వస్తుంది. ఈ "పయియెద" అనే రూపం ఎక్కడా ప్రయుక్తమయ్యిందీకాదు వ్యవహారంలో వున్నదీకాదు - పయియెద అనేది పయ్యెదకు మొదటి అవస్థలో రూపమైనప్పటికీ అది అప్రయుక్తం అవ్వడం చేతా ఏ వ్యాకరణ కర్తాకూడా ఆ రూపాన్ని పేర్కొనక పోవడంచేతా "పయియెద" ను "పైయెద" కు వికల్పరూపంగా పేర్కొనడం సమంజసం కాదు. కాబట్టి పయి + యెద అన్నప్పుడు ఇకార స్వరలోపంతోనే రూపం "పయ్యెద" గా ప్రారంభమై "పైయెద" గా మారిందని చెప్పడమే సమంజసంగా వుంటుంది. అసలు "పైయెద" అనే రూపం వుంటుందని అప్పకవి చెప్పాడేగాని ఆరూపానికి కవి ప్రయోగమేమీలేదు - అటువంటి ఐత్వంకల రూపాన్ని ఏకవీ ప్రయోగించలేదు - అటువంటి ప్రయోగాన్ని దేన్నీ

అప్పకవి ఉదాహరించలేదుకూడా. "పయియెద" అనే రూపం అసలు వ్యవహారంలో కాని కవి ప్రయుక్తంగా కాని యెక్కడాలేదు. పయియెద అనేదే కవి ప్రయుక్తమైవుంటే మామూలుగా "అయి"కి "ఐ"ని చెప్పుకొని "పైయెద" చేసుకోవచ్చు. ఆవిధంగా పయియెద అనేది కవి ప్రయుక్తంగాలేదు కాబట్టి వ్యాకరణకర్తలు "పైయెద" అనే రూపాన్ని సాధించాలంటే "పయ్యెద" అనే రూపంమీదనే సాధించాలి - "పయ్యెద" అనే రూపంమీదనే "పైయెద" ను సాధించాలంటే "అయ్" అనేదానికి "ఐ" త్వం విధించుకొనవలసి వస్తుంది. ఆవిధంగా "అయ్" అనేదానికే ఐత్వాన్ని వ్యాకరణకర్త విధించాడంటే "కయ్య - కయ్యము - వ్రయ్యలు" మొదలైన రూపాల్లోకూడా అయ్ అనేదానికి ఐకారంవచ్చి "కైయ — కైయము - వ్రైయలు" వంటి దుష్టరూపాలన్నీ తయారై కూచుంటాయి. ఈ బాధను గమనించిన చిన్నయసూరి "పయ్యెద పయ్యెద" అని ఆ రెండు రూపాలను మాత్రమే పేర్కొన్నాడుగాని "పైయెద" అనే ప్రదమ వక్రత మంతో వున్న రూపాన్ని యెక్కడా పేర్కొనలేదు. "పయియెద" అనే రూపం కవిప్రయుక్తమయ్యే వుంటే చిన్నయసూరి "ఆచ్ఛికంబులందయి యవులకు" (బాల - క్రియ - 103 సూ) ఇత్యాది సూత్రంచేత "పైయెద" అనే రూపాన్ని సాధించి వుండేవాడే-అది కవిప్రయుక్తం కాదు కాబట్టే దాన్ని విడిచిపుచ్చాడు. పయి + ఎద అనేవాని మేళనం చేతనే "పయ్యెద"యేర్పడిందని అప్పకవి(అప్ప- 2 ఆ-185 ప.) చెప్పిన ఆ పదవిభాగ సత్యాన్ని రహస్యాన్ని చిన్నయసూరి గమనించకపోలేదు. "పయ్యెద" అన్నప్పుడు అప్పకవి చెప్పిన "పయి + ఎద అనే పదవిభాగం సత్యసమ్మతం - అర్థవంతంకూడా- అంతమాత్రంచేత చిన్నయసూరి పయి + ఎద అనే విభాగాన్ని పేర్కొని "పయియెద" అనే రూపాన్నే అంగీకరించి వుంటే అతడు "పయ్యెద" అనే రూపాన్ని సాధించలేక పోయేవాడే - "పయియెద" అనేదాన్నే చిన్నయ అంగీకరిస్తే "ఆచ్ఛికంబులం దయి యవులకు" (బాల-క్రియ- 108 సూ) ఇత్యాది సూత్రంచేత ఐత్వం చేసుకొని "పైయెద" అనే లేని రూపాన్ని ముందు సాధించుకుని అటుపైన "పై" లోని "ఐ" కారానికి "అయ్" అనేదాన్ని ప్రత్యేకంగా విధించుకుంటేనేగాని "పయ్యెద" అనే రూపాన్ని సాధించడం సాధ్యపడదు. ఆ విధంగా "ఐ" కారానికి "అయ్" అనేదాన్ని ప్రత్యేకంగా విధించడమే సంభవిస్తే "ఐదు-ఐరేని"

మొదలైన రూపాలకు (అయ్ + దు =) "అయ్దు - (అయ్ + రేని =) అయ్యేని (సయ్ + చు =) సయ్చు, (కయ్ + వారము =) కయ్వారము మొదలైన అనిష్టరూపాలు రూపాంతరాలుగా సిద్ధించడం అనివార్యమే అవుతుంది - ఇన్ని యిబ్బందులనూ ఆలోచించే చిన్నయసూరి తెలివిగా ప్రవర్తించి "పయ్యెద" కు అప్పకవి చెప్పిన వ్యుత్పత్త్యర్థం సమంజసమైనదీ అర్థవంతమైనదీ అయినప్పటికీ దానిజోలి పట్టించుకోకుండా "పయియెద" అనే రూపాన్ని తన కనుసన్నల్లోకైనా రానీయకుండా దానితోపాటే "పైయెద" అని అప్పకవి చెప్పిన రూపాన్ని కూడా విడచిపుచ్చి "పయ్యెద పయ్యద" † అని సూత్రించుకుని "పయ్యెద" ను నిపతించుకున్నాడు - అప్పకవి "పైయెద" రూపాన్ని పేర్కొనడం వ్యాకరణ నియమాలకు వ్యాకరణ పద్ధతులకు పూర్తిగా విరుద్ధం - ఉచ్చారణలో "పైయెద" కు "పయ్యెద" కు చెప్పుకోతగిన తేడా వుండదు- కాబట్టే ఆ వుచ్చారణననుసరించి అప్పకవి "పయ్యెద" ను "పైయెద" గా కూడా పేర్కొని వుంటాడు. అప్పకవి "పైయెద" ను పేర్కొనడం వ్యావహారికానికి లోనవడంచేతనే జరిగిందిగాని వేరుకాదు -

ఇంతకూ ఈ మొత్తం పరిశీలనవల్ల చిన్నయసూరి "పయ్యెద" ను నిపతించుకున్నప్పటికీ పయి + ఎద అనే దాని వ్యుత్పత్తినిబట్టి "పయియెద" అనే అవస్థలో "ఇ" కారలోపం జరిగి పయ్ + యెద=పయ్యెద సిద్ధించిందనీ, యీ "ఇ" కారలోపంజరిగి "పయ్యెద" సిద్ధించడం వ్యవహారబలం చేతనేకాని వేరుకాదనీ, ఈ విధంగా "అయి" అన్నప్పుడు ఇకారలోపం (పయియెద అన్నప్పుడు) జరగడాన్ని "పయ్యెద" విషయంలో మాత్రమే గ్రాంథికభాషావ్యాకర్తలు అంగీకరించారనీ, ఆవిధంగా అంగీకరించడం "పయ్యెద" ప్రాచీన కవి ప్రయోగారూఢమై పోయినందువల్ల తప్పనిసరి అయ్యిందనీ స్పష్టపడుతున్నది.

గ్రాంథికంలో బహుళంగా ప్రయోగింపబడి వ్యాకరణకర్తలచేత అంగీకరింపబడిన ఈ "పయ్యెద" రూపం అసలు వ్యావహారిక బలంచేతనే సిద్ధించింది అని తేల్చిచెప్పడమే యీ పరిశీలనకు ఫలితం -

---

† పయ్యెద, పయ్యదగా మారడం గురించి లోగడ వివరింపబడింది. చూ - 32 పు.

పోనీ అసలు అప్పకవి ఆ పద్యంలో "పైయెద" అనే రూపాన్ని పేర్కొనలేదనీ అది తప్పు పాఠమనీ

— "పయెదయు సయాటయు నొయారి బలుగయాళి" —

అని ఆ పద్యపాదం వుండాలనీ, "సయాట, సయ్యాట" మొదలైన ద్వివిధ రూపాల్లాగానే "పయ్యెద, పయెద" అనే ద్వివిధ రూపాలూ వుంటాయని పేర్కొన్నాడనీ చెప్పి అప్పకవిని యీ "పైయెద" రొంపిలోనుంచి తప్పించుదామా అని చూస్తే పయ్యెద" కు "పయెద" అనే ద్విత్వరహిత రూపం కవిప్రయుక్తమైనట్లు కనబడడంలేదు. అటువంటి ప్రయోగానిక లక్ష్యాన్ని అప్పకవికూడా యివ్వలేదు. ఒక్క పయ్యెదకు మాత్రమే లక్ష్యాన్నిచ్చాడు. కనీసం వ్యవహారంలోనైనా లేదు. పయి + ఎద=పయ్యెద అయ్యిందని స్పష్టంగా అందులో స్వరసంధి వున్నట్లు పేర్కొన్న అప్పకవి స్వరసంధి జరిగినప్పుడుకూడా ద్విత్వలోపం జరుగుతుందని భావించాడనడానికి ఆస్కారం లేదు. "జడ్డక్కరంబుఁగొఁ బదాది స్వరంబుకూడుచో జడ్డకు లోపంబు లేదు" అని (బాల. ప్రకీ - 9 సూ) చిన్నయసూరి వెల్లడించిన అభిప్రాయం అంతకుముందు అప్పకవికి లేదనలేము † కాబట్టి నిర్మూలమైన "పయెదయు" అనే పాఠం సవ్యమైనది కాదనడంలో సందే

† "కల్లు, పల్లు" మొదలైన శబ్దాల్లో ద్విత్వం హలాది పదాలు పరమైతేనే లోపిస్తుందని కేతన యీ క్రింది పద్యం రచించాడు.

ఆ॥ వె॥ ఇల్లు కల్లు ముల్లు పల్లును విల్లును
కన్ను మున్ను వెన్ను చన్ను నాఁగఁ

హింపనక్కరలేదు. కాబట్టి అప్పకవి "పైయెద సయాటయు..." ఇత్యాది పాఠాన్ని పొరపాటున రచించాడనడం సమంజసం -

ఇంతకూ "పైయెద" అన్నప్పుడు యకారంలోని హల్లుకు ద్విత్వం వస్తుందని చెప్పిన మాత్రంచేతనే పైలోని ఐకారం "అ"కారంగా మారుతుందనిలోపలఅనుకొనివుంటాడు. కాబట్టే ద్విత్వం వున్న రూపానికే - అంటే - "పయ్యెద" అనేదానికి శశిబింబు చరిత్రంలోని "పయ్యెదబాసి" ఇత్యాది (అప్ప - 2 ఆ. 227 ప.) పద్యాన్ని లక్ష్యంగా చూపాడు - ఇక్కడే అప్పకవి "కియ్యవడ" వుంటుంది; వుండదు అని కయ్యవడి విషయం చెప్పే రూపంలోనే పయ్యెద, పైయెద అనే ద్వివిధపదాలను చూపిస్తున్నాడు కాబట్టి పై సీసపాదాల్లో వున్న "త్రైయక్ష, హైయంగవీన, సైయూసిక" ఇత్యాది పదాలను వ్రాసేటప్పుడు ఆ "య"కారాలకు "కియ్యవళ్ళు పెట్టరాదు" అని చెప్పరూపంలోనే "త్రయ్యక్ష, హయ్యంగవీన, సయ్యూసిక" ఇత్యాది రూపాలను వ్రాయకూడదని చెప్పడమే అతని భావంగా మనం యెంచవచ్చు - అయితే "త్రైయక్ష" ఇత్యాదుల్లో వున్న ఐకారస్థానంలో "అయ్" అనేదాన్ని చేర్చి (త్రయ్యక్షవలె) వ్రాయకూడదని అప్పకవి చెప్పివుంటే

బలుగు శబ్దములకు పై హలాదులతోడ
నగుకునపుడు జడ్డ లడగ(ప)జెల్లు ॥ (ఆం- భా- భూ- **121** ప.)

ఇందులో కేతన హలాది పదాలు పరమైనప్పుడే ద్విత్వలోపం వస్తుందని చెప్పి (తర్వాతి పద్యంలో లక్ష్యాల్ని చూపిస్తున్నాడు.) నందున పరిశేష న్యాయంచేత అచ్చుపరమైతే ద్విత్వలోపం రాదని అర్థం చెప్పుకోవాలి. ఇల్లు మొదలైనవి యితర శబ్దాలకు వుపలక్షణాలు - **13** వ శతాబ్దంలోనే కేతనకున్న యీ అభిప్రాయం అప్పకవికి లేదనలేము.

పోనీ అసలు అప్పకవి ఆ పద్యంలో "పైయెద" అనే రూపాన్ని పేర్కొనలేదనీ అది తప్పు పాఠమనీ

— "పయెదయు సయాటయు నోయారి బలుగయాళి" —

అని ఆ పద్యపాదం వుండాలనీ, "సయాట, సయ్యాట" మొదలైన ద్వివిధ రూపాల్లాగానే "పయ్యెద, పయెద" అనే ద్వివిధ రూపాలూ వుంటాయని పేర్కొన్నాడనీ చెప్పి అప్పకవిని యీ "పైయెద" రొంపిలోనుంచి తప్పించుదామా అని చూస్తే పయ్యెద "కు "పయెద" అనే ద్విత్వరహిత రూపం కవిప్రయుక్తమైనట్లు కనబడడం లేదు. అటువంటి ప్రయోగానికి లక్ష్యాన్ని అప్పకవికూడా యివ్వలేదు. ఒక్క పయ్యెదకు మాత్రమే లక్ష్యాన్నిచ్చాడు. కనీసం వ్యవహారంలోనైనా లేదు. పయి + ఎద=పయ్యెద అయ్యిందని స్పష్టంగా అందులో స్వరసంధి వున్నట్లు పేర్కొన్న అప్పకవి స్వరసంధి జరిగినప్పుడుకూడా ద్విత్వలోపం జరుగుతుందని భావించాడనడానికి ఆస్కారం లేదు. " జడ్డక్కరంబుతోఁ బదాది స్వరంబుకూడుచో జడ్డకు లోపంబు లేదు " అని (బాల. ప్రకీ - 9 సూ) చిన్నయసూరి వెల్లడించిన అభిప్రాయం అంతకుముందు అప్పకవికి లేదనలేము † కాబట్టి నిర్మూలమైన "పయెదయు" అనే పాఠం సవ్యమైనది కాదనడంలో సందే

† "కల్లు, పల్లు" మొదలైన శబ్దాల్లో ద్విత్వంహలాది పదాలు పరమైతే లోపిస్తుందని కేతన యీ క్రింది పద్యం రచించాడు.

ఆ॥ వె॥ ఇల్లు కల్లు ముల్లు పల్లును విల్లును
కన్ను మున్ను వెన్ను చన్ను నాఁగ

హింపనక్కరలేదు. కాబట్టి అప్పకవి "పైయెద సయాటయు..." ఇత్యాది పాఠాన్ని పొరపాటున రచించాడనడం సమంజసం -

ఇంతకూ "పైయెద" అన్నప్పుడు యకారంలోని హల్లుకు ద్విత్వం వస్తుందని చెప్పిన మాత్రంచేతనే పైలోని ఐకారం "అ"కారంగా మారుతుందనిలోపలఅనుకొనివుంటాడు. కాబట్టి ద్విత్వం వున్న రూపానికి - అంటే - "పయ్యెద" అనేదానికి శశిబిందు చరిత్రంలోని "పయ్యెదబాసి" ఇత్యాది (అప్ప - 2 ఆ. 227 ప.) పద్యాన్ని లక్ష్యంగా చూపాడు - ఇక్కడ అప్పకవి "కయ్యావడ" వుంటుంది; వుండదు అని కయ్యావడి విషయం చెప్పు రూపంలోనే పయ్యెద, పైయెద అనే ద్వివిధపదాలను పేర్కొన్నాడు కాబట్టి పై సీసపాదాల్లో వున్న "త్రైయక్ష, హైయంగవీన, నైయాసిక" ఇత్యాది పదాలను వ్రాసేటప్పుడు ఆ "య" కారాలకు "కయ్యావళ్ళు పెట్టరాదు" అని చెప్పేరూపంలోని "త్రయ్యక్ష, హయ్యంగ వీన, నయ్యాసిక" ఇత్యాది రూపాలను వ్రాయకూడదని చెప్ప డము అతని భావంగా మనం యూహించవచ్చు-అయితే "త్రైయక్ష" ఇత్యాదుల్లో వున్న ఐకారస్థానంలో "అయ్" అనేదాన్ని చేర్చి (త్రయ్యక్షవలె) వ్రాయకూడదని అప్పకవి చెప్పివుంటే

బలుగు శబ్దములకు పై హలాదులతోడ
నగుకునపుడు జడ్డ లడఁపఁజెల్లు ॥ (ఆం- భా- భూ- 121 ప.)

ఇందులో కేతన హలాది పదాలు పరమైనప్పుడే ద్విత్వలోపం వస్తుం దని చెప్పి (తర్వాత పద్యంలో లక్ష్యాల్ని పేర్కొన్నాడు.) నందున పరిశేష న్యాయంచేత అచ్చుపరమైతే ద్విత్వలోపం రాదని అర్థం చెప్పుకోవాలి. ఇల్లు మొదలైనవి యితర శబ్దాలకు వుపలక్షణాలు - 13 వ శతాబ్దంలోనే కేతన కున్న యీ అభిప్రాయం అప్పకవికి లేదనలేము.

తాను చెప్పదలచుకొన్నదాన్ని స్పష్టంగా చెప్పినట్లయ్యేది † "త్రైయక్ష" మొదలైన పదాలను "త్రయ్యక్ష" మొదలైన పదాలుగా పండిత కవులు వ్రాయడమనేది గణపవరపు వెంకటకవి కాలంలోకూడావున్నది. అందుకే వెంకటకవి కూడా "నైయాసిక, హైయంగవీన, నైయాయి" కాదిశబ్దా

---

† "త్రైయక్ష" ఇత్యాది ఈ సీసపద్యంలో ఆద్యక్షరంలో ఐ కారం కల్గి ద్వితీయాక్షరాలు "య" కారంకల "త్రైయక్ష, హైయంగ, నైయాసిక" మొదలైన శబ్దాలవంటి శబ్దాలనే అన్నింటినీ పేర్కొని వుంటే అప్పకవి ఆ విషయం స్పష్టపరచడానికి అవకాశం లభించేది. కాని యీ పద్యంలోనే పానీయ, పీయూష, త్వదీయ, క్షయ్య, జయ్య, న్యాయ్య, సాహాయ్య" మొదలైన వాటిని "సయాట" మొదలైనవాటిని ఈ యితర శబ్దాలను కలగాపులగంగా పేర్కొనడంవల్లనే "త్రైయక్ష" ఇత్యాది పదాల విషయం స్పష్టంగా వ్యక్తీకరించలేకపోయాడు. ఆ సీసపద్యంలోనే వివిధపాదాల్లో "త్రైయక్ష" ఇత్యాది పదాలనన్నిటిని ఒక గణంగాను, "పానీయ" ఇత్యాది పదాలనన్నింటిని ఒక గణంగాను, "క్షయ్య, జయ్య, త్రయ్య" శబ్దాలను ఒక గణంగాను "సాహాయ్య" ఇత్యాది పదాలను ఒక గణంగాను "సయాట" ఇత్యాది పదాల నొక గణంగాను, పేర్కొని యీ క్రింది విధంగా పద్యాన్ని రచించేవుంటే యెంతో బాగుండేది.

సీ॥ త్రైయక్ష నైయాత్య హైయంగవీనాదు
లందు నాద్యక్షరమైత్వమొందు
అత్వమొందదు నింక ద్విత్వమొందదు ద్వితీ
యాక్షరము నెపుడు - న్యాయ్యధాయ్య
సాహాయ్యములయందు సాన్నాయ్య హేయ్యాని
కాయ్యములను నిల్చుఁ గియ్యవహులు
తీయరాదిఁ కవస్మదీయ త్వదీయ స్వ
కీయాదులను లేదు కియ్య వడి - జ
య్య క్రయ్యములను నాద్యక్షరమైత్వము
ద్విత్వలోపమును ద్వితీయలిపియు

లలో కియ్యవర్ణ్ణ లేవని అప్పకవి రచించిన పద్ధతిలోనే యీ క్రింది సీసపాదాలు రచించాడు -

— "క్రయ్య సాన్నాయ్య నికాయ్య ధాయ్యా క్షయ్య
గేయ్య సాహాయ్య సంచాయ్య పాయ్య
శయ్యాది శబ్దాలఁ గియ్యవర్ణ్ణ మనర్చు
నీ కియవర్ణ్ణ మంగీసఁగునట్టి
పదములు తగునింక త్రైయాసి కాత్మీయ
త్రైయంగళీన త్రైయాయుకు లన
త్రైయాత్యమనఁగ త్రైయాక్రియాలుత్రై
యగ్రోధములు ద్వితీయాలు నన గమ
నీయ పదీయ త్వదీయ మదీయ యాస్మ
దీయులు నా యుష్మదీయులనఁగ" —

(ఆం- కా- 35 పుట.)

తే॥ గీ॥ కలియవు - పయాటము నోయారి బలుగయాళి
యనుపదంబులఁ గొన్నిటి నరసిచూడఁ
దోలఁగు నిలుచును గియ్యలు తెలుఁగులందు
సత్యభామాముఖాంభోజ చంచరీక -

ఈ పద్యంలో "త్రైయ" క్షాది పదాలు క్రమంగా వేరుగా (కలగా పులగం కాకుండా) పేర్కొబడ్డాయి. అంతే కాకుండా ఆద్యక్షరంలో ఐత్వం వుంటుంది అత్వం వుండదనీ ద్వితీయాక్షరానికి ద్విత్వం వుండదనీ - అంటే - "త్రైయక్ష" అని వ్రాయాలిగాని "త్రయ్యక్ష" అని వ్రాయకూడదని స్పష్టంగా చెప్పబడింది. అసలు విషయాన్ని ఇంత స్పష్టంగాను సూటిగాను అప్పకవి చెప్పలేకపోవడానికి కారణం లోగడ వ్రాసినట్లు విభిన్న విష యాలకు చెందిన వివిధ పదాలనన్నింటినీ కలగా పులగంగా కలిపి పద్యం వ్రాసుకోనడమే - ఆవిధంగా వ్రాసుకోనడంవల్లనే అప్పకవి మనస్సులో విషయాన్ని చెప్పడానికి తగిన అవకాశం చిక్కలేదు - (త్రైయక్ష ఇత్యాది అప్పకవి పద్యాన్ని సవరించి రచింపబడిన పద్యంలో మిగిలిన యితర పదా లకు చెందిన విషయాలు ముందు పరిశీలింపబడతాయి.)

అప్పకవి వ్రాసిన "త్రైయక్ష" ఇత్యాది పద్యాన్ని చూచిన వెంకటకవి అచ్చంగా అప్పకవి వ్రాసిన పద్ధతిలోనే ఈ సీసపాదాలు రచించాడు - కొన్ని పదాలు ముందు వెనుకలుగా వుండడమే తప్ప శబ్దాలను కలగాపులగం చెయ్యడంలోగాని చెప్పవలసిన విషయాన్ని సూటిగాను స్పష్టంగాను చెప్పకపోవడంలోగాని అప్పకవి రచనకు వెంకటకవి రచనకూ ఏమాత్రమూ తేడాలేదు - వెంకటకవి "నైయాసిక" నైయాయంగవీన" శబ్దద్వయానికి మధ్య "ఆత్మీయ" శబ్దాన్ని చేర్చకుండా "నైయాసిక" శబ్దంవంటి శబ్దాన్నే చేర్చివుంటే నైయాసి కేత్యాది పదాలన్నీ ఒక గణంగా వరసగా వున్నట్లయ్యేది. అయినప్పటికీ "నైయాసిక" మొదలైన శబ్దాలను వ్రాసే విషయంలో లోగడ "త్రైయక్ష" ఇత్యాది అప్పకవి పద్యానికి సవరణగా వ్రాసిన పద్యంలో పేర్కొనబడినట్లు - "ఆద్యక్షరమైత్వ మొందు సత్వమొందదు నింక ద్విత్వ మొందదు ద్వితీయాక్షరము నెపుడు" అనే పద్ధతిలో వెంకటకవి విషయాన్ని విస్పష్టపరచకుండా - "ఈ కియ్యవల్లు రాజెసగునట్టి పదములు తగునింక" - అని చెప్పడంలో వున్న లోపం అప్పకవి లోపంతో సరిసమానంగా వుండనేవుంటుంది- ఈ వెంకటకవి వ్రాసిన సీస పాదాలనుకూడా లోగడ అప్పకవి రచించిన "త్రైయక్ష" ఇత్యాది సీసపద్యాన్ని విషయానుగుణంగా దిద్దుకున్నట్లే దిద్దుకోవాలి.

ఈ విధంగా ఉచ్చారణ కనుగుణంగా సహజంగా "ఐ" కారంవున్న "త్రైయక్ష" ఇత్యాదుల్లో "అయ్" కారం రావడం

"త్రైయక్ష" మొదలైన వాటిని "త్రయ్యక్ష" వంటివిగా వ్రాయడం యెప్పుడు ప్రారంభించారో ఆ నాటినుంచే సహజంగా "అయ్" వున్న పదాల్లోకూడా "ఐ" రావడంతో తిరిగి అక్షరాలు తారుమారు అవ్వడం ప్రారంభించాయి — కయ్య - కయ్యము - కయ్యర - వ్రయ్యు - గయ్యాళి - పయ్యెద - బయలు - మొదలైన పదాల్లోవున్న "అయ్" లకుమారు "ఐ" కారాన్ని ఉచ్చారణలో అభిన్నత్వం వుండడంవల్ల ప్రాచీన కాలంలో పండిత కవులు వ్రాస్తూవుండేవారు - అనగా - ఆ "కయ్య" మొదలైన పదాలను "కైయ - కైయము - కైయర - వ్రైయు - గైయాళి - పైయెద - బైలు మొదలైనవిగా వ్రాస్తూండే వారనన్నమాట - ఈ విధంగా శాబ్దికమైన "అయ్" స్థానంలో "ఐ" కారాన్ని వ్రాయడమనేది చాలా ప్రాచీన కాలంనుంచీ పండిత కవుల్లో అలవాటుగావున్నది. కాబట్టే "బయలు" అనేశబ్దంలో ఉచ్చారణవశంచేత "అయ్"కారానికి "ఐ" కారం వ్యవహారంలో వచ్చి "బైలు" గా మారి ప్రాచీన కవి ప్రయోగారూఢమైపోయింది. శబ్దరత్నాకరకర్త - "బైలు-వై - వి. బయలుయొక్క రూపాంతరము - (మూ - బైలగు.) (మొదటిరూపము బయిలు)"-అనిపేర్కొన్నాడు. బైలు అనేది ఒకవంక "బయలు" అనేదానికి రూపాంతరమని చెప్తూనే "మొదటి రూపము బయిలు" అని వ్రాయడం వింతగావున్నది. "బయిలు" అనే పదమే వుంటే - "బైలు - వై - వి - బయిలు యొక్క రూపాంతరము" అని వ్రాస్తే సర్వవిధాలా సమంజసంగా వుండేదిగా - బైలు, బయలు యొక్క రూపాంతరము అని వ్రాసి "మొదటి రూపము బయిలు" అని వ్రాయడంలో

అర్థమేమిటి ? అసలు ఇక్కడ పూర్వాపరవిరుద్ధమైన వ్రాతలు శ - ర - కారుడు వ్రాయడానికి కారణం వేరు - వాస్తవానికి "బయలు" అనేదే మొదటి రూపం - ఈ "బయలు" అనే రూపంమీదనే "అయ్" కార "ఐ" కారాలకు జనోచ్చారణలో వున్న అభిన్నత్వంవల్ల(అప్పుకని "పయ్యెద"ను "పైయెద"గా తయారు చేసినట్లు) "బైలు" తయారై కవి ప్రయుక్తమయ్యింది. అయితే శ - ర - కారుడు "బైలు" వ్రాసి అది "బయలు" కు రూపాంతరమనే విషయం వున్నదివున్నట్టుగానే వ్రాశాడు - కాని "బైలు" "బయలు" మీద ఎలా తయారవుతుంది? తెలుగులో వ్యాకరణం ప్రకారం "అయి" అనేదానికి "ఐ" కారం వస్తుందికాని "అయ్" అనే దానికి రాదుకదా ? వ్యాకరణ నియమాల ననుసరించి "బయలు" మీద "బైలు" సిద్ధించదుగదా ? అని ప్రశ్నలు అతనికి రావడంతో వెంటనే "బయిలు" మొదటి రూపం గా యెంచి వ్రాశాడు - "బయలు" మీద "బైలు" సిద్ధించదు కాబట్టి "బయిలు" మొదటి రూపంగా శ - ర. కారుడు పేర్కొన్నాడేగాని వాస్తవానికి "బయిలు" అనే రూపం నేటి వ్యావహారికంలోనే గాని ప్రాచీన కవి ప్రయోగాల్లో యెక్కడా లేదు - బైలు అనే రూపంమీద జన వ్యవహారంలో "బయిలు" తయారయ్యింది - అంటే - బైలు అన్నప్పుడున్న "ఐ" కారానికి "అయి" వచ్చి "బయిలు" అయ్యిందన్నమాట - "బయలు" అన్నప్పుడున్న "అయ్" కారానికి "ఐ" త్వంవచ్చి "బైలు" సిద్ధించగా ఆ "బైలు" లోని "ఐ" కారానికి "అయి" వచ్చి "బయిలు" సిద్ధించింది. ఈ "బయిలు" అనేది చాలా ఆధునికమైన రూపం - "బైలు"

దానికి పూర్వరూపం- "బయలు", "బైలు" కంటే మరింత పూర్వకాల రూపం - "బయలు" "బైలు" శబ్దాల కంటే "బయిలు" అనేది అత్యాధునికమైన దవడంవల్లనే బయలు, బైలు" శబ్దాలు కవి ప్రయుక్తాలైనట్టుగా "బయిలు" శబ్దం ప్రయుక్తంకాలేదు -

చ॥ గమనము వీఁక వేఁడిఁక వికారము పుట్టక సంగరోత్సవో
ద్యమ రభసాతిరేకము బయల్పడు టించుక లేక రోషసం
భ్రమ మొకయింత...... (భార - విరా - 2 ఆ - 324 ప.)

చ॥ అమరిన లేఁత పచ్చిక బయళ్ళను...... (విష్ణు - పు - 7 ఆ)

సీ॥ గర్భగార్భక తనూకాంతి బైలగు లీల
విమలాంగి నూగారు విపులమయ్యె
(ఉత్త - రా - 2 ఆ.)

అని యీ విధంగా "బయలు" "బైలు" శబ్దాలు రెండూ కవి ప్రయుక్తాలయ్యాయి - కాని "బయిలు" శబ్దం కవి ప్రయుక్తంకాలేదు-కారణం అది అధునాతన రూపమవ్వడమే- "మొదటి రూపము బయిలు" అని శ - ర - కారుడు "బైలు" రూపాన్ని యిచ్చిన సందర్భంలో వ్రాశాడేగాని "బయిలు" అనే శబ్దాన్ని తన శ - ర - లో అసలు పరిగ్రహించనే లేదు. "బయిలు" అనే రూపం కవి ప్రయుక్తమయ్యే వుంటే - "బయలు - బయలు దామర - బయలుదేఱు - బయలుపడు- బయలు మెఱయు - బయలు నెడలు - బయలువోవు - బయానా - బయావారి - బయ్యంకలు - "బయ్యేఁడు" - అని పదాలన్నీ వరుసనేయిస్తూ "బయిలు" ను యెందుకు పేర్కొనడు. "బయిలు" అనేదే మొదటి రూపమైతే "బయలు

దామర" మొదలైన ఆ ఆరు పదాలలోను "బయలు" శబ్దాన్నే యెందుకు గ్రహించాలి ? "బయిలు దామర - బయిలు దేఱు - బయిలుపడు" అన్నట్లు "బయిలు" శబ్దాలుకలవిగా యెందుకు పరిగ్రహించలేదు - "బయలు" - "బైలు" శబ్దాలను రెండింటినీ గ్రహించాడే ! ఆ రెండింటినీ గ్రహించినప్పుడు "బయిలు" శబ్దాన్ని గ్రహించక "బైలు" శబ్ద సందర్భంలో "బయిలు" మొదటి రూపంగా పేర్కొనడంలో అర్థమేమిటి ? "బయిలు" అనేదే మొదటి రూపమైతే పదాలవరుసలో "బయిలు" శబ్దాన్ని పేర్కొనక తర్వాతి రూపమైన "బైలు" ను పేర్కొనడంలో ఆంతర్యమేమిటి ?

ఈ పరిశీలనవల్ల తేలేది "బయలు" అన్నప్పుడున్న "అయ్" అనేదానికి వ్యవహారవశాన "ఐ" త్వంవచ్చి "బైలు" గా తయారై కవి ప్రయుక్తమైనదనేగదా ! -

ఈ విధంగా కయ్యము - కయ్య - పయ్యెద అని వ్రాయవలసిన పదాలను ప్రాచీన కాలంలో పండితకవులు వ్యవహారానికిలోనై వుచ్చారణలో "ఐ - అయ్" లకు భిన్నత్వం అస్పష్టమైన దవడంచేత "కైయము - కైయ - పైయెద" అని "ఐ" కారాలుకలవిగా వ్రాస్తూండేవారు - కేవలం లక్షణవేత్త మాత్రమే కాకుండా లక్షణగ్రంథకర్తకూడా అయిన అప్పకవి ఉచ్చారణలోవున్న తారుమారుకు లోనై ఈ క్రింది పద్యంలో "పయ్యెద" అని ప్రయోగింపవలసిన పదాన్ని "పైయెద" గా ప్రయోగించాడు -

సీ॥ తే॥ గీ॥ పైయెద సయాటయు నొయార బలుగయాళి

యను పదంబులఁ గొన్నిటి నరసిచూడఁ

దోలఁగు నిలుచును గియ్యలు దెలుఁగులందు
సత్యభామాముఖాంభోజ చంచరీక

(అప్ప - 2 ఆ - 226 ప.)

ఉచ్చారణకులోనై "కయ్యము" మొదలైన తెలుగు పదాల్లోవున్న "అయ్" కారానికిమారు "ఐ" కారాన్ని వ్యవహరించి "కైయము" మొదలైనవిగా వ్రాస్తున్నట్లే "క్రయ్యము-క్షయ్యము-జయ్యము" మొదలైన సంస్కృత సమ పదాల్లో సైతం "అయ్" కారానికిమారు "ఐ" కారాన్ని పండిత కవులు వ్రాస్తూవుండే వారు - అంటే - క్రయ్యము - క్షయ్యము - జయ్యము - మున్నగు పదాలను 'కైయము - క్షైయము - జైయము మున్నగు పదాలుగా వ్రాస్తూండే వారన్నమాట. ఆకారణంచేతనే అప్పకవి

‡ సీ॥ ....

క్షయ్య జయ్య న్యాయ్య సాహాయ్య సాన్నాయ్య
ధాయ్య హేయ్యముల నికాయ్యములను
క్రయ్య శబ్దమునను గియ్యలుగలవని
తెలిసి ప్రాసములకు నిలుపవలయు॥

(అప్ప - 2 ఆ 226 ప.)

అని పేర్కొన్నాడు-ఇందులో పేర్కొబడిన "క్షయ్య, జయ్య, క్రయ్య" శబ్దాలుమూడూ ఒక తెగకు చెందినవి. మిగిలిన న్యాయ్యాది శబ్దాలు ఆరూ వేరొక తెగకు చెందినవి. † -

---

‡ ఈ పద్యం ౧౨౭వ పుటలో పూర్తిగా యివ్వబడింది.

† న్యాయ్యాది శబ్దాల విషయం "ద్విత్వలోపాలు"అనే విభాగంలో చర్చింపబడుతుంది.

క్షయ్యాదుల్ని న్యాయ్యాదుల్ని కలగా పులగం చెయ్యడం అప్పకవిది పొరపాటు - క్షయ్య, జయ్య ఇత్యాది పదాల్లో కియ్యలు తప్పకుండా వ్రాయాలని అప్పకవి చెప్తున్నాడు. అప్పకవి చెప్పినదాన్ని చెప్పినట్లుగానే గ్రహిస్తే క్షయ్యాదుల్లో కియ్యలు కలవు అని అప్పకవి చెప్పాడు కాబట్టి క్షయ్యాదుల్లో కియ్యలు కలవు అని అప్పకవి చెప్పవలసిన అవసరమేమిటి ? అనే ప్రశ్న వేసుకుంటే-"క్షయ్య-జయ్య-క్రయ్య శబ్దాలను ఆతని కాలంలో కొందరుపండితులు క్షయ - జయ - క్రయ అని ద్విత్వరహితంగా వ్రాసేవారేమో ! " అందుకే వాటిల్లో కియ్యవళ్ళున్నా యని అప్పకవి చెప్పాడేమో ?" - అనేదే సమాధానంగా వస్తుంది. అయితే "క్షయ్య" మొదలైన శబ్దాలను ద్విత్వరహితంగా "క్షయ" మొదలైనవిగా ఏకాలంలోనూ ఎవ్వరూ వ్రాయరనడం సుస్పష్టం - కారణం క్షయ్యాదుల్లో ద్విత్వలోపానికి కారణం శూన్యమవ్వడమే - అయితే అప్పకవి "కియ్యవళ్ళుకలవు" అని చెప్పడంలో ఆంతర్యం యేమై వుండాలి ? ఇక్కడ అప్పకవి తాను చెప్పదలచుకున్న భావాన్ని స్పష్టంగా చెప్ప లేకపోయాడు - క్షయ్యాదుల్లోఆద్యక్షరంమీద అత్వమే వుంటుంది. ఐత్వం వుండదు. ద్వితీయాక్షరంలో ద్విత్వం వుంటుంది. ద్వితీయాక్షరంలో యద్విత్వం లేకుండాను ఆద్యక్షరంలో అత్వానికి మారు ఐత్వంవుండి - అంటే - "క్షైయ" - "జైయ" అన్నట్లుగా యెప్పుడూ వ్రాయకూడదు అని చెప్పాలి అని అతని అభిప్రాయం - ఈ అభిప్రాయమంతా అతనికి లోపలవున్నది. కాని స్పష్టపరచలేకపోయాడు. "కియ్యవడి వుంటుంది" అని చెప్తే పూర్వాక్షరంలో అత్వం వుంటుంది

అని చెప్పనక్కరలేదనుకున్నాడు. పూర్వాక్షరంలో ఐత్వం వుండదు అత్వం వుంటుంది అని చెప్పకుండా "క్షయ్య- జయ్య- క్రయ్య"ల్లో కియ్యవడి వుంటుంది అని చెప్పేస్తే అసలువిషయం వూహించలేని సామాన్యపాఠకుడు "కియ్యవడి లేకుండా "క్షయ - జయ - క్రయ" అని ఆ క్షయ్యాదులను పూర్వ కాలంలో వ్రాసేవారు కాబోలు"- అని వూహించుకొని సమాధానం చెప్పుకుంటాడన్న సంగతి అప్పకవి గమనించలేదు - క్షయ్యాదులను క్షైయ్యాదులుగా వ్రాయకూడదు అని వున్న విషయాన్ని స్పష్టంగా చెప్పాలంటే అప్పకవి యీ క్రిందివిధంగా ఆ సీసపాదాలు రచించివుంటే యింతబాధ వుండేదేకాదు—

† సీ॥ ....జ
య్య క్రయ్యములను నాద్యక్షరమైత్వము
ద్విత్వలోపమును ద్వితీయలిపియుఁ
తే॥ గీ॥ కలియవు............‡

అప్పకవిలాగానే గణవరపు వెంకటకవికూడా క్రయ్యాదుల్ని సాన్నాయ్యాదుల్ని సాంకర్యంచేసి

సీ॥పా॥ క్రయ్య సాన్నాయ్య నికాయ్య ధాయ్యా క్షయ్య
జయ్య సాహాయ్య సంచాయ్య పాయ్య
శయ్యాది శబ్దాలఁ గియ్యవళ్ళు దనర్చు......

(ఆం. కౌ - 35 పుట)

† సవరించి విషయానుగుణంగా వ్రాయబడిన యీ పద్యభాగం "త్రైయక్ష" ఇత్యాది అప్పకవి పద్యాన్ని సవరించి వ్రాసిన పద్యంలోది. ఆ సవరణకల పూర్తి పద్యంలోగడ ౧౩౮ వ పుటలో యివ్వబడింది -

‡ ఆద్యక్షరం ఐత్వంతోనూ కలియదు. రెండవ అక్షరం ద్విత్వలోపాన్నీ కలియదు. అంటే రెండో అక్షరంలోని ద్విత్వం లోపించదని అర్థం -

" కియ్యావళ్ళు దనర్చు" అని మాత్రం చెప్పాడేగాని అసలు విషయాన్ని స్పష్టంగా చెప్పలేకపోయాడు -

ఇంతకూ ఈ పరిశీలనవల్ల వ్యవహారవశంచేత మొదట "అయి" అనేది "ఐ" కారంగామారి స్థిరపడిపోయిందనీ తర్వాత సామ్యంవల్ల అక్షరవినిమయం జరిగి శాబ్దికమైన "ఐ" కారం "అయి" కారంగాకాక "అయ్" కారంగా కేవలం తెల్గుపదాల్లోనే కాకుండా సంస్కృత సమపదాల్లో కూడా మారిపోయిందనీ ఆ తర్వాత శాబ్దికమైన "అయ్" కారం తెల్గులోనే కాక సంస్కృత సమాల్లోకూడా ఐకారంగా మారిం దనీ ఆయా మార్పుల కనుగుణంగా అన్నివిధాలా ప్రాచీనులు వ్యావహారికానికి లోనై వ్రాతలు వ్రాసేవారనీ తేలుతున్నది - వ్యవహారవశాన బయలులోని "అయ్" "ఐ"గా మారి బైలు రూపం తయారై ప్రాచీన కవులచే ప్రయోగింపబడిందనీ తిరిగి ఆ "బైలు" లోని "ఐ" ఉచ్చారణలో విపరీత స్థితిని పొంది "అయి" గా మారడంచేత "బయిలు" రూపం తయారైనదని కూడా తేలుతున్నది -

జనవ్యవహారంలో ఉచ్చారణ సౌలభ్యం కోసం తెలుగులో "అయి" అనే రెండక్షరాలు "ఐ" గా మారిపోయినట్లే "అవు" అనే రెండక్షరాలు "ఔ" గా మారిపోయినాయి - "అవు" అన్నప్పుడున్న "అ" కారం కంఠంలో నుంచీ "వు" కారం (స్వరవ్యంజనాలు రెండూ కూడా) ఓష్ఠాల్లో నుంచీ

"క్షయ్య" ఇత్యాదులే వ్రాయాలికాని "క్షైయ" ఇత్యాదులు వ్రాయకూడ దని భావం—

జన్మించాయి. (ఇక్కడ "వు"లో వున్న వ్యంజనానికి స్థానంగా కేవలం ఓష్ఠమేకాకుండా దంతాలుకూడావున్నాయి. "ఔ"కారానికి "వ్"కారానికి స్థానసామ్యం అత్యవసరం కాబట్టి "వ్"కారం దంత స్థానికంగా కాకుండా ఓష్ఠ స్థానికంగానే గ్రహింపబడింది.) "ఔ"కారంకూడా కంఠోష్ఠస్థానాల్లోనుంచే జన్మించింది. భిన్నస్థానాలుకల భిన్నాక్షరాలను రెండింటిని వుచ్చరిండం కంటే భిన్నస్థానాలుకల ఒకే అక్షరాన్ని వుచ్చరించడం మానవుడికి సులభం - అందుకే "అవు" ను "ఔ" గా మార్చి వుచ్చరించుతాడు. ఉచ్చారణలో "అవు" అనే రెండక్షరాలు "ఔ" గా మారడమనేది యీ నాడు జరిగిందికాదు. అత్యంత ప్రాచీన కాలంలోనే జరిగి ఆమార్పుకు గ్రాంథికత్వంకూడా సంక్రమించి అనేక విషయాల్లో స్థిరపడిపోయింది. "రవుతు, చవుతి, చవుకము, గవుసెన, జ్జవుకు" మొదలైన వాటిల్లోవున్న "అవు" అనేది "ఔ"గామారి "రౌతు, చౌతి, చౌకము, గౌసెన, జ్జౌకు," మొదలైనవిగా సిద్ధించాయి - ఈ రూపాలను రెండు విధాలగానూ (అవుకారం కలవిగానూ ఔకారం కలవిగానూ) ప్రాచీన కవులు అనేకులు ప్రయోగించారు. అందుకనే యిటువంటి రూపాలను "వాయిరవుర్వ్యక్రతమా" † అని ఆంధ్ర శబ్ద చింతామణికారుడూ, ఆచ్చికంబులం దయియవులకు వక్రతమం

---

† "వాయిరవుర్వ్యక్రతమా" అనే యీ ఆంధ్ర శబ్ద చింతామణి సూత్రానికి బాల సరస్వత్యాదులు ఈ క్రింది విధంగా వ్యాఖ్యలు వ్రాశారు.

— " వక్రతమా = ఐకారౌకారములు, వా = వికల్పముగాను, అయిరవుః = అయి అవులౌను. ఉ. కై, కయి - కైలు, కయులు-ఔర, అవుర"— (బాల-అజం-209 పుట.)

క॥ క్రమమున వక్రతమములకు
వమరు నయిక్కాను నవుక్కా ననియెడు నాదే
శములు వికల్పంబున..............." (అప్ప- 2 ఆ. 110 ప.)

ఆ॥ వె॥ లోకహితము కొఱకుఁ బైకొని దుష్టుల
లయ మొనర్చి శిష్టులయిన నృపుల
నేలయేల నిలిపె గాలిచ్చి నలుదెసఁ
దనిలి కృష్ణరాయఁ డవుర యనఁగ" (అప్ప. 2 ఆ. 111 ప.)

— "వికృతి శబ్దేషు యః ఐత్, ఔచ్చ - తయోర్వా అయి, అవు ఇత్యేతా వాదేశౌ స్తః॥ చెలువలై - చెలువలయి - ఔరా - అవురా -" (వాసుదేవవృత్తి. నావద్దనున్న తాళపత్ర ప్రతి - 14-వ పత్రం. 2 వ వైపు చివర పంక్తి.)

— "వికృతి శబ్దేషు యః ఐత్, ఔచ్చ, తయోర్వా అయి, అవు ఇత్యేతా వాదేశౌ స్తః - చెలువై- చెలువయి- ఔరా-అవురా-" ఇత్యాది- (అహో - పం - 297 పుట.)

ఈ వ్యాఖ్యాత లందరూ "ఔ"కారానికి "అవు" వస్తుందని పేర్కొని ఔకారంకల రూపాలే మొదటివని వ్రాయడం పొరపాటు-అగుధాతువులోని వ్యజనం "క్వచిద్గకారోవః"అనే చింతామణి సూత్రంవల్ల " వ " కార వ్యంజనంగామారి "అవు"అవుతుంది. "అవు" అనే రూపమే "ఔ" గా మారుతుంది. దీనిమీద - అంటే - అగుధాతువుమీద సిద్ధించిందే "ఔరా" అనేది - అగురా - అవురా - ఔరా - అని దీని పరిణామం - ఈ చింతామణి సూత్రానికి "అవు" కు "ఔ" వస్తుందనీ "ఔ" కు "అవు" వస్తుందనీ రెండు విధాలా అర్థం చెప్పుకోవచ్చును - కాబట్టి మొదట బహుళ వ్యవహారంకల "అవు" "ఔ" గా మారడాన్ని చెప్పి (అగురా) అవురా - ఔరా వంటి వుదాహరణలిచ్చి తదనంతరం "ఔ" "అవు" గా మారడాన్ని చెప్పి వుంటే యెంతో బాగుండేది - "ఔ" కారం "అవు"కారంగా మారడానికి తెలుగులో ప్రయోగాలు మృగ్యాలు - వ్యావహారికంలో మాత్రం కౌస్తుభం - కవుస్తుభం - దౌర్భాగ్యం - దవుర్భాగ్యం, భౌకం

భవుకం మొదలైన సంస్కృత సమపదాలు కొన్ని వున్నాయి - వాటికైనా కావ్య ప్రయోగాలు మృగ్యాలే -

అగు - అవు - ఔ - అని అగుధాతువు అవుగానూ అవుధాతువు ఔగానూ మారుతుందని గమనింపక శ్రీ వఝ్ఝలవారు ఈక్రింది విధంగా వ్రాయడం సమంజసంగా లేదు - "ఉదంత తద్ధర్మార్థకవిశేషణమున కచ్చుపరమగునపుడు నుగాగమంబగు" అను సూత్రము చాలదనియు, నౌదంత తద్ధర్మార్థక విశేషణమున కచ్చుపరమగునపుడును వాని నడుమ నకారము నిల్చుననియు సూత్రింపవలసియున్నదనియు,

సీ॥ ప్రబలమౌనీశ నిర్దయవృత్తి......" (హరి-నలో-26)

"ప్రబలమౌన్ + ఈశ = ప్రబల + మౌనీశ" అనిభేదము.

అను పద్యంలోని "ప్రబలమౌనీశ" అను ప్రయోగము వ్యక్తపఱచుచున్నది."

(హరి. నలో - పీఠిక - 101 పుట.)

చిన్నయసూరి "ఉదంత తద్ధర్మార్థక విశేషణాలకు అచ్చుపరమవుతుంటే నుగాగమాన్ని "విధించాడు. ఆ నుగాగమవిధచేతనే(అగు) అవు + ఈశ, అవు + ను + ఈశ, అవునీశ" అని సిద్ధించిన తర్వాత "అచ్చికంబులం దయి యవులకు (బాల - క్రియా. 108 సూ.) ఇత్యాది సూత్రంచేత ".అవు" కారానికి "ఔ" కారంవచ్చి "ఔనీశ" అవడంలో అభ్యంతరమేమీ వుండదు - అటువంటప్పుడు ఔదంతానికి నుగాగమం చెప్పుకోవలసిన అవసరమేమిటి ? అగు - అవు - ఔ - అనే పరిణామం లేకుండా ఔ అనేది సహజమైనది అయినప్పుడేగదా "ఔ + ఈశ = ఔనీశ అన్నప్పుడు ఔకారానికి నుగాగమం చెప్పుకోవాలి ? ఆ "ఔ" అనేది "అగు" ధాతువు రూపాంతరమైన "అవు" ధాతువుకి రూపాంతరమేగదా ? అయినప్పుడు చిన్నయసూరి రచించిన "ఉదంత తద్ధర్మార్థకవిశేషణ" ఇత్యాది సూత్ర మిక్కడ ప్రవర్తించి ఆ తర్వాత "అవు" కారానికి "ఔ" కారాన్ని చేస్తే "ఔనీశ" రూపం చేకుకొనడంలో అభ్యంతర మేముంటుంది ?

బులు బహుళంబుగా నగు" (బాల - క్రియ - 103 సూ) అని బాలవ్యాకరణ కర్తా సూత్రాలు రచించుకొని సాధించు కున్నారు. "అవు" అనే రెండక్షరాలూ యిక్కడ "ఔ" గా మారడంలో కేవలం స్థానసామ్యమే కాకుండా ప్రయత్న సామ్యంకూడా వుంది. "అవు" అనేదాంట్లో "అ" కారానికి సంవారనాద ఘోషాలు, "వు" కారానికి (స్వరవ్యంజనాలకు రెండింటికీకూడా) సంవారనాదఘోషాలు బాహ్య ప్రయత్నాలు - ఈ "అవు" అనే రెండక్షరాలకూ జరిగే బాహ్య ప్రయత్నాలే (సంవారనాద ఘోషాలే) "ఔ" అనే దానికి కూడా జరుగుతాయి. ఈ విధంగా స్థాన ప్రయత్న సామ్యం వున్నదికాబట్టే "అవు" అనే రెండక్షరాలూ "ఔ" గా మారి స్థిరపడి పోయాయి - అలా స్థిరపడక పోవడమే జరిగితే కవులు "రవుతు, రౌతు, గవుసెన - గౌసెన" వంటి ద్వివిధాలైన రూపాలనూ ప్రయోగించడమూ, ప్రయోగాల ననుసరించే మన వ్యాకరణకర్తలు "అవు" కు "ఔ" వికల్పంగా వస్తుందని చెప్పు కొనడమూ సంభవించేదే కాదు —

అయితే - ఈ విధంగా తెలుగులో ఉచ్చారణానుగుణంగా "అవు" అనే రెండక్షరాలకు "ఔ" అనే అక్షరం యెప్పుడైతే బహుళంగా వచ్చి స్థిరపడడం జరిగిందో అప్పుడే ఈ "అవు" కారానికి "ఔ" కారం రావడమనేది ఒక్క తెలుగులోనే కాకుండా సంస్కృత సమపదాల్లోకి కూడా పాకింది. ప్రాచీన కాలంలో మన పండిత కవులు పెక్కుమంది అవురా-ఔరా - గవుసెన - గౌసెన - మొదలైన వాటిల్లో అవు కారానికి ఔకారాన్ని చేసినట్లే "భవుకము-భవుఁడు" మొదలైన

సంస్కృత సమపదాల్లో కూడా "అవు" కారానికి "ఔ" కారాన్ని చేసి ఉచ్చారణ ననుసరించి "భౌకము - భౌఁడు" అని వ్రాస్తూండేవారు. కాబట్టే అప్పకవి సూచనా మాత్రంగా ఈ క్రింది సీస గీతంలో "భవుకంబు - భవుఁడు" ఇత్యాది పదాల్లో వకారం ఉత్వవిశిష్టమని పేర్కొన్నాడు.

నడుమఁ గొమ్ములు సంస్కృతాంధ్రముల రెంట
బలసి జాత్యక్షరములకే కలిగియుండు
భావుకము నీవు భవుకంబు భవుఁడనంగఁ
బొడవు దీవులు సవురంబు పువ్వులనఁగ ॥

(అప్ప. 2 ఆ 221 ప.)

ఇంతగా - స్థాన ప్రయత్న సామ్యంవల్లా జనోచ్చారణలో సులభాపేక్షవల్లా "అవు" అనే రెండక్షరాలూ "ఔ" గా మారి యెప్పుడైతే స్థిరపడ్డాయో అప్పటి నుంచే తిరిగి యిదే స్థాన ప్రయత్న సామ్యాలవల్ల జనవ్యవహారంలో విపరీతస్థితిలో సంస్కృతసమపదాల్లోకూడా అక్షర వినిమయంజరిగి స్వతస్సిద్ధమైన "ఔ" కారానికి (అవు అనేదాని స్థానంలో రాని ఔ కారానికి) "అవు" అనే రెండక్షరాలు రావడం ప్రారంభించాయి - అంటే - "కౌస్తుభము" మొదలైన సంస్కృత సమపదాల్లో "ఔ" కారానికి "అవు" కారంవచ్చి "కవుస్తుభము" వంటి రూపాలు తయారయ్యాయన్నమాట. ఇటువంటి మార్పిడి వ్రాతలు పూర్వకవులు వ్రాస్తూండేవారు - కాబట్టే అప్పకవి

క॥ యౌవన యౌవత కౌస్తుభ
సౌవర్ణ యౌవరాజ్య సౌవీరమహీ

దౌవారిక శబ్దం బులుఁ
దావుకొను ద్వితీయ వక్రతమములు మొదలన్"

(అప్ప - 2 ఆ. 106 ప.)

క॥ సౌవగ్రామిక శౌవన
సౌవర్చస సౌవిదల్ల సౌవస్వల స
త్సౌవర శబ్దముల మొదల
వావిరి నిలుచున్ ద్వితీయ వక్రతమంబుల్ ॥

(అప్ప. 2 ఆ - 107 ప.)

అని చెప్పుకున్నాడు. ఈ పద్యాల్లో యౌవన, యౌవత మొదలైన శబ్దాలతో పాటు "కౌస్తుభ" అనే శబ్దాన్ని అప్పకవి ప్రయోగించాడు. ఈ రెండు పద్యాల్లోను వున్న పదాలన్నీ (యౌవనాదులు) ఒకగణానికి చెందినవి. "కౌస్తుభ" శబ్దం వొక్కటే వేరొక గణానికి చెందింది. కౌస్తుభ శబ్దం "ఔ" కారంకలదిగాను "అవు" కారంకలదిగాను రెండు విధాలా వ్రాయడానికి అనువైన శబ్దం - "కౌస్తుభము" అని "ఔ" కారం వ్రాయాలేకాని "కవుస్తుభము" అని "అవు" కారం వ్రాయకూడదని అప్పకవి అభిప్రాయం - ఈ అభిప్రాయం అతనికి లోపలవున్నది. కౌస్తుభాదుల్లో ఔకారం వ్రాయాలి అని మాత్రమే చెప్పి "అవు" కారం వ్రాయకూడదనే విషయం పాఠకుల వూహకు విడచిపెట్టాడు - అయితే యిక్కడ యౌవనాది శబ్దాలు కౌస్తుభ శబ్దం వంటివి మాత్రం కావు — కవుస్తుభము అని "అవు" అనేదాన్ని వుంచి వ్రాయడానికి వీలైనట్లుగా "యవువనము" అని వ్రాయడానికి వీలులేదు — ఇక్కడ "యౌవన, యౌవత, సౌవర్ణ, సౌవీర, దౌవారిక, సౌవగ్రామి, శౌవన, సౌవర్చస, సౌవిదల్ల" మొదలైన శబ్దాల్లో

వున్న "ఔ" కారం "అవ్" కారంగా మారి "అవ్" అన్నప్పు డున్న "వ్" కారంలోని వ్యంజన స్వరాలలో (వ్ + ఉ) చివరి స్వరం లోపించడం కూడా జరిగి. యువ్వన, యువ్వత, సవ్వస్న, సవ్వీర, దవ్వారిక, సవ్వగ్రాణు, శవ్వన, సవ్వర్చస, సవ్విదళ్ళ, వంటి రూపాలు వ్యవహార వశంచేత సిద్ధించాయి - "యౌవనము" అనే సంస్కృత సమరూపం "యువ్వనము, ప్రవ్వనము గా మారి ఈ "ప్రవ్వనము" అనేది తద్భవంగా మారింది కవులచే ప్రయోగింపబడింది. "యువ్వనము" అనేది కూడా "యౌవన" శబ్దానికి మారుగా కవి ప్రయుక్తం కాకపోలేదు. "యౌవనము" అన్నప్పుడున్న "యౌ" లోని "ఔ" కారం "అవ్" గా మారి యవ్ + వనము - యువ్వనము అయ్యిందన్నా చెప్పవచ్చు - లేదా ఆ "యౌ" లోని "ఔ" కారం మామూలుగా "అవు" గానే మారి "యవు + వనము" అన్నప్పుడు "వు" కారంలోని (వ్ + ఉ అన్నప్పుడున్న) స్వరం మాత్రం లోపించి యవ్ + వనము = యువ్వనము" అయినదన్నా చెప్పవచ్చు. యౌవనము అనేపదం "యవ్వనము" గా మారేటప్పుడు "యౌ" లోని "ఔ" కారం యెప్పుడైనా (అవుగా మారినా సరే ఉకారలోపం వచ్చి "అవ్" గా మారక తప్పదన్న మాట - యౌవనము అన్నప్పుడున్న "ఔ" కారం "అవు" గా మారినా "వు" కారంలోని స్వర లోపం జరిగి "యువ్వనము" తయారైనాక ఆ "యువ్వన" శబ్దం నుండి "ప్రవ్వన" శబ్దం జనించిందని (తెలియక కాదు) గమనించక శ్రీ వజ్ఝలవారు "విపరీతస్థితికి" అని వుదాహరించుచూ " యౌవనము " (ఔవనము = జవువనము) జవ్వనము" - (ఆం. వ్యా. సం.

సర్వస్వము - 1654 పుట.) అని వ్రాసి వూరుకున్నారు. "యవ్వన" శబ్దం విషయం అసలు చర్చింపనేలేదుసరిగదా! "అవు" లోని స్వరలోప విషయంకూడా స్పృశింపలేదు - అయినా యిక్కడ జవ్వన శబ్దం విపరీత స్థితికి ఉదాహరణ యెలా అవుతుంది? "జోవనము" అనే రూపం మొదట కవి ప్రయుక్తంగా వుండి దానితోపాటు "జవువనము" అనే రూపం కూడా కవి ప్రయోగాల్లో వుంటే అప్పుడు జౌ - అవుగా మారడానికి "జౌవన - జవువన" శబ్దాలను పేర్కొన్నా బాగుండేది - అసలు ఆ "జౌవన - జవువన" శబ్దాలు కవి ప్రయుక్తాలు కానేకావు - పోనీ "జవ్వన" శబ్దం చూద్దామన్నా అందులో "అవ్" వున్నదిగాని "అవు" లేదుగదా! అసలీ జవ్వన శబ్దం "యావన" శబ్దం ఉచ్చారణలో మారి యేర్పడిన "యవ్వన" శబ్దం నుండి నేరుగా జనించిందేకాని "యావన"శబ్దం"జౌవన"జవువనలుగామారి జవ్వనసిద్ధింపలేదు. ఇంతకూ యిక్కడ "యావన" అన్నప్పుడున్న "జౌ" కారం "అవ్" గానన్నా మారిందనాలి - లేదా - "అవు"గా మారి చివరి "ఉ" కారానికి లోపం వచ్చి "అవ్" గా తయారయ్యిందనైనా అనాలి. అయితే "అవు" లోని స్వరలోపం ఉచ్చారణ సౌలభ్యం కోసమే జరుగుతుంది. "ఉ" కారానికీ "వ్" కారానికీ రెండింటికీ కూడా స్థానం, బాహ్య ప్రయత్నాలు † సామ్యం కలవి (ఒక్కవిధమైనవే) అవడంచేత వ్ + ఉల మేళనంవల్ల యేర్పడిన "వు" కారం

---

† ఉ - వ్ అనే వాటికి ఓష్ఠాలుస్థానం - సంవారనాద ఘోషాలు బాహ్య ప్రయత్నాలు.

లోని "ఉ" కారం లోపించినా యిక్కడ స్థాన, (బాహ్య) ప్రయత్నాల మార్పేమీ జరుగదు కాబట్టే, "యవువనము" అన్నప్పుడు ఓష్ఠస్థానికాలైన మూడక్షరాలను (వ్ + ఉ = వు - వ్ + అ = వ) ఒకదాని వెంబడి ఒకదాన్ని వరుసనే వుచ్చరించడం కష్టం కాబట్టే "వు" కారంలోని "ఉ" కారం లోపించి "యవ్వనము" అనే రూపం తయారవుతుంది. ఈ విధంగా "యౌవన" శబ్దంలోని "ఔ" కారం "అవ్" గా మారినట్లే తక్కిన "యౌవత, సౌవర్ణక, యౌవరాజ్య, సౌవీర, దౌవారిక, సౌవగ్రామిక, శౌవన, సౌవర్చస, సౌవిదల్ల, సౌవస్య, సౌవర" మొదలైన శబ్దాల్లోకూడా మారి క్రమంగా "యవ్వత, సవ్వర్ణక, యవ్వరాజ్య, సవ్వీర, దవ్వారిక, సవ్వ గ్రామి" కాదులుగా రూపొందాయి - అందుకే అప్పకవి పూర్వం(153,154పుటలలో)వుదాహరించిన"యౌవన"ఇత్యాది పద్య ద్వయంలో "యౌవ" నాది శబ్దాల్లో ఔకారం వున్నదని వాకొన్నాడు - పండితకవులు "యవ్వనము, దవ్వారికుడు" మొదలైన వ్రాతలు వ్రాయడంచూచిన గణపవరపు వెంకటకవి

— "సౌవిదల్లుఁడనంగ దౌవారికుఁ డనంగ
సౌవీర నృపతినా యౌవనమన
వెలయు సంస్కృతమున ద్విత్వంబు లేనిమ
ధ్యవకారము నామంబు లవని ......"

(ఆం. కౌ — 34, 35 పుటలు)

అని సౌవిదల్లాది శబ్దాల్లో మధ్య వకారానికి ద్విత్వం లేదన్నాడు - "సౌవిదల్లుఁడు మొదలైన శబ్దాల్లో ఆద్యక్షరం ఔత్వం కలదిగానూ ద్వితీయాక్షరాంగమైన "వ్" కారహల్లు

ద్విత్వరహితంగానూ వుండేట్లుగా విలిఖించాలి. కాని ఆ "సావిద" ల్లాది శబ్దాల్లో ఆద్యక్షరం అత్వం కలదిగానూ, ద్వితీయాక్షరాంగమైన "వ" కారహల్లు ద్విత్వ సహితంగానూ వుండేట్లుగా విలిఖించకూడదు-అంటే- "సావిద"ల్లాది శబ్దాలను "సావిదల్ల"వలెనే వ్రాయాలికాని "సవ్విదల్ల" వలే వ్రాయ కూడదు"- అనే అభిప్రాయాన్ని ప్రతిపాదించాలని వెంకటకవి వుద్దేశం - కాని యీ అభిప్రాయాన్నంతనీ అతడు మనస్సులో వుంచుకున్నాడే గాని బైటికి చెప్పలేకపోయాడు - అతని పద్యానికి ఉన్నదానికి ఉన్నట్లుగా న అర్థం చెప్పుకుంటే " సావి దల్ల-మొదలైన శబ్దాల్లో సకారానికి ద్విత్వం వుండదు"అని వెంక టకవి చెప్పాడు కాబట్టి " అక్కడ సకారానికి ద్విత్వం పెట్టి "సావ్విదల్ల" అనే పద్యాల్లో మన పూర్వులు వ్రాసేవారు"అని మాత్రమే మనం గ్రహించవలసి వుంటుంది. మధ్య వకా రానికి ద్విత్వం లేదని చెప్పినంత మాత్రం చేతనే ప్రథమాక్ష రంలో "ఔ" కారం వుంటుందని అనుకున్నాడు వెంకటకవి. కాని అది సరికాదు.

ఈ విధంగా "సావన" మొదలైన శబ్దాల్లో "ఔ" కారానికి "అవ్" కారంవచ్చి "యవ్వ" నాదులుగా యేర్పడడ మనేది యెప్పుడో నన్నయ్యకు పూర్వకాలంలోనే జరిగి ప్రామాణికులైన కవుల చేతను-డా వ్యవహరింపబడ్డాయి- ఈ క్రింది ప్రయోగాల్లో "యవన" శబ్దానికి మారు "యవ్వన" శబ్దం "య" కారం "వ" ద్విత్వయుక్తంగా యతిప్రాసల్లో బిగింపబడింది.

† ఉ॥ క్రొవ్విరి తమ్మితావిగొని క్రోలి మదంబునఁదేలి తెంటికొం
డెవ్విరి పువ్వుకంపు సొగయింపని భంగి మహేశుఁ డయ్యుమా
యవ్వనవార్ధిపూర్ణసుర తార్థివివర్ధితుఁడై మదించి మై
దివ్వడ లోకవర్తనకు దేవతలెంత విహీన భాగ్యులో" *

(నన్నెచోడ కుమార సంభవం. 8 - ఆ. 157 ప-)

ఉ॥ నవ్వచుఁ జెక్కుమీటినలినస్ఫుటలోచన మాటలేల నీ
యవ్వన లక్ష్మికిన్ భటుఁడనైతి ననుం గరుణింపుమంచు వాఁ
డువ్విళులూరుచుం బలుక నుత్పలగంధియు నో మహాత్మ! నీ
కివ్విధమెట్లు చొప్పడియె నేనొక బ్రాఁతియె నీదు కోర్కికిన్॥

(భోజ - రా - 7 ఆ. 108 ప.)

క॥ అవ్వనములఁ దమమయునై
యవ్వనమున నొకటి కొకటి యాయము మిగులన్
క్రొవ్వి కడు మసురి కవిసిన
నవ్విపినంబుల మృగంబు లవనినాథా! *

(పద్మ - పు - 1 ఆ. 91.)

ఉ॥ యవ్వని కోమలాంగి మఱి యవ్వనితామణి నిన్నుఁజూడ రా
దవ్వనిపోదు నీవలపు దవ్వను బ్రొద్దికలేదు ముగ్ధ వా
క్రువ్వని కాంత దాని మెడ గ్రువ్వని పేరుగఁదోలు నెప్పుడుం
ద్రెవ్వని బాంధవంబు లెడఁద్రెవ్వ నిఁకేటికి వేంకటేశ్వరా! *

(శృం - వృ - ప - శతకం - 37 ప.)

ఉ॥ ఎవ్వరి వరించు మనసంచుకయేని కుమారికామణీ
యవ్వన సర్వసుందర శుభాకృతికి న్గుమోహనాంగుఁడే
డివ్వనరాశి వేష్టిత మహీతల నాయములంచు లేకఁ దా
నెవ్వగఁ జిత్రభానుఁ డెద నిత్యముఁ జింతిలుచుండె నయ్యెడన్॥ *

(ఉత్త - హరిశ్చ. 2 ఆ. 491 ప.)

---

† ఈ పద్యం ముద్రిత ప్రతిలో లేదు. వ్రాతప్రతిలో వుంది.

* ఈ గుర్తుగల పద్యాలు అప్పకవీయం పంచమ ముద్రణ తొలిపలుకు కర్త చూపినవి.

ఈ విధంగా నన్నయనాటినుంచీ "యౌవన" శబ్దం "యవ్వన" శబ్దంగా మహాకవులచేత వ్యవహరింప బడిందంటే పూర్వకవులు వ్యావహారికపదాలు వుపయోగించారనడానికి యింతకంటే ఆధారం యేంకావాలి ? –

ఈ విధంగా "యౌవన" మొదలైన శబ్దాల్లో "ఔ" కారం "అవ్" గా మారి "యవ్వ" నాదులుగా యెప్పుడైతే విపుల వ్యవహారాన్ని పొంది కవులచేత వ్యవహరింపబడి స్థిరత్వాన్ని పొందాయో ఆనాటినుండీ తిరిగి విపరీతంగా సహజంగా "అవ్"కారంగల సంస్కృత సమపదాలైన "గవ్యూతి, గవ్యము, నవ్యము" మొదలైన వాటిని కూడా "గౌయూతి, గౌయము, నౌయము" మొదలైనవిగా పూర్వకవులు వ్రాస్తూవుండేవారు – అంతేకాదు– "అవ్వ, కవ్వము, గవ్వ, దవ్వు, మవ్వము" మొదలైన తెలుగు పదాల్లో శాబ్దికంగా వున్న "అవ్" కారానికి సైతం "ఔ" కారాన్ని చేసి "ఔవ, కౌవము, గౌవ, దౌవ, మౌవము," అని ఆద్యక్షరంలో ద్వితీయ వక్రతమాన్ని పెట్టి ద్వితీయాక్షరానికి ద్విత్వ లోపంచేసి మహాకవులైన వారే వ్రాస్తూవుండే వారంటే ఏమీ ఆశ్చర్యపడ నవసరంలేదు – సగర్వంగా "వాణి నారాణి" అని చెప్పుకున్న పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుని యీ క్రింది ప్రయోగం పరికించండి –

ఉ॥ నావుడు వాయునందనుఁడు నన్నిఁటఁబొమ్ము చమూవధూటినీ
కైవశమైన లెస్సయటుగాక నినుందల మీఱెనేని దౌ
దౌవుల నిల్చి మద్భుజగదాపటు విభ్రమ తాడనంబులన్
జీవయదంతు నెందు గురుశిక్షగదా మదిగాంతురంగనల్ ॥

(జై - భార - 2 ఆ - 51 ప.)

"దవ్వు" అని మొదటి రూపం - ఇక్కడ "దవ్వు" లో వున్న "అవ్" కారానికి ఉచ్చారణలో వచ్చిన వైపరీత్యంచేత "ఔ" కారం చేసి తత్ఫలితంగా సిద్ధించిన "దౌవు" అనే రూపాన్ని దిద్దడానికైనా అవకాశం లేకుండా ప్రాసలో ప్రయోగించాడు † - పిన వీరభద్రుడు "దవ్వు" ను "దౌవు" గా వ్రాసుకొన్నట్టే పూర్వకాలపు కవులు అవ్వ, కవ్వము, గవ్వ, మవ్వము, అవ్వ, మొదలైన పదాలను ఔవ, కౌవము, గౌవ, మౌవము, ఔవ మొదలైనవిగా వ్రాస్తూండే వారనడంలో విప్రతిపత్తియేమీ వుండదు - ఈ "ఔవ, కౌవము, దౌవు"

† "దౌవు" అనే రూపాన్ని గురించి ప్రయోగం చూపుతూ శ్రీ వర్ఘ్యులవారు- "(యౌవనము = జౌవనము (దౌవువంటిది) = జవ్వనము)"
(ఆం - వ్యా - సం - స - 1684 పుట.)

అని వ్రాసారు. జౌవనము దౌవువంటిదేలా అవుతుంది? దవ్వు అన్నప్పుడున్న "అవ్" కారానికి ఔకారం వచ్చి "దౌవు" అని అయ్యింది - ఆ విధంగానే "జవ్వనము" అన్నప్పుడు "అవ్" కారానికి ఔ కారంవచ్చి "జౌవనము" అనేరూపం సిద్ధిస్తే దౌవు వంటిదవుతుంది - ఒకవంక "యౌవనము" అనేరూపంమీద "జౌవనము" వచ్చిందని శబ్దపరిణామాన్ని పేర్కొంటూనే దౌవువంటిదనడంలో అర్థమేమిటి? దవ్వుమీదగాని "దౌవు"రాదు - శ్రీ వర్ఘ్యులవారి అభిప్రాయం ప్రకారం జౌవనముమీద జవ్వనము సిద్ధిస్తుంది. పరస్పరవిరుద్ధ విపరీత కార్యాలు జరిగే (ఒకచోట అవ్ కారానికి ఔకారం - మరొకచోట ఔకారానికి అవ్ కారం) దౌవు - జవ్వనము రూపాలను పోల్చి చెప్పడం సమంజసంకాదు. అసలు జౌవనము అనే రూపం యెక్కడైనా కవి ప్రయుక్తమై వుంటేగదా! - దాన్ని ఒక రూపంగా పేర్కొనడానికి ఆస్కారం వుండేది!

వంటి కవుల వ్రాతలు చూచిన గణపవరపు వెంకటకవి యీ క్రింది సీసపాదాలు రచించాడు.

"సౌవిదల్లుఁడనంగ దౌవారికుఁడనంగ
సౌవీర నృపతినా యౌవనమన
వెలయు సంస్కృతమున ద్విత్వంబులేని మ
ధ్య వకార నామంబులవని నింకఁ
గనఁ దెనుంగునను వకారములకు ద్విత్వ
ములు గల్గి కొన్ని పేరులు చెలంగు
అవ్వ కవ్వము చివ్వ క్రొవ్వు బువ్వము గవ్వ
నివ్వటిల్ మవ్వము గువ్వలనఁగ.
బువ్వ జువ్వలు నవ్వు నెవ్వగ నువ్వులు
లవ్వ జువ్వలు మువ్వలనఁగ ...."

(ఆం. కౌ - 34 - 36 పుటలు)

† సౌవిదల్లుడు ఇత్యాదుల్లో "అవ్" కారం వ్రాయ కూడదు ఔకారమే వ్రాయాలి అనే అభిప్రాయం వెంకటకవి ఏవిధంగా పూర్వం చెప్పలేకపోయాడో "అవ్వ" ఇత్యాదుల్లో "ఔ" కారం (ఔవ అని) వ్రాయకూడదు "అవ్" కారమే (అవ్వ అని) వ్రాయాలి అనే విషయాన్ని కూడా స్పష్టంగా యిక్కడ చెప్పలేక పోయాడు - "సౌవిదల్ల"ఇత్యాదుల్లో ఆద్యక్షరం ఔ కారం కలదిగాను ద్వితీయాక్షరం ద్విత్వ రహితం గాను వ్రాయాలి - "అవ్వ" ఇత్యాదుల్లో ఆద్యక్షరం అకారం కలదిగాను ద్వితీయాక్షరం ద్విత్వంకలదిగాను వ్రాయాలి"-అనే విషయాన్ని వెంకటకవి చెప్పదలచాడు అని స్పష్టపరచడానికే "అవ్వ ఇత్యాది పాదాలకు ముందున్న సౌవిదల్ల ఇత్యాది

† అవ్వ ఇత్యాది పదాల్లో జువ్వ మొదలైన విషయ భిన్న పదాలను చేర్చి వుదాహరించడం సమంజసంకాదు.

పాదాలను కూడా వుదాహరించాను. "సావిదల్ల" ఇత్యాది పాదద్వయం తర్వాతనే "ఆవ్వకవ్వము" ఇత్యాది పాదద్వయాన్ని రచించాడు. సావిదల్ల ఇత్యాది పాదాలు "ఔ" కార విషయికాలనీ, "అవ్" కార విషయికాలు కావనీ అవ్వ ఇత్యాదులు "అవ్" కార విషయికాలనీ, ఔ కార విషయికాలు కావనీ చెప్పడానికే వెంకటకవి ఆపాదాలను వెంట వెంటనే రచించాడు - "సావిదల్ల" ఇత్యాదుల్లో వ కారానికి ద్విత్వం వుండదు అని చెప్పడంతోనే ఆద్యక్షరంలో ఔత్వం వుంటుందనే అర్థంవస్తుందని భావించిన వెంకటకవి "అవ్వ" ఇత్యాదుల్లో వ కారానికి ద్విత్వం వుంటుంది అని చెప్పడంతోనే ఆద్యక్షరంలో ఔత్వం వుండదు అనే అర్థం వస్తుందని భావించా డనడంలో దోషమేమీ వుండదు - కేవల ద్విత్వ విషయికాలుగానే ఈ పద్య పాదాలను గ్రహించేట్లయితే అవి వ్యర్థంగా రచియింపబడినవే అవుతాయి.

ఇంతకూ ఈ మొత్తం పరిశీలనవల్ల జనోచ్చారణ సౌలభ్యం కొరకై వ్యవహారంలో "అయి, అవు" లు "ఐ, ఔ" లు గాను, సంస్కృత సమపదాల్లో శాబ్దికమై వున్న "ఐ, ఔ" లు "అయి, అవు" లు గానే కాకుండా "అయ్, అవ్" లు గానూ; తిరిగి విశేష విపరీతంగా సహజంగావున్న "అయ్, అవ్," లు "ఐ, ఔ" లు గాను మారి వివిధరూపాలుగా పండితకవులచేత విలిఖింప బడ్డాయని సుస్పష్టంగా వ్యక్తమవుతున్నది-

— ం, ః —

పూర్ణాను స్వారానికి స్థానం నాసిక - సంవారనాద ఘోషాలు బాహ్యప్రయత్నాలు - ఙ, ఞ, ణ, న, మ, అనే ఐదు వర్గాంత్యాలకూ స్థానం నాసిక.† సంవారనాదఘోషాలు బాహ్యప్రయత్నాలు - ఈ స్థాన ప్రయత్నాల మిశ్రత్వాన్ని పురస్కరించుకుని జనోచ్చారణలో ఙ, ఞ, ణ, న, మ లు నిండుసున్నగా మారిపోయాయి. వాస్తవానికి సంస్కృత భాషా నియమాల ననుసరించీ, సాంప్రదాయాన్ననుసరించీ పంక్తి, సంచన, కంఠము, దంతము, కంపము మొదలైన పదాల్లో నిండు సున్నా వ్రాయకూడదు. ఆ నిండు సున్నకు మారుగా పఙ్క్తి, వఞ్చన, కణ్ఠము, దన్తము, కమ్పము అని ఆయా వర్గాంత్యాక్షరాలనే వ్రాయాలి - ఈ విధంగా వర్గాంత్యాలనూ పూర్ణానుస్వారాన్నీ ఉచ్చరించడంలో పెద్ద తేడా ఏమీ లేకపోయినా వ్రాతలోకి వచ్చేసరికి వర్గాంత్యాలను వ్రాయటంకంటే పూర్ణానుస్వారాన్ని వ్రాయడం చాలా సులభం - ఈ సులభాపేక్షతోనే ఆ వర్గాంత్యాల స్థానంలో పూర్ణానుస్వారాన్ని వ్రాయడానికి అత్యంత ప్రాచీన కాలంలోనే నాందీ ప్రస్తావనలు జరగడం చివరికి ఆ వర్గాంత్యాల స్థానంలో పూర్ణానుస్వారం స్థిరపడి పండిత కవిప్రయోగాల్లో అతి సామాన్యంగా కూడా వ్యవహరించడం జరిగింది.

---

† వర్గాంత్యాలకు అయిదింటికీ క్రమంగా కంఠతాలు మూర్ధదన్త్యోష్ఠాలు కూడా స్థానాలు - అయితే యీ సందర్భంలో స్థానప్రయత్న మిశ్రత్వం కోసం నాసికలుగానే గ్రహింపబడినాయి—

చిన్నయసూరి తన బాలవ్యాకరణంలో "ఋ ౠ ఌ ౡ" ఇత్యాది (సంజ్ఞ - 4 సూ.) సూత్రోదాహరణల్లో "ఞ"కారం కల సంస్కృత సమపదానికి వుదాహరణగా పట్టుపట్టి తాను పెద్ద సంస్కృత భాషాసాంప్రదాయాన్ని అనుసరించినట్లుగా "పఞ్క్తి" అని ఞ కార, కకార, తకార సంయుక్తంగా వుదాహరించాడేగాని ఆ వుదాహరణల్లోనే "కణ్ఠము, షణ్డము అని "ణ" కారాన్ని వుపయోగించడానికి మారు "కంఠము, షండము" అని పూర్ణానుస్వారాన్ని వుపయోగించాడు. అదేవిధంగా అనేకాలైన సంస్కృత సమపదాల్లో వర్గాంత్యాన్ని వినియోగించవలసినచోట పూర్ణానుస్వారాన్ని వినియోగించాడు. ఊరికే ఏదో అప్పటికప్పుడు తోచింది తోచినట్లుగా చిన్నయసూరి "ఞ" కారోదాహరణగా పఞ్క్తి అని పేర్కొన్నాడే గాని వాస్తవానికి తెలుగులో "పంక్తి" అని మామూలుగా పూర్ణానుస్వారరూపమే వున్నది కాని "పఞ్క్తి" అని "ఞ" కారం కల రూపం లేనే లేదు - ఒకవేళ "ఞ" కారానికి ఉదాహరణ కావాలంటే ఈ వ్యవహారంలో లేని "పఞ్క్తి" అనే రూపాన్ని యివ్వడం కంటే "శార్ఙ్గము" అనేదాన్ని వుదాహరించి వుంటే యెంతో బాగుండేది. మామూలుగా అందరూ వ్యవహరిస్తున్నట్లే "కంఠము, షండము" ఇత్యాదుల్లో తానుకూడా ఎక్కడపడితే అక్కడ పూర్ణాను స్వారాన్నే వ్యవహరించిన చిన్నయసూరి ఎంతో పెద్ద అవసరం కలిగినట్లుగా "పంక్తి" శబ్దాన్ని "పఞ్క్తి" గా గ్రహించడం సమంజసంగా లేదు - వాస్తవానికి తెలుగుభాషలో

“పఙ్క్తి” ఇత్యాదుల్లో వర్గాంత్యాలను వ్రాయడమనే పద్ధతి లేనేలేదు - మనకక్కడ అనుకూల మయ్యిందీ అందమయ్యిందీ పూర్ణానుస్వారం మాత్రమే - నిజానికి “సంజ్ఞ” అని మనం వ్రాసుకుంటున్న ఈ అను స్వారంకల పదాన్ని నియమానుసారంగా “సఞ్జ్ఞ” అని ఞకార, జకార, ఞకారాల, సంయుక్తంగా వ్రాయాలంటే యెంతో యిబ్బెట్టుగా వుంటుంది సరి గదా! ఆ అవతారాన్ని వ్రాయాలన్నా చూడాలన్నా తెలుగు వారి శరీరాలు బెరుకుతనంవల్ల గగుర్పాటు పొందుతాయనడం సత్యదూరం కాదు - అందుకే తెలుగులో వర్గాంత్యాలకు మారు అనుస్వారాన్ని వ్రాయడమే సహజంగానే కాకుండా అందంగాకూడా వుంటుంది -

మామూలుగా క, ఖ, గ, ఘ అనే వాటికి పూర్వంలో వున్న పూర్ణాను స్వారం “ఙ” కారోచ్చారణ కలదిగానూ, చ, ఛ, జ, ఝ అనే వాటికి పూర్వంలో వున్న పూర్ణాను స్వారం “ఞ” కారోచ్చారణ కలదిగానూ, ట, ఠ, డ, ఢ లకు పూర్వంలో వున్న పూర్ణాను స్వారం “ణ” కారోచ్చారణ కలదిగానూ, త, థ, ద, ధ లకు పూర్వంలో వున్న పూర్ణాను స్వారం “న” కారోచ్చారణ కలదిగానూ, ప, ఫ, బ, భ లకు పూర్వంలో వున్న పూర్ణానుస్వారం “మ” కారోచ్చారణ కలదిగానూ శ్రవణగోచరమవుతుంది. కాబట్టే మన పూర్వులు అంకము, పొంకము; లంచము, కుంచము; మంట, పండ, సేవితుండు; అంత, కొంత, పంతము; పంపిన, చంపిన, మిరియంపు; మొదలైన వర్గాంత్యాలుండని తెలుగు పదాల్లో అనుస్వారా

ుకి మారు "అఙ్కము, పాఙ్కము; లఞ్ఛము, కుఞ్ఛము; మణ్టా, పణ్టా, సేవితుణ్టు; అన్త, కొన్త, పన్తము; పమ్పిన, చమ్పిన, మిరియమ్బు మొదలైనవిగా ఆయా వర్గ్యాంత్యాలను వ్రాస్తూ వుండేవారు.† ఈ విధంగా ఆయా వర్గాక్షరాలకు పూర్వంలో వున్న పూర్ణానుస్వారం ఆయా వర్గాంత్యంగా వుచ్చారణలో శ్రవణగోచవరమవుతుంది కాబట్టే పూర్ణబిందు పూర్వకాలైన వర్గాక్షరాలకూ ఆయా వర్గాంత్యాలకూ యతి మైత్రిచెల్లడం సంభవించింది - య, ర, ల, వ, శ,ష, స, హ అనే హల్లులకు పూర్వంలో వుండే పూర్ణానుస్వారంకూడా మకార శ్రవణం కలదై వుంటుంది. కాబట్టే బిందు పూర్వాలైన ఆ అంతస్థోష్మలకూ "మ" కారానికీ యతిచెల్లడం సంభవించింది.

సంస్కృత వ్యాకరణమైన పాణినీయంలో "వాపదాన్తస్య" (8-4-59) అని ఒక సూత్రం వున్నది. పదాంతమైన అనుస్వారానికి క, ఖ, గ, ఘ, ఙ, చ, ఛ, జ, ఝ, ఞ, ట, ఠ, డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ, బ, భ, మ, య, ర, ల, వ, అనే 29 అక్షరాల్లో ఏది పరమైనా పరసవర్ణం వికల్పంగా వస్తుందని దానికర్థం - ఈ సూత్రాన్ననుసరించే సిద్ధించే "ధాతన్నాభి, ధాతంనాభి - సాన్నిధ్య, సాంనిధ్య - సన్నుతి, సంనుతి - సమ్మద, సంమద అని పరసవర్ణ సహితాలూ అనుస్వార సహితాలూ అయిన రెండు విధాలైన రూపాలుకూడా మన ఆంధ్రభాషలోకి సంస్కృత సమా

---

† ఇటువంటి వ్రాతలు ప్రాచీన శాసనాల్లో కొన్నిట్లలు - తాళపత్ర ప్రతుల్లో కూడా కొన్నింటిలో కన్పడతాయి -

లుగా తెలుగులో ప్రవేశిస్తాయి. వాస్తవానికి ఈవిధంగా సాన్నిధ్యాది శబ్దాల్లో అనుస్వారం రావడం జనవ్యవహారం చేతనేగాని వేరుకాదు - సన్నుతి - సమ్మద ఇత్యాదుల్లో సమ్ + నుతి, సమ్ + మద అన్నప్పుడు అక్కడవున్న మకార వ్యంజనం అనుస్వారంగా (మోనుస్వారః అనే పాణిని సూత్రం ప్రకారం) మారి ఆ అనుస్వారం పరవర్ణం నకారమైతే నకారంగానూ మకారమైతే మకారంగానూ మారుతుంది. అప్పుడు సం + నుతి - సం + మద అని ముందు సిద్ధించి సన్ + నుతి, సమ్ + మద అని మార్పు చెంది సన్నుతి, సమ్మద వంటి రూపాలు ఏర్పడతాయి - ఇక్కడ వుచ్చారణాలో సన్నుతి, సమ్మద మొదలైన వాటిల్లో వున్న "న్న, మ్మ" అనే వాటినివుచ్చరించేటప్పుడువాస్తవానికవి న, మ,ల ద్విత్వాక్షరాలే అయినప్పటికీపూర్ణబిందుపూర్వకాలైన న, మ,లుగానే (ం న, ంమ లుగానే) శ్రవణగోచరా లవుతాయి. న్న, మ్మలు ద్విత్వ సహితాలుగా కాక బిందు పూర్వకాలుగా (ం న - ంమ లుగా) ఎప్పుడైతే శ్రవణగోచరం కావడం ప్రారంభించాయో అప్పటి నుంచే ఆశ్రవణ గోచరమయ్యే పద్ధతిలో సంనుతి - సంమద వంటి రూపాలు తిరిగి సిద్ధించాయి. ఈ విధంగా వ్యవహార వశంచేత సిద్ధించి కవి ప్రయుక్తాలైన రూపాలనే వికల్ప కార్యం చెప్పుకొని పాణిని సాధించుకుని ప్రామాణికత్వాన్ని సంపాదించి పెట్టాడు -

ఈ విధంగానే కన్నీరు, తెన్నేరు, మిన్నేరు, నెమ్మి, శమ్మని, తమ్ములు మొదలైన తెలుగు పదాల్లోకూడా ద్విత్వ నకార మకారాలు పూర్ణబిందు పూర్వకాలుగా ఉచ్చారణలో

శ్రవణగోచరా లవుతాయి-† మనం ఒకటోతరగతి చదివే పిల్లల్ని డిక్టేషన్ చెప్తూ "కన్నీరు, కమ్మని" వంటి పదాలు వ్రాయవలసిందని చెప్పితే ఆ మొదటవున్న నకారమకారాలు వుచ్చారణలో పూర్ణబిందువులుగా వినబడడంవల్ల "కంనీరు,కంమని" అని బిందు రూపాలు వ్రాసి కూచుంటారు - ఇంకానయం! యిప్పుడు కన్నీరు, తెన్నేరు, మిన్నేరు, నెమ్మి, కమ్మని, తెమ్ములువంటి పదాలు వ్రాయడానికి కంనీరు, తెంనేరు, మింనేరు, నెంమి, కంమని, తెంములు, వంటి పదాలను మాటలు వ్రాయడం నేర్చుకొనే ఒకటో తరగతి పిల్లలే వ్రాస్తారు. పూర్వకాలంలో ఇటువంటి వ్రాతలు మహామహులైన పండితులూ కవులూ తమ కావ్యాల్లోకూడా వ్రాస్తూండేవారు. నన్నయభట్టువంటి మహాకవిపుంగవుడే వ్రాసినప్పుడు అనంతుడు, చిత్రకవి పెద్దన, కాకునూరి అప్పకవి, కూచిమంచి తిమ్మకవి, కస్తూరి రంగకవుల వంటి లాక్షణికకవులే వ్రాసినప్పుడు యితరులమాట యేమని చెప్పాలి ?

లయగ్రాహి—

కంమని లతాంతములకుం మొనసివచ్చు మధు
పంముల సుగీత నినదంము లెసఁగెం జూ
తంముల లసత్కిసలయంముల సుగంధిముకు
ళంములను నానుచు ముదంమొనర వాచా
లంములగు కోకిలకులంముల రవంము మధు
రంమగుచు విస్ఫురనిశంము సుమనోభా

---

† ఈ విధంగా న, మ, లు బిందువుగా ఉచ్చారణలో శ్రవణగోచరంకావడం బిందువుకూ న, మ, లకూ వున్న స్థాన ప్రయత్న సామ్యం వల్లనేగాని వేరుకాదు.

గంముల నశోక నికరంములును జంపక చ
యంములును గింశుక వనంములును నొప్పెన్ ॥
(భార - ఆది - 5 ఆ - 188 ప.)

మత్తకోకిల —

అంమునీశునివాసశక్తిఁ దదంగదేశము నందు మే
ఘంము లెల్ల వలంకులంగడుఁ గ్రంమ్మి సర్వజన ప్రమో
దంముగాఁ బ్రభవద్బృహజ్జలధార లొప్పఁగ వృష్టిఁజే
సెంమహానది † దీర్ఘికాసరసీనదంబులు నిండఁగాన్ ॥
(భార - ఆర - 3 ఆ - 113 ప.)

నన్నయ రచించిన పైరెండు పద్యాల్లోనూ బిందు పూర్వక మకారాలుగా వున్నవన్నీ వాస్తవానికి ద్విత్వ మకారాలు - ఈ నాడు ముద్రిత ప్రతుల్లో మనకన్నీ ద్విత్వ మకారాలే కన్పడతాయి. అది పరిష్కర్తల చలువ - వాస్తవానికి నన్నయ "కమ్మని" అని వ్రాయడానికి "కంమని" అని వ్రాసుకొని "లతాంతములకున్ + మొనసి" అన్నప్పుడున్న ద్రుతానికి స్థిరమైన మకారం పరమవుతుంటే పూర్ణబిందువుచేసి "లతాంతములకుం మొనసి" అనే పూర్ణానుస్వారరూపాన్ని తయారుచేసుకొని† "కంమని"లోని బిందు పూర్వక మకారానికీ

---

† "మహా నదులున్ సుహా సరసీవరంబులు నిండఁగాన్" అని పాఠాంతరం —

† ఈ విధంగా "లతాంతములకున్ + మొనసి" ఇత్యాది స్థలాల్లో స్థిరవర్ణమైన మకారం పరమవుతుంటే ద్రుతానికి పూర్ణబిందువు చెయ్యడమనేది ప్రాచీన కాలంలో వుండేది. "లతాంతములకుం మొనసి" అని బిందువు రావడాన్ని ప్రాచీన లాక్షణికులు కవులు దోషంగా ఎంచేవారు కాదు. కాబట్టే బాలసరస్వతి ఆంధ్రశబ్దచింతామణిలో వున్న "బిందుం

"లతాంతములకుం మొనసి" లోని బిందుపూర్వక మకారానికీ ప్రాసయతిని సరిపెట్టుకున్నాడు - అదేవిధంగా ఆ పాదంలో "మధుపమ్ముల, నినదమ్ము"అని వ్రాయడానికి "మధుపంముల, నినదంము" అని వ్రాసికొని ఆపాదంలోవున్న మిగిలిన ప్రాస యతుల్నికూడా సరిపెట్టుకున్నాడు - మొదటి పాదంలో "కం మని" అని "ంమ" అనేదాన్ని (బిందుపూర్వక మకారాన్ని) ప్రాసగా పెట్టుకున్నాడు కాబట్టి తక్కిన మూడు పాదాల్లోనూ "చూతమ్ముల, వాచాలమ్ముల, భారమ్ముల" అని వ్రాసు కొనడానికి మారు "చూతంముల, వాచాలంముల, భారంముల" అని బిందుపూర్వక మకారాలను వ్రాసుకొని ప్రాస సరిపెట్టు కొన్నాడనే చెప్పాలి - దీన్నిబట్టి తక్కిన మూడు పాదాల్లో వున్న ఆయాయతి స్థానాల్లోకూడా బిందుపూర్వకమైన మకా రాన్ని వ్యవహరించే ప్రాసయతి సరిపెట్టుకొన్నాడని చెప్పు కొనక తప్పదు - ఈ విధంగానే రెండో పద్యంలో కూడా "చేసెన్ + మహా" అన్నప్పుడు ద్రుతానికి పూర్ణబిందువు చేసుకొని "చేసెంమహా" అన్నప్పుడున్న బిందు పూర్వక మకారంతోపాటు మిగిలిన "అమ్ము, మేఘమ్ము, మోదమ్ము" అనే పదాలను కూడా "అంము, మేఘంము, మోదంము" అనే పద్ధతిలో బిందు పూర్వక మకారాలు కలవిగా వ్రాసుకొని ప్రాస సరిపెట్టుకొన్నాడనే చెప్పాలి - ఆవిధంగా ద్విత్వ మకారానికి మారు బిందు పూర్వకమకారాన్ని విని

ప్రవదంతి తం క్వచిత్కేచిత్" అనే సూత్రానికి వ్యాఖ్యానం వ్రాస్తూ "వచ్చెం మాధవుఁడు" అని స్థిరమైన మకారం పరమవుతుంటే ద్రుతానికి పూర్ణబిందువు వచ్చిన రూపాన్ని వుదాహరించాడు.

యోగించి నన్నయ వ్రాసిన వ్రాతను మార్చివేసి రానురాను కొంతకాలానికి శబ్దతత్త్వజ్ఞులైన పండితకవులు కొందరుమాత్రమే ద్రుతనకార స్థానంలో ఆదేశంగా వచ్చిన బిందువును మాత్రం వుంచి మిగిలినచోట్ల బిందుపూర్వక మకారాలకు మారు ద్విత్వ మకారాలనే వినియోగించి వ్రాయడానికి మొదలు పెట్టారు – అంటే – పూర్వంయిచ్చిన రెండుపద్యాలనూ యీ క్రిందివిధంగా కొందరుమాత్రమే వ్రాయడానికి మొదలు పెట్టారన్న మాట.

లయగ్రాహి ॥

కమ్మని లతాంతములకుం మొనసివచ్చు మధు
 పమ్ముల సుగీత నినదమ్ము లెసగెం ఝూ
తమ్ముల లసత్కిసలయమ్ముల సుగంధిముకు
 ళమ్ములను వానుచు ముదమ్మొనర వాచా
లమ్ములగు కోకిల కులమ్ముల రవమ్ము మధు
 రమ్మగుచు విన్చె ననిశమ్ము సుమనో భా
రమ్ముల నశోక నికరమ్ములును జంపక చ
 యమ్ములును గింశుక వనమ్ములును నొప్పెన్ ॥

మత్తకోకిల– అమ్మనీశుని............ మే
 ఘమ్ము లెల్ల...............ప్రమో
 దమ్ముగా...............వృష్టిఁజే
 సెంమహోనది,.....................॥

అయితే యీ పద్ధతిలో శబ్ద తత్త్వానికి అనుగుణంగా వ్రాసుకొనడంవల్ల పై లయగ్రాహి మొదటిపాదంలో ద్విత్వ మకారానికీ బిందుపూర్వక మకారానికీ (మ్మ – ంమ అనేవాటికి) ప్రాసయతిమైత్రినీ, మత్తకోకిలలో ద్విత్వమకారానికీ బిందు

పూర్వక మకారానికీ ప్రాసమైత్రినీ అంగీకరించాల్సి వచ్చింది. ఈవిధంగా "మ్మ - ంమ" అనేవాటికి ప్రాస చెల్లుతుందని అప్పకవికి పూర్వులెవ్వరూ చెప్పలేదు - కాబట్టి "కేచిద్వదంత్యభేదత్వమనుస్వారమకారయోః" అనే అధర్వణకృతమనబడే కారికవల్ల అనుస్వారమకారాలకు అభిన్నత్వమున్నదని చెప్పుకుని పైరెండు పద్యాల్లోనూ ప్రాసయతిమైత్రిని ప్రాసమైత్రిని సరిపెట్టుకుని సంతృప్తిపడ్డారు-ఈవిధంగా సంతృప్తిపడ్డవారిలో అహోబల పండితుడొకడు -

— "కేచిద్వదం త్యభేదత్వమనుస్వార మకారయోరితిచోక్తం - సర్వత్ర సంస్కృతాంధ్రయో రిత్యర్థః - అనుస్వార మకార యో రభిన్నత్వంచమ కారే పరఏవ "కమ్మని లతాంతములకుం మొనసి † వచ్చు మధుపమ్ములు" నిత్యాదిరాచార్య స్యాప్రిప్రయోగః"—

(అహో - పం - 183 పుట-)

---

† లతాంతములకు మ్మొనసి అనిముద్రణప్రతిలో ఉన్నది.అదిపొరపాటు- "లతాంతములకుం మొనసి" అని బిందురూపం వుంటుందికాబట్టే అను స్వార మకారాల కభిన్నత్వం చెప్పుకొని ప్రాస చెల్లుతుం దనుకున్నాడు - "లతాంతములకుమ్మొనసి'' అని వుండడమే అతని అభిమతమైతే బిందువుకు మకారాదేశం చెప్పనే చెప్పేవాడు - దీనికి పూర్వం "శబ్దానామంత్య భాగేషుయోనుస్వారః ప్రదృశ్యతే, తస్యాచిపరతో మస్స్యాత్" అని అచ్చుపరమైతే అనుస్వారానికి మకారం వస్తుందని స్పష్టంగానే చెప్పాడు - "లతాంతములకుమ్మొనసి'' అనేదే అసలు పాఠంగా యెంచితే పూర్వం అచ్చుపరమవుతుంటే అనుస్వారానికి మకారాదేశం చెప్పినట్లే మకారం పరమవుతున్నా అనుస్వారానికి మకారాదేశం వస్తుందని చెప్పనే చెప్పేవాడు. "లతాంతకుం మొనసి" అనేదే అసలు పాఠంగా తలంచాడు కాబట్టే అనుస్వార మకారాల కభిన్నత్వం చెప్పుకుని సరిపుచ్చుకున్నాడు.

ఈ "క్ష్మమని లతాంతములకుం మొనసి" – "అమ్మ్మ నీశుని......మేఘుమ్మ్మ......మోదమ్ము్మ....చేసెంమహా... వంటి ప్రయోగాలే – అంటే – "మ్మ – ంమ" అనే వాటికి ప్రాస చెల్లినట్లు కన్పడే వ్రాతలే అప్పకవికి కూడా కన్పడ్డాయి. ఆ వ్రాతల్నే ప్రామాణికంగా తీసుకొని అనునాసిక ప్రాసము అనే పేరుతో యీ క్రింది పద్యాలు రచించాడు –

తే॥ గీ॥ తమకుఁదామ ద్విత్వంబులై తనరు నవియుఁ
బూర్ణబిందులు డాపలఁ బొరయునవియుఁ
గలసి యనునాసిక ప్రాసములను పేర
నమలమరుఁ గావ్యములయందుఁ దమకుఁదామ – ॥

క॥ మిన్నేఱు పాదమున ధా
తంనాభిని గుసుమ శరుఁ గాంచిన నీ
సాంనిధ్యము దొరకుటకై
సంనుతి సేయుదురు నిన్ను సనకాదులుగా! ॥

క॥ తమ్ములను మల్లికా కుసు
మమ్ముల మరువాది పత్రమాలికలను భ
క్తిం మురసంహరు పూజలు
సంమదమున సలుపఁ గలుగు సకలార్థంబుల్ ॥

(అప్ప - 3 ఆ - 340, 341, 342 ప-)

పూర్వకాలంలో పండితకవులు "మింనేరు...ధాతంనాభి... సాంనిధ్య...సంనుతి......" అనే పద్ధతిలో "ంన" కారాలుగల పదాలను వ్రాస్తూండేవారు– "ధాతంనాభి–సాంనిధ్యము – సంనుతి"వంటిబిందురూప సంస్కృతసమపదాలను సంస్కృతవ్యాకరణ నియమానుసారంగా వ్రాయవచ్చు – "ధాతంనాభి–సాంనిధ్యము" వంటి బిందురూపాలు సంస్కృత వ్యాకరణాల ప్రకా

రం సిద్ధించుతాయి కాబట్టివాటిని (ఆబిందురూపాలను)వ్రాయ వచ్చు అనేఅభిప్రాయంతోనే ప్రాచీనకవులు ఆరూపాలువ్రాసిన ట్లయితేబాగానేవుండేది. మామూలుగా ఉచ్చారణలో మొదటి నకారం బిందువుగా వినపడుతుంది కాబట్టి ఉచ్చారణకులోనై తదనుగుణంగా వ్రాసేవారేకాని సంస్కృత వ్యాకరణాలను దృష్టిలో పెట్టుకొని వ్రాసేవారుకాదు. కేవలం వుచ్చారణను దృష్టిలో పెట్టుకొని వ్రాసేవారు కాబట్టే సున్నా వ్రాయడానికి వీలులేని "మిన్నేరు" వంటి తెలుగుపదాల్లో సైతం సున్నా పెట్టి "మింనేరు" వంటి రూపాలను వ్రాస్తూండేవారు – ఈ "మింనేరు" వంటి వ్రాతలను సంస్కరించాలనే అభిప్రాయం తోనే అప్పకవి పైలక్షణపద్యంలో నకారాన్ని గ్రహించి తప్పటడుగు వేసాడు. "తమకుఁదాము" ఇత్యాది పద్యంలో అప్పకవి "న్న – ంన" అనే వాటికి ప్రాస చెల్లుతుందని చెప్ప వలసిన అవసరం ఏ మాత్రమూ లేదు. "న్న – ంన" అనే వాటికి ప్రాసచెల్లినట్లు లక్ష్యంగా యిచ్చిన "మిన్నలు"ఇత్యాది పద్యంలో దాతంనాభి... సాంనిధ్యము ... సంనుతి ... అనే పదాలస్థానంలో ధాతన్నాభి...సాన్నిధ్యము... సన్నుతి ... అనే ద్విత్వనకారాలుగల పదాలను వినియోగించి నిశ్శంకగా ప్రాస సరిపెట్టుకోవచ్చు – ధాతన్నాభి – సాన్నిధ్యము – సన్నుతి వంటిద్విత్వ నకారాలుగల రూపాలు సాధ్యాలు కాకుండా కేవలం "ధాతంనాభి – సాంనిధ్యము – సంనుతి" అనే బిందురూపాలు మాత్రమే సాధ్యాలయితేగదా "న్న – ంన"లకు పాసమైత్రి చెప్పుకోవాలి? "ధాతన్నాభి"వంటి న ద్విత్వరూపాలుండగా అప్పకవి ఈ లక్షణంలో నకారాన్ని

చేర్చి చెప్పడం వ్యర్థమేకదా! "మిన్నేలు" ఇత్యాదుల్లో ద్విత్వనకారమే వ్రాయాలి - "మింనేలు" అని బిందువు వ్రాయ కూడదు - అని తాను చెప్పదలిస్తే స్పష్టంగా సూటిగానే ఆ విషయం చెప్పవచ్చుగదా!

ఈ విధంగానే "తంములు ... (కుసు) మంములు... (భ) క్తింముర...సంమద..." వంటి ప్రయోగాల్లోవలే "తంము లు-కుసుమంములు" అనే పద్ధతిలో వ్రాయడం దోషమనీ "భక్తిం ముర - సంమద" అనే (మొదటిది తెలుగు వ్యాకరణంచేతా రెండోది సంస్కృత వ్యాకరణంచేతా) బిందు రూపాలు నిర్దుష్టాలనీ చెప్పడం అప్పకవి అభిమతం - కాని అలా స్పష్టపరచలేక తనకు పూర్వం ఏ లక్షణకర్తాకూడా చెప్పని "మ - ంమ" అనే వాటికి ప్రాస చెల్లుతుందని ప్రమా దంగా చెప్పాడు - ఈ ప్రమాదాన్ని గుర్తించి సరిదిద్దుకున్న ట్లుగా బిందువుకు కూడా "నమ" ల రూపాన్ని ఆదేశిస్తూ "నమకార ద్విత్వ మైత్రము" అనే శీర్షికలో

తే॥ గీ॥ తమకుఁదాము ద్విత్వంబులై యమరునవియు
బిందువులు డాపలను వెలుఁగొందునవియు
నొక్క రూపంబ పూర్వ ప్రయోగసరణి
నములు ప్రాసంబులకు నిల్చుఁదమకుఁదాము॥

(అప్ప - 5 ఆ - 159 ప-)

అని పూర్వోక్త లక్షణానికి భిన్నంగా లక్షణంచెప్పుకుని ద్విత్వాలైననమలకూబిందుపూర్వకాలైన నమలకూఏకత్వాన్ని (న్న - మ్మలుగా) సాధించి తిరిగి ప్రాస చెప్పుకున్నాడు - తిరిగిలక్ష్యాలుగాపూర్వోక్తపద్యాలనే "మిన్నేలు...ధాతన్నాభి

......సాన్నిధ్యము......సన్నుతి" — "తమ్ముల ...... సుమమ్ముల....భక్తిమ్మర......సమ్మద..." అని మామూలుగా ద్విత్వాలైన మ్మ-మ్మలు కలవిగానే పేర్కొన్నాడు–

లోగడ వుదాహరించిన నన్నయ పద్యద్వయాన్ని "కమ్మని లతాంతములకుం మొనసివచ్చు మధుపమ్ముల..." "అమ్మునీశుని...మేఘమ్ములెల్ల ... ప్రమోదమ్ముగా..... వృష్టిఁజేసెంమహా" అనే పద్ధలో ద్రుతస్థానంలో మాత్రమే బిందువునుంచి తక్కినచోట్ల ద్విత్వ మకారాన్నే వ్రాసి శబ్ద తత్వవేత్తలైన కొందరు పండితకవులు మాత్రమే వ్రాసేవారని పూర్వం 15వ పుటలో పేర్కొన్నాను – మరి కొందరు పండిత కవులు మొదట నన్నయ వ్రాసుకొన్నట్లే "కంమని లతాంతములకుం మొనసివచ్చు మధుపంముల..." – "అంమునీశుని.... మేఘంములెల్ల ... ప్రమోదంముగా ... వృష్టిఁజేసెంమహా" అనే పద్ధతిలో కేవలం ద్రుతస్థానంలోనే కాకుండా ద్విత్వ మకారంలో వున్న మొదటి మకారానికి మారుగా కూడా అన్నిచోట్లా పూర్ణబిందువును కొందరు వ్రాస్తూంటేవారు – కస్తూరి రంగకవి చెప్పిన యీ క్రింది లక్షణలక్ష్య పద్యాల నన్నింటినీ పరిశీలించండి.

బిందుప్రాసము—

గీ॥ రహిని బ్రాసాక్షరాది వర్ణంబు గిలుక
సమరియుండిన నది బిందువగుచు బిందు
వర్ణములఁజేరి ప్రాసమై వన్నెకెక్కు
సుందరీ మోహనాంగ యానందరంగ !

(ఆనం - రం - ఛం - 3 ఆ. 39 ప.)

ఈ లక్షణ పద్యానికి లక్ష్యంగా యీ క్రింది పద్యాల నుదాహరించాడు.

అనంతుని ఛందమున—

గీ॥ పేర్చి పొల్లు నకారంబు బిందువగుచు
మీఁద నున్న ధకారంబు నూఁదఁ బ్రాస
బంధమగుఁ గృష్ణుఁ డుదయించినం † ధరిత్రి
యంతయును నిరుపద్రవంబయ్యె ననఁగ॥

సారంగధర చరిత్రమున—

క॥ కం ‡ దోయి చల్లగా నిటు
కందోయి నృపాలు లెస్సగా నింకొక మా
ఱందఱిముందఱ నీవని
చిందఱవందఱయి గుట్టుచిట్టాడంగన్॥

హరికథాసారమున—

క॥ అంబరము పగులనార్చి ప్ర
లంబాసురుఁడాగ్రహము వెలయఁ గదిరినవే
శం బలరాముఁడు చే ముస
లంబున వానితలఁ ద్రుంచె లావు మెఱయఁగన్

భారతము అరణ్యపర్వమున—

మత్త॥ అంమునీంద్రుని వాసశక్తిఁ దదంగ రాజ్యములందు మే
ఘంములెల్ల కెలంకులంగడు గ్రమ్మి సర్వజన ప్రమో
దంముగాఁ బ్రచలద్బృహజ్జలధారలొప్పఁగ వృష్టిఁ జే
సం మహానదులున్ మహాసరసీచయంములు నిండఁగాన్॥

భారతము ఆదిపర్వమున -

లయగ్రాహి॥ కంమని లతాంతములకుం మొనసివచ్చు మధుపంము
.... (అ.రం.చం. - 3 ఆ.79,80 పు.)

---

† ముద్రణప్రతిలో "నన్ధరిత్రి" అని వున్నది. అది పొరపాటు.

‡ ముద్రణప్రతిలో "కన్దోయి" అని వున్నది - అది సరికాదు.

"రహిని" ఇత్యాది లక్షణ పద్యంలో రంగకవి ద్రుతన కారానికి ఆదేశంగా వచ్చిన పూర్ణానుస్వారానికీ సహజంగా శబ్దగతమైన పూర్ణానుస్వారానికీ ప్రాస చెల్లుతుందని లక్షణం చెప్పాడు. ఆ లక్షణానికి అనుగుణంగానే - "బంధ - (ఉద యించి)నంధరిత్రి"; "కందోయి - కందోయి - అందటి - చిందఱ"; "అంబర - (ప్ర) లంబాసురు - (వే) శంబల - (సము) లంబున"; అని వివిధ కవుల గ్రంథాలలోంచి లక్ష్యాలు పేర్కొన్నాడు. లక్ష్యాలన్నింటిలోనూ ద్రుత నకారాని కాదేశ మైన పూర్ణానుస్వారానికీ, సహజమై శాబ్దికమైన పూర్ణాను స్వారానికీ ప్రాస చెల్లింది. ఆ విధంగా ఆయా శబ్దాలు పూర్ణా నుస్వారంకలవి కాబట్టి ఆ ప్రాసలు నిర్దుష్టాలనడం స్పష్టం - కాని ద్రుత నకారానికి ఆదేశంగా వచ్చిన పూర్ణానుస్వారా నికీ, సహజమైన పూర్ణానుస్వారానికీ ప్రాస చెల్లుతుందని లక్షణం చెప్పిన రంగకవి "అమ్ముని నీంద్రుని - (మే) ఘమ్ము లెల్ల - (మో) దమ్ముగా - (చే) సెంమహా -" "కమ్మని లతాంతములకుం మొనసి మధుపమ్ము ....." అని ద్విత్వ మకారానికీ పూర్ణబిందు పూర్వకమైన మకారానికీ ప్రాస చెల్లిన పద్యపాదాలు వుదాహరించుతాడేమిటి? అని ఎవరైనా ప్రశ్నించవచ్చు - కాని ఇక్కడ రంగకవి సహజంగా ద్విత్వ మకారాలుగల పదాలను ద్విత్వ మకారాలు కలవిగా వ్రాసు కొనలేదు. ఉచ్చారణ కనుగుణంగా ఆ ద్విత్వ మకారాలను పూర్ణబిందు పూర్వక మకారాలుగా వ్రాసుకొని "అంమునీ ద్రుని . . . . . . (మే) ఘంములెల్ల - (మో) దంముగా -" అన్నప్పుడున్న బిందువులు సహజాలైన శాబ్దికాలైన బిందువు

లనీ "చేసెంమహా" అన్నప్పుడున్న బిందువు(చేసెన్ + మహా) ద్రుతానికి ఆదేశంగావచ్చిన బిందువనీభావించి ఆసహజబిందువులుకీ ఆదేశమైన బిందువుకీ ప్రాస చెల్లిందనీ తలంచి ఆవిధంగానే లక్ష్యంగా పేర్కొన్నాడు - అదేవిధంగా "కంమని" అన్నప్పుడున్న బిందువు సహజమైనదనీ "లతాంతములకుం మొనసి" అన్నప్పుడున్న బిందువు ద్రుతాని కాదేశంగా వచ్చిందనీ భావించి యిక్కడ సహజమైన బిందువుకీ ద్రుతానికి ఆదేశంగా వచ్చిన బిందువుకీ ప్రాసయతి చెల్లిందనీ తలంచాడు - దీన్నిబట్టి రంగకవి భారతంలో నుంచి లక్ష్యాలుగా పరిగ్రహించిన ఆ రెండు పద్యాలనూ

మత్త॥ అంమునీంద్రుని వాసశక్తిఁ దదంగ రాజ్యములందు మే
ఘంములెల్ల కెలంకులం గడుఁగ్రంమి సర్వజన ప్రమో
దంముగాఁ బ్రచలద్భ్రుహజ్జలధార లొప్పఁగ వృష్టిఁజే
సెంమహానదులున్ మహా సరసీచయంములు నిండఁగాన్ ॥

లయగ్రాహి-॥" కంమని లతాంతములకుం మొనసివచ్చు మధుపంము
.... ॥

అనే పద్ధతిలో బిందు పూర్వక మకారాలు కలవిగా వ్రాసుకొన్నాడని స్పష్టంగా తెలుతున్నది - ముద్రితప్రతిలో ద్విత్వ మకారాలు కలవిగా పైపద్యాలు ముద్రింపబడ్డాయి - అది సరికాదు - నన్నయ దగ్గర్నుంచీ వస్తున్న "అంమునీంద్రుని" వంటి వ్రాతలు సవ్యమైనవి కావని భావించిన కొందరు కవి పండితులు లోగడ చెప్పినట్లు "అమ్మునీంద్రుని" ఇత్యాది ద్విత్వ మకారాలు కలవిగానే వ్రాసుకుని "చేసెంమహా"- "లతాంతములకుం మొనసి" అన్నప్పుడున్న బిందువును బిందువు

గానే వ్రాసుకుని ద్విత్వ మకారానికీ పూర్ణబిందు పూర్వక మకారానికీ ప్రాస చెల్లుతుందని భావించారు - ఆతర్వాత మరి కొంత కాలానికి "అమ్మునీంద్రు - (మే) ఘమ్ము - (మో) దమ్ము - చేసెంమహా"; "కమ్మని - ల . . . . కుం మొనసి" ఇత్యాదుల్లో ద్విత్వ మకారానికి బిందుపూర్వక మకారానికి ప్రాస చెల్లినట్లు వుండడం సాంప్రదాయ సిద్ధంకాదనీ అటువంటి ప్రాస మైత్రి అప్పకవికి పూర్వకాలంలో వున్న లాక్షణిక ప్రోక్తంకాదనీ కొందరు పండితులు భావించి "చేసెమ్మహా" "లతాంతములకు మ్మొనసి" అని ద్రుతానికి మకారా దేశాన్ని చెప్పుకుని తమ కాలంలోవున్న భాషా స్థితికి అనుగుణంగా పూర్వపు వ్రాతలను దిద్దివేసారు - ఈ సందర్భంలో ఆవిధంగా దిద్దుబాటు జరిపిన వారిలో ప్రౌఢవ్యాకర్త వొకడు - "ప్రాసంబున మకారంబు పరంబగుచో ద్రుతంబునకు మకార దేశంబగు" (ప్రౌఢ - వ్యా సంధి - 22 సూ -) అని సూత్రాన్ని సృష్టించి "కమ్మని లతాంతములకు మ్మొనసి" - "వృష్టిఁజే, సెమ్మహా నది దీర్ఘికాసరసీనదంబులు నిండఁగాన్" అని ప్రాస సరిపెట్టుకున్నాడు ప్రౌఢవ్యాకర్త - ప్రాచీన కాలంలోవున్న "కంమని లతాంతములకుం మొనసి" "అంమునీంద్రుని. . . మేఘంము. . . మోదంము . . . . . . వృష్టిఁజేసెంమహానదిదీర్ఘకాసరసీనదంబులు నిండఁగాన్" అనే వ్రాతనుగాని "కమ్మని లతాంతములకుం మొనసి - అమ్మునీంద్రుని . . . మేఘమ్ములు . . . మోదమ్ములు . . . వృష్టిఁజేసెంమహానది . . . . . ." అనే వ్రాతనుగాని గమనింపలేదు. ఒకవేళ గమనించినా ఆ రెండు వ్రాతలూ దోషభూయిష్టాలుగానే భావించి యీ కొత్త

సంస్కరణ ప్రవేశపెట్టి వుంటాడు. ఏం చేసినా అది యీనాటి సంస్కరణమాత్రమే అవుతుందిగాని పూర్వులంతా ప్రాసలో మకారం పరమవుతుంటే ద్రుతానికి మకారాదేశం వస్తుందని భావించారనడానికి ఏ మాత్రమూ అవకాశం లేదుగదా! ఈతడు ఈ పద్యాలను ఇప్పుడు సంస్కరించినా ఉచ్చారణ కనుగుణంగా వెలసిన "కంమని లతాంతములకుం మొనసి" వంటి వ్రాతలనల్ల ప్రాచీనకవులూ లాక్షణికులూ పడినప్రమాదాలను సాహిత్యలోకంలోనుంచి తొలగించడమనేది ఇతనికే కాదు ఎవరికైనా అసాధ్యమేగదా!

ఈ విధంగా ప్రాచీనకాలంలో "కమ్మ, చెమ్మ, నెమ్మి" మొదలైన ద్విత్వ మకారాలుగల పదాలను ఉచ్చారణ ననుసరించి "కంమ, చెంమ, నెంమి" అని పూర్ణానుస్వార యుక్తాలుగా అనంతుడు మొదలైన లాక్షణికులు ప్రాస్తాండేవారు -

ప్రాసమైత్రి—

గీ॥ లలిలు రెండును నొండొంటఁగలసివచ్చు
నమరునన్యోన్యమును బుయుతాయుతములు
బిందుపూర్వమై తమలోనఁ బొందుబమలు
ప్రాసమైత్రికి నిది స్వరూపంబు తెలియ॥

ఆ॥ వె॥ నీలవర్ణ గర్భగోళంబునందు లో
కంబులెల్లనుండు నెమ్మితోడ
శ్రీకి నొడయఁడుజ్వలాకృతి యితఁడన్నఁ
బ్రాసమైత్రియిట్లు పఱఁగుఁ గృష్ణ॥

(అనంతుని ఛందము - 1 ఆ. 40, 41 ప.)

వీటిలో మొదటిపద్యం లక్షణపద్యం – రెండవది లక్ష్య పద్యం – లక్షణపద్యం మూడవపాదంలో బిందుపూర్వకాలైన "బ" కార "మ"కారాలకు ప్రాస చెల్లుతుందని లక్షణం చెప్పబడింది. లక్ష్యంలో ద్విత్వ మకారానికి పూర్ణబిందుపూర్వకమైన బకారానికీ ప్రాస చెల్లినట్లు ప్రత్యక్షంగా కన్పడుతున్నది. ఈ లక్షణానికి లక్ష్యంగా "కంబులెల్లనుండు నెమ్మితోడ" అని రెండో పద్యం రెండోపాదం యివ్వబడింది. లక్షణంలో "బ"కార "మ" కారాలు రెండూ బిందు పూర్వకాలైతే ప్రాస చెల్లుతుందని చెప్పబడింది. వాస్తవానికి యిక్కడ లక్షణం చెప్పవలసింది ద్విత్వ మకారానికి, పూర్ణానుస్వారం పూర్వంలోవున్న "బ" కారానికీ ప్రాసచెల్లుతుందనిమాత్రమే- ఈవిధంగా చెప్పకుండా అనంతుడు మకార బకారాలు రెండూ బిందు పూర్వకాలేనని చెప్పడానికి కారణం ద్విత్వ మకారాన్ని ఉచ్చారణ ననుసరించి బిందు పూర్వక మకారంగా వ్రాసే అలవాటు కొందరు కవిపండితుల కున్నట్లు అనంతుడికి కూడా వుండడమే – "నెమ్మి" అని వ్రాయడానికి మారుగా "నెంమి" అని వ్రాసుకొని ఆ మకారం నిర్వివాదంగా ద్విత్వ మకారమనే సంగతి మరచిపోయి బిందుపూర్వకమని అభిప్రాయ పడడమే ఈ అనంతుని ప్రమాదానికి కారణం – అంటే – అనంతుడు యితరులతో పాటు తనకుకూడా వున్న అలవాటునుబట్టి "కంబులెల్ల నుండు నెంమితోడ" అని వ్రాసుకొని "బిందు పూర్వమై తమలోనఁ బొందు బమలు" అని తాను వ్రాసిన లక్షణానికి లక్ష్యంగా సరిపెట్టుకున్నాడన్న మాట –

ఈ విధంగా అనంతుడు "నెమ్మి" అనేది "నెంమి"అని బిందువు కల రూపంగా చెప్పినట్లే చిత్రకవి పెద్దన "క్రమ్ము" అనేది "క్రంము" అని బిందువుకల రూపంగా పేర్కొన్నాడు–

– "బిందు పూర్వంబుగాఁ బొందిన బమలు జ
గంబులోఁ గృతులను గ్రమ్మననఁగ" –

(ల - సా. సంగ్రహం - 1ఆ. 65 ప.)

ఇదేవిధంగా కూచిమంచి తిమ్మకవికూడా

బమలు బిందు పూర్వకముగఁ బ్రాసంబుల
నిలుపఁజెల్లు లలిలకిల నభేద
మొదవుఁ గృతుల యందు నుడురాజకోటీర !
దురితదూర ! పీఠపుర విహార ! "

(సర్వ - ల - సా - సంగ్రహం - 2 ఆ- 16 ప-)

అని బమలు బిందు పూర్వకాలుగానే లక్షణం చెప్పుకుని 17, 18 పద్యాల్లో "ఇమ్ముగ – (బిం) బమ్మున – (రం) ధ్రమ్మను – అమ్మఖ" వంటి పదాలను "అంముగ – (బిం) బంమున – (రం) ధ్రంమను – అంమఖ" వంటి బిందుయుక్త పదాలుగా వ్రాసుకొని లక్ష్యంగా వుదాహరించాడు – ఈ విధంగా "నెమ్మి" ఇత్యాదుల్లో బిందువును వ్రాడమనేది జన వ్యవహారంలో కేవలం వుచ్చారణవశంచేత సంభవించిందేగాని వేరుకాదు. ‡ పెద్దగా పాండిత్యంలేని వ్యక్తికూడా ఈనాడు

---

‡ శబ్దతత్వాన్ని తెలుసుకున్న అప్పకవిమాత్రం "నెమ్మి" మొదలైన పదాలలో ద్విత్వ మకారం వున్నదేగాని బిందువులేదని గమనించి సరైన పద్ధతిలో "ద్విత్వమకారానికీ పూర్ణబిందుపూర్వకమకారానికీ ప్రాస చెల్లుతుం" దని ఈ క్రింది పద్యంలో "ప్రాసమైత్రిప్రాస" మనే పేరుతో

రచనలో వినియోగిస్తున్న వ్యావహారికభాషలో "నెమ్మి, కమ్మని," మొదలైన పదాల్లో బిందువును వ్రాయడు - కాని ప్రాచీనకాలంలో అంతంత పండితులైవున్న లాక్షణికకవులే అనేక ప్రదేశాల్లో వ్యావహారికానికి లొంగిపోయి వ్యావహారిక భాషావాదులుకూడా అంగీకరించని భ్రష్టవ్యావహారికానికి సంబంధించిన పిచ్చివ్రాతలు వ్రాస్తూవుండేవారంటే యితరుల సంగతి ఏమని చెప్పాలి ?

ఈ పూర్ణానుస్వారమే ప్రయత్న సామ్యంవల్ల చిత్ర విచిత్రంగా కొన్నికొన్ని శబ్దాల్లో ప్రవేశించింది. ఈ ప్రవేశం కేవలం వ్యవహారంలో ఉచ్చారణవశంచేత సంభవించిందేకాని వేరుకాదు. ఈనాడు వ్యావహారికభాషలో యెవరైనా "జిహ్వా, విహ్వాల, గహ్వర" మొదలైన శబ్దాలను వ్రాయాలంటే సవ్యంగా ఆ శబ్దాల వర్ణక్రమాన్ననుసరించి "హవ''ల సంయుక్తంగా మాత్రమే వ్రాస్తారుగాని అనుస్వారసహితాలుగా "జింహ్వా, వింహ్వాల, గంహ్వర" మొదలైన శబ్దాలుగా ఎవ్వరూ వ్రాయరు - కాని మన ప్రాచీనకాలంలో పండితులు కవులు కూడా ఉచ్చారణను అనుసరించి "జింహ్వా, వింహ్వాల, గంహ్వర" అని అనుస్వారసహితాలుగా వ్రాసుకుంటూవుండే

సవ్యంగా లక్షణం చెప్పుతున్నాడు -

గీ॥ గట్టి బిందువుమీది బకారమునకు
జమిలి మాప్రాసమైత్రినా జరుగుచుండుఁ
గమ్మతావులు వెదచల్లు నంబుజములు
శంబరారాతిచేతివాలమ్ములనఁగ ॥

(అప్ప - 3 ఆ - 343 ప.)

వారు - ఈవిధంగా జిహ్వాదిపదాల్లో పూర్ణానుస్వారాన్ని వ్రాయడమనేది జనవ్యవహారవశంచేత ఉచ్చారణ సౌలభ్యాపేక్షచేత సంభవించిందేకాని వేరుకాదు.

"జిహ్వా" ఇత్యాదుల్లో "హ" కారానికి స్థానంకంఠం- "హ" కారానికి "వివారం, శ్వాసం, అఘోషం" బాహ్యప్రయత్నాలు - "వ" కారానికి సంవార, నాద, ఘోషాలు బాహ్యప్రయత్నాలు. అకారానికి ప్రయత్నం సంవార, నాద, ఘోషాలు -

విభిన్నాలైన స్థాన ప్రయత్నాలుకల "హ" కార "వ" కారాల సంయుక్తాక్షరాన్ని వుచ్చరించడం కష్టం - కాబట్టి ఉచ్చారణలో "వ" కారానికి "అ" కారానికి ప్రయత్న మిత్రత్వంకల † అనుస్వారంవచ్చి ప్రవేశిస్తుంది - ఉచ్చరించడానికి కష్టంగావున్న "హ" కార "వ" కారాలు సుఖంగా వుచ్చరించడానికి యోగ్యాలయ్యేట్లుగా వుండడానికిగాను వాటికి పూర్వభాగంలో ఈ అనుస్వారం ప్రవేశిస్తుంది. కాగా "జిహ్వా, విహ్వాల, గహ్వార" మొదలైన రూపాలు "జింహ్వా, వింహ్వాల, గంహ్వార" మొదలైనవిగా అనుస్వారసహితాలుగా సిద్ధిస్తాయి- ఈ విధంగా "జిహ్వా" మొదలైన శబ్దాలను "జింహ్వా" మొదలైనవిగా ఉచ్చారణ ననుసరించి వ్రాయడమనేది ఎప్పుడో క్రీ॥ శ॥ 1500 ప్రాంతంనుంచీ పండితకవుల్లో అలవాటుగా వున్నది. కాబట్టే ఈ క్రింది ప్రయోగాల్లో "విహ్వాల-గహ్వార"

† "వ" కారానికి "అ" కారానికి లాగానే అనుస్వారానికికూడా సంవారనాద ఘోషాలే బాహ్య ప్రయత్నాలు -

శబ్దాలు "వింహ్వాల - గంహ్వార" శబ్దాలుగా ప్రాసల్లో ప్రయోగింపబడ్డాయి -

-"వింహ్వాలితనరక వీరము చక్రము
‡ సైంహ్వకేయగళ సంహ్వార చక్రము" -*

(సుదర్శనరగడ - తాళ్ళపాక పెదతిరుమలయ్య -
క్రీ॥ శ॥ 1530 ప్రాంతం)

-"గంహ్వాగ్ని ధరగుహ కడతెంచి యొక్క-
‡ సింహ్వంబు నరనాథ సింహ్వుపై కెగసి" - *

(అష్టమహిషీ కళ్యాణము - తాళ్ళపాక చిన్నన్న-
క్రీ॥ శ॥ 1545 ప్రాంతం -)

-"కనకహర్మ్యంబులై కనుపట్టు సానువు
ద్గంహ్వ రాంతరములు ‡ సింహ్వమధ్య" -

(హరిశ్చంద్రోపాఖ్యానము - 4 ఆ. 62 ప.
క్రీ॥ శ॥ 1580 ప్రాంతం)

ఈ విధంగా జనవ్యవహార సరణిన "విహ్వల, గహ్వ" రాది శబ్దాలు "వింహ్వల, గంహ్వ" రాదులుగా పండితకవుల చేత వ్రాయబడడమే కాకుండా రచనలో సైతం ప్రయోగింపబడడం చూచిన అప్పకవి "హకార వివేకము" అనే శీర్షికతో ఈ క్రింది సీసపాదాలు రచించుకున్నాడు -

సీ॥ బహ్వర్థ విహ్వల జిహ్వాహ్వ లాహ్వాన
గహ్వ రోపహ్వర ప్రహ్వ కహ్వ
శబ్దంబులు వకార సహితంబులగుఁగాని
బిందుపూర్వములు దా మెందుఁగావు

(అప్ప. 2. ఆ. 261 వ.)

---

* ఈగుర్తుకలవిఅప్పకవీయచపంచమముద్రణ తొలిపలుకుకర్త చూపినవి.

‡ సింహశబ్దం సింహ్వ శబ్దంగా మారడం గురించి ముందు చర్చింపబడుతుంది.

ఇందులో అప్పకవి స్పష్టంగా "బహ్వార్థ, విహ్వాల, జిహ్వా, ఆహ్వాల, ఆహ్వాన, గహ్వార, ఉపహ్వార, ప్రహ్వా, కహ్వా" శబ్దాలను "బంహ్వార్థ, వింహ్వాల, జింహ్వా, ఆంహ్వాల ఆంహ్వాన, గంహ్వార, ఉపంహ్వార, ప్రంహ్వార, కంహ్వా" అని అనుస్వార సహితాలుగా వ్రాయకూడదని వావిడిచి పేర్కొన్నాడు.

ఈ విధంగా "విహ్వా" లాది శబ్దాల్లో అనుస్వారం లేదని అప్పకవి చెప్పినట్లే గణపవరపు వెంకటకవికూడా యీక్రింది సీసపాదాలు రచించాడు.

సీ॥ ఇంకమీఁద హాకారసంకలితవకార
ములగుమఁ గొన్ని రాజిలుచునుండుఁ
బ్రహ్వ గహ్వర కహ్వ విహ్వలాహ్వ నాహ్వ
బహ్వశి బహ్వృష జిహ్వలనఁగ

(ఆం. కా. 35 పుట.)

అయితే యిందులో వెంకటకవి అప్పకవి చెప్పినట్లుగా విషయాన్నంతా చెప్పలేకపోయాడు. ప్రహ్వాది శబ్దాలు కేవల వకారసహితాలని మాత్రమే చెప్పాడుగాని వాటిని అనుస్వార సహితాలుగా వ్రాయకూడదనే విషయాన్ని స్పష్టపరచలేక పోయాడు -

ఇక్కడ విపరీతస్థితికూడావున్నది. ఏమంటే భిన్నస్థాన ప్రయత్నాలుకల "హ" కార "వ" కారాలకు పూర్వభాగంలో పూర్ణానుస్వారం "వ" కార మిశ్రత్వాన్ని పురస్కరించుకుని ప్రవేశించినట్లే సహజంగా వకారం లేకుండా అనుస్వారమూ హాకారమూకల "సింహ, స్నంహతి, సంహార" మొదలైన

పదాలలో అనుస్వారప్రయత్న మిత్రిత్వాన్నీ హాకారంమీద వుండే స్వరప్రయత్న మిత్రిత్వాన్నీ పురస్కరించుకొని "వ" కారం రావడం ప్రారంభించింది. అనుస్వారానికి సంవారనాద ఘోషాలు బాహ్య ప్రయత్నాలు - "హ" కార వ్యంజనానికి వివారం, శ్వాసం, అఘోషం బాహ్యప్రయత్నాలు - హాకారంపైనుండే స్వరానికి సంవారనాద ఘోషాలే బాహ్య ప్రయత్నాలు. సంవారాది ప్రయత్నాలుకల అనుస్వారం పూర్వంలోవున్న వివారాది ప్రయత్నాలు కల హాకారాన్నీ సంవారాది ప్రయత్నాలుకల స్వరాన్నీ (౦ + హ + అకారాదులు) కలిపి (హ కారానికీ పైనుండే స్వరానికి మధ్య మరో హల్లు లేకుండా) వుచ్చరించడం కష్టం - కాబట్టే "హ" కార వ్యంజనానికి పూర్వపరభాగాల్లో వున్న సంవారాదిప్రయత్నాలుకల అనుస్వారస్వరాలకు బాహ్యప్రయత్న మిత్రిత్వం కల "వ" కారవ్యంజనం హాకారానికీ దానిపైన వుండేస్వరానికీ మధ్యప్రవేశిస్తుంది. అప్పుడు "సింహ, సంహతి, సంహార" మొదలైన శబ్దాలు "సింహ్వ, సంహ్వతి, సంహ్వార" మొదలైన శబ్దాలుగా "వ" కార వ్యంజన సహితాలుగా మారతాయి - ఈ విధంగా ఉచ్చారణ సౌలభ్యంతో సింహాది శబ్దాలు సింహ్వాది శబ్దాలుగా మారడమనేదికూడా ఎప్పుడో క్రీ। శ॥ 1500 ప్రాంతంలోనే జరిగింది. కాబట్టే ఈ క్రింది ప్రయోగాల్లో "సింహ" శబ్దం "సింహ్వ" శబ్దంగా ప్రాసలో ప్రయోగింపబడింది.

— "వింహ్వాలిత నరకవీరము చక్రము
సైంహ్వాకేయగళ సంహ్వారచక్రము"
(సుదర్శనరగడ - తాళ్ళపాక పెదతిరుమలయ్య. క్రీ॥ శ॥ 1530 ప్రాంతం.)

— "గంహ్వారి ధరగుహాకడతెంచి యొక్క-
సింహ్వంబు నరనాథ సింహ్వుపై కెగసి"
(అష్టమహిషీ కళ్యాణం - తాళ్ళపాక చిన్నన్న - క్రీ॥ శ॥ 1545.)

—"కనక హార్మ్యంబులై కనుపట్టు సానుమ
ద్గంహ్వ రాంతరములు సింహ్వ మధ్య" -
(హరిశ్చంద్రోపాఖ్యానం - 4 ఆ. 62 ప
క్రీ॥ శ॥ 1580 ప్రాంత్రం.)

ఈ విధంగా విపరీతంగా సింహాది శబ్దాల్లో వకారాన్ని కలిపి పండిత కవులు వ్రాయడాన్ని రచనలో వుపయోగించడాన్ని చూచిన అప్పకవి సింహాది శబ్దాలను సింహ్వాది శబ్దాలుగా వ్రాయకూడదని స్పష్టపరుస్తూ యీ క్రింది సీసపాదాలు రచించాడు.

సీ॥ ....

....

సంహతి సంహూతి సంహితా సంహార
సంహననాంహో నృసింహ రంహ
బృంహణ పదములు బిందు పూర్వకములు
గాని వకారయుక్తములు గావు
(అప్ప - 2 ఆ - 261 ప.)

ఈ విధంగా సింహాది శబ్దాలను సింహ్వాది శబ్దాలుగా - అంటే - వకార వ్యంజన సహితాలుగా వ్రాయకూడదనే అభి

ప్రాయంలో గణపవరపు వెంకటకవి ఈ క్రింది పాదాలు రచించాడు -

సీ॥ ఇంక రంహోంహ ప్రబృంహణ సంహితా
సంహతి సంహార సింహ సంహ
ననము లన్నద్రముల్ కనఁగ ననుస్వార
యుత హకారమ్ములై యొప్పు నిటులు
(అం - కా - 35 పుట.)

ఇక్కడకూడా వెంకటకవి రంహోంహాది శబ్దాలు అనుస్వారయుతాలు మాత్రమేనని చెప్పాడుగాని ఆ పదాలను వకార యుక్తాలుగా వ్రాయకూడదని విస్పష్టపరచ లేదు — ఈ విషయాన్ని పాఠకులవూహకు విడిచి పెట్టాడు -

"విహ్వ" లాది శబ్దాలను ఉచ్చారణ ననుసరించి "వింహ్వ'' లాదులుగా ప్రాచీనులు వ్రాసుకొన్నట్లే "బ్రహ్మ, జహ్మ" మొదలైన శబ్దాలనుకూడా ఉచ్చారణ ననుసరించి "బ్రంహ్మ, జింహ్మ" మొదలైనవిగా అను స్వారసహితాలుగా వ్రాస్తూ వుండేవారు - ప్రయత్న సామ్యంలేని హకార మకారాలను (హకారానికి వివారశ్వాసఅఘోషాలు, మకారానికి సంవారనాద ఘోషాలు బాహ్య ప్రయత్నాలు.) కలిపి వుచ్చరించడం కష్టం కాబట్టి పూర్వోక్తరీతిగానే హకారానికి పూర్వం ఉచ్చారణ సుఖాపేక్షతో పూర్ణానుస్వారం చేర్చబడుతుంది. అప్పుడు బహ్మాది పదాలు బ్రహ్మాందులుగా సిద్ధించుతాయి. కాబట్టే మన ప్రాచీన కవి పండితులు ఆ బిందురూపాలను వ్రాస్తూవుండే వారు. అటువంటి వ్రాతలు చూచిన అప్పకవి

తే॥ "మాముడులు నిల్చు బహ్మ జిహ్మాగ పదముల"
....

(అప్ప - 2 ఆ. 261 ప.)

అని బహ్మ ఇత్యాదుల్లో మాముడి వుంటుందన్నాడు. అయితే యిందులో అప్పకవి "విహ్వా" లాది శబ్దాల విషయం చెప్పినట్లుగా విషయాన్నంతనీ విస్పష్టంచెయ్యలేక పోయాడు. ఇక్కడ మరొక విషయం గమనించాల్సి వున్నది. "సంవార నాద ఘోష"(బాహ్య) ప్రయత్నాలుకల మకారానికిపూర్వం "వివార శ్వాస అఘోష" (బాహ్య) ప్రయత్నాలు కల హ కారాన్ని వుచ్చరించడం కష్టమనేగదా ఆ హకారానికి పూర్వ భాగంలో "సంవారనాద ఘోష" (బాహ్య) ప్రయత్నాలు కల పూర్ణానుస్వారాన్ని చేర్చుకుంటాము? ఇక్కడ మకారా నికి అనుస్వారానికి స్థాన ప్రయత్నాలు రెండూ మైత్రికలవి అవడంచేత † అనుస్వారానికి మారుగా హకారానికిపరంగావున్న మకారమేరావడం ప్రారంభించింది. అంటే - బహ్మ, జిహ్మ అని వుచ్చరించి వ్రాయవలసిన పదాలు ఉచ్చారణ సుఖా పేక్షతో అనుస్వారానికి మారు హకారోత్తరవర్తి అయిన మకారమే వచ్చి (హమలు తారుమారై) "బ్రహ్మ, జిహ్మ" మొదలైనవిగా తయారయ్యాయన్నమాట. ఈవిధంగా బ్రహ్మాది శబ్దాలను బ్రహ్మాది శబ్దాలుగా మన ప్రాచీనులు వ్రాస్తుండే వారు - "బహ్మ" మొదలైన పదాలను హ్మకారాలు కలవిగానే

---

† అనుస్వార మకారాలకు రెండింటికీ స్థానం నాసిక - సంవార నాద ఘోషాలు బాహ్య ప్రయత్నాలు.

(మాముడులుకలవిగానే†) వ్రాయాలిగాని "బ్రహ్మ" మొదలైన విగా (హాముడులుకలవిగా‡) వ్రాయకూడదనే అభిప్రాయంతో అప్పకవి "మాముడులు నిల్చు బ్రహ్మ జిహ్మాగ పదముల" అనేదాన్ని రచించాడని చెప్పినా చెప్పవచ్చు -

ఇదేవిధంగా గణపవరపు వెంకటకవికూడా బ్రహ్మాది శబ్దాలను, బ్రంహ్మాదులుగాను బ్రహ్మాదులుగాను వ్రాయకూడ దనే అభిప్రాయంతో ఈ క్రిందిపాదాలు రచించాడు -

సీ॥ ...మకార సంకలిత హకార
　　　　ములు కొన్ని దనరారుఁ దెలివిడిగను
　　గనుఁడు జిహ్మజిహ్మగ బ్రహ్మ జిహ్మగ
　　　　బ్రాహ్మణులనఁ బరబ్రహ్మమనఁగ

(ఆం. కౌ. 35 పుట.)

బ్రహ్మాది శబ్దాలు ఉచ్చారణ సౌలభ్యంకోసం స్థాన ప్రయత్న సామ్యాలనుపురస్కరించుకొనివ్యవహారంలో "బ్రంహ్మ-బ్రహ్మ" మొదలైనవిగా సిద్ధించినట్లే "చిహ్నము" మొదలైన శబ్దాల్లో కూడా అదేస్థాన ప్రయత్నాల సామ్యంచేత "చింహ్నము, చిన్హము" అని అనుస్వార ప్రవేశమూ, హనలవ్యత్యస్తమూ జరిగింది - చింహ్నము, చిన్హము, వంటి రూపాలను ప్రాచీనకాలంలో పండితకవులు కొందరు వ్యవహరించే వారు - కాబట్టే అప్పకవి

"చిహ్నమనుచోట * నాముడిచెందియుండు" (అప్ప. 2 ఆ. 261 ప.)

అని చెప్పుకోవలసి వచ్చింది -

---

† మాముడి = మావత్తు.　* నాముడి = నావత్తు
‡ హాముడి = హావత్తు.

"లేహ్యాము, గృహ్యాము" మొదలైన శబ్దాలలో పూర్వంపలనే సంవారాది ప్రయత్నాలుకల "య" కారానికి పూర్వం వివారాది ప్రయత్నాలుకల హాకారాన్ని వుచ్చరించడం కష్టంకాబట్టి సులభాపేక్షతో హాకారానికి పూర్వంలో "య" కార (బాహ్య) ప్రయత్న సామ్యంచేత అనుస్వారం వస్తుంది. అప్పుడు "లేహ్యాము" మొదలైన శబ్దాలు "లేంహ్యాము మొదలైనవిగా మార్పు పొందుతాయి. ఈ విధంగా ఉచ్చారణ ననుసరించి లేహ్యాము మొదలైన శబ్దాల్లో అను స్వారాన్ని వ్రాయడమనేది ప్రాచీన కాలంనుంచీ అలవాటుగా వున్నది. అందువల్లనే అప్పకవి

"కియ్యలగు లేహ్య గృహ్య ప్రగృహ్యములను
బ్రాసముల వీని నెఱిఁగి చెప్పంగవలయు" —

(అప్ప - 2 ఆ. 261 ప.)

అని చెప్పుకున్నాడు. లేహ్యాది శబ్దాలలో కియ్యవడి వుంటుందని మాత్రమే చెప్పాడుగాని వాటిల్లో అను స్వారాన్ని వ్రాయకూడదని అప్పకవి స్పష్టంగా చెప్పలేకపోయాడు. ఈ విషయంలో గణపవరపు వెంకటకవి మనస్సు విప్పి "గుహ్య, సమూ" హ్యాది శబ్దాల్లో కియ్యవడి మాత్రమే వ్రాయాలికాని "గుంహ్య, సమూంహ్య" అని అనుస్వారం వ్రాయకూడదని విస్పష్టంగానే చెప్పాడు —

సీ॥ గుహ్య సమూంహ్య దండహ్య మాన గ్రాహ్య
క్షైతిహ్యులనఁగ వాహ్యాళి యనఁగ
సహ్యజా బాహ్యాపవాహ్య గుహ్యాశి సహ్య
వాహ్య లేహ్యములన వఱలు పదము

లన్నియు నిర్బిందువులై కియ్యవళ్ళతోఁ
గూడుకయుండు నీ జాడ ....

(ఆం - శా - 35 పుట.)

"అన్నము, సున్నము" మొదలైన మువర్ణాంతాలైన పదాలను మనం వ్యావహారికంలో "అన్నం, సున్నం మొదలైనవిగా పూర్ణానుస్వారం చివరకలవిగా ఉచ్చారణను బట్టి వ్రాస్తుంటాము - ఈ "ము" వర్ణంలో వుండే స్వరం ఉచ్చారణ సౌలభ్యంకోసం లోపిస్తుంది. స్వరలోపం జరిగిన తర్వాత "మ్" అనే వ్యంజనానికి స్థాన ప్రయత్న సామ్యంవల్ల పూర్ణానుస్వారం వస్తుంది. అప్పుడు "అన్నం, సున్నం" వంటి రూపాలు తయారవుతాయి. ఇదేవిధంగా "ధనమ్, వనమ్, అహమ్, కిమ్" మొదలైన మకారాంత సంస్కృత పదాలనుకూడా తెలుగువారు వ్రాయవలసి వచ్చేసరికి ఉచ్చారణ ననుసరించి "ధనం, వనం, అహం, కిం" మొదలైనవిగానే వ్రాస్తారు - ఈవిధంగా "ధనమ్" మొదలైన వాటిని అనుస్వారాంతాలుగా వ్రాసే అలవాటు ప్రాచీన కాలంలో మన పండితకవులకు చాలా మందికి వుండేది. కేతన తన ఆంధ్ర భాషాభూషణంలో

క॥ ఇల సంస్కృత పదములపై
నెలకొని నిల్చిన విసర్జనీయంబులు సు
న్నలు నిలువవు తెనుఁగులలో
నలవడఁగాఁబల్కుచోట నభినవదండీ !

(ఆం - భా - భూ 30 ప.)

అని వొక పద్యం రచించాడు - ఇందులో కేతన "సంస్కృత పదములపైనున్న విసర్గములును, సున్నలును నిలువవు" అని చెప్తున్నాడు - విసర్గలు నిలువక పోవడానికి "వర్థతాం(శ్రీః + అనియె=వర్థతాం(శ్రీయనియె" అనేదాన్ని వుదాహరణగా పేర్కొవచ్చు - "విద్వాంసమ్, అప్సరసమ్" మొదలైన పదాల్లోవున్న చివరి మకార వ్యంజనానికి లోపం చెప్పి ఆపైన విభక్త్యాదుల్ని చేర్చుకోవాలి - ఇక్కడ కేతన మకారాంతాలైనవాటిని అనుస్వారాంతాలుగా (వాసుకొనే అలవాటు తనకు వుండబట్టి ఇక్కడ స్వతస్సిద్ధమైన మకారానికి లోపం చెప్పవలసివుండగా అనుస్వారానికే లోపంచెప్పాడు - విద్వాంసమ్, అప్సరసమ్ మొదలైనవాటిల్లో మకారానికి లోపం చెప్పడానికి మారు అనుస్వారానికి లోపం చెప్పాడంటే వాటిని అనుస్వారాంతాలుగా "విద్వాంసం, అప్సరసం" అని (వాసుకొన్నాడని వేరే చెప్పవలసిన పనిలేదు -

ఇక్కడ ఎవరైనా "విసర్జనీయంబులు సున్నలు" అన్నప్పుడు "విసర్జనీయంబుల సున్నలు" అని సవరించవచ్చు - ఆ విధంగా సవరించే ట్లయితే విసర్గకు సంబంధించిన రెండుసున్నాలు లోపిస్తాయనే అర్థం సిద్ధిస్తుంది. కాని ఆంధ్రభాషాభూషణంలో మకారాంతపదాలైన "విద్వాంసమ్" మొదలైన పదాల్లో చివరి మకారవ్యంజనానికి లోపంచెప్పే వాక్యం లేకపోవలసి వస్తుంది. ఒకవేళ ఆవిధంగానే "విసర్జనీయంబుల సున్నలు" అనే సవరించేటట్లయితే "మకారాంత పదాలను అనుస్వారాంతాలుగా (వాయడ" మనేది కేతనకు

చెందకపోయినా అటువంటి వ్రాతలు వ్రాసిన ప్రాచీన లక్షణ గ్రంథకర్తలు మరికొందరున్నారు కాబట్టి యిక్కడవచ్చే యిబ్బంది యేమీలేదు -

క॥ పన్నగ మకారహల్లగు
సున్నమకారమగు నచ్చుసోక సమగ్రం
బన్నమన ఋకారం బా
సన్నంబుగ మృత్వమగు రససమృద్ధియనన్ "

(అనంతుని ఛందం - 4 ఆ. 61 ప.)

"సమ్" అనే వుపసర్గ మకారాంత మనడం నిర్వివాదం. మకారం చివరకల "సమ్" అనే ఉపసర్గను "సం" అని అనుస్వారాంతంగా అనంతుని కాలంలో పండితులూ కవులూ వ్రాస్తూండేవారు. కాబట్టే అనంతుడు "సం" అన్నప్పుడు ఆ చివరవున్న సున్నాకు అచ్చుపరమైతే ఆ సున్న మకారంగా మారుతుందని చెప్పి "సం + అగ్రంబు" అన్నప్పుడు "సం"లో వున్న సున్నాకు "అగ్రంబు" అనే దాంట్లోవున్న అకారం అచ్చుపరమైనదికాబట్టి ఆ సున్నా "మ" కారంగామారి "అ" కారస్వర "మ" కార వ్యంజనాల మేళనంతో "సమగ్రంబు" అనే రూపం సిద్ధించిందని దానికి వుదాహరణ మిచ్చాడు. ఆ విధంగానే ఆ "సం"లో వున్న సున్నాకు ఋకారం పరమైనా ఆసున్నా మకారంగా మారుతుందని (ఋకారం బాసన్నంబుగ మృత్వమగు) వచించి దానికి "సం + ఋద్ధి= సమృద్ధి" అని వుదాహరించాడు -

"మకారహల్లగు సున్న మకారమగు" అనే యీవాక్యం చేత న్యాయానికది మకారమేననీ దాని స్థానంలో సున్నా

వ్రాస్తున్నామనీ ఆసున్నా అచ్చుపరమైనప్పుడు మకారంగా మారుతుందనీ అనంతుడు చెప్తున్నాడు – (మకార హల్లగు సున్న=స్వతస్సిద్ధంగా మకారమే అయివుండి సున్నాగా వ్రాయబడుతున్న అనుస్వారం, అచ్చుసోకన్=అచ్చుయొక్క సంబంధం కలిగినప్పుడు, మకారమగున్=మకారంగా మారు తుంది–) కాబట్టి "సం" అన్నప్పుడు వాస్తవానికది మకారాంత మనే జ్ఞానం (Presentలో) వుండికూడా అనంతుడు బుద్ధి పూర్వకంగా సున్నా వ్రాసుకొన్నాడనిస్పష్టంగా తెలుస్తున్నది.

ఆంధ్రశబ్ద చింతామణికి తెలుగులో టీక వ్రాసిన యెలకూచి బాలసరస్వతి ఆ చింతామణిలోవున్న "అహమాదీ నాంద్విత్వమ్" అనే సూత్రానికి అర్థంవ్రాస్తూ – "సున్నకు ద్విత్వము రానేరదు గావున మకారముచేసి కొనునది" – అనిఒక వాక్యం వ్రాసాడు. (బాల సరస్వతీయం – 170 పుట–) "అహమ్" మొదలైన శబ్దాల్లో అంతంలోవున్న మకారానికి అనుకరణంలో ద్విత్వం వస్తుందని సూత్రార్థం – "అహమ్" మొదలైనవి మకారాంతాలేగాని అనుస్వారాంతాలు కావు – అటువంటి చోట్ల మకారానికి ద్విత్వం రానేవస్తుంది – అలాం టప్పుడు –"సున్నకు ద్విత్వము రానేరదు గావునమకారముచేసి కొనునది" – అని బాలసరస్వతి చెప్పవలసిన అవసరం యేమా త్రమూ లేదుగదా? ఇటువంటి నిరపేక్షణీయమైన విషయాన్ని బాలసరస్వతి చెప్పి స్పష్టంగా మనకొక విశేషాన్ని తెలియ జేసాడు – "అహమ్" మొదలైన మకారాంత పదాలను బాల సరస్వతికాలంలో "అహం" మొదలైనవిగా అనుస్వారాంతా లుగా పండితులు కవులుసైతం వ్రాసేవారని అతని వాక్యంవల్ల

త్వల్లమవుతుంది. ఆ విధంగా అనుస్వారాంతాలుగా వ్రాసేఅల వాటుఆకాలంలో బాలసరస్వత్యాదులకు సైతం వున్నదికాబట్టే బాలసరస్వతి ఆ అలవాటు ప్రకారం "అహం+అని" అని వ్రాసుకొని అక్కడ సున్నాకు ద్విత్వం రావడం సంభవించదు కాబట్టి ఆసున్నాకు మకారంచేసి ఆ మకారానికి ద్విత్వంచేసు కోవాలని వుద్ఘాటించాడు.

— "అహమ్ అనునది మొదలైన శబ్దము లనుకరించు నపుడు వాని యంత్యమునకు ద్విత్వమువచ్చును. సున్నకు ద్విత్వము రానేరదుగాన మకారము చేసికొనునది" - అని వావిళ్ళవారు ముద్రించిన బాలసరస్వతీయంలో (170 పుట.) వున్నది. ఇందులో "అహమ్" అని మకారాంతంగా గ్రహింప బడింది. అదిపొరపాటు. "అహం అనునది మొదలైన......" అని అనుస్వారాంతంగా వుదాహరిస్తేనేగాని బాలసరస్వతి వ్రాసిన "సున్నకు ద్విత్వము రానేరదు గావున......" అనే వాక్యం సార్థకంకాదు. †

ఈ బాలసరస్వతి వ్రాసిన "సున్నకు ద్విత్వము రానేరదు గాన......" ఇత్యాది వాక్యాన్ని అహోబలుడు పరిశీలించి

—: బాలసరస్వత్యాత్యత్ర అహమాదిశబ్దానామంతగస్యానుస్వారస్య ద్విత్వాయోగాత్ తత్ స్థానే మకారం కృత్వా తస్య ద్విత్వమిత్యుక్తమ్. ద్వితీయాచేర్యాణాపి

---

† ఈ విధంగా బాలసరస్వతి "సున్నకు ద్విత్వము రానేరదు గావున..." అని వ్రాసిన వాక్యం విషయం శ్రీవర్ఝులవారు తమ సర్వస్వం 430 వ పుటలో యెత్తినారు కాని అది వ్యవహార వశంచేత వ్రాయబడిందన్న సంగతి కూడా వ్రాయ లేకపోయారు—

శబ్దానామంత్య భాగేషు
యోను స్వారః ప్రదృశ్యతే
తస్యాచి పరతో మస్స్యాత్
సర్వత్రకవి సమ్మతేః॥ ఇతి.
కేచిద్వదం త్యభేదత్వ
మనుస్వార మకారయోః॥ ఇతిచ ఉక్తమ్.

సర్వత్ర సంస్కృతాంధ్రయో రిత్యర్థః. అనుస్వార మకారయోః భిన్నత్వం చ మకారేపర ఏవ. కమ్మని లతాంతములకుం మొనసివచ్చు ముధుప మ్ముల నిత్యాది రాచార్యస్యాపి ప్రయోగః.

అత్రేయం చింతా - రామదాసోహ మిత్యాది సంస్కృత వాక్యా నాంహల్ పరత్వాభావే మాంతత్వం నిర్వివాద మితి న తేషా మనుకరణ ఏత దావశ్యకమ్ - కింతు ఝుం ఝుం ప్రముఖావ్యక్తానుకరణశబ్దానామను కరణ మేతద్వచనమ్ - రామేసుం ఇత్యాదీనాం బింద్వంతానాం ప్రాకృత శబ్దానా మనుకరణే ప్యస్య వినియోగ ఇతి బోధ్యమ్. వ్యాఖ్యాయాంత థైవోదాహృతంచతేన ఝుం ఝుమ్మని, కిమ్మని ఇత్యాది. నచతేషా మపి మాంతత్వమ్ - తథాత్వే బాధకాభావే పృథగ్వర్ణస్య నిరాకర్తు మశక్య త్వాత్”—

(అహో- 183 - 184 పుటలు.)

“సున్నకు ద్విత్వము రానేరదు గాన మకారముచేసి కొనునది.” అని బాలసరస్వతి వ్రాసిన వాక్యం అహమాదులు మకారాంతా లవడంచేత వాటికి వర్తించదనీ, అనుస్వారాంతా లైన “ఝుంఝుం” మొదలైన అనుకరణ శబ్దాలకూ “రామే సుం” మొదలైన ప్రాకృత, శబ్దాలకూ అది వర్తిస్తుందనీ అహో బలుడు చెప్పాడు. వ్యాఖ్యానంలో బాలసరస్వతి అనుకరణ శబ్దాలను ప్రాకృత శబ్దాలను ఉదాహరించినట్టుకూడా అహో బలుడు చెప్తున్నాడు - ఆ బాలస్వతి యిచ్చిన వుదాహరణాలు “ఝుంఝుమ్మని, కిమ్మని” అనేవని కూడా చెప్తున్నాడు -

"అహమ్, కిమ్" మొదలైన మకారాంత పదాలకన్నింటికీ చివరవున్న మకారానికి ప్రాకృత భాషలో అనుస్వారం నిత్యంగా వస్తుంది.

— "బిస్టుల్" — శబ్దానా మంత్యస్యమకారస్యబిందుర్భవతి - లిత్యాస్య వికల్పః - ఫలం, భవం, గిరిం, హరిం -

(త్రివిక్రమకృత ప్రాకృత శబ్దానుశాసనం.
1 అధ్యా - 1 పాదం. 40 సూ)

అటువంటి అనుస్వారాంత ప్రాకృత పదాలను తెలుగులో అనుకరించే టప్పుడు ఆ అనుస్వారాన్ని మకారంగా మార్చుకొని ద్విత్వం చేసుకొన వలసివుంటుంది. "ఝుం ఝుం" మొదలైన ధ్వన్యనుకరణశబ్దాల చివరవున్న అనుస్వారానికి మకారం చేసుకోవాలి. ఇటువంటి అను స్వారానికి మకారం రావాలనే "శబ్దానా మంత్యభాగేషు" ఇత్యాది కారిక సృష్టింపబడింది. ఇదంతా నిజమే. కాని బాలసరస్వతి అహోబలుడన్నట్లు "సున్నకు ద్విత్వము రానేరదు గావున మకారముచేసికొనునది" అనే వాక్యం అహమాదులకుకాక ఝుంఝుం మొదలైన ధ్వన్యను కరణ శబ్దాలకూ, బిందువు చివరకల ప్రాకృతి శబ్దాలకూ మాత్రం వర్తించేట్లుగా వ్రాసాడనిచెప్పడానికే మాత్రమూ ఆధారంలేదు. ప్రాకృత పదాలలోను ధ్వన్యను కరణ శబ్దాలలోను, చివర అనుస్వారం వుంటుందనీ, ఆ అనుస్వారానికి మకారం చేసుకోవాలనీ బాలసరస్వతి చెప్పలేదు. ఈ విధంగా స్పష్టంగా బాలసరస్వతి చెప్పినట్లు అహోబలుడు కూడా, చెప్పలేదు - "తద్వైవోదాహృతంచ తేస"అని మాత్రం

అహోబలుడు చెప్పాడు. కేవలం బాలసరస్వతి యిచ్చిన "ఝుం ఝుమ్మని, కిమ్మని"అనే వుదాహరణలను బట్టి "కిం" అనే ప్రాకృత శబ్దాన్ని గ్రహించి ఆప్రాకృత శబ్దంయొక్క అంతంలో వున్న అనుస్వారానికి మకారం చేసుకోవాలని బాలసరస్వతి అభిప్రాయమే అయితే అతడుస్పష్టంగా "అహమాదీనాం ద్విత్వమ్" అనే సూత్రానికిముందు సంస్కృత పదాలైన మకారాంత పదాలను వుదాహరించి ఆ మకారానికి ద్విత్వం వస్తుందని చెప్పి, దానికి తర్వాత అనుస్వారాంతాలైన ధ్వన్యనుకరణ శబ్దాల విషయాన్ని, ప్రాకృత శబ్దాల విషయాన్ని స్పష్టంగా చెప్పి వాటికి అంతంలో వున్న అనుస్వారానికి మకారం చేసుకొని ద్విత్వం చేసుకోవాలని చెప్పేవాడే - ఆ విధంగా బాలసరస్వతి చెప్పినట్లు ఈనాడు ముద్రితమైన బాలసరస్వతీయంవల్లగాని కనీసం అహోబలుని వ్రాతలవల్లగాని తెలియడంలేదు సరిగదా ! బాలసరస్వతి కేవలం "అహం అనునది మొదలైన శబ్దములను అనుకరించునపుడు వాని యంత్యమునకు ద్విత్వమువచ్చును. సున్నకుద్విత్వమురానేరదుగావునమకారము చేసికొనునది. ఉదా॥ అహమ్మని, కిమ్మని, ఝుమ్మని" - అని మాత్రమే వ్రాసి వూరుకున్నాడు. దీనివల్ల బాలసరస్వతి "అహమ్, కిమ్, ఝుమ్" అనే యీ మూడు మకారాంత సంస్కృత పదాలనూ వ్యవహారాన్నిబట్టి అనుస్వారాంతాలుగా గ్రహించి అక్కడ సున్నాకు ద్విత్వంరాదు కాబట్టి ఆ సున్నాకు మకారం చేసుకొని ద్విత్వం చేసుకోవాలనే అభిప్రాయాన్నే కలిగివున్నాడని చెప్పాలి. ఇంతకూ బాలసరస్వతి "అహమ్, కిమ్" అనే మకారాంత సంస్కృతపదాలను అను

స్వారాంతాలుగా "అహం, కిం" అని వ్రాసుకొన్నాడనడం సుస్పష్టం -

మనం నిత్యవ్యవహారంలో "అన్యమ్" అనే రూపాన్ని చివరి మకారానికి పూర్ణానుస్వారం చేసి "అన్యం" అని ఉచ్ఛరిస్తుంటాము. అదేవిధంగా "నాకు రక్షణ అన్యం లేదు నాకు ఆధారం అన్యం లేదు" అని "అన్యం" అనుస్వారాంతంగా వ్రాస్తాము. ఈవిధంగా "అన్యమ్" అనేదాన్ని "అన్యం" అనేదిగా వ్రాయడమనేది ఈనాటిదికాదు. శ్రీ కృష్ణదేవరాయల కాలంలోనే వున్నది. ఆనాడైనా వట్టి పామరులే కాకుండా పండితకవులుకూడా వ్రాస్తుండేవారు. కాబట్టే తెనాలి రామకృష్ణకవి

శా॥ భస్మోద్ధూళిత పాండురాంగము రమా
ప్రాణేశు పాదద్వయిన్
విస్మేరాంబుజగామి హంసమిదినా
నేత్రాల్చుచున్ లేచి "నే
వాస్మాకం శరణం త్వమేవ గతిర-
న్యం నాస్తి దుర్వాసనా
పస్మారంహర" యంచుం బల్కు మఱియున్
భక్తుండు భక్తిస్పృహన్ "

(పాండు - మా - 2 ఆ. 54 ప.)

అనే యీ పద్యంలో వ్యవహారంలోవున్న అలవాటు కొద్దీ "అన్యోనాస్తి" అనడానికి మారు "అన్యంనాస్తి" అని ప్రయోగించి యతిస్థానంలో బిగించాడు. సంస్కృత వ్యాకరణనియమాల ననుసరించి "అన్యోనాస్తి" అనే వుండాలిగాని "అన్యంనాస్తి" అని వుంచరాదని తలచి పరిష్కర్తలు శబ్ద

నిర్దుష్టత్వంకోసమై "అన్యోన్యాస్తి" అని సంస్కరించారు. కాని "దే! వాస్మాకం శరణం త్వమేవగతి రన్యోన్యాస్తిదుర్వాసనా పస్మారంహర" అనే పాఠంలో యతి తప్పుతుందన్న సంగతి వారు గమనించనేలేదు - † ఇక్కడ తెనాలి రామకృష్ణకవి వ్యవహారవశాన "అన్యంనాస్తి" అనే దాన్ని సంస్కృత వాక్య గతం చేసి ప్రయోగించాడనే విషయం సుస్పష్టం -

---

† - "దేవాస్మాకం ..... గతిరన్యోన్యాస్తి" అనేచోట అస్మా కంలోని "అ" కారానికీ "అన్యో" లోని "ఓ" కారానికి యతి చెల్లు తుందని ఒకడు భావించి దాన్ని బలపరచుకుంటూ ఈ క్రింది పద్యం తన భావానికి ఆధారమని పేర్కొన్నాడు-అది యతి తత్వానికి పూర్తిగా విరుద్ధమైన విషయం - కాబట్టి నిరాకరం -

తే॥ గీ॥ దైవభాషనదంత సాంతముల మీఁద
నస్తు మొదలను గల శబ్ద మతుకువేళ
నమరునోత్వంబునకుఁ జెల్లు నయహాలిపులు
జగతిలుప్త విసర్గక స్వరవశాలన ॥

(అప్ప. 3 ఆ. 17 ప.)

ఇందులో అప్పకవి "అయహా" లిపులు "ఓ" త్వానికి యతి చెల్లు తాయని పొరపాటుగా చెప్పాడు - "దాసోహం" ఇత్యాదుల్లో గూఢమైన (పూర్వరూపంపొందిన) "అ" కారానికి యతి చెల్లుతుంది. ఆ విధంగా గూఢమైన అకారానికి యతి చెల్లుతుందని గూఢ స్వరయతి చెప్పిన ప్రాచీ నాధునాతన ఛందోగ్రంథకర్త లందరూ చెప్పారు - కాని అప్పకవి ఒక్కడే ప్రమాదవశాన "అయహా" లకూ "ఒ" త్వానికి యతి చెల్లుతుంద న్నాడు - అసలు వాస్తవానికి "ఓ" కారానికి "అయహ" లకూ యతి మైత్రి యెక్కడాలేదు. యతుల్లో మన ప్రాచీన ఛందోగ్రంథకర్తలందరూ చెప్పింది ప్రాణసంబంధగా మూడు వర్గాలు మాత్రమున్నాయనే - 1 అ, ఆ, ఐ, ఔ, (య, హ.) 2. ఇ, ఈ, ఎ, ఏ, ఋ, ౠ, 3. ఉ, ఊ, ఒ, ఓ.

ఏలక్షణకర్త చెప్పినా అ, ఆ, ఐ, ఔ లకే మైత్రి చెప్పాడు - ఉ, ఊ, ఒ, ఓ లకే మైత్రి చెప్పాడు-కాని "ఓ" కారానికి "అ" కారానికి మైత్రి వున్నట్లు ఏలక్షణకర్తా సూచనగా నైనా చెప్పలేదు - చివరికి అప్పకవికూడా "అ" కార "ఓ" కారాలకు యతిమైత్రి అంగీకరించాడనడానికి అణుమాత్ర మైనా ఆస్కారంలేదు - స్వరాలకున్న మిత్రత్వాన్ని ప్రతిపాదిస్తూ "స్వర మైత్రి వగలు" అనే పేరుతో ఈ క్రింది లక్షణపద్యాన్ని రచించాడు —

తే॥ గీ॥ అద్వయమునకు వక్రతమద్వయంబు
నిద్వయమునకు ఋయుగంబునె ద్వయంబు
నుద్వయమునకు నంత్య వక్ర ద్వయంబుఁ
జెల్లు స్వరమైత్రి వగలన శేషశయన ॥ [అప్ప-3ఆ. 11 ప-]

ఇందులో స్పష్టంగా అప్పకవి అందరివలెనే స్వరమైత్రి విభాగాన్ని చేసాడు. "అ" కార "ఓ" కారాలకు మిత్రత్వం వున్నట్లు సూచనగానైనా చెప్పలేదు - అసలు స్వరమైత్రిలోనే అ త్వానికి ఓ త్వానికి మైత్రిచెప్పని అప్పకవి "అమరునోత్వంబునకుఁ జెల్లు నయహాళిపులు" అనేది బుద్ధి పూర్వకంగా చెప్పాడనడానికి ఆస్కారంలేదు. ఒకవేళ "అమరునోత్వంబునకుఁ జెల్లు నయహాళిపులు" అనిచెప్పిన అప్పకవి లక్షణ పద్యాన్ని బట్టి చూచినా అప్పకవిచెప్పిన లక్షణానికీ, "దేవాస్మాకం ...... గతిరన్యోనాస్తి" అనేదానికీ ఏ మాత్రమూ సంబంధంలేదు - అప్పకవి "అత్తు మొదలను గలశబ్ద మతును వేళ" నే అయహాలకూ ఓకారానికీ యతి చెల్లుతుందన్నాడు. "అన్యోనాస్తి" అన్నప్పుడు అత్తు పరమవుతుంటే ఓత్వంరాలేదు. నాస్తిలోని నకారవ్యంజనం పరమవుతుంటే ఓత్వంవచ్చింది. (అసలు దాని ప్రక్రియవిషయం ముందు చర్చింపబడుతుంది.) కాబట్టి యిక్కడ [దేవాస్మాకం . . . అన్యోనాస్తి అన్నప్పుడు] అకారానికి ఓకారానికి యతి చెల్లిందని అప్పకవి చెప్పిన లక్షణం పట్టించడానికి ప్రయత్నిద్దామన్నా అది నెరవేరదు - అసలు "అ" కారానికి "ఒ" కారానికి మైత్రిలేనేలేదు. కాబట్టిరామకృష్ణకవి "అన్యంనాస్తి" అని ప్రయోగించి "అస్మాకం" లోని "అ" కారానికి "అన్యం" లోని అకార విశిష్ట "య" కారానికి యతిని వుపయోగించాడనడం న్యాయం. "అన్యంనాస్తి" అనే రూపమంటే శాస్త్రీయమైంది కాదుగాని అక్కడ వుపయోగింపబడ్డ యతి శాస్త్రప్రసిద్ధమైనదే —

ఈ నాడు మనం అరసున్నకల పదాలుగా యెంచుతున్నవన్నీ పూర్వకాలంలో పూర్ణబిందువుకల పదాలే - "ప్రాంత, వీంగు, లోంగు, వీండు, వాండు, పోండి" మొదలైన పదాల్లో వున్న అరసున్న రూపాలు అప్పకవి కాలంలో సృష్టింపబడ్డాయి- ప్రాచీన కాలంలో అసలు మన కీ అరసున్న (ఁ) రూపం లేనే లేదు - అన్నిచోట్లా పూర్ణ బిందు వే వుండేది - దీర్ఘాలమీద పూర్ణబిందువనేది యీ నాడు ఏ కొంతమంది నోళ్ళల్లోనో వున్నట్లు "ప్రాంత చింతసందు - వాండు - వీండు" అన్నట్లుగా పూర్వకాలంలో ఈనాడరసున్న వున్న ప్రతిపదంలోనూ వుండేది - ప్రాచీన కాలంలో ఎక్కడైనా - అంటే - హ్రస్వాల మీదనే కాకుండా దీర్ఘాలమీదకూడా పూర్ణబిందువునే వుచ్చరించుతూ వుండేవారు. ఈ పూర్ణబిందువు చాలా పదాల్లో జనోచ్చారణలో క్రమంగా భ్రష్టమయ్యింది. అయినప్పటికీ అక్కడ అనునాసికోచ్చారణ స్వల్పంగానైనా వుంటున్నది. ఆ కారణంచేతనే దాని మొదటి రూపం పూర్ణబిందువనే గుర్తు వుండడానికి ఈ అరసున్న సృష్టింపబడింది - వీంగు, లోంగు, వీండు ఇత్యాదుల్లో నిండు సున్నా జనవ్యవహారంలో భ్రష్టమైనప్పటికీ అరసున్నకు ఆనాడు ప్రత్యేకంగా లిపి లేకపోవడంచేత దాన్ని పూర్ణబిందువుకల రూపంగానే వ్రాసుకొని తేల్చిపల్కుతుండేవారు - "వీంగు, వీంగు," అనే యీ రెండింటిలోనూ అరసున్నాగలపద (నిండు సున్నా వ్యవహారంలో భ్రష్టమైన పద) మేదో నిండు సున్నాగల పదమేదో తెలియడానికిగాను అరసున్నకల వాటిని "వీంగు" అనే పద్ధతిలోను, నిండుసున్నా కలవాటిని "వీంగ్గు" అనే పద్ధతిలోనూ వ్రాస్తూండేవారు -

క్రమంగా నిండుసున్నా మీద ద్విత్వం వ్రాసే పద్ధతికూడా అలవాటు తప్పి మారిపోయింది - కాబట్టి మనకు లభించిన తాళపత్ర ప్రతుల వ్రాతల్లో చాలాచోట్ల యీ ద్విత్వాలు కన్పడవు - వ్యవహారవశాన ప్రాచీన కాలంలో ఈ క్రింది ప్రయోగాల్లో కవులచేత దీర్ఘాలమీద పూర్ణబిందువులు వ్యవహరింప బడ్డాయి -

నన్నెచోడ కుమారసంభవంలో --

ఉ॥ వీంగు నపారసత్త్వగుణ విస్ఫురణం బరమేశ్వరోరువా
మాంగమునందు మున్న దయనై నియమస్థితిఁ గొల్చి తద్దయుం
లోంగిన పేర్మితో నఖిలలోకములుం దగఁ గాచుచున్న వే
దాంగు ననంతు విష్ణుఁ గమలాధిపు సంస్తుతిఁ దేల్చి సమ్మతిన్ ॥

(1 ఆ - 4 ప.)

ఉ॥ వీండె ఖలుండు దక్షుఁడను వీఁడిడి పాఁటుఁడు వీఁడు సర్వ వ
స్యం గడసేయకుండ శివదూషకు నాలుకగోసి యుప్పు నిం
పుం డాద్రపు ద్రవమ్ముఁ దెలఁ బూయుఁడు లోహముగాఁచి నోరఁబో
యుండు దురాత్ము చర్మపటమొల్వుఁడు కన్నులు మీఁటుఁడుక్కఁడన్.

(2 ఆ - 82 ప)

ఉ॥ చందన కర్దమంబు ఘనసారరజః ప్రసరంబు శీతలుల్
గందలిరుల్ ప్రసూనములు గసరము లుక్కము దోత్పలాబ్జత
త్కంద మృణాళిపత్ర ఘనధాతు తుషార ఘనోపలాంబువుల్
నాందగు శీతలోపకరణంబుల నేర్చితలిర్చి సిద్ధికిన్ ॥

(5 ఆ - 141 ప.)

క॥ పోండిగ నగజ తపశ్శిఖి
మూండు జగంబులను దీవ్రముగఁ బర్విన బ్ర
హ్మాండము గాఁచిన కాంచన
ఖాండము క్రియదాల్చెఁ దత్ప్రభాభాసితమై ॥ (6 ఆ. 157 ప.)

క॥ పోఁక వళినీరజస్వల
సోఁకిన దోషంబువాయ సూర్యుఁడు గలితా
శంకనపరాంబు నిధిలోఁ
గ్రుంకెనొకో యనఁగఁ బ్రొద్దుగ్రుంకుడు నంతన్ ॥ (8 ఆ. 89 ప.)

క॥ వీండేమిసేయుఁ బంచిన
వాండుండఁగ నిక్కమునకు వధ్యుఁడుగానా
ఖండలుఁడుగాక యేలిన
వాండుండఁగ నేమిసేయఁ బరికరమనిలోన్॥ (10 ఆ. 155 ప.)

క॥ ఆంకగొన నుభయబలములుఁ
బొంకంబటి తలగిపెలర భువిగ్రక్కదలన్
వీంక మదకరులు రెండుం
దాంకె వడిం గొండగొండ దాఁకిన భంగిన్ ॥ (12 ఆ. 69 ప.)

తే॥ గీ॥ కూంతుసరియె పోల్పఁగా గాంతలెందు............
[రాజరాజ నరేంద్రుని కూతురు సోమలదేవి దాక్షారామ శిలాశాసనము
శా॥ శ॥ 987]

ద్విప - హాంం తంతయనగాలి యెడిళులు దూల
నూంతలుగా నిడ్డ యూఁతకోలలను—
[పండితా - పర్వ - ప్ర.]

పాండు రాంగం బైన పడఁతి గర్భమునఁ
బోండి గా (పోఁడిగా) వెలుఁగుచుఁ బుత్రుఁడీ క్రియను
బస - పురా - 18 - పుట)

ప్రగీతి॥ (మూఁడు) మూండు సేసినగణములు రెండు నలములు
(మూఁడు) మూండిన గణములును మొగి నహంబు
(పోఁడి) పోండిగాఁగ నర్థమునకగు మీఁద ని
ట్లుండఁ జెప్పవలయు నొగిఁబ్రగీతి॥
(కవి - జ - 51 పుట - వావిళ్ళ ముద్రణ - 69
పుట - 21 - ప - ఆంధ్రసాహిత్య పరిషన్ముద్రణం.)

ఆ॥ వె॥ పాండె మరగి బ్రతుకు వాండ్రిల వ్రేతలు
వాండ్ర వెన్నలేల తండ్రియనఁడె
పండుకొనకు వింతయింట్లకుఁ బోకు కృ
ష్ణుండ నినుఁ బ్రాతెపండ్లు నిచట॥

(అనం - ఛం - 1ఆ - 53 ప -)

ఆ॥ వె॥ పింఛ చైచెనఁగ వాండ్రను నవిల సం
భవుఁ డనంగ శుభప్రాసమగును

(లక్షణ - సా - సం - 1ఆ - 65 ప -)

తే॥ గీ॥ (పాఁడి) పాండిద్రచ్చఁగ నిమ్మనాతండ్రి కృష్ణ
(వేఁడు) వెండుకొనియుఁ నందాఁడుఁ బండ్లినుము
ఉండఁడగవుఁ జేట్లులు నోటిగాండ్రతనము
మెండుగాఁ జెప్పెనురు వైదేండ్ల కనఁగ॥ †

(అప్ప - 3 ఆ - 31౯ - ప.)

పై పద్యాలలో కొన్ని పదాలు పూర్ణ బిందువు కలవిగా ప్రయోగింపబడ్డాయి. ఈ నాటి ముద్రిత ప్రతుల్లో చాలాచోట్ల ఆ పూర్ణ బిందువుకు మారుగా అరసున్నలే కన్పడతాయి. ఇటువంటి ప్రాసలను అంగీకరించి లక్షణం చెప్పిన ఛందో గ్రంథకర్త యొక్కడైనా లేడు. అంతవిపులమైన ఛందోభాగం రచించిన అప్పకవికూడా అనంతాదుల ప్రయోగాలు చూచికూడా తానా ప్రాసను ప్రయోగించి కూడా లక్షణం చెప్పడం మరచిపోయాడు - మరచిపోక పోయినా సర్వత్రా యీ ప్రాసను అంగీకరించడానికి వీలు లేదు కాబట్టి- అంటే - ఇటువంటి ప్రాస

† పాఁడి - తండ్రి అనే ప్రాసను అప్పకవి వొక్కఁడే ప్రయోగించాడనీ యిటువంటి ప్రాసలు మరెక్కఁడా లేవనీ "అప్పకవీయ వివరణం" లో (306 పుట.) మాగురువులు వ్రాయడం పొరపాటు.

యితర ప్రాసలవలే యథేచ్ఛగా ప్రయోగించడానికి వీలైనది కాదు కాబట్టి చెప్పకుండా బుద్ధిపూర్వకంగా విడిచి పుచ్చాడనాలి.

ఇటువంటి ప్రాసలు అనేకాలు కేతన దృష్టిలో వుండడం చేతనే తన ఆంధ్రభాషాభూషణంలో హ్రస్వాలమీదపూర్ణబిందువులు ఖండబిందువు లవుతాయనీ, దీర్ఘాలమీద కానేరవనీ చెప్తూ పద్యాలలో కొన్నిచోట్ల దీర్ఘాలమీద కూడా పూర్ణబిందువులు వుండవచ్చునని చెప్పాడు – అయితే యిక్కడ కేతన వ్యాకరణ సంబంధంగా "నిండుసున్నా అరసున్నాగా మారుతుంది, మారదు" అనే విషయాన్ని చెప్పినప్పటికీ పద్యాల్లో దీర్ఘాలమీద కూడా పూర్ణబిందువు వుండవచ్చని చెప్పడంతో "(వీఁగు) వీంగునపార......(వా) మాంగము.... (లోఁగిన) లోంగిన...(వే) దాంగు" వంటి పూర్వోదాహృతపద్యాల్లో ప్రయోగింపబడ్డ ప్రాసలు చెల్లుతాయనే విషయం చెప్పకుండానే చెప్పాడు – ఈ ప్రాసకు ఒక పేరుపెట్టి యిటువంటి ప్రాసలు చెల్లుతాయని చెప్పక పోయినప్పటికీ "పద్యాల్లో దీర్ఘాలమీద నిండుసున్నా లుండవచ్చు" అనే విషయాన్ని చెప్పడం చేత యిటువంటి ప్రాసలను అంగీకరించిన వాడయ్యాడు – కేతన రచించిన ఆపద్యంయిది.

క॥ కుఱుచలపై నరబిందులు
నెఱయఁగ నూఁదినను జెల్లు; నిడుపుల మీఁదన్
నెఱయవు గద్యంబులలో
నెఱబిందువు లూఁదుఁ బద్య నికరములోనన్॥

[ఆం – భా – భూ – 58 ప.]

ఇటువంటి ప్రాసలకు లక్షణాన్ని ఏ ఛందో గ్రంథకర్త కూడా చెప్పలేదు † కాని ఈ ప్రాసను సామాన్యంగా ప్రతి లాక్షణికుడూ ప్రయోగించాడు -

---

† "వీఁగు - (వా) మాఁగము - లోఁగిన - (వే) దాఁగు" వంటి యీ ప్రాసను అప్పకవి చెప్పాడని అనంతుని ఛందం ఉపోద్ఘాత కర్తలు — "అనంతుడు చెప్పిన పండ్రెండు విధములే కాక అతడు చెప్పక విడిచిన మఱి యేడు విశేషములు అప్పకవి చెప్పినాడు - అవి ఏవంటే - 1 వేఁడు, పండ్లకు........." - (21 పుట.)

అని వ్రాసారు - "వేఁడు - పండ్లు" అనేవాటికి ప్రాస చెల్లుతుందని అప్పకవి యెక్కడా చెప్పలేదు - ఈ విధంగా పూర్ణార్ధబిందు ప్రాసలు చెల్లుతాయని అప్పకవే కాదు ఏ ఛందో గ్రంథకర్తకూడా చెప్పలేదు. అనంతం - ఉపోద్ఘాత కర్త పేర్కొన్న "వేఁడు - పండ్లకు" అనే దానికి అప్పకవి చెప్పిన లక్షణ లక్ష్యపద్యాలివి.

గీ॥ రలలు తమక్రింద జడ్డలై క్రాలువ్రాలు
ప్రాసవర్ణంబులైవానిఁ బాసియైనఁ
గూడియైనను బెఱయుచుఁగులను నిలుచు
సంయుతా సంయుత ప్రాససంజ్ఞఁదనరి॥

గీ॥ పాఁడిద్రప్పఁగ నిమ్మనాతండ్రి కృష్ణ!
వేఁడుకొనియెద నందాఁకఁ బండ్లు దినుము
దుండగపుఁ జేష్టలును నోటిగాండ్రతనము
మెండుగాఁ జొచ్చె నీకు నైదేండ్లకనఁగ॥

(అప్ప - 3ఆ - 314 - 315 ప.)

వీటిల్లో అప్పకవి చెప్పింది "రకారంతోను, లకారంతోను, కూడిన డకారం; రకారంతోను, లకారంతోను కూడని డకారంతో ప్రాసచెల్లుతుం" దని మాత్రమే - ఈ లక్షణంలో దీర్ఘాలమీద (పాండి మొదలైనవాటిల్లో) పూర్ణాల విషయం ఏమీలేదు - ఇక్కడ పూర్ణార్ధబిందువులకు ప్రాసచెప్పే విషయంకూడా ఏమీలేదు - కవిజనాశ్రయ కర్త ప్రభృతులు ప్రయోగించిన

విధంగానే అప్పకవి కూడా ప్రయోగించాడు - కాని లక్షణం ఏమీ విశేషంగా చెప్పలేదు - అప్పకవి పద్యంలో అనుస్వార ప్రసక్తితేనేలేదు - ఈ ప్రాసను అప్పకవి చెప్పాడని అనంతఛ్ఛందం ఉపోద్ఘాత కర్త వ్రాసినట్లే ద్వితీయ ముద్రణ పీఠికాకర్త కూడా - "అనంతుడు దానిని స్పృశించుటయే దాని విశిష్టత"† అని వ్రాసి ఖ్యాప్రాసకు అనంతుడు లక్షణం చెప్పాడనే ధోరణిలో కొంత వ్రాసారు - అది పొరపాటు-‡ ఇట్టి ప్రాసను అనంతు డొక్కడే స్పృశించలేదు. అనంతునికి పూర్వంలో కవిజనాశ్రయ కర్త పరంలో యితర లక్షణ గ్రంథకర్తలు చాలామంది స్పృశించారు-దీనికి పూర్వం (పుటలు. 208, 209.) యిచ్చిన ప్రయోగాలే సాక్ష్యాలు - అనంతుడు కూడా అందరిలాగానే ఈప్రాసను ప్రయోగించాడు గాని దీనికి లక్షణంఏమీ చెప్పలేదు - దీనిని గురించి శ్రీవఝ్ఝలవారు

- "భారత కవులె కాక నాచన సోమ శ్రీనాథాదులును నిట్టి దీర్ఘ పూర్వకపూర్ణములను బ్రయోగింపలేదు" ...

(ఆం - వ్యా - సం - సర్వ. 113 పుట.)

అని వ్రాసారు - సుప్రసిద్ధులైన అనేకమంది లక్షణ గ్రంథకర్తలే యిటువంటి ప్రాసలు ప్రయోగించగా నాచన సోమనాదులు ప్రయోగించాల్సిన ఆవశ్యకత ఏముంది? ఆసందర్భంలోనే శ్రీవఝ్ఝలవారు - "ఇట్టి ప్రాసబద్ధ ప్రయోగములు భారతమునఁ గన్పట్టలేదు - దీర్ఘాచ్చేన్నిందవ ఏవ అని భట్టారకుఁడు కంఠోక్తముగ నిషేధించుచున్నాఁడు" — అనికూడా వ్రాసారు. లక్షణం చెప్పడానికీ ఆలక్షణాన్ని ఆచరణలో వినియోగించడానికీ తేడావున్నది - దీర్ఘాలమీద నిందుసున్నా వుండదని అప్పకవికిబాగా తెల్సును - తెల్సికూడా

† అనం ఛం - ద్వితీయ ముద్రణ పీఠిక - 56 పుట - 5-6 పంక్తులు.

‡ - నావ్యాసం- అప్పకవీయవివరణవిమర్శనాలేశము - "త్రిలింగ" 5 - 5 - 1952. చూ.

గీ॥ నిడుదలగు నక్కరములపై నిలిచినట్టి
యర్ధ బిందువు లన్నియు నరసిచూడ
ధరణి సిద్ధంబులైన సాధ్యంబులైన
ఖండములెగాని పూర్ణముల్ గావు సుమ్ము॥

(అప్ప - 2 ఆ - 29 ప.)

అని ఖండితంగా దీర్ఘాలమీద ఖండ బిందువేగాని పూర్ణబిందువులేదని చెప్పిన అప్పకవి "పాండిద్రచ్చఁగ నిమ్మునాతండ్రి కృష్ణ" ఇత్యాది (3 ఆ - 315 పద్యం) పద్యంలో దీర్ఘంమీద పూర్ణబిందువును ప్రయోగించలేదా ? లేదని చెప్పినంత మాత్రంచేత లేకుండా పోతుందా ?

"పాఁడి (పాండి) ద్రచ్చఁగనిమ్ము నాతండ్రి కృష్ణ" ఇత్యాదుల్లో వుపయోగింప బడ్డ ప్రాసలకు ఏంపేరు పెట్టాలనేది వివాదాస్పదమైనది. ఇటువంటి ప్రాసకు ఛందో గ్రంథకర్త లెవ్వరూ లక్షణం చెప్పలేదు. కాబట్టి దీనికి పేరు పెట్టడంకూడా సంభవించ లేదు. అందువల్ల యిప్పుడు దీనికొక పేరు పెట్ట వలసివున్నది.

"పాండిద్రచ్చఁగ నిమ్ము నా తండ్రి కృష్ణ" అను రీతిగా ప్రాచీన కాలంలో ప్రయోగింప బడ్డవాటిలో "పాండి" మొదలైన పదాలను "పాఁడి" ఇత్యాదులుగా అరసున్నాలు కలవిగానే నేడు మనం వ్రాసుకుంటున్నట్లుగా పైప్రయోగాల్లోముద్రిస్తున్నారు. కాబట్టి ముద్రిత గ్రంథాలలో "పాఁడిద్రచ్చఁగ నిమ్మునా తండ్రి కృష్ణ" అను రీతిగా కొన్ని ప్రయోగాలు కన్పడుతున్నాయి. కుమార సంభవంలో మాత్రం "లోంగిన" వంటి పూర్ణబిందురూపాలే ముద్రించారు. ఆయా ప్రాసల్లో మన ప్రాచీన కవులు వాస్తవానికి దీర్ఘాలమీద పూర్ణ బిందువును వుపయోగించి "పాండి - తండ్రి" ఇత్యాదుల్లో పూర్ణ బిందువును సమప్రాసగా సరిపెట్టుకున్నారు. "పాండి" అనిఆ యా పదాలు పూర్ణబిందువులు కలవిగానే పూర్వకవులు భావించారు. కాబట్టే ప్రాసల లక్షణాలు చెప్పేటప్పుడు బిందువు విషయం ఎత్తలేదు - "పాఁడి" అని అరసున్న గ్రహించి "పాఁడిద్రచ్చఁగ నిమ్ము నా తండ్రికృష్ణ" అని అర్ధబిందు పూర్ణబిందు

వులకు ప్రాసచెల్లిందని భావించినప్పుడు గదా పూర్ణార్ధ బిందువులకు ప్రాస చెల్లుతుందని లక్షణం చెప్పుకోవాలనే యోచన రావడం ? అక్కడ అర్ధ బిందువుకీ పూర్ణబిందువుకీ ప్రాసచెల్లదనీ "పాండి" ఇత్యాదులలో పూర్ణబిందు వేవున్నదనీ అక్కడ పూర్ణబిందువులకే ప్రాస చెల్లిందనీ భావించినప్పుడు పూర్ణార్ధ బిందువులకు ప్రాస చెప్పుకోవాలనే ఆలోచనకే ఆస్కారంలేదు గదా! - అయితే "పాండి" ఇత్యాదుల్లో ప్రాచీనుల † అభిప్రాయం ప్రకారం పూర్ణబిందువునే అంగీకరిస్తే బిందు విషయంలో సమప్రాసమే అవుతుంది కాబట్టి దానికి ప్రత్యేకంగా పేరుపెట్టుకోవలసిన పనిలేదు - అయితే మనం "పాండిద్రచ్చగ నిమ్ము నా తండ్రి కృష్ణా" అని అరసున్న నిండుసున్నాలకు ప్రాసచెల్లినట్టు వ్రాస్తున్నాం కాబట్టి ఆ వ్రాతను దృష్టిలో పెట్టుకున్నట్లయితే పూర్ణార్ధ బిందువులుకి ప్రాసచెల్లుతుందని లక్షణమూ చెప్పుకోవాలి ఆ ప్రాస కొక్క పేరూ పెట్టుకోవాలి - "లోఁగిన - (వా) మాంగము" వంటి (ఈనాడు మన సంస్కరణ ప్రకారం సిద్ధించిన) ప్రాసను చూచే శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఆ ప్రాసకు "పూర్ణార్ధ బిందు ప్రాసము" అని పేరు పెట్టి వ్యవహరించారు - ఈ పేరును గురించి కవిజనాశ్రయ పీఠికాకర్త

- "పూర్ణార్ధబిందు ప్రాస స్పష్టముగాలేక సందేహముల కెడమిచ్చును. ఏలయనఁగా, పూర్ణమునకు అర్ధబిందువునకు వేఱ్వేఱుగా పూర్ణబిందు ప్రాసమని అర్ధబిందు (సమ) ప్రాసమని ప్రత్యేక లక్షణములు గలవు - ప్రస్తుతము పూర్ణార్ధబిందు ప్రాసమనగా పూర్ణార్ధబిందు ప్రాసలు సాంకర్యము చెందిన వన్న విపరీతార్థము వచ్చును - కొంత సందేహమునకుఁగూడ తావుగలదు. నవీన వ్యాకరణపద నిర్వచనముల ననుసరించి దీనిని సిద్ధసాధ్య బిందు ప్రాస మనిన శాస్త్రీయముగ నుండునని గోచరించినది. విద్వాంసులు దీనిని చర్చింతురుగాత" - [వావిళ్ళవారిది - 1950 ముద్రణం -]

---

† "పాండి" ఇత్యాదుల్లో పూర్ణబిందువు నంగీకరించక పోతే కవిజనాశ్రయ కర్తాదులు వాటిని వుపయోగింపరు - ఒకవేళ అర్ధబిందువులుగా భావించి వుపయోగించి వుంటే దానికి (పూర్ణార్ధబిందు ప్రాసకు) లక్షణం చెప్పనే చెప్పేవారు.

అని వ్రాసారు. పై పీఠికాకర్త పెట్టిన "సిద్ధసాధ్య బిందు ప్రాస" మనే పేరు సరైందికాదు. సిద్ధబిందు వంటే శబ్దాలలో సహజంగావున్న బిందువు - సాధ్య బిందువంటే వ్యాకరణంచేత సాధింపగావచ్చిన బిందువు. సిద్ధ సాధ్య బిందు ప్రాస మనేట్లయితే "అంబు......(మొగి) డెంబద్మము" అనేటప్పుడు కూడా వుపయోగింప బడ్డ ప్రాస ఆ సిద్ధసాధ్య బిందు ప్రాసమే అవుతుంది. ఏమంటే! "అంబువులు" అన్నప్పుడున్నది సిద్ధపూర్ణ బిందువే గదా! "మొగిడేన్ + పద్మము=మొగిడెంబద్మము" అన్నప్పుడు ద్రుత నకారాని కాదేశంగావచ్చిన పూర్ణబిందువు సాధ్యమేగదా? అయితే యిదికూడా సిద్ధసాధ్య బిందుప్రాసమేకాదా! అదిసరే! కవిజనాశ్రయపీఠికాకర్త చెప్పిన మాటనే అనుసరిస్తే పూర్వం (207,208పుటల్లో) వుదాహరించిదనన్నెచోడుని ఏడు ప్రయోగాలకూ ఈ క్రింది విధాలుగా వివిధాలైన పేర్లు పెట్టుకోవలసి వస్తుంది.

* (౧) 1 ఆశ్వా - 4ప - సిద్ధార్ధ సిద్ధపూర్ణబిందు ప్రాసం -
§ (౨) 2 ఆశ్వా - 82ప-సాధ్యార్ధ సాధ్య పూర్ణ బిందుప్రాసం -
♦ (3) 5 ఆశ్వా - 141ప - సిద్ధపూర్ణ సాధ్యపూర్ణ సాధ్యార్ధ బిందు ప్రాసం -
* (౪) 6 ఆశ్వా - 157ప - సిద్ధార్ధ సిద్ధ పూర్ణ బిందుప్రాసం -
* (౫) 8 ఆశ్వా - 89ప - సిద్ధార్ధ సిద్ధపూర్ణ బిందుప్రాసం -
≀ (౬) 10 ఆశ్వా - 155ప - సాధ్యార్ధ సిద్ధపూర్ణ బిందుప్రాసం -
* (౭) 12 ఆశ్వా - 69ప - సిద్ధార్ధ సిద్ధపూర్ణ బిందుప్రాసం -

వీటిల్లో మొత్తం సున్నా విషయంలోనే నాలుగు రకాల ప్రాసలున్నాయని చెప్పుకుని నాలుగురకాల పేర్లుపెట్టుకోక తప్పదు - * ఈ గుర్తు కలవన్నీ ఒకరకం ప్రాస. § ఈ గుర్తుకలది మరొకరకంప్రాస. ♦ ఈగుర్తుకలది మరింకొక రకంప్రాస. - ≀ ఈగుర్తు కలది వేరొకరకంప్రాస. ఇన్నివిధాలుగా చెప్పుకోవాల్సిన అవస్థ యెందుకు? శ్రీ ప్రభాకర శాస్త్రిగారు చెప్పినట్లు "పూర్ణార్ధ బిందుప్రాస" మనేపేరుపెట్టడమే సర్వవిధాలా సమంజసం - పూర్ణార్ధబిందుప్రాసమంటే పూర్ణబిందువుకీ అర్ధబిందువుకీ వేసేప్రాసమనిఅర్ధం. దీన్ని ఖండాఖండప్రాసగా వ్యవహరించ వచ్చు. ఖండమంటే అర్ధబిందువు -

జనోచ్చారణలో సౌలభ్యాపేక్షతో దీర్ఘాలమీద నిండుసున్నా నన్నయ్యకు పూర్వకాలంలోనే విడిచిపెట్టబడింది. ఆవిధంగా విడిచిపెట్టబడ్డ వాటిని నన్నయ్యాదులు జాగ్రత్తగా దృష్టిలో పెట్టుకొని ప్రాసల్లో వినియోగించారు. ఆ విధంగా దృష్టిలో పెట్టుకోని నన్నెచోడాదులు, లక్షణ గ్రంథకర్తలు, ఉచ్చారణలో భ్రష్టమై అర్ధబిందురూపం తాల్చాయన్న సంగతి (తెలియకకాదు) గమనింపక కొన్నిచోట్ల పూర్ణబిందువునుపయోగించారు. లక్షణ గ్రంథకర్తల్లో మొదట కవిజనాశ్రయకర్త వ్యవహారవశాన ప్రయోగించివుంటే తక్కిన అనంతాదులందరూ ఆతని ప్రయోగాన్ని చూచి ప్రయోగించారు. అలా కాకపోతే అనంతాదులంతా కేవలం ఒక్క సంయుతాసంయుత ప్రాస సందర్భంలోనే దీర్ఘాలమీద పూర్ణబిందువును వ్యవహరించడం జరుగదు - నిండుసున్నా దీర్ఘాలమీద వుచ్చారణలో భ్రష్టమైనప్పటికీ అక్కడసున్నా వున్నదన్న గుర్తుకు అరసున్నా వ్యవహరించేవారు. అరసున్నా అంటే అది ఈనాడు మనం వ్యవహరించే అరసున్నా వంటిది కాదు. పూర్వకాలంలో అరసున్నా అన్నా నిండుసున్నా అన్నా రెండింటికీ "ం" అనేది ఒక్కటే రూపం - దీర్ఘంమీద నిండుసున్నా

అఖండమంటే పూర్ణబిందువు - ఈ రెండింటికీ వేస్తేప్రాస ఖండాఖండప్రాస. లేదా పూర్ణార్ధ బిందుప్రాస - సార్ధబిందు నిర్బిందుక ప్రాసను ఖండా ఖండ ప్రాసమనే పేరుతో అప్పకవి వ్యవహరించడం పొరపాటు అఖండమంటే పూర్ణబిందువనీ, ఖండమంటే అర్ధబిందువనీ, తన అప్పకవీయం 2ఆశ్వాసం 22 పద్యంలో సంజ్ఞలువిధించిన అప్పకవి ఖండా ఖండ శబ్దాలను సార్ధబిందు నిర్బిందుకాలకు వ్యవహరించి సార్ధబిందు నిర్బిందుక ప్రాసానికి ఖండాఖండ ప్రాస అని పేరుపెట్టడం ఏమాత్రమూ హర్షింప తగిందికాదు.

వుచ్ఛరించడంలో కొద్దిగా యెక్కువకష్టంవుంటుంది. కాబట్టే అది పూర్ణంగా ప్రభ్రిష్టమై "దీర్ఘాలమీద నిండుసున్నా వుండదు" అనే నియమాన్ని సృష్టించుకొనేంతగా ఆస్కారమిచ్చింది. హ్రస్వాలమీద వుండే సున్నాను వుచ్ఛరించడంలో కొద్దిగా (దీర్ఘంమీదిదానికంటే) తక్కువ కష్టంవుంటుంది. కాబట్టే హ్రస్వాలమీద రెండుబిందువులూ వుండడానికి ఆస్కారం లభించింది. ఈ విధంగా సున్నా వుచ్చారణలో తేలిపోయినవాటికీ తేలనివాటికీ తేడా వుండాలి కాబట్టి సున్నాను తేల్చి పలికినప్పుడు "రాముండు" వలే మీదిహల్లుకి ద్విత్వం లేకుండాను, ఊది పలికినప్పుడు "రాముండ్డు" వలే మీదిహల్లుకి ద్విత్వం వుంచీ వ్రాసుకొని పూర్ణార్ధబిందు జ్ఞానాన్ని కలిగించుకొనేవారు. ఈబిందు వివేకాన్ని తనకాలంలో వున్నది వున్నట్లుగా అనంతుడు ఈ క్రింది పద్యాల్లో చాలా వరకు స్పష్టపరచాడు -

ఆ॥ వె॥ అర్ధబిండ్డు సహితమగు వర్ణమునకుం బ్రా
సాది యరయ నిడుద యక్కరంబు
నెందు మనకుం గల్గినాండు లక్ష్మి నాథుం
డెంటి కింక నెందు మాంటలనంగ॥

ఆ॥ వె॥ కఱచమీంద సున్న మఱి తేల వ్రాయం బ్రా
సద్వయాది నిట్లు జరుగు నచ్యు
తుండు సమస్త వల్లభుండు నాంగ నయ్యచ్యు
తుండ్డు సకలవల్లభుం డ్డనంగ ॥

[అనం - ఛం - 1 ఆ - 32, 33ప.]

ఈ రెండు పద్యాలనూ ఈ పై విధంగానే వ్రాసుకొని చదువు కొనడం మాత్రం యీ క్రింది విధంగా చదువు కొనేవారు.

ఆ॥ వె॥ అర్ధబిందు సహితమగు వర్ణమునకుఁ బ్రా
సాది యరయ నిడుదయక్కరంబు
నేఁడు మనకుఁ గల్గినాఁడు లక్ష్మీనాథుఁ
డేఁటికింక నేఁడు మాఁటలనఁగ

ఆ॥ వె॥ కుఱుచ మీఁద సున్న మఱి తేల వ్రాయఁ బ్రా
సద్వయాది నిట్లు జరుగునచ్యు
తుఁడు సమస్త వల్లభుఁడు నాఁగ నయ్యచ్యు
తుండు సకలవల్లభుండనంగ॥

రాను రాను క్రమంగా అనంతుని కాలంలో వున్నట్టుగా ఆతడు చెప్పిన లేఖనా పద్ధతి మారిపోయింది - నిండు సున్నా మీాద (నిండు సున్నాగా పరిగణించాల్సి వచ్చినప్పుడుకూడా) ద్విత్వం వ్రాయడం మానివేసారు - కాని గణాల స్థితినిబట్టి ఊది పల్కడమో తేల్చి పల్కడమో (గణభంగం కల్గకుండా) చేసేవారు -

ఈ విధంగా అర్ధబిందు పూర్ణబిందు వివేకాన్ని కేవలం వూహాలోను అనుభవంలోను మాత్రమే వుంచుకొని వ్రాతలో మీాది హల్లుకి ద్విత్వాన్ని వ్రాయడం ఎప్పుడైతే మానివేసారో అప్పటినుంచీ కొన్ని యిబ్బందులు వచ్చాయి. లోంగు, పాండి వంటి పదాలను ఏ విధంగా మీాది హల్లుకి ద్విత్వం లేకుండా వ్రాసేవారో "నారింజ, గావంచ, వెల్లంకి" వంటిసహజపూర్ణాలు గల పదాలను కూడా ఆ విధంగానే మీాది హల్లుకి ద్విత్వం లేకుండా వ్రాయడం ప్రారంభించే సరికి అర్ధబిందు వివేకంలో

తేడాలు సంభవించాయి. ఏ మంటే సాంప్రదాయం ప్రకారం "రాముండు" అని మీాది హల్లుకి ద్విత్వం లేకుండా (రాముండ్డు వలె కాకుండా) వ్రాయబడిన పదాన్ని అర్ధబిందు సహితంగా (రాముఁడుగా) భావించినట్లే "నెల్లంకి" వంటి సహజ పూర్ణాలు గల పదాలను గూడా అర్ధబిందు సహితాలుగా కొందరు పండిత కవులు భ్రమపడి భావించేవారు. నెల్లంకి అనవలసినదాన్ని "నెల్లఁకి"గా భవించే వారన్నమాట. ఇక్కడ వాస్తవానికి "నెల్లంకి" అనే పదం "నారింజ" వంటిది. "నారిఁజ" అనే అర్ధ బిందు పదం ఎలావుండదో అలాగే "నెల్లఁకి" అనే అర్ధ బిందు పదం కూడా వుండదు. మీాది హల్లుకి ద్విత్వం వ్రాయడం మాని నెయ్యడంతో అర్ధబిందు పూర్ణబిందు వివేకం సడలి "నెల్లంకి" వంటి పదాలకు "నెల్లఁకి" వంటి పదాలున్నాయని భావించారు. వాస్తవానికి తాతంభట్టు ఇంటిపేరు నెల్లంకివారు- ఆ నెల్లంకికి "నెల్లఁకి" అనే రూపాంతరం లేదు - కాని చిత్రకవి పెద్దన తన లక్షణ సార సంగ్రహ గ్రంథాదిలో పూర్వ కవి స్తుతిచేస్తూ

> ఉ॥ త్ర్యక్షవరప్రసాద కవి తార్క్ష్యుని వేములవాడ భీము, న
> య్యక్షత భక్తివిస్ఫుర దనంతు ననంతుఁ, గవిత్వలక్షణా
> ధ్యక్షులఁగాచి రాజు బసవార్యుని, భైరవు, నూత్నదండి, వా
> గ్దక్షుణ కర్ణనేతయగు నెల్లఁకి తాతబుధేంద్రు నెన్నుచున్॥
>
> (ల- సా.సం - 1ఆ - 3ప.)

అని తగణ పదమైన "నెల్లంకి"ని భగణపదంగా "నెల్లఁకి"గాచేసి ప్రయోగించాడు - నెల్లంక్కిలాగా వ్రాసే అల వాటుతప్పి నెల్లంకి గా తాను వ్రాసుకోనబట్టే అక్కడ అరసున్నా

వున్నదని భ్రమపడడానికి "వెల్లఁకి" అని పెద్దన ప్రయోగించ డానికీ అవకాశం లభించింది.

జన వ్యవహారంలో వుచ్చారణ సులభా పేక్షతో తేలిపోయిన పూర్ణబిందువును "అరసున్నా" అనాలనే జ్ఞానం క్రీ॥ శ॥ 13వ శతాబ్దంలోనే మన కవులకు కలిగింది - కాబట్టే కేతన ఈ క్రింది పద్యంలో "అరబిందు" శబ్దాన్ని ప్రయోగించాడు.

క॥ నసుఁగను నన్నుంగనుఁడా
ఘనుఁడు ఘనుండనఁగఁ జెల్లుఁగ వ్యనుమతిచేఁ
దనుబోఁటి లోభివాఁడితఁ
డననిడుపులమీఁది బిందు లరబిందులగున్"

(ఆం - భా - భూ - 57ప.)

ఈ సందర్భంలో కేతన ఉచ్చారణలో తేలిన పూర్ణ బిందువును "అరబిందువు" అని వ్యవహరించినప్పటికీ దానిని "ఁ" అనే రూపంగా ఆతడు వ్రాసుకొనలేదు - తాను అర్ధబిందువు అని వ్యవహరించిన దాన్ని సైతం పూర్ణబిందు రూపంలోనే ("ం" అనే రూపంగానే) వ్రాసుకొన్నాడు - కాబట్టే

క॥ కుఱుచల తుది హల్లులకున్
బిఱుఁదన్ నెల కొన్నయట్టి బిందువులెల్లన్
నెఱయఁగ నూఁదుచుఁ దేలుచు
నొఱపై యిరుదెఱఁగుఁ జెల్లుచుండున్ కృతులన్॥

(ఆం - భా - భూ - 56 ప.)

అనే పద్యంలో నిండు సున్నా ఊది పల్కబడుతుందనీ, తేల్చిపల్క బడుతుందనీ "ఊఁదుచు, తేలుచు" అనే పదాలు వుపయోగించి చెప్పాడు -

అసలు అర్ధబిందువును అర్ధచంద్రాకారంలో ("ᑕ" అనే రూపంలో) వ్రాయాలనే యోచన అప్పకవికి పూర్వం యెవ్వరికీ కల్గలేదు. మొట్టమొదట అరసున్నాకు "ᑕ" అనే రూపాన్ని కల్పించినవాడు అప్పకవి - అర్ధబిందు పూర్ణబిందువులకున్న లిపి భిన్నత్వాన్ని గురించి అప్పకవి చెప్పిన పద్యంయిది -

గీ॥ సగము జాబిల్లివలె వ్రాయ సగము సున్న
నిండు జాబిల్లివలె వ్రాయ నిండు సున్న
యయ్యె నీ భేదము లెఱింగి యాంధ్రకృతుల
వ్రాయఁదగు బిందువులు పాండవేయ పక్ష! ॥ †

(అప్ప - 2ఆ - 33ప.)

ఈ విధంగా అప్పకవి అరసున్నాను సగం జాబిల్లివలే వ్రాయాలని చెప్పి ఆలిపిని తాను వ్రాతలో వ్రాసాడో లేదో

---

† అప్పకవి అరసున్నా నిండుసున్నాలకు ప్రత్యేకంగా రూపకల్పన చేసి చెప్పిన ఈపద్యాన్ని అహోబలుడు సంస్కృతీకరించి ఆ శ్లోకకర్తృత్వాన్ని తిక్కనకు కొద్దిగా పూర్వుడైన అధర్వణాచార్యుని కంటగట్టి ఆ అథర్వణ కారికావళికర్త అథర్వణుడు కాడనీ తానేననే రహస్యాన్ని చెప్పకుండానే చెప్తున్నాడు—

"పూర్ణేందు సదృశఃపూర్ణ
స్త్వర్ధస్త్వర్ధేందు సన్నిభః"

ఇత్యథర్వణోక్తేః పూర్ణార్ధబిందోః పూర్ణార్ధచంద్రతుల్యత్వేన లేఖనమ్. (అహో - 162 పుట.)

అర్ధబిందువు అర్ధేందు సదృశమైనదనీ పూర్ణబిందువు పూర్ణేందు సదృశమైనదనీ చెప్పేయీ ఆధునికమైన లేఖన జ్ఞానం అధర్వణాచార్యుని కంటగట్టి యిటువంటి లేఖన జ్ఞానం ఆతని కాలంలో (క్రీ॥ శ॥ 13వ శతాబ్దంలోనే) వున్నదని నిశ్చయించే చరిత్రజ్ఞులుగాని, లిపిచరిత్రజ్ఞులుగాని, తాళపత్ర గ్రంథ పరిశోధకులుగాని వున్నారా?

చెప్పలేము. అప్పకవి స్వహ_స్తంతో వ్రాసిన అప్పకవీయ తాళపత్ర ప్రతి లభిస్తేనేగాని ఆ విషయం తేలదు - అప్పకవి చెప్పిన యీలిపి భేదాన్ని ఆచరణలో యెవ్వరూపాటించలేదు. ఇటీవల ముద్రణ యంత్రాలు వచ్చిన తర్వాతనే ఈ అరసు న్నాకు సగం జాబిల్లి (సున్నను సగంచేసిన) రూపం లేఖనంలో విస్తృతిని పొందింది.

ఈ విధంగా నిండుసున్నా ఎప్పుడైతే వుచ్చారణలో దీర్ఘాలమీద తేలిపోయి ఖండ బిందువుగా స్థిరపడి పోయిందో అప్పుడు సున్నావున్న పదాలు లేనిపదాలు సమానాలయి పోయి ప్రయోగ శరణంగా అనుస్వార జ్ఞానం కలిగించుకొన వలసిన అవసరం కల్గింది. అంతేకాదు. కొన్ని కొన్ని పదాలలో సున్నా లేకపోయినా వున్నట్టుగా కొందరు వ్యవహారంలో భావించేవారు. కొందరు సున్నా వున్నప్పటికీ లేదని భావించే వారు - ఇటువంటి తారుమారులకు పాల్పడబట్టే "చీఁకటి, తీఁగ" మొదలైన పదాలు సార్ధబిందుకాలా? నిర్బిందుకాలా? అనే విషయంలో వివాదాస్పదాలయ్యాయి. నన్నెచోడాదులు "చీకటి" శబ్దాన్ని నిర్బిందుకంగా వ్యవహరించారు కాబట్టి అం దులో బిందువు లేదని కొందరి వాదన - "చింకు" శబ్దాన్ని చూచినా "ఇంత చింకు రాత్రేళ (చీఁకటి రాత్రేళ అని అర్థం) రాకపోతేపరా" మొదలు గాగల వ్యవహారవాక్యాలనుబట్టి చూచినా "చీఁకటి" లో అరసున్న వున్నదనే అనిపిస్తుంది. అయితే నన్నెచోడాదులు దీన్ని నిర్బిందుకంగా వాడారన్న విషయం సత్యమే. అంతమాత్రంచేత తేలేది "చీకటి" లో

నన్నెచోడాదుల కాలంలో సున్నా లేదని మాత్రమే తేల్తుంది గాని ఆ తర్వాతి కాలంలో కూడా లేదనే సంగతి యెలా ధ్రువపడుతుంది? అప్పకవి స్పష్టంగా తన అప్పకవీయం 3 ఆశ్వాసంలో "నాఁగాఁటిత" ఇత్యాది విరాటపర్వంలో పద్యాన్ని వుదాహరించి "చీఁకటి"లో అరసున్నా వున్నదని భావించాడు- అప్పకవి కాలంలో దానికి సబిందు రూపంగా వ్యవహారం లేకపోతే ఆతడు దాన్ని సబిందుకంగా ఎలా పేర్కొంటాడు ! అదే విధంగా † "తీఁగ" శబ్దంలో అప్పకవి అరసున్నా వున్నట్లు భావించాడే -అది అప్పకవికి పూర్వకాలంలో నిర్బిందుకమేగా! ఖండాఖండ ప్రాససందర్భంలో అప్పకవి "మూఁక" "శబ్దాన్ని నిర్బిందుకంగా గ్రహించి ద్రోణపర్వంలోని "మూఁకలు విరియించి

---

† "తీఁగ" శబ్దంలో అరసున్నా లేదని కొందరంటారు. అప్పకవి రచించిన

గీ॥ ఆఁగెలోఁగెను వీఁగెను డాఁగె నేఁగె
వాఁగననునివి మొదలగు వాక్యములను
బొదలు నక్షరములు చిన్నబొట్లపై గ
కారములుగాని యంతస్థకములు కావు॥

(అప్ప. 2 ఆ. 116 ప.)

అనే పద్యాన్ని పురస్కరించుకొని "తీగ"లో గకారం వకారంగా మారి "తీవ" అనే రూపం అవుతుంది కాబట్టి "తీగ" లో అరసున్నా వుండడానికి అవకాశం లేదని ఒకరు వ్రాసారు. అరసున్నా పూర్వంలో వున్న గకారం వకారంగా మారదని అప్పకవి చెప్పిన లక్షణం కేవలం పొరపాటు -

ఈఁగ - ఈవ	మ్రేఁగు - మ్రేవు
ఊఁగు - ఊవు	మ్రోఁగు - మ్రోవు
మూఁగ - మూవ	(లొంగు) లోఁగు - లోవు

వీఁక......” ఇత్యాది సీసపాదాన్ని ప్రమాణీకరించాడే ! శబ్దారత్నకరకర్త “మూఁక” శబ్దం సార్థబిందుకంగా గ్రహించి సరిగ్గా అప్పకవి పేర్కొన్న తిక్కన ప్రయోగాన్నే ప్రమాణీకరించాడే ! ఇవన్నీ యింత కంగాళిగా యెందుకు తయారవ్వాలి? అనే ప్రశ్న వేసుకుని సమాధానంకోసం ఎదురుచూస్తే “సున్నా వుచ్చారణలో భ్రష్టమై అది వుండేస్థానం వుండని స్థానం తెలిసీ తెలియక తారుమారుకావడమే” అనేది సమాధానంగా వస్తుంది. ఇం కెందుకు ? “మాట” అనే శబ్దంలో అరసున్నా లేదని ఈ నాడు అందరమూ అంటాము - నన్నయ్యాదుల ప్రయోగాల్లోకూడా ఆశబ్దంలో అరసున్నా లేదు - ఈ విషయంలో సందేహానికెక్కడా తావులేదు-అయితే అనంతు డొక్కడు మాత్రం ఈ క్రింది పద్యాల్లో “మాట” శబ్దాన్ని సబిందుకంగా “మాంట” గా ప్రయోగించాడు -

---

నాఁగురు - నావురు	(†మింగడ) మీఁగడ - మీవడ
(వేసంగి) వేసఁగి - వేసవి	(మెసంగు) మెసఁగు - మెసవు
(విసుంగు) విసుఁగు - విసువు	(నిసుంగు) నిసుఁగు - నిసువు
(ముసుంగు) ముసుఁగు - ముసువు	(దోసంగు) దోసఁగు - దోసవు

అనే యీ పదసముచ్చయాన్ని పరిశీలిస్తే అరసున్నా పూర్వంలో వున్న గకారం కూడా వకారంగా మారుతుందని తేలిగ్గా నిర్ణయించుకో వచ్చు - “మీఁగడ” ‡ (మీఁదు + కడ) లో అరసున్నా వున్నదనడం నిర్వి

---

† “మింగడ” జనవ్యవహారంలో వున్నది.

‡ “మీఁగడ” లో అరసున్నాను చిన్నయసూరి కూడా తన బాల వ్యాకరణంలో సాధించుకున్నాడు - సంధి - 37 సూత్రం - చూడు-

వాదమేగదా !

ఉ॥ ....

వేలుఁగ బానకు నేర్పుతోఁడఁ బై

మీఁవడఁ బుచ్చి...............

....

(పంచ తంత్రం - 1ఆ - 590 ప.)

అనే యీ పద్యంలో వెంకటు నాథుడు వకార ప్రాసలో "మీఁవడ" శబ్దాన్ని ప్రయోగించాడు - ఇంక అరసున్నా పూర్వంలో వున్న గకారం వకారంగా మారదు కాబట్టి "తీవ" గా మారుతున్న "తీగ" లో అరసున్నా లేదనే వాదంలో బలమెంతవున్నది? అయితే "తీఁగ" లో వున్న గకారం వకారంగా మారినప్పుడు స్థిరపూర్వకమైన బిందువు తెలుగులో వుండదుకాబట్టి లోపిస్తుందని చెప్పుకోవాలి. చిన్నయ్యసూరి తన బాల వ్యాకరణంలో "ఆమ్రేడితంబు పరంబగునపుడు విభక్తిలోపంబు బహుళంగానగు" (సంధి - 41 సూ.) అనే సూత్రసందర్భంలో ఇంచుక నాఁడిత్యాదులందు బహుళ గ్రహణముచేత నంతిమాక్షరలోపంబునగు - ఇంచుక...ఇంచుక = ఇంచించుక...ఇంచుకించుక-నాఁడు... నాఁడు = నానాఁడు... నాఁడునాడు అని వుదాహరిస్తూ "నానాఁడు" లో "నానా" లకు మధ్యవున్న అరసున్నా స్థిరాక్షరం పరంలోవున్న దైనందువల్ల లోపిస్తుందని భావించాడు. ఈ విధంగానే "అడంగ్వాదుల డాకు ణకారంబు విభాషనగు (బాల. ప్రకీ - 13 సూ) అనే సూత్రంలో "నాఁడేము, పోఁడి" అనే సార్ధబిందుక పదాలను గ్రహించి డకారానికి ణకారాదేశం రాగా "నాణెము, పోణి" అనే అవస్థలో స్థిరానికి పూర్వంలో వున్న బిందువు తెలుగులో వుండదు కాబట్టి లోపిస్తుందని భావించాడు. ఈ రెండు స్థలాలలోను బిందులోపాన్నంగీకరించిన చిన్నయసూరి "సమానపదంబునందు సంయోగంబు పరంబగు నపుడెల్లచో ఖండంబునకుఁ బూర్ణంబగు (బాల. అచ్చి - 15 సూ.) అనే సూత్రంలో "ఏండ్లు, కాండ్లు ఇత్యాదులందు డాకుళాదేశంబు కొందఱు వక్కాణించిరి. తెనుఁగున బిందు పూర్వక స్థిరంబులేమింజేసి గ్రాహ్యంబుగాదు" అని వ్రాయడం సమంజసంగాలేదు. "పోఁడి - పోణి" అన్నప్పుడు డకారానికి ణాదేశం రాగానే బిందులోపం

జరుగుతుందని యెంచిన చిన్నయ్య "ఏంన్లు - కాంన్లు" ఇత్యాదుల్లో డాను శాదేశం వచ్చినప్పుడు లోపించదనకోవడంలో అర్థమేమిటి? శాదేశం రావడానికి బిందువును అభ్యంతరంగా చెప్పడం సమంజసమా? సమంజసమే అయితే బిందువును పురస్కరించుకుని శాదేశనివారణ చేసుకొన్నట్లైతే "పోఁడి" ఇత్యాదుల్లో కూడా బిందువును పురస్కరించుకొని ణాదేశనివారణ చేసుకోవద్దా? ఈ సందర్భంలో చిన్నయ "ఏంన్లు. కాంన్లు" అనే రూపాలను అంగీకరించలేదుగాని "ఏన్లు, కాన్లు" అనే రూపాలను అంగీకరించాడని ఒకరన్నారు. అది సమంజసంకాదు. చిన్నయ సూత్రాల ననుసరించి "ఏఁడు" శబ్దంమీద "ఏళ్ళు" అనీ, కాఁడు" శబ్దం మీద "కాళ్లు" అనీ కానేకావు -

ఈ విధంగా స్థిరంపర మవుతుంటే బిందులోపాన్ని ప్రౌఢవ్యాకర్త కూడా అంగీకరించాడు. "కొన్ని యెడల నవర్ణంబు పరం బగునప్పుడు పూర్వ పదాంత్య డకారంబు నకారంబగు - రెండు + నాళ్ళు = రెన్నాళ్ళు (నాఁడు + లు = నాఁడులు, నాన్లు.) మొదలగునవి." (సంధి - 15సూ.) "అమదర్థంబున భిన్నవస్తు సముదాయం బర్థమగుచోనేకవచనంబున నంతాదుల తకారంబునకు ద్విరుక్త నివర్ణంబగు ఉదా "అన్ని, ఇన్ని, ఎన్ని, కొన్ని". (శబ్ద - 52సూ.) ఈ విధంగా వ్యాకరణాల సాంప్రదాయాన్ననుసరించి స్థిరం పరమవుతుంటే బిందువుకు లోపం కల్గుతుందనే విషయాన్ని గమనించకుండా "తీఁగ" కు "తీవ" అనే రూపం వున్నది కాబట్టి "తీఁగ"లో అరసున్న లేదనడం పొరపాటు గాదా? అక్కడ అరసున్నా వుంటే గకారానికి వకారాదేశం వస్తే ఆ అరసున్నా లోపించదా? పూర్వం వచ్చిన "మీఁగడ మీవడ" అనే వాటిని చూచినా లేదా ఈ నాటికీ నిత్య వ్యవహారంలోవున్న "వేసంగి - వేసఁగి - వేసవి" అనే రూపత్రయాన్ని చూచినా అరసున్నా పూర్వంలోవున్న గకారానికి కూడా వకారం వస్తుందని తీర్మానించుకో వలదా?

ఆ॥ వే॥ అర్ధబిందు సహితమగు వర్ణమునకుఁ బ్రా
సాది యరయనిడుద యక్షరంబు
నేఁడు మనకుఁ గల్గినాఁడు లక్ష్మీనాథుఁ
డేఁటికింక నేఁడు మాఁట లనఁగ

(అనం - ఛం - 1 ఆ - 33 ప.)

తే॥ గీ॥ సార్ధబిందువులై తేలినట్టి పటల
కరయఁ బ్రాసంబు నిర్బిందులైనఁ గొల్లు
వీఁపు మూఁపులు మఱి తలమోపులయ్యె
మాఁట లేఁటికి మేటి తాఁబేటి కనఁగ॥

(అనం - ఛం - 1 ఆ - 52 ప.)

వీటిలో "అర్ధబిందుసహితమగు" ఇత్యాది పద్యంలో దీర్ఘాలమీద అర్ధబిందువు వుంటుందని చెప్తూ 3, 4 పాదాలను అనంతుడు లక్ష్యాలుగా పేర్కొన్నాడు - "నేఁడు" లోని సార్ధ బిందుక డకారానికి "నాఁడు" లోని సార్ధబిందుకడకారానికి ప్రాసయతి వుపయోగించి "నేఁడు, నాఁడు" అనే పదాల్లో దీర్ఘాలమీద అరసున్నా వున్నదని నిరూపించాడు - అదేవిధంగా "ఏఁటికింకనేఁడు మాఁటలనఁగ" అనే దాంట్లో "ఏఁటి" లోని సార్ధబిందుక టకారానికి "మాఁట" లోని సార్ధ బిందుక టకా రానికి ప్రాసయతి వుపయోగించి "ఏఁటి, మాఁట" అనే పదాల్లో దీర్ఘాలమీద అరసున్నా వున్నదని నిరూపించాడు-

ఏమిటి అన్నప్పుడు మికారంలోవున్న ఇకారం ఉచ్చా రణ సౌలభ్యంకోసం లోపిస్తుంది. అనంతరం "ఏమ్‌టి" అన్న ప్పుడు మకారవ్యంజనానికి పూర్ణబిందువు వచ్చేసి "ఏంటి" అని వ్యావహారికంలో రూపమేర్పడుతుంది - ఏమిటికి అనడానికి ఏటికి అనే రూపాన్ని చాలామంది ప్రామాణికకవులు ప్రయో

గించారు కాని వారందరూ దాన్ని సార్థబిందుకంగా ప్రయో గించారనడానికి ఆధారం కన్పడదు. ఇక్కడ అనంతుడు మాత్రం సార్థ బిందుకంగా వ్యవహరించాడని స్పష్టంగా తేలుతున్నది.‡ ఇక్కడ "ఏఁటి" సార్థ బిందుకమైనప్పుడు "మాఁట" కూడా సార్థ బిందుకం అయితీరాలి. ఆ విధంగా కాకపోతే అనంతుడు చూపదలచిన లక్ష్యసిద్ధి కానేరదు - సార్థ బిందుకాలైన "నేఁడు - నాఁడు" లకు ప్రాసయతిని కూర్చిన విధంగానే (మాఁటలో అరసున్నా వున్నదని భావించి) "ఏఁటి - మాఁట" లకు ప్రాసయతిని సమకూర్చాడని యెంచవలసివుంది. దీర్ఘాలమీద అరసున్నాలున్నాయని నిరూపించుతూ ప్రాసయతుల్లో బంధింపబడ్డ "నేఁడు - నాఁడు" అనే వాటిని "ఏఁటి - మాఁట" అనే వాటిని వుదాహరించాడని "ఏఁటికింక నేఁడు మాఁటలనఁగ" అనేదానిలోవున్న "మాఁటలు + అనఁగన్" అనేప్పుడున్న "అనఁగన్" అనే పదమే స్థిరపరుస్తున్నది. † అదే విధంగా " సార్థబిందువులై తేలినట్టి పటల కరయ "

---

‡ "పండితేతరుల వ్యవహారమునమాత్ర ముండెడి లక్షణ - కవి ప్రయోగ - సమ్మతము కానిభాష - ఉదా॥ యెల్తాను- సెప్తాను-యేంటి - యాడాడు?" -(ఆం- వ్యా-సం - సర్వస్వం - 178పుట.) అని శ్రీ వజ్ఝల వారు వ్రాసారు. "యేంటి" పండితేతర వ్యవహారపదమే అయితే ఇక్కడ అనంతుని ప్రయోగ విషయం ఏమంటారు? అనంతుడు పరమప్రామాణికుడైన లాక్షికుడైన పండితకవేగాని పండితేతరుడు కాడుగా !

† "ఏఁటి కింక నేఁడు మాఁటనఁగ" అనేదాన్ని గురించి చర్చించుతూ అనంతుని ఛందం ద్వితీయ ముద్రణ పీఠికా కర్తలు

- "ఏంట్టి మొదలగు శబ్దములలో నిండుసున్న యుచ్చారణమె పూర్తిగ నశించినదనియు ఏఁట్టికి అనియున్నను టిద్విత్వమైనను లఘువేయగు

ఇత్యాది పద్యంలో కూడా "మాఁట" శబ్దాన్ని సార్థానుస్వారం గానే ప్రయోగించాడు - ఆ పద్యంలో అనంతుడు అర్ధబిందు ప్రాసకు రెండు పాదాలు లక్ష్యంగా, యిచ్చాడు. అందులో మొదటిది "ఏఁపు మూఁపులు మఱి తలమోపులయ్యె" అనే పాదం-ఇందులో "ఏఁపు" సార్ధబిందుకం "మోపు" నిర్బిందుకం అయి ప్రాసయతి చెల్లుతున్నది - ఈ విధంగానే రెండవ లక్ష్యపాదంలో కూడా "మాఁటలేఁటికి నేటి తాఁబేటికనఁగ" అనేదాంట్లో "మాఁట" సార్ధబిందుకమూ "బేటి" నిర్బిందు

టచే మాటలు అను నిండుసున్న లేని పదముతో ప్రాస సరిపోయినదనియు గ్రహింపనగును" - (54పుట.)

అని వ్రాసారు - "ఏఁటికింక నేఁడు......" ఇత్యాది అనంతుని ప్రయోగంలో సార్ధబిందు నిర్బిందుక ప్రాసప్రయోగింప బడిందన్నారు పీఠికా కర్తలు. అది సరికాదు ఈ పద్య సందర్భాన్ని బట్టి యిక్కడ సార్ధబిందు నిర్బిందు ప్రాసం వుపయోగించడానికి తావేలేదు- ఇక్కడ అనంతుడు బిందు పూర్వకాలైనపదాలవిషయం చెప్తున్నాడు కాని నిర్బిందుకాలైనపదాలవిషయం చెప్పడంలేదు - అటువంటప్పుడు సార్ధబిందుకానికి సార్ధబిందుకానికీ ప్రాస యతిచెల్లినట్లు చూపించడమే సమంజసంకాని సార్ధబిందుకానికీ నిర్బిందుకానికీ ప్రాసయతి చెల్లినట్లు చూపడం ఏమాత్రమూ సమంజసంకాదు - కాబట్టి మాఁటలో అరసున్నా వున్నదని అనంతుడు భావించాడనడమే తగివున్నది.

"ఏంట్టి" శబ్దంలో నిండుసున్నా వుచ్చారణ భ్రష్టమైనదని, పీఠికా కర్త వ్రాత. అదియుక్తంకాదు. "నువ్వనేదేంటిరా?" "నువ్వుచెప్పేదేంటిరా?" వంటి వ్యావహారిక వాక్యాలలో పూర్ణానుస్వారం స్పష్టంగా ఈనాటికీ నిలిచి వున్నది. దీర్ఘంమీదిది కాబట్టి అనంతుడు అర్ధబిందువు కలదిగా గ్రహించాడేగాని వాస్తవానికి జనుల్లో దానికి పూర్ణబిందువు కలదిగానే వ్యవహారం - మొత్తం మీద యిక్కడ అనంతుడు "ఏంటి" అనే వ్యావహారిక రూపంమీద "ఏఁటి" అనే అర్ధబిందు రూపాన్ని సాధించుకుని ప్రయోగించాడనే తేలుతున్నది.

కముగా అయి ప్రాసయతి చెల్లుతున్నది - అనంతుడు "మాఁట" శబ్దాన్ని సార్థబిందుకంగా ప్రయోగించాడన్న సంగతి గమనిం చక శ్రీ వఝ్ఝలవారు తమ వైయాకరణ పారిజాతంలో ఖండా ఖండ ప్రాసచర్చలో (328 పుటలో)

- "వీఁపు శబ్దము సార్థబిందుకముగా నెంచియు "తాఁ బేటికి" అను దానిలోని టివర్ణము సైతము ఖండపూర్వమే యని తలంచి యున్నట్లు చెప్పియుండునని తోఁచుచున్నది - ఔప విభక్తిక టివర్ణము హ్రస్వ పూర్వకమగు నపుడు పూర్ణ బిందు పూర్వకమైయుండుటంబట్టి దీర్ఘపూర్వకత్వమునందును నిది ఖండపూర్వకమై యుండునని యీతండు తలంచెనా యని యాలోచింపవలసి యున్నది- పరిశీలింపఁగా నీ యభిప్రాయము యుక్తి యుక్తమే యనందగియున్నను నాంధ్రశబ్ద చింతామణి కర్త టివర్ణము ఖండ పూర్వక మనుటకు సమ్మతింప లేదనుట (ప్రాచీన కాలమున లేమింజేసి) నిశ్చితమగు చున్నది" -

అని వ్రాసారు - ఇది సమంజసంకాదు. ఔప విభక్తి కటివర్ణం హ్రస్వపూర్వకమై నప్పుడు పూర్ణబిందు పూర్వ కమైవుండడంవల్ల దీర్ఘ పూర్వకత్వంలో ఖండ బిందువు వుండా లనే అభిప్రాయం కల్గుతుందా ? అటువంటి అభిప్రాయం శ్రీవఝ్ఝలవారన్నట్లు యుక్తి యుక్తమే అయితే "కొండవంటికి" ఇత్యాదుల్లో హ్రస్వ పూర్వకమైన పూర్ణబిందుపూర్వక టి వర్ణం పాక్షికంగా అర్ధబిందు పూర్వకం యెందుకు కారాదు ? అయితే "కొండవఁటికి" వంటి రూపాలు సమ్మతించ దగినవా? అటువంటి రూపాలు ప్రాచీన కాలంలో ఏకవినామకునిచేత

నైనా చెప్పబడలేదు! వాస్తవానికి ఔపవిభక్తిక టివర్ణం పూర్ణబిందు పూర్వక మవుతుందేగాని అర్ధబిందు పూర్వకం యెన్నటికీ కాదు - అక్కడ అనంతుడు "మాఁట" శబ్దాన్ని సార్ధ బిందుకంగా ప్రయోగించాడనడం సుస్పష్టం -

ఈ విధంగా "మాఁట" లో అరసున్నాను అనంతుడు వ్యవహరించాడనే నావాదాన్ని బలపరుస్తూ మిత్రులు శ్రీ తిరుమల రామచంద్ర (ఆంధ్రప్రభ సహాయ సంపాదకులు) గారు -"ఇక ఖండా ఖండ ప్రాస విషయంలో శ్రీ గోపాల కృష్ణయ్యగారు ఒక సత్యాన్ని గుర్తించారు.

"సార్ధబిందువులై తేలినట్టి పటుల
కరయఁ బ్రాసంబు నిర్బిందులైనఁ జెల్లు
వీఁపుమాఁ పులుమటి తలమోపులయ్యె
మాఁటలేఁటికి మేటితాఁ బేటికనఁగ" (పుట - 140)

అరసున్న గల వీఁపుకు, అరసున్న లేని మోపుకు ఇక్కడ ప్రాసయతి. అలాగే అరసున్న వున్న మాఁటకు లేని తాఁబేటికి.

వీపులో అరసున్న వున్నట్టు అనంతుడు చెప్పినా భారత కవులు వీపును సార్ధబిందుకంగా వాడలేదు-

"ఆపన్నగముఖ్యులఁదన
వీపునఁబెట్టి కొని పఱచి
విపినములు మహా......"
(సౌపర్ణోపాఖ్యానము. ఆదిపర్వం - ద్వితీయ - 44)

"వీపున నబ్ధినొక్కప్పుధి
వీధరముందగఁ దాల్చె నంచుల
క్ష్మాపతి".........
(ఎఱ్ఱాప్రగడ లక్ష్మీనృసింహ పురాణం- 4 - 181)

మాటలో అరసున్న వుండడంకూడా ప్రాచీన ప్రయోగ

సాపేక్షమయినా వ్యవహారంలో అనంతుని కాలానికి వుండి వుంటుంది. మనకు "మాటా మంతి" అనే పలుకుబడి వుంది. ఇది "పిల్లా జెల్లా" పురుగూపుట్రా), లాగ ఏకార్థకద్వంద్వపద ప్రయోగం అని పరిశీలిస్తే "మంతి" అనేదికూడ మాటకు పర్యాయమే. మాటకు కన్నడంలో 'మాతు' తమిళంలో మాట్రు (మాత్రు), "మళయాళంలో" మాట్రు (మాత్ర) మాట్రు (మాత్రు) పర్యాయములు - మాట్రు అనే ద్విశకట రేఫాంత తమిళ పదోచ్చారణ తటపోచ్చారణతో మాత్ర అయి, రేఫం వూడి మాత్ర, మాతు అయివుంటుంది. మాత్రు అని ఒత్తి పలకడంలో అను నాసికం కూడా వచ్చివుండేమో కన్నడంలో (గుల్బర్గా ప్రాంతాన) మాటకు పర్యాయమైన మాతును మాంతు అని అను నాసికంతో పలకడంవుంది. ఇది తెలుగు లోను మాంట అని ఒకప్పుడు వుండేదేమో! కనుక శ్రీ గోపాలకృష్ణయ్యగారి వాదం సమంజసమనే భావించవచ్చు" -

(ఆంధ్రప్రభ - వ్యాసపీఠం - 8-11-1953)

అని వ్రాసారు - ఇంక అనంతుడు "మాట" ను "మాంట" గా ప్రయోగించాడనడం నిస్సందేహమేగదా! - నన్నయాదులంతా "వీపు" శబ్దాన్ని నిర్బిందుకంగా వ్యవహరిస్తే అనంతాదులు కొందరు సబిందుకంగా వ్యవహరించారు. చీకటి, తీగ, మూక, వీపు, మాట, మొదలైన పెక్కు పదాలను నన్నయ్యాదులు నిర్బిందుకాలుగా ప్రయోగిస్తే తక్కిన అనంతాదులు సబిందుకాలుగా ఎలా గ్రహించారు? అనే ప్రశ్న వేసుకుంటే "ఒక కాలంలో నిర్బిందుకాలైన పదాలు మరొక

కాలంలో సబిందుకాలుగా జనసమూహంలో వ్యవహరింప బడడమే" అనేదే సమాధానంగా వస్తుంది. అయితే "చీకటి" మొదలైన పదాలలో నన్నయ కాలంలో బిందువులేదని నిర్ణయించడానికి ఎవరికైనా హక్కువున్నదిగానిఅసలవి నిర్బిందుకాలనే హక్కు ఎవ్వరికీ లేదు. అప్పకవ్యాదుల మతంలో "చీకటి" మొదలైన కొన్ని పదాల్లో అరసున్నా వున్నదనడం నిర్వివాదం. అయినప్పుడు అప్పకవి "చీకటి, తీగ" లను సార్థబిందుకాలుగా వ్యవహరించినందుకు ఆతన్ని తెగడడంలో అర్థంలేదు -

పూర్ణబిందువు ఉచ్చారణలో భ్రష్టమై యింతగా తారుమారైన కారణంచేతనే సబిందు నిర్బిందు ప్రాసను తిక్కనాదు లుపయోగించారు. ఈ బిందువుయొక్క సంపూర్ణమైన పరిస్థితిని గుర్తించకుండా "నన్నయతో పాటు తిక్కన ఎఱ్ఱాప్రగడలు కూడా సబిందు నిర్బిందు ప్రాసను ప్రయోగింపలేదు" అని కొందరు చేసిన నిర్ణయమే చివరి నిర్ణయంగాను వారి నిర్ణయాన్ని పరిశీలించే హక్కు ఎవరికీ లేదనే ధోరణిలోను కొందరు వాదించడం ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నది. ఈ క్రింది ప్రయోగాల్లో తిక్కన నిశ్శంకగా సబిందు నిర్బిందు ప్రాసను ప్రయోగించాడు -

క॥ తగనా కురువృద్ధునకు నొ
సఁగె నాఁటికి దివ్యదృష్టి.........

(భార - ఆశ్ర - 2 ఆ. 121 ప.)

"ఒసంగు" అనే రూపాన్ని చూస్తే "ఒసఁగు" లో అరసున్నా వున్నదనడం నిర్వివాదం. "ఒసఁగు" శబ్దం భారతరచనా కాలంలో సబిందుకంకాదని (యువ సం. మార్గశిర) భారతిలో ఒకరు వ్రాసారు. అదిసరికాదు. ఈ క్రింది ప్రయోగాల్లో తిక్కన "ఒసంగు" పూర్ణబిందురూపాన్ని ప్రయోగించాడు.

క॥ అనియెంగావునఁ గుంతీ
తనయాగ్రజ నీవు నివ్విధముల జనములం
గొనియాడుము వారలు శో
భనము లొసంగుదు రఘుంబుఁ బాపుదురు కృపన్ ॥

(భార - అను- 2 ఆ. 136 ప.)

క॥ కోరినవరము విమానము
గారవమున నాకుఁ గమలగర్భుఁడొసంగన్

(నిర్వ - 2 ఆ. 45 ప.)

గీ॥ ఇంపొసంగు నీయర్మిలి యెల్లవమ్ము
గాఁగ........................ (నిర్వ - 9 ఆ. 88 ప.)

వీటిల్లోవున్న "ఒసంగు" ను "ఒసఁగు" అని దిద్దివేసే ప్రముఖులుకూడా మనలో లేకపోలేదు. "బ్రాఁతి" సబిందుకమనే అంగీకరిస్తారనుకుంటాను. శబ్దరత్నాకరకర్తకూడాదీన్ని సబిందుకంగానే గ్రహించాడు. కేతన తన ఆం. భా. భూషణం 99 పద్యంలో మూడుపాదాలు "కూఁతురు" శబ్దంతోను ఒక పాదం "బ్రాఁతి" శబ్దంతోను ప్రాసపెట్టి రచించాడు. "బ్రాఁతి" లో అరసున్నా వున్నదనక తప్పదుగదా! అయితే

ఉ॥ జాతర సేయఁగావలయు............
బ్రాఁతిగ భక్తితోడ..............(భార- మౌస-1ఆ.24ప.)

ఇక్కడ తిక్కన సబిందు నిర్బిందుప్రాసను ప్రయోగింప లేదనగలరా? "బ్రాంతి" శబ్దాన్ని సమకాలికులైన కేతన తిక్కనల్లో ఒకరు సబిందుకంగాను మరొకరు నిర్బిందుకంగాను వుపయోగించారనడానికే ఎవరైనా సాహసిస్తే అంత అన్యాయం మరొకటి వుండదు. వారెంతకైనా తగుదురన్న మాట-ఇంకెందుకు? కాలవాచియైన "నాఁడు" లోను, "వెంట" మీఁద తయారైన "వేఁట" లోను బిందువు వున్నదనడం నిర్వివాదం. నిర్బిందుకాలైన "మీటు, నాటు" పదాలతో సబిందుకాలైన "నాఁట (నాఁడు) - వేఁట" పదాలను కలిపి ప్రాసవేసిన యీ తిక్కన పద్యం పరికించండి.

క॥ మీటుగల రథికులను నొక †
నాఁటను వేవుర వధింతు నురుశరములు నో
నాటి పడవైచునంతకు
వేఁటాడెదఁ బ్రతిబలంబు వీరుల నెల్లన్॥

(భార - ఉద్యో - 4ఆ - 407ప.)

ఎఱ్ఱాప్రగడ తన నృసింహ పురాణంలో

క॥ ఆదియు మహిమయు నేర్పడ
నాది పురుషుఁ డొకఁడ యెఱుఁగు నన్యుల కెఱుఁగం
గాఁదరము గాదు కమలభ
వాది దివిజవంద్య మది మహాద్భుత మహిమన్॥

(1 ఆ - 39 ప.)

క॥ ఆదేవు దివ్యమహిమం
బా దేవుఁడు తానె యెఱుఁగు నన్యుల కెఱుఁగం
గాఁదరమె విధిపురందరు
లాది యయిన దివిజులకును నందునె యెందున్॥

(1 ఆ - 64 ప.)

---

‡ మీటుగల రాజఘరకుల నాఁటికి . . . అని పాఠాంతరం.

క॥ పూఁచిన యశోకములయం
దేచిన తుమ్మెదల రవము లింపెసఁగెఁ బొరిం
దాఁచు వనదేవతల చర
ణాచలితము లైన యందియల మ్రోఁతయనన్॥

(2 ఆ - 70 ప.)

ఉ॥ వేఁదుఱు గొన్న మానవుని వేమఱుఁగంటియు బిట్టుగాల్చియున్
మోఁదియు నీటఁద్రొక్కియును మున్కని తీర్పఁగడంగు వెజ్జున
ట్లేఁదగ నిన్ని చందముల నీతని దీర్చుటకై పెనంగితిన్
బేదటికంబు గట్టుకొని బెట్టుగఁ జిక్కితి నేమి సేయుదున్॥

(5 ఆ - 12 ప.)

అని యిన్ని చోట్ల సబిందు నిర్బిందు ప్రాసను ప్రయోగించాడు - కొన్ని పద్యాల్లో ఎర్రాప్రగడ సబిందు నిర్బిందు ప్రాస ప్రయోగించాడని వీటిల్లో ఒక పద్యాన్ని చూపేసరికి "ఎర్రాప్రగడ లక్ష్మీనృసింహ పురాణం తాళపత్ర ప్రతులు లేవు. వాటిని సమగ్రంగా అవలోడించాలి" - అని వాకరు తప్పుకో జూచారు. కాని పాపం తిరిగివారే అవసరం వచ్చేసరికి ఎర్రాప్రగడ వీపుశబ్దాన్ని నిర్బిందుకంగా వాడాడనడానికి వుదాహరణగా "ఆపన్న గముఖ్యులఁదన । వీపునఁ బెట్టికొని పఱచి" ఇత్యాది లక్ష్మీనృసింహ పురాణంలో (4 ఆ. 181 ప.) పద్యాన్ని ఎత్తిచూపించారు. వారు ప్రమాణీకరించాల్సివచ్చేసరికి ఆ గ్రంథం యోగ్యమైనదీ మనం ప్రమాణీకరించితే అయోగ్యమైనదీను - లోకం యెంత విచిత్రం? - ఇంతెందుకు? "మోఁదు" శబ్దం సార్థబిందుకంగా మన నిఘంటు కర్తలందరూ అంగీకరించారు - మోఁదు సార్థబిందుకమే అయితే

నృసింహ పురాణంలోంచి వుదాహరించిన "వేఁదుఱు" ఇత్యాది (5ఆ - 12ప.) పద్యంలో సార్ధబిందు నిర్బిందు ప్రాసను(అక్కడ వేదశబ్దంలో బిందువు లేదు కాబట్టి) అంగీకరించక తప్పదు. ఒకవేళ ఎవరైనా మోదు నిర్బిందుకమే అని వాదించేవారుంటే యీ క్రింది ఎర్రాప్రగడ హరివంశంలోని పద్యాన్ని తిలకిస్తే సందేహం తీరుతుంది.

ఉ॥ చీఁదఱ రేఁగినట్లు రిపుసేనల నెల్లను ముట్టిగోఁకటన్
మోఁదుచు నాఁగటం దిగిచి నొంచుచుఁ గార్ముక ముక్తబాణముల్
పైఁదొరగించి కూల్చుచును వాదహతి న్నవియంగఁ ద్రొకుచున్
లోఁదగు కొ్రొత్తవీర రసలోలత మో మలరంజరింపఁగన్ ॥

(హరి - ఉ - భా - 1ఆ - 103ప.)

మోఁదు సబిందుకమంటారా? నృసింహ పురాణంలో వున్న 5ఆ - 12 పద్యంలో సబిందు నిర్బిందు ప్రాస సిద్ధిస్తుంది. కాదు నిర్బిందుకమంటారా? హరివంశంలోని పై పద్యంలో (ఉత్త - భా - 1ఆ - 103ప.) సబిందు నిర్బిందు ప్రాస సిద్ధిస్తుంది. తూఁగు, అనే పదాన్ని నిర్బిందుకమని యెవ్వరూ అనలేదు. నిఘంటు కారులు సైతం సబిందుకంగానే గ్రహించారు. "తూంగు" అనే తమిళ భాషా పదాన్ని చూస్తే "తూఁగు" లో అరసున్నా లేదనలేరేమో కూడా! - ఈ క్రింది ఎర్రా ప్రగడదే ప్రయోగం గమనించండి.

క॥ తూఁగాడు సూతుని సము
ద్వేగంబున వడఁకు రథ్యవితతిం గని గో

పాగమ కలితుండైఫణి
భోగనిభంబైన చాపమున నొకశరమున్ ॥
(హరి - ఉత్త - భా - 6ఆ - 168ప.)

తాఁచులో అరసున్నా వున్నట్లు అందరూ అంగీకరించారు. నృసింహ పురాణం (2ఆ. — 70ప.) సరైన గ్రంథంకాక పోయినా ఈ క్రింది హరివంశ పద్యాన్నయినా తిలకిస్తే తెలుస్తుంది.

ఉ॥ తాఁచినఁదోన బిట్టాడిసి తత్పదఘుష్టముఁబట్టి.....
వీచియతండు...............
వైచె ....నుగ్గును
గ్గై చెడియుర్విఁ........(హరి - పూ - భా - 7ఆ - 87ప.)

ఇలాగే "నేఁచు"లో కూడా అరసున్నా లేదని యెవ్వరూ అనలేదు. అయితే యీ క్రింది తిక్కన ప్రయోగాలు సబిందు నిర్బిందు ప్రాస కలవిగాక యేమవుతాయి ?

ఉ॥ కీచక కోటిచేత ....నిన్
నేఁచిన ....(భార - విరా - 3ఆ - 45ప.)

ఉ॥ నీతిఁగొఱంగి ....
బ్రీతిగ ....
వేఁతురు ....(భార - సౌప్తి - 1ఆ - 35ప.)

ఇన్ని ప్రయోగాలు సబిందు నిర్బిందుప్రాస కలవి కన్పడుతుంటే

— "కవిత్రయం ఖండాఖండ ప్రాసం ప్రయోగించలేదనే బహుపండిత జనసమ్మతమైన సిద్ధాంతం...... ఒక్క తిక్కన

ఖండాఖండ ప్రాస సాంకర్యం చేశాడని కొంత అనుమానముండింది పండితులకు. అదికూడ తొలగింది" -

అని ఒకరు తిరుగులేని తీర్పు చెప్పినట్లు వ్రాయడమే కాకుండా మీదుమిక్కిలి

"ఇంతకూ ఖండాఖండ బిందుప్రాస చర్చ ఒకతరం పాటు జరిగి కవిత్రయం ఈ సాంకర్యానికి దూరంగావుందని నిర్ధారితమైంది గనుక ఇక చర్చ అనవసరం"

అనికూడా వ్రాయడం ఆశ్చర్యకరంగావుంది. ఏ విషయంమీదనైనా ఒకతరంకాదు ఎన్నితరాలు చర్చజరిగి ఏనిర్ణయం జరిగినా దానిని పరిశీలించే హక్కు ప్రతిపరిశోధకుడికీ వుంటుంది. ఆ హక్కు లేదనేవారేవుంటే వారిని ఏమనాలో...

ఇంతకూ ఈ పరిశీలనవల్ల తేలేది పూర్ణబిందువు జనవ్యవహారంలో భ్రష్టమైనదవ్వడంచేత కొన్ని నిర్బిందుకాలు సబిందుకాలుగాను సబిందుకాలు నిర్బిందుకాలుగాను తారుమారై ఆ వ్యవహారవశంచేతనే కవులచేతకూడా నైరుధ్యంగా గ్రహింపబడ్డాయనిగదా! - ఈ సందర్భంలో జనవ్యవహారం ముందు ఎంత కట్టుబాటులో వున్న భాషైనా మారకుండా వుండడమనేది అసాధ్యమనే స్పష్టపడుతున్నది.

ఈ పరిశీలనలో "అన్నము - సున్నము" మొదలైన మువర్ణాంత పదాలను "అహమ్, కిమ్" మొదలైన మకారాంత పదాలను అనుస్వారాంతాలుగా వ్రాయడం దోషంకాదనేదీ

అట్టి[వాత పూర్వకాలంలో పండితకవుల్లో వున్నదనేదీ మనకు ముఖ్యమైన విషయం. †

"దాసో ఽ హమ్" మొదలైన పదాలను మనం అర్థ బోధకై "దాసః + అహమ్" అని పూర్వపదాన్ని విసర్గాం తంగా విభజించు కొంటాము. ఈ విధంగా పూర్వపదాన్ని విసర్గాంతంగా విభజించు కొనడమనేది కేవలం లౌకికంగా అర్థ బోధకోసమేగాని వేరుకాదు - అయితే యిక్కడ అలౌకికంగా ప్రక్రియ కోసం విభజించాలంటే "దాస + స్ + అహమ్" అనే విభజించుకోవాలి. మన ప్రాచీన కవులు కొందరు నిత్య వ్యవ హారంలో అర్థబోధకై "దాసః + అహమ్" అని విభజించు కొనే అలవాటు అత్యధికంగా కలవారవడంచేత అలౌకికంగా దాస + స్ + అహమ్ అని విభజించుకొనవలసిన ప్రక్రియా విషయాల్లో కూడా లౌకికంగానే "దాసః + అహమ్" అనేపద్ధ తిలోనే విభజించుకొనేవారు. వాస్తవానికి అలౌకిక విషయంలో విసర్గాంతంగా పూర్వపదాన్ని విభజించకూడదు - పూర్వ కవులు ఆ విధంగా విభజించుకొన్నారంటే ప్రక్రియా విషయా నికి -: ప్రక్రియా పద్ధతికి - స్వస్తిచెప్పి వ్యావహారికానికి లొంగి పోయారన్నమాట - ఆవిధంగా అలౌకిక విభాగంచేసుకోవలసిన

---

† ప్రాచీనంనుంచీ వస్తున్న యీ అలవాటును పోగొట్టుకోలేకే కాబోలు "సంస్కృత శబ్దార్థ కల్పతరువు" నిఘంటు కర్తలు ఆ నిఘంటు వులో మకారాంతాలుగా గ్రహించవలసిన పదాలను - నాలుగైదు పదా లనుకాదు - కొన్నివందల పదాలను అనుస్వారాంతాలుగా వ్రాసుకొని అనుస్వారాంతాలుగానే ముద్రించారు. ఇదంతా లక్షణబద్ధమే కాబోలు !!!

చోట "దాసః+అహమ్" అనే పద్ధతిలో లౌకిక విభాగంచేసు కొన్నవారిలో అనంతుడు అప్పకవి ప్రముఖులు -

"దాసోఽహమ్" ఇత్యాదుల్లో పూర్వరూపం పొందిన గూఢమైన అకారానికి యతి చెల్లుతుంది. దీనికి సరైన పేరు గూఢ స్వరయతి అనేది. ఈయతిని అనంతుడు సవ్యంగాగూఢ స్వరయతిగానే పేర్కొంటూ ఈ క్రింది పద్యంలో లక్షణం చెప్పాడు -

గీ॥ స్వరము తుదనుండి లుప్త విసర్గకోత్వ
మైన స్వర విరామంబు దాసోఽహమనఁగ
నచ్యుతా శ్రితు లుర్వినన్యోన్య మిత్రు
లనఁగ నమ్మకుందుండు యశోఽగ్రియనఁగ ॥

(అనం - ఛం - 1 ఆ. 85 ప.)

ఇక్కడ అనంతుడు లుప్త విసర్గ కోత్వం వస్తుందని అభి ప్రాయపడడం పొరపాటు - "దాస+స్+అహమ్" అని అలౌకిక విభాగం చేసుకోవాలి. అప్పుడు "ససజుషోరుః" - అనే సూత్రంచేత దాస+ర్+అహమ్ అయి, "అతోరోరప్లుతా దప్లుతే" అనే సూత్రంచేత రేఫకు ఉత్వంవచ్చి దాస+ఉ+ అహమ్ అని అయి "ఆద్గుణః" అనే సూత్రంచేత గుణం వచ్చి దాసో+అహమ్ అయి అనంతరం "ఏఙః పదాంతాదతి" అనే సూత్రంచేత పూర్వరూపంవచ్చి "దాసోఽహమ్" అనే రూప మవుతుంది. సత్వానికి, రుత్వం, ఉత్వం, వచ్చిన తర్వాత గాని గుణంవచ్చి ఓత్వం రాదుగదా! అటువంటప్పుడు ఈ ప్రక్రియనంతనూ విడిచిపెట్టి అనంతుడు ఊరికే "లుప్తవిసర్గ కోత్వమైన" అని విసర్గకు ఓత్వం చెప్పేస్తే ఎలాసరిపో

తుంది? ఈ యతి సందర్భంలోనేకాదు - అసలు ప్రక్రియ విషయంలోనే అనంతుడు విసర్గ సంబంధం మీద ఓత్వం చెప్పాడు -

క॥ ప్రకట విసర్గాది స్వర
మకారమునఁ గలసి యోత్వమగు సంధిఁదపో౽-
ధికుఁడన విసర్గచెడి వా
ఋకారమా ప్రభృతిఁగదిసి రజఅస్తి యగున్॥

(అనం - ఛం - 4 ఆ. 75 ప.)

ఇక్కడ తపః + అధికుడు అనే అవస్థలో విసర్గకు పూర్వంలో వున్న అకారమూ, విసర్గా రెండూ కలిసి ఓత్వం అవుతుందన్నాడు- పూర్వరూపం విషయం పట్టించుకోలేదు- తప + స్ + అధికుడు అనే అవస్థలో సత్వానికి రుత్వ ఉత్వాలు వచ్చి అనంతరం అకార ఉకారాలకు గుణంవచ్చి అధికుడులో అత్వానికి పూర్వరూపం వస్తే తపో౽ధికుడు అని అవుతుంది. ఈ ప్రక్రియా కాండ అంతా చెప్పడం కష్ట మనుకొనడమేకాక మామూలుగా "తపో౽ధికుడు" అన్నప్పుడు పద విభాగం చెయ్యాల్సి వచ్చేసరికి నిత్య వ్యవహారంలో తపః + అధికుడు అని చేసుకుంటాం కాబట్టి వాటి మేళనం చేతనే (తపః + అధికుడు అనేవాటి మేళనం చేతనే) తపో౽ధికుడు అవుతుందనుకున్నాడు.

ఇదే విధంగా అనంతుడు తన ఛందో గ్రంథం చతుర్థాశ్వాసంలో సంస్కృత సంధులను పేర్కొంటూ ప్రతిచోటా వ్యవహార వశాన విసర్గ సంబంధంగానే సంధులు చెప్పాడు - ఈ క్రింది పద్యాలు కొన్ని మచ్చు కిస్తున్నాను పరిశీలించండి.

క॥ పొలుపుగఁ జటతాది యుగం
బులశషసలెనయ విసర్గపొందునవన్ వా
శ్చలనము ఛందస్స్థికలు
లలితయశ స్త్రిస్రతిమిథశ్చలంబుల నంగన్ ॥ ‡
(అనం - ఛం - 4ఆ - 71ప.)

క॥ కలి తేకారాది విస
ర్గలు స్వరములమీఁదఁ గదియఁగా రేఫలు సం
ధిలు నర్చి రగ్రమనఁగా
నలవడు మఱిచక్షురింద్రియంబనఁగ మహిన్ ॥ *
(అనం - ఛం - 4ఆ - 76ప.)

గీ॥ వర్గములఁ దృతీయ చతుర్థ వర్ణములును
ఙనములును యరలవహలు నొనరఁ గదియ
నామ పద విసర్గాంతవర్ణ మోత్వ
మగు రజోగుణమన మనోహర మనంగ॥ ♦
(అనం - ఛం - 4ఆ - 77ప.)

క॥ వెలయ నివర్ణాది విస
ర్గల మీఁదను రేఫగదియఁగా దీర్ఘము వ
ట్రిలి యర్చిరాజి యనఁగ
నీఁజక్షూరాగ మనఁదనర్చును సంధిన్ ॥ §
(అనం - ఛం - 4ఆ - 78ప.)

---

‡ స్తోశ్చునాశ్చుః, ష్టునాష్టుః, అనే సూత్రవిషయాలతోపాటు సత్వ విషయం కూడా యిందులో చెప్పబడింది.

* మామూలుగా ససజుషోరుః అనే సూత్ర విషయం యిందులో చెప్పబడింది.

♦ ఇందులో ససజుషోరుః, హశిచ, అద్గుణః అనే సూత్రాలు క్రమంగా వర్తించే విషయం ఇందులో చెప్పబడింది.

§ రోరి, ఢ్రలోపే పూర్వస్యదీర్ఘోఽణః, అనే సూత్రాలు క్రమంగా వర్తించే విషయం యిందులో చెప్పబడింది.

ఈ విధంగా పద్యాలన్నింటిలోనూ విసర్గ సంబంధాన్ని అనంతుడు వాకొన్నాడు.

గూఢస్వరయతిలో అనంతుడు "స్వరము తుదనుండి లుప్త విసర్గకోత్వమైన" అని విసర్గకు ఓత్వం చెప్పడం వ్యవహారవశంచేత సంభవించిందనీ సంస్కృత వ్యాకరణ ప్రక్రియాపద్ధతికి విరుద్ధమైనదనీ అప్పకవి గమనించాడు. కాబట్టే తాను "దాసోఽహమ్" ఇత్యాదుల్లో అకారానికి యతి చెప్పే విషయమై లక్షణం వ్రాస్తూ "అదంత సాంతములమీఁద" అని విసర్గాంతాలుగా కాక సాంతాలుగానే (అంటే దాస + స్ + అహమ్ అనేపద్ధతిలోనే) గ్రహించాడు -

‡ తే॥ గీ॥ దైవభావనదంత సాంతములమీఁద
నత్తు మొదలనుగల శబ్దమతుకువేళ

[అప్ప - 8 ఆ. 17 ప.]

---

‡ ఇందులో కేవలం అత్తుపరమై పూర్వంలో ఓత్వం వచ్చేటప్పుడే "దాసోఽహమ్" ఇద్యాదుల్లోనే గూఢ స్వరానికి యతి చెల్లుతుందనే అభిప్రాయం వెల్లడించ బడింది. కాని నాచన సోముని

ఆ॥ వె॥ ఆద్యబీజాయ విశ్వ కర్త్రేఽక్షరాయ
నిర్గుణాయ గుణాత్మనే నిర్మలాయ
హరిహరాత్మనే ప్రవర దివ్యాయ యజ్ఞ
నాశరాయ నమో యనుచు న్నుతింతు॥

(ఉత్త. హరి. 2 ఆ. 219 ప.)

అనే పద్యంలో "కర్త్రేఽక్షరాయ" అనే దాంట్లో సైతం గూఢమైన అకారానికి యతి చెల్లింది - దీన్ని బట్టి "హరేఽవ," మొదలైన పదాల్లో గూఢమైన అత్తుకు కూడా యతి చెల్లుతుందని తెలుతున్నది. అంటే "ఏఙః పదాంతాదతి" అనే సూత్ర ప్రవృత్తికల రూపంలో ప్రతిదాంట్లోనూ గూఢ స్వరయతి వేయవచ్చునన్నమాట -

నమరునోత్వంబునకుఁ జెల్లు నయహాలిపులు
జగతిలుప్తవిసర్గక స్వరవళులన ॥ †

కాని అనంతుని "లుప్తవిసర్గకోత్వమైన" అనేదే దృష్టిలో వుండబట్టి కాబోలు లక్షణం సవ్యంగా "అదంత సాంత ములమీఁద" అనే చెప్పినప్పటికీ ఈ యతికి పేరు మాత్రం "లుప్తవిసర్గ స్వరవళి" అని పొరపాటుగానే పెట్టాడు. అనంతుడు గూఢస్వరయతి అని పేరు చక్కఁగా సవ్యంగా పెట్టు కొని లక్షణంలో విసర్గసంబంధం చెప్పడంతో తప్పటడుగు వేసాడు. అనంతుడు వేసిన యీ తప్పటడుగును గమనించిన అప్పకవి లక్షణం చక్కఁగా సవ్యంగా "అదంత సాంతముల మీఁద" అని చెప్పుకుని పేరు పెట్టుకొనడంలో విసర్గ సంసర్గాన్ని పేర్కొని "లుప్తవిసర్గ స్వరవళి" అని పేరుపెట్టడంతో తప్ప టడుగు వేసాడు. అయితే ఈ విషయంలో అనంతుడు అప్పకవి యిద్దరూ పొరపాటుపడ్డవాళ్లే – ఒకరు లక్షణం చెప్పడంలోను మరొకరు పేరుపెట్టడంలోను పొరపడ్డారు. ఈ యిద్దరి పొరపా ట్లకూ మూలకారణం "దాసః + అహమ్" అని లౌకికంగా వ్యవ హారంలో పద్యవిభాగం చేసుకొనే అలవాటు వుండి ఆ లౌకిక వి భాగాన్ని అలౌకికంలో కూడా గ్రహించడమే.

కంఠస్థానమూ, వివార, శ్వాస, అఘోష ప్రయ త్నాలు కల "ఖ" కారానికి పూర్వంలో జిహ్వామూలీయ మైన విసర్గను వుచ్చరించడం కష్టమైన పని – కాబట్టి వుచ్చా రణలో విసర్గకూడా పరసవర్ణంగా మారిపోతుంది. అందుకే

† "అమరునోత్వంబునకుఁ జెల్లు నయహాలిపులు" అనే దానివిషయం లోగడ 204, 205 పుటల్లో చర్చింపబడింది.

"దుఃఖము" మొదలైన పదాలను "దుఖ్ఖము" మొదలైనవిగా కొందరు వ్రాస్తారు - "దుఃఖము" అని వ్రాయడానికి దుఖ్ఖము వంటి ఖద్విత్వంకల వ్రాతలు తాళపత్ర ప్రతుల్లో చాలా కన్పడ తాయి. కానివాటికి కవి ప్రయోగాలు మృగ్యాలు.

— ఖ, ఘ - జ —

ఖకారానికి స్థానం కంఠం - ఘకారానికి కూడా స్థానం కంఠమే - ఖకారానికి బాహ్య ప్రయత్నాలు వివార, శ్వాస, అఘోషాలు - ఘకారానికి బాహ్య ప్రయత్నాలు సంవార, నాద, ఘోషాలు - ఈ విధంగా "ఖ" కార "ఘ" కారాలు పరస్పర విరుద్ధాలైన బాహ్య ప్రయత్నాలు కలవే అయినప్ప టికీ అన్నింటికంటే ముఖ్యమైన స్థానమైత్రి కలవి అవడంచేతా రెండూ ఒత్తక్షరాలే (మహాప్రాణాలే) అవడంచేతా పరస్పరం "ఖ" కారానికి మారు "ఘ" కారం "ఘ" కారానికి మారు "ఖ" కారం తారుమారు కావడం ప్రారంభించాయి - కాబట్టే వ్యవహారంలో "మఖ, పరిఖ, వైశాఖ, శిఖండి" మొదలైన "ఖ" కారాలుగల పదాలు "మఘ, పరిఘ, వైశాఘ, శిఘండి" మొదలైన "ఘ" కారాలు కలవిగా మారిపోయాయి - ఈ విధంగా ఖకారానికి మారు ఘకారాన్ని వ్యవహరించడమనేది పూర్వ కాలంలో పండిత కవుల్లోనే అలవాటుగా వుండేది. తాళపత్ర ప్రతులు తిరగవేస్తుంటే యీ విధంగా తారుమారైన వ్రాతలు వందలు వేలు కన్పడతాయి.

అసలు "మఖ" శబ్దానికి యజ్ఞము అని అర్థంగదా! ఈ మఖ శబ్దంమీద వచ్చిందే "మాఖవుఁడు" (ఇంద్రుడు అని అర్థం) అనే శబ్దం - ఇందులోవున్న "ఖ" కారంకూడా "ఘ" కారంగా మారి "మాఘవుఁడు" అనే ఘకార రూపంసైతం ప్రామాణికమే అయ్యింది. శబ్దరత్నాకర కర్త "మఘవుఁడు - సం. వి. న్. పుం - పై - (మఖవుఁడు అనియు)" అని మఘవుఁడు అనే దానికి మఖవుఁడు అని రూపాంతరంగా పేర్కొన్నాడు. దీనికి పైన "మఘవంతుఁడు. సం. వి. న్. పుం. ఇంద్రుఁడు, వేల్పుఱేఁడు. (మఖవంతుఁడు అనియు)" అనికూడా పేర్కొన్నాడు - శబ్దరత్నాకర కర్త "మఘవుఁడు, మఘవంతుఁడు" అనే వాటికి "మఖవుఁడు, మఖవంతుఁడు" అనేవి రూపాంతరాలుగా పేర్కొన్నాడు గాని అదిసరికాదు. వాస్తవానికి "మఖ" శబ్దం మీద సిద్ధించిన "మఖవుఁడు, మఖవంతుడు" అనే రూపాలమీద (ఖకారం వుచ్చారణలో ఘకారంగా మారి ప్రామాణికత్వాన్ని పొందడంచేత) "మఘవుఁడు, మఘవంతుఁడు" అనే ఘకారరూపాలు సిద్ధించాయి - గణపవరపు వెంకటకవి ముందు వుదాహరించబోయే సీసపాదాల్లో "మఘవ" అని ఘకార రూపాన్ని మాత్రమే పేర్కొన్నాడు గాని "మఖవ" అనే ఖకార రూపాన్ని అసలు పేర్కొననేలేదు. అంటే అసలు మొదటిది "మఖవ" శబ్దమన్న సంగతి వెంకటకవి దృష్టిలో లేనేలేదన్న మాట -

కేవలం పామరులే కాదు పండితులు అనేకమంది పూర్వ కాలంనుంచీ కూడా "మాఖమాసము" అని వ్యవహరిస్తున్నారు - వాస్తవానికి "మాఘమాసము" అని

ఘకారంతోనే వ్యవహరించాలి. ఏమంటే మనకున్న "చైత్రం, వైశాఖం" మొదలైన మాసాలన్నీ ఒక్కొక నక్షత్రాన్ని పురస్కరించుకొని వచ్చినవే కాని వేరుకాదు. చిత్తా నక్షత్రం మీద వచ్చింది చైత్రం, విశాఖా నక్షత్రం మీద వచ్చింది వైశాఖం, జ్యేష్ఠా నక్షత్రంమీద వచ్చింది జ్యేష్ఠం - ఇలాగే శ్రవణ నక్షత్రం మీద శ్రావణం - కృత్తికానక్షత్రం మీద కార్తీకం, మృగశీర్షా నక్షత్రంమీద మార్గశిరం, పుష్యమీ నక్షత్రంమీద పౌష్యం (పుష్యమాసం) ఫల్గునీ నక్షత్రం మీద ఫాల్గునం వచ్చాయి. ఇలాగే "మఘా" నక్షత్రంమీద "మాఘ" మాసమే అవుతుందిగాని "మాఖ" మాసంకాదు- అసలు శబ్దం "మఘ" అని "ఘ" కారం కలదే గాని "మఖ" అని "ఖ" కారం కలదికాదుగా - "మఖ" అని ఖకార రూపం వుంటేనే కాని "మాఖం" కాదే అటువంటప్పుడు "మాఖ" మాసంగా మనపండితులు వ్యవహరించడం వ్యావహారికాన్ని చేపట్టడం కాకమరేమవుతుంది? ఇది జన వ్యవహారంలో ఉచ్చారణలో "ఘ" కారం "ఖ" కారంగా మారడంవల్ల సిద్ధించిందే కాని వేరుకాదు.

ఇదే విధంగా "అమోఘ, లఘిమ" మొదలైన "ఘ" కారాలు గల పదాలను "అమోఖ, లఖిమ" మొదలైన "ఖ" కారాలు గల పదాలుగా వ్రాస్తూండేవారు. కాబట్టే గణపవరపు వెంకటకవి ఖకారాలు గల పదాలనూ, ఘకారాలు గల పదాలనూ పేర్కొంటూ ఖకారస్థానంలో ఘకారం వ్రాయ

కూడదనీ, ఘకారస్థానంలో ఖకారం వ్రాయకూడదనీ అభిప్రాయపడి యీ క్రింది సీసపాదాలు రచియించాడు-

సీ॥ వహివిూఱ నింకఁ గవర్గ ద్వితీయ ఖ
కారము లీపయిఁ గలుగు పేర్లు
పుంఖాను పుంఖలాఖ్యాసంఖ
రింఖద సంఖ్యాక శృంఖల లన
దాక్ఖంజన ఖురళీనాఖ్ఖద లేఖక
సఖ్ఖలన విశిఖ మయూఖ్ఖ లనఁగ
సఖివిశిఖా శిలీముఖ సుఖరవిశాఖ
ఖండ దుఃఖనఖ తత్ఖ్కారములనఁ
ప్రేంఖచ్ఛిలీముఖ కంఖాణ ముఖఖగ
ఖరఖుర ఖండాఖు ఖడ్గము లన
ఖల ఖేదఖన్యోలూఖల మేఖలాఖగ
ఖాతఖలీనాతి ఖట్వములన
శేఖర వైశాఖ శిఖర సఖిశిఖి
శిఖిశిఖండక శతమఖములనఁగ
ఖాదిరాఖేటక ఖస్జాఖసూచి ప్ర
ముఖ ఖచిత ఖలవిూన ఖరము లన
తో నింక వర్గచతుర్థ ఘకారము
లై తగునీపయి నాహ్వయములు
ఘంటాఘనాఘన ఘ్రూణఘాతుకఘన
ఘుంకార ఘృణిఘోర ఘృష్టులనఁగ
నోఘాఘఘర్మ నిదాఘ లంఘన మాఘ
లఘిమజంఘాలార్ఘ్య విఘటిక లన
నిఘ్నిత సంఘాత దీర్ఘజం ఘామోఘ
సరఘా మఘవమఘి పరిఘము లన

ద్రాఘిష్ఠ ఘూర్ణిత శ్లాఘా ప్రఘోషౌఘ
జఘన ప్రఘణమే ఘజంఘిక లన

రాఘువ ఘస్మర లాఘువానఘు పరి
ఘా మాఘ్యఘోణీశ ఘాసము లన
అఘస్య నిరాఘాట ఘస్య దార్ఘ్యఘాట
ఘాటనాఘాటా సంఘ ఘటములనగ
ఘోటక ఘంటికా ఘోణ ఘనసంఘాతము
ఘూటన ఘు ఘటం ఘణలనంగ

(ఆంధ్ర - కౌ - 32, 33పుటలు.)

"ఖ"కారస్థానంలో "ఘ"కారాన్ని వ్యవహరించరాదనీ "ఘ"కారస్థానంలో "ఖ"కారాన్ని వ్యవహరించరాదనీ ఖకారాలుగల పదాలనూ "ఘ"కారాలు గల పదాలను విభజించి చూపదలచి నిర్దుష్ట పదాలను ప్రతిపాదించ దలచిన వెంకటకవే యిక్కడ తారుమారుగా వ్యవహరించాడు - "పరిఖ" అనేది కవర్గ చతుర్థవర్ణం కల శబ్దంకాదు. అటువంటప్పుడు ఘకారాలున్న పదాలలో "పరిఖ"ను "పరిఘ"గా శబ్దవివేకాన్ని కలిగించదలచిన వెంకటకవే ప్రయోగిస్తే యింక యితర పండిత కవులమాట సామాన్యులమాట ఏం చెప్పాలి ? ఆ సీసపాదాల్లోనే వెంకటకవి "పరిఖ" అని "ఖ"కారం కలదిగా గ్రహించవలసిన పదాన్ని "పరిఘ" అని "ఘ"కారం కలదిగా పరిగ్రహించాడు - వెంకటకవి యిక్కడ "పరిఖ" అనే ఖకార పదాన్ని ప్రమాదవశాన "ఘ"కారపదంగా పరిగ్రహించలేదనీ "ఒక గ్రహయోగము, ఇనుపకట్లగుదియ, బాణము, గడియమ్రాను, కోటగవను, గాజుకుండ, కుండ, దెబ్బ" (చూ-శబ్దరత్నాకరం) అనే అర్థాలుకల "పరిఘ" అనే "ఘ"కారంకల పదాన్నే పరిగ్రహించాడనీ యెవరైనా ఆక్షేపించవచ్చు - కాని వెంకటకవి ఆ అర్థాంతరాలుగల "పరిఘ" అనే "ఘ" కారంకల పదాన్ని

కూడా పైసీస పాదాల్లోనే "మఘవమఘి పరిఘములన" అని ప్రత్యేకంగా పరిగ్రహించాడు కాబట్టి ఆ ఆక్షేపానికి అవకాశం లేదు - అసలు "పరిఖ" సంస్కృతంలో ఆదంత స్త్రీలింగపదం- "పరిఘ" అదంత పుంలింగం - కాబట్టి వేంకటకవి "రాఘవ ఘుస్మర లాఘువాసఘు పరిఘామూఘ్య"అనే పాదంలో "పరిఖ" శబ్దాన్ని "పరిఘ"గా గ్రహించాడనడం సుస్పష్టం.

"ఙ" కారానికి స్థానం కంఠం - "గ" కారానికికూడా స్థానం కంఠమే. అయితే "ఙ" కారానికి నాసిక కూడా స్థానం- ఈ "ఙ, గ" కారాలకు రెండింటికీ సంవారనాద ఘోషాలే బాహ్య ప్రయత్నాలు. కంఠంలో నుంచి సంవారనాద ఘోష ప్రయత్నాలతో ఉచ్చరింపబడే అనునాసిక అయిన "ఙ" కారాన్ని వుచ్చరించడం కంటే "గ" కారాన్ని వుచ్చరించడం బహు తేలిక - కాబట్టి "శార్ఙ్గము" అన్నప్పుడు "ఙ" కార స్థానాన్ని అనునాసికంగా వుండే గకారం ఆక్రమించింది. వ్యవహారంలో "ర్ఙ్గ" అన్నప్పుడున్న రకార ఙకార గకారాలను మూడింటినీ మనం వుచ్చరించం - మనమేకాదు మన పూర్వులూ వుచ్చరించలేదు. అక్కడవున్న "ఙ" కారానికి కూడా అనునాసికంగా వుండే "గ" కారాన్ని చేసుకుంటాము- అయితే అప్పుడు "శార్ఙ్గము" అనేది శార్గ్గము" గా మారుతుంది. అస్యహాల్ సంయుక్తంలో ద్విరుక్తమైన అక్షరం ఉచ్చారణలో నిలబడదు కాబట్టి ఒక గకారం దానంతటదే లోపిస్తుంది. అప్పుడు "శార్గము" అవుతుంది. అయితే ఈ

"శార్ఙ్గము" లో వున్న "ర్గ" కారాన్ని "వర్గ" శబ్దంలోవున్న "ర్గ" కారం లాగా వుచ్చరించం - "శార్ఙ్గము" అన్నప్పుడున్న "గ" కారం "జ" కారానికి మారుగా వచ్చింది కాబట్టి స్థాన బలంచేత ఆ "జ" కార స్థానంలో వచ్చిన "గ" కారాన్ని అనునాసికంగా వుచ్చరిస్తాము. దీనికి మన తెలుగులో (అను నాసినమైన గకారానికి) ప్రత్యేకమైన లిపిలేదు. కాబట్టే అను నాసిక చిహ్నంగా "." అనేగుర్తు గకారం ప్రక్కన వుంచ బడింది. ఈ విధంగా "శార్ఙ్గము" అనే దాంట్లోవున్న "ఙ" కారానికి అను నాసిక మైన "గ" కారోచ్చారణ రావడమ నేది ఎప్పుడో క్రీ॥ శ॥ 17వ శతాబ్దానికి పూర్వమే జరిగింది. కాబట్టే క్రీ॥శ॥ 1600 ప్రాంతంలోవున్న దామెర వెంగళ భూపా లుడు తన బహుళాశ్వచరిత్రలో "శార్ఙ్గము" లో వున్న "ఙ్గ" కారాన్ని మామూలు "ర్గ" కారాన్ని సమానంగా భావించి ఈ క్రింది పద్యంలో ప్రాసను వుపయోగించాడు.

శా॥ శార్ఙ్గంబేమురు వంచు వంచుకొను చం
చద్విభ్రమ భ్రూలతల్
జార్గొప్పుం గొరకొప్పు చొప్పడరు న
ల్లం జిల్వ చెల్వంబు నూ
గార్గోముల్ వలికమ్మవా తెఱల తీ
యంబోండ్లు, మేలూరు బిం
దూర్గాయల్ జనపజ్ఞ భోజనములం
దొప్పార నర్పింపఁగన్॥

(బహుళాశ్వ చరిత్ర - 4ఆ - 53ప.)

ఇందులో సెంగళభూపాలుడు శార్ఙ్గము అనేదాన్ని "శార్గ్గము" అనేదిగా ప్రయోగించి ప్రాస సరిపెట్టుకొన్నాడన్నమాట.

ౘ్ - ౙ్

మన తెలుగులో అసలు తాలవ్యమైన అకార స్వరసమ్మిళితమైన చ్, జ్ అనే హల్లులు లేనేలేవు - ఇక్కడ అకారం అనడంచేత అఆలు రెండూ గ్రాహ్యాలే. అంటే తెలుగులో చ, చా, జ, జా అనే తాలవ్యాక్షరాలు లేవన్నమాట. అయితే ఆ విధంగా అకార ఆకారాలతో సమ్మిళితమైన చ్, జ్ అనే హల్లులు తెలుగులో దంత్యాలవుతాయి. ఈ దంత్యత్వానికి చిహ్నం తెలుగు లిపిలో "‿" అనేది పైభాగంలో వుండడమే. అయితే తెలుగులో దంత్యాలైన (అఆ అనే స్వరాలు కల) చ్, జ్ అనే హల్లుల్ని వ్రాయాలంటే ౘ, ౘా, ౙ, ౙా అనే వ్రాయాలన్నమాట. అయితే చిన్నయ సూరి తన బాల వ్యాకరణంలో "తెనుఁగునకువర్ణములు ముప్పదియాఱు" (సంజ్ఞ-3సూ.) అని తెలుగు భాషకు వర్ణాలు చెప్తూ "క గ చ ౘ జ ౙ" అని ౘ ౙ లతోపాటు "చజ" లను కూడా పేర్కొన్నాడు. ఇక్కడ "ౘ, ౙ" అనేవి దంత్యాలని "చ, జ" అనేవి తాలవ్యాలనీ చిన్నయ అభిప్రాయం - అసలు తెలుగులో "చ, జ" అనే అకార స్వరసహితమైన "చ్, జ్" అనే హల్లులు లేనేలేవుగదా! "చ, జ" అని చిన్నయ ఎలా వుదాహరించాడు?

చిన్నయ పేర్కొన్న "క, గ, చ, ౘ, జ ౙ" మొదలైన హల్లుల్లో వున్న అకారం ఉచ్చారణ సౌలభ్యం కోసమైతే పెట్టబడింది. కాబట్టి "చ, జ"లు వుండవచ్చు అని ఎవరైనా అనవచ్చు - తెలుగు అనేసరికి సహజమైన అకారమే వుండనివ్వండి, ఉచ్చారణ సౌలభ్యం కోసమయ్యే వచ్చివుండనివ్వండి ఎలా వచ్చినప్పటికీ అకారంకల చ్, జ్ అనే హల్లులు "ౘ, ౙ" అనే దంత్యాలుగా వుంటాయేగాని "చ, జ" అని తాలవ్యాలుగా యెప్పుడూ వుండవు. ఆ విధంగా దంత్యత్వం లేని "చ, జ"లే వుంటే అవి తెలుగు వర్ణాలు కానేకావు. సంస్కృత వర్ణాలో ప్రాకృత వర్ణాలో అయివుంటాయి. తెలుగులో అసలు "చ, జ"అనే తాలవ్యాలు లేనేలేవుగదా!-"అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔ లం గూడిన చజలు దంత్యములు" (బాల - సంజ్ఞ - 9సూ.) అని స్పష్టంగా "అ"కారంతో కూడిన "చ్ జ్" అనే హల్లులు దంత్యాలనే పేర్కొంటూ తెలుగువర్ణాల్లో "చ, జ"అనేవాటిని ఎలా పేర్కొన్నాడు? వుచ్చారణార్థం అకారంవచ్చినాసరే అవి "ౘ, ౙ" లుగా వుంటాయేగాని తెలుగులో "చ, జ" లుగా వుండనే వుండవు.

వాస్తవానికి ఈ "చ్, జ్" అనే వాటిని తెలుగులో నాలుగు వర్ణాలుగా "చ, ౘ, జ, ౙ" అని అసలు పరిగణించాల్సిన అవసరం ఏ మాత్రమూ కన్పడదు. తెలుగుతాలవ్యమైన "చ్ జ్" అనే హల్లుల్ని చూద్దామా అంటే వాటిల్లో ఇ ఈ ఎ ఏలు తప్ప మరొక స్వరంవుండదు- అంటే

తాలవ్యాలైన "చ్ జ్" అనేవాటిలో అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔ, అనే యితర స్వరాలకు అసలు సంబంధమే లేదన్న మాట.

అదేవిధంగా తెలుగు దంత్యమైన "ౘ్, ౙ్" అనే హల్లులను చూద్దామా అంటే వాటిల్లో అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔలు తప్ప మరొకస్వరం వుండదు. అంటే దంత్యాలైన ౘ్ ౙ్ అనే వాటికి ఇ, ఈ, ఎ, ఏ అనే యితర స్వరాలకు అసలు సంబంధమే లేదన్న మాట - హల్లులన్ని తర్వాత ఏ హల్లు కైనా ప్రతిస్వరమూ కనీసం గుణింతంలోనైనా వుండితీరాలి క, కా, కి, కీ, కు, కే, కై, కొ, కో, కౌ అనే విధంగానే తాలవ్యాలైన "చ్ జ్" అనే వాటికి గాని దంత్యాలైన "ౘ్ ౙ్" అనే వాటికి గాని సంపూర్ణమైన గుణింతం లేనేలేదు- ఇ, ఈ, ఎ,ఏ లతో కూడిన "చ్ జ్" అనేవి తాలవ్యాలు గాను అఆ ఉ,ఊ,ఒ,ఓ,ఔ లతో కూడిన "చ్ జ్" అనేవి దంత్యాలుగాను తయారవుతాయి. తాలవ్యాలైన "చ్ జ్" అనే హల్లులకు దంత్యాలైన "ౘ్ ౙ్" హల్లులకు సంపూర్ణమైన గుణింతం లేదన్న మాట - ఆ రెండింటినీ కలుపుకుంటేనే గాని ఒక విధంగా సంపూర్ణత్వంరాదు - ఈ అసంపూర్ణమైన గుణింతం గల "చ్ జ్"అనే హల్లుల్ని నాలుగక్షరాలుగా(దంత్య తాలవ్యాలకు పృథక్పరిగణనచేసి) పరిగణించాల్సిన అవసరం ఏమే మున్నది? హాయిగా ఆ నాలుగింటికీ మారుగా రెండింటినే పేర్కొని ఆ "చ్ జ్" అనేవి అ,ఆ,ఉ,ఊ,ఒ, ఓ, ఔ లతో.

కూడినప్పుడు దంత్యాలుగాను; ఇ,ఈ,ఎ,ఏ లు† తో కూడినప్పుడు తాలవ్యాలుగాను వుచ్చరించ బడతాయని పేర్కొని వుంటే ఎంత బాగుండేది! స్పష్టంగా "ౘ ౘా చి చీ ౘు ౘూ చె చే చై ౘొ ౘో ౘౌ" అని చక్కగా గుణింతమంతా వ్రాసుకోడానికి అవకాశం లభించేదిగదా! ఆ విధంగా చ, ౘ, జ, ౙ అని నాలు గక్షరాలుగా పరిగణించడంవల్ల వచ్చే నష్టం కూడా లేకపోలేదు - తాలవ్యాలైన "చ్, జ్" హల్లులను పృథగక్షరాలుగా మనం యీనాడు వర్ణమాలలో పేర్కొనడంచేత కొన్ని ఎలిమెంటరీ పాఠశాలల్లో జరిగే దేమిటో గమనించారా? తాలవ్యాలైన "చ్ జ్"ల గుణింతం వచ్చేసరికి "చ, చా, చి, చీ, చె, చే, చై, చొ, చో చౌ - జ, జా, జి, జీ, జె, జే, జై, జొ, జో, జౌ" అనీ - దంత్యాలైన "చ్ జ్"ల గుణింతం వచ్చేసరికి ౘ, ౘా, ౘి, ౘీ, ౘు, ౘూ, ౘె, ౘే, ౘై, ౘొ, ౘో, ౘౌ, ౙ, ౙా, ౙి, ౙీ, ౙు, ౙూ, ౙె, ౙే, ౙై, ౙొ, ౙో, ౙౌ, - అనీ నేర్పడం జరుగుతున్నది. తాలవ్యాలైన సర్వస్వర గుణింతంగల "చ్ జ్"లు తెలుగులో లేనివి సంస్కృతాక్షరాలుగానైనా చెలామ

---

† ఐ కారంతో కూడిన 'చ్ జ్' అనే హల్లులుగల పదాలు తెలుగులో లేవు. "చయివుల" అనడానికి "ౘైవుల" అని వొక ప్రయోగం వున్నది. కాని ఐకారంలో "అ" కార 'య్' కారాల వుచ్చారణ వుండడంచేత ('అ' కారం దంత్యం - 'య్' కారం తాలవ్యం కాబట్టి) ఐ కారాన్ని వుభయంగా - అంటే - దంత్యతాలవ్యోచ్చారణాలు రెండూ గలదిగా పరిగణించాల్సి వుంటుంది.

ణీఅయ్యేఅవకాశంవున్నదిగానిదంత్యాలైనసర్వస్వరగుణింతంగల "చ్, జ్"లు ఏ అక్షరాలుగా చెలామణీ అవుతాయి ? అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔలతో కూడిన "చ్, జ్" లు తెలుగులో వున్నాయి కాబట్టి తెలుగక్షరాలుగా చెలామణీ అవుతాయి - మరి ఇ, ఈ, ఎ, ఏలుగల "చ్, జ్,"లు ఏ అక్షరాలుగా చెలామణీ అవుతాయి ? వాటిని నేర్పడంవల్ల వచ్చే ప్రయోజనమేమిటి? అందుకే సర్వస్వర సంపూర్ణమైన గుణింతం లేని "చ్ జ్" అనే హల్లుల్ని "చ్, చ్, జ్, జ్" అని నాలుగు హల్లులుగా పరిగణించడంలో అర్థం పర్థం లేదనవచ్చు ! ఆ "చ్ జ్"లను రెండక్షరాలుగానే (చ్ ఒకటి జ్ ఒకటి) పరిగణించి స్వరస్థితిని బట్టి దంత్యతాలవ్యత్వాలను విధించుకుంటే ఏ చిక్కూ లేకుండా గుణింతమూ సంపూర్ణత్వాన్ని పొందుతుంది, దంత్యతాలవ్యాలభిన్నత్వమూ తెలుస్తుంది, రెండు హల్లులు తగ్గినట్లూ అవుతుంది. ఇంత సులభమైన మార్గం "చ్ జ్"ల విషయమై కనపడుతుంటే ప్రాచీన కాలంనుంచీ కూడా † వాటికి నాలుగక్షరాలుగా పరిగణించే యోగ్యత యెందుకిచ్చారో బోధపడదు-

చె - జె అనే అక్షరాల్లో వున్న 'ఎ' కారంకంఠ్యం. అకారం కూడా కంఠ్యమే - కాబట్టి ఈ స్థాన మిత్రత్వాన్ని పురస్కరించుకుని ఉచ్చారణలో చె - జె - లలో ఎకారానికి

† అనంతాదుల కూడా చ్, ఛ్, జ్, ఝ్లను ప్రత్యేక వర్ణాలుగానే పరిగణించారు-

మారు అకారం రావడం జరుగుతుంది. అంటే — జనవ్యవహా రంలో చెక్క, చెంప, చెట్టు, చెద, చెమ్మ, చెలి, జెట్టి, జెముడు, జెల, జెట్టి ముదలైన చకార జకారాలు గల పదాలు చక్క, చంప, చట్టు, చద, చమ్మ, చలి, జట్టి, జముడు, జల, జట్టి ముదలైన తాలవ్యాలైన (దంత్యాలైన చ జలుగా కావన్న మాట —) చ, జలు కలవిగా మారడం జరుగుతుందన్న మాట— ఈవిధంగా చెక్క, చెంప, జెముడు, ముదలైన పదాలలో వున్న చకార జకారాలు తాలవ్యాలైన చకార జకారాలుగా జన వ్యవహార వశాన మారడమూ కవి పండితుల వ్రాతల్లో కూడా ఆమార్పు వ్రాతలే ప్రవేశించడమూ చాలా ప్రాచీన కాలం లోనే జరిగింది. ఈ విధంగా చెక్క జెల ముదలైన పదాలను "చక్క, జల" ముదలైనవిగా చకార జకారాలుకలవిగా వ్రాయడ మనేది ఆంధ్రశబ్ద చింతామణి కర్త కాలంలో పండిత కవుల్లో సైతం వున్నది. కాబట్టే ఆతడు "అద్దంత్యస్తాలవ్యశ్చుర్వ్య క్రస్యాన్మిథస్సవర్ణౌశ్చ" ‡ అనే సూత్రాన్ని సృష్టించుకోవలసి వచ్చింది. ఈ "అద్దంత్యస్తాలవ్య" ఇత్యాది సూత్రం పూర్వం చర్చించబడ్డ "అద్వ్యక్రియాసు భూతార్థ" ఇత్యాది సూత్రం వంటిది. అద్వ్యక్రియా స్విత్యాది ఆ సూత్రం ఎటువంటి ప్రయోజనాన్నపేక్షించి వ్రాయబడిందో ఈ "అద్దంత్యస్తా

---

‡ చిన్నయ రచించిన దంత్యతాలవ్య విషయిక సూత్రాలకూ ఈ చింతామణి సూత్రానికి ఏ విధంగానూ సంబంధంలేదు. మిథస్సవర్ణౌశ్చ — అనే దానికీ చిన్నయ రచించిన "దంత్య తాలవ్యంబులైన చ జ లు సవర్ణం బులు" అనే దానికి మాత్రం సంబంధమున్నది.

లవ్య” ఇత్యాది సూత్రం కూడా అటువంటి ప్రయోజనాన్ని అపేక్షించి వ్రాయబడిందే - దంత్యాశ్చుః=దంత్యమైన చవర్గం, అత్=అకారం కలది - తాలవ్యాః చుః=తాలవ్యమైన చవర్గం, వక్రః=ఎత్వం కలది. స్యాత్=అగును - అని దాని అర్థం - ఇందులో “చుః” అనడంచేత “అ” కారంతోపాటు “ఆ” కారంకూడా గ్రాహ్యమే - దంత్యాలైన చ జ లపైన అకారం వుంటుందన్నారు కాబట్టి చాప చుక్క, చూపు, చొక్క, చోపు, చౌక, జాతర, జున్ను, జూలు, జొన్న, జొర్రి, జోకు, వంటి చోట్లవున్న చజలుదంత్యాలుకావేమో అని సందేహించ కూడదు - అదేవిధంగా తాలవ్య చవర్గం ఎత్వంకలది అవుతుం దన్నారు కాబట్టి చిలుక, చీమ, జిల, జీడి మొదలైనవాటిల్లో చజలు తాలవ్యాలు కావేమో అని కూడా సందేహించకూడదు. దంత్యచవర్గం అకారం కలదనీ, తాలవ్యచవర్గం ఎకారం కలదనీ చెప్పడంలో యిక్కడ సూత్రకర్త ఆంతర్యంవేరు. చెక్క, చెమ్మ, జెముడు, జెల మొదలైన పదాల్లో చెకారాలే వ్రాయాలనీ, చక్క, చమ్మ, జముడు‡, జల మొదలైనవిగా వ్రాయరాదనీ ఆ విధంగా వ్రాస్తేయితే ఆ చక్క, చమ్మ, జముడు, జల, మొదలైన వాటిల్లో చకార జకారాలు దంత్యాలు కావలసి వస్తుందనీ ఆ సూత్రకర్త అభిప్రాయం - మనం వ్యవహారంలో చెక్క, జెల, మొదలైన పదాలను

---

‡ ఇది యజుశ్శబ్దభవంకాదు. యజుశ్శబ్దభవమైన జముడులో జకారం నిశ్శంకగా దంత్యం - వ్యాకరణాల్లో జముడుగా గ్రహించబడి ఉదాహరింపబడ్డ “జెముడు” శబ్దం వృక్షవాచకం —

చక్క,జల మొదలైనవిగా అత్వవిశిష్ట చజలు కలవిగానే వ్రాస్తు న్నప్పటికీ వాటిని తాలవ్యాలుగా వుచ్చరిస్తామేగాని దంత్యా లుగా వుచ్చరించం - తెలుగు పదాలలో చజలను అత్వ విశి ష్టాలుగా వ్రాసుకుంటూ తాలవ్యాలుగా వుచ్చరించ కూడదనీ ఆ పదాలు వాస్తవానికి చెకార జెకారాలు గల పదాలు కాబట్టి ఆ విధంగానే వ్రాసుకొని తాలవ్యంగా వుచ్చరించడం సమంజసమనీ అభిప్రాయపడి "అద్ద స్త్యాస్తాలవ్య" ఇత్యాది సూత్రాన్ని రచించాడు - ఈసూత్రంలో ఆతనికున్న "చెమ్మ, జెల" మొదలైన వాటిని "చమ్మ,జల" మొదలైనవిగా వ్రాయ కూడదనే అభిప్రాయాన్ని సాకల్యంగా వ్యక్తీకరించ లేక పోయాడు - సందర్భాన్ని బట్టి ప్రయోజనాన్ని బట్టి వక్రశబ్దం చేత ఎకారాన్నే మనం గహిస్తున్నాం కాని వాస్తవానికి అక్కడ వక్రశబ్దం ప్రయుక్తం కాకూడదు - స్పష్టంగా ఎత్వ మనే ప్రయుక్తమవ్వాలి. † ఆంధ్ర శబ్దచింతామణికి వ్యాఖ్యా నం వ్రాసిన ప్రాచీన వాఖ్యాతలందరూ ఒక్క అప్పకవి మినహా యీసూత్ర నిర్మాణంలోవున్న ఆంతర్యాన్ని గ్రహించకుండానే వ్యాఖ్యానాలు వ్రాసారు - ఈ క్రింది బాలసరస్వత్యాదుల వ్యాఖ్యానాలు పరికించండి.

—"దంత్యాః = దంత్యమైన, చుః = చవర్గువు, అత్ = అకారము,తాలవ్యాః= తాలవ్యమైన చుః= చవర్గువు, వక్రః = ఎకారము, స్యాత్ = అగును - మిథస్సవర్ణశ్చ = దంత్య

† ఈ సూత్రకర్త నన్నయ్యభట్టే అయివుంటే దాన్ని ఇంత అసం పూర్ణంగాను అసమర్థంగాను రచిస్తాడనుకోవడం హాస్యాస్పదం-

తాలవ్యములు రెండును బరస్పరము సవర్ణములు - చందురుఁడు, చక్కెర, జంట, జాణ, మొదలైన చోటులలోని దంత్యములు తలకట్టు గలవి. చెన్ను, చెలువ, జెట్టి, జెట్టి మొదలైన శబ్దములలోని తాలవ్యము లెత్వములు గలవనుట - ఇందులకు దాహరణము.

ఆ॥ వె॥ చక్కఁదనము లోకజయవైభవము వల
రాచవారు వడసి రాచరించి
చెలువ నద్రికన్య సేవించువారికే
జాడనైనఁ గననసాధ్యమెద్ద

(బాల - స. 157 పుట.)

— "దంత్యశ్చవర్గః అత్ అకారవాన్ భవతి. సఏవతాలవ్యస్సన్నేకారవాన్స్యాత్. చవి, చముకు, చెవి, చెమట ఇత్యాది. సకార చవర్గావపిదే తౌదంత్యావేవేతి కేచిత్ † దంత్యశ్చస్సచాద్య భాషా తాలవ్యస్యచ అన్యోన్యం యతిప్రాసయోస్సావర్ణ్యం భవతి. జలజనేత్రుని గొల్తురు జడలవారు.

(వాసుదేవవృత్తి. నావద్దనున్న తాళపత్రప్రతి 3 వ పత్రం - 1 వైపు. 4, 5 పంక్తులు.)

---

† ఈ "సకార చవర్గావపిదే తౌదంత్యావేవేతి కేచిత్" అనేవాక్యం శ - స అనే విభాగంలో ముందు చర్చింపబడ్తుంది. ఈ వాక్యాన్ని దీని రచనలోని ఆంతర్యాన్ని అహోబలుడు గమనించలేదు. కాబట్టే వాసుదేవుని వ్యాఖ్యననుసరించి రచించుకున్న తన వ్యాఖ్యలో దీని విషయం యెత్తలేకపోయాడు.

– " అత్రవికృతే దంత్యశ్చుశ్చవర్గః అత్ అకారవాన్ భవతి. చవి, గముడు, చాన, చప్పుడు ఇత్యాది. తాలవ్య శ్చుశ్చవర్గః అత్రవక్రస్స్యాత్. ఏకారవాన్ భవతి. చెవి, జేగురు, చెమట, చెలువు ఇత్యాది. చురిత్యస్య సవర్గ సంజ్ఞా త్వం. అణుదిత్సవర్ణస్య చాప్రత్యయః ఇత్యస్య వ్యాకరణసిద్ధం. మిథస్సవర్ణశ్చ – అత్రిశ్లోక్య దంత్యశ్చు రాద్యాయాం తాలవ్య శ్చుశ్చ భవేత్. చదలేటి బంగారు పలుకుహంబులు తూంగ్చు భోజనంబులుమాకుఁ పూపుఁబోఁడి ఇత్యాదిక సుప్రోదాహ రణం. వక్రచవర్గస్యతు సంస్కృత సవర్గేణ దంత్యసవర్గేణ చ ప్రాసమైత్రీ మాత్రమస్తి. ప్రాసస్య ... పేక్షాయా అభా వాదితి జ్ఞేయం –" (అహో – సం– 142 పుట)

*ఈ వ్యాఖ్యాత ఇవ్వాయాకుండా సరాసరిగా చెవి, చెమట, జెల్లె, జెట్టి మొదలైనవాటిల్లో "చ" కార "జ" కారాలు వ్రాసి "చవి, చమట, జల్లె, జెట్టి" మొదలైనవిగా వ్రాసుకోనరాదన్న విషయం స్పష్టపరచలేకపోయాడు. ఈ సూత్రం ఆంతర్యాన్ని ఆవశ్యకతను గుర్తించి స్పష్టంగా వ్యాఖ్యానించినవాడు అప్పకవి.

---

* "మిథస్సవర్ణశ్చ" అనే దానికి యతిప్రాసల్లో తాలవ్యదంత్య చ జ లు సవర్ణాలై యతిప్రాసలకు చెల్లుతాయని బాల సరస్వత్యాదులు వ్రాశారు – కేవలం అది పొరపాటు. "అచ్చంత్యస్తాలవ్య" ఇత్యాది సూత్ర రచనలో వున్న ఆంతర్యం తెలిసికోకే వారా విధమైన మిత్రత్వాన్ని పేర్కొన్నారు. వాస్తవానికి ఈ సూత్ర సందర్భంలో దంత్య తాలవ్యాలైన తెలుగు చ జ లకే గ్రాహ్యం కాని సంస్కృత చ జ లకు కాదు. సంస్కృత సమాసాల్లో వుండే చ జ లకు కూడా యిది వర్తించదు గనుక "చంద్రుడు, జనము మొదలైన వాటిల్లోవున్న తాలవ్య చ జ లు కూడా వక్రాలు కలవిగానే

చ జ లు గానే - అంటే - చంద్రుడు, జేయష్టులవలనే వ్రాయాలనే నియమం చెప్పినట్లనిపిస్తుంది. కాబట్టి అప్రాంత్య ఇత్యాది సూత్రంలో సంస్కృత సమ పదాలకు స్థానం లేదన్నమాట - అయినప్పుడు తెలుగులో దంత్యాలైన చ - జ మొదలైన వాటికి సంస్కృత సమాల్లో తాలవ్యాలైన చ జ మొదలైన వాటికి యతి ప్రాసలు చెల్లుతాయనే అభిప్రాయంతో "మిథస్సవర్ణాశ్చ" అనేది స్వీకరింపబడిందనడం పొరపాటు కాదా? అచ్చ తెలుగుకి సంబంధించిన "చేముడు" "జేముడు" ఇత్యాదుల్లో చకార జకారాలకు చెల్లని, సంస్కృతాలు మొదలైన వాట్లల్లో చకార జకారాలకు సంబంధించిన మిత్రత్వాన్ని ఇందులో చెప్పాడనడం నిర్వివాదం - ఇక్కడ దంత్య తాలవ్యాలకు (చ - చ, జ - జలకు) యతి మైత్రివుంటుందన్నాడందామా అది యతి లక్షణాలకే పూర్తిగా విరుద్ధం. అటువటివిషయం చెప్పడం అసంభవం. ఇక ప్రాస అయితే (స్వర మైత్రితో అవసరం లేదు కాబట్టి) చెల్లుతుందనుకోవచ్చు- కాని అసందర్భంగా యిక్కడ అనవసరమైన ప్రాస విషయం చెప్పాల్సిన అవసరం యేమాత్రమూ లేదు. అయితే ఇక్కడ "మిథస్సవర్ణాశ్చ" అనేదిఎందుకు చెప్పాడిందని ప్రశ్న వస్తుంది. సంతోషణి కర్త మామూలుగా పరుష సరళ సంజ్ఞలను విధిస్తూ "కచటతపాః పరుషాఖ్యాః" - "గజడదబాస్తు సరళాః" అని ఏకచకార జకారాలనే గ్రహించాడు-ఈ సందర్భంలో ఒక్క తాలవ్య చ జ లే పరుష సరళాలు కావని దంత్య చ జ లు కూడా పరుష సరళాలేననీ తెలియజెయ్యడానికే ఈ మిథస్సవర్ణత్వాన్ని ప్రతిపాదించాడు. సరళా దేశ ద్రుతాది కార్యాలలో సైతం ఈ దంత్య తాలవ్యాలకు సమాన ప్రతిప్రత్తివున్న దనడానికి కూడా ఈ సవర్ణత్వాన్ని ప్రతిపాదించాడు-వాస్తవం యిలావుండగా శ్రీవఝ్ఝలవారు కూడా తమ సర్వస్వంలో - "దంత్యచకారమునకును దాలవ్య చకారమునకును మైత్రి కల్గును - అట్లే దంత్య జకారమునకును దాలవ్య జకారమునకును మైత్రి కల్గుచుండును - యతి ప్రాసాదులందొకటి కొకటి చెల్లునని తాత్పర్యము" (ఆం - వ్యా - సం - సర్వస్వం - 72పుట.) అని వ్రాయడం సమంజసంగాలేదు. ఇక్కడ సంస్కృత సమపదాలను గ్రహించడానికి అవకాశమే లేదన్న సంగతి వారు గమనించలేదు - చిన్నయ "దంత్యతాలవ్యంబులైన చజలు సవర్ణంబులు" (బాల - సంజ్ఞ -

దానికి వ్యాఖ్యానంగా తన అప్పకవీయం ద్వితీయాశ్వాసంలో ఆతడు రచించిన పద్యాలివి.

ఆ॥ వె॥ ధరణి దంత్యములును దాలవ్యములు నన
వికృతి చజలు రెండువిధములయ్యె
వీనిఁదెలియకున్న విశ్రమభంగంబు
దొడరి కావ్యములను దోషమొదవు ॥ (117 ప.)

ఆ॥ వె॥ దంతజంబులెల్లఁ దలకట్టులును వాని
యందుదీర్ఘములును బొందియుండుఁ
దాలుజాక్షరములు దనరారు హ్రస్వాది
వక్రయుతములగుచు వనజనాభ ॥ (118 ప.)

ఆ॥ వె॥ చలముమాని కుడువు చట్టకేశవప్రోగ్గు
చాలనయ్యెఁ బసివ్రజంబు వెడలె
జతలు గూడివచ్చి సఖులుచీరదరేల
బాగనంగ దంతజంబు లయ్యె ॥ (119 ప.)

ఆ॥ వె॥ చెప్పరాని క్రొవ్వువేఁగంబు పంపునఁ
జెలఁగి కొనుచుఁ దన్నుఁజేరి పెనఁగ
జెట్టిమట్టుఁబెట్టెఁ జిఱుతయేనందుని
పట్టియనఁగఁ దాలుభవములయ్యె ॥ (120 ప.)

ఆ॥ వె॥ చేతఁ జీరలైదు చేరెడు వరహాలు
జేనెఁడంత జిత్తుచేకటొకటి
చేఁదుకొనియెఁ గృష్ణుఁ జేర్చుక యననిట్లు
వఱలుఁ గొన్ని దీర్ఘవక్రలిపులు ॥ (121 ప.)

7సూ.) అనే సూత్రాన్ని ఏ అభిప్రాయంతో ఏ అర్థంలో ఏ అవసరాన్ని గుర్తించి సృష్టించాడో అదే అభిప్రాయంతో అదే అర్థంలో అదే అవసరాన్ని గుర్తించి "మిథస్సవర్ణశ్చ" అనేదాన్ని చింతామణి కర్తసృష్టించాడు. అయితే "అర్ధంత్యస్తాలవ్యశ్చుర్వ క్రస్సాన్యత్" అనే సూత్రానికీ తక్కిన చిన్నయ్య సృష్టించిన దంత్యతాలవ్య చ జ ల సూత్రాలకూ ఏ మాత్రమూ సంబంధంలేదు.

తే॥ గీ॥ దంత్యముల నరవంకలు దైవభాషఁ
గనము తాలవ్యములఁ దలకట్లు లేవు
ప్రాకృతమునందుఁ దద్భవపదములందు
దంత్యములెకాని తాలు జాతములులేవు॥ (122ప.)

వ॥ ....

ఆ॥ వె॥ చందమామ గాయఁజక్కెర విలుకాఁడు
జాజిపువ్వు టంపజల్లుగురియఁ
జామగాక కోర్వఁజాలక హరివచ్చు
దనుక బడలెననఁగ దంత్యచజలు॥ (124ప.)

వ॥ ....

క॥ తొడరు జటాశబ్దమునకు
జడ యనునది తద్భవంబు పదలును జానుం
గడునచ్చ తెలుఁగు లివి పద
పడి మూఁడును దంత్యములుగఁ బలుకఁదగు హరీ! (126ప.)

117 వ పద్యంలో అప్పకవి తెలుగులో చ జ లు దంత్యాలు తాలవ్యాలు అని రెండు రకాలనీ వీటి వస్థుస్థితిని తెల్సుకొని పద ప్రయోగం చెయ్యకపోతే యతి భంగం జరుగుతుందనీ చెప్పాడు. "చెప్పరాని క్రొవ్వుచేఁ గంసు పంపున" అని వ్రాయ వలసినచోట "చెప్ప" అనే దాన్ని "చప్ప" గా వ్రాస్తే అక్కడ యతి భంగంకాక మరేమవుతుంది? అందుకే "చె, చ" అనే వాటిని తెల్సుకుని మరీ వ్యవహరించా లన్నాడు.

మనం యీ నాడు వ్రాతలో "చలము, జడ" మొదలైన పదాలలో "చ, జ" లను వ్రాయడానికి మూరు పై నుండే దంత్య చిహ్నమైన "‿" అనే దాన్ని విడిచిపుచ్చి మామూలు

తాలవ్య "చ, జ" లుగానే వ్రాస్తున్నాము. ఈ విధంగా దంత్య తాచిహ్నాన్ని విడిచిపుచ్చడం కేవలం మనమే కాదు మన పూర్వులు కూడా విడిచిపుచ్చారు – దాన్ని విడిచిపుచ్చడానికి కారణం వ్రాతలో సుఖాన్ని అపేక్షించడమే గాని వేరు కాదు. చకార జకారాల్లో దంత్యతాచిహ్నం వ్రాతలో పోయినా దంత్యతాలవ్య చజల భేదం ఉచ్చారణానుభవంలోనే వుంచుకొనేవారు. అయినప్పటికీ "చలము, జడ" అని దంత్య చిహ్నం లేకపోయేసరికి కొందరు పండితులు ఆ చ జ లను మామూలు "చంద్ర, జల" మొదలైన సంస్కృత పదాలలోవున్న తాలవ్య చ జ ల వలెనే వుచ్చరించేవారు. చలము, జడ మొదలైన వాటిల్లో వున్న దంత్యాలైన చ జ లను తాలవ్యాలుగా ఎప్పుడైతే వుచ్చరించడానికి ప్రారంభించారో అప్పటినుంచే "చెక్క, జెముడు" మొదలైన పదాలలోవున్న "చె, జె" లను "చ, జ" లుగా పూర్వం కొందరు వ్రాసుకొన్నదానికి విపరీతంగా "చలము, జడ" మొదలైన వాటిల్లోవున్న "చ జ" లను "చె, జె" లుగా కూడా వ్రాయడం మొదలు పెట్టారు. అంటే "చలము, జడ" అనేవాటిని "చెలము, జెడ" అనే పద్ధతిలో వ్రాసుకొనే వారన్నమాట. కాబట్టే అప్పకవి దంత్య చ జ ల విషయం కూడా బాగా తెల్సుకోవాలని పేర్కొని 119 వ పద్యాన్ని లక్ష్యంగా యిచ్చాడు – "చలము మానికుడువుచట్ట కేశవ ప్రొద్దు" అనేచోట "చలము" వ్రాయడానికి "చెలము" వ్రాస్తే పూర్వం చెప్పినట్లుగా యతి భంగం కాక మరేమవుతుంది ?

ఈ నాడు వ్రాతలో చ, చా, జ, జా అనే అక్షరాలను దంత్య చిహ్నలతో వ్రాసేవారు లేరనే చెప్పవచ్చు - నా అంతటనేను గూడా యీ గ్రంథంలోనే ప్రత్యేకంగా నిర్దేశించ వలసి నప్పుడు తప్పదంత్య చిహ్నన్ని వాడనేలేదు. నామాటా యితరుల మాటా యెందుకు? ఈనాడు ముద్రణలో దంత్య చ జ లు వ్యాకరణాల్లోనే ప్రత్యేక నిర్దేశంలోనే తప్ప మామూలు ప్రదేశాల్లో వుండడమే లేదు - అనేకాలైన వ్యావహారిక ప్రయోగాలను పండితులచేత దిద్దించి మన ప్రాచీన వాఙ్మయంలోని పెక్కు గ్రంథాలను అచ్చమైన గ్రాంథికంలో అచ్చు వేయించారనే అప్రప్రథగల వావిళ్ళవారే దంత్య చ జ లను ప్రత్యేకావసరం కలిగి నప్పుడు తప్ప అన్ని చోట్లా ముద్రించడం లేదు - మహా శాస్త్రపారంగతులు ఉద్దండ గ్రాంథికవాదులు అయిన శ్రీ వఝ్ఝల చినసీతా రామస్వామిశాస్త్రిగారే తమ వ్యాకరణ గ్రంథరాజాల్లో దంత్య చజలను ఏదో కొన్ని చోట్ల తప్ప అన్ని చోట్లా వుపయోగించలేదు - ఇంక సామాన్యుల విషయమెందుకు ? †

అసలు "జడ, జాజి" వంటి కొన్ని పదాలలో వున్న "జ"కారాలకు దంత్యత్వం ఈ నాడు వ్యవహారంలో పూర్తిగా భ్రష్టమై తాలవ్యోచ్చారణే సహజమైందిగా నిలబడి.

---

† అసలు చ, చా, జ, జా అనే అక్షరాలు ముద్రణలో దొరకడమే లేదు. అవి దొరక్క యీ గ్రంథంలో ఈ చ జ ల భాగంలోనే దంత్యతా చిహ్నంగా పైన తావత్తు పెట్టుకోవలసి వచ్చింది. ఆ విధంగా తావత్తు "ఁ" అనేది చ జ ల పైన పెట్టవలసిరావడంవల్ల ముద్రణలో అందంకూడా పోయింది.

వుంది. "జక్షత్" అనే సంస్కృత పదంలోవున్న జకారాన్ని ఎలా స్వచ్ఛమైన తాలవ్యంగా వుచ్చరిస్తామో అలాగే "జడ" శబ్దంలోవున్న జకారాన్ని కూడా వుచ్చరిస్తున్నాం. "జాగ్రత్త" అనే దాంట్లోవున్న జాకారాన్ని ఎలా స్వచ్ఛమైన తాలవ్యంగా వుచ్చరిస్తున్నామో అలాగే "జాజి" శబ్దంలోవున్న "జా" కారాన్ని కూడా వుచ్చరిస్తున్నాం.

తెలుగులో సహజంగా దంత్యాలైన చజలుగల పదాలే తాలవ్య చజలుగామారి ఆ తాలవ్యచజలు చెజెలుగా ఉచ్చారణలోను వ్రాతలోను మారాయంటే సంస్కృత సమ పదాల్లో సహజంగా తాలవ్యాలైన చజలను చెజెలుగా ఉచ్చరిడం వ్రాయడం జరుగుతుండేదని వేరే చెప్పాలా ? చంద్రుడు మొదలైన పదాలను "చెంద్రుడు" మొదలైనవిగా చెకారాలు కలవిగా మన పూర్వకవి పండితులు వ్రాస్తూండేవారు. ఆ వ్రాతలు చూచిన అప్పకవి చంద్రుడు జయము మొదలైన వాటిని చెంద్రుడు జెంద్రుడు మొదలైనవిగా చెకార జెకారాలు కలవిగా వ్రాయకూడదనే అభిప్రాయాన్ని "దంత్యముల నరవంకలు దైవభాషఁగనము" అని ఒక విధంగా ‡ స్పష్టపరచాడు. అరవంకలంటే హ్రస్వవక్రాలనీ, వక్రిశబ్దభవం వంకర అనీ అప్పకవి వింగడింపు. అటువంటి ఉచ్చారణకు సంబం

---

‡ ఒకవిధంగా స్పష్టపరచాడు అని బుద్ధి పూర్వకంగానే వ్రాసాను. ఇక్కడ అప్పకవి భ్రమ ప్రమాదవశుడయ్యాడు - ఏమంటే "దంత్యముల నరవంకలు" అనకూడదు - సంస్కృతంలో దంత్యాలంటే "ౡ, త, థ, ద, ధ, న, ల, స" అనేవేగాని "చ" "జ"లు కావు. సంస్కృతంలో చజలు తాలవ్యాలేగాని దంత్యాలుకావు - దంత్యముల నరవంకలు దైవభాషఁగనము అనే

ధించిన వ్రాతలు వ్రాయబట్టే మనకు "చెంచు" పదం చెకారం కలదిగా తయారయ్యింది. సంస్కృతంలో "చంచః" అని మొదట పదం. అది తెలుగువారి వుచ్చారణలో "చెంచ"గా మారి వికృతిరూపంగా "చెంచు" తయారయ్యింది. ఈ విధంగా "చెంచు" శబ్దం జనవ్యవహార వశంచేత సంభవించిందనీ అది లక్షణవంతమైన పదం కాదనీ భావించిన అప్పకవి "చెంచు" అని "చె" కారం వ్రాయకూడదనీ "చంచు" అని "చ"కారాన్నే వ్రాయాలనీ యీ క్రింది పద్యాన్ని రచించాడు.

> క॥ భూమి నిఘంటునఁ జంచః
> పామర జాతీయ యనుట పరికించి బుధ
> గ్రామణులు చెంచులని వెసఁ
> దామేత్వం బిడరు వడికిఁ దలకట్టుగుటన్॥

(అప్ప - 2ఆ - 132ప.)

దానిచేత "స"అనే హ్రస్వఎకారంకలసకారం సంస్కృతంలోలేదని చెప్పడమే అతని అభిమత మందామా అంటే యిక్కడ సకార ప్రసక్తి లేనేలేదు. "శ, స" అనే అక్షరాల విషయమై ప్రత్యేకంగా 258,259, 260 సంఖ్యగల పద్యాలను వ్రాయనే వ్రాసాడు. ఇక్కడ చజల సంబంధం తప్ప మరొకటి లేదు. అసలు అప్పకవి యిక్కడ ఒక భ్రమపడ్డాడు. "చంద్రుడు, జయము" ఇత్యాదుల్లో చ, జలు దంత్యాలని పొరపాటుగా భావించాడు. ఆవిధంగా దంత్యాలని భావించకపోతే "దైవభావఁగనము"అని "అరవంకలు"అని ప్రత్యేకంగా సంస్కృత పదాల విషయమే చెప్తూ "దంత్యముల" అని యెందుకు ప్రయోగిస్తాడు - తెలుగులో మామూలుగా తలకట్టువున్న చజలు దంత్యాలు కాబట్టి ఆ అలవాటులో వుండి పొరపాటుగా దైవభావలోకూడా తలకట్టు వున్న చజలు దంత్యాలని భావించాడు. ఇది సరికాదు. కాబట్టే "ఒక విధంగా స్పష్టపరచాడు" అని పైన వ్రాయవలసివచ్చింది.

చంచులు అనే అనాలిగాని "చెంచు"లు అని అనగూడ దట - అసలు అప్పకవి చెప్పినట్లు "చంచు" శబ్దాన్ని యెం లైనా వుపయోగిస్తారా? అటువంటిది జనవ్యవహారంలో వుం టేగా వుపయోగింపబడడానికి ? ఈ క్రింది మహాకవుల ప్రయోగాలు పరికిస్తే వుచ్చారణ వశాత్తు వికృతిరూపన్నై సిద్ధించిన చెంచుశబ్దం ఎంతకాలంగా స్థిరపడి సుశబ్దంగాయెంచ బడుతున్నదో తెలియదూ ?

తే॥ గీ॥ వీని రిపుకాంత పతిఁబాసి కానలోనఁ
జెంచు పూఁబోడులును దానుఁ జెలిమిచేసి
చెప్పుఁ దమదేశ వార్తలు చెప్పుచోటఁ
జల్లనైయుండు మాభూమి చంద్రుఁడంమ॥

(శృం - నై - 5ఆ - 134ప.)

క॥ కంచి ఫలంబులు హరిచే
నించి కరాలంబనముల నెగడుచు నిద్రిం
డించెద రంగన చూడుము
చెంచితలన్ బింఛ పత్రిచేలాంచితలన్

(భాగ - దశమస్కం - పూ.)

సీ॥ పక్కు-పక్కున నంఘ్రిపాశముల్ వెసఁద్రెంచి
డేగతండముల మింటికిని విడిచి
గళగళధ్వనులతోఁ గంఠశృంఖలలూడ్చి
సుడివడఁ గుక్కలనడవిఁ గలిపి
గుప్పుగుప్పున మోచికొనియున్న దలలతోఁ
బలలంపుఁ బొత్తిరల్ పాఱవైచి
కంగుకంగున నేలఁ గైదప్పగాఁబడు
నేఁటమ్ము లేఱకదాఁటిదాఁటి

తే॥ గీ॥ తిరిగిచూచుచు దల్లెఁగఁదీసికొనుచు
దగలుదొట్టి యథాయథలగుచు విఱిగి
యొకఁడుపోయిన త్రోవవేఱొకఁడుపోక
చెట్టొకఁడుగాఁగఁ బఱచిరి చెంచులపుడు॥

(మను - చ - 4ఆ - 108ప.)

తే॥ గీ॥ ధవళలోచన శ్రీ పర్వతంబు మహిమఁ
బ్రస్తుతింపఁగ శక్యమే బ్రహ్మకైన
గండశిల లెల్లశంభు లింగంబులిందు
సిద్ధమును లిందుఁజరియించు చెంచులెల్ల॥

(కాశీ - 3ఆ - 59ప.)

తే॥ గీ॥ చెంచునింటికిఁబోయి చెంచెతకుఁబ్రియము
చెప్పినమ్మించి తలమీఁదఁ జెయ్యివెట్టి
వెఱకుమని తన్ముఖంబున నెఱుకు తెలిఁ
గాంచి యాతనితోడ సఖ్యంబుసేసి॥

(కాశీ - 5 - ఆ - 71ప.)

వీరంతా "చెంచు" శబ్దాన్నే వ్యవహరించారే ! పోతన, శ్రీనాథ, పెద్దన, యింకా యింకా యీ చెంచు పదాన్ని ప్రయోగించిన వారంతా అప్పకవి చెప్పినట్లు బుధ గ్రామణులు కారని అనవలసిందేనా ? ఇంతెందుకు ? మన వ్యాకరణకర్తలు చెంచు రూపాన్నే గ్రహించారుగాని "చంచు" రూపాన్ని గ్రహించనేలేదు. అసలు "చంచు" వున్నట్లే పేర్కొలేదు. "తవర్ణంబు పరంబగుచో నాకానొకచో నెత్వంబు చూపట్టెడు" (బాల - తద్ధి - 20 సూ -) అని బాల వ్యాకరణకర్తా "మతు బర్థంబునం జెంచునకుఁ దవర్ణంబు పరంబుగుచో నిత్వంబగు" (ప్రౌఢ - తద్ధి - 4 సూ.) అని ప్రౌఢ వ్యాకరణకర్తా స్పష్టంగా చెంచు అని చెకారంగల పదాన్నే పేర్కొన్నారు - చెంచు

"చె" కార గ్రహణకు ఇంతకంటే ప్రామాణికత్వంకల వుదాహరణలు మరేం కావాలి?

పూర్వం వివరించినట్లు చెక్కు, చెమ్మ, చెలువ మొదలైన పదాల్లో చెకారాలను వుచ్చారణ ననుసరించి తాలవ్యాలైన అత్యవిశిష్ట చకారాలుగా వ్రాయడమనేది పండిత కవుల్లో కేవలం అప్పకవి కాలంలోనే కాక, ఆంధ్రశబ్ద చింతామణి కాలంలోనే కాక, చిత్రకవి పెద్దన కాలంలో కూడా (క్రీ॥ శ॥ 1550 ప్రాంతంలోకూడా) వున్నది. కాబట్టి పెద్దన చెలువ మొదలైన పదాలను అత్వయుతాలుగా "అంటే" చలువ మొదలైన పదాలుగా వ్రాయగూడదని చెప్తూ యీ క్రింది పద్యాలు రచించాడు.

క॥ తలకట్టు గాక యెత్వమె
యలవడుఁజ జ స ‡ లను మూఁటు నది మొదలగుచోఁ
దెలుఁగుల మొదళ్ళ నెయిలివి
యల హల్లులు గావు స్వరములగు వ్రాయంగన్ ॥

గీ॥ చెలువ చేకట్టొప్పు జేనయనంగను
‡ సేస కొప్పనంగఁ జెల్లు మూఁటు
నెఱుక యిరవనంగ నీ రెండు వర్ణంబు
లచ్చులగును హల్లులాది గావు॥

(ల - సా. సంగ్రహం - 3 ఆ. 6, 7 పద్యాలు -)

ఎంతో ప్రాచీన కాలంనుంచీ లక్షణబద్ధ మనుకొన్న భాషలో పండిత కవులచేత వ్రాయబడిన ఈ "చె, జె" ల "చ, జ" ల తారుమారు వ్రాతలు ఈనాడు వ్యావహారిక

‡ సకారం విషయం శ-స-అనే విభాగంలో ముందుచర్చింపబడుతుంది.

భాషా రచయిత లెవ్వరూ వ్రాయరనడం మనకు నిత్యం అను భవంలో వున్నదే -

ఈ చిత్రకవి పెద్దన చెప్పిన విషయాన్నే వివరంగా చెప్పాలనే అభిప్రాయపడి గణవరపు వెంకటకవి చాలూ మూలా లేకుండా గజిబిజిగా అస్పష్టంగా యీ క్రింది సీస పాదాలు రచించాడు.

సీ॥ వహినింకఁ దద్భవపదములో స చ జ లు
తలకట్లనమరు నెత్వములు పొసఁగ
పొక్క స్జ పదంబుదక్క సావాసము
సాదుసంగ్రమనఁ జందుచాయ
చక్కరమన జాము జడ జలంగ యన నీ
జాడలుగానట్టి సచజల్ల
నెత్వమ్ములౌనవి యెఱింగింతు సెకసేస
చెలకుచెలువ జెట్టి జెట్టియనఁగ ‡

(ఆం. కౌ. 31 పుట)

చ జ అనే అక్షరాలు తలకట్లతోనే (అత్వాలతోనే) వుంటాయని ఎత్వాలతో వుండవనీ చెప్పాడు. అలా చెప్పే సరికి వెంటనే జెట్టి, జెట్టివంటి పదాలు ప్రత్యక్షమయ్యాయి. తిరిగి తన తప్పును తానే దిద్దుకొన్నట్లుగా మళ్ళీ ఎత్వాలుగల చ జ లు వున్నాయంటూ "ఈ జాడలుగానట్టి స చ జ లెల్ల నెత్వమ్ములౌను" అని చెప్పుకుని జెట్టి, జెట్టి, పదాలను వుదాహరించుకున్నాడు. మొదట చ, జల్లో ఎత్వం లేదు అత్వమే

‡ ఇందులో సకారం విషయం - శ, స - అనే విభాగంలో ముందు చర్చింపబడుతుంది.

వున్నది అని తొందరపడి నియమించుకోనడం యెందుకు ? వెంటనే మళ్ళీ సద్దికుని చ, జల్లో ఎత్వంకూడా వుంటుందని చెప్పుకోవడమెందుకు ? చలువ, చదరం, జత మొదలైన వాటిల్లో ఎత్వవిశిష్ట చ జ లు వ్రాయరాదనీ అత్వవిశిష్టాలే వ్రాయాలనీ, అదేవిధంగా చెమ్మ, చెఱకు, జెట్టి ఇత్యాదుల్లో అత్వవిశిష్ట చ, జ లు వ్రాయరాదనీ ఎత్వవిశిష్టాలే వ్రాయాలనీ తాను చెప్పదలిస్తే. సూటిగా ఆ విషయాన్నే తెలియపరచవచ్చుగదా ! ముందు చ జ ల్లో ఎత్వంవుండదు అత్వమే వుంటుందనీ తర్వాత ఎత్వంకూడా వుంటుందనీ, బాగా దూరాలోచనచేసి ఆ కాలపు వ్రాతలను పరిశీలించి దృష్టిలో పెట్టుకొని కొంత యితర పుస్తకానుభవం వుంటేనేగాని పాఠకుడు అసలు విషయాన్ని గ్రహించుకోడానికి వీల్లేనిపద్ధతిలో ఈ సీస పాదాలు ఎందుకు రచించాలి ?

ఉచ్చారణవశాన చెకార జెకారాలను తాలవ్యాలై అత్వవిశిష్టాలైన చకార జకారాలుగా మార్చుకొని వ్రాసుకొన్నట్లే చేకార జేకారాలను కూడా చాకార జాకారాలుగా మార్చి వ్రాస్తూండేవారు, ఈ నాడు మనం నిత్యవ్యవహారంలో "చేత, చేప, చేరెడు, జేన" మొదలైన చేకార జేకారాలు గల పదాలను "చాత, చాప, చారెడు, జాన" మొదలైన చాకార జాకారాలు గల పదాలుగా వ్యవహరిస్తాము- వాటిల్లో వున్న చాకార జాకారాలు అచ్చమైన ఆత్వం కలవి కావు - కాబట్టి వాటిని దంత్యాలుగా వుచ్చరించకుండా తాలవ్యాలుగా వుచ్చరిస్తాము. ఆ చాజాల్లోస్వరం ఆకార ఏకారాలకు మధ్యమ స్వరంగా - అంటే - ఆకారాంశతోను ఏకారాంశ

తోను కలిపి మధ్యమస్వరంగా వుచ్చరింపబడ్తుంది. మనం వాటిని వ్రాయవలసి వచ్చేసరికి ఆ త్వాన్ని ప్రాస్త్రమేకాని వాస్తవానికి ఏత్వమూ కాకుండా ఆత్వమూ కాకుండావుండే మధ్యమ స్వరానికిమరొకలిపి స్వరూపాన్ని మనం కల్పించుకోవాలి. (తాటాకు అన్నప్పుడు సైతం ఇటువంటి ఏ కార ఆకార మిశ్రస్వరమే వినపడుతుంది.) అటువంటి ఏకార ఆకారాలకు మధ్యమ స్వరంగా వుండే దాన్ని వ్రాయాలంటే" ౕ" అనే ఏ కార ఆకారాల గుర్తులను రెండింటినీ వ్యంజనంమీద వుంచితే వుచ్చారణకు తగినట్లుగా సరిపోతుందని ఎప్పుడో కొన్ని సంవత్సరాల క్రితం "నవజీవన"లో "ఆంధ్రభాష-అక్షరజ్ఞానం" అనే పేరుతో నేను వ్రాసిన వ్యాసంలో వ్రాశాను. ఈ విధంగా తెలుగులో చేత, చేప, జేన మొదలైన పదాల్లో వున్న "చే, జే"లను ఆకార ఏకారాలకు మధ్యమ స్వరం కలవిగా వుచ్చరించడమూ, వాటిని "చా, జా"లుగా వ్రాసుకోనడమూ అనేది క్రీ॥ శ॥ 15వ శతాబ్దంలోనే పండిత కవుల్లో వుండేది - కాబట్టే చిత్రకవి పెద్దన

క॥ తలకట్టుగాక యుత్వము
యలవడుఁ జజసలను నూఁటు నది మొదలగుచోఁ
దెలుఁగుల మొదళ్ళనెయి లివి
యులహాల్లులుగావు స్వరములగు వ్రాయంగన్॥

(ల - సా - సంగ్రహం - 3ఆ - 6ప.)

అని లక్షణం చెప్తూ ఈ క్రింది పద్యాన్ని లక్ష్యంగా యిచ్చాడు.

గీ॥ చెలువ చేతఁగొప్ప జేనయనంగను
సేసకొప్పనంగఁ జెల్లునూఁటు
నెఱుక యిరవనంగ నీ రెండు వర్ణంబు
లచ్చులగును హల్లులాది గావు॥ (ల-సా-సంగ్రహం-3 ఆ. 7 ప.)

లక్షణ పద్యంలో పెద్దన తలకట్టు శబ్దాన్ని "అకార" శబ్దానికి పర్యాయంగా ప్రయోగించాడు - అకార మంటే అఆ లకు రెండింటికీ గ్రాహ్యమే - అలాగే యిక్కడ పెద్దన తలకట్టు అనే దానిచేత ఆకారాన్ని కూడా గ్రహించాడు. వాస్తవానికి తలకట్టంటే హ్రస్వ అకారమే - కాని పూర్వ కాలంలో కొందరు తలకట్టు పదాన్నే ఆ కారానికి కూడా వ్యవహారించారు. "చేకటి, జేన" మొదలైన పదాలలో చే జే లనే వ్రాయాలిగాని చా జా లను వ్రాయకూడదని పెద్దన అభిప్రాయం. అందుకే వాటిల్లో తలకట్టు - అంటే - ఆత్వం వుండదనీ ఎత్వమే వుంటుందనీ (ఎత్వం అంటే ఏత్వానికీ గ్రాహ్యమే.) చెప్పి "చేకటొప్ప జేన యనంగను" అని చేకటి జేన పదాలను వుదాహరించాడు. ఈతని కాలంలో చేకటి, జేన అనే పదాలను చాకటి, జానలుగా వుచ్చారణ ననుసరించి వ్రాసే వారనడం స్పష్టం -

గణపవరపు వెంకటకవికూడా తలకట్టు శబ్దంచేత ఆత్వాన్ని గ్రహించి ఎత్వ శబ్దంచేత ఏకారాన్ని గ్రహించి పూర్వం చెప్పినట్లు గజిబిజిగానే యీ క్రింది సీసపాదాలు రచియించాడు-

సీ॥ వహినింకఁ దద్భవ పదములొ సచజలు
తలకట్లు నమరు నెత్వములు పొసఁగ
వొక్క సెజ్జపదంబు దక్క సావాసము
సాదు సంబరమనఁ జందు చాయ
చక్కరమన జాము జడ జలంగ యన నీ
జాడలుగా నట్టి సచజ లెల్ల
నెత్వమ్ములొ నవి యెఱేఁగింతు సెకసేస
చెఱకు చెలువ జెట్టి జెత్తి యనఁగ (ఆం. కా. 81పుట.)

ఈ సీసపాదాలను చెప్పవలసిన విషయాన్ని సూటిగా చెప్పకుండా గజిబిజిగా రచించాడని చకార జకారాల విషయ చర్చ సందర్భంలో నిరూపించాను. తిరిగి చర్చించాల్సిన అవసరం లేదు. ఇందులో "తలకట్లు నమరు" అని చెప్పినప్పటికీ పెద్దన వలెనే దీర్ఘ ఆకారాన్ని కూడా ఆ తలకట్టు శబ్దం చేతనే గ్రహించాడు - కాబట్టే చాయ, జాము వంటి దీర్ఘాలు గల పదాలను కూడా పేర్కొన్నాడు. ఆ విధంగా గ్రహించకపోతే దీర్ఘాలైన చా, జా లను వుదాహరించాల్సిన అవసరం యేమాత్రమూ వుండదు.

ఈ విషయంలో అప్పకవి "చేరెడు, జేన" మొదలైన పదాలలో చా జా లను వ్రాయరాదని పెద్దన వెంకటకవులు చెప్పిన దానికంటే విస్పష్టంగా చెప్పాడు -

ఆ॥ వె॥ దంత జంబులెల్లఁ దలకట్టులును వాని
యందు దీర్ఘములును బొంది యుండుఁ
దాలు జాక్షరములు దనరారు హ్రస్వాది
వక్రయుతములగుచు వనజనాభ ॥ (అప్ప. 2 ఆ. 118 ప)

ఆ॥ వె॥ చేతఁ జేరలైదు చేరెఁడు వరహాలు
జేనెఁడంత జిత్తు చేకటొకటి
చేఁదు కొనియెఁ గృష్ణుఁ జేర్చుక యననిట్లు
వఱలుఁ గొన్ని దీర్ఘ వక్రలిపులు ॥
(అప్ప - 2 ఆ. 121 ప.)

ఈలక్షణ లక్ష్య పద్యాలకు పూర్వం ఈక్రింది పద్యాన్ని రచించి చేత, చేర, జేన మొదలైన వాటిల్లో తాలువ్యాలైన †

---

† దంతజంబులెల్ల ఇత్యాది పద్యంలో "హ్రస్వాది" లోని ఆది శబ్దం చేత దీర్ఘ వక్రం గ్రాహ్యం -

దీర్ఘ వక్రంకల చే జే లుంటాయి గాని చా జా లు వుండవనే అభిప్రాయాన్ని స్పష్టపరచాడు -

ఆ॥ వె॥ శషస లు దంత్యములును తాలవ్యములునన
వికృతి చ జ లు రెండు విధములయ్యె
వీనిఁ దెలియకున్న విశ్రమ భంగంబు
నొడరి కావ్యములకు దోష మొదవు ॥

(అప్ప. 2 ఆ. 117 ప.)

అప్పకవి పేర్కొన్నట్లు "చేతఁ జేరలైదు చేరెఁడు వరహాలు" ఇత్యాదుల్లో చేకారాలను చాకారాలుగా వ్రాస్తే యతి తప్పక యేమవుతుంది? "చాతఁ జేరలైదు చారెఁడు వరహాలు" అని చాకారాలు వ్రాస్తే ఈ పాదాలలో యతి సరిపోతే సరిపోవచ్చు కాని "చెలువ చేకట్టొప్ప జేన యనంగను" అనే దాన్ని "చెలువ చేకట్టొప్ప జాన యనంగను" అని వ్రాస్తే యతి తప్పక యేమవుతుంది? ఇక్కడైనా పూర్వం చెప్పినట్లు చెలువను "చలువ" గా వ్రాస్తే యతి సరిపోతుంది గదా అనవచ్చు. అంటే అసలు ఇక్కడ "చలువ, జాన" అని వ్రాయకూడదనేది మాత్రమే అభిప్రాయం కాదు. చెలువ, చేత, జేన మొదలైన వాటిని చలువ, చాత, జాన మొదలైన చ, చా, జాలుకలవిగా వ్రాయకుండా వుండడమే కాకుండా ఆ పదాలను (చాత, జానవంటి పదాలను) పొరపాటుగా ప్రయోగిస్తారేమో అలా ప్రయోగించరాదని కూడా చెప్పడమే అప్పకవి అభిప్రాయం. ఏమీ లేదు. చాత, జాన అని వ్రాయడానికే అలవాటుపడ్డ కవులు ఎవరైనా "ఛత్ర మొక్కటి వానలో చాతఁబట్టి" అనే పద్ధతిలో "చేత"ను

"చాత"గా ప్రయోగించి యతిస్థానంలో బిగించితే శబ్దతత్వాన్ని బట్టి వ్యాకరణ నియమాల ననుసరించీ, "చాత"కు సహజ రూపమైన "చేత"నే ఆ పాదంలో పడితే- అంటే - ఆపాదాన్ని "ఛత్రమొక్కటి వానలో చేతఁబట్టి" అని వ్రాస్తే యతి తప్పక యేమవుతుంది? కాబట్టి శబ్దతత్వాన్ని గ్రహించి జాగ్రత్తగా చేత, జేనవంటి పదాలను ఏత్వాపకార ఐకారాలు కలవిగానే ప్రయోగించాలని అప్పకవి చెప్పుతున్నాడు.

ఈవిధంగానే "చేప"వంటి పదాల్లో చేకారం చాకారంగా మారడం "చాప" వంటివిగా వ్రాయబడడం జరుగుతున్నది. అయితే(తాటాకులతోనో ఈతాకులతోనో అల్లబడింది- లేదా సిరి, తుంగలతో అల్లబడింది.) "చాప"కూ మత్స్యార్థకమైన "చాప"కూ వ్రాతలో భిన్నత్వంలేదు. వాస్తవానికి ఆసనమైన "చాప"లో చాకారం దత్యం. దంత్య చిహ్నాన్ని వ్రాయడం విడిచి పెట్టడంవల్ల యీ యిబ్బంది వచ్చింది. ఈ యిబ్బంది వ్రాతలోనేగాని మనుష్యులకు నిత్యవ్యవహారంలో లేనేలేదు. ఏమంటే చేపమీద తయారైన "చాప"లోని "చా"కారాన్ని తాలవ్యంగానే వుచ్చరిస్తాం. పైగా అందులో స్వరం ఆకార ఏకారాల మధ్యమ స్వరంగా వుంటుంది- ఇంక ఆసనార్థకమైన "చాప"లో చాకారాన్ని దంత్యంగానే వుచ్చరిస్తాం. కాబట్టి ఈ దంత్యతాలవ్య ఉచ్చారణభేదంచేతనే అర్థభేదం జనవాణిలో సుబోధక మవుతున్నది.

ఈ పరిశీలన వల్ల ఉచ్చారణ వశాన "చెవి, చెమట, జెట్టి" మొదలైన పదాలలో వున్న చెకార జెకారాలు తాల

వ్యాలైన చకార జకారాలుగా మారాయనీ, చలువ, చక్కన, జడ, మొదలైన పదాలలో వున్న దంత్య చ జ లు వాటిల్లోని దంత్యాతా చిహ్నం సుఖాపేక్షతో వ్రాతలో విడిచిపెట్ట బడ డంవల్ల తాలవ్య చ జ లుగా మారి ఆ తాలవ్య చ జ లు చెకార జెకారాలుగా కూడా మారినాయని తేలుతున్నదిగదా! అంతేకాక చంద్రుడు జయము వంటి సంస్కృత సమపదాలు కూడా చెకారాలు జెకారాలు కలవిగా మారాయనీ తేలుతున్నదిగదా! ఇంక దీర్ఘాలైన చే జేలు చా జా లుగా మారాయని కూడా తేలుతున్నదిగదా! ఈ విధంగా చె జె అనే వాటిని "చ జ" లుగాను "చ జ" లను చె జె లుగాను దీర్ఘాలైన చే జే లను చా జా లుగాను వుచ్చారణ వశాన ప్రాచీన కాలంలో పండిత కవులు సైతం వ్రాసేవారని కూడా సుస్పష్టంగా ఈ పరిశీలనవల్ల తెల్లమవు తున్నదిగదా!

— ట, డ —

తిట్టుట, కొట్టుట, చేయుట, పోయుట మొదలైన వాటిల్లో వున్న భావార్థకమైన టవర్ణం జనవ్యవహారంలో డవర్ణంగా ఉచ్చారణ సులభాపేక్షతో మారుతుంది. టవర్ణానికి పూర్వంలోవున్న ఉకారం అకారంగా మారుతుంది. అప్పుడు తిట్టడం, కొట్టడం, చేయడం, పోవడం, తినడం మొదలైన రూపాలు తయారవుతాయి. టకారానికీ డకారానికీ స్థానం (మూర్ధం) ఒక్కటే అయినా బాహ్య ప్రయత్న భేదంవున్నది. డకారానికి బాహ్య ప్రయత్నాలు సంవార, నాద, ఘోషాలు. టకారానికి వివార, శ్వాస, అఘోషాలు. సంవారాది ప్రయ

త్నాలుకల అక్షరాన్ని వుచ్చరించడం కంటే వివారాది ప్రయ
త్నాలుకల అక్షరాన్ని వుచ్చరించడం కష్టం - కాబట్టే టకా
రం డకారంగా మారుతుంది. ఈ విధంగా చేయుట మొదలైన
టవర్ణాంత భావార్థక క్రియలు "చేయడం" మొదలైనవిగా
వ్యవహారంలో చాలా ప్రాచీన కాలంలోనే మారిపోయాయి. †
పూర్వకాలంలో పండితకవులు కూడా కొందరు "చేయడం"
వంటి రూపాలను పద్యాలలో వ్రాసేవారు కాదుగాని వచ
నంలో విరివిగానే వ్రాసేవారు-ఈ విషయం తాళపత్ర ప్రతులు
పరిశీలిస్తే ఎవరికైనా తెలుస్తుంది - ఈ విధంగా టకార
స్థానంలో డకారాన్ని వ్యవహరించే అలవాటు వుండంచేతనే
"ఇరకట - అటుకట" వంటి రూపాలకు "ఇరకడ, అటుకడ"
వంటి డకారాలరూపాలు సిద్ధించడం జరిగింది. అంతేకాదు విప
రీతంగా కొన్ని చోట్ల డకారం టకారంగా మారింది- "వెండ్రుక"
అనే శబ్దం అసలు డకార రకారాల సంయుక్తం. ఇక్కడ
ఉచ్చారణలో కొందరు "వెంట్రుక" అని పూర్వకాలంనుంచీ టకా
రాన్ని కూడా (డకారానికి మారుగా) వ్యవహరిస్తున్నారు -
తాళపత్రప్రతులు తిరగవేస్తే చాలా చోట్ల వెండ్రుక శబ్దం
ఎక్కడ వ్రాయవలసి వచ్చినా వెంట్రుకగా వ్రాసినట్లు కన్పడ

---

† చేయుట మొదలైనవి మొదట వుచ్చారణలో "చేయటము" వలే
ముವర్ణాంతాలుగా మారి అనంతరం మువర్ణానికి సున్నా వచ్చి "చేయటం"
వంటి రూపాలు తయారై ఆ తర్వాత టకారానికి డకారం వచ్చి "చేయ
డం" వంటి రూపాలు సిద్ధించాయి - (చూడు. నా వ్యావహారిక భాషా
వ్యాకరణం - క్రియాప్రకరణం)

తాయేగాని నెంౘ్రుకగా వ్రాసినట్టు కన్పడే వ్రాతలు చాలా తక్కువ. ఈ నాడు కూడా మనం వ్యవహారంలో నెంౘ్రుకలు, నెంౘ్రుకలు టకార డకారాల రూపాలు రెండింటినీ వాడుతూనే వున్నాము -

- త, ద -

పరుషమైన "త"కారాన్ని వుచ్చరించడం కంటే సరళమైన "ద"కారాన్ని వుచ్చరించడం తెలుగు వారికి తేలిక - అంతేకాదు సహజంగా వివారశ్వాస అఘోష ప్రయత్నాలుకల వర్ణాన్ని వుచ్చరించడం కంటే మామూలు సంవారాది ప్రయత్నాలు కల వర్ణాన్ని వుచ్చరించడంలో కొంతసుఖం వుంటుందని ముందే చెప్పాను. అక్కడ తకారం వివారాది ప్రయత్నాలు కలది. దకారం సంవారాది ప్రయత్నాలు కలది. కాబట్టే ఉచ్చారణలో సులభాపేక్షతో "వెతకు, కతుకు, చతికిలబడు, పితుకు, ఉతుకు, గోతుకు" మొదలైన పెక్కు పదాల్లో "వెదకు, కదుకు, చదికిలబడు, పిదుకు, ఉదుకు, గోదుకు," మొదలైనవిగా తకారం దకారంగా మారింది. ఈ తకార దకారాల ద్వివిధరూపాలూ ప్రాచీన కవిపుంగవులచేత వ్యవహరింపబడ్డాయి - అప్పకవి.

ఆ॥ వె॥ వెతకివాని కతికెఁ జతికిలఁ బడెయావుఁ
బితుక బీర లుతికెగోతికె ననుచుఁ
బలుకుచోఁ దకారముల దకారములును
వలసినేని నిలుపవచ్చుఁ గృతుల॥ (అప్ప - 2ఆ - 166ప)

అని తకారం దకారంగా మారుతుందని లక్షణం చెప్పి కొని ఆతర్వాత "కవిగజాంకుశం, ఆ ముక్తమాల్యద, కళా

పూర్ణోదయం" మొదలైన కావ్యాలలోంచి "ద"కార ప్రయోగాలకు లక్ష్యాలు పేర్కొన్నారు. కొందరు దకార రూపాలే మొదటివనీ తకార రూపాలే తర్వాతివనీ అంటారు. ఏ విధంగా చూచినా ఆ మార్పు వ్యవహారసిద్ధమేగాని వేరుకాదు.

— థ, ధ —

సామాన్యంగా వివారాది ప్రయత్నాలు కల వర్ణాన్ని వుచ్చరించడం కంటే సంవారాది ప్రయత్నాలు కల వర్ణాన్ని వుచ్చరించడం తేలిక అని లోగడనే చెప్పాను. థకారం వివారాది ప్రయత్నాలుకలది. ధకారం సంవారాది ప్రయత్నాలు కలది. ఈ థకారాన్ని వుచ్చరించడం కంటే ధకారాన్ని వుచ్చరించడం చాలా తేలిక అనే విషయం మనకు నిత్యానుభవంలో ప్రత్యక్షంగా వున్నదే. వాస్తవానికి ఈ నాడు "థ"కారాలున్న పదాలు పదిపదాలు చెప్పండిస్వామీ అని మన పండితుల నడిగితే నూటికి తొంభైతొమ్మిదిమంది చెప్పలేరని ఘంటాపథంగా చెప్పవచ్చు-అంటే ఈ థకారం అంతగా వుచ్చారణలో ప్రభ్రష్టమైపోయి దాని స్థానాన్ని ధకారం ఆక్రమించిందన్న మాట- సంస్కృతంలో థకారధకారాలకు అసలు స్పష్టంగా లిపి భిన్నత్వం వున్నది. (థ, थ — ధ, ध.) సంస్కృత లిపుల్లో వున్నంత భిన్నత్వం తెలుగు లిపిలో లేదు. థ, ధ, అన్నప్పుడు ధకారం పొట్టలో చుక్క తప్పితే థకారానికి ధకారానికి ఆకారంలో తేడాయేలేదు - చుక్క పెట్టడం పొరపాటుగా మరచిపోయినా, లేదా పెట్టిన చుక్క తొందరలో ప్రక్కగీత లోనో క్రింది గీతలోనో కలిసిపోయినా అది థకారమే అవు

తుంది - ఇంతగా ఉచ్చారణలో థకారం ప్రభ్రష్ట మవ్వడానికి కొంత కారణం థ ధ లకు స్పష్టమైన లిపి భిన్నత్వం లేకపోవ డం కూడా - ఈ విధంగా ఉచ్చారణలో థకారం భ్రష్టమై దాని స్థానాన్ని ధకారం ఆక్రమించడ మనేది యెప్పుడో నన్నయ్యకు పూర్వకాలంలోనే జరిగింది - ఈ విధంగా థకార స్థానంలో ధకారాన్ని నన్నయ్య వాడక పోయినా తక్కిన తర్వాతి కవులు చాలమంది ప్రయోగించారు. ఈ క్రింది ప్రయోగాలు పరికించండి.

ఉ॥ బాంధవశాత్రవా కలితభావ భవా భవపాశ బంధసం
బంధ విరామ కామ పరిపక్వ వివేక నిరూఢభక్తహృ
ద్గ్రంథి విభేదనా పరమ కారుణికాపరి మాణ దూరదుః
ఖేంధన పావకాయిత సమీక్షణ శైత్య మహోద్భుతాత్మకా॥

(భార - విరా - 1 ఆ. 333 ప.)

క॥ సింధురము మదోద్రేకమ
దాంధంబై వచ్చునోజ నాచార్యుని పై
గంధవహ సుతుఁడు గవయఁగ
మంధర గతి నెవ్వఁడాఁగు మన యోధులలోన్॥

(భార - ద్రోణ - 1 ఆ. 88 ప.)

ఉ॥ అంధకవృష్ణి భోజకుకురాన్వయ భూపతులెల్ల నీదెసన్
బాంధవ సౌహృద ప్రణయభక్తి విశేషములొప్ప నీమనో
గ్రంధి యడంగఁజేయు నెసకంబునఁ బూనినవారు లోభమో
హాంధులు ధార్తరాష్ట్రులు నయమ్ముమెయిన్మన కర్పియిత్తురే॥

(భార - అరణ్య - 4 ఆ. 160 ప.)

ఉ॥ కంధర నీలవర్ణమధుకైటభనాగ సుపర్ణయోగి హృ
ద్గ్రంధి భిదోత్థభోగివనితా స్వవవచ్ఛ్వసన ప్రవచ్చిర
స్పంధివ సన్నిశాపతి రసస్రుతి దుగ్ధపయోధివీ చికా
మంథర కేళికాధర సమాశ్రిత పంక్తి శిరోధిసోదరా ! ॥

(ఆముక్త - 5ఆ - 158ప.)

ఇటువంటి మహాకవుల ప్రయోగాలు కోకొల్లలుగా ప్రాచీన కావ్యాల్లో పిలిస్తే పలుకుతాయి. తిక్కన "గ్రంథి, మంథ" అనే థకారాలుగల పదాలను ఉచ్చారణవశాన ధకారాలు కలవిగా ప్రయోగించి ఆ పద్యాలలో యితర ధకారాలతో ప్రాస సరిపెట్టుకొన్నాడు. ఎర్రాప్రెగడ కూడా గ్రంథి శబ్దాన్ని గ్రంధిగా ప్రయోగించాడు. అదేవిధంగా కృష్ణదేవరాయలు "కంథర, గ్రంథి, మంథర" అనే థకారాలు గల పదాలను ధకారాలు కలవిగా ప్రయోగించి ప్రాస సరిపెట్టుకున్నాడు. ఇటువంటి ప్రాసలు చూచిన అప్పకవివంటి లక్షణ గ్రంథకర్తలు పై ప్రయోగా లన్నింటిలోను థకార స్థానంలో ధకారం ప్రయోగింపబడడం సమంజసం కాదని భావించి వాటిని సహజ థకారాలుగల పదాలుగానే సవరించుకొన్నారు. ఆ విధంగా సవరించుకోవడంవల్ల ఆప్రాసల్లో సహజ థకారాలు (వర్గచతుర్థాలు) కలవి కొన్ని పదాలుండడంవల్ల థ, ధల ప్రాస అంగీకరింపక తప్పిందికాదు. "గ్రంథి" వంటి థకారాలుగల పదాలను "గ్రంధి" వంటివిగా ధకారాలుకలవిగా వ్రాసుకొనడం కంటే అసలు శబ్దాలను నిర్దుష్టంగానే వుంచుకొని థధలకు ప్రాసమైత్రి నంగీకరించడం మంచిదిగా భావించారు. కాబట్టే వుచ్చారణలో భ్రష్టమైన థకారస్థానంలోధకా

రాన్ని ప్రయోగించి ప్రాస సరిపెట్టుకొన్న తిక్కనాదుల ప్రయోగాల్లో థకారస్థానంలో ధకారాన్నే వుంచి పైని వుదాహరించిన పద్యాలనే థ, ధల ప్రాసకు లక్ష్యాలుగా పేర్కొంటూ అప్పకవి థధలకు ప్రాసచెల్లుతుందని యీ క్రింది లక్షణం సృష్టించుకున్నాడు-

తే॥ గీ॥ గ్రంథ మంథ శబ్దంబులఁగల ద్వితీయ
వర్ణములు రెండును సఘోష వర్ణములగు
నైన నిజవర్గభవ చతుర్థాక్షరములఁ
గలియుఁ బ్రాసంబులను స్వవర్గజములనఁగ॥

(అప్ప - 3ఆ - 345ప.)

ఈవిధంగాతిక్కనాదులుప్రయోగించినథకారరూపాలైనధకారరూపాలను థకార రూపాలుగానే అప్పకవి ఎంతగాసవరించుకుని థధల ప్రాస చెల్లుతుందని చెప్పుకున్నా జనవ్యవహారంలో సౌలభ్యాపేక్షతో భ్రష్టమయ్యే థకారాన్ని యెవరు ఆపగలరు ? ఇటువంటి అప్పకవులు ఎంతమంది పుట్టినా ఆప లేరు. పాపం అప్పకవి కాలంలోనే మరీ విపరీతంగా (ప్రతీచోటా) కవులు పండితులు థకార స్థానంలో ధకారాన్నే వాడు తుండేవారు. కాబట్టే గణపవరపు వెంకటకవి థకారాలుగల పదాల్లో థకార స్థానంలో ధకారాన్ని వ్రాయకూడదనే అభిప్రాయంతో థకారంగల పదాలను ధకారంగల పదాలను విభజించి వేర్వేరుగా పేర్కొంటూ మామూలు పండితకవులకు థకారధకార వివేకం కలిగించుకొనే అవకాశం కల్పించ డానికై యీ క్రింది సీస పాదాలు రచియించాడు -

సీ॥ తెలియంగ వర్గద్వితీయ థకారము
లై రహిఁబొల్చుఁ బైపేరు లింకఁ
బార్థివ మన్మథ పార్థివా నిత థార్థి
పృథు రాట్ప్రమాథ సత్కథ లనంగఁ
దైర్థ కాతిథ్యర్థ పార్థ పృథుప్రథా
మంథాన మంథర గ్రంథము లనఁ
శ్రీథప్రథమనాథ గాథావ్యథాకుథా
శ్వత్థామ మిథున కపిత్థములన
గథ్యామనోరథగ్రంథ చైత్రరథోత్థి
పాథఃప్రథన రథప్రోథములన
మిథ్యాపథిక తథ్యపథ్యపాంథ సమర్థ
తీర్థనిశీథ చతుర్థులనఁగఁ
బ్రార్థనా సర్వథాపార్థ్యయథాతథా
తిథివికత్థన నిశీథినులనంగ

యూథకంథాక్రోథి వీథీవమథుయూథి
పథివరూథిమథ ప్రమథులనంగ

నశ్వత్థి పృథవికాయ స్థావయస్థ దు
స్థ సమిదిత్థంభూతసార్థములన
నస్థిర స్థేమ స్థితిస్థగిత స్థల
స్థిసుస్థవిరాతి తిర్థములనఁ

బ్రస్థాన సంస్థావ్యవస్థా మహాస్థాక
రస్థ సిక్థవిథిలాప్రస్థములన
వరుసగానిఁక మీఁద వర్గచతుర్థ ధ
కారముల్దనరును గోరువగను

గంధ బంధుర సింధు సైంధవ సింధుర
రాధా మధురిపు విరాధులనఁగఁ

గంధ రాంధ దివాంధ గంధ బాంధవ బంధు
సంధాను సంధాన సంధులనఁగ

నంధకపరి పంధి దంధ నాద్ధా విధా
ధూసర శ్రద్ధాతి ధూర్తులనగ
యుద్ధ సన్నద్ధ నిరుద్ధ బద్ధాసిద్ధ
విద్ధా నిరుద్ధ ప్రసిద్ధు లనగ
బద్ధతి గోధా సముద్ధతా యుధ సుధా
వీవధా యోధన విధము లనగ
ఋద్ధ సమిద్ధ సమృద్ధక దద్ధ్వా ధ్వ
ధైనుకా బధ్నత్ప్రిధానము లన
ధైర్యాభిధాన మాధుర్య ధూళీధూత
ధృతిపిధాన ధ్వస్తధృతము లనగ
ముగ్ధదుగ్ధ స్నిగ్ధదిగ్ధ సమాధి ధు
రంధరాం ధోధ్వాంత కంధులనగ
విధు విధుధ్వాంక్షాలి విధి విధురవ్యాధి
యోద్ధైధ మాన నిరోధము లన
బంధూక సంబంధ గంధక సంధ్యావ
ధి ప్రతి షేధక ధిషణులనగ
వింధ్యాద్రిసౌగంధ్య సంధ్యావళీ రక్త
సంధ్యక సంధ్యాత్యవంధ్యములన
నిర్ధారణార్ధాంగ దుర్ధర దుర్ధర్త
వార్ధక స్పర్ధాళు గీర్ధవులన
వార్ధక్య గీతార్ధమూర్ధన్యవర్ధకి
వర్ధితాయోధ్యారి వరకులన
వార్ధక్రవోవార్ధి మూర్ధగోవర్ధన
వార్ధుషికాంతర్ధి నిర్ధనులన
ధుర్యవధుని వ్యాధోవిధుంతుదాంతర్ధాన
శోధనధృతి ధూపసౌధములన
దోగ్ధృధాయ్యాస్నిగ్ధ దోగ్ధ్రీవ ధూధవ
శ్రద్ధాప్రబుద్ధ ప్రవృద్ధులనగ

స్తబ్ధరోమ విలబ్ధ లుబ్ధక ప్రారబ్ధ
లబ్ధాబ్ధి లబ్ధిసం లుబ్ధులనగ
గృధ్ర మహీధ్రాద్రి లోధ్ర స్పర్ధించిన
రంధ్ర నిరంధ్ర పురంధ్రులనగ
నింధన సింధు జలంధర సంబాధ
వధ్ర సైరంధ్రీ ధ్యాంధ్ర వంధ్యలనగ
బుద్ధశ్రద్ధ స్నిగ్ధ ప్రబుద్ధ బుధ్న మధురా
దధిశతధా సీధు నిధులనంగ
ధూమధావన సాధుధామ ధర్మధమనా
మాధవాబ్ధి మధుమాధవులన
బోధ మేధోపాధి సాధారణ విధాతృ
మధుగ మధూళికా మధువు లనగ
నాధ్యాత్మ వేధోధ సిధ్మల ధూధర
దేధ్మీయ మానసు ధేధ్మలనగ
మేధ్య మధ్యధ్యాన సాధ్య వధ్యా రాధ్య
మధ్య మాధ్యాహార బాధ్యములన
ధాగణా ధోరణి ధోరణీ ధారాళ
ధారానుకరణ ధూర్ధరులనగ
నధిరాధరంధ్రోత్థ బుధవ ధుంధానుమధ్ర
ధుర్వహా ధౌరేయ ధుర్యులనగ
సాధకి నిషధ ప్రసాధన దుగ్ధనుర్
ధారణీ వారిధి ధరణులనగ
నిధువనధ్వజినీ పరిధ బధిరేధ్వజా
రాధన ద్వైధ శరధులనంగ
మాగధ సాన్నిధ్యగాధా ప్రణిధి సము
త్సేధావరోధ నిషేధములన
గాధేయవిధి పరివ్యాధ మహౌషధ
శపధ రాధేయ విశ్లథములనగ
ధన్యధూర్జటి విరోధకృదను రాధాక

బంధానుబంధ ప్రబంధములనఁ
బరిధావి సిద్ధార్థి బహుధాన్య సురుధిరో
ద్గారి సాధారణ ధాతువులనఁ
గ విరోధి నిధనధాతు వసుధాధే తవ్య
ధర్మధర్మాధాన ధరలన...... (ఆం-కౌ-33,34 పుటలు.)

ఇంత విపులంగా థకారాలుగల పదాలనూ ధకారాలు గల పదాలనూ ప్రత్యేకించి "థధ"లను తారుమారు చెయ్యరాదనే అభిప్రాయంతో ఎంతో విచక్షణచూపి యిన్ని సీస పాదాలు రచించిన వెంకటకవే తప్పటడుగువేసి నప్పుడు యితరుల మాట ఏంచెప్పాలి? ఇందులో "శపథ" అని తవర్గ ద్వితీయంగల శబ్దాన్ని "శపధ" అని చతుర్థవర్ణం కల పదంగా ధకారాలుగల పదాల్లో వెంకటకవి చేర్చాడు. లక్షణ గంథకర్త అయిన వెంకటకవే యిలా వ్రాస్తే మామూలు కవి పండితుల మాట చెప్పనక్కరలేదుగదా! ఇంకొక విశేషం - థకార స్థానాన్ని ధకారం ఆక్రమించడంతో థకారం కల పదమేదో ధకారం కల పదమేదో తెలియక, థకారాలు గల పదాలను ధకారాలు కలవిగా వ్రాసుకొన్నట్లే ధకారాలు గల పదాలను థకారాలు కలవిగా కూడా పూర్వం కొందరు వ్రాస్తూండేవారు. కాబట్టే ధకారాలు గల పదాలను అంత యెక్కువగా వెంకటకవి పేర్కొన్నాడు - అంతేకాదు - "సమిధ" అని ధకారంగల శబ్దాన్ని థకారంకలదిగా "సమిథ"గా భావించి థకార పదాలపట్టికలో పఠించుదామనుకొని పొరపాటుగా సమిథశబ్దం తకారాంతంగా భావించి "సమిదిత్థం భూతసార్థములన" అని "సమిత్"అని ప్రయోగించాడు. మామూలుగా తకారాంతమైన "సమిత్" అనే శబ్దంవున్నది. దాని

యిక్కడ వెంకటకవి పఠించాడనడానికి అవకాశం యే మాత్రమూ లేదు. ఇక్కడ థకారాలుగల పదాలను పేర్కొన డానికే అవకాశం వున్నదిగాని తకారం కల పదాన్ని పేర్కొన డానికి అవకాశం లేదుగదా!-ఇది "సమిత్" శబ్దాన్ని పేర్కొన డానికి సందర్భమే కాదుగదా ! ఇంక వెంకటకవి "సమిధ" శబ్దాన్ని "సమిథ" శబ్దంగా భావించి ప్రయోగింపదలచి "సమిత్"ను పొరపాటుగా ప్రయోగించాడనడానికి సందేహం వుండనక్కరలేదుగదా ! ఈ థకారం స్థానం, స్థలం, మొదలైన పదాలలో తవర్గ ద్వితీయంగా స్వస్వరూపంలోనే నిలచి వున్నది. కొన్ని పదాలలో మాత్రమే ఉచ్చారణలో ప్రభ్రష్టమై ధకారానికి అవకాశాన్ని కల్పించింది. ఈ పరిశీలనవల్ల ప్రాచీనకాలంలో పండితకవులు అనేకమంది గ్రంథాది శబ్దాలను వ్యవహారాన్ననుసరించి గ్రంధాది శబ్దాలుగా (ధకారాలుకల విగా) వ్రాసేవారని తేలుతున్నది.

- న - ణ -

జనవ్యవహారంలో నకారం ణకారంగాను ణకారం నకారంగాను తారుమారయ్యింద. ఈ న ణలు రెండూ యిలా తారుమారవ్వడానికి కారణం ఉచ్చారణలో బాహ్యప్రయత్న సామ్యంవుండడమే. నణలకు రెండింటికీ సంవారనాదఘోషాలు బాహ్యప్రయత్నాలు. మనం నిత్యవ్యవహారంలో అణా- అనా, కాణీ - కానీ, అన్నం - అణ్ణం - వంటి తారుమారు రూపా లను వ్యవహరిస్తున్నాము. అణ్ణం అనే రూపాన్ని కొందరు పామరులు మాత్రమే వ్యవహరిస్తున్నప్పటికీ కాణీ, కానీ - అణా, అనా అనే భిన్నరూపాలను పామరులేకాకుండా విద్యా

వంతులుకూడా కొందరు వ్యవహరిస్తున్నారు. ఈ విధంగా న ణ లను తారుమారుచేసి వాడడమనేది మనమే చెయ్యలేదు. మన ప్రాచీన పండితకవులుకూడా చాలామంది ఈ తారుమారును చేసినవారే. ఇంకానయం - ఈనాడు కేవలవ్యవహారంలోనే ఈతారుమారు జరుగుతున్నదిగాని పూర్వకాలంలో కావ్యప్రయోగాల్లోనే ఈ తారుమారులు జరుగుతుండేవి. కాబట్టే గణపవరపు వెంకటకవి

సీ॥ నిర్నయ స్వర్నదీ దుర్నీతి గీర్నాథు
లనుశబ్దముల యందుఁ బ్రదినయనమను
శబ్దమునందు నెసఁగు ద్వితీయ నకార
ములకు ణకారము గలుగదటుల
నల్లయాచార్యాని యనుశబ్దమునకు లే
‡ దర్ణవర్ణాదుల్ ణకారములేక (అం. కా. 35 పు.)

అని ఈ సీసపాదాలు రచించాడు. ప్రాచీన కాలంలో పండిత కవులు కొందరు "నిర్నయ, స్వర్నది, దుర్నీతి, గీర్నాథు" మొదలైన రకార నకార సంయుక్తాలుగల పదాలను ఉచ్చారణననుసరించి "నిర్ణయ, స్వర్ణది, దుర్ణీతి, గీర్ణాథు" మొదలైన రకార ణకారాల సంయుక్తాలు గల పదాలుగా వ్రాస్తూవుండేవారు. ఇక్కడ రేఫకు మూర్ధస్థానం అవడంచేత దంత్యమైన "న"కారం రేఫసంపర్కంతో మూర్ధస్థానికమైన ణకారంగా ఉచ్చారణలో మారడం సహజం- ఈ విధంగా "నిర్నయ, స్వర్నది" మొదలైన నకారాలుగల పదాలను "నిర్ణయ, స్వర్ణది" మొదలైన

‡ ఇక్కడ ముద్రణ ప్రతిలో "లేకర్ణ వర్ణాదుల్" అని వున్నది. అది సరియైన పాఠంకాదు. అర్థవంతమూ కాదు.

ణకారాలుగల పదాలుగా వ్రాయడానికి అలవాటు పడేసరికి ప్రాచీన కాలంలో పండిత కవులకు అసలు ణకారం యెక్కడ వ్రాయాలో నకారం యెక్కడ వ్రాయాలో తెలియకుండాపోయింది. దాంతో సహజంగా "న" కారంగల పదాలను (నిర్నయాదులను) ణకారంగల పదాలుగా వ్రాసుకొన్నట్లే "అర్ణ, వర్ణ" మొదలైన ణకారంగల పదాలను "అర్న, వర్న" అని నకారంగల పదాలుగా కూడా వ్రాయడానికి ప్రారంభించారు. కాబట్టే వెంకటకవి "నిర్నయ, స్వర్నది" మొదలైన పదాలలో నకారానికి ణకారం వుండదనీ, (నకారములకు ణకారము గలుగదు.) అర్ణవర్ణాది శబ్దాల్లో ణకారమే వుంటుందనీ చెప్పుకున్నాడు.

ఇంకెందుకు ? "త్రినయన" అనే శబ్దంలో ణకారం లేదనీ నకారమే వున్నదనీ, పైపాదాల్లో స్పష్టంగా చెప్పాడు వెంకటకవి. అప్పకవి "వికల్పప్రాస" అనేపేరుతో శాబ్దికమైన ణకారానికి ఆదేశమైన (నకారస్థానంలో వచ్చిన) ణకారానికి ప్రాసచెల్లుతుందని ఈ క్రింది లక్షణం చెప్పి

ఆ॥ వె॥ ధాత్రిఁ బాణినీయ సూత్రములను వృత్తి
యోష్మమును ద్రుతంబు నొక్కచోటఁ
గ్రమత షాక్షరము ణకారమునై ప్రాస
ములకు నుభయసంజ్ఞఁ బొసఁగు రెండు ॥

(అప్ప. 3 ఆ. 329 ప.)

లక్ష్యాలను మహాకవుల కావ్యాల్లోంచి వుదాహరించుతూ శ్రీనాథుని కాశీఖండంలోనుంచి "త్రినయన" శబ్దంలో నకారానికి ణకారం ఆదేశంగావచ్చి "త్రిణయన" అనే రూపం

అయ్యిందని తలంచి ఆదేశ ణకార సహజ ణకారాల ప్రాసకల దిగా యీ క్రింది పద్యాన్ని వుదాహరించాడు.

క॥ త్రిణయనుని రాణి వాసమ
నణిమా ద్యైశ్వర్య వితరణామరతరువున్
మణికర్ణిక ముక్తివధూ
మణికర్ణికఁ దలఁచె వకాని మానసవీథిన్॥

(కాశీ - 2 ఆ. 110 ప.) అప్ప - 3 ఆ. 335 ప.

ఇందులో "అణిమ, మాణి, మణి" అనే పదాలలో వున్న ణకారం సహజమైనదనీ "త్రిణయన" లోని ణకారం నకార స్థానంలో ఆదేశంగా వచ్చిందనీ భావించాడు - "త్రిణయన" లో ణకారం వున్నదని అప్పకవీ, ణకారం లేదు నకారమే వున్నదని గణపరపు వెంకటకవీ చెప్తున్నారు. నణ లను తారుమారుగా యిష్టం వచ్చినట్లు వ్రాసుకోనడం చేతనే గదా యీ భిన్నాభిప్రాయా లుండడానికి ఆస్కారం లభించింది!

అప్పకవి "త్రినయన" శబ్దాన్ని "త్రిణయన" శబ్దంగా ణకారం కలదిగా పేర్కొనడం తప్పనీ, అక్కడ ణత్వం రావడానికి అవకాశం లేదనీ శ్రీగిడుగు రామమూర్తి పంతులుగారు కాశీఖండ పద్యసందర్భంలో ఫుట్‌నోట్‌లో వ్రాసారు ‡ అంటే శ్రీరామమూర్తి పంతులుగారు అప్పకవితో ఏకీభవించక వెంకట కవితో ఏకీభవించారన్న మాట. అయితే అసలు త్రిన

‡ ఈ త్రిణయన శబ్దాన్ని గురించి అందులో ణత్వం రావడానికి అవకాశం వున్నదని మా గురువులు శ్రీ వేమల రామశాస్త్రిగారు తమ అప్పకవీయ వివరణ 326, 327, 328 పుటల్లో వ్రాసినారు. ఈ విషయాన్ని గమనించి వావిళ్ళవారు శ్రీ గిడుగువారు వ్రాసిన ఫుట్‌నోట్‌ను అప్పకవీయ పంచమ ముద్రణప్రతిలో తొలగించారు.

యన అనేది సరైన రూపమా త్రిణయన అనేది సరైన రూపమా అనే విషయం తెల్సుకోవాల్సి వున్నది. మామూలుగా "త్రినయన" అన్నప్పుడు "పూర్వపదాత్సంజ్ఞాయామగాత్" అనే పాణినీయ సూత్రంచేత ణత్వంవచ్చి "త్రిణయన" అనే రూపం సిద్ధిస్తున్నది - కాని యీ "త్రినయన" అనే శబ్దాన్ని క్షుభ్నాది గణంలో పఠించడంచేత క్షుభ్నాదులకు వర్తించే ణత్వనిషేధ రూపమైన నిపాత "త్రినయన" శబ్దానికి కూడా వర్తించి ణత్వం రాకుండా "త్రినయన" అనే రూపమే సిద్ధిస్తున్నది. అయితే "త్రిణయన" అనే ణత్వరూపం తప్పన్న మాట- ఇంతవరకూ ఇక్కడ వున్న యీ పాణినీయ సూత్రాలననుసరించి వచ్చిన ప్రక్రియ ప్రకారం "త్రినయన" అనేదే సిద్ధిస్తుందిగాని "త్రిణయన" అనేది సిద్ధించదనిగదా తేలింది. ఈ సూత్రాలను ఈ ప్రక్రియను మాత్రమే దృష్టిలో పెట్టుకొని గణపవరపు వెంకటకవి, శ్రీ గిడుగు రామమూర్తిపంతులు గారు "త్రిణయన" తప్పనీ "త్రినయన" ఒప్పనీ భావించారు. ఇంతవరకూ వెంకటకవి రామమూర్తి పంతులుగార్ల అభిప్రాయాలకు అడ్డేమీలేదు - కాని యిక్కడ "త్రిణయన" అనే ణత్వరూపాన్ని సాధించే అవకాశం కూడా లేకపోలేదు.

మనం నిత్య వ్యవహారంలో శ్రావణ మాసంలో వచ్చే పూర్ణిమను శ్రావణ పూర్ణిమ అని అంటాము. ఈ "శ్రావణ" అనేది "శ్రవణా" నక్షత్రాన్ని పురస్కరించుకొని వచ్చిందని పూర్వమే 248 వ పుటలో చెప్పాను. వాస్తవానికి శ్రవణా నక్షత్రంతో కూడిన పూర్ణిమ "శ్రావణి పూర్ణిమ" అని "శ్రావణి" రూపం కావలసి వస్తుంటే "శ్రవణా........"

ఇత్యాది సూత్రంలో పాణిని "శ్రవణా" అని పఠించి నిపతిం చాడు - ఈ సందర్భంలో మహా భాష్యకారుడు "అబాధ కాన్యపి నిపాతనాని భవంతి" అని వ్రాసి కొన్ని చోట్ల నిపతించ బడిన శబ్దాలు నిపతించబడ్డ రూపాలకు సాధుత్వాన్ని సంపా దించి పెడతాయేగాని వాటి పూర్వ రూపాల అసాధుత్వాన్ని ప్రతిపాదింప నేరవని స్పష్టపరచాడు - అంటే పాణిని "శ్రావణ" అనే రూపాన్ని నిపతించాడంటే ఆ రూపం సాధు రూపమని చెప్పడానికేగాని "శ్రావణి" అని సహజంగా సూత్రప్రవృత్తితో సిద్ధిస్తున్న రూపం అసాధువని చెప్పడానికి కాదని స్పష్టపరచా డన్నమాట. అంటే యింతకూ "శ్రావణ పూర్ణిమ, శ్రావణి పూర్ణిమ" రెండు రూపాలూ సాధు రూపాలన్నమాట - అదే విధంగా "త్రినయన" అన్నప్పుడున్న "పూర్వపదా" దిత్యాది సూత్రంచేత ణత్వం వస్తుండగా ఆ త్రినయన శబ్దాన్ని క్షుభ్నాదిగణంలో పఠించి ణత్వనిషేధ రూపంగా నిపతించడం వల్ల "నిపాత అనేది నిపాతితరూపాల సాధుత్వానికే కాని పూర్వ సిద్ధాలైన రూపాల అసాధుత్వానికి కాదు" అనే పై భాష్య కారవచనం చేత "త్రినయన, త్రిణయన" రెండు రూపాలూ సిద్ధిస్తాయన్న మాట. క్షుభ్నాదిగణంలో పఠింపబడ్డంచేత ణత్వ రహితమైన "త్రినయన" అనే రూపమూ వుంటుంది. క్షుభ్నా దుల్లో ణత్వనిషేధ రూపమైన నిపాత "త్రినయన" వంటి "న" కారరూప సాధుత్వ ప్రతిపాదనకోసమేగాని మామూ లుగా "పూర్వపదా" దిత్యాది సూత్రంచేత సిద్ధించే "త్రిణయన" అనే ణత్వరూప సాధుత్వ నిరోధం కోసంకాదని మహా భాష్యకారుడు చెప్పడంచేత "త్రిణయన" అనే ణత్వరూపమూ

వుంటుంది. కాబట్టి "త్రినయన, త్రిణయన" అనే "న" కార "ణ" కార రూపాలు రెండూ సాధువులే నన్నమాట. అయినప్పుడు గణపవరపు వెంకటకవీ, శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారూ "త్రిణయన" అనే ణత్వరూపం వుండదని వ్రాయడం సమంజసం కాదన్నమాట. అయితే అప్పకవి విషయంలో ఒక విషయాన్ని గమనించాలి. శ్రీనాథుని కాశీఖండ పద్యంలో "త్రిణయన"అనే ణత్వరూపాన్నివుంచి అప్పకవి పేర్కొన్నాడు. ఆపద్యంలో శ్రీనాథుడు "త్రిణయన," అనే ణత్వరూపాన్నే ప్రయోగించాడనే అధికారం అప్పకవికిలేదు. నకార ణకార ప్రాసను వుపయోగించి శ్రీనాథుడు "త్రినయన" అనే నత్వరూపాన్ని ప్రయోగించాడని వాదించడానికి అవకాశం వున్నది. అయితే శ్రీనాథుడు "త్రిణయన" అనే ణత్వరూపాన్ని ప్రయోగించాడో "త్రినయన" అనే నత్వరూపాన్ని ప్రయోగించాడో యిదమిత్థమని తేల్చి చెప్పడం కష్టం - శ్రీనాథుడు స్వహస్తంతో వ్రాసుకొన్న ప్రతి లభిస్తేనేగాని చెప్పలేము. ఎవరికిష్టంవచ్చిన రూపాన్ని వారు గ్రహిస్తారు. గణపవరపు వెంకటకవి "త్రినయన" శబ్దంలో ణకారం లేదని స్పష్టంగా చెప్పడం వల్ల ఆతని కాలంలో కొందరు పండిత కవులు "త్రిణయన" అని ణత్వరూపం వ్రాసేవారని తెల్లమవుతున్నది గదా! అయితే "త్రిణయన" అని ణత్వరూపం ప్రాచీన కాలంలో వ్రాసుకొన్న ప్రతి పండితుడూ ప్రతి కవీ పై భాష్యకార వచనాన్ననుసరించి ఆ ణత్వరూపం సరైన రూప మనే అభిప్రాయంతోనే వ్రాసుకొన్నా రనడానికి అవకాశంలేదు. ఏదో నిత్య వ్యవహారంలో నకారానికి మారు (దుర్నీతి ఇత్యాది

పదాల్లో) ణకారాన్ని వ్యవహరించే అలవాటు వుండబట్టి వ్రాసు కొనేవారు కాని "త్రిణయన" అనేది సాధురూపమనే అభి ప్రాయంతో వ్రాసుకొనేవారు కాదు. ఆ విధంగా "త్రిణయన" అనే ణత్వరూపాన్ని వ్యవహారానికిలోబడే వ్రాయకుండా అది భాష్యకారవచనానుసారంగా సాధువని తెల్సుకొనే అందరూ వ్రాస్తుంటే గణపవరపు వెంకటకవి "త్రిణయన" అని ణత్వం వ్రాయకూడదనీ "త్రినయన" అని నత్వమే వ్రాయా లనీ చెప్పవలసిన అవసరం యే మాత్రమూ వుండదు - భాష్య కారవచనా న్ననుసరించి "త్రిణయన" అనే ణత్వరూపం వుం టుందన్న సంగతి శబ్దాదిసర్వశాస్త్రాల్లోనూపారంగతుడై "సర్వల క్షణశిరోమణి" అనేపేరుతో ఛందోవ్యాకరణఅలంకారాదిసమస్త లక్షణగ్రంథాలనూ వ్రాసిన‡ గణపవరపు వెంకటకవికే తెలియ నప్పుడు సామాన్యంగా దుర్నీతి, నిర్నయ, స్వర్నది మొదలైన నకారాలుగల పదాలలో కూడా దుర్ణీతి, నిర్ణయ, స్వర్ణది అని ణకారాన్ని వ్రాసే కవిపండితులకు తెల్సునని యెలా చెప్ప గలరు ? ఎవరు చెప్పగలరు ? అందుకే చాలామంది పండిత కవులు పూర్వకాలంలో "త్రిణయన" అన్నప్పుడు కూడా ణత్వాన్ని ఉచ్చారణ ననుసరించీ మామూలుగా నకార స్థానంలో ణకారాన్ని వ్రాసే అలవాటును పురస్కరించుకునీ వ్రాసేవారనడం-

---

‡ ఈ వెంకటకవి వ్రాసిన సర్వలక్షణశిరోమణిలోనిదే "ఆంధ్రకౌముది" అనే వ్యాకరణ భాగం- ఇలాగే అందులో అలంకార, ఛందో, నిఘంట్వాది భాగాలున్నాయి. ఒక్కొక్కభాగం ఒక్కొక్క లక్షణ గ్రంథంగా చేర్కొన డంలో అతిశయోక్తిలేదు. కాని ఆ భాగాలన్నీ లభించలేదు. కొన్ని లభించాయి.

ఈ పరిశీలనవల్ల ఉచ్చారణ ననుసరించి పూర్వకాలంలో కవులు పండితులు నకారస్థానంలో ణకారాన్ని వ్రాసేవారనీ, ఆ విధంగా నకార స్థానంలో ణకారాన్ని వ్రాయడంచేత నకారాలు గల పదాలేవో ణకారాలు గల పదాలేవో విస్పష్టంగా కొందరికి తెలియక పోయినా అందరికీ తెలియక కాదు తెల్సిన దాన్ని ఆచరణలో అమల్లో వుంచుకునే ఓపిక లేక కొన్ని సహజంగా ణకారాలు గల పదాల్లో కూడా నకారాలు వ్రాసేవారనీ తేలుతున్నది.

— ఫ, భ —

జన వ్యవహారంలో ఏకస్థానికాలైన (ఓష్ఠ్యాలు) ఫభలు మైత్రికలవి. వివారాది ప్రయత్నాలు కల ఫకారాన్ని వుచ్చరించడం కంటె సంహారాది ప్రయత్నాలు కల భకారాన్ని వుచ్చరించడం తేలిక. ఫకార భకారాలకున్న స్థానమైత్రిని పురస్కరించుకునీ, ఫకారాన్ని వుచ్చరించడంలో కంటే భకారాన్ని వుచ్చరించడంలో వున్న సుఖాన్ని పురస్కరించుకొనీ కొద్ది ప్రదేశాల్లో ఫకారం భకారంగా వ్యవహారంలో మారి పోయింది. రేఫశబ్దం వున్నదంటే ఇది ఫకార సహితమేకాని భకార సహితంకానేకాదు. కాని వుచ్చారణలో "రేఫ"లో ఫకారానికి భకారం ప్రాచీన కాలంలోనే వచ్చింది. పూర్వకాలంలో కవి పండితులు అనేకమంది "రేఫ" అని ఫకారం వ్రాయడానికి మారు "రేభ" అని భకారాన్ని వ్రాస్తూండే వారు. ప్రాచీన తాళపత్ర ప్రతులు తిరగవేస్తుంటే చాలా చోట్ల "రేఫ" శబ్దానికి మారు "రేభ" శబ్దమే కన్పడుతుంది. అదే

విధంగా ఉచ్చారణలో "ఫాల"శబ్దం "భాల"శబ్దంగా మారింది. ఈ మారడం యెప్పుడో మహాకవి రామరాజభూషణుని కాలం లోనే జరిగింది. కాబట్టే ఈ క్రింది పద్యంలో రామరాజ భూషణుడు "ఫాల" శబ్దాన్ని "భాల" శబ్దంగా వ్యవహరించాడు.

సీ॥ పసమీఱు నేవేల్పు భాలసన్నుతహేతి
యురుబల మదనాశనోగ్రవృత్తి
ఘనదీప్తి కర్పూరాకారమై యేవేల్పు
విల్లనంత శరాప్తి నుల్లసిల్లుఁ
దనరు నేవేల్పునందన మహాక్రీడ చి
త్రమహిమందార కాంతత వహించు
వరసర్వమంగళా వాసమై యేవేల్పు
మూర్తినానా భోగములఁదనర్చు
తే॥ గీ॥ నట్టికలధౌత గిరికటకాధిరామ
సదన తరవర్తి సురలోక చక్రవర్తి
యఖిలముని నిర్జరులుగొల్వ నానృపాలు
నెదురఁ బ్రత్యక్షమై నిల్చి యిట్లు పలికె॥

(హరి. న. 5 ఆ. 62 ప.)

ఇక్కడ - "ఏవేల్పుయొక్క=ఏదేవతయొక్క, భాల=లలాటమందు, సన్నుత=కొనియాడతగిన, హేతి=అగ్నిజ్వాల"- అని ఈశ్వర సంబంధంగా హరిశ్చంద్రకథార్థంలో అన్వయిస్తుంది. ఇంక - "ఏవేల్పుయొక్క=ఏదేవతయొక్క, భా=తేజస్సుచేత, లసత్=ఒప్పుచున్నదై, నుత=కొనియాడదగిన, హేతి=ఆయుధము" - అని ఇంద్ర సంబంధంగా నలకథార్థంలో అన్వయిస్తుంది - ఇది ద్వ్యర్థికావ్యంలో ప్రయోగింప బడింది కాబట్టి ప్రాసలో ప్రయుక్తం కాకపోయినా యిక్కడ"భాల"ను

"ఫాల"గా దిద్దడానికి ఎవ్వరికీ అవకాశం చిక్కలేదు - చివరికి ఫాలశబ్దానికి భాల శబ్దం రూపాంతరంగా ఆధునిక నిఘంటు కర్తలు వ్రాసుకొన్నారు.

— మ, వ —

మకార వకారాలకు స్థాన మైత్రితోపాటు ప్రయత్న మిత్రత్వంకూడావున్నది. ‡ కాబట్టే "ఏమిటి, మామిడి, దీమసం" మొదలైన పదాలలో మధ్యవున్న మకారం వకారంగా ఉచ్చారణలో మారుతుంది. అయితే మకారం అనునాసికంకాబట్టి వకారం కూడా అనునాసికంగానే మారుతుంది - ఈ అను నాసిక చిహ్నంగా ఆధునిక రచయితలు వ్యావహారిక రచనల్లో అరసున్నాను వినియోగిస్తున్నారు. "ఏమిటి" అనే దాన్ని "ఏవిఁటి" గా వ్యవహరిస్తున్నా రన్నమాట. అరసున్నా వున్న చోటల్లా అనునాసిక వుచ్చారణ జరుపుతుంటే ఇటువంటి చోట్ల దాన్ని పెట్టుకోవడం సమంజసంగా వుంటుంది - కాని అర్ధాను స్వారానికి ఏనాడో ఉచ్చారణ అనేది లేకుండా పోయింది. అటువంటప్పుడు కొందరు దాన్ని ఈ మకార స్థానంలో వకారం వచ్చిన సందర్భాల్లో సార్థకంగా వినియోగించడం ఆలోచింప దగింది. ఈ విధంగా తెలుగులో మకారానికి వకారాదేశం వ్యవహారంలోనే రావడమనేది ఎప్పుడో తిక్కనకు పూర్వకాలంలోనే జరిగింది. కాబట్టే "మామిడి" శబ్దాన్ని "మావిడి" శబ్దంగా పూర్వ కవులు అనేకమంది ప్రయోగిం

‡ మ, వ, లకు రెండింటికీ స్థానం ఓష్ఠాలు (వకారానికి దంతాలు కూడా) సంవార నాద ఘోషాలు బాహ్య ప్రయత్నాలు.

చారు. కేతన, మారనాదులు కొందరు "మావిడి" శబ్దాన్ని వకార ప్రాస పెట్టి వ్యవహరించారు. మన నిఘంటు కర్త లందరూ "మామిడి" శబ్దానికి "మావిడి" శబ్దాన్ని రూపాంత రంగా పేర్కొని వ్యవహార వశాత్తు కావ్యాలలో కెక్కిన యీ "మావిడి" రూపాన్ని ప్రామాణిక పదంగానే గ్రహించారు. ఇలాగే "దీమస" శబ్దాన్ని "దీవస" శబ్దంగా కేతన ప్రయో గించాడు - ఇది కూడా నేడు గ్రాంథిక భాషలో ప్రామాణిక మైన రూపమే కాని అప్రామాణికంకాదు -

ఈ విధంగా వుచ్చారణలో మకారం వకారంగా మారగ డం విపరీతమై కొన్నిచోట్ల యిటీవల వకారం మకారంగా మారడం కూడా జరిగింది. వ్యవహారంలో "చెవిటి, చెవుడు" వంటి వకారాలు గల పదాలను ఈ నాడు కొందరు "చెమిటి, చెముడు" వంటి మకారాలుగల పదాలుగా వుచ్చరించడం వ్రాయడం కూడా జరుగుతున్న సంగతి అందరికీ అనుభవంలో వున్నదేగదా ! -

— ఱ, ర —

జగమెరిగిన.........జందెమెందుకన్నట్లు "ఱ"కారం యొక్క మొదటి స్వరూపమేదో తర్వాత వ్యవహారంలో దాని పతనస్థితి చివరికి "ఱ"కార "ర" కారాలు సర్వ సామాన్య వర్ణాలైపోయిన విషయం తెలియందెవరికి ? వాస్తవానికి "ఱ" కారానికి తెలుగు వర్ణాల్లో ప్రాచీన కాలంలో ప్రత్యేకమైన స్థితి వున్నది. కాబట్టే పూర్వకవులు కొందరు "ఱ"కార "ర" కారాలకు యతి ప్రాసమైత్రిని అంగీకరించలేదు - వేటు -

వేరు, కాఱు - కారు, పాఱు - పారు, నీఱు - నీరు వంటి భిన్నార్థకాలైన భిన్న రేఫలుకల పదాలను పరిశీలిస్తే తెలుగులో శకటరేఫకున్న ప్రత్యేకత సువ్యక్తమవుతుంది. అంతకంటే మరొక్క రహస్యం తెల్సుకుంటే "ఱ"కారం మొదట అసలు "ర"కారం వంటిది కాదనే విషయం స్పష్టంగా బోధపడ్తుంది. ఏమంటే మనంమామూలుగా రేఫశబ్దాన్ని వ్యవహరిస్తున్నాము. ఈ రేఫ శబ్దాన్ని పూర్వకాలంలో ఛందో వ్యాకరణ గ్రంథ కర్తలనేకమంది వాడారు. ఇది అసలు "ర + ఇఫ" అనే వాటి మేళంచేత యేర్పడింది. ర + ఇఫ= రేఫ అనే ఋసంజ్ఞ అసలు తెలుగువారిదికాదు. రకారం తెలుగులో వున్నప్పటికీ ఇఫప్రత్యయం తెలుగులో లేదు. తెలుగు కల్లా స్వాభావికమైనది-దీర్ఘ స్వరం - † ఇంక ఈ"ఇఫ" ప్రత్యయమనేది సంస్కృత భాషలో విధించుకోబడింది. తెలుగులోకి సంస్కృత పదాలు అనేకాలు ప్రవేశించి సంస్కృత ప్రభావం తెలుగు మీాద పూర్తిగా పడ డంతో ఈ "ఇఫ" ప్రత్యయం కూడా తెలుగులోకి వచ్చింది. వాస్తవానికి ఈ "ఇఫ" ప్రత్యయం సంస్కృతంలోదే కాబట్టి తెలుగులో దీని వ్యవహారం వచ్చేసరికి "రాముడు, రాక్షసుడు, రథము, ప్రభ" మొదలైన సంస్కృత సమపదాలలో వున్న రకారానికే ఇఫప్రత్యయాన్ని చేర్చి ఆ సంస్కృత సమాల్లో వున్న రకారాన్నే రేఫగా వ్యవహరించాలి. అంటే "రాముడు" ఇత్యాది సంస్కృత సమాల్లో వున్న రకారాన్నే రేఫ అనాలి

---

† ఆరు ఊ వచ్చును. కారు గా వచ్చును వంటివి తెలుగులో స్వాభావికాలు. కారప్రత్యయం కూడా సంస్కృతం నుంచి తెలుగులో ప్రవేశించిందేకాని తెలుగు భాషకు స్వాభావికం కాదు.

గాని "రాడు, రమ్ము, రండి" మొదలైన అచ్చ తెలుగు పదాలలో వున్న రకారాన్ని రేఫ అని అనరాదన్న మాట. కాని సంస్కృత సమాల్లో "రాముడు" ఇత్యాదుల్లో వుండే రకారానికీ, అచ్చ తెలుగు పదాల్లో "రాడు" ఇత్యాది పదాల్లో వుండే రకారానికీ భేదమేమీ లేకపోవడంచేత ఆ ఇఫ ప్రత్యయాన్ని తెల్గు రకారానికి కూడా చేసి "రాండు, రమ్ము" ఇత్యాదుల్లో వున్న రకారాన్ని కూడా రేఫగా వ్యవహరించారు మన లక్షణ గ్రంథకర్తలు. ఱకారం వుచ్చారణలో భ్రష్టమై మామూలు "ర" కారంతో సమానమైన వుచ్చారణకలది అయినప్పటికీ ఆ ఱకారానికి వాస్తవానికి ప్రత్యేకమైన స్థితి మొదట నుంచీ వున్నది కాబట్టి ఇఫ ప్రత్యయం చేరలేదు. ఉచ్చారణలో వాస్తవానికి "ఱ" కార "ర" కారాలకు భిన్నత్వం లేదనడం నిర్వివాదం - ఈ రెండింటికీ వుచ్చారణలో అభిన్నత్వ మనేది నన్నయ్యనాటికే యేర్పడిందని చెప్పడానికి అవకాశాలున్నాయి-కాని యిదితిక్కన్ననాటికి మరీ ప్రబలమైపోయింది. ఇంతగా ఉచ్చారణలో ఱకారం రకారం వంటిదే అయినా రకారానికి చేరినట్లుగా ఱకారానికి ఇఫ ప్రత్యయం చేరడంలేదు. ఈ ఱకారం వుచ్చారణలో రకారం వంటిదిగా అయిపోయింది కాబట్టి ఱకార రకారాలకు భేదం తెలియడానికై ఱకారాన్ని "శకటరేఫ" అని లిపి స్వరూపాన్ని బట్టి "బండిఱా" అనే తెలుగువారి వ్యవహారాన్ని సంస్కృతీకరించుకొని సంజ్ఞ ప్రత్యేకంగా పెట్టుకొన్నారేగాని ర + ఇఫ = రేఫ అని చేసుకొన్నట్లుగా ఱ + ఇఫ = ఱేఫ అని యెవ్వరూ ఱకారాన్ని ఱేఫగా వ్యవహరించలేక పోయారు - ఱకారానికి

వుచ్చారణలో అత్యల్పమైన భేదంకూడా లేకపోబట్టే గదా మొదటినుంచీ మన లక్షణ గ్రంథకర్తలు "ఱ"కారాన్ని శకట రేఫ అని వ్యవహరిస్తున్నారు. మొత్తంమీద "ఱ"కారాన్ని కూడా శకటశబ్దం మొదటపెట్టి రేఫగానే వ్యవహరించారే - ఈ విధంగా "ఱ"కారాన్ని (శకట) రేఫగా వ్యవహరించడానికి మన పూర్వుల కభ్యంతరం లేకపోయినప్పుడు ఱ + ఇఫ = ఱేఫ అని ఱేఫగానే యెందుకు వ్యవహరించకూడదు? అటువంటి వ్యవహారం లేకపోవడానికి కారణం వాస్తవంగా ఱకారం ప్రత్యేకమైన పరిస్థితి కలిగి "ర"కారానికి భిన్నమైన స్వభావాన్ని కలిగివున్న దవ్వడమే ‡ కాబట్టే మొదట ఱకార రకారాలకు ప్రాసగాని యతిగాని చెల్లదని ఆంధ్రకవులు భావించారు. కాని

క॥ ధరనెక్కటి వల్లితగు
శరమఱవలు వానిలోఁ జెలంగును శౌరున్
సరిశాయన విశ్రమ వే
శరమాథిప రెండునుం గలసి వర్తించున్॥

(అనం - ఛం - 1ఆ - 117ప.)

అని ర - ఱలకు ఎక్కటి యతులు చెప్పుకొన్న అనంతుడే యీ క్రింది రగడలో ర - ఱ ల సాంకర్యం చేసి యతిని ప్రయోగించాడు.

---

‡ ఈ "ఱ"కారం యొక్క ప్రాచీన స్వరూప స్వభావాలను గురించి పూజ్యశ్రీకోరాడ రామకృష్ణయ్యగారు తమ "సంధి"లో వివరించి వున్నారు. ఆ కారణం చేతా, విస్తర భీతిచేతా దాని ప్రాచీన చరిత్ర ఇక్కడ వ్రాయడంలేదు.

అంపమున బ్రచురగతి వ్రచ్చెనఖముల రిపుని
వక్షము నృసింహుఁడని రాయువడి సారదు కృతి
అంపమున బ్రచ్చుగతి బ్రచ్చెనఖముల రిపు ను
రంబు నరసింహుఁడనఁ బ్రాలుసంయుక్త యతి॥

(అనం - ఛం - 1ఆ - 111ప.)

ఇం తెందుకు ? నన్నయ్య సాధు రేఫ శకట రేఫల సాంకర్యం చెయ్యలేదు గాని తిక్కన యెర్రాప్రగడలు చేసారు -

క॥ నాయుల్ల మరయ నిను మో
హాయో కాకిట్లు మాపటికి విని నేర్చెన
సాయక సముదయ ఖరభవ
దీయ వచన చయము గవియుదేరందిరన్నై ॥

(భార - భీష్మ - 3 ఆ. 419 ప.)

క॥ చేతఁగొని యుష్ణవమలుట
రాతి పయిని నుప్పనుట గ్రాతి దధిమఘ
పేతంబుగఁ గుడుచుట ఘ
ర్మేతరములు రేయిసక్త వెగ్గనరేంద్రా !॥

(భార - అను - 110 ప.)

ఆఱాయి శబ్దం శకట రేఫ అంటారా? చేతఁగొని ఇత్యాది పద్యంలో సాధు రేఫ శకట రేఫల యతి మైత్రి సిద్ధిస్తుంది - కాదు సాధు రేఫే నంటారా? "నాయుల్ల మరయ" ఇత్యాది పద్యంలో సాధు రేఫ శకట రేఫలయతి మైత్రిసిద్ధిస్తుంది.

క॥ మాఱాడినఁ గోపింతురు
నీఱుగ శపియింతురేమ నీబోంట్లకు నీ
శూరతములు వెఱతుర మము
గాఱియగా నిట్లు పలుకఁ గలరే యన్యుల్॥

(హరి. ఉత్త. 6 ఆ. 128 ప.)

ఇందులో "నీఱు, కాఱియ" శబ్దాల్లో శకటరేఫ అనడం నిర్వివాదం. మాఱులోది కాకపోతే నేమి? "శూరతములు" అనే సంస్కృత సమపదంలోవున్నది సాధు రేఫే గదా! మరి యిక్కడ సాధు రేఫ శకట రేఫల ప్రాసమైత్రి చెల్లలేదని యెవరంటారు? ఈ తిక్కన ఎర్రాప్రగడలకు పూర్వం యీ క్రింది ప్రయోగాల్లో నన్నచోడ పాల్కురికి సోమన్నలు రేఫ శకట రేఫల సాంకర్యం చేసారు.

సీ॥ క్షీరవారాశి కెలఁగిన కాఱు మొగులు
కరణి శశికాంత వేదిపై గిరుతోలు
పరచి విలసిల్లు నందుండి పరమపురుఁడు
సాలిచె నారి మొగుల్నైఁ దటిత్పుంజమనఁగ॥

(కుమా - సం. 8 ఆ. 92 ప.)

కారు=స్రవించు, కాఱు=నల్లని-అనే అర్థభిన్నత్వంలో "కాఱు మొగులు" అన్నప్పుడున్న రేఫ శకట రేఫే కాని సాధు రేఫ కాదనడం స్పష్టం -

ద్విపద॥ గాఱియుఁ బట్టుముఁ దప్పఁ గోపించి మాని
పఱువడి కిన్నర బ్రహ్మయ్య నొదిరి॥

(బసవ. 5 ఆ. 60 ప.)

ఇంతగా నన్నెచోడాదులతో పాటు తిక్కనాదులు కూడా రేఫ శకటరేఫల యతిమైత్రి ప్రాస మైత్రులను పాటించగా అనంతాదులు వాటికి వైరిభావాన్ని ప్రతిపాదించడంలో అర్థమేమిటి ?

అప్పకవి —

తే॥ మహిని రేఫాక్షరంబును మఱి శకాంగ
నామక అకారమును సవర్ణంబు లయ్యుఁ
గావ్యముల యందు నొకటి నొక్కటి గలయక
దమకుఁ దామయెయగు నేకతరయతులన॥

(అప్ప - 3 ఆ. 85. ప.)

తే॥ కబ్బముల రేఫమునకు అకారమునకు
మైత్రి గలుగమిఁ గవి శిఖామణులు ప్రాస
వైరమనుచును గలుపరు వాని నెందుఁ
గూర్తురా రెండు నెఱుఁగక కుకవి జనులు॥

(అప్ప. 3 అ. 344 ప.)

అని రకారఅకారాలకు యతిప్రాసలను నిరాకరించడమే కాకుండా అప్పకవి ద్వితీయాశ్వాసంలో రేఫ అకారాల గురించి యీ క్రింది పద్యాలు రచించాడు.

తే॥ జ్ఞాతివైరంబు నొంది ప్రాసంబు లందు
విశ్రమము లందుఁ దమలోన వేఱుకలిగి
దేవదానవు లట్లన తెనుఁగులందు
మించి రేఫ అకారముల్ మెలఁగుఁ గృష్ణ॥ (229ప.)

క॥ భ్రమయక రేఫములకు రే
ఫములను ఱాలకును ఱాలుఁ బ్రాసములను వి
శ్రమములను జెప్పఁదగు నీ
క్రమ మెఱుఁగక రెండునుంగుకవి గూర్చుఁగృతిన్॥ (230ప.)

తే॥ చెల్లునని ముందు భీమన చెప్పెననుచుఁ
గలుపుదురు రేఫములును అకారములును
దుష్టకవులవి యొకటైనఁ దొంటి పెద్ద
లందఱును నేల విభజింతురని తెలియరు॥ (232ప.)

క॥ వలసిన రేఫ అకారము
లలవడుఁ దా మొకటి కొక్కటని భీమన యే
పలుకుట గలిగిన నాతఁడు
గలిపిన లక్ష్యమొకటైనఁ గనఁబడదన్నా॥ (233ప.)

ఉ॥ బమ్మెర పోతరాజకృత భాగవతంబు సలక్షణంబుగా
కిమ్మహి నేమిటం గొదువ యొంతయు నారసి చూడఁగాను రే
ఫమ్ములు ఱాలునుంగలసి ప్రాసములైన కతంబునంగదా
యిమ్ములనాది లాక్షణికులెల్లను మాని యుదాహరింపఁగన్॥ (234ప.)

శారదా దర్పణమునందు —

తే॥ చనజరఘులకు మొదలి యూష్మములు మూఁడు
సగసవడి నిల్పఁగా నేక జాతిగాన
బండిఱాకు రేఫమువడి కుండరాదె
ప్రాసవర్ణంబులకుఁ గూర్పరాదుగాని॥ (235)

వ. ఈ పద్యంబు లక్షణ వేద్యంబును సుకవి హృద్యంబునుగాదు. (236ప.)

అని రేఫఱకారాల మైత్రిని తెగడడంతో పాటు శారదా దర్పణకర్త వాటికి యతిమైత్రి నంగీకరించడం లక్షణవేద్యం కాదన్నాడు. ఱకారం రేఫ భిన్నమైన ప్రత్యేక వర్ణమైనప్పటికీ దాని ప్రత్యేకత జనవ్యవహారంలో నశించి రేఫవంటి వుచ్చారణనే ఱకారంకూడా పొందడంవల్లనేగదా ఆ ఱరలకు యతిమైత్రి ప్రాసమైత్రి నన్నెచోడాదులచేతా తిక్కనాదులచేతా వ్యవహరింపబడింది. ఈ రేఫలు వుచ్చారణలో అభిన్నాలుగా వుండడంచేత రేఫస్థానంలో ఱకారాన్ని ఱకార స్థానంలో రేఫను ఇష్టంవచ్చినట్లు పూర్వపండితకవులు వ్రాస్తుండేవారు. కాబట్టే రేఫ ఱకారాలను తారుమారు చెయ్యరాదనే అభిప్రాయంతో

‡ లింగమగుంట తిమ్మకవి, చిత్రకవి పెద్దన, అప్పకవి, గణపవరపు వెంకటకవి వగైరా లక్షణ గ్రంథకర్తలు చాలామంది రేఫలుగల పదాలను అకారాలుగల పదాలను విభజించి పట్టికలుగా పద్యాల్లో పేర్కొన్నారు. ఇలా పేర్కొనడంలో ఈ లక్షణ గ్రంథకర్తలందరూ అకారంగల పదాలను రేఫగలవిగాను రేఫకల పదాలను అకారం కలవిగాను తారుమారుగా పేర్కొన్న ప్రబుద్ధులే. ఒకరు శకట రేఫవున్నదన్న పదాన్ని మరొకరు సాధు రేఫవున్న పదంగా పేర్కొంటారు. ఒకొకప్పుడు "మఱి - మరి" వంటి రెండు రేఫలూ వున్న పదాలుగా కనపడేవన్నీ వాస్తవానికి శకట రేఫకలవో సాధు రేఫకలవో అయివుంటాయి. మహాకవులు రేఫ అకారాలను సాంకర్యం చేసిన ప్రయోగాలను రేఫను అకారంగానో అకారాన్ని రేఫగానో దిద్దివేసి "రఱ"ల సాంకర్యాన్ని తప్పించడంవల్లనూ లక్షణ గ్రంథకర్తలు ఒకరు రేఫ అంటే మరొకరు అకారం అని భిన్నాలుగా పేర్కొనడం వల్లనూ "మఱి - మరి" వంటి రెండు రేఫలూ వున్న పదాలు తయారయ్యాయి. రేఫ అకారాల యతిప్రాసలను గూర్చి గాని అకారానికి జనవ్యవహారంలో యేర్పడ్డ రేఫ వంటి వుచ్చారణను గూర్చిగాని భిన్నాభిప్రాయాన్ని వెలిబుచ్చి వ్యతిరేకించే మహానుభావు లెవ్వరూ ఈనాడు లేరు కాబట్టి

---

‡ లింగగుంట తిమ్మకవి రచించిన సులక్షణసార, బాలబోధచ్ఛందములనే లక్షణ గ్రంథాల తాళపత్ర ప్రతులు నావద్ద వున్నాయి. సులక్షణసారం ఛందస్సు కాదు. ఇప్పుడు తిమ్మకవి పేర అచ్చయివున్న సులక్షణసారం సరైన గ్రంథం కాదు. (చూ. దివ్యప్రభావివరణసహిత ఆంధ్రభాషా(?)నికి నేను వ్రాసిన పీఠిక.)

విషయాన్ని సంగ్రహిస్తున్నాను గాని లేకపోతే ప్రామాణికంగా యెవరెవరు ఎక్కడెక్కడ రేఫ ఱకారాలను తారుమారుగా వాడారో చూపాలంటే ప్రయోగాలు కోకొల్లలుగా వున్నాయి. కేవలం ఆ ప్రయోగాలను వాటి తారుమారుల గురించిన విషయాలను సమగ్రంగా వ్రాస్తే ఎట్లా లేదన్నా ముద్రణలో వంద పేజీలు తేలిగ్గా వస్తుంది.

రేఫ ఱకారాలకు యతిప్రాసలు చెయ్యకూడదని అంతగా భీష్మించి వాటి మైత్రి నంగీకరించని వారి నందరినీ కుకవులుగానూ అజ్ఞులుగానూ చిత్రించిన అప్పకవే రేఫఱకారాలకు యతిప్రాసలను వేసినప్పుడు ‡ యింక యితరుల గురించి చెప్పనవసరం లేదుగదా! –

అసలు రేఫశకట రేఫలు సవర్ణాలని పేర్కొంటూ చింతామణి కర్త,అప్పకవి,యిద్దరూ "నాన్యేషాం సాధర్మ్యం లఘ్వలఘూనాం రయోస్తుసిత్యం స్యాత్" అనే చింతామణి సూత్ర విషయాన్ని ఆమోదించడం ఆశ్చర్యకరంగా వుంది. రకార ఱకారాలు సవర్ణాలే అయితే వాటికే లఘ్వలఘు భిన్నత్వం పెట్టడంలో అర్థమేమిటి? రకార ఱకారాలు సవర్ణాలైతేనే గదా వాటికి లఘ్వలఘుత్వాన్ని ప్రతిపాదించడానికి అవకాశం– సవర్ణత్వాన్నే అంగీకరించి లఘ్వలఘువులని రఱలను పేర్కొని విభజించుకొన్నప్పుడు యతిప్రాసల్లో మైత్రి నంగీకరించడానికి అభ్యంతరం వుండడంలో అర్థం లేదు – అదే విధంగా చిన్నయసూరి కూడా సరిగ్గా యీ చింతామణి సూత్రాలనే అనువ

‡ అప్పకవి రేఫ ఱకారాల మైత్రిని వుపయోగించాడని శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు అప్పకవీయ పీఠికలో తెలియజేసి ఆ ప్రయోగాలు వుదాహరించారు.

దించి రకార ఱకారాలకు లఘ్వలఘుత్వాలను ప్రతిపాదించి "యవలలు లఘ్వలఘులు మైత్రిం బొరయు రేఫంబులు పొరయవు" (బాల - ప్రకీ. 24 సూ.) అని రేఫలమైత్రిని వ్యతిరేకించడం సమంజసంకాదు - రకారాన్ని లఘు రేఫగాను ఱకారాన్ని అలఘు రేఫగాను అంగీకరించినప్పుడు ఆ రెండింటికీ యతి ప్రాసలను నిరభ్యంతరంగా అంగీకరించవచ్చు - రకార ఱకారాలను జాగ్రత్తగా పరిశీలించి మరీ యతిప్రాసలు వెయ్యాలనీ, "ర, ఱ"లను భ్రమపడి తారుమారుగా వ్రాయకూడదనీ అప్పకవి పేర్కొన్నాడు. కాని తానే భ్రమపడి "ర-ఱ"లకు మైత్రిని ప్రయోగించాడు- "ర, ఱ"లకు మైత్రిని పాటించి యతి ప్రాసలను పయోగింప బట్టే పోతన భాగవతం ప్రామాణిక గ్రంథం కాకుండా పోయిందని అప్పకవి పేర్కొన్నాడే పూర్వోదాహృతాలైన రకార ఱకార సాంకర్య ప్రయోగాల ననుసరించి నన్నెచోడాది తిక్కనాది మహాకవుల గ్రంథాలు ప్రామాణికాలు కాకుండా పోవలసిందేనా ? ఇంతా కష్టపడి అప్పకవి వ్రాసుకొన్న అప్పకవీయంలోనే ర, ఱల సాంకర్యం జరిగింది కాబట్టి అప్పకవి వాక్యం ప్రకారం ఆతని గ్రంథం అప్రామాణికం కావలసిందేనా? ఎవరి గ్రంథాలూ అప్రామాణికాలు కావు. నన్నెచోడాదుల గ్రంథాలతోపాటు తిక్కనాదుల గ్రంథాలు పోతన్న భాగవతంతోసహా అన్నీ పరమ ప్రామాణికాలే.

ప్రాచీన కాలంలో అన్యహల్లులతో ఱకారాన్ని కలిపి సంయుక్తంగా వ్రాస్తుండేవారు. అంటే ఈ నాడు మనం చేబ్రోలు అని వ్రాస్తున్నట్లుగా మామూలు శ్రావడి వ్రాయ

కుండా చేబ్ఱోలు అని బకార ఱకారాల సంయుక్తంగానే ప్రాచీనులు వ్రాస్తుండేవారన్న మాట. ఱకారం రేఫకు సంబంధించని ప్రత్యేకవర్ణం కాబట్టే ఆ విధంగా సంయుక్తంలో దాన్నే విని యోగించడానికి ఆస్కారం లభించింది. అనంతుని కాలం వరకూ కూడా కావ్యాల్లో ఈ శకట రేఫసంయుక్త లేఖనం వున్నదని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఈ క్రింది పద్యంలో అనంతుడు

గీ॥ నుఱులురులు పొల్లులౌను తెనుంగునంది
హేమమిది పదాఱ్వన్నెనల్క్రొము లతఁడు
ప్రబలి హరిఁగొల్చియున్న వార్పరమమునులు
గోటిలో నొప్పు సతికిఁ గన్గొన లనంగ ॥

(అనం - ఛం - 1 ఆ. 66 ప.)

అని ఱుకారంలో ఉత్వలోపం చెప్పకొని "పదాఱ్వన్నె" అనే శకట రేఫ సంయుక్త రూపాన్ని సాధించాడు - తాళపత్ర ప్రతుల్లో పదాఱ్వన్నె అనే వున్నది. అనంతరం చివరికి వావిళ్ళ వారి ముద్రిత ప్రతిలో సైతం "పదాఱ్వన్నె" అనే వున్నది - "అలఘు రేఫంబు లుష్ట్రా చ్ఛాంబగుచో లఘు రేఫంబగు" (ప్రౌఢ-వ్యా. ముక్తలక్షణ వివేచనం.) వంటి విధులు పూర్వ కాలంలో లేవు. శకట రేఫనుగూడా అన్య హల్లుల్లో శకట రేఫ గానే వ్రాస్తుండేవారు. కాబట్టే అనంతుడు మామూలుగా శకట రేఫలో ఉత్వలోపం మాత్రమే చెప్పాడుగాని సర్వలోపం జరిగినప్పుడు శకట రేఫ సాధు రేఫగా మారుతుందని చెప్పనే లేదు - మామూలుగా చేకూఱు అన్నప్పుడున్న సాధు రేఫ హ్రస్వ పూర్వకమైతే - అంటే - చేకుఱు అని అయితే చేకుఱు

అని శకట రేఫే వ్రాయాలిగాని సాధు రేఫ వ్రాయకూడదట - చేకూరుఅన్నప్పుడున్న రకారారం "కూ" కారానికి హ్రస్వంవచ్చేసరికి "ఱ" కారంగా మారుతుందట-అలాగే శకట రేఫ లుప్తాక్షరమైతే సాధు రేఫగా మారు తుందట-ఇలా అవసరమైతే రకారం ఱకారంగాను ఱకారం రకారంగాను మారుతుందట - కాని ఆ రెంటికీ యతిప్రాసలు చెల్లనేరవట. చేకూరువంటిరూపాలలో రేఫ హ్రస్వ పూర్వకమైతే చేకుఱు అని శకట రేఫగా మారుతుందని అప్పకవి కూడా చెప్పాడు. ఇంతగా వుచ్చారణ వశంచేత శకట రేఫ సాధు రేఫవంటిది కాగా ఇతర కార్యాలలో "ర"కార "ఱ" కారాలకు పరస్పర సవర్ణత్వాన్ని అంగీకరించడమూ యతి ప్రాసల విషయాల్లోకి వచేసరికి సవర్ణత్వాన్ని నిరాకరించడమూనా? ఎంత అన్యాయం! ఈ రేఫ ఱకారాలకు యతిప్రాసల్లో సవర్ణత్వాన్ని అంగీకరించని పెద్దలు శకట రేఫను వర్ణాంతరంగా పరిగ్రహించినా బాగుండేది. శకట రేఫను వర్ణాంతరంగానూ భావించక సాధు రేఫ శకట రేఫలకు యతి ప్రాసమైత్రినీ అంగీకరించక క్రమరహితంగా వ్యవహరించడం అర్థవంతమెలా అవుతుంది? రకార ఱకారాల యతిమైత్రి నంగీకరించని ప్రముఖులు చక్కగా రకార ఱకారాలకు అసలు సంబంధమే లేదనే ప్రాచీన వర్ణ స్వరూపాన్ని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పి ఱకారాన్ని ప్రత్యేక వర్ణంగా పరిగణించి దాని ప్రత్యేకతను నిలబెట్టి వుంటే యెంత బాగుండేది! లేదా ఱకారానికి పూర్వ కాలంలో ప్రత్యేకమైన స్థితివున్నప్పటికీ అది జనోచ్చారణలో భ్రష్టమై రకారం వంటిదైపోయి మహాకవుల చేత యతి ప్రాసల్లో రకారంతో సమానంగా వ్యవహరింపబడింది కాబట్టి

దీన్నింక పృథగ్వర్ణంగా పేర్కొనవలసిన అవసరం లేకుండా అలఘు రేఫ రూపంలో రేఫ సంబంధిగానే వ్యవహరించుదామని స్పష్టంగా వున్న విషయాన్ని చెప్పి రకార ఱకారాలకు యతి ప్రాస మైత్రిని అంగీకరించి వుంటే యెంత బాగుండేది?

అయితే యింతవరకూ యీ పరిశీలనవల్ల తేలేది ఱకారం ఆదిలో ప్రత్యేకమైన "ఱ" కార భిన్నమైన స్వభావం కలదే అయినప్పటికీ అది వ్యవహారంలో భ్రష్టమై "ర"కారంతో సమానమైన వుచ్చారణను పొంది రకారంతో సరిసమానంగా కావ్యాల్లో యతి ప్రాసల్లో వ్యవహరింప బడిందనేగదా?

ఱకారం విషయమై ఈ సందర్భంలో ముఖ్యంగా గమనించవలసిన విషయం వొకటుంది. ఱకారంతో అన్యహల్లు కూడినప్పుడు శ॥ 11వ శతాబ్దంలోను దానికి పూర్వమూ ఱకారాన్ని వ్రాసేవారే కాదు. అర్క, పర్కి, భర్గుడు, వర్గము మొదలైన పదాలలో రేఫను మనం వ్రాసినట్లుగా వ్రాసేవారు కాదు. ఱకారానికి మారుగా వలపలగిలక వ్రాస్తుండేవారు. ఈ వలపలగిలక ఱకారానికి మారుగా తెలుగు లిపిలో యెందుకు వ్రాయబడుతుండేదో కారణం యింతవరకూ పరిశోధకులకు అందలేదు. ఱకారానికి - "ఱ"కారం వంటి వుచ్చారణ నన్నయ్యకు పూర్వకాలంలోనే సంక్రమించిందని లోగడనే వ్రాసాను - ఆ విధంగా నన్నయ్యకు పూర్వమే ఱకారానికి రకారోచ్చారణ సంక్రమించి విరివిగా వ్యవహరింపబడుతున్నది. కాబట్టే నన్నెచోడుడు తన కుమారసంభవంలో "ఱ, ర" లకు ప్రాస మైత్రిని పాటించాడు-నన్నయ్యకు ప్రాచీన కాలంలోనే ఱవర్ణానికి రవర్ణోచ్చారణ యేర్పడటం వల్ల ఆ రెండింటికీ స్పష్టంగా

తేడా తెలియడానికై రకారానికి అన్యహల్ సంయోగం కలిగే టప్పుడు వలపలగిలక వ్రాయాలని కొత్తగుర్తు నేర్పరచుకొన్నా రేమోనని ఒక వూహ పొడకడుతోంది. కాని కేవలం యీ వూహే సరైనదని నేననను. ఇంతకంటే వలపలగిలక అవస రాన్ని గురించి విశేష విషయాలను ఎవరైనా పరిశోధకులు తెలియచేస్తే వారి కెంతో కృతజ్ఞుడనై వుంటాను—

ప్రాచీన కాలంలో రాముండు మొదలైన పూర్ణబిందు పదాలను "రాముంణ్డు" మొదలైన పూర్ణబిందు సహిత ద్విత్వ యుక్త పదాలుగా పండిత కవులు వ్రాసుకొన్నట్లే అర్క, భర్గ, వర్గ,వంటి పదాలను అక్కౖ, భగ్గౖ,వక్కౖ అని వ్రాసుకొనే వారు. "రాముంణ్డు" అన్నప్పుడు ద్విత్వం వ్రాసుకొని రాముండుగా ఎలా చదువు కొనేవారో అలాగే "అక్కౖ, భగ్గౖ"వంటిపదాలలో ద్విత్వమూ,వలపలగిలకా వ్రాసుకొన్నా అర్క, భర్గ అనే పద్ధతిలోనే చదువుకొనే వారు. "అక్కౖ, భగ్గౖ"ల వలే వ్రాసుకొనడమూ వాటిని చదవవలసి వచ్చేసరికి రేఫ సంయుక్తాలుగా అర్క, భర్గ, ల వలే చదువుకొనడమూ జరుగుతుండడంవల్ల నన్నెచోడాదులు ప్రమాదవశులయ్యారు- ఉచ్చారణలో రకారం మొదటా యితర హల్లు తర్వాతా యీ నాడు వుచ్చరింప బడుతున్నట్లే వుచ్చరింపబడేది. కాని వ్రాయ వలసి వచ్చేసరికి మొదట వుచ్చరింపబడే వర్ణాన్ని మనం మొదట వ్రాస్తున్నట్లు కాకుండా నన్నెచోడాదులు మొదట వుచ్చరింప బడేదాన్ని (రేఫ రూపమైన వలపల గిలకను) తర్వాతా తర్వాత వుచ్చరింపబడే దాన్ని ద్విత్వయుక్తంగా మొదటా

వ్రాస్తుండేవారు - ఈ విధంగా అర్క మొదలైన పదాలను అక్కా మొదలైనవిగా వ్రాయుడంవల్ల వాటిని రకార సంయుక్తాలుగా కాక ద్విత్వ హల్లులుకలవిగా భావించేవారు-కాబట్టే నన్నెచోడుడు తన కుమార సంభవంలో భర్గ, తర్గ శబ్దాలను భగ్గ, తగ్గ శబ్దాలుగా నుగ్గు, మ్రుగ్గు శబ్దాలతో సమానంగా ప్రాసలో యీ క్రింది పద్యంలో ప్రయోగించాడు -

శా॥ (భర్గుం) భగ్గుఁడండంతక వాహినుల్ భంజించు నట్లైన్మెయిన్
(దర్గ) దగ్గంగా రథపత్రముల్ విఱిగివేదండాంకురానీకముల్
నుగ్గాడన్ భట కోరకంబులలరన్ నూత్నాశ్వపుష్పౌఘముల్
మ్రగ్గింతున్ చిరసైన్య పద్మవనమున్ మద్బాణవర్షంబునన్

(కు. సం - 11 ఆ. 38 ప.

ఇదేవిధంగా మల్లిఖార్జున పండితారాధ్యుడు తన శివతత్వసారంలో ఈ క్రింది పద్యాలలో "ధర్మ" శబ్దాన్ని "ధమ్మా" శబ్దంగాను, సర్వజ్ఞ శబ్దాన్ని "సవ్వాజ్ఞ"శబ్దంగాను ప్రాసలో ప్రయోగించాడు.

క॥ నమ్మిన భక్తుఁడు గన్నడ
బమ్మయు సద్భక్తి మహిమ పరికింపఁగ లో
కమ్ములఁ జోద్యముగాఁదె య
(ధర్మం) ధమ్మాంబును ధర్మమయ్యెఁ దత్వాతీతా ! ॥

క॥ ఇవ్వసుమతిఁ గడుఁగమ్మని
ప్రువ్వులలోఁ బుట్టినట్టి పువ్వులు గొఱయే
(సర్వ) సవ్వాజ్ఞ భక్తివిరహితుఁ
డెవ్వఁడు నుత్కృష్టజాతుఁడేటికిఁ గొఱయే ॥

ఇలాగే పాల్కురికి సోమన్న తన బసవపురాణంలో "కర్జ" శబ్దాన్ని "కజ్జ" శబ్దంగాను, "నిర్జీవి" శబ్దాన్ని " నిజ్జీవి " శబ్దంగాను ప్రాసలో ప్రయోగించాడు.

ద్విపద॥ (కర్జంబు) కర్జంబు నాకును గర్జంబు దంత
లజ్జయును సిగ్గును బుజ్జగింపంగ॥

(బసవ. పు. 107 పుట.)

అర్జునకు వినిపింపఁగ నతఁడు
(కర్జ) కర్జ మెంతేనియుఁ గలుగు నేరాడు॥

(బసవ - పు - 193 పుట.)

బుజ్జగింతును వెన్నెల్లను నేర్పు
(నిర్జని) నిర్జని క్రీడలను నివర్జఁగంటు॥

పూర్వం చెప్పినట్లు దీర్ఘాక్షరాలమీద ద్విత్వం లేకుండా వాండు - లేండు, కాంగోలు కాంగుట్ట వంటివి వ్రాసుకొన్నట్లే దీర్ఘాలమీద రేఫతో అన్యహల్లు సంయుక్తమైనప్పుడు నేచిఁన అని మీఁదిహల్లు ద్విత్వ రహితంగానే వ్రాసుకొనేవారు. పైనుదాహరించిన హ్రస్వ ప్రయోగాలవలె ద్విత్వ యుక్తంగా వ్రాసేవారు కాదన్నమాట. నేర్తు, నేర్చిన, వంటి ఈసంయుక్త పదాలను నేతుఁ, నేచిఁన అని వలపలగిలకగల పదాలుగా మహాకవి తిక్కన యీ క్రింది పద్యాలలో ప్రాసలో ప్రయోగించాడు.

క॥ ద్యూతక్రీడకుఁ గొండొక
(నేర్తు) నేతుఁ ననఁగ పటమున నొప్పని జనంబులు నా
చేతి ధన మెల్లఁ గొనిపరి
భూతునిఁ జేసిన విరక్తిపుట్టె వెడలితిన్॥

(భార - విరా - 1ఆ - 196ప.)

క॥ కాచికొని వచ్చితగనా
(నేర్చి) నేచిఁన యట్లుచనుటనచట నిల్పితి మునినా
థా! చేటును భంగంబును
నైచిత్తము శోకమునకు నంగంబయ్యెన్॥

(భార - సభా - 1ఆ - 215ప.)

ఈ విధంగా వలపలగిలక వ్రాతలో వుండడంతో రేఫ రహిత వర్ణప్రాసను ఇక్కడ తిక్కన చెయ్యడం చూచిన అప్ప కవి ఈ క్రింది పద్యం రచించుకొని

క॥ నేరుచునట్టి లపితము
లో రేఫంబచ్చుతోడ లోపంబగు గా
ధారమణ వలసి వప్పుడు
భారతమున సోమయాజి పలుకుట వలనన్ ॥

(అప్ప. 2 ఆ. 242 ప.)

అని రేఫకు లోపం చెప్పుకొని "నేతు, నేచిన" అనే రూపాలను నేర్తు, నేర్చిన, అనేవాటికి మారు రూపాలుగా సృష్టించి పెట్టాడు. ఈ అప్పకవి పద్యాన్ని చూచిన చిన్నయ సూరికూడా "నేర్చుటకు లిప్త్యాదులు ముత్త్వం బరంబగునపుడు రుచులకు లోపంబు బహుళంబుగానగు" (బాల, క్రియ - 97 సూ.) అని సూత్రం సృష్టించుకొని పై తిక్కన ప్రయోగాలను నేతును, నేచిన అనేరూపాలుగా సాధించుకున్నాడు.

వాస్తవానికి తిక్కన యిక్కడ "నేర్తును" "నేర్చిన" అన్నప్పుడున్న రేఫలు లోపిస్తాయని భావించి వాటిని ప్రయోగింపలేదు. నేతుఁను, నేచిఁన అని వలపలగిలక వ్రాసుకొనే అలవాటు వుండడంవల్ల అక్కడ రేఫవున్న సంగతి మరచిపోయి కేవల "త" కార "చ" కారాల ప్రాసను ప్రయోగించాడు. వాస్తవానికి అవి రేఫలోపం జరిగిన రూపాలుకానేకావనీ, తిక్కన వలపలగిలకవల్ల ప్రమాదవశుడయ్యాడనీ గమనించిన కొందరు లక్షణవేత్తలు ఆ పదాలను రేపయుక్తాలుగానే సంస్కరించుకొని అందులో తిక్కన సంయుతాసంయుత ప్రాస

ప్రయోగించాడని తలంచారు. అందు పైనుదాహరించిన పద్యాలను

క॥ ద్యూతక్రీడకుఁ గొంకక
నేర్తును గపటమున నొప్పని జనంబులు నా
చేతిధన మెల్లఁగొని పరి
భూతునిఁజేసిన విరక్తిపుట్టి వెడలితిన్ ॥

క॥ కాచికొని వచ్చి తగనా
నేర్చిన యట్లుచనుట నచటు నిల్పితి మునినా
థా! చేటును భంగంబును
నైచిత్త్యము శోకమునకు నంగంబయ్యెన్॥

వలే నేస్తును, నేర్చిన, అని రేఫ సంయుక్తాలుగానే వ్రాసుకొని ఆ పద్యాలలో సంయుతా సంయుత ప్రాసను తిక్కన ప్రయోగించాడని భావించే వారన్నమాట – అలా భావించిన వారిలో లింగమగుంట తిమ్మకవి వొకడు. ఈ తిమ్మకవి తన ఛందో గ్రంథమైన బాలబోధచ్ఛందస్సులో ‡ "ఉభయప్రాస" అనే పేరుతో అనంతుడు తన ఛందో దర్పణంలో చెప్పిన

క॥ చూడఁగ లకారరేఫలు
కూడియు వేర్వేరఁ దానకుండి తగఁ దో
డ్తోడన యుభయప్రాసము
జాడఁబడు నసంయుత ప్రసంగతఁ గృష్ణా!

అనే పద్యాన్ని లక్షణ పద్యంగా పరిగ్రహించి పేర్కొని ఆలక్షణానికి లక్ష్యాలుగా "రేఫశ్లిష్టమునకు విరాటపర్వమున... మౌసల పర్వమున..."అని పై"ద్యూతక్రీడ" ఇత్యాది పద్యాన్నీ "కాచికొని" ఇత్యాది పద్యాన్నీ వుదాహరించాడు.

---

‡ బాలబోధచ్ఛందం తాళపత్ర ప్రతి నా వద్ద వున్నది. ఇది **అముద్రితం.**

పైన వుదాహరించిన తిక్కన ప్రయోగాలలో వలపల గిలకవల్ల ప్రమాదవశాన పడిన ఆ ప్రాసను "నేర్తును, నేర్చిన" అని రేఫయుతంగానే వ్రాసుకొని అందులో తిక్కన రేఫసంయుతానికి, రేఫాసంయుతానికి ప్రాసవేసాడని తలంచబట్టే తర్వాతి కవులు పెక్కుమంది యీ క్రింది పద్యాలలో రేఫ సహితానికి రేఫరహితానికి ప్రాసవేసారు.

సోముని హరివంశమునందు—

శా॥ నాతో మార్కొనలేరు నిర్జరపురీ నాగేంద్రబృందారకా
రాతుల్మున్నగ దేవసంఘములు పోరన్ధీరసంగ్రామ కుం
ఠీత్రైలోక్యమునందుఁ గల్గఁడు రణంబెచ్చోట్ల లేకుండఁగాఁ
జేతుల్వేయు వృథాభరంబగుచు వచ్చెన్ దేవయీమేనికిన్॥

దేవీ విజయమునందు—

తే॥ గీ॥ వాక్ప్రకీర్తిత్రాంగ నాశచీశక్తులధిక
సంభ్రమంబునఁ గుంభనిశుంభదైత్య
హంత్రిఁబూజింపుదురు త్రయీమంత్రములను
స్తోత్రములుచేసి మంగళారాత్రిక లిడి॥

పద్మపురాణము నందు—

క॥ శ్రీకర చక్రాంకితులగు
లోకులు శుద్ధులును బుణ్యులును నగుదురు శా
స్త్రీక్రియలు లేకయుండినఁ
బ్రాకృతులనఁ బతితులనఁగఁ బడుదురు జగతిన్॥

అనంతుడు అప్పకవి మొదలైనవారు కొందరు అన్య హల్లుంతో రేఫ కూడినప్పుడే సంయుతా సంయుత ప్రాస చెల్లు

తుందని భావించి లక్షణాలు చెప్పారు. (చూ - అసం - ఛం- 1ఆ - 53ప. అప్ప - 3ఆ - 314ప.) అంటే రేఫ ప్రథమ హల్లుగా కాక ద్వితీయ హల్లుగానే వున్నప్పుడు పైనవుదాహరించినట్లు "నాత్రో...రాతు...డ్రైత్రె...జేతు—2వాక్ర......శక్తి—3సంభ్ర...కుంభ—4శక్ర...లోకు...రీక్రి...ప్రాక్ర—" వంటి చోట్ల సంయుతానికి అసంయుతానికి ప్రాస చెల్లుతుందని లక్షణాలు చెప్పారన్న మాట - రకారం ప్రథమ హల్లుగా వుండి యితర హల్లు ద్వితీయ హల్లుగా వున్నప్పుడు సంయుతాసంయుత ప్రాస చెల్లదని భావించారు. అంటే లోగడ వుదాహరించిన " 1. ద్యూత . . . నేర్తు . . . చేతి . . . భూతు - 2. కాచి . . . నేర్చి . . . ధాచే . . . నైచి" వంటి చోట్ల సంయుతానికి అసంయుతానికి ప్రాస చెల్లదని భావించారన్న మాట. ఆ విధంగా భావించ బట్టే అప్పకవి పై తిక్కన పద్యాలలో "నేర్తును, నేర్చిన" అన్నప్పుడు రేఫ లోపం జరిగిందని భావించి లోప కార్యం చెప్పుకొని ప్రాస సరిపోయిందని భావించాడు - లింగమగుంట తిమ్మకవి పేర్కొన్నట్లు పై తిక్కన పద్యాల్లో వున్న "ద్యూత......నేర్తు" వంటి చోట్ల మాత్రం సంయుతా సంయుత ప్రాస యెందుకు కారాదు - "రేఫే ఒక చోట వుండడం మరొక చోట లేకపోవడం" అనేగా సంయుతాసంయుత ప్రాసకు లక్షణం - రేఫ ముందుంటే యేమిటో తర్వాత వుంటే యేమిటో ? ఇక్కడ అసలు సంయుతాసంయుత ప్రాసంటే ప్రాసలో అన్య హల్లుతో రేఫఒకచోట కలిసి వుండడమూ మరొకచోట అసలు వుండక పోవడమే

గదా జరగవలసింది. అయినప్పుడు రేఫ ముందున్నా తర్వాత వున్నా వొకటికాక యేమవుతాయి - తిమ్మకవి గ్రహించినట్లు భావిస్తే దోషమేమిటి?

నాత్రో మార్గాని......

రాతుల్మున్నగ.........

డ్రిపైర్లోక్య............

జేతుల్ వేయు.........

వంటి నాచన సోమనాదుల ప్రయోగాలలోను,

ప్వ్యాత......

నేస్తు......

చేతి......

భూతి......

వంటి తిక్కన ప్రయోగాలలోను ప్రాసలో రేఫ ఒకచోట వుండడమూ యితరచోట్ల లేకపోవడమూ మాత్రమేగా జరిగింది. రేఫ ఒక ప్రయోగంలో రెండవ హల్లుగా వుంది. మరొక ప్రయోగంలో మొదటి హల్లుగా వుంది. ఎక్కడున్నా ప్రాసలో వున్నట్టేగదా లెక్క - అయినప్పుడు అప్పకవి పై తిక్కన ప్రయోగాలను సంయుతా సంయుత ప్రాసగా ఆమోదించక రేఫకు లోపం చెప్పుకోవలసిన అవసరం యేమున్నది? శివకవుల ప్రయోగాల్లో భగ్గ, తగ్గ అని ద్విత్వ యుక్తాలుగా ప్రయోగించబడ్డాయి - తిక్కన ప్రయోగించిన "నేతుల" వంటి రూపాలను "నేస్తు" గా సంస్కరించుకొని తిమ్మకవి

సంయుతా సంయుత ప్రాసగా ఆమోదించిన విధంగానే ఈ శివ కవుల † వలపలగిలక ప్రయోగాలను

— భర్గుండ......
తర్గంగా......
నుర్గ్గాడన్......
ప్రమర్గింతున్......
— కర్మ......
నిర్మాత......
తమ్ర్ములు......
— బిర్జలు......
కర్జము......

వంటివిగా సంస్కరించుదామా అంటే భర్గ, తర్గ శబ్దాలను భర్గ, తర్గశబ్దాలుగాను; కర్మ, నిర్మాత శబ్దాలను కర్మ, నిర్మాత

† ఇటువంటి వలపలగిలక ప్రాసనే సుమతీశతక కర్త

క॥ ఎప్పుడుఁ దప్పులు వెదకెడి
నప్పురుషుని గొల్వఁగూడదది యెట్లన్నన్
సప్పకాంబు పడగనీడను ॥
....

అని "ప్ప" కారప్రాసలో "సప్పట" అని సర్పశబ్దాన్ని వ్యవహరించగా ఆధునికులు దానిని "సప్ప" గా దిద్ది సర్పానికి సప్ప శబ్దం తద్భవమన్నారు. ఈ విధంగానే "కర్జ" శబ్దతద్భవంగా "కర్జము" అనే దాన్ని సృష్టించారు - ఇంక యిటీవల శ్రీ వఝ్ఝలవారు పై నన్నెచోడాదుల ప్రయోగాలను చూచి "నిర్జీవి" మొదలైన పదాలకు "నిర్జీవి" మొదలైన తద్భవ పదాలను సృష్టించి పెట్టారు. (చూ. ఆం. వ్యా. సం. సర్వస్వం. 160-161 పుటలు)

శబ్దాలుగాను, కర్జశబ్దాన్ని కర్జశబ్దంగాను గ్రహించాల్సివస్తుంది. కానివాటిల్లో గకార మకార జకారాలకు ద్విత్వం వుండడం వ్యాకరణసమ్మతంకాదు. కాబట్టి తిక్కన ప్రయోగాల్లాగా వాటిని సంస్కరించడానికి అవకాశంలేదు. "భర్గ...తగ... నగు" వంటిపద్ధతిలో ద్విరుక్త గహితమైన ప్రయోగాలుగా శివకవులు ప్రయోగించివుంటే తిక్కన ప్రయోగాలను సంస్కరించినట్లే సంస్కరించడానికి అవకాశంవుండేది. ఇంతకూ యిక్కడ మనకు వలపలగిలకవల్ల ప్రాచీనకవులు భ్రమప్రమాదవశులయ్యారనీ, నేస్తను, నేర్చిన అన్నప్పుడు అప్పకవి చిన్నయసూరులు రేఫకు లోపంచెప్పడం పొరపాటనీ, తేలుతున్నదిగదా! -

ఈ పరిశీలనలో మనకు శకటరేఫ ఉచ్చారణలో తన వ్యక్తిత్వాన్ని కోల్పోయి, సాధురేఫతో సమానమైన వుచ్చారణను పొంది నిత్యవ్యవహారంలో అకార రకారాల వ్యత్యస్తానికి అవకాశం కల్పించిందనేదే చాలా ముఖ్యమైన విషయం - సాధురేఫ శకటరేఫలకు యతిప్రాసల్లోమైత్రి వ్యవహారవశంచేత సంభవించేదేగాని వేరుకాదనేదికూడా ముఖ్యమైన విషయం -

— శ, స —

"శ, స"లకు రెండింటికీ కూడా వివార, శ్వాస, అఘోషాలు బాహ్య ప్రయత్నాలు. ఈ బాహ్య ప్రయత్న మిత్రత్వాన్ని పురస్కరించుకొని జనవ్యవహారంలో "శ, స"లు తారు

మారయ్యాయి - శకారం అసలు తెలుగు వర్ణంకాదు. అది సంస్కృతంలో నుంచి సమ రూపంలో తెలుగులో ప్రవేశిం చింది. ఈ నాడు మనం నిత్య వ్యవహారంలోను వ్యావహారిక రచనలోను వ్రాసాడు, వ్రాశాడు, చేసాడు, చేశాడు, కోసాడు, కోశాడు, అని శకారసకారాలను తారుమారుగా ఎలావాడుతు న్నామో అలాగే ప్రాచీనకాలంలో పండితులు కవులు కూడా వుచ్చారణ ననుసరించి శసలను తారుమారుచేసి వ్యవహరించే వారు. శిఖరం, పిశితం, కౌశికం, శేముషి మొదలైన శవర్ణాలుగల సంస్కృత సమ పదాలను సిఖరం, పిసితం, కౌసికం, సేముషి మొదలైన సవర్ణాలు గల పదాలుగాను; నాసిక, సిత, సేక మొదలైన సకారాలు గల సంస్కృత సమ పదాలను నాశిక, శిత, శేక మొదలైన శకారాలుగల పదాలుగాను మన ప్రాచీన పండిత కవులు వ్రాస్తుండేవారు. అంతేకాదు అచ్చ తెలుగులో శవర్ణం లేదన్న సంగతి తెల్సి కూడా వ్యవహార వశాన సెనగలు, సేరులు, సెలగోలలు మొదలైన సకారాలు గల అచ్చ తెలుగు పదాలను శెనగలు, శేరులు, శెలగోలలు మొద లైన శ వర్ణాలుగల పదాలుగాకూడా కేవలం పామరులమాట కేమిగాని పండితులు కవులే వ్రాసేవారు. ఇంకయితరుల సంగతేం చెప్పాలి ? ఈ విధంగా శ స లను తారుమారుచేసి పండిత కవులు వ్రాయడం చూచిన అప్పకవి శకార సకారవివేకాన్ని గురించి ప్రస్తావించి ఈ క్రింది పద్యాలు రచించాడు.

క॥ శసలెఱుఁగక చదువంగాఁ
బొసఁగ దదెట్లనిన శకలము సకృత్తనుచో
వసుధ సకలము శకృత్తన
రసికులు నవ్వుదురు గాన రాక్షసవైరా! (అప్ప. 2ఆ.258ప.)

సీ॥ వికృతిపదాదిని వెలయు నాలవహల్లు
మొదలి విభక్తిపైఁ గదిసె నేని
యరయఁ దృతీయోష్మమగు శౌరిసీరలు
దాఁచి గోపస్త్రీల నేఁచెననఁగఁ
బ్రథమోష్మవర్ణంబుఁ బరికింపఁ దద్భవా
ద్యంధ్రిదేశోక్తులయందు లేదు
సింగంబు సింగిణి సెవమును సెలగోల
వీసెఁడుపసిగొనఁ జేసిరనఁగ
తే॥ గీ॥ భీష్మసన్నుత ! యివి తృతీయోష్మలిపులు
గాని ప్రథమోష్మవర్ణముల్ గావు వీనిఁ
దెలియక రచియించు కృతులు ధాత్రీతలమునఁ
బ్రాసభంగంబులై నగుఁబాటుఁ జెందు ॥

(అప్ప. 2 ఆ. 259 ప.)

క॥ తెలుఁగుపదంబుల నెత్వము
గల మూఁడవ యూష్మమును శకారముఁ గాఁగం
బలుకుదు రజ్ఞజనంబులు
సెలగోలలు సెనగలాలు సేరులు ననుచోన్ ॥

(అప్ప. 2 ఆ. 260 ప.)

ఈ పద్యాల్లో ఆనాడు శసలు ఎంతగా తారుమారు పొందాయో అప్పకవి చాలావరకు † స్పష్టపరచాడు - అప్పకవి కాలంలో శకార స్థానంలో సకారాన్ని సకారస్థానంలో శకారాన్ని చాలామంది పండితులు వ్రాసేవారన్న సంగతి అప్పకవి పద్యాలవల్లనే స్పష్టపడు తున్నది - ఎక్కడో నూటికి

† చాలావరకు అని యిక్కడ సాపేక్షతోనే వ్రాసాను. అప్పకవి కాలంలోవున్న శసల తారుమారుగురించిన వ్రాతల విశేషాలను అప్పకవి అన్నింటినీ స్పష్టంగా పేర్కొనలేదు. అందుకే చాలావరకు స్పష్టపరచా డని వ్రాసాను. అప్పకవి పేర్కొనని విషయాలు ముందు చర్చింపబడతాయి.

కోటికి ఒక్కడో యిద్దరో వ్రాసినా పామరులు వ్రాసినా వాటిని పరిగణించి అప్పకవి ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. పండిత కవులే వ్రాస్తుండేవారు కాబట్టి అప్పకవి శసల వర్ణ విచక్షణను ఎత్తి చెప్పవలసి వచ్చింది. అక్షరాలు వ్రాతల్లో తారుమారు కావడానికి మొట్టమొదట పునాది జనుల వుచ్చారణలో తారుమారు కావడమేనని లోగడ అనేకసార్లు పేర్కొన్నాను. ఈ శసల సందర్భంలో అప్పకవి వాటి మార్పిడి వుచ్చారణ వశంచేత వచ్చిందేనన్న సంగతి "శస లెఱుఁగక చదువంగాఁ బొసగదు" అని వ్రాసి బహిరంగ పరచాడు. అప్పకవి వ్రాసినట్లు శసల వివేకాన్ని కల్గిద్దామని తలపోసిన గణపవరపు వెంకటకవి యెంతో పండితుడూ, లక్షణవేత్తా మాత్రమే కాక లక్షణ గ్రంథకర్త అయివుండీ కూడా ఈ క్రింది సీసపాదాల్లో నాలుగుపాదాలు పొరపాటుగా రచించి హాస్యాస్పదు డవ్వడమే కాకుండా ఆశ్చర్యాన్ని కూడా కల్గిస్తున్నాడు - పండితులు కవులు ప్రాచీన కాలంలో ఎంతగా అక్షర విచక్షణ లేని వ్రాతలు వ్రాసేవారో పేర్కొనాలంటే వుదాహరణగా మచ్చుకు ఈ పొరపాటుగా వ్రాసిన నాలుగు సీసపాదాలు చాలు -

ఇంక శకారమ్ము తెఱఁగింతు శేబాస
నునుడి యెత్వాత్వతఁ దనరు వినుఁడి
శింగాణి శిరి శేలు శివిరి శేమంతి
శేశరించెను శేరు శిదరంబు
శిరి శింగణావత్తి శిరిమిడి తరటుశి
రాజి శేమంబు శేరబడులనఁగ

శాబాసనఁగ నిట్టి శబ్దము ల్పదునాల్గు
తెలుఁగునను శకారములగు నవల

మొదలను నడుమను దుది శకారములున్న
సంస్కృత శబ్దాలెసంగుఁ గొన్ని
శాలాశిఖాశేష శమశంఖ శుభశుక్ర
శీతశిలాశుచి శివలనంగ
శలశక్ర శమిశీల శర్మశంపాశ్వేత
శయశాలి శరశర్వ శౌరులనఁగ
శ్యామాశిఖాశిఖిశ్లాఘా శిరశ్శిత
శాంబశయ్యా శ్లక్ష్ణ శస్త్రులనఁగ
శిక్య శిక్యశ్లిష్ట శిష్ట శుభ్రశ్రోత్ర
శుక్లశం ఖశ్రవశ్మశ్రుతులనంగ
శ్రద్ధాశ్లథాశచీశ్యేనశంకాశంకు
శార్ఙ్గి శిశుశ్మశ్రు శంభులనఁగ
శూలి శోణశ్రావ్య శుద్ధి శూకశ్లేష
శీఘ్రశాణాశ్రిత శ్రీలనంగ
శాంతశుక్తి శయన శరణశబల శప
థశమన శకల శతఘ్నులనఁగ
శంకర శేముషీ శైవాల శాలూర
శేఖర శర్కరా శిఖరములన
నాశర కేశవ కౌశిక దాశార్హ
పేశల కౌశల పిశితములన
దశమాశన మశక క్రశిమ దశార్ణా భ్ర
శిమ నిశీథుల శునశిరములన

నశ్రాంత సంశయ విశ్రామ కుశల ప్ర
శస్త విశేష విశాలము లన
నీశాన దేశిక వేశంత నాశక
కశ్మల కూశ్మాండ కశ్యపులన

నాశ్చర్య నిశ్చయ పాశ్చాత్య పశ్చిమ
శశక కృశాను విశదములనఁగ
నైశ్వర్య విశ్వాస శాశ్వత దశనవి
శిష్టకిశోరనిశితములనఁగ
నాశుగోశీరశుగా శంసు విశిఖ వి
శాఖిక శైరు.నిశాంతములన
శశవశావేశ్యాంశు వంశదంశీరాశి
కాశకాశీ కోశదేశములన
బాలిశ శర్కశాప భ్రంశ సదృశాప
దేశాశ్రయాశ ప్రదేశములన
దాశ కశాప్రాంశు వేశ దిశాపాశ
కుశ నిరాశాదశా కోశములనఁ
గీశపేశి ప్రశ్నలేశాంశు వేశ్మాశ్మ
దృశ్యవాంశీ పాంశు వైశ్యులనఁగ
నా దేశకులిశ పలాశని వేశస
దేశ ప్రకాశనిస్త్రింశములన
నిఁక సకారమ్ముల నెసఁగును గొన్ని శ
బ్దమ్ములు దాస సంత్రాస చమస
సీమాత సీతుల సీప్రసూతి స్వసా
లసిత విహాయ సోల్లసకిలాస
రాసలాస వికాస మాసర వాసర
ధూసర కేసర కాసర బిస
సితనాసికా సైకసిక్త బృసీస్మర
భసల వైసారిణ ప్రసవసస్య
పనస మాంసల హంస భసిత సీతాసుత
విస్మయ స్మయ సీధు ఘస్మర సుధ
వసన సునాసీర వాసవసిస్తాసి
వాసనాభ్యాస విలాసములన

(అం - కా - 81, 82పుటలు.)

శేబాసు, శింగాణి, శిరి, శేలు, శేవిరి, శేమంతి, శేక రించెను, శేరు, శీదరంబు, శిరి, శింగణావత్తి, శిరిమిడితరటు, శిరాజి, శేమము, శేరబడు, శాబాసు, అనే తెలుగు పదాలన్నీ శవర్ణాలు గల పదాలట. వెంకటకవి వింగడింపు ప్రామాణిక మేనా? తెలుగు వర్ణాలు లక్షణవేత్తా లక్షణ గ్రంథకర్తాఅయిన వెంకటకవికి తెలియవా? తెలుగులో శకారం లేదనీ ఆ శకారం అచ్చ తెలుగు పదాలలో వుండదనీ అది సంస్కృత సమ పదాల్లోనే వుంటుందనీ వెంకట కవికి తెలియదా? తెలియకేం! అన్నీ తెల్సును - కాని వ్యవహార వశంచేత అవన్నీ శకారాలు గల పదాలనే భావించి అలా పేర్కొన్నాడు - ఒకవేళ యెవ రైనా యిక్కడ వెంకటకవి శకారాలుగల పదాలుగా వాటిని పేర్కొన లేదనీ సకారాలుగల పదాలుగానే పేర్కొన్నాడనీ అనవచ్చు. ఈనాల్గుపాదాలనుసకారాలుకల పదాలుకలవిగాదిద్ది వెయ్యవచ్చు - కాని తాళపత్రప్రతుల్లో అన్నింటా శకా రాలుగల పదాలుగానే వున్నాయి. శవర్ణాలుగల పదాలుగా పేర్కొన్నట్లే వున్నది. సకారాలుగల పదాలుగా వ్రాయబడ లేదు. సకారాలుగల పదాలని చెప్పినట్లూలేదు. అంతేకాదు. శేబాసు, శాబాసు, † అని ఎత్వ అత్వ రూపాలు రెండూ వున్నాయని వెంకటకవి కంఠోక్తిగా పేర్కొనడంవల్ల అవన్నీ శకారాలుగల పదాలుగానే పేర్కొన్నాడని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఏమంటే నిత్య వ్యవహారంలో ఎత్వ సహితమై నపుడు శేబాసు, సేబాసు, వంటి శకార సకారాలుగల పదాలు రెండూ వున్నాయి. కాని అత్వసహితమైనప్పుడు శాబాసు అవి

† శేకారంశాగా మారడం గురించి ముందు చర్చించబడుతుంది.

శకార రూపవ్యవహారమే వున్నదిగాని "సాబాసు" అనే వ్యవహారం లేనేలేదు. కాబట్టి వెంకటకవి ఆత్వరూపం కూడా వున్నదని పేర్కొన్న శేబాసు, శాబాసు పదాలు శకార సహితాలుగా గ్రహించాడనడం విస్పష్టం - దానితోపాటు గణంగా పేర్కొన్న తక్కిన సింగాణి వంటి పదాలుకూడాశింగాణి వంటి శకారాలు గలవే అవుతాయిగాని సకారాలుగలవి యెన్నడూ కావు. కాబట్టి యిక్కడ వెంకటకవి సకారాలు గల పదాలను శకారాలు గలవిగా గ్రహించాడనడం నిస్సందేహం.

ఇక్కడ మరొక విచిత్రం. ప్రథమావిభక్తిమీద చకారం సకారంగా మారుతుంది. కాబట్టి ఆ విధంగా చకారానికి ఆదేశంగా వచ్చిన సకారంగల పదాలనుకూడా సహజసకారాలుకలవిగా భావించడమేకాక, ఆసకారాలకు మారుశకారాలు వ్రాసుకొని వాటిని శకారాలుగల పదాలుగా వెంకటకవి పేర్కొనడం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. చేమంతి, చీదరము, చేరబడు, అనే వాటిల్లో మొదటి అక్షరాలు పరుష చకారాలనడం నిస్సందేహం - ఈ చకారాలు ప్రథమా విభక్తి మీద పరుషాలకు గసడదవాదేశం వస్తుందనే నియమానుసారంగా సకారాలుగా మారతాయి. సంధి వశాన చకారం సకారంగా మారి అసహజమైన (శాబ్దికంకాని) సకారాన్ని సకారంగా కూడా వ్రాసుకోకుండా వ్యవహార వశాన శకారంగా వ్రాసుకొని శకారం గల పదాలుగానే పేర్కొన్నాడు- ఇక్కడ వెంకటకవి రెండు పొరపాట్లు పడ్డాడు - ఒకటి చకారాలుగల పదాలను సకారాలుగలవిగా భావించడం. తప్పుగా యెంచిన ఆ సకారాన్ని కూడా సకారంగానే గ్రహించకుండా

వ్యవహార వశాన శకారంగా గ్రహించడం - ఇంత కంగాళీగా వ్యాకరణకర్త అయిన వేంకటకవిలక్షణ విరుద్ధంగా వ్యావహారికానికి లోబడి వ్రాయడం గ్రాంథికమనీ లక్షణవంతమనీ యెలా అనిపించు కుంటుంది? ఇంతగా వేంకటకవి ప్రమాద వశుడై సకారాలుగల పదాలను శకారాలుగల పదాలుగా గ్రహించడానికి ముఖ్యకారణం వుచ్చారణలో శసలు తారుమారు కావడంలో ఆవుచ్చారణ ననుసరించి తారుమారుగా వ్రాసుకొనే అలవాటు ప్రాచీన పండిత కవులలో పాటు లక్షణవేత్తా లక్షణగ్రంథకర్త కూడా అయిన వేంకటకవికి కూడా వుండడమే.

ఈ విధంగా శసలు వుచ్చారణ వశంచేత తారుమారు కావడం కేవలం అప్పకవి వేంకటకవుల కాలంలోనే జరుగలేదు. ఈ శసలు వుచ్చారణలో తారుమారు కావడం ఆ విధంగా వుచ్చారణ ననుసరించి పండిత కవులు తారుమారుగా వ్రాయడమనేది ఎప్పుడో 11 వ. శతాబ్దం నుంచీ జరుగుతూనే వున్నది. ఈ క్రింది మహాకవుల ప్రయోగాలు పరికించండి.

క॥ ఏసియు నైచియుఁ గొడిచియు
వేసటఁగొండొరులఁ బట్టివిడువక కేశా
కేశిఁ బెనంగుచుఁ బోరమ
హాసురముగఁబోరి రా సురాసురవీరుల్ ॥

(కుమార. 12 ఆ. 161)

ద్విపద॥ శశిలేని నిశి దివస్పతిలేని పగలు
బసవన్నలేని సద్భక్తలోకంబు ॥

(పండితా - మహి. ప్ర.)

క॥ కంసుని బాధలంబడు జగంబుల కింతటు వేగుగాక త
ద్వంశము వేగ వేగుటయుఁ దానొడఁగూడదె యన్నతిందమో
ధ్వంసమొనర్చి శౌరికనుదమ్ములు తమ్ముల చాయనవ్వఁగా
హంసుఁడు ప్రాచ్యపర్వత శిఖాగ్రవతంసత నొందె నొప్పుగాన్ ॥

(హరి. పూర్వ. 9 ఆ. 87 ప.)

ఇటువంటి ప్రాసలు చూచిన అథర్వణుడు శస ప్రాసను అంగీకరించి తన ఛందంలో లక్షణం చెప్పుకోగా ఆ అథర్వణునితోపాటు కస్తూరి రంగకవికూడా శసప్రాస నంగీకరించి తన ఆనందరంగాట్ఛందంలో అథర్వణునిలక్షణపద్యాన్ని వుదాహరించి మరికొన్ని ప్రబంధాలలోంచి లక్ష్యాలను శసప్రయోగాలు కలవాటిని వుదాహరించాడు. అవియివి.

క॥ తొలుత శకారమ్ములు తిగ
గలిగి సకారమొకటైనగాక సకార
మ్ములుతిగ శకారమొక్కటి
గలిగిన శప్రాసమండ్రు కమలదళాక్షా! (101 ప.)

లక్ష్యము—

క॥ † వసునగ సమధీరుండై
పొసఁగిన యానందరంగభూపతి సభనిం
పెసఁగిన తారలనడుమన్
శశిభాసిలుఁరీతి వెలయుజనులు నుతింపన్ ॥ (12 ప.)

---

† ఇది కస్తూరి రంగకవి స్వయంగా రచించిన లక్ష్యపద్యం.

‡ నన్నయభట్టు ఇంద్ర విజయమున -

క॥ ఆసరసి జాక్షి కౌనుకు
గాసరి యొక్కింత పోలు కతమునఁగద యా
కాశ మనంతా హ్వయమునఁ
గేసరి హరినామమునఁ దగెన్ వినుమింద్రా ! (103. ప.)

అప్పన్న ఆంధ్రపద ప్రయోగమున -

క॥ పసలేని పనికిఁ బోయిన
రసభంగము గాక మేలు రానేర్చునె యం
త సహాయ శూరుఁడైనను
దశదప్పిన నేమిసేయు దశరథరామా !॥ (104. ప.)

పరమ భాగవత చరిత్రమున -

క॥ ఆశీర్వదించి శుకుఁ డుచి
తాసీనుండగుచు రాజునంద నునిచి యా
వేశకృపామతి శాప
క్లేశ విషాదాత్ముఁ డగుటఁ గృతనిశ్చయుఁడై॥ (105. ప.)

భాస్కర రామాయణమున -

ఉ॥ వ్రేసియుఁ గేరియుం బొడిచి వ్రేచియుఁ గ్రుచ్చియుఁ జించి తుంచి చి
ట్టేసియుఁ గూల్చియుం బగులనెమ్ములు రాల్చియుఁ గ్రుచ్చి నుగ్గుగాఁ
జేసియుఁ గంఠముల్ దునిమి చిందఱ వందఱఁగాఁగ మోఁదినన్
గీశులు భీతిఁ జెంది దమకించుచు రాఘవు మర్వ చొచ్చినన్॥
(106. ప.)

---

‡ నన్నయ్యభట్టు రచనలుగా వున్న యింద్ర విజయం మొదలైన పద్య గ్రంథాలు నన్నయ్య కృతాలు కావని శ్రీ వీరేశలింగంగారు కవుల చరిత్రలో వ్రాసారు. కాని అవి నన్నయ్య వ్రాసిన గ్రంథాలు కావనడానికి వారు చూపిన వుపపత్తులు సరైనవి కావు - అవి నన్నయ్య రచనలే అనడానికి
[illegible]

జానకీ నాయక శతకమున -

మ॥ కసుమాలంబగు దేహి పుట్టువును నీ కష్టంబులం బాపి ది
వ్య శరీరం బొనరింతు వెప్పుడు నిను న్వ్యాక్రుచ్చివన్ యోగిమా
నసగేహంబుల నుండి లోహము సువర్ణచ్ఛాయలం జేయఁగా
రసవాదంబుల నేర్చి కొంటె రఘువీరా జానకీనాయకా॥ (107ప.)
(ఆనందరం. రా. ఛందం 87, 88 పుటలు)

పైన వుదాహరించిన ప్రయోగాలన్నింటిలోనూ శసప్రాసలు వుపయోగింప బడినట్లు మనకు కన్పడుతున్నాయి. అలాగే రంగకవి శసప్రాసగానే పేర్కొన్నాడు - వాస్తవానికా ప్రయోగాలన్నీ శసప్రాసలు గల పద్యాలు కావు - వాటిల్లో శకార ప్రాస కొన్నింటిలోనూ సకార ప్రాస కొన్నింటిలోనూ ఆయా కవులచేత ప్రయోగింపబడింది. ఏమంటే యీక్రింది విషయాలు గమనిస్తే అసలు రహస్యం తెలుస్తుంది.

నన్నెచోడ పాల్కురికి సోమన్నలు వుచ్చారణ వశం చేత శకారస్థానంలో సకారాన్ని వ్రాసుకొన్నారు. అంటే నన్నెచోడుడు "కేశాకేశి" అనే "శి"వర్ణంకల పదాన్ని "కేశాకేసి" అని "సి"వర్ణం కల పదంగాను, పాల్కురికి సోమన్న "శశి" అనే "శి"వర్ణంగల పదాన్ని "శసి"అని సివర్ణం కలపదంగానూ వుచ్చారణ వశంచేత వ్రాసుకొని సకార ప్రాసను సరిపెట్టుకున్నారు. అంటే నన్నెచోడ పాల్కురికి సోమన్నలు తమ పద్యాలను.

క॥ ఏసియు...............
వేసట...........కేశా
కేసిఁబెనం............
వాకుర ముగఁ......... (కు - మార - 12ఆ - 169ప.)

ద్విపద॥ శశిలేని............

బసవన్నలేని............ (పండితా - మహి - ప్ర.)

అని "కేశి, శశి" శబ్దాలను "కేసి, శసి" శబ్దాలుగా వ్రాసుకొని ప్రాస సరిపెట్టుకున్నారన్నమాట. అయినప్పుడు శబ్దశాస్త్రరీత్యా "కేశి, శశి" శబ్దాలను "సి" వర్ణాలు కలవిగా వ్రాయకూడదు కాబట్టి ఆశబ్దాలను లక్షణవంతాలుగా దిద్దుకుని అథర్వణుని వంటి లక్షణ గ్రంథకర్తలు శసప్రాసను అంగీకరించారు. అదే విధంగా ఈ క్రింది భాస్కరరామాయణ పద్యంలో "గీశులు" అనేది వ్యవహార వశాన "గీసులు"గా ప్రయోగింపబడి ప్రాస సరిపెట్టుకోబడింది-

ఉ॥ వ్రేసియు............చి

ట్రేసియు...............

జేసియు..............

గీసులు...............

రాశి, గీశి, పేశివంటి ఇదంత పదాలకు బహువచనం పరమవుతుంటే మామూలుగా ఉత్వం వస్తుంది. ఆ విధంగా ఉత్వం వచ్చినప్పుడున్న "శు" వర్ణం "సు" వర్ణంగా సులభాపేక్షతో వుచ్చరింపబడుతుంది. అంటే వాటికి బహుత్వంలో రాసులు, గీసులు, పేసులువంటిరూపాలు తయారవుతాయన్నమాట. ఈ విధంగా వ్యవహారంలో రాశులు, పేశులు, వంటిరూపాలు రాసులు, పేసులుగా మారడంచూచి శబ్దరత్నాకరకర్తవంటి వారు కొందరు రాసి, పేసివంటి తద్భవాలను సృష్టించుకోగా బాలవ్యాకరణ గుప్తార్థ ప్రకాశికాకర్తా, నారాయణీయాంధ్ర వ్యాకరణగాణపతవివరణకర్తా తద్భవత్వాన్ని ఆమోదిం్చ

నట్లుగా బహుత్వంలో శవర్ణం సవర్ణంగా మారుతుందనే అభి ప్రాయంతో యీ క్రిందివిధంగా వ్రాసారు.

-"రశ్మి - రాశి - పరదేశి - పేశి - ఇత్యాది శవర్ణ పూర్వకేకారాంతములకుబహువచనంబు చేర్చునపుడు వాని శవ ర్ణంబు సవర్ణంబగు. ఉదా:- రస్ములు - రాసులు - పరదేసులు- పేసులు" (బాల. వ్యా. ప్ర. తత్స - 45 సూ - టీక.)

-"బహువచనంబున రాశి ప్రభృతుల శవర్ణమునకు సకారంబగు". (నారా - గాణ - తత్స - ౭౨సూ.)

ఈ విధంగా బహుత్వం పరమవుతుంటే శకారానికి సకారమే చెప్పాల్సివస్తే "గతాశులు, ఆశ్రయాశులు, జితా శులు" వంటి రూపాల్లో "గతాసులు, ఆశ్రయాసులు, జితా సులు" వంటి దుష్టరూపాలు తయారవ్వడమే కాకుండా అపార్థ ద్యోతకాలు కూడా అవుతాయి-

ఇక్కడ సూత్రార్థ ప్రకాశికాకర్త్రాదులు శకారానికి సకా రాన్ని చెప్పుకున్నారంటే వ్యవహారంలో వచ్చిన మార్పును గ్రంథికంగా లక్షణవంతంగా పరిగ్రహించారన్న మాట. అలాగే వుచ్చరణవశాన గీశులు అనే శకారంగల పదాన్ని గీసులు అని సకారంగల పదంగా భాస్కర రామాయణ కర్త ప్రయోగిం చగా శబ్దశాస్త్రానుసారంగా గీసులు అనేదాన్ని గీశులుగాసరిదిద్దే సరికి ఆ పద్యంలోనూ శస ప్రాస తయారయ్యింది. కాబట్టే లక్షణ గ్రంథకర్తలు కొందరు శస ప్రాసను అంగీకరించి శబ్ద నిర్దుష్టత్వాన్ని సాధించుకున్నారు.

అదే విధంగా పై ప్రయోగాల్లో శకారంకల పదాలను వుచ్చారణ వశాన సకారంగల పదాలుగా ఆయా కవులు ప్రయోగించినట్లే దానికి విపరీతంగా పరమభాగవత చరిత్రకర్త యీ క్రింది పద్యంలో "ఆసీను" అనే పదంలో సకారానికి శకారాన్ని చేసి ఉచ్చారణ వశాన "ఆశీను" శబ్దంగా వ్రాసుకొని ప్రాస సరిపెట్టుకున్నాడు -

క॥ ఆశీర్వాదించి శుకుఁడు చి
తాశీనుండగు ను రాజు నందను నిచి యా
వేశ కృపామతి నాప
ల్లేశ విషాదాత్ముఁ డగుటఁ గృతనిశ్చయుఁడై॥

ఆసీన శబ్దాన్ని శాస్త్ర విరుద్ధంగా "ఆశీన" శబ్దంగా ప్రయోగించ బడడంచూచిన కొందరు లక్షణ గ్రంథ కర్తలు దాన్ని లక్షణ వంతమైన శబ్దశాస్త్ర సమ్మతమైన సకారంగల "ఆసీన" పదంగానే దిద్దుకొని పై పద్యంలో సహితం శస ప్రాస వుపయోగింప బడిందని ఆ ప్రాస నంగీకరించారు.

ఇంకపై నుదాహరించిన పద్యాలలో యిప్పుడు చర్చించిన వాటికి భిన్నమైన పద్యాల్లో వుపయోగింపబడ్డ ప్రాస విషయాన్ని గురించి చర్చించుదాము-

కొందరు యీనాడు నిత్యవ్యవహారంలో సెలవు, సెనగలువంటి సకారాలుగల పదాలను వుచ్చారణవశాన శెలవు, శెనగలు వంటి "శె" వర్ణాలుగల పదాలుగా కూడా వ్రాస్తున్నట్లే ప్రాచీనకాలంలో పండిత కవులుకూడా చాలా మంది వ్రాస్తుండేవారు. సెలవు, సెనగలు మొదలైన పదాలలో సకారానికి బాహ్యప్రయత్న మిత్రత్వంచేత శకారం

వచ్చి శెలవు, శెనగలువంటి రూపాలు అవుతాయని మొట్ట మొదటే చెప్పాను. శెలవు ఇత్యాదుల్లో వున్న ఎకార స్వరా నికి కంఠస్థాన మిశ్రత్వంచేత (అకారానికి కూడా స్థానం కంఠం కాబట్టి) అకారంవచ్చి వుచ్చారణలో శెలవు మొద లైనవి శలవు మొదలైన అత్వవిశిష్ట శకారాలు కలవిగా మారి పోయాయి. ఈ విధంగా మారడం చాలా ప్రాచీనకాలంలోనే జరిగింది. పూర్వకాలంలో పండితులు కవులు సెలవు, అని వ్రాయడానికి శెలవు, అని శె వర్ణం వ్రాయడమే కాకుండా "శెలవు" అని అత్వవిశిష్ట "శ" వర్ణంకల రూపాలవంటివి కూడా వ్రాస్తుండేవారు. కాబట్టే చిత్రకవి పెద్దన

క॥ తలకట్టుగాక యెత్వమె
యలవడుఁ జజసలను మూఁటు నదిమొదలగుచోఁ
దెలుఁగుల మొదళ్ళ నెయిలివి
యలహల్లులు గావు స్వరములగు వ్రాయంగన్ ॥

(ల. సా. సంగ్రహం. 3 ఆ. 6ప.)

గీ॥ చెలువచేకటొప్పు జేనయనంగను
సేసకొప్పనంగఁ జెల్లుమూట
నెఱుకయిరవనంగ నీరెండు పర్ణంబు
లచ్చులగును హల్లులాదిగావు ॥

(ల. సా. సంగ్రహం. 3 ఆ, 7 ప.)

అని చెప్పకోవలసివచ్చింది. ఈ పద్యాల్లో చజల విషయం లోగడనే చర్చింపబడింది. సెలవు మొదలైన పదా లలో సకారంమీాద ఎత్వమే వ్రాయాలికాని అత్వం వ్రాయ కూడదని పెద్దన చెప్తున్నాడు. ఇక్కడ పెద్దన తాను చెప్పదల

చుకున్న విషయాన్ని స్పష్టంగా చెప్పలేకపోయాడు. సెలవు మొదలైన పదాలను శలవు మొదలైన పదాలుగా వ్రాయకూడదని చెప్పాలని పెద్దన అభిప్రాయం - కాని యీ అభిప్రాయాన్ని పైలక్షణపద్యంలో వ్యక్తీకరించలేకపోయాడు. సకారం మీద ఏత్వమే వుంటుందిగాని అత్వం వుండదు. అని చెప్పేస్తే సరిపోతుందనుకున్నాడు. ఇక్కడ ఈతని వాక్యానికివున్న దివున్నట్టుగా అర్థం చెప్పుకుంటే సకారంలో ఎత్వమేగాని అత్వం లేదన్నాడు కాబట్టి పూర్వకాలంలో సెలవు, సెనగలు, మొదలైన పదాలను సలవు, సనగలు అని వ్రాసేవారా? అని సందేహం కల్గుతుంది. కాని అదికాదు అసలు విషయం - సలవు, సనగలు వంటి సకారాలుగల రూపాలను ఏకాలంలోనూ ఎవ్వరూ వ్రాయలేదు - అదీకాక యిక్కడ పెద్దన మాటవల్ల తెలుగులో అత్వ విశిష్ట సకారాలుగల పదాలు లేవని అర్థంవస్తుంది. అంతే కాదు మీదుమిక్కిలి సంగడి, సంత, సరగున వంటి తెలుగు పదాల్లో వున్న సకారాన్ని సెకారంగా సెంగడి, సెంత, సెరగున అనే పద్ధతిలో వ్రాయాలనే నియమం రావడంతో లేనిపోని దుష్ట రూపాలన్నీ తయారవుతాయి. కాబట్టే పెద్దన ఆ పద్యాలు రచించడంలో లోపలతనకున్న భావాన్నంతనీ వ్యక్తీకరించ లేకపోయాడనడం - సెనగలు మొదలైన పదాలలో వున్న సెకారాన్ని అత్వ విశిష్టమైన శకారంగా వుచ్చారణ వశాన వ్రాయ కూడదని ఆతని అభిప్రాయం - అయితే యిక్కడ అతడు శకారం విషయం అసలు యెత్తనే లేదు - ఆ విధంగా శకారం విషయం యెత్తకపోవడం వల్లనే యిక్కడ తన భావాన్ని పూర్తిగా వ్యక్తీకరించ లేకపోయాడు-

ఈ విధంగా సెనగలు మొదలైన పదాలలో సెకారానికిమారు శెకారాన్నీ శకారాన్నీ వ్రాయకూడ దనే అభిప్రాయాన్ని వెల్లడించాలనే అప్పకవి యీ క్రింది పద్యంరచించాడు -

క॥ తెలుఁగు పదంబుల నెత్వము
గల వాఁడవ యూష్మమును శకారముఁ గాఁగం
బలుకుదు రష్ట జనంబులు
సెలగోలలు సెనగ లాఁకు సేసలు ననుచోన్॥

(అప్ప. 2 ఆ. 260 ప.)

ఇక్కడ అప్పకవి సెనగలు మొదలైన పదాలను "శెన గలు" మొదలైనవిగా వుచ్చరించే వుచ్చారణను దృష్టిలో పెట్టు కుని పైనిరసన చేసాడో లేక "శనగలు" మొదలైనవిగా వుచ్చ రించే వుచ్చారణను దృష్టిలో పెట్టుకొని పైనిరసనచేసాడో అని సామాన్యంగా పాఠకులకు సందేహం రావడానికి అవకాశం వున్నది. దీనికి పై పద్యంలో (259 ప.) స్పష్టంగా "ప్రథ మోష్మ వర్ణంబుఁ బరికింపఁ దద్భవాద్యంధ్రదేశోక్తులయందు లేదు, సింగంబు సింగిణి సెవమును సెలగోల వీసెఁడు పసిగొ నఁ జేసిరనఁగ, భీష్మసన్నుత యివితృతీయోష్మ లిపులుగాని ప్రథమోష్మవర్ణముల్ గావు" అని చెప్పాడు. కాబట్టి ఈ 259 వ పద్యం "సెనగలు" మొదలైన పదాలను "శెనగలు" మొద లైనవిగా వ్రాయ కూడదనే అభిప్రాయాన్ని వ్యక్తపరచడానికై వ్రాసాడనీ దీని తర్వాతిదైన "తెలుగు పదంబులు" ఇత్యాది పద్యాన్ని "సెనగలు" మొదలైన వాటిని "శనగలు" మొద లైనవిగా వ్రాయరాదనే అభిప్రాయాన్ని వ్యక్తీకరించడానికై వ్రాసాడనీ తేలుతున్నది. అయినాఅప్పకవి సెనగలు మొదలైనవా

టినిఅత్వవిశిష్టశకారాలుకలవిగాకొందరుపల్కుతూ వ్రాస్తుంటా రనీఆవిధంగా వ్రాయకూడదనీ సుస్పష్టంగా చెప్పివుంటేయెంతో బాగుండేది. ఇంత సుస్పష్టంగా తన అభిప్రాయాన్ని అప్పకవి చెప్ప లేక పోయాడు కాబట్టే లోగడ 327 వ పుటలో "చాలా వరకు స్పష్టపరచాడు" అని వ్రాసాను -

ఈ విధంగా సెనగలు మొదలైన పదాలలో వున్న సకారం వుచ్చారణలో మొదట శేకారంగా మారి శకారంగా మారడం ప్రచురమయ్యే సరికి అది విపరీతమై "శరీరం, శశి" మొదలైన పదాలలో వున్న శకారాలు శేకారాలుగా మారడమే కాకుండా సెకారాలుగా కూడా మారాయి. ప్రాచీన కాలంలో శరీరం మొదలైన పదాలను వుచ్చారణలో తారు మారుగా పల్కడంవల్ల సెరీరంవలే సెకారాలు గలవిగా చాలా మందిపండితులు కవులువ్రాస్తుండేవారు. కాబట్టే కొందరు కవులు వుచ్చారణ వశాన ఈ క్రింది పద్యాలలో "ఆకాశము, వంశము, దశ, శరీరము" వంటి పదాలను "ఆకాసెము, వంసెము, దసె, సెరీరము" వంటి పదాలుగా ప్రయోగించారు -

ఉ॥ కంసుని బాధలం......................త
ద్వంసెము........................
ధ్వంస మొనర్చి....................
హంసుఁడు..................... *

(హరి - పూర్వ - 9అ - 87ప.)

---

* ఈ పద్యం లోగడ 384, పుటలో సంపూర్ణంగా లక్షణ వేత్తల సంస్కరణలో శ-స ప్రాసగా వుదాహరింపబడినది.

క॥ ఆసరసి . . . .
గాసరి . . . . ఆ
కాసె మనంతాహ్వాయ . . . . . .
కేసరి హరినామ . . . . *

(నన్నయభట్టు ఇంద్ర విజయం.)

క॥ పసలేని . . . . . .
పసభంగము . . . . యెం
తసహాయ . . . .
దసె తప్పిన . . . . *

(అప్పన్న ఆంధ్ర పద ప్రయోగం.)

మ॥ కసుమాలం . . . . ది
వ్యసెరీరం బొనరింతు . . . . యోగిమా
నస గేహంబుల . . . .
రసవాదంబుల . . . . *

(జానకీ నాయక శతకం.)

శబ్దశాస్త్రసమ్మతం కాకుండా వుచ్చారణ వశాన "వంసెము, ఆకాసెము, దసె, దసె, సెరీరము" అని సెకారాలు గలవిగా ప్రాసలో ప్రయోగించి సకార ప్రాసను సరిపెట్టు కొన్న యిటువంటి ప్రయోగాలను చూచి కొందరు లక్షణ గ్రంథకర్తలు శబ్దనిర్దుష్టత్వం కోసమై వుచ్చారణవశాన ప్రయోగింపబడ్డ అటువంటి ప్రయోగాలను శకారాలు కలవిగా "వంశము, ఆకాశము, దశ, శరీరము," వంటి రూపాలుగా సంస్కరించారు. ఆవిధంగాశబ్దశాస్త్రరీత్యా ఈశబ్దాలను సంస్కరించు

* ఈ పద్యాలు లోగడ ౩౩౫, ౩౩౬ పుటల్లో సంపూర్ణంగా లక్షణ వేత్తల సంస్కరణలతో శ-స ప్రాసగా వుదాహరింపబడినవి.

కొనడంతో లోగడవలెనే శసప్రాసను ఆమోదింపక తప్పలేదు. తప్పని సరిగా కొందరు లక్షణ గ్రంథకర్తలు మాత్రమే ఈ శస ప్రాసను ఆమోదించి లక్షణంచెప్పుకున్నారు. అనంతాదులు కొందరు ఈ శసప్రాసను అసలు పేర్కొననే లేదు. అప్పకవి స్పష్టంగా శసలకు ప్రాసను అంగీకరించకుండా "పొరపాటుగా శసలను తారుమారుచేసి వ్రాస్తే ప్రాసభంగం ఒరుగుతుం" దని హెచ్చరించాడు.

వుచ్చారణ వశానవంసము మొదలైన సంస్కృత సమ పదాలనువంసము మొదలైన కారాలుగలపదాలుగా వ్రాసినట్లే తిరిగివిపరీతంగా కొందరు పండిత కవులు సంబరము,సంత మొదలైన పదాలను శంబరము శంత వంటి పదాలుగా కూడా వ్రాసేవా రేమోనని గణపవరపు వెంకటకవి వ్రాసిన యీ క్రింది సీసపాదాలను బట్టి అనుమానం కల్గుతున్నది.

సీ॥ . . . ఇంకిదదన్యవపదములౌ సచజలు
తలకట్లనమరు నెత్వములు పొసఁగ
హొక్క సెజ్జపదంబు దక్క సావాసము
సామనసంబరమనఁ జెందుచాయ
చక్కరమనజాము బడజలంగయనని
జాడలుగానట్టి సచజలెల్ల
నెత్వమ్ములౌనవి యుతిగింతు సెకసేక
చెఱకు చెలువ జెట్టి జెట్టియనఁగ॥

(ఆం. కా. 31 పుట.)

ఇందులో వెంకటకవి "సకారంపైన ఎత్వం వుండదు. అత్వమే వుంటుంది." అనిచెప్పి "సంబరము" అని వుదాహరిస్తున్నాడు. సంబరము అనే పదాన్ని సెంబరముగానో శెంబర

ముగానో ప్రాచీనులు వ్రాయకపోతే అటువంటివ్రాతలు వెంకటకవి కళ్ళముందే పడకపోతే సకారంమీద ఎత్వంవుండదు అత్వమే వుంటుంది అనిచెప్పి సంబర శబ్దాన్ని ఎందుకు వుదాహరిస్తాడు? ఈ పాదాలు లోగడ చెప్పినట్లు గజిబిజగానే వున్నాయి. ఇక్కడ వెంకటకవి సంబరమువంటి పదాలను శెంబరము, లేదా సెంబరమువంటి పదాలుగా వ్రాయకూడదు అనే విషయాన్నే చెప్పదలిస్తే సూటిగా అలాగే చెప్పవచ్చుగదా! - సకారంమీద ఎత్వంవుండదు అత్వం వుంటుంది అని చెప్పేసరికి "సజ్జ" శబ్దంకళ్ళకు ప్రత్యక్షమైంది. దాంతో "సజ్జపదంబుదక్క" అని అడ్డుపెట్టుకున్నాడు. మరి కొంత ఆలోచించేసరికి సకారంమీద ఎత్వంలేదనడం పొరపాటుగాభావించి తనతప్పుతానే దిద్దుకున్నట్లుగా "ఈజాడలుగానట్టి సచజాల్ల నెత్వమ్ములౌను" అని మళ్ళీ లక్షణం వెంటనే చెప్పుకుని సెక మొదలైన పదాలను వుదాహరించాడు -

ఇంత అవకతవకలుగా ఈ పాదాలు రచించకపోతే యేం? చెప్పదలచుకొన్న విషయం సూటిగా చెప్పితే యెంత బాగుండేది?

ప్రాచీన కాలంలో సెనగలు మొదలైన "సె" కారంగల పదాలు వుచ్చారణలో "శెనగలు" మొదలైన "శె" కారంగల పదాలుగా మారి కవులచేత వాడబడినట్లే "సేస, సేరు, సేబాసు," మొదలైన "సే" కారాలుగల పదాలు "శేస, శేరు, శేబాసు" మొదలైన పదాలుగా మారిపోయి కవుల చేత వాడబడుతుండేవి. అంతేకాదు "శెనగలు" వంటి పదాలలో "శె" కారం "శ" కారంగా మారి "శనగలు" వంటి పదాలుగా

వ్రాయబడినట్లే "శేబాసు" వంటి పదాలు కొన్ని "శాబాసు" వంటి శాకారాలు కలవిగా కూడా మారి కవులచేత వ్రాయ బడుతుండేవి. సేసవంటి కొన్ని పదాల్లో ఏకారస్వరం ఆకార ఏకారల మధ్యమస్వరంగా వ్యవహారంలో పలుకబడు తుంది. కాబట్టి సేసను సాసగాకూడా ప్రాచీనులు కొందరు వ్రాయడం కద్దు - కాబట్టే చిత్రకవి పెద్దన "తెకట్టుగాక యెత్వము" అనేపద్యంలో సకారంమీద తలకట్టు వ్రాయరాదనీ ఎత్వాన్నే వ్రాయాలనీ చెప్పాడు. ఇక్కడ తలకట్టు, ఎత్వ శబ్దాలు ఆకార ఏకారాలకు రెండింటికీ గ్రాహకాలుగానే పెద్దన ప్రయోగించాడు. కాబట్టే లక్ష్య పద్యంలో "సేస" అనే పదాన్ని వుదాహరించాడు. దీనివల్ల పెద్దన కాలంలో "సేస" అనే సేకారంగల పదాన్ని "సాస" గా కొందరు వ్రాసేవారని స్పష్టంగా తేలుతున్నది. గణపవరపు వెంకటకవి "శేబాసను నుడియెత్వాంతం బనరు వినుఁడి" అని "శేబాసు, శాబాసు" అనే రూపాలను రెండింటినీ పేర్కొని తానువాటికిప్రామాణికత్వాన్ని కూడా యిచ్చాడంటే యింక ఆకాలంలో వ్రాతలు ఎలా వుండేవో వేరే చెప్పాలా? "షహబాష్" అనేది జనవ్యవహా రంలో సేబాసుగామారి సకారానికి శకారంవచ్చి శేబాసు అయి అనంతరం శాబాసుగా కూడా మారింది. ఇలా రకరకాలుగా మారిన యీ పదానికి ప్రామాణికత్వమిచ్చి పేర్కొన్నవాడు గణపవరపు వెంకటకవి. ఒక లక్షణ గ్రంథకర్త వ్యావహారిక పదాన్ని ప్రయోగించి అది లక్షణ వంతమైన దన్నాడంటే అంతకంటే వ్యావహారిక ప్రయోగం మరేంకావాలి?

ఈ పరిశీలనవల్ల అసలు ఉచ్చారణలో చాలా విపరీతంగా తారుమారవ్వడంతో ఆ వుచ్చారణ ననుసరించి ప్రాచీన కవులు వాటిని తారుమారుచేసి యిష్టం వచ్చినట్లు వ్రాస్తుండే వారని స్పష్టంగా అధికార పూర్వకంగా తేలుతున్నది.

— మహాప్రాణాలు —

ఉచ్చారణలో శబ్దాలకు మామూలుగా వున్న అర్థం కంటే అధికమైన విశేషమైన అర్థాన్ని వుద్దేశించినప్పుడు ఆయా శబ్దాలలో వున్న వర్గ ప్రథమాక్షరాలు ద్వితీయాక్షరాలుగాను, వర్గ తృతీయాక్షరాలు చతుర్థాక్షరాలుగాను మారిపోతాయి. అవివర్గ ద్వితీయ చతుర్థవర్ణాలు వుండడానికి వీలులేని అచ్చ తెలుగు పదాల్లోనైనా సరే మారిపోతాయి. అలా మారడం కేవలం జన వ్యవహారంలోవున్న వుచ్చారణ బలంచేతనే కాని వేరుకాదు. ఏదైనా సందర్భంలో "కచ్చితంగా చెప్తున్నాను" అని అనవలసినప్పుడు ఆ"కచ్చిత" శబ్దాన్ని చాలా నిక్కచ్చిగా చెప్తునట్లుగా, దాని కెక్కువ బలం వున్నట్లుగా, అనాలంటే "ఖచ్చితంగా చెప్తున్నాను" అని "క" కారానికి "ఖ"కారాన్ని చేసి వుచ్చరిస్తాము. గట్టిగా వద్దనడానికి "అఖ్ఖర్లేదు" అని అంటామేగాని "అక్కర్లేదు" అని అనడమే యెరుగం? అలాగే "పెద్దగాలి వీస్తున్నది" అని అనవలసినప్పుడు ఆ గాలిని చాలా హోరుగాలిగా తెలియ జెయ్యడానికిగాను "పెద్ద ఘాలి వీస్తున్నది" అని "గ"కారానికి ఘకారం చేసి వుచ్చరిస్తాము. "చడామడా చెంపలు వాయించాడు. చటపట పేల్తున్నాయి" అని అనవలసివచ్చినప్పుడు అధికార్థంలో "ఛడా

మడా చెంపలువాయించాడు. ఛటపటపేల్తున్నాయి" అని చకారానికి ఛకారం చేస్తాము. ఇలాగే "చాలా" అనే పదాన్ని "మిక్కిలి - మరింత" - అనేవి శేషార్థం రావాలనుకున్నప్పుడు "ఛాలాబాగుంది" అని "ఛా" కారాన్ని వాడేస్తాము. ఇం తెందుకు? తెల్లవారి లేస్తే ఎవరినైనా పిల్లలను ముద్దుగానో కోపంగానో అనవలసివస్తే "ఛీ వెధవా," అంటామేగాని "చీ వెధవా" అని అనడంచాలాతక్కువ.-బాగా "జడుసుకున్నాడు" అనవలసివస్తే "ఝడుసుకున్నాడు" అని అని తీరతాం. ఒక పెద్ద మోసగాడి విషయం రానివ్వండి "వాడుఠక్కరి" అని అంటామేగాని "వాడు టక్కరి" అని అననేఅనం. చమత్కారానికన్రాణ్ణి చూస్తే వట్టిశుంఠ అనడానికి "వట్టిసుంఠ" అనకుండావుండగలమా! "ఢామ్మని మోగింది" అని అనడమేగాని "డామ్మని మోగింది" అని అనే అలవాటు మనకు లేనేలేదు. "ఘూత్ వెధవ" అని ఎవరైనా అంటారేమోనని మొదుకు చూస్తే "ఘూత్ వెధవ" అనే మన కెక్కువుగా వినపడేది. బాగా యేదైనా మోత వినపడడం ఆలస్యం "పెద్దమోత మోగింది" అని అనేస్తాం. పిల్లలమీద కాస్త ఎక్కువకోపంవచ్చినా చీకాకు కలిగినా "ఫుండాకోర్! ఫో వెధవా" అని అనడం మనకు రోజూ అనుభవంలో వున్నదే. మంచి అందమైన వస్తువును చూడడమే తడవు "భలేగావుంది" అనకుండా వుండలేం-

కణకణ, ఖణఖణ - కణిల్లుమని, ఖణిల్లుమని - గణగణ, ఘణఘణ - గల్లుమని, ఘల్లుమని - ఛెళ్ళుమని, ఛెళ్లుమని - జల్లుమన్నాయి, ఝల్లుమన్నాయి, జణజణ, ఝణఝణ - టాంటాం, ఠాంఠాం - డాండాం, ఢాంఢాం - దణ

దణ, ధణధణ – పెళ్ళుమని, ఫెళ్ళుమని – బగబగలు, భగభగలు వంటి అనుకరణ శబ్దాలలో వుచ్చారణ వశాన వచ్చిన మహాప్రాణాలుకల శబ్దాలే సహజ సిద్ధాలుగా భాసిస్తాయి. ఈ అనుకరణ శబ్దాలతోపాటు ప్రశంసార్థకాలైన "బళిబళీ" అనేవి "భళిభళీ" గా మారి ప్రాచీనులైన కవులచేత వ్యవహరింపబడ్డాయనే విషయం మనకు పాతదేకాని కొత్తది కాదు.

ధణధణ, ఘణఘణ వంటి మహాప్రాణాలుగల అనుకరణ శబ్దాలు సంస్కృతాది భాషా సామాన్యాలని అహోబలుడు (అహో. 324 పుట) అన్నాడు. కాని వెంటనే – "ఖణిల్లు, పెఠిల్లు, ఖంగు, ఖంగు ఖంగు, ఖచుక్కు, ఖరిక్కు......భగభగలు, ... ఇత్యాదయోబహవోఽంధ్రభాషామాత్రే ప్రయోగార్హాశ్శబ్దాః – " అని (324 పుట. అహో.) వ్రాసాడు. ఖణిల్లు మొదలైన తెలుగు పదాల్లో మహాప్రాణా లున్నాయని అహోబలు డంగీకరించాడు – కాని శ్రీవర్ఘ్యులవారు ఇటువంటి చోట్ల అనుకరణ శబ్దాలలో వున్న మహాప్రాణాల నంగీకరిస్తూనే "ధ్వన్యను కరణ శబ్దములం దర్వాచీన కావ్యములలోనే కాక భారత ప్రయోగము లందును మహాప్రాణ ఘటిత శబ్దము లుండుట విరుద్ధము కాదు – అట్టి యనుకరణ శబ్దములొక భాషలోని వనిపించు కొనవు – కావున వానిలోని మహాప్రాణాదులను గొలగింపరాదు –" (ఆం. వ్యా. సం. సర్వస్వం. 46 పుట.) అని వ్రాసారు – అనుకరణ శబ్దాలు ఒక భాషలోనివి కావట – తెలుగువారు జాతీయంగా వుపయోగించే అనుకరణ శబ్దాలు ఇతర భాషల్లో వుండవు. అన్య భాషల్లో వుండే అను

కరణ శబ్దాలు వేరు- తెలుగులో వుపయోగింపబడే అనుకరణ శబ్దాలువేరు . ఏవైనా సంస్కృతకావ్యాల్లోవుంటేఆకావ్యాలు తెలుగు వారు వ్రాసినవే అయివుంటాయి గాని వేరు కాదు. ఆంధ్రేతరులైన వారు సంస్కృతంలోగాని యితరభాష ల్లోగాని "ఖణిల్లు, ఖంగు, ఖచుక్కు, భగభగ"వంటి అనుకరణ పదాలను వుపయోగించరు. అలా వుపయోగించారనడానికి ఆధారంలేదు. ఒకవేళ వుంటే ఇటువంటి అను కరణ పదాలు తెలుగు భాష కక్కచెల్లెళ్ళయిన అరవ కన్నడాది ద్రావిడ భాషల్లోనే తప్ప అన్య భాషల్లో వుండనేవుండవు. "ఈ అను కరణ శబ్దాలు సర్వభాషా సామాన్యాలు" అనేవారు యితర భాషల్లో తెలుగువారుపయోగించే అనుకరణ శబ్దాలు ఎక్క డెక్కడ ప్రయోగింపబడ్డాయో సోదాహరణంగా పేర్కొంటేనే గాని వారి వాదం అంగీకార యోగ్యంకాదు.

"మజ్జా, బళీ,"వంటి అచ్చ తెలుగు పదాలు చాలా ప్రాచీనకాలంలోనే మెచ్చుకోలుయొక్క అతిశయార్థంలో మహా ప్రాణఘటితాలై "మఝ్ఝా, భళీ"అని మారిపోయాయి- కాబట్టే శబ్దరత్నాకర కర్త వాటినిమహాప్రాణయుక్తాలుగానేగ్రహించి దేశ్యాలుగా పేర్కొన్నాడు.మఝ్ఝా,భళీఅనే ఈమహాప్రాణఘటిత పదాలు వుచ్చారణవశాన"మజ్జా,బళీ"అనేఅచ్చ తెలుగుపదాల మీాద తయారయ్యా యన్న సంగతి గమనింపక అహోబల పండితుడు - "షట్త్రింశ దక్షరవ్యతి రిక్తాస్తే వర్ణాశ్చ శబ్దయోగ వశాత్తత్సమాది శబ్దయోగవశాదనుప్రవిశంతి. స్వాతంత్ర్యేణ శాద్యక్షరాణాం ప్రకాశోనాస్తి. కింతు షణ్ముఖుఁడు, శరీరము మఝ్ఝా ఇత్యాది తత్సమాది ద్వారా ప్రవేశస్సంభవతీత్యర్థః -

(అహో - 125 పు.) అని వాటిల్లో మహా ప్రాణాలు కన్పడుతున్నాయి కాబట్టి అవి సంస్కృతసమ పదాలుగా గణించాడు. అహోబలుడు తెలుగులో లేని ఝకార భకార వర్ణాలు తత్సమాది శబ్దాలద్వారా తెలుగులో ప్రవేశిస్తాయంటూ సంస్కృత సమ పదాలుగా పరిగణించిన మజ్ఝా, భళీ అనే పదాలు మహాప్రాణ ఘటితాలుగా అహోబలుడు అంగీకరించాడనడం నిర్వివాదమే గదా! అయితే అహోబలుడన్నట్టు అవి సంస్కృత సమాలు కానేకావు. అవి వుచ్చారణవశాన మహాప్రాణఘటితాలుగా వ్యవహరింప బడుతున్న అచ్చ తెలుగు పదాలు. మజ్ఝా, భళీ అన్నప్పుడు స్పష్టంగా మహాప్రాణా లున్నాయని అహోబలుడు చెప్తుంటే శ్రీవర్ఝులవారు శబ్దరత్నాకర కర్తను విమర్శిస్తూ యీ క్రింది విధంగా వ్రాయడం ఆశ్చర్యకరంగా వున్నది.

- "శబ్దరత్నాకరకర్త మజ్జా- మూస్టీడు- బళీ-" శబ్దముల నంగీకరింపక మజ్ఝా - మూష్టీడు† - భళీ శబ్దములను ప్రమాణప్రదర్శనము లేకుండగనే యుదాహరించెను" -

(ఆం. వ్యా. సం. సర్వస్వం. 43 పుట.)

---

† మూస్టీడు అనేది అసలు సకారంకల పదమే అయినా దంత్యమైన సకారాన్ని మూర్ధన్యమైన టకారాన్ని (భిన్నస్థానాలు కలవిఅనడంచేత) కలిపి వుచ్చరించడం కష్టం కాబట్టి మూర్ధన్యమై టకార స్థానమైత్రితో సకారానికి షకారం వుచ్చారణలో వస్తుంది. అప్పుడు "మూష్టీడు" అవుతుంది. సంస్కృతంలో "ష్టునాష్టుః" అనే సూత్రం ఇటువంటి మైత్రత్వాన్ని పురస్కరించుకుని వచ్చిందే కాని వేరు కాదు -

ఇలాగే "మక్కా" అనే వురుదూ పదం వుచ్చారణలో మహా ప్రాణఘటితమై "మక్ఖా" గా మారింది. తన కాలంలో ఈ "మక్కా" శబ్దానికి "మక్ఖా" గా వ్యవహారం వుండబట్టే రామరాజ భూషణుడు ఈ క్రింది పద్యంలో "మక్ఖా" శబ్దాన్ని మహా ప్రాణఘటితంగా ప్రాసలో ప్రయోగించాడు.

శా॥ మక్ఖా మండువ పండువా భయద దోర్మాహాత్మ్యధాటీ మహా
తుక్ఖార ప్రతిరుద్ధ భూభువన హిందూరాజ్య సంస్థాపనా
ప్రాక్షద్యోత.................................
ప్రక్షీవ్యకృత..............................

(నరస - 5 ఆ. 244 ప.)

"మక్కా" అనేది తురుష్కుల పుణ్యక్షేత్రం - శబ్ద రత్నాకర కర్త "మక్కా" అనేది "మఖ" శబ్దభవమని తన వైకృతదీపికలో పేర్కొనగా దాన్ని శ్రీ వఝ్ఝలవారు వ్యతిరేకిస్తూ "మక్ఖా" అనే సంస్కృత పదం వున్నదనీ దాని వికృతి రూపమే"మక్కా"అనీ తమ అభిప్రాయం అనేధోరణిలో సర్వస్వంలో (42వపుట.) కొంతవ్రాసారు. సంస్కృతంలో తురుష్క పుణ్యక్షేత్ర వాచకంగా "మక్ఖా" అనే శబ్దం వున్నదనడానికి ఆస్కారంలేదు. ఆ పదం సంస్కృతంలో వున్నదని శ్రీ వఝ్ఝల వారు నిరూపించలేదు కూడా. 42వ పుటలో ఆ అభిప్రాయాన్ని వెల్లడించినవారు తిరిగి 174 వ పుటలో "మక్ఖా" తురుష్క భాషాపదమని పేర్కొన్నారు. తురుష్క భాషలో మహా ప్రాణ ఘటితమైన "మక్ఖా" శబ్దం లేనేలేదు. "మక్కా" అని మాత్రమే వున్నది.

—"మక్కా - సంజ్ఞా - పుం - (అ.) అరబ్ కా ఏక్ ప్రసిద్ధనగర్ జోముసల్మా నోంకాసబ్ సే బడాతీర్థస్థాన్ హై"-

(రామచంద్రవర్మ - ఉర్దూ హిందీకోశ్ - 327పుట - హిందీ గ్రంథరత్నాకర్ కార్యాలయ్ బొంబాయి.)

అని విస్పష్టంగా మహా ప్రాణ రహితంగానే "మక్కా" శబ్దం నిర్దేశింపబడింది. అయితే ఈ మక్కా అనే పురుదూ పదం మఘుశబ్ద భవమనడానికి ఆధారంలేదు. ఇంక వర్ణ(?)ల వారు పేర్కొన్నట్లు "మక్ఖా" అనే మహా ప్రాణ ఘటిత పదం పురుదూలో లేనేలేదని స్పష్టపడలేదా? అయినప్పుడు రామరాజ భూషణుడు "మక్కా"లో తెలుగు వుచ్చారణవశాన యేర్పడిన ఖకారాన్ని వినియోగించి "మక్ఖా" శబ్దంగా ప్రయోగించా డనడం సుస్పష్టం.

ఇలాగే వుచ్చారణలో "టవర, టీవి, టేవ, టావు, డాక" అనే పదాలు వరుసగా "ఠవర,ఠీవి, ఠేవ, ఠావు, ఢాక" అని మహాప్రాణాలు కలవిగా మారిపోయి కవులచేత వ్యవహరింప బడ్డాయి. ఈ విధంగా మహా ప్రాణ ఘటితాలైన యీ పదాలు మహాకవులచే ప్రయుక్తాలవ్వడం చూచిన అప్పకవి వాటిని తెలుగు పదాలుగా అంగీకరించక అన్యదేశ్యాలుగా పేర్కొన్నాడు.

ఆ॥ వె॥ ఠవరఠీవి ఠేవ ఠావును ఢాకయు
మొదలుగా ద్వితీయములు చతుర్థ

వర్ణములును గలుగు వాక్యంబు లన్యదే †
శ్యములుగాని వైకృతములు కావు॥

టవర మొదలైన తెలుగు పదాలే వుచ్చారణలో మహా ప్రాణాలు కలవిగా మారాయన్న సంగతి గమనింపక తవ రాదులన్నీ అన్యదేశీయాలని అప్పకవి భ్రమపడ్డాడు. తవర మొదలైన పదాలను ప్రాచీన కవులు మహా ప్రాణఘటితాలు గానే ప్రయోగించినట్లు అప్పకవి ఈ క్రింది పద్యాల నుదాహ రించాడు.

క॥ కొమ్మపయినీవు పక్షము
లిమ్మోయి నెరపుదు విదేల యేచెదవకటా
తమ్మిఁగ నవాతు చక్కర
గ్రమఁగ మాటాడు థవర కలకంఠవరా ! ॥

(విజయ విలాసం - ౩ఆ - ౫౬ప.)

క॥ దివిబిసరుహ బాంధవ సైం
ధవ సంఘం బెంతదవ్వ దగలే కరుగున్
భువినంత దవ్వమేమును
థవరవలే కరుగుదుము హుటాహుటి నడలన్॥

(మను - 1 ఆ. 76 ప.)

సీ॥ గీ॥ సఖులు పరిహాసకులు వెంటఁ జనఁగ యువతి
భుక్త నిర్ముక్త పరిధాన యుక్తుఁడగుచు
నగర ఘంటాపథంబున నగుచుఁ దిరుగు
నొంటుపుగల ఠీవి జాతిమాత్రోపజీవి ॥

(పాండు. మా. 3 ఆ. 10 ప.)

---

† అన్యదేశ్యములు అనే పాఠం అహోబలుడు పేర్కొన్నది. అప్ప కవీయ ముద్రిత ప్రతిలో స్వదేశ్యములు అని వుండడం పొరపాటు. ఇక్కడ అప్పకవి దేశీయాలు మహాప్రాణ ఘటితాలుగా మారాయన్న సంగతి గమ నింపక థవరాదులను అన్యదేశీయాలుగా పరిగణించాడు,

సీ॥ గీ॥ తేవ మీఁదటిన్నటీ పంక్తిఁ బ్రేరించి
కోపుగా మెఱుములు గొనఁగఁజేసి

(రామాభ్యు. 6 ఆ. 18 ప.)

శా॥ దేవ బ్రాహ్మణ భక్తిప్రోవు ప్రియవక్తృత్వంబు కాణాచి వి
ద్యావై దుష్యము దిక్కు ధర్మమునకుం దార్కాణ మర్యాదకున్
తానౌచిత్యము జీవగఱ్ఱ హిత శిష్టవ్రాత సంతోషణ
శ్రీవజ్రాంగి యజాత శత్రుఁడు మహీభృన్మాత్రుఁడే చూడఁగన్॥

(విజయవిలాసం. 1 ఆ. 85 ప.)

క॥ నాకౌకసులైనను నీ
ధాకకు నిల్చెదరె కటకటా మనుఁ బోట్లం
జేకొని సంరక్షింపక
నీకిటు లుచితంబె యురవణింప నరేంద్రా!

(శశిబిందు చరిత్ర.)

అప్పకవికి పూర్వంలో ఎంతకాలంనుంచో టవరాది శబ్దాలు తవగాదిమహాప్రాణఘటితాలుగా కావ్య వ్యవహారంలో వుండకపోతే వాటిని ప్రామాణిక పదాలుగా అప్పకవి యెందుకు గ్రహిస్తాడు? వీటిల్లో వుపయోగింపబడ్డ తవరాది మహాప్రాణ ఘటిత శబ్దా లన్నింటినీ టవరాది పరుష వర్ణఘటిత శబ్దాలుగాను, ధాకశబ్దాన్ని డాకగాను సవరించుకోవాలని శ్రీవఝ్ఝల వారు తమ ఆం - వ్యా - సం - సర్వస్వం 42, 43, 44 పుటల్లో ప్రతిపాదించారు. తవర మొదలైన తక్కిన పదాల మాట ఎలావున్నా చేమకూర వెంకటకవి రచించిన "దేవ బ్రాహ్మణ భక్తిప్రోవు" ఇత్యాది పద్యంలో "మర్యాదకున్ తానౌచిత్యము" అనే దాంట్లో తకారానికి టకారాన్ని చేసి ద్రుత కార్యం చేసి "మర్యాదకున్ డానౌచిత్యము" అని దిద్దివెయ్యడం

చూస్తే అక్కడ ఆ శబ్దంలో వున్న మహాప్రాణం పోవడంతో నిజంగా ప్రాణం పోయినట్టే వున్నది. ఆ పద్యంలో "మర్యాదకున్ డావౌచిత్యము"అని చదువుకొనడానికి ఏ తెలుగు హృదయమూ అంగీకరించదు - కఠకంఠ శబ్దంలో ఠకారం లేదని వింత వితండవాదాన్ని ప్రతిపాదించిన శ్రీవర్ఘ్యులవారు ఠవరాదులను టవరాదులుగా సవరించుకోనాలనడంలో ఆశ్చర్యంలేదు. ఏదైనా శబ్దాన్ని వ్యాకరణవేత్తగాని లక్షణ గ్రంథకర్తగాని ఎవరైనా సంస్కరించ దలచుకొన్నప్పుడు తన హృదయం ఎంత కర్కశమైనదైనా సౌకుమార్యాన్ని దృష్టిలో పెట్టుకొని సవరించాలి.

టవర మొదలైన అచ్చ తెలుగు పదాలు అత్యంత ప్రాచీన కాలంలోనే వుచ్చారణలో ఠవరాదులుగా మహాప్రాణ ఘటితాలుగా మారి స్థిరపడి మహాప్రాణ ఘటితాలుగానే కవులచేత వ్యవహరింపబడిన సంగతిని గమనించికూడా శ్రీవర్ఘ్యులవారు వాటిని మహాప్రాణ రహితాలుగా సవరించుకోనాలనడం సమంజసంగాలేదు. ఠకార ఢకారాలు తెలుగులో లేనంత మాత్రంచేత వాటిని దిద్దవలసిందేనా? సజీవమైన భాషకు మార్పు సహజంకాదా? కొన్ని అచ్చ తెలుగు పదాలు మహాప్రాణఘటితాలుగా మారి ప్రామాణికులైన కవులచేత ప్రయోగింప బడినప్పుడు వాటిని శిరోధార్యాలుగా యెంచడం సహృదయ భాషాసేవకుల విధికాదా? ఠవరాదులను టవరాదులుగా దిద్దవలసివస్తే ఎన్నిచోట్ల దిద్దగలరు? ఎట్లాదిద్దగలరు? ఒకవేళ మనం పుస్తకంలో దిద్దినా మహాప్రవాహం వంటి జనవ్యవహారాన్ని ఎవరుఅడ్డగలరు? వ్యవహారవశుడై ప్రజాసమ్మతి నపే

క్షించేసహృదయుడైలలితహృదయుడైనకవిమాత్రంజనవ్యవహారంలో కలిసి నడవక వెలిగా యెలా నడుస్తాడు? తెలుగులో ఠకార ఢకారాలు లేవుగదా అని ఠవరాదులను, ఢాకను, టవరాదులుగాను డాకగాను శ్రీ వఝ్ఝలవారు దిద్దారేగాని ఈ క్రింది ప్రయోగంలో కదల్చడానికే వీలులేకుండా ఎంతో ఠీవిగా కవి ప్రయుక్తమైన "ఠేవ" శబ్దాన్ని దిద్దలేక పోయారేమి!

క॥ ఢుంఠీశు భైరవుని సితి
కంఠు విశాలాక్షి దండకగు జాహ్నవి వై
కుంఠ పతిగుహుని లోలా
ర్కుం ఠేవలు మీఱి భూవరుఁడు పొడఁగనియెన్॥

(‡ త్రైశంకవోపాఖ్యానం - అప్ప. 5 ఆ. 154 ప.)

ఇలాగే నిత్య వ్యవహారంలో "బావి" శబ్దాన్ని మహాప్రాణఘటితంగా "భావి" అని మనలో కొందరు వ్యవహరిస్తున్నట్లే ప్రాచీన కాలంలో పండిత కవులు కూడా కొందరు వ్యవహరించేవారు. కాబట్టే ప్రాచీన కవియైన పాల్కురికి సోమన్న తన బసవ పురాణంలో "భావి" మహాప్రాణయుతంగా కన్పడతుండడంవల్ల దాన్ని సంస్కృత పదంగా భావించి సమాసంలో బిగించాడు.

ద్విపద॥ సజ్జన లీల మజ్జన భావికోన
యజ్జలంబులు............ (బసవ. 6 ఆ. 241)

"బావి" ని "భావి" గా సంస్కృత పదంతో సమాసం చేసాడని గమనించక శ్రీ వఝ్ఝలవారు "మజ్జన" శబ్దానికి "మజ్జన" అనే తద్భవ రూపాన్ని సృష్టించిపెట్టారు.

‡ కర్త - కవి సింగరన్న.

ఈ పరిశీలనవల్ల అచ్చ తెలుగు పదాలు కొన్ని జన వ్యవహారంలో స్వార్థాతిశయార్థంలో మహాప్రాణఘటితాలుగా మారి ప్రాచీన కవిపుంగవులచేత ప్రామాణికాలుగా పరిగ్రహింపబడి వ్యవహరింప బడ్డాయని స్పష్టంగా తెలుతున్నది గదా ! -

— సంయుక్తాలు * —

విజ్ఞప్తి, ఆజ్ఞ మొదలైన పదాలలో వున్న జ్ఞకారాన్ని ఈ నాడు యెంతెంత పండితులైనా సవ్యంగా వుచ్చరించడంలేదు. కేవలం నిత్య వ్యవహారంలోనే కాదు. కావ్యాల్లో కూడా "ఆజ్ఞాబద్ధుఁడనై" వంటి ఎక్కడైనా వస్తే వ్యవహారంలో లాగానే చదువుతారుగాని సవ్యంగా చదవనే చదువరు - వాస్తవానికి "జ్ఞ" కారాన్ని వ్రాయాల్సివస్తే వ్రాతలో "జ"కార "ఞ"కారాల సంయుక్తంగానే వ్రాస్తాము. కాని దాన్ని వుచ్చరించాల్సి వచ్చేసరికి "జ"కార "ఞ"కారాల సంయుక్తంగా వుచ్చరించకుండా "గ"కార "న"కారాల సంయుక్తంగా వుచ్చరిస్తాం. ‡

* ఈ సంయుక్తాలు అనే విభాగంలో వ్యవహారవశాన కవులు బహుళంగా ప్రయోగింపగా లాక్షణికులు లక్షణాలు సృష్టించుకున్న సంయుక్తాల విషయం చర్చించ బడుతుంది. తక్కిన సంయుక్తాల విషయం "ఇతరాలు" అనే ముందు విభాగంలో చర్చింపబడుతుంది.

‡ కాని దేశం అంతా తిరిగితే "జ్ఞ"కారాన్ని గకార నకారాల వుచ్చారణ లేకుండా సహజాక్షరానుగుణంగా జకార ఞకారాల వుచ్చారణలోనే వుచ్చరించేవారు ఒక రిద్దరు దొరుకుతారేమో ! ఒకవేళ ఎవరైనా అలా వుచ్చరించేవారు కన్పడితే మనం తెల్లబోతాము సరిగదా! అదేసరైన,అక్షరానుగుణ్పైన, వుచ్చారణ అన్న సంగతి గమనింపక అపసవ్యమైన వుచ్చారణగా

భావించి అపహాస్యం చేస్తాము - కాని వాస్తవానికి క్షకారాన్ని జకార ఞకారాల సంయుక్తంగానే వుచ్చరించాలనీ "గ"కార "న" కారాల సంయుక్తంగా వుచ్చరించరాదనీ గమనించం. ఈ విషయాన్ని కేవలం పామరులే కాదు పండితాగ్రేసరులు కవిశేఖరులు కూడా గమనించరు. అంతమాత్రం చేత నేను జకార ఞకారాలుగా వుచ్చరిస్తానని చెప్పడంకాదు-నేనూ అందరి లాగా "జ్ఞ" కారాన్ని గకార నకారాల్లాగా వుచ్చరించే వాడినే. ప్రస్తుతం వస్తుస్థితిని మచ్చటిస్తున్నానేగాని వేరుకాదు. ఈ నాడు జ్ఞకారాన్ని జ ఞల సంయుక్తంగానే వుచ్చరించాలంటే అది సాగేపనికాదు - వర్ణస్థితికి గకార నకారాల వుచ్చారణ తగిందే కాకపోయినా దుష్ట వుచ్చారణే అయినా అది మంచి వుచ్చారణగానే మనం భావించాలి. "పదుగురాడుమాట పాడియై ధరఁజెల్లు" కదా! ఒకవేళ చెల్లదన్నా వినిపించుకొనేదెవరు ?

పూజ్య శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారి పినతల్లి కుమారులు శ్రీ బొబ్బారామమోహనరావు (ఆంధ్రప్రభ - ఏజంటు. ఏలూరు.) గారితో ఒకసారి మాట్లాడుతున్నాను. ఏదో సందర్భంలో శ్రీరామ మోహనరావుగారు "వాడికసలు విజ్ఞానమే లేదండీ" అని అంటూ "విజ్ఞాన" శబ్దంలో "జ్ఞ"కారాన్ని స్పష్టంగా జకార ఞకారాల సంయుక్తంగా (గకార నకారాల వుచ్చారణ లేకుండా) వుచ్చరించడం విని లోలోపల నేనెంత సంతోషాన్ని ఆశ్చర్యాన్ని పొందానో చెప్పలేను. అక్షరానుగుణమైన వారి వుచ్చారణ వినడంవల్ల నాలో సంతోషాశ్చర్యాలు కలిగిన వన్నసంగతి వారికింతవరకూ తెలియదు. ఇకమీదట తెలుస్తుం......వారి నోటినుండి "విజ్ఞాన"శబ్దాన్ని ఆ తర్వాత ఎన్నోసార్లు విన్నాను - ఎన్నిసార్లువిన్నా "జ్ఞ"కారంలో జకార ఞకారాల వుచ్చారణే వినపడేది. పొరపాటుగానైనా "గ. న"ల వుచ్చారణ వస్తుందేమోనని ఎదురుచూచి అనేకసార్లు విఫలుడ నయ్యాను. అయితే వారి నోటినుండి నేను విన్నది ఒక్క "విజ్ఞాన" శబ్దం మాత్రమే. తక్కిన "ఆజ్ఞ" మొదలైన పదల్లో జ్ఞకారం ఎలా వుచ్చరించుతారో చెప్పలేను - "విజ్ఞాన" శబ్దభిన్నాలైన జ్ఞకారం కల పదాలు వారు నావద్ద వుచ్చరించే సందర్భమే రాలేదు - అయితే ఈ నాటికీ ఒక్కరైనా "జ్ఞ"కారాన్ని "జ్ఞ"కారంగానే (జఞల సంయుక్తంగానే) వుచ్చరించేవా రున్నందుకు నేనుమాత్రం యెంతో సంతోషించాను—

"భగ్నము" వంటి చోట్ల వున్న "గ్న" కారాన్ని వుచ్చరించేప్పుడు "గ" కారాన్ని వుచ్చరించినట్లుగా "జ్ఞ"కారాన్ని వుచ్చరించేటప్పుడు వుచ్చరించే"గ"కారాన్ని వుచ్చరించము. జ్ఞకారం వుచ్చారణలో వచ్చే గకారోచ్చారణ సానుసికంగా వుంటుంది. కాబట్టే ఆలను నాసిక చిహ్నంగా - "గ." కార "న" కారాల సంయుక్తంగా వుచ్చరిస్తాం"-అన్నప్పుడు "గ."కారంపక్కన"." అనే గుర్తువుంచాను.

జకారానికి స్థానం తాలువులు. ఞకారానికి తాలువులే కాకుండా నాసికకూడా స్థానమే - కొన్ని చోట్ల ఏకస్థానికాలైన జకార ఞకారాలనుకలిపి వుచ్చరించడంకష్టం. కాబట్టిప్రయత్న మిత్రత్వాన్ని పురస్కరించుకొని జకారానికిసానునాసికమైనగకారమూఞకారానికి"న"కారమూవస్తాయి. జకారగకారాలకు రెండింటికీ సంవారనాదఘోషాలు బాహ్య ప్రయత్నాలు. అలాగే ఞకార నకారాలు రెండింటికీ కూడా సంవారనాదఘోషాలే బాహ్య ప్రయత్నాలు. ఈ మిత్రత్వాన్ని పురస్కరించుకొని జకారానికి గకారం ఞకారానికి నకారం వుచ్చారణలో ప్రవేశిస్తాయి. ఞకార సాహచర్యంలో గకారం కూడా నాసికగా మారుతుంది. కాబట్టే మనం "జ్ఞ" కారాన్ని "గ.న"కారంగా వుచ్చరిస్తున్నాము.

ఈ విధంగా జ్ఞకారాన్ని "గ.న" కారంగా వుచ్చరించడమనేది ఎప్పుడో పాల్కురికి సోమన్న కాలానికి పూర్వకాలం నుంచీ అను శ్రుతంగా వున్నది. కాబట్టే ఈ క్రింది ప్రయోగాల్లో "జ్ఞ"కారానికి "క" కారానికి యతి వెయ్యడంజరిగింది.

ద్విపద॥ కర్మమధర్మ మజ్ఞాన మాగడము

(పండితా - పురాత - 284పుట.)

క॥ జ్ఞానము కేవల కృపన
జ్ఞానికి నుపదేశవిధిఁ బ్రకాశము సేయం
గానది సకలధరిత్రీ
దానంబున కంటె నధికతరఫలదమగున్॥

(భార. శాంతి. 4 ఆ. 255 ప.)

మ॥ ఇదిసింహాచల రంభ కేసరిపదా భీష్టార్చనా పుణ్యల
బ్ధదురుట్టంకణ పొట్నునూరి విజయస్తంభోపలోట్టంకి తాం
కదృఢేష్టాక్షర కృష్ణరాయ నృప సంజ్ఞాస్మత్కృతాముక్త మా
ల్యదనశ్వాస వరంబు నాలవది హృద్యంబై మహిం బొల్పగున్ ॥

(ఆము. మా. 4 ఆ. 289 ప.)

క॥ ....గాక
జ్ఞానంబునం గడపమిగులఁ గల్మష మొందున్

(ప్రౌఢకవి మల్లన్న రుక్మాంగద చరిత్ర - 2ఆ - 68ప.)

ఇటువంటి ప్రయోగాలు పెక్కులు చూచిన అప్పకవి విశేష వళులు అనే పేరుతో ఈ క్రింది లక్షణం చెప్పుకున్నాడు.

తే॥ ప్రౌఢ కవులు కొందఱు జ్ఞకారంబునకును
బ్రథమ వర్గంబు తొలి యక్కరములు నాల్గు
నిడుదురు ప్రబంధముల నొక్క యెడ విశేష
వళు లనుచు సోమయాజులు వాడు కతన॥

(అప్ప - 3 ఆ - 56 ప)

అంతేకాదు పాల్కురికి సోమన్న స్పష్టంగా జ్ఞ కారానికి గ్న కారానికి తన "సోమనాథ స్తవం" లో ఈ క్రింది ద్విపదలో ప్రాసమైత్రిని పాటించాడు.

ద్విపద॥ అజ్ఞాన మనియెడు నంధకారమున
మగ్నుఁడనై నిన్ను మఱచి యుండితిని ॥

జ్ఞ కారంలో "గ్న" కార వుచ్చారణ వుండడంవల్లనే యిటువంటి యతులు ప్రాసలు సంభవించాయి – జ్ఞకారంలో గకారోచ్చారణకు ప్రాధాన్యం కొందరివ్వడం వల్లనే (ప్రజ్ఞ,) పగ్గెవంటి తద్భవాలు వుప్పతిల్లాయి.

ఇంక విజ్ఞప్తి, వినతి – ఆజ్ఞప్తి, ఆనతి – ఆజ్ఞ, ఆన – విజ్ఞానం, విన్నాణం – విజ్ఞాపనం, విన్నపం వంటి తద్భవ రూపాలను చూస్తే ఎంత ప్రాచీన కాలంలో జ్ఞకారానికి నకార సహితమైన గకార వుచ్చారణవచ్చి నకారానికి ప్రాధాన్యం వచ్చిందో తెలుస్తుంది. జ్ఞకారంలో తవర్గాంత్యమైన "న" కారోచ్చారణ వున్నది కాబట్టే "జ్ఞ – న" లకు యతిమైత్రి చెల్లడమూ పెక్కుమంది కవులు ప్రయోగించడమూ వాటికి లక్షణ గ్రంథకర్తలు లక్షణాలు చెప్పుకొని అంగీకరించడమూ జరిగింది. ఈ క్రింది లక్షణ పద్యాలు పరికిస్తే "జ్ఞ – న" లయతి యెంత బహుళంగా వ్యవహరించ బడిందో వ్యక్తంకాదూ! –

గీ॥ అప్రసిద్ధముల్ జ ఞ లు శబ్దాదియందు
ఞాజసంయుక్తి తద్భవ వ్యాజమునను
నణలతోఁ బొందు విరతి యాజ్ఞప్తియనఁగ
జలరుహోదరా శ్రితులు సుజ్ఞానులనఁగ ॥

(అనం. ఛం. 1 ఆ. 112 ప)

సీ॥ విజ్ఞానమునకు భావింప విన్నాణంబు
విజ్ఞాపనమునకు విన్నపంబు
సంజ్ఞకు సన్న యజ్ఞమునకు జన్నంబు
నాజ్ఞప్తి కానతి యాజ్ఞకాన

యని యిట్లు సంస్కృత వ్యాహార మధ్యావ
పానంబుల ద్వితీయ సరళిమునకు
నడుగునఁగల తాలుజానునాసికములు
తద్భవంబున ద్రుతత్వంబుఁగాంచి
గీ॥ వెలయుటను దద్భవ వ్యాజ విశ్రమమన
జరిగి ణనలకు రెంటికి జ్ఞాతనర్చు
జ్ఞాని చేతోంబుజాతశోణ కరయనఁగ
జ్ఞాతి విద్వేషి నృపనాశన కర యనఁగ

(అప్ప. 3 ఆ - 54 ప.)

ఇందులో అప్పకవి తద్భవత్వంలో జ్ఞకారం నకారంగా మారుతుంది కాబట్టి "జ్ఞ న" లకు యతి చెల్లిందన్నాడుగాని జ్ఞకారంలో నకారోచ్చరణ జనవ్యవహారంలో కలగడమే దీనికి మూలమన్న సంగతి పేర్కొనలేదు. తద్భవత్వంలో జ్ఞకారం నకారంగా మారడానికి జనుల వుచ్చారణే కారణమనుకున్న సంగతి, ఆ యతిమైత్రిసంభవించడం వుచ్చారణకు కవులు లోనవ్వడమన్న సంగతి అప్పకవి గమనించి వుంటే పై లక్షణం అలా చెప్పేవాడే కాదు -

క్షకారం మన పండితు లందరూ చెప్పేవిధంగా వాస్తవానికి "క" కార "ష" కారాల సంయుక్త వర్ణమేకాని వేరు కాదు. అయితే దీనిలో "క" కార "ష" కారాల వుచ్చారణ చాలా ప్రాచీన కాలంలోనే జనవ్యవహారంలో భ్రష్టమై ఒక ప్రత్యేకమైన స్థిరోచ్చారణ యేర్పడి స్థిరపడింది. వాస్తవానికి "క్ష" అని కకార షకారాల సంయుక్తంగానే దాన్ని వ్రాయవలసి వుండగా "క్ష" అని క్రింది పావత్తుకు మారు ఒక గొలుసువంటిదాన్ని వ్రాయడం మొదలుపెట్టి ఉచ్చారణతోపాటు

లిపిలోకూడా మార్పు తెచ్చుకొన్నాము. "క్ష" కారంలో క్రింద మనం యిప్పుడు వ్రాస్తూ వుండే "క్ష" అనే దానిక్రింద వుండే గుర్తు "ఎ" అనే దానిపరిణామ ఫలితంగా యేర్పడిందే. ఈ విధంగా జనవ్యవహారంలో క్షకారంలో వున్న పరుషాది వుచ్చారణలు భ్రష్టమై స్థిరోచ్చారణ యేర్పడడంతో ద్రుత ప్రకృతి కానికి పరుషం పరమవుతుంటే జరుగవలసిన ద్రుతకార్యాలు జరుగకుండా పోయాయి. పైగా క్షకారంలో స్థిరోచ్చారణ ఏర్పడింది కాబట్టి ద్రుత ప్రకృతికానికి స్థిరం పరమవుతుంటే జరిగే ద్రుతకార్యాలే జరుగుతున్నాయి. వచ్చెను + క్షత్రియుడు అన్నప్పుడు క్షకారంలో వున్న కకారం "ద్రుత ప్రకృతికము మీఁది పరుషములకు సరళములగు" అనే చిన్నయసూరి బాలవ్యాకరణ సూత్రం వర్తించి "గ" కారంగా మారాలి. వచ్చెన్ + గ్షత్రియుడు అని పండితులు కవులు కూడా వుచ్చరించను సరిగదా కనీసం వ్రాయనైనా వ్రాయరు. పైపెచ్చు "వచ్చెక్షత్రియుడు" అని ద్రుతంబునకు సరళ స్థిరంబులు పరంబులగునపుడు లోప సంశ్లేషములు విభాషనగు" అనే సూత్రాన్ననుసరించి ద్రుతానికి లోపంకూడా వస్తున్నది. ‡ ఈ విధంగా క్షకారం తన సహజత్వాన్ని

---

‡ మన వ్యాకరణ కర్తలు క్షకారాన్ని కవల సంయుక్త వర్ణంగానే భావించారుగాని ద్రుత ప్రకృతికం మీద క్షకారంలోని కకారానికి సరళాదేశం రాదని నిషేధించు కోవడం అందరూ మరిచిపోయారు. చివరికి క్షకారాన్ని గురించి ప్రత్యేక ప్రసంగాలు చేసిన అహోబలపండితీయ కర్తా ప్రౌఢ వ్యాకరణకర్తా యిద్దరూ ఈ విషయాన్ని చెప్పకుండా విడిచిపుచ్చడం సమంజసంకాదు -

కోల్పోయి స్థిరత్వాన్ని జనవ్యవహారంలో పొంది చివరికి పండిత కవుల సమ్మతితో ప్రామాణికత్వాన్నికూడా పొందింది. దీని కున్న ఈ ప్రత్యేకతను గమనించే అనంతుడు క్షకారాన్ని ప్రత్యేక వర్ణంగా పరిగణించాడు -

క॥ భూమిఁ బదాఱచ్చులు నాఁ
గా నెఱసి అకార మాదిగా స్వరములగున్
కా మొదలు క్షకారము తుద
గా ముప్పదినాల్గు హల్లు లగు వ్యంజనముల్ ॥
(అనం. ఛం. 4 ఆ. 123 ప.)

ఈ క్షకారానికి జనవ్యవహారంలో ఏర్పడిన ప్రత్యేక స్థితిని ప్రామాణికంగా అంగీకరించబట్టే ప్రాచీనకాలంలో "ఆది క్షాంతాస్సృతావర్ణాః"అని క్షకారాన్ని కూడావర్ణాంతరంగాఆగమజ్ఞులు వ్యవహరించారు. అనంతుడుక్షకారప్రత్యేక స్థితినిబట్టి దాన్ని వర్ణాంతరంగా పరిగణించినా అది "కష" ల సంయుక్తమన్న సంగతిని మరచిపోలేదు. కాబట్టే తన ఛందం మొదటి పద్యంలోనే "శ్రీరామా స్తనమండలీమిళిత కాశ్మీరార్ద్రి వక్షంబుతో" అని వక్షశబ్దాన్ని వినియోగించి క్షకారంవల్ల వకారాన్ని గురువుచేసుకున్నాడు. అంతేకాదు. అదేపద్యం మూడవ పాదంలో"కారుణ్యామృతపూరపూరితకటాక్షశ్రీలఁ బెంపొందు" అని "క" కారానికి "క్ష"కారంలో "క" కారానికి యతి వేసుకున్నాడు. తన ఛందం 1 ఆ-37వ పద్యంలో "సమాక్షరసం శోభితము లయినఁజాలును మఱి" అని "క్ష"కారంలో వున్న "ష" కారానికి "చా"కారానికి యతి వేసుకున్నాడు. ఇటువంటి యతులు అనంతుడు చాలా వుపయోగించాడు. అయితే

యిక్కడ వీటినియెత్తి చూపడమెందుకంటే అనంతుడుక్షకారాని కున్న ప్రత్యేక స్థితినిబట్టి వర్ణాంతరంగా లెక్కించినా అది "కష"ల సంయుక్తమనే విషయాన్ని మరచిపోలేదని చెప్పడానికే. జన వ్యవహారంలో స్థిరోచ్చారణ వచ్చి పండిత కవుల ప్రామాణికత్వాని పొందిందనే అభిప్రాయంతోనే క్షకారాన్ని "కష"ల సంయుక్తమని తెల్సికూడా ప్రత్యేక వర్ణంగా పరిగణించాడన్న ఈ వస్తుస్థితిని గమనింపక "అనంతునికి క్షకారం కషల సంయుక్తమన్న సంగతే తెలియ" దన్నట్లు అవహేళన చేస్తూ అప్పకవి యీ క్రింది పద్యం రచించడంలో అర్థమేమిటి ?

తే॥ కాకుషా జన్ద్రమైన క్షకారమగుట
దలఁప కేఁ బదిలిపులలో దానిఁగూర్చి
తొలుత భిన్నాక్షరంబైన దొడ్డళాను
విడిచిపెట్టె నంతుండు వెఱ్ఱిగాఁడె ! ॥

(అప్ప - 2ఆ - 52ప.)

ఈ నాడు నిత్యవ్యవహారంలోనే కాకుండా వ్యావహారిక రచనల్లో కూడా "తక్షణం" అనే శబ్దాన్ని వాడుతున్నాము - వాస్తవానికి దాన్ని తత్ + క్షణం అనే వాటి మేళంవల్ల ఏర్పడింది కాబట్టి "తత్ క్షణం" అనే వ్రాయాలి. కాని స్థిరోచ్చారణకల "క్ష"కారానికి పూర్వంలో మరొక వ్యంజనాన్ని (త్ అనేదాన్ని) వుచ్చరించడం కష్టం - కాబట్టి తత్ క్షణం అన్నప్పుడున్న "త్" అనేదాన్ని వుచ్చారణలో జారవిడిచి "తక్షణం" అనే వుచ్చరిస్తాము. ఇలా వుచ్చరించేది కేవలం పామరులేకాదు. పండిత కవులందరూ "తత్ క్షణ" శబ్దాన్ని "తక్షణ" శబ్దంగానే వుచ్చరిస్తారు. ఈ విధంగా వుచ్చరణలో

"త్" అనేది క్షకారం పరమవుతుంటే లోపించడం చాలా ప్రాచీన కాలంలోనే జరిగింది. కాబట్టే యీ క్రింది పద్యాల్లో "తత్ క్షణ" శబ్దం "తక్షణ" శబ్దంగా "క్ష" ప్రాసలో మహా కవులచేత ప్రయోగింపబడింది.

క॥ ఈక్షితికి వచ్చివేగమ
దక్షారామమున వారతరుణుల నృత్యం
బీక్షించి యంతకంతెను
దక్షణమున నేర్చి రంభతగ వేర్పడగన్ ॥

(భీమన. నృసింహపురాణము.)

ఉ॥ అక్షరపక్షపాతమున నర్థము నాళ్ళనొసంగ నుబ్బునన్
భిక్షుజటాధరాదిరులు భిన్ననిజవ్రతులౌదు రైన దు
ర్భిక్షరుజాశిశుచ్యుతులు పెక్కమభక్తియచాలు దాననే
తక్షుభితత్వమేయఘముఁ దార్పదు శంకఁదలంగ మియ్యెడన్ ॥

(ఆము. 4 ఆ. 242 ప.)

ఈ పద్యాల్లో "తత్ క్షణ" శబ్దం "తక్షణ" శబ్దంగా ప్రయోగింపబడిందనడం విస్పష్టమేగదా? ఇక్కడశబ్దశాస్త్రాను గుణంగా "తత్ క్షణ" అని దిద్దితే ప్రాసభంగం జరుగుతుంది. ప్రాసలో కతిపయహల్సామ్యమున్నా శివకవులు సమ్మతిస్తారనే విషయాన్నే అంగీకరించకుండా శ్రీ వఝ్ఝలవారు శివకవులు ప్రయోగాలను సలక్షణంగా దిద్ది సర్వస్వం 198, 199 పుటల్లో చూపించారు. అయితే పైపద్యాల్లో "తక్షణ" అనే వ్యావహారిక పదాన్ని గ్రాంథికవాదులైన శ్రీ వఝ్ఝలవారు ఆమోదించి ప్రాస సరిపెట్టుకుంటారా ? లేక "తత్ క్షణ" అని సలక్ష

ణంగా దిద్దుకొని కతిపయహల్ సామ్యంతోనే ప్రాససరిపోయి నట్లు ముఖ్యంగా భవికవి కృష్ణరాయలు భావించాడంటారా ? అదీయిదీ కాక యేదోరకంగా శ్రీ వేదం వెంకటరాయశాస్త్రి గారు దిద్దిపెట్టినట్లు దిద్దిపెట్టాలో !

పాణిని రచించిన "యరోఽనునాసికేఽనునాసికోవా" అనేసూత్రాన్ననుసరించి ప్రాఙ్ముఖము, ప్రాగ్ముఖము - సరిన్నికట, సరిద్నికటవంటి వికల్పరూపాలుయేర్పడ్డాయి. అయితే ప్రాఙ్ముఖము, సరిన్నికటవంటి అనునాసికాదేశరూపాలనువుచ్చరించినంత తేలికగా ప్రాగ్ముఖము, సరిద్నికటవంటి అనునాసికాదేశం రాని రూపాలను వుచ్చరించలేము. "ప్రాఙ్ముఖ"శబ్దంలోవున్న "ఙ్మ" లోని రెండక్షరాలూ స్థానప్రయత్న మిత్రత్వంకలవవడంచేత వాటిని వుచ్చరించడం తేలిక. ఙకారమకారాలకు రెండింటికీ స్థానం నాసిక. బాహ్యప్రయత్నాలు సంవారనాద ఘోషాలు. ప్రాగ్ముఖశబ్దంలోని "గ్మ"లోని రెండక్షరాలూ భిన్నస్థానాలు కలవి అవడంచేత వాటిని వుచ్చరించడం కష్టం. గకారానికి స్థానం కంఠం. మకారానికి ఓష్ఠమూనాసికా రెండూస్థానాలే. అయినా గకారానికి మకారానికి స్థానసామ్యంలేదు. కాబట్టి భిన్నస్థానాలుకల భిన్నాక్షరాలను వుచ్చరించడం కంటే ఏకస్థానాలు కల భిన్నాక్షరాలను వుచ్చరించడం తేలిక. అలాగే "సరిన్నికట" అన్నప్పుడు "న్ని" లోని నకారాలు రెండూ స్థానప్రయత్న మిత్రత్వం కల ఏకవర్ణాలు. "సరిద్నికట" అన్నప్పుడు "ద్ని" లోని దకార నకారాలు ఏక స్థానికాలే అయినాభిన్నాక్షరాలు. నకారానికి స్థానం నాసికా దంతాలు. దకారానికిదంతాలు. ఏకస్థానికాలైన భిన్నాక్షరాలసం

యోగమైన "ద్ని"వంటి అక్షరాలను వుచ్చరించడంకంటే ఏక స్థానికాలైన ఏకవర్ణాలసంయోగమైన "న్ని"వంటి అక్షరాలను వుచ్చరించడం తేలిక. ఈ సులభాపేక్షతోనే వ్యాకరణ నియమాల ననుసరించి ప్రాఙ్ముఖము, సరిద్నికటవంటి రూపాలు సాధురూపాలే అయినా, ప్రాఙ్ముఖము, సరిన్నికటవంటి రూపాలతో సమానమైన ప్రయోగార్హతకలవే అయినా, వాటిని మనం వ్యవహరించడం లేదు. మనమే కాదు. మన పూర్వులు కూడా చాలా మంది వ్యవహరించలేదు. ఆంధ్ర వాఙ్మయ ప్రపంచంలో అనునాసికాదేశ రహిత రూపాలకు స్థానం వున్నా మార్దవాపేక్షతో జనవ్యవహారంలో నిలచిన రూపాలను మాత్రమే గ్రహించి ప్రాగ్ముఖము, సరిద్నికటవంటి రూపాలను విడిచిపుచ్చారు. అలా విడిచిపుచ్చకేపోతే అనంతాదులు ఈ క్రింది లక్షణాలు సృష్టించుకొనవలసిన అవసరం యేమాత్రమూ లేదు.

గీ॥ సాను నాసిక లౌ వర్గ హల్లులకుఁ ద్వి
తీయములు వికల్ప ప్రాసమై యెలర్చుఁ
బ్రాఙ్నగంబు పై రవిదోఁచె నగ్నివోలెఁ
బ్రాఙ్ముఖుండై నుతించె నీ వాగ్మియనఁగ ॥

(అనం - ఛం - 1 ఆ. 50 ప.)

సీ॥ శబ్ద వికల్పమై జరగుఁగావున మాంస
భుక్ని శరవనికి యగ్నియగుచు
హృన్మోదమునఁ గొల్చెఁ బద్మాక్షు నితఁడని
పల్కు వికల్పమన్ ప్రాసమయ్యె

(ల. సా. సంగ్రహం. 1 ఆ. 65 ప.)

తే॥ పంచవర్గంబు లను గనుపట్టి నట్టి
పొల్లు లనునాసికాక్షరంబులను గదిసి
తమదు పంచమములుఁ ద్రుతీయములు నగుచు
నమరుఁ బ్రాసంబులకు వికల్పాహ్వయముల ॥
తే॥ ప్రాఙ్నగ సమాన ధృతి సుధారుఙ్నిభాస్య
ప్రఙ్నిచయ సక్తకంఠదావాగ్ని పాయి
వాఙ్మనోహరమత యసదృఙ్మహాత్మ
దిఙ్మహితకీర్తి యర్జునయుగ్మ భేది ॥

(అప్ప. 3 ఆ. 327, 328 ప)

ఇలాగే తదితరులు కూడా చెప్పారు - ప్రాఙ్న - అగ్న", "ప్రాఙ్మ - వాగ్మ" అని అనంతాదులు "ఙ్న - గ్న లకూ "ఙ్మ-గ్మ" లకూ ప్రాస చెల్లుతుందని చెప్పుకోవలసిన అవసరం యేమున్నది? ఈ అనంతాదులు అనునాసికవర్ణాల సంయుక్తానికీ తృతీయవర్ణ అను నాసిక వర్ణాల సంయుక్తానికీ ప్రాస చెల్లినట్లుగా వుదాహరించిన

-ప్రాఙ్నగంబు పై రవిదోఁచెనగ్నివోలెఁ
బ్రాఙ్ముఖుండై నుతించె నీ వాగ్మియనఁగ-
-భుఙ్నికరవనికి యగ్నియగుచు
హృన్మోదమునఁ బొల్చెఁ బద్మాక్షునితఁడని-
-సఙ్నిచయ సక్తకంఠ దావాగ్నిపాయి
దిఙ్మహిత కీర్తి యర్జున యుగ్మభేది-

అనే ప్రయోగాలలో "ప్రాఙ్న-ప్రాఙ్మ-భుఙ్ని - హృన్మో - సఙ్ని - దిఙ్మ" అనే వాటిస్థానంలో "ప్రాగ్న - ప్రాగ్మ-భుగ్ని - హృద్మో - స్రగ్ని - దిగ్మ -" అనే వాటిని వుంచి హాయిగా సమప్రాసను సరిపెట్టుకోవచ్చుగదా!- "ప్రాగ్నగము" వంటిరూపాలు అసాధ్యాలైతేనే గదా అనంతాదుల లక్షణాలతో అవసరం! అవిఅసాధ్యాలుకానప్పుడు ఈఅనంతాదులలక్షణాలతో

పనేమిటి? ఇంకా "మయటి నిత్యంవాచ్యమ్" అనేదానిచేత "చిద్మయ" మనే వికల్పరూపం వుండదు కాబట్టి "చిన్మయ" శబ్దంలో "ద్మ-న్మ"లకు రెండింటికీ ప్రాసచెల్లుతుందని అంగీకరిస్తేయేంతో బాగుండేది. అయితే అటువంటి ప్రయోగాలుమాత్రం వెదకినా దొరకవు. ఈవిధంగా నిత్యరూపాలున్నప్పుడుఅటువంటి ప్రాసను ఆమోదించకుండా వికల్పరూపాలుండేటప్పుడు ఆమోదించి ప్రయోజనం శూన్యం-"ప్రాఙ్నగంబుపై రవి దోఁచెనగ్నిసోత్ర" ఇత్యాదుల్లో "ప్రాగ్నగంబుపై" వంటి రూపాలుంచినే ప్రాస ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేకుండానే సరిపోతుంటే వాటిని వుపయోగించకుండా "ప్రాఙ్నగంబు" వంటి అను నాసికాదేశ రూపాలనే అనంతాదులంతా పరిగ్రహించడం వ్యవహారానికి లోను కావడం కాదా? ప్రాగ్నగము వంటి రూపాలు జనవ్యవహారంలో భ్రష్టాలై ప్రాఙ్నగమువంటి రూపాలు మాత్రమే నిల్చివుండడంవల్లనేగదా అనంతాదులు ఆయా ప్రయోగాల్లో అనునాసికాదేశరూపాలను మాత్రమే గ్రహించడం.

ఆది పురాణ కర్త సరిద్నికట - సరిన్నికట అనే వికల్ప రూపాల్లో "సరిద్నికట" అనే రూపాన్ని పరిగ్రహించి "ద్ని" కారంలో "ద"కారానికి "ద్వైతే య"లోని "తే"కారానికి యతి వేసి సలక్షణంగా ఈ క్రింది పద్యాన్ని రచించాడు.

మ॥ ఒకనాఁడిందు ధరుండుఁ బార్వతియు లీలోద్యాన కేళీసరి
ద్నికటానేకవన ప్రదేశముల ద్వైతే యేంద్ర కన్యాప్సరో
నికురంబంబులు పారిజాత కుసుమా నీకంబుపైఁజల్లద
ర్పక బాణంబుల కెల్లనెల్లయగు సౌభాగ్యంబు శోభిల్లఁగన్

(అప్ప. 3 ఆ. 118 ప)

నిత్యవ్యవహారంలో "సరిద్నికట" అనే రూపం భ్రష్టమై "సరిన్నికట" అనే రూపమే నిలబడడంవల్ల వ్రాయసగాళ్ళు "సరిన్నికటానేక......ప్రైతేయ" అని వ్రాస్తే ఆ వ్రాతలు చూచిన అప్పకవి "సరిద్నికట" అనేరూపం వున్నదన్న సంగతి మరచిపోయి తాను కూడా వ్యవహార వశుడై "సరిన్నికట" అనేదేకవి ప్రయుక్తమనుకొని నిర్వ్యర్థంగా "వికల్ప విరణములు" అనే పేరుతో ఒక యతిని తనకుతానై సృష్టించి ఈ క్రింది పద్యాలు రచించాడు- †

గీ॥ వలి గకారంబు ల్లితరానునాసికాఖ్యఁ
గదిసి తత్పంచమముగా వికల్పవిరతి
గలుగుఁ బ్రకిద్వ్ధవసుద్యుమ్నుఁడనంగఁ
గనుల నేత్రుండు సకల దిబ్బ్రహ్మహీశుఁ డనఁగ॥

(అనం - ఛం - 1ఆ - 124ప.)

తే॥ వ్యాకరణ సూత్రముల సంఘాలతుకునప్పుడు
రెండు విధముల రూపంబు లుండెనేని
వసుధ నయ్యక్కరముల కవ్వల వికల్ప
సంధి విరమణ మన రెండు సాగుచుండు॥

తే॥ నందసుకుమార ఘోషహృన్మద విహార
దళిత శిశుపాల గోత్రభిన్మణి వినీల
నాగపర్యంకశాయి సన్మార్గదాయి
ధాతృనుతనామ యోగిహృన్మధ్యధామ॥

(అప్ప - 3ఆ - 116, 117ప.)

---

† అప్పకవి యీ యతిని సృష్టించడానికి "యుక్త వికల్పయతి" అనే పేరుతో అనంతుడు గకారవిషయికంగా రచించిన యీ క్రింది పద్యంమూలం- అనంతుడొక్క గకార విషయికంగానే ఈ యతిని సృష్టిస్తే అప్పకవి అన్ని వర్గాలకూ సమన్వయపరచి సృష్టించాడు - ఏమైనా యిద్దరూ వ్యవహారవశులవ్వడం వల్లనే యీ యతి చెప్పుకున్నారు గాని వేరు కాదు.

అప్పకవి చూపిన లక్ష్యంలో "దళిత......భిన్నణి" "ధాతృ......హృన్మధ్య" అన్నప్పుడు "భిన్మణి, హృన్మధ్య"ల స్థానంలో "భిద్మణి, హృద్మధ్య" అనే "ద్మ" కార రూపాలను వినియోగించి చక్కగా యతిని సరిపెట్టుకోవచ్చుగదా! అయినప్పుడు ఈ కొత్త యతిని అప్పకవి సృష్టించ వలసిన అవసరం యేమిటి? "భిద్మణి" వంటి రూపాలను మరచి "భిన్మణి" వంటి రూపాలను మాత్రమే దృష్టిలో పెట్టుకొనడంవల్లగదా అప్పకవి యీ యతిని చెప్పింది? "భిన్మణి" వంటివే అప్పకవి దృష్టిలో వుండడానికీ "భిద్మణి" వంటివి లేకపోవడానికీ కారణం జనవ్యవహారమేగదా! జనవ్యవహారంలో ఉచ్చారణ సులభాపేక్షతో "భిద్మణి"వంటి రూపాలు విడిచి పెట్టబడడమేగదా! అయితే యీ యతి వ్యవహార సిద్ధంకాక మరేమవుతుంది?

ఈ విధంగా వికల్ప రూపాలుండేచోట ఈ యతి నిష్ప్రయోజనంగా చెప్పుకొనే కంటే "చిన్మయము" వంటి నిత్యానునాసికాదేశ రూపాల్లో తకార (చిత్ లో తకారానికి) యతిని అంగీకరించి వుంటే బాగుండేది. కాని అటువంటి యతులు ప్రయోగాల్లో మృగ్యాలు. చిన్మయాదుల్లో తకార యతిని అప్పకవి అంగీకరింపలేదు సరిగదా

గీ॥ హలధరానుజమయటి నిత్యంబటంచు
పలుకు వాక్యంబుచే మయపదము గూడు
నప్పుడను నాసికంబె నిత్యమయి నిల్చు
నలినలోచనుమేను చిన్మయ మనంగ॥

(అప్ప. 3 ఆ - 120 ప)

అని అనునాసికానికే యతి వెయ్యాలని నిష్కర్షగా చెప్పాడు. వికల్ప రూపాల్లో అంగీకరించి నిత్యరూపాల్లో అంగీకరించక పోవడం సమంజసంకాదు - వాస్తవానికి యిటువంటి యతి నిత్యరూపాలను దృష్టిలో పెట్టుకొని చెప్పాలేగాని వికల్ప రూపాలను దృష్టిలో పెట్టుకొని చెప్పి ప్రయోజనం శూన్యం - నిత్యరూపాల్లో చెప్పాలంటే ప్రయోగాలులేవు. కాబట్టి చెప్పడానికి వీలులేదు. అందువల్ల ఈ యతులు చెప్పదలచిన అవసరం యేమాత్రమూ లేదు. మార్దవ దృష్ట్యా గ్రాంథికవాదులు జనవ్యవహారాన్ని ఆమోదిస్తే "సరిద్నికట" వంటి రూపాలతో మనకు అవసమే లేదు -

ఇలాగే "ఝయోహోఽన్యతరస్యామ్" అనే సూత్రం చేత "వాగ్ఘరి - వాగ్హారి" వంటి ద్వివిధ రూపాలూ సిద్ధిస్తాయి. "వాగ్ఘరి" వంటి వర్గ చతుర్థ వర్ణాలుగల రూపాలను వుచ్చరించడం కంటే ""వాగ్హారి" వంటి "గహ" ల సంయుక్త రూపాలను వుచ్చరిండం కష్టం. కాబట్టి ప్రాచీన కాలంలోనే "వాగ్హారి" వంటి హకార సంయుక్తరూపాలు వ్యవహార భ్రష్టాలై పోయాయి. "వాగ్ఘరి" వంటి రూపాలే వ్యవహారంలో నిల్చివున్నాయి. "గహ" లు ఏకస్థానికాలే అయినా భిన్నాలైన ప్రయత్నాలు కలవి. ఈ విధంగానే "జ, డ, ద, బ లు "హ" కారం కంటే భిన్నాలైన స్థాన ప్రయత్నాలు కలవి. "గఘ" లు ఏవిధంగా ఏకస్థాన ప్రయత్నాలు కలవో ఆ విధంగానే తక్కిన వర్గ తృతీయ తురీయ వర్ణాలన్నీ ఏజంట కాజంట స్థానప్రయత్న మిత్రత్వం కలవే. అందువల్ల వర్గ

తృతీయంలో హకారాన్ని కలిపి వుచ్చరించడం కంటే వర్గతృతీయంతో ఆవర్గతురీయ వర్ణాన్ని కలిపి వుచ్చరించడం చాలా సులభం. ఈ సులభాపేక్షవల్లనే "వ్యాఘ్ర" వంటి రూపాలు జనవ్యవహారంలో భ్రష్టమయ్యాయి - అలా భ్రష్టమవ్వడంతో ప్రాచీన కాలంలో పండిత కవులు వాటిని వాడడమే మాని వేసారు. అందువల్లనే అనంతాదులు ఈ క్రింది యతులు సృష్టించుకొన్నారు -

వికల్పయతి -

గీ॥ హాసముతస్సై హల్లుల వికల్ప యతులు వ్రాల్లు
దేవకీ నందనుఁడు జగద్ధనుఁడనంగ
హాలధరుఁడు సంగరాంగణోద్ధతుఁడనంగ
నవని మోచినయవి కకుబ్భస్తులనఁగ ॥

(అనం - ఛం - ఆ. 123.)

అంత్యోష్మసంధి వళులు -

సీ॥ కైరవకామ దుగ్ఘరవాహ కవికుంద
హైరణ్య గర్భవాగ్ఘంస బృంద
....

గీ॥ ....యిట్లు వర్గహల్లు
పొల్లులకుఁ బై హకారంబు పొందునపుడు
సంధి బంధన యంత్యోష్మ సంధి విరమ
ణాఖ్యచే దానికయ్యదియైనఁ జెల్లు ॥

(అప్ప - 3 ఆ. 155 ప.)

అనంతుని పద్యంలో "ఉద్ధతుఁడు - కకుబ్భస్తులు" అన్నప్పుడు "ఉద్హ్వతుఁడు - కకుబ్హ్వస్తులు" అనే హకార రూపాలను ప్రయోగిస్తే సవ్యంగా యతులు సరిపోతాయి. అలాగే

అప్పకవిపద్యంలో కూడా "వాగ్ఘ్రంస" ఇత్యాదులకు మారు "వాగ్హ్రంస" వంటి హకార సంయుక్త రూపాలు ప్రయోగిస్తే చక్కగా యతులు సరిపోతాయి - అయినప్పుడు అనవసరమైన యీ యతిని అనంతుడు అప్పకవి చెప్పితాము జన వ్యవహారాన్ని దాటి పోలేమని ఒకసారికి రెండుసార్లు నిరూపించుకొన్న వారు కాలేదా ? "జగద్హితుడు" వంటి హకార రూపాలు వుంటాయన్న సంగతి అనంతాదులకు తెలియదా ? ఎందుకు తెలియదు ? చక్కగా తెల్సును. అప్పకవి స్పష్టంగా "ఝయో హోఽన్యతరస్యామ్" అనే సూత్రాన్ని వుదాహరించి దాని అర్థాన్ని ప్రతిపాదించి ఆ తర్వాతనే లక్షణ పద్యం వ్రాసాడు- అనంతుడు మాత్రం అప్పకవి కంటే ఎక్కువే తిన్నాడుగాని తక్కువతిన లేదు - తన ఛందం 4 ఆశ్వాసం 63వ పద్యంలో స్పష్టంగా "స్రగ్ఘరము - స్రగ్హరము" వంటి ద్వివిధాలైన రూపాలనూ పేర్కొన్నాడు - అక్కడ సంధికార్యం చెబుతూ వికల్పంగానే చతుర్థవర్ణాన్ని ఆదేశంగా చెప్పాడు - ఇంతా తెలిసి కూడా యతి విషయానికి వచ్చేసరికి జన వ్యవహారానికి లొంగిపోయి ప్రత్యేకతను నిలబెట్టుకొన్నారు - అనంతాదులు జన వ్యవహారానికే లొంగకపోతే యీయతిని అసలు ప్రత్యేకంగా చెప్పుకొనవలసిన అవసరం యే మాత్రమూ లేదు-

— ద్విత్వలోపాలు —

హల్లు పరమవుతుంటే ద్విత్వాల్లో వున్న స్వరం కొన్ని చోట్ల లోపిస్తుంది. ఆ విధంగా స్వరలోపం జరిగినప్పుడు ద్విత్వాక్షరాలు అన్యహల్సంయుక్తాలు అవుతాయి - అన్య

హల్సం యుక్తాలైనప్పుడు ద్విత్వాక్షరాల్లో ఒకహల్లు మాత్రమే వుచ్చరింపబడుతుంది. రెండవ హల్లు ఉచ్చరింపబడకుండా ఎప్పుడైతే భ్రష్టమయ్యిందో అప్పుడే ఆద్విత్వమైన హల్లుల్లో ఒక హల్లు వ్రాతలో సైతం వ్యవహారవశాన లోపిస్తుంది. "అబ్బురాదు లందుత్వంబునకు లోపంబగు" (బాల. ప్రకీ. 19సూ.) అని చిన్నయసూరి సూత్రం వ్రాసుకొన్నాడు. అబ్బురము - అబ్రము, కప్పురము - కప్రము, అప్పుడు - అప్డు, ఇప్పుడు - ఇప్డు, ఎప్పుడు - ఎప్డు, చెప్పుడు - చెప్డు, నెత్తురు - నెత్రు, మొదలైన వాటిల్లో ఈ సూత్రంచేత ఉత్వలోపం వస్తుందని చిన్నయ్య అభిప్రాయం. అబ్బురము అన్నప్పుడు ఉత్వలోపం వస్తే అబ్బ్రము అవుతుంది గాని అబ్రము ఎలా అవుతుంది ? ఇలాగే తక్కిన రూపాల్లో కూడా ద్విత్వలోపం ఎలా వస్తుంది? అబ్బ్రము ఇత్యాదుల్లో ద్విరుక్తమైన హల్లు అన్యహల్ సంయోగం వుండడంవల్ల వుచ్చారణలో లోపిస్తుంది. ఆ విధంగానే చిన్నయ కూడా ఉచ్చారణ వశాన ద్విత్వలోపంచేసి అబ్రము అని వుదాహరించాడేగాని ఉత్వలోపం తర్వాత ద్విత్వలోపం వస్తుందన్న సంగతి ఆతడెక్కడా వ్రాయలేదు.

ఈ విధంగానే "ఇయకు మారుగా నామాంతంబున కేత్వంబు బహుళంబుగానగు" (బాల - ఆచ్ఛి - 23సూ.) అనే సూత్రంలో చిన్నయ సూరి "ముత్తియశబ్దంబునందు మాత్ర మిత్వలోపంబు గానంబడియెడి. ముత్తియము - ముత్తెము - ముత్యము" - అని వ్రాసాడేగాని ముత్యము అన్నప్పుడు ఇత్వలోపంతోపాటు తకార ద్విత్వలోపం కూడా యెలా జరిగిందో

చెప్పలేదు. అక్కడ వుచ్చారణలో అన్యహల్సంయోగంలో ద్విత్వంలో ఒకటి లోపిస్తుంది. కాబట్టి వ్యవహారానికి లోబడి "ముత్యము" అని ద్విత్వరహిత రూపం వ్రాసాడేగాని వ్యాకరణ కర్తయైన తాను లోపం చెప్పకుండానే యేలా జరుగుతుందన్న సంగతి గమనించలేదు.

ప్రౌఢవ్యాకరణ కర్త కూడా "ముత్తియ శబ్దేతరంబుల యందును దఱచుగ నిత్యలోపంబు గానంబడియెడి" (ప్రౌఢ - శబ్ద - 49సూ.) అనే సూత్రం వ్రాసి వరుసనే "కన్నియ - కన్య, దివ్వియ - దివ్య, కల్లియము - కళ్యము, పల్లియము- పళ్యము, వీడియము - వీడ్యము, అని వుదాహరణ లిచ్చాడే గాని "కన్య" మొదలైన రూపాల్లో ఇత్వలోపంతో పాటు ద్విత్వ లోపం కూడా ఎలా జరిగిందో చెప్పలేదు. ఇలాగే శబ్ద పరిచ్ఛేదం 50 సూత్రంలో కూడా ఎక్కాలు - ఎక్క అన్నప్పుడు ఉత్వలోపమే చెప్పాడుగాని ద్విత్వలోపం చెప్పలేదు - ప్రాచీన కాలంలో బాలసరస్వత్యాదులు కూడా "ముత్యము" మొదలైన రూపాలను "పదంతతాచ" ఇత్యాది ఆంధ్రశబ్దచింతామణి సూత్రవ్యాఖ్యా సందర్భంలో పేర్కొన్నారు కాని ద్విత్వ లోప విషయం యెవ్వరూ ఒక్కటైనా యెత్తలేదు -

తత్ + జ్ఞాలు అన్నప్పుడు "తజ్జ్ఞాలు" అని రూపం అవుతుంది - అయినప్పుడు ఞ కార సంయోగంచేత "జ్జ్ఞ" అన్నప్పుడున్న ద్విత్వ జకారం ఉచ్చారణలో నిలువదు. అప్పుడది "తజ్ఞాలు" అని తయారవుతుంది. పాల్కురికి సోమన వ్యవహార

వశాన జకార ద్విత్వం లేకుండా "తజ్ఝులు" అనే రూపాన్ని "తఝ్ఝులు" గా ఈ క్రింది ద్విపదలో ప్రయోగించాడు -

తఝ్ఝుల ద్విత్వములచేఁ గానవనిన
నజ్ఞాని ! కారంగ నలవియే నీకు ?

(పండితా - వాదప్ర. - 526 పు.)

ఇలాగే తత్ + త్వ - అనేది "తత్త్వ" అని అవుతుంది. ఇక్కడ కూడా వుచ్చారణలో ద్విత్వం లోపించి "తత్వ" అని అవుతుంది. దీన్ని కూడా వ్యవహార వశాన సోమన్న ద్విత్వ రహితంగా ప్రయోగించాడు -

హేత్వంతరము లాద్యులెన్నరే పరమ
తత్వహూషిత వివిధ ప్రమాణముల

(పండితా - వాదప్ర. 567 పు.)

తత్ + త్రిపురాంతక = తత్త్రిపురాంతక అని కావలసివుండగా ద్విత్వలోపంతో

తత్రిపురాంతక స్థానవాస్తవ్యుఁ
డై త్రిపురాంతకు.........

(బసవ - 4 ఆ - 107 పు)

అని ప్రయోగించాడు - ఇలాగే తత్ + ధ్యాన = తద్ధ్యాన కావలసి వుండగా వుచ్చారణ వశాన "తధ్యాన" గా ప్రయోగించాడు -

మధ్యాహ్న మగుటయు మారయ్య లింగ
తధ్యాన సుఖ............

(బసవ - 5 ఆ. 153 పు.)

ఇటువంటి ప్రయోగాలన్నింటిలోను శ్రీ వఝ్ఝలవారు క్రమంగా తజ్జ్ఞులు, తత్త్వ, తత్త్రపు, తద్ధ్యాన అనే పదాలనే వుంచి "అనచిచ" అనే సూత్రంచేత తక్కిన అజ్ఞానాది పదాలను కూడా "అజ్జ్ఞాని, హేంత్త్వంత, మద్ధ్యాహ్న" అని దిద్దుకొని "ఐత్రిపు" అనేదాన్ని "అత్త్రిపు" అనిదిద్దుకొని చూపెడతారు. సహజంగావున్న ద్విత్వానికే వుచ్చారణలేక లోపంజరుగుతుంటే లేనిచోట్ల కూడా ద్విత్వం పెడదామంటారు శ్రీ వఝ్ఝలవారు. (ఆం. వ్యా. సం. స. 199 పు.) అది లోకవిరుద్ధం సరిగదా ఆ విధంగా మనం దిద్దగలిగేవి ఈ విశాల వాఙ్మయంలో స్వల్పాలేనని కూడా గమనించాలి. తెలుసుకోవాలేగాని ఇంకా......ఇంకా......విశేష వ్యావహారిక ప్రయోగాలు యెన్నెన్నో వున్నాయి. పరికించండి.

దీర్ఘంమీద ద్విత్వాన్ని వుచ్చరించడం తెలుగు వారికి కష్టం. కాబట్టే వాక్కు – వాకు, – స్వరాట్టు, స్వరాటు వంటి వికల్ప రూపాలు సిద్ధించాయి. "న్యాయ్య, సాహాయ్య, సాన్నాయ్య, ధాయ్య, హేయ్య" మొదలైన సంస్కృత శబ్దాల్లో కూడా ద్విత్వం దీర్ఘంమీద వున్నది. కాబట్టి ఆ ద్విత్వాలకు లోపంచేసి "న్యాయ, సాహాయ, సాన్నాయ, ధాయ, హేయ" మొదలైన ద్విత్వ రహిత రూపాలను మనం వ్రాస్తున్నట్లే ప్రాచీన కాలంలో చాలా మంది పండితులు కవులు కూడా వ్రాస్తుండేవారు. కేవలం వ్రాయడమే కాదు వాటిని చాలా మంది కవులు కూడా ప్రయోగించారన్న సంగతి సర్వవిదితం –

ఈ న్యాయ్య మొదలైన ద్విత్వాలు గల పదాలను "న్యాయ" మొదలైన దిత్వాలు లేని రూపాలుగా వ్రాయడమే కాకుండా ఈ స్థితికి విపరీతంగా "పానీయ, పీయూష" మొదలైన ద్విత్వరహిత పదాలను "పానీయ్య, పీయ్యూష" అని ద్విత్వ సహిత పదాలుగా కూడా ప్రాచీన కాలంలో పండిత కవులు వ్రాస్తుండేవారు - కాబట్టే అప్పకవి

సీ॥ త్రైయక్ష పానీయ పీయూష నైగమాశ్వ
హైయంగవీన నైయాసిక త్వ
దీయ స్వకీయాస్మదీయ ప్ర
భృతులను గియ్యలు వెట్టరాదు
క్షయ్యజయ్య న్యాయ్యసాహాయ్య సాన్నాయ్య
ధాయ్య హేయ్యముల నికాయ్యములను
గయ్య శబ్దమునను గియ్యలు గలవని
తెలిసి ప్రాసములకు నిలుపవలయు

(అప్ప - 2ఆ - 226ప.)

అని చెప్పుకున్నాడు. ఇందులో "పానీయ" మొదలైన శబ్దాల్లోకియ్యవడి వ్రాయరాదని "న్యాయ్య" మొదలైన శబ్దాల్లోకియ్యవడి వ్రాయాలని అప్పకవి స్పష్టంగా చెప్పాడు. అయితే యిందులో త్రైయక్షాదుల్ని పానీయాదుల్ని కలగా పులగం చెయ్యడం సమంజసంకాదు - అలాగే క్షయ్యాదుల్నీ న్యాయ్యాదుల్నీ కలగా పులగం చెయ్యడం సమంజసంకాదు. త్రైయక్షాదులకు పానీయాదులకు సంబంధంలేదు. అలాగే క్షయ్యాదులకు న్యాయ్యాదులకు సంబంధంలేదు - ఈ పద్యాన్ని అప్పకవి సవ్యంగా రచించలేదని "అయి - ఐ, అవు-

ణో" అనే విభాగంలో విస్పష్టంగా వివరించి సరైన పద్యాన్ని 138 వ పుటలో రచించి చూపించాను. ఈ అప్పకవి లాగానే గణపవరపు వెంకటకవి కూడా క్రింది సీసపాదాల్లో క్రయ్య శబ్దాన్ని సాన్నాయ్యాదులను కలగా పులగంచేసి నైయాసికాది శబ్దాలను ఆత్మీయాది శబ్దాలను కలగా పులగం చేసాడు.

సీ॥ క్రయ్య సాన్నాయ్య నికాయ్య ధాయ్యా క్షయ్య
జయ్యసాహాయ్య సంచాయ్య పాయ్య
శయ్యాది శబ్దాలఁ గియ్యవళ్ళు దవర్చు
నీ కియ్యవళ్ళు రాకెసఁగు నట్టి
పదములు తగు నింక నైయాసికాత్మీయ
హైయంగవీన నైయాయికులన
నైయాత్య మనఁగను వైయాకరణులునై
యగ్రోధములు ద్వితీయలు నన రమ
ణీయ తదీయ త్వదీయ మదీయాస్మ
దీయులునా యుష్మదీయు లనఁగఁ
గమనీయతపనీయ గణనీయ వంధ్యఘు
టీయు లనఁగ భవదీయులనఁగ

(ఆం - కా - 8రపు.)

ఈ అప్పకవి వెంకటకవు లిద్దరూ న్యాయ్యాది శబ్దాలను న్యాయాదులుగాను, త్వదీయాది శబ్దాలను త్వదీయ్యాదులు గాను వ్రాయకూడదనే అభిప్రాయంతోనే పై సీస పద్యాలు రచించారు. ఉచ్చారణ వశాన న్యాయ్యాదుల్లో ద్విత్వానికి లోపం చేసి త్వదీయాదుల్లో ద్విత్వంచేసి ప్రాచీన పండిత కవులు

వ్రాసేవారని అప్పకవి వెంకటకవుల పద్యాలవల్ల విస్పష్టంగా తేలుతున్నది.

— ఇతరాలు —

జన వ్యవహారంలో సులభాపేక్షతోను ఇతర విధాలగాను పెక్కు పదాలు మార్పుగా వ్యవహరింపబడుతుంటాయి. ఆ విధంగా వ్యవహారికంగా మారిపోయి లక్షణత్వంలేని పదాలను కవి ప్రయోగాలలో కొన్నిటిని ఈ క్రింద పేర్కొంటున్నాను-

"స్నాన" శబ్దాన్ని కొందరు "స్థాన" శబ్దంగాను మరి కొందరు "స్తాన" శబ్దంగానూ ఈనాడు వ్యవహరిస్తున్నట్లే పూర్వ కాలంలో పండితులు కవులు కూడా కొందరు వ్యవహరిస్తుండే వారు - ఈ క్రింది కవి ప్రయోగాల్లో "స్నాన" శబ్దం స్థాన శబ్దంగానో స్తాన శబ్దంగానో కవులచేత వ్యవహరింపబడి యతులు సరిపుచ్చుకొనబడ్డాయి -

ద్విప॥ ధారాంబువుల రుద్ర కృత స్నానులై పరగ

((పండితా - పర్వత - 291 పు.)

ఉ॥ ధీనిధి............విభూతి మంగళీ

స్నానము చేసి ధౌత పరిధానముఁ గట్టి............

(హరవిలాసం-)

గీ॥ స్నాన మహిమంబు భక్తి తాత్పర్య గరిమ (కాశీఖండం-)

గీ॥ స్నాన మొనరించి ధౌత వస్త్రములు గట్టి

నాయకసమేతుఁడై కవి నాయకుండు

(లక్షణ - సా - సంగ్రహం - 1 ఆ. 41 ప)

సీ॥ తావకనగజలస్నాత పాపహరాయ

నతి మాత్ర సాధన జ్ఞానదాయ

(ప్రబంధరాజ విజయ వెంకటేశ్వర విలాసం. ఆ. రం. రాట్చం

దం. 8 ఆ. 302 ప)

పై ప్రయోగాలన్నింటిలోను స్నాన శబ్ద స్థానంలో "స్థాన" శబ్దంగాని "స్తాన" శబ్దంగాని కవి ప్రయుక్తమై యతి సరిపెట్టుకోబడింది. శబ్దనిర్దుష్టత్వం కోసమై "స్నాన"గా సంస్క-రించే సరికి యతి తప్పుతున్నది. ఈ ప్రయోగాల్లో వ్యవహార వశాత్తు "స్థాన, స్తాన" శబ్దాల్లో ఒకటి ప్రయుక్తమైన దన్న సంగతి గమనింపక శబ్ద శాస్త్రానుగుణంగా "స్నాన"గా దిద్ది "స్న-తా"లకు తద్భవ వ్యాజయతి చెల్లుతుందని కొందరు భావించారు. అది కేవలం పొరపాటు - తద్భవవ్యాజ యతికీ దీనికీ ఏ మాత్రమూ సంబంధం లేదు - అసలు తద్భవ వ్యాజ యతి కూడా జ్ఞకారంలో "న" కారోచ్చారణ యేర్పడడం వల్ల సిద్ధించిందేగాని వేరుకాదని లోగడే నిరూపించాను-

అచ్యుతరామయ్యఅనడానికి "ఏరాఅచ్చుతరామయ్యా!" "అచ్చుతరామయ్య లేడా ?" అని "అచ్యుత" శబ్దస్థానంలో "అచ్చుత"శబ్దాన్ని చాలామందివ్యవహరిస్తుంటారు-"చయ"లకు రెండింటికీ తాలువులే స్థానం - ఏక స్థానికాలైన భిన్నాక్షరాల సంయుక్తాన్ని వుచ్చరించడం కంటే ఏకస్థానికాలైన ఏకాక్షరాల సంయుక్తాన్ని - అంటే - ద్విత్వాన్ని వుచ్చరించడం చాలా తేలిక. అందువల్లనే"అచ్యుత"లో "చ్య" కారంవుచ్చారణలో "చ్చ"కారంగా మారి పోయింది. అచ్యుత శబ్దం అచ్చుత శబ్దంగా ఈ క్రింది ప్రయోగాల్లో కవులచేత ప్రయోగింపబడింది.

తెచ్చిన భూలోక దేవేంద్రుడైన
అచ్చుత రఘునాథుడటు గటాక్షింప॥

(రఘు - నా - నా - అభ్యు - 80పు.)

అచ్చుతేంద్రు కుమారు ససహాయశూరు
నిచ్చటికేఁ దెత్తు నిదె పోయివత్తు॥

(రఘు - నా - నా - అభ్యు - 46పు.)

అచ్చుత రఘునాథుఁడంత నక్కడను
విచ్చలవిడి స్వారి విచ్చేసిమరలి॥

(రఘు - నా - నా - అభ్యు - 49పు.)

అచ్చుత రఘునాథ యతి మోహనాంగ
విచ్చేయవలయు మా నెలఁది యింటికిని॥

(రఘు - నా - నా - అభ్యుదయం - 65పు.)

అచ్చుతేంద్రుని పట్టి యతివఁజేపట్టి
మచ్చికతోడ నమ్మనికి సౌధమునకు॥

(రఘు - నా - నా - అభ్యు - 79పు.)

సీ॥ సారస దరహాస చారు చంపక నాస
వైభవ క్రమణమత్తేభగమన
మంజు లారుణపాణి మత్తకోకిలవాణి
గండనిభముకుర కందచికుర
కాంతామణీ శాయి కనకలతా దేహి
విమలహృత్పేటి పృథ్వినిభకటి
బాలసదుత్పలమాలా విభూషణి
గురుకవి జనపుత్రి తరళ నేత్రి

గీ॥ నిట్టి మత్కావ్య కన్యక నిచ్చమెచ్చి
లచ్చి మగనికినిచ్చి నే నచ్చుతపద
మెచ్చుగాఁగొని మనియెదఁగుచ్చితుండు
మెచ్చి మెచ్చుక యుండిన లొచ్చుగలదె॥

(కాళిందీపరిణయం - ‡ 1 ఆ. 24 ప.)

---

‡ కర్త - చేమర్తి సుందర శేషగిరి రాయకవి. అముద్రితం - దీని వ్రాత ప్రతి నావద్ద వున్నది.

ఈ పై ప్రయోగాలన్నింటిలోనూ "అచ్యుత" శబ్దానికి మారు వ్యవహారంలో వున్న "అచ్చుత" శబ్దం ప్రయోగింపబడింది.

ఈ విధంగా పెక్కు వ్యావహారిక ప్రయోగాలు కవులు ప్రయోగిస్తే వాటినన్నింటినీ అనేక విధాలుగా మన పండితులు సంస్కరించారు. ఈ క్రింది విషయాలు గమనించండి -

మర్త్యలోకం అనడానికి నిత్యవ్యవహారంలో "మర్తెలోకం" అని అంటారు. (ఇక్కడ తాలవ్యమైన యకారానికి తాలవ్యమైన ఎకారం రావడం సహజమే -) ఈ "మర్తె" శబ్దాన్నే పాల్కురికి సోమన్న

మర్తెలోకమునకు మహిత వేదాల కొక్కఁడు
కర్తయున్నాఁడె............ (బసవ 1ఆ. 18 పు)

అని ప్రయోగించాడు - దీన్ని "మర్త్యలోక...... కర్త" అని (శ్రీ)వేటూరివారు దిద్ది కతిపయహల్సామ్య ప్రాసగా పేర్కొంటే ప్రాసలో కతిపయహల్సామ్యంఅంగీకరించని శ్రీవర్ఘ్యుల వారు "మర్తలోక......కర్త" అనిదిద్దిపెట్టారు - (ఆ - వ్యా - సం - స - 189పు.)

"నిత్యము" అనడానికి వ్యవహారంలో "నిత్తెము" అని అంటారు - అలాగే "ముత్యాలు" అనడానికి "ముత్తాలు" (త్తాలోని స్వరం ఆ కార ఏకారాల మధ్యమ స్వరంగా వుంటుంది.) అని అంటారు - ఈ "నిత్తె" శబ్దాన్ని "ముత్తాలు" అనే దాన్ని వ్యవహారవశాన పాల్కురికి సోమన్న ప్రాసలో వినియోగించాడు.

నిత్తెనేమంబిది నేటి ప్రుగ్గునకు
ముత్తాలపొడి మాకు ముక్కున వలయు॥

(బసవ - 2ఆ - 44పు.)

ఈ ప్రయోగాలను "నిత్యనేమంబిది-ముత్యాల" అని శ్రీ వేటూరి వారు సంస్కరించి "నెత్యనేమం" అనేదాన్ని వైరి పదసమాసంగా భావించగా మిశ్రసమాసాల నంగీకరించని శ్రీ వఝ్ఝలవారు "నిత్య"శబ్దం కేవలం సంస్కృత పదమే అనడానికి వీలులేదనీ "నిత్తియము - నిత్యము" (ముత్తియము- ముత్యము వలెనే) అని "నిత్య"పదం తెలుగు పదమేననీ ఉటంకించారు. (ఆం - వ్యా - సం - స - 161పు.) సూత్రాలు ప్రవర్తించు తుంటే చాలు ఎన్నిరూపాలైనా వ్యవహారంలో వుండడం లేక పోవడం అనేమాటతో పనిలేదు కొత్తరూపాలు తయారవు తూనే వుంటాయి.

"కాళహస్తి"ని నిత్య వ్యవహారంలో "కాళాస్త్రి" అని అంటారు - పాల్కురికి సోమన్న ఈ కాళాస్త్రి అనే వ్యావహారిక పదాన్నే స్వీకరించి ముచ్చటగా

"కలితాత్ములై తిరుకాళాస్త్రిపురిని"

(బసవ - 3 ఆ - 88 పు.)

అని రచిస్తే "కాళహస్తి"కి "కాళాత్తి" అనే తద్భవాన్ని అంగీకరించి "కాళాత్తిపురిని" అని దిద్దుకోవలసిందంటారు గ్రాంథిక వాదులైన శ్రీ వఝ్ఝలవారు -

(ఆం. వ్యా. సం. స. 161 పు)

ఇదీ వరస - దిద్దడమంటే ఒకటీ రెండూ కాదు. యెన్నైనాదిద్దిపెట్టగలరు. శబ్దసౌకుమార్యంచెడినా, అర్థాపత్తికే

ఆపత్తుకలిగినా, కర్మంజాలక తమకు తెలియకుండా, వ్యాకరణ విరుద్ధమే అయినా ఏదైనా ప్రాచీన వాఙ్మయంలో కన్పడ్డ వ్యావహారిక ప్రయోగాన్నల్లా దిద్ది వెయ్యడమే పని-

ఎడు, ఎడి అనే వాటికి వ్యావహారికంలో "ఏ" కారం వస్తుంది. తెచ్చెడు వాడు - తెచ్చేవాడు, దాటెడువాడు - దాటేవాడు - ఇలాగే ఎడికూడా. "దాటేవాడు" అనే వ్యావహారిక రూపాన్ని రోజూ నిత్యవ్యవహారంలో వున్న అలవాటు కొద్దీ తెనాలి రామకృష్ణకవి ఈ క్రింది పద్యంలో ప్రయోగించాడు -

శా॥ అంతర్వాణి కుశేశయా మ్యమణిఁ బద్మాక్షున్ మదిన్ నిల్పి గు
ప్తాంతానంత భవాంధకూపతరణ ప్రౌఢిన్ దృఢస్నేమఁ బా
టింతుర్పెద్దలు పెద్దనమ్మి నుయిదాఁటేవానికిన్ జింతయా
కంతైనంగడమేనియుం గడమగాదాయంచునూహించుమన్ ॥

(పాండు - 4ఆ - 275ప.)

దీనిని గురించి శ్రీ వఝ్ఝలవారు

- "ఇట నుయిదాఁటెడి యనుదాని వ్యావహారిక రూపము "దాటే వానికి" అనునది రామకృష్ణకవి ప్రయోగించెనా యని యాలోచింపవలసియున్నది. ఇట "నుయిదాఁటు + ఏ వానికిన్" అని ఛేదముచేసి యించుగాగమస్వర యతి నంగీకరించి కవి ప్రయోగించెనా యని నాలోచింప నగును. ఈ పక్షమున లక్షణ విరోధము కల్గనేరదు" - (ఆం - వ్యా - సంస - 178పు.)

అని వ్రాసారు. నుయిదాఁటే వానికిన్ అనే దాన్ని నుయి దాఁటు + ఏ వానికిన్ అని విభజించుకొని అర్థం చెప్పా

కోవాలట - అక్కడ లక్షణ విరోధమేదీ కల్గదట - నుయి దాటు + ఏ వానికిన్ అని విభజించేట్లయితే నుయిదాటునే వానికిన్ అనే రూపమే అవుతుందిగాని నుయిదాటేవానికిన్ అని నుగాగమా భావరూపం కానేకాదు. కేవలం దాటు + ఏ వానికిన్ అనే విభాగాన్ని ఇంచుగాగమయతిని మాత్రమే దృష్టిలో పెట్టుకొన్న శ్రీ వర్ఘులవారు ఈ సందర్భంలో వ్యాకరణాన్ని మరచిపోయారు - "ఉదంత మగు తద్ధర్మార్థవిశేషణ మున కచ్చు పరమగునపుడు నుగాగమంబగు" - (బాల-సంధి-33 సూ -) అనే సూత్రం ప్రవర్తించి "నుయిదాటు నేవానికిన్" అనే అవుతుందిగాని "నుయిదాటే వానికిన్" అని కానే కాదు - అయితే యిక్కడ నుగాగమ అభావాన్ని శ్రీ వర్ఘుల వారు అంగీకరిస్తారా? పాండురంగ మహాత్మ్య ప్రయోగాన్ని వ్యావహారిక ప్రయోగం కాదని త్రోసిపుచ్చడానికి ప్రయత్నించిన శ్రీ వర్ఘులవారు

మ॥ పడతీ..................గుడిమింగే వానికిన్ దల్పుల
ప్పుడముల్ గావన....................

(ప్రబోధ - 2 ఆ - 67 ప -)

అనే ప్రయోగాన్ని అంగీకరింపక తప్పలేదు సరిగదా

- "ఇందును "మ్రింగెడి" వానికి అను దాని గ్రామ్య రూపము "మ్రింగేవానికి" అనునది ప్రయుక్తమయ్యెను." -

అని వ్రాసి తిరిగి యీ క్రింది విధంగా సమర్థించుకొన్నారు -

-"కాని లోకోక్తుల ననుకరించి యుద్ధరించు నపుడది కవి ప్రయోగములో దోషమని పించుకొనదు గాన నిందు "గుడి

మ్రింగే వానికిఁదల్పు లప్పడములుగావు" అను లోకోక్తి (సామెత) యుద్ధరింపఁబడెనని సమర్థించుట కవకాశము కన్పట్టు చున్నది - "అనుకారేచదోషాణాం । సర్వేషాం నైవదోషతా" (సాహి - ౭ పరి - ౬౦౨ కారి) "-

(ఆం. వ్యా - సం. స. 178 పుట -)

ఏనాటికైనా సమర్థనలు సమర్థనలుగానే నిలుస్తాయి - మహాకవి ధూర్జటి తన కాళహస్తీశ్వరశతకంలో "చేయఁ గాఁబోతే దోషముగాన" (69 ప.) వంటి వ్యావహారిక భాషా ప్రయోగాలు చాలా వాడాడు. ఒకవేళ అవి శతకాల్లోవి కాబట్టి ప్రామాణికాలు కావని త్రోసిపుచ్చుతారేమో !

లాక్షణికుల్లో మహాలాక్షణికుడూ పరమ ప్రామాణికుడూ అయిన కాకునూరి అప్పకవికి ప్రామాణికుడైన చిత్రకవి పెద్దన యేదో ప్రబంధంలో కాదు తన లక్షణ గ్రంథమైన "లక్షణ సార సంగ్రహం"లో ప్రయోగించిన ఈ క్రింది వ్యావహారిక ప్రయోగాలు పరిశీలించండి -

"పదునాల్గు"అనే దానికి వ్యావహారికంలో "పధ్నాల్గు" అని వుంటుంది. ఈ "పధ్నాల్గు" పదాన్ని పెద్దన ప్రయోగిస్తే ఆ ప్రయోగాన్ని దిద్దలేక పరిష్కర్తలు దాంట్లో వున్న మహాప్రాణాన్ని తొలగించి దకార సరళంగా సవరించుకుని "పద్నాల్గు" అనే రూపాన్ని వుంచి సంతృప్తి పడ్డారు -

"పధ్నాల్గింటన్ యతుల్ గా మరభనయభవల్
ప్రాపొసువదనన్ ॥ "

(ల - సా - సం - 1 ఆ - 87 పు -)

– "నయుగళిపయి నెన్నఁ బధ్నాల్గు రేఫల్ క్రమం బొప్పఁగా నుండినన్ శంఖమన్ దండకం బెందు నందంబగున్ శంఖ హస్తాంఘ్రి నీరేజ భృంగాయ మానాఘునా!"

(ల. సా. సం. 2 ఆ. 53 పు)

సీ॥ "అటతాళమున మాత్ర లంఘ్రి కిర్వదినాల్గు
నాల్గిట విరతి పధ్నాలు గింట"

(ల - సా - సం - 2 ఆ - 66 పు - 141 ప-)

"పదునెనిమిది" అనే రూపానికి వ్యావహారిక భాషలో "పద్దెనిమిది - పద్దెన్మిది అని వ్యవహరిస్తాము - ఈ పద్దెన్మిది రూపాన్ని పెద్దన ఈ క్రింది పద్యంలో ప్రయోగించగా పరిష్కర్తలు లోగడవలెనే మహాపాపాన్ని తొలగించి "పద్నెన్మిది" గా సంస్కరించుకొని సంతృప్తి పడ్డారు -

క॥ మొదలిటి నాటక పద్యం
బదియర్వది రెండు పదములయినను బద్దె
న్మిది యైన నెన్మిదైనను
బదు రెండిట నైనఁ గూర్పఁ బరఁగును సుకవుల్ ॥

(ల - సా - సం - 3 ఆ - 64 ప)

పూరణార్థకమైన "అవ"కు మారుగా వ్యావహారికంలో "ఓ" కారం వస్తుంది. రెండోది - మూడోది - మొదలైనవి. ఇలాగే "నాల్గోది" అనే వ్యావహారిక రూపాన్ని పెద్దన ఈ క్రింది పద్యంలో ప్రయోగిస్తే దిద్దడానికి అవకాశంలేక పరిష్కర్తలు అలాగే వుంచేసారు.

గీ॥ మొదలి ప్రాసంబు పద్యంబు తుదనుదిరుగు
నాది మాత్రాగ్ర మది తృతీయాంఘ్రికగును
బరగ నాల్గోది రెండవ ప్రాసమరుతఁ
బ్రకటితంబగుఁ బద్యభ్రమకము నందు॥

(ల. సా. సం. 3 ఆ. 111 ప.)

అరువది, అర్వది అనే వాటికి "అరవై, అర్వై" అనేవి వ్యావహారిక రూపాలు. "అర్వై" అనే దాన్ని పెద్దన యీ క్రింది పద్యంలో దిద్దడానికి అవకాశం లేకుండా ప్రయోగించాడు.

క॥ ఆనాటక విధములు పది
యానందుల కైదు సంపులను నంగము ల
ర్వైనాల్గగు రామభట మ
హానాటక కావ్యకర్త హనుమా వినుమా!॥

(ల - సా - సం - 3ఆ -ప. 85)

ప్రాచీన వాఙ్మయంలో వ్యావహారిక భాషను మన పండిత కవులు వాడారనడానికి యింతకంటే ఆధారాలు వేరేం కావాలి? ఎన్నెన్నో ప్రయోగాలు దిద్దివేసిన గ్రాంథికవాదులు ముఖ్యంగా వ్యాకరణ ఛందో గ్రంథాల నాధారంగా చేసుకొని ఈగ్రంథంలో నేను ప్రతిపాదించిన పెక్కు విషయ రహస్యాలను కాదని త్రోసిపుచ్చడం అసంభవం.

★

గిడుగు కాదు
కాదు; పిడుగటంచును గొప్ప
కీర్తిగన్న
రామ మూర్తిగారి
తలపు నిల్పి
తీవు సలుపు ప్రస్థానమ్ము
జయము నీకె
జయము జయము జయము

ముఖ్య సవరణలు

పేజీ	పంక్తి	తప్పు	ఒప్పు
10	29	పూర్వ్యంగా	పూరకంగా
15	14	సంశ్లేషం	సంశ్లేషము
,,	16	కార్యం	కార్యము
,,	18	ఉన్చార	ఉచ్చార
,,	21	పదాని	పదాదిని
24	20	సమంజం	సమంజసం
40	21	రామన్న	వెంకటకవి
49	5	శాస్త్ర	వశాస్త్ర
50	2	,,	,,
52	20	మొదగు	మొదలగు
53	2	"వా" కారం	"వో"కారం
82	26	పరిశ్కృతము	పరిష్కృతమ్ము
86	25	హ	హరి
87	17	పాఠాన్ని	పాఠం
88	28	హృషీక	హృషీకేశ
93	20	పైభాగంలో	పైభాగంలో కొమ్ము వత్రు సుడులు పక్కన వుంటాయి.
97	28	ఇఫ =	ఇఫ=రేఫ
98	11	చూపుక	చూపక
104	6	కారానికి	కారాన్ని
110	8	వికల్పం	వికల్పంగా
115	18	ఈ	
116	12	అవురా-జౌరా"	జౌరా-అవురా"
177	11	159	172
187	26	చపంచ	పంచ

పేజీ	బంతి	తప్పు	ఒప్పు
191	22	బ్రహ్మాండులు	బ్రంహ్మదులు
193	8	రచించి	రచిం
205	22,23	(అసలుదాని...తుంది.)	
243	26	ఇందులో	
247	1	౦-౮	ఖ-ఘ-జ
252	16	శార్జ్గం	శార్ఙ్గం
260	23	దాన్ని	దీన్ని
352	4	భకారవర్ణాలు	భకారాలు
399	1	ఇతరులు	ఇతరాలు

226వ. పుటలో 18 పంక్తిలో "శ - 52సూ." అనేదాని తర్వాత యీ క్రింది పంక్తులు చేర్చు చుసుకోవలెను-

-పోనీ స్థిరానికి పూర్వంలోవున్న బిందువు లోపిస్తుందన్న సంగతి అప్పకవి అంగీకరించకుండా వుంటే యిక్కడ అర్థబిందు పూర్వకమైన గకారం వకారం కాదని చెప్పుకున్నా సమంజసంగా వుండేది. స్థిరంపరమైతే అర్థబిందు లోపం వస్తుందని యీ క్రింది పద్యంలో అప్పకవి వావిడిచి చెప్పకపోయినా చెప్పాడనడానికి సందేహం అక్కరలేదు. అయినప్పుడు అర్థబిందు పూర్వక గకారం వకారంగా మారదనడానికి కారణం దురూహ్యం.

తే॥ పోఁడిమియు నురువడియును నాఁడెము నను
బలుకులఁ దృతీయ సరళముల్ వలసినపుడు
భువిస్వకీయానునాసికంబులును గాఁగఁ
బలుకఁబడు నాది కవుల కబ్బముల కలిమి॥

(అప్ప - 2ఆ - 161ప.)

846వ పుటలో రెండవ పేరా తర్వాత ఈ క్రింది పంక్తులు చేర్చి చదువుకోవలెను-

– ఈ వెంకటకవి పద్యంవంటి పద్యాలేవైనా వాసుదేవుని కళ్ళబడ్డాయి కాబోలు – తన ఆంధ్ర శబ్ద చింతామణి వ్యాఖ్యలో "సకార చవర్గావని దేతౌ దంత్యావేవేతి కేచిత్"అని అద్దంత్యస్తాలవ్య ఇత్యాది చింతామణి సూత్రానికి వ్యాఖ్య వ్రాస్తూ వ్రాసాడు. ఇందులో వాసుదేవుడు దంత్యమైన సకారంమీద చత్వంతో పాటు ఇత్వం కూడా వుంటదని కొందరి అభిప్రాయంగా చెప్పాడు. ఈ వాసుదేవుని వాక్యం కూడా సరైనది కాదు – ఈతని వాక్యం కూడా "సంబరము" మొదలైన పదాలను "శంబరము" మొదలైన పదాలుగా వ్రాయరాదనే అభిప్రాయాన్ని నెల్లడించాలని వ్రాయబడిందే.అయితే యిందులో ఇకారం కూడా చేర్చబడటం వల్ల "వాసి" వంటి పదాలను "వాశి" వంటివిగా వ్రాయరాదని కూడా చెప్పినట్లవుతుంది.

నానుడి 10 వ పుటలో మూడవపంక్తిలో "మనితప్పు" అనే దాని తర్వాత ఈ క్రింది వాక్యం చేర్చుకోవలెను.

"వ్యావహారిక రచన అని పేరుపెట్టుకొని వ్యావహారికం వాడడంలో తప్పేమి వుంటుంది? ఇక్కడ చెప్పేది ఒకటి చేసేది ఒకటి కాదుగా? "

ఉదాహృత గ్రంథ వివరణ పట్టిక

1. అప్పకవీయము
2. అప్పకవీయ వివరణము
3. అథర్వణ కారికావళి (వికృతి వివేకము)
4. అనంతుని ఛందము (ఛందోదర్పణము)
5. అష్టమహిషీ కళ్యాణము
6. అహాదన కరశాసనము
7. అహోబల పండితీయము
8. ఆంధ్రపద ప్రయోగము
9. ఆంధ్రప్రభ (దినపత్రిక)
10. ఆంధ్ర భాషాభూషణము
11. ఆంధ్ర మహా భాగవతము
12. ఆంధ్రమహా భారతము
13. ఆంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వము
14. ఆంధ్ర శబ్దచింతామణి
15. ఆంధ్ర సాహిత్యపరిషత్పత్రిక
16. ఆనంద రంగరాట్ఛందము
17. ఆముక్తమాల్యద
18. ఇంద్ర విజయము
19. ఉత్తర హరివంశము
20. ఉర్దూ హిందీకోశ్
21. కన్న శతకము
22. కవిచింతామణి
23. కవిజనాశ్రయము
24 కవి (జన) సంజీవని
25. కాశీఖండము
26. కాళిందీకన్యాపరిణయము (అముద్రితం-చేమర్తి సుందరశేషగిరిరాయకవి)
27. కాళిందీపరిణయము (అహోబలుడు)

28. కుమార సంభవము
29. చింతామణి విషయపరిశోధనము
30. ఛందోదర్పణము (అనంతుని ఛందము)
31. ఛందోదర్పణోపోద్ఘాత ద్వితీయ ముద్రణపీఠికలు
32. జానకీనాయక శతకము
33. జైమినీ భారతము
34. త్రిలింగ (వారపత్రిక)
35. త్రివిక్రమకృత ప్రాకృత శబ్దానుశాసనము
36. త్రైశంకవోపాఖ్యానము
37. తెలుఁగువనము
38. దాక్షారామశిలాశాసనము (సోమలదేవిది)
39. దివ్యప్రభా వివరణసహిత ఆంధ్రభాషాభూషణ టీక
40. ద్విపద భారతము
41. దేవీవిజయము
42. ధర్మఖండము
43. నరసభూపాలీయము
44. నవనాథ చరిత్ర
45. నారాయణీయాంధ్ర వ్యాకరణ గాణపత వివరణము
46. నిర్వచనోత్తర రామాయణము
47. నృసింహ పురాణము (ఎఱ్ఱాప్రెగడ)
48. నృసింహ పురాణము (భీమన)
49. నెల్లూరు శాసనములు
50. పంచతంత్రము (వెంకటనాథుడు)
51. పండితారాధ్య చరిత్ర
52. పద్మపురాణము
53. పరమ భాగవత చరిత్ర
54. పరశురామ శతకము
55. పాండురంగ మాహాత్మ్యము
56. పాణినీయము

57. ప్రబంధ చంద్రోదయము
58. ప్రబంధ రాజవిజయ వెంకటేశ్వర విలాసము
59. ప్రౌఢ వ్యాకరణము
60. బసవ పురాణము
61. బహుళాశ్వ చరిత్ర
62. బాలబోధచ్ఛందము (అముద్రితము)
63. బాల వ్యాకరణము
64. ,, గుప్తార్థ ప్రకాశికా వ్యాఖ్య
65. ,, దూసివారి వ్యాఖ్య
66. ,, బులుసు వారి లఘు టీక
67. బాల సరస్వతీయము
68. భారతి (మాసపత్రిక)
69. భాస్కర రామాయణము
70. భోజ రాజీయము
71. మను చరిత్ర
72. రఘునాథ నాయకాభ్యుదయము
73. రాఘవ పాండవీయము
74. రామాభ్యుదయము
75. రుక్మాంగద చరిత్ర
76. లక్షణ సారసంగ్రహము
77. వాసిష్ఠ రామాయణము
78. వాసుదేవ వృత్తి (అముద్రితము)
79. వికృతి వివేకము (అథర్వణ కారికావళి)
80. విజయ విలాసము
81. విష్ణు పురాణము
82. వీరభద్రవిజయము
83. వృషాధిపశతకము
84. శబ్దరత్నాకరము
85. శశిబిందుచరిత్ర

86. శారదా దర్పణము
87. శివతత్వసారము
88. శృంగార నైషధము
89. శృంగార వృత్తపద్యశతకము
90. శృంగార శాకుంతలము
91. సంస్కృత మహాభారతము
92. సర్వలక్షణ శిరోమణిలోని ఆంధ్రకౌముది
93. సర్వలక్షణ సారసంగ్రహము
94. సారంగధర చరిత్ర
95. సిద్ధాంతకౌముది
96. సుదర్శన రగడ
97. సుభాషిణి (మాసపత్రిక)
98. సుమతీశతకము
99. సులక్షణసారము (అముద్రితము)
100. సూర్యరాయాంధ్ర నిఘంటువు
101. హరవిలాసము
102. హరికథాసారము
103. హరివంశము
104. హరిశ్చంద్రోపాఖ్యానము
105. హరిశ్చంద్ర నలోపాఖ్యానము
106. హరిశ్చంద్ర నలోపాఖ్యాన పీఠిక

గ్రంథకర్త యితర రచనలు

1. మానవుఁడు (పద్యకావ్యం) (పసితనం) 1-0-0

2. ఆంధ్రభాషాభూషణ 3-8-0

శ్రీ దేవినేని సూరయ్యగారి దివ్యప్రభా వివరణ సహితము - శ్రీ గోపాలకృష్ణయ్యగారి 150 పుటల పరిశోధనాత్మకమైన పీఠికతో

-: త్వరలో అచ్చుకానున్నవి :-

1. వ్యావహారిక భాషావ్యాకరణం
2. జనపదమంజరి (వ్యావహారిక భాషానిఘంటువు)
3. ఆంధ్ర వ్యాకరణము (సమగ్ర ప్రామాణిక గ్రాంథిక వ్యాకరణము)
4. ఆంధ్రచ్ఛందము (సమగ్రచ్ఛందోగ్రంథము)
5. ఆంధ్ర పదపరిణామం
6. మానవుఁడు (కుఱ్ఱతనం, పడుచుతనం, ముసలితనం)
7. విశ్వరూపము (నవరసభరిత పద్యకావ్యము)
8. మానవతి (నీతిబోధక కావ్యము)
9. ఋష్యశృంగుడు (పద్యకావ్యం)
10. ఆంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వవిమర్శ

: ప్రతులకు :

గ్రంథాలయ పుస్తకశాల

పటమట పోస్టు, కృష్ణాజిల్లా.